PRACHEENA TELUGU KAVYALU VIDYA VIDHANAM

A Thesis submitted to the UNIVERSITY OF HYDERABAD
in Partial fulfillment of the requirement for the Degree of

Doctor of Philosophy

in

Telugu

By

NELLORE VIJAYAKUMAR

Regd. No. 10HTPH03

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad – 500 046
Telangana, India

June, 2016

ప్రాచీన తెలుగు కావ్యాలు – విద్యావిధానం

పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయం వారికి సమర్పిస్తున్న

సిద్ధాంత గ్రంథం

పరిశోధకుడు

నెల్లూరు విజయకుమార్

10HTPH03

పర్యవేక్షకులు

ఆచార్య. రేమిల్ల వేంకట రామకృష్ణశాస్త్రి

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500046

జూన్, 2016

DECLARATION

I, Nellore Vijayakumar hereby declare that this Thesis entitled "**PRACHEENA TELUGU KAVYALU -VIDYA VIDHANAM**" submitted by me under the guidance and supervision of Prof. R.V.R.K. Sastry is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this university or any other university or institution for the award of any Degree or Diploma. I hereby agree that my thesis can be deposited in Shodhganga/INFLIBNET.

Hyderabad
Dated:

Signature of the Student
Registration No: 10HTPH03
(NELLORE VIJAYAKUMAR)

CERTIFICATE

This is to certify the Thesis entitled "**PRACHEENA TELUGU KAVYALU -VIDYA VIDHANAM**" submitted by Mr. Nellore Vijayakumar bearing Registration Number 10HTPH03 in partial fulfillment of the requirements for the award of Doctor of Philosophy in Telugu is a bonafide work carried out by his under my supervision and guidance which is a plagiarism free thesis.

This dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any Degree or Diploma.

Prof. R.V.R.K. SASTRY
Research Supervisor

Head, Department of Telugu

Dean, School of Humanities

కృతజ్ఞతలు

విద్య అనేది ఒక సాగరం లాంటిది. ఆ సాగరంలోని ప్రతి నీటి బిందువూ విలువైనదే. ఒక్కొక్క నీటిబిందువు చేరితేనే సాగరం సంపూర్ణంగా ఉంటుంది. అలాగే నేను చేస్తునన ఈ పరిశోధన సంపూర్ణం కావటానికి ఎంతోమంది ఆత్మీయులు నాకు సహాయపడ్డారు. వారందరి సంపూర్ణ సహకారం వల్లనే నా యీ పరిశోధన ఫలవంతం కాగలిగింది.

నాకు జన్మనిచ్చినది తల్లిదండ్రులైతే, పునర్జన్మను ఇచ్చింది గురువులు. వారందరికి ఐదుపది చేస్తున్నాను. చిన్నప్పుడే తండ్రికి దూరమైన నేను అమ్మమ్మ గారి ఇంట్లో పెరిగాను. మా అమ్మ నెల్లూరు సుబ్బరత్నమ్మ, అమ్మమ్మ గారి ఇంట్లో పెరిగాను. మా అమ్మ నెల్లూరు సుబ్బరత్నమ్మ, అమ్మమ్మ అత్తిపాటి పెంచలమ్మగార్లు రెక్కల కష్టంతో నన్ను ఇంతవరకు చదివించారు. తాత్య్య అత్తిపాటి పెంచలయ్యగారు ఆదరించి ఆశ్రయం కల్పించారు. వీరందరికీ మనసారా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నా చదువుకు, పరిశోధనకు కర్తలు, భోక్తలు వీళ్లే. నేను నిమిత్తమాత్రుణ్ణి. మా అమ్మ తన జీవితాంతం నాకోసం అవిశ్రాంతంగా కష్టపడి పనిచేసింది. నా కోసమే తన జీవితం అంకితం చేసింది. అలాగే నేను కూడా నా జీవితాంతం కష్టపడతాను. నేను రాసే ప్రతి గ్రంథాన్నీ మా అమ్మకే అంకితమిస్తాను.

నా జీవితాన్ని పూలబాటలోకి మళ్ళించింది, నాకు గమ్యస్థానాన్ని నర్దేశించింది, డిగ్రీలో తెలుగు పాఠాలు చెప్పిన గురువుగారు డా॥ యర్రంరెడ్డి శ్రీపతిరెడ్డిగారు. వీరు నాకు గురువు అయినా, నన్నెప్పుడూ ఏక వచనంతో పిలువలేదు, అమర్యాదగా చూడలేదు. నేను నా తండ్రిని నాన్న పిలవలేకపోయాను. కానీ ఈ గురువు గారి చేత 'నాన్న' అని పిలిపించుకున్నాను. కల్మషం లేని శిష్యవాత్సల్యం, సాధనతో సాధించిన పాండిత్యం ఈ గురువులోని సుగుణాలు. ప్రతిక్షణం నాకు తోడుగా ఉంటూ, మిత్రుడిలాగా నాకు సలహాలు ఇస్తూ, నాలో తనను చూసుకొని మురిసిపోయే ఈ

గురువుగారికి కృతజ్ఞతలు అని చెప్పడం చాలా చిన్నమాట. మరో జన్మ ఉంటే వీరికి మిత్రుడిగా పుట్టి ఋణం తీర్చుకుంటాను.

నాకు ఉత్సాహాన్ని ఇచ్చి, విద్యావివేకాలను బోధించి ఇలా పరిశోధకుడిగా తీర్చిదిద్దిన మరో గురువుగారు ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారు. నేను ప్రశ్నలతో ఎంతగా వేధించినా, విసుగు చెందకుండా విలువైన సూచనలు చేస్తూ, నా యీ పరిశోధనకు కొంతకాలం పర్యవేక్షకులుగా ఉన్నారు. ఒక గురువు, పరిశోధకుడు ఎలా ఉండాలో వీరిని చూసి నేను నేర్చుకున్నాను. తొంభైశాతం పరిశోధన వీరి పర్యవేక్షణలోనే జరిగింది. గురువుగారు పదవీవిరమణ చెందటం వల్ల తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణి గారు, తెలుగుశాఖలోని ఆచార్య రేమిల్ల వేంకట రామకృష్ణశాస్త్రి గారికి నన్ను అప్పగించారు. ఈవిధంగా ఇద్దరు గురువుల పర్యవేక్షణలో ఈ పరిశోధన పూర్తిచేశాను. వీరిరువురుకీ మనసారా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

'ప్రాచీన తెలుగు కావ్యాలు – విద్యావిధానం' అనే అంశం మీద పరిశోధన చేస్తే బాగుంటుందని సూచించిన గురువుగారు డా॥ శ్రీపతిరెడ్డిగారికి, సోదరుడు వెంకటరమణ గారికి ధన్యవాదాలు.

తెలుగు శాఖలో పరిశోధన చేయటానికి అవకాశం కల్పించిన, శాఖాధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి ధన్యవాదాలు. నాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన గురువులు, ఆచార్య పరిమి రామనరసింహం గారికి, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి గారికి, ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు గారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, ఆచార్య జి. అరుణకుమారి గారికి, ఆచార్య రేమిల్ల వేంకట రామకృష్ణశాస్త్రి గారికి, డా॥ పమ్మి పవన్‌కుమార్ గారికి, డా॥ డి. విజయలక్ష్మి గారికి, డా॥ బి. భుజంగరెడ్డి గారికి, డా॥ డి. విజయకుమారి గారికి ధన్యవాదాలు.

ఎప్పుడు ఏ సందేహం వచ్చినా తీరుస్తూ, కావలసిన పుస్తకాలు సేకరించి ఇస్తూ నా పరిశోధన ఫలవంతం కావటానికి సహాయపడిన ఆత్మీయ గురువు డా॥ అద్దంకి శ్రీనివాస్ గారికి ధన్యవాదాలు.

నాకు సహాయసహకారాలు అందించిన తెలుగుశాఖ బోధనేతర సిబ్బంది భవానీశంకర్, రాంబాబు, సాయి గార్లకు కృతజ్ఞతలు.

పరిశోధన చేయటానికి ఆర్థికసహాయం అందించిన యు.జి.సి. వారికి కృతజ్ఞతలు. ఈ ఆర్థికసహాయం లేకపోతే నేను ఏమీ చేయలేకపోయేవాడిని. నేను జీవితంలో స్థిరపడటానికి, చదువు సాఫీగా సాగటానికి సహాయపడిన యు.జి.సి. వారికి మనసారా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

కావలసిన పుస్తకాలను సేకరించి ఇస్తూ, ఎప్పుడూ నాకు ప్రోత్సాహాన్ని ఇస్తూ ముందుకు నడిపించిన 'ఇందిరాగాంధీ మెమోరియల్ గ్రంథాలయ' సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

నాకు సూచనలు, సలహాలు ఇస్తూ పరిశోధన విజయవంతం కావటానికి సహాయపడిన ఆత్మీయ మిత్రులు, ఇరుమల్ల శ్రీనివాస్, నామా శ్రీకాంత్, నామిండ్ల శ్రీకాంత్, పి. గోపీనాథ్ రాథోడ్, ఇమ్రాన్, చిరంజీవి, సుమన్, డా॥ అలిలేటి నాగరాజు, గడ్డం మోహన్‌రావు, రాజీవ్ అన్నయ్య, సత్యనారాయణ వై.వి.యస్., లక్ష్మీనారాయణ, గంగాప్రసాద్, మురళి, శివశంకర్, మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం, రమ్యజ్యోతి, లత, శ్రీలక్ష్మి, భగ్గునాయక్, ఆంజనేయులు, కొండారెడ్డి, విద్యారాణిగారికి, అన్నపూర్ణ గారికీ, అశోక్, రామకృష్ణ మొదలైన మిత్రులందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

పరిశోధన ఎలా చేయాలో నేర్పించిన గురువులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారికి, డా॥ మనసచెన్నప్పగారికి, డా॥ వెలిదండ నిత్యానందరావు గారికి, వెన్నుతట్టి ప్రోత్సహించిన డా॥ ఆశావాది ప్రకాశరావుగారికి ధన్యవాదాలు.

ఈ పరిశోధన గ్రంథాన్ని అందంగా డి.టి.పి. చేసి ఇచ్చిన మిత్రుడు కృష్ణమోహన్ గారికి ధన్యవాదాలు.

ఇంకా నా పరిశోధన విజయవంతం కావటానికి సహాయపడిన బంధుమిత్రులకు, గురువులకు, శ్రీమతి శ్రావణికి ఆత్మీయంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను.

నన్ను నిరంతరం చైతన్యపరుస్తూ, నాకు నిత్యం శుభాలను కలిగించే నా అంతరంగ ఆరాధ్యదైవాలకు, నాకు నిత్యం కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ముందుమాట

మనిషి బుద్ధి జీవి. సృష్టిలోని ఇతర ప్రాణులకి లేని జ్ఞానం మానవజాతికి లభించింది. ఈ జ్ఞానం ఏ ఒక్కరి వల్లనో సంపూర్ణం కాదు. ఒక్కొక్క వ్యక్తి తాను సంపాదించిన జ్ఞానరేణువును విజ్ఞానభాండాగారంలో పొందుపరుస్తూనే వస్తున్నాడు. వేదకాలం నుండి నేటి వరకు జ్ఞానసాధన జరుగుతూనే ఉంది. అయితే కాలాన్నిబట్టి జ్ఞానసాధన మార్గాల్లో మార్పులు వచ్చాయి. తొలి వేదకాలంలో గురువు గొప్పవాడు అనే భావన ఉండేది. మలివేదకాలంలో శిష్యుడు గొప్పవాడు అనే వాదం బయలుదేరింది. ఉపనిషత్తుల కాలంలో ఇద్దరూ సమానమే అనే ఒక సమన్వయం సిద్ధాంతం ఏర్పడింది. అందువల్లనే "సహనావవతు సహనౌభునక్తు -----" వంటి శ్లోకాలు ఉపనిషత్తులో చోటుచేస్తున్నాయి.

ప్రాచీనకాలంలో విద్యావిధానంలో జరిగిన ఇటువంటి క్రమపరిణామాన్ని విశ్లేషించడమే ఈ సిద్ధాంతవ్యాసం యొక్క లక్ష్యం. క్రీ॥శ॥11వ శతాబ్దం నుండి క్రీ॥శ॥ 18వ శథాబ్దం వరకు వెలువడిన తెలుగు కావ్యాల్లో 'విద్యావిధానం' ఏవిధంగా ప్రతిఫలించిందో వివరించటమే ఈ సిద్ధాంతవ్యాసం యొక్క పరిధి. కొన్ని సందర్భాల్లో, గత చరిత్రను చెప్పవలసి వచ్చినప్పుడు వేదాలు, ఉపనిషత్తులు చెప్పిన విద్యాసంబంధి విషయాలను కూడా చేర్చటం జరిగింది.

గతంలో, డా॥ ఆర్. మల్లేశుడు గారు 'మహాభారతంలో విద్యావిధానం' అనే అంశం మీద పరిశోధన చేశారు. వీరి పరిశోధన మహాభారతం వరకే పరిమితం అయింది. అందువల్ల నేను 'ప్రాచీన తెలుగుకావ్యాలు – విద్యావిధానం' అనే అంశాన్ని పరిశోధనకు ఎంపిక చేసుకున్నాడు. మల్లేశుడు గారు విద్యావిధానాన్ని విశ్లేషించిన తీరు ప్రత్యేకం. ప్రస్తుత సిద్ధాంత వ్యాసంలో క్రీ॥శ॥ 11వ శతాబ్దం నుండి 18వ శతాబ్దం వరకు వచ్చిన విభిన్న పరిణామాలను వివరించటం జరిగింది. మల్లేశుడి గారి సిద్ధాంతవ్యాసం నాకు పరిశోధనలో ఒక మార్గాన్ని సూచించింది. నా పరిశోధన సులభతరం కావటానికి వీరి సిద్ధాంతవ్యాసం నాకు ఎంతగానో సహాయపడింది.

ప్రాచీన విద్యావిధానంలో మనం స్వీకరించదగిన మంచి విషయాలు ఎన్నో ఉన్నాయి. ఆశ్రమజీవనం, అన్నిరకాల విద్యలు నేర్పించటం, జీవనోపాధి మార్గాలను విద్యార్థి దశలోనే ఏర్పాటు చేసుకోవటం వంటి విశేషాలు ఉన్నాయి. శాస్త్రగ్రంథాల రచన, బోధన కూడా ఎక్కువగా జరిగింది. ఆనాటి గురుశిష్యుల మధ్య సత్సంబంధాలు ఉండేవి. అయితే విద్య కొందరికి మాత్రమే పరిమితంగా ఉంది. ఇది ఒక పెద్ద లోపమే. ఇప్పటి కాలంలో విద్య అంటే కేవలం విజ్ఞానశాస్త్రమే. సామాజికశాస్త్రాలు, మానవీయ శాస్త్రాలు మరుగునపడిపోతున్నాయి. కేవలం భౌతికమైన అభివృద్ధిని సాధించటమే ప్రస్తుత విద్యావిధానం యొక్క లక్ష్యంగా మారిపోతుంది. ఇటువంటి తరుణంలో మన భారతీయ సనాతన విద్యావిధానాన్ని గురించి అధ్యయనం చేయవలసి ఉంది. 'భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక రంగాల సంపూర్ణ వికాసమే విద్య' అనేది భారతీయ సనాతన సంప్రదాయం. పైన చెప్పిన మూడు రంగాల్లో మనిషిని తీర్చిదిద్దటానికి ఉపయోగపడేదే విద్య. ప్రస్తుత సిద్ధాంత వ్యాసంలో ఈ మూడు రకాల విద్యల గురించి, అవి తెలుగు కావ్యాల్లో ప్రతిఫలించిన తీరును గురించి ప్రధానంగా చర్చించడం జరుగుతున్నది.

'ప్రాచీన తెలుగు కావ్యాలు – విద్యావిధానం' అనే ఈ సిద్ధాంత వ్యాసాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించటం జరిగింది. మొదటి అధ్యాయంలో 'విద్యావిధానం – స్వరూప స్వభావాలు' గురించి చర్చించటం జరిగింది. ఇందులో పదవ్యుత్పత్తి, ప్రాచ్య పాశ్చాత్య పండితుల నిర్వచనాలు విశ్లేషించటం జరిగింది. ఆచార్యుడు, సత్ప్రవర్తన వంటి అంశాలు కూడా ఇందులో వివరించటం జరిగింది. విద్యాబోధనలో ఆనువంశిక లక్షణం, పరిసరాల ప్రభావం సమానపాత్ర పోషిస్తాయని ఈ విశ్లేషణలో తేలింది. గురువు, శిష్యుడు, ప్రవచనం, శీలం అనేవి విద్యాసౌధానికి నాలుగు స్తంభాల వంటివని నిరూపించటం జరిగింది.

'భౌతిక విద్యలు – కావ్యానుశీలన' అనేది రెండవ అధ్యాయం. ఇందులో మానవుడి శరీర పోషణకు, రక్షణకు, నివాసానికి సంబంధించిన భౌతిక లేదా శారీరక విద్యల గురించి విశ్లేషించటం

జరిగింది. ఈ విద్యలు తెలుగు కావ్యాల్లో ఏవిధంగా ప్రతిఫలించాయో వివరించటం జరిగింది. ఈ అధ్యాయంలో ఆయుర్వేదవిద్య, జలస్తంభనవిద్య, చోరవిద్య, అస్త్రవిద్య, వైద్యవిద్య, కామరూపిణివిద్య, అస్త్రహృదయవిద్య, శాంబరీవిద్య, చింతామణిమంత్రవిద్య, తిరస్కరిణీవిద్య వంటివి వివరించటం జరిగింది. ఈ శారీరక విద్యల్లో శరీరం ప్రధానపాత్ర వహిస్తుంది. మనస్సు ప్రమేయం కూడా ఉంటుంది. అయితే ప్రధానంగా శరీరం పనిచేస్తుంది కాబట్టి వీటిని భౌతిక లేదా శారీరక విద్యలుగా చెప్పటం జరిగింది.

మూడవ అధ్యాయం – 'మానసికవిద్యలు – కావ్యానుశీలన'. ఇందులో మనస్సు అంటే ఏమిటో? విశ్లేషించటం జరిగింది. మనస్సు గురించి ఉన్నటువంటి ప్రాచ్యపాశ్చాత్య భావనలను పరిశీలించటం జరిగింది. మనస్సుకు ఉండే విభిన్నప్రవృత్తుల్ని విశ్లేషించటం జరిగింది. మానసిక విద్యలను ప్రబోధాత్మకాలు, ప్రయోగాత్మకాలు అని రెండు రకాలుగా విభజించవచ్చు. ఉపాఖ్యానాలు, పురాణాలు, ఇతిహాసాలు, ఉపదేశాలు ఈ విభాగంలో వివరించటం జరిగింది. వీటిల్లో ప్రబోధం ప్రధానం కనిపిస్తుంది. అందువల్ల వీటిని ప్రబోధాత్మక మానసిక విద్యలు అనడం జరిగింది.

ప్రయోగాత్మక మానసిక విద్యల్లో సిద్ధాంతజ్ఞానంతో పాటు సాధన కూడా అవసరం. కవిత్వం, సంగీతం, శిల్పం, నాట్యం, చిత్రలేఖనం వంటి విద్యల్లో సాధన ప్రధానంగా ఉంటుంది. ప్రయోగం వల్లనే పై విద్యలు పరిణతిని పొందుతాయి. ఉదా:– గాయకుడు గురువుల దగ్గర సంగీతశాస్త్రానికి సంబంధించిన సిద్ధాంతాలను నేర్చుకుంటాడు. తన సాధన వల్ల ఆ సంగీతంలో విశేష కృషి చేస్తాడు. అపూర్వమైన రాగాలను తన గొంతులో పలికించగలుగుతాడు. అందువల్ల సాధనాప్రధానమైన సంగీతాది విద్యల్ని 'ప్రయోగాత్మక మానసిక విద్యలు' అని పిలవటం జరిగింది. ఈ మానసిక విద్యల ప్రధాన ప్రయోజనం 'మనస్సుకు ఆనందాన్ని కలిగించటం'. ఉపాఖ్యానాలు, పురాణాలు, కవిత్వం, సంగీతం వంటి విద్యల ప్రధాన లక్ష్యం మానసిక ఆనందాన్ని కలుగజేయడమే.

నాల్గవ అధ్యాయం – 'ఆధ్యాత్మికవిద్యలు – కావ్యానుశీలన'. ఈ అధ్యాయంలో 'ఆధ్యాత్మికత' అంటే ఏమిటో విశ్లేషించటం జరిగింది. దర్శన సంప్రదాయం, మతసంప్రదాయం ఏవిధంగా జరిగింది. దర్శన సంప్రదాయం, మతసంప్రదాయం ఏవిధంగా ఆధ్యాత్మికవిద్యను అభివృద్ధి దశకు తీసుకువచ్చాయో విశ్లేషించటం జరిగింది. షడ్దర్శనాలు, త్రిమతాచార్యుల సిద్ధాంతాలు, జీవన్ముక్తి వంటి విషయాలు ఈ అధ్యాయంలో చర్చించబడ్డాయి. 'మానవుడి అంతర్గతప్రయాణమే ఆధ్యాత్మికత' అని సారాంశంగా చెప్పవచ్చు. దీనివల్లనే జీవన్ముక్తిని పొందవచ్చు. దీనికి యోగసాధన మంచి మార్గం అని తేలింది.

ఐదవ అధ్యాయంలో 'ప్రాచీన విద్యలు – బోధన పద్ధతులు' అనే విషయం చర్చించటం జరిగింది. విద్యల్ని బోధించటానికి మన ప్రాచీన గురువులు పాటించిన పద్ధతుల్ని ఇక్కడ పరిశీలించటం జరిగింది. ఉపాఖ్యాన పద్ధతి, చర్చాపద్ధతి, ప్రశ్నోత్తర పద్ధతి, సంవాద పద్ధతి మొదలైన బోధనపద్ధతుల్ని ఈ అధ్యాయంలో సోదాహరణంగా చర్చించడం జరిగింది.

ఆరవ అధ్యాయంలో 'గురుశిష్యసంబంధాలు' గురించి విశ్లేషించటం జరిగింది. గురువుల్లో రకాలు, విద్యార్థుల్లో రకాలు ఇక్కడ వివరించబడ్డాయి. గురువు లక్షణాలు, విద్యార్థి లక్షణాలు, ఉపనయనం, భిక్షాటనం వంటి విషయాలు విశ్లేషించబడ్డాయి. భీష్ముడు, ధర్మరాజు, అర్జునుడు, ఏకలవ్యుడు మొదలైన భారతవీరులు ఏవిధంగా విద్యను ఆర్జించారో ఈ అధ్యాయంలో పరిశీలించడం జరిగింది. ఆనాటి గురుశిష్యుల మధ్య ఎటువంటి సంబంధాలు ఉండేవో వివరించటం జరిగింది. స్నాతకోత్సవం, గురుదక్షిణ మొదలైన విషయాలు వివరించబడ్డాయి.

పై విధంగా 'ప్రాచీన తెలుగు కావ్యాలు – విద్యావిధానం' అనే సిద్ధాంతవ్యాస రచన పూర్తి చేయటం జరిగింది. 'మానవుడి భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక రంగాల సంపూర్ణ వికాసానికి దోహదపడే విద్య' అనే ఫలితాంశం ఈ విశ్లేషణ వల్ల లభించింది. గురుశిష్యుల మధ్య సత్సంబంధాలు ఆనాటి విద్యావిధానంలో గుర్తించదగిన విషయం.

విషయసూచిక

1. విద్యావిధానం – స్వరూపస్వభావాలు **1–17**

1.1. విద్య – వ్యుత్పత్తి 1

1.2. విద్యావిధానం – ప్రాచ్యపాశ్చాత్య పండితుల అభిప్రాయాలు 3

1.3. విద్యార్థి – ఆచార్యుడు – సత్ప్రవర్తన 12

2. భౌతిక విద్యలు – కావ్యానుశీలన **18–105**

2.1. వృత్తివిద్యలు – కావ్యానుశీలన **23**

2.1.1. ఆయుర్వేద విద్య 23

2.1.2. వైద్య విద్య 27

2.1.3. వర్తక విద్య 29

2.1.4. వ్యవసాయ విద్య 31

2.1.5. పాముకాటు విద్య 32

2.1.6. విషహారిణి విద్య 32

2.1.7. వాస్తు విద్య 33

2.1.8. రసవాద విద్య 34

2.1.9. బొమ్మల తయారీ విద్య 36

2.1.10. రాజనీతి విద్య 37

2.1.11. ధనుర్వేద విద్య 47

2.1.12. శబ్దభేది విద్య 48

2.1.13. అశ్వశాస్త్ర విద్య 50

2.1.14. పశుపాలన విద్య 51
2.1.15. స్వప్నశాస్త్ర విద్య 52
2.1.16. నేపథ్య విద్య 54
2.1.17. కవచధారణ విద్య 54
2.1.18. దండనీతి విద్య 55
2.1.19. శకునశాస్త్ర విద్య 56
2.1.20. వస్త్ర తయారీ విద్య 57
2.1.21. అద్దకపు విద్య 60
2.1.22. చోర విద్య 60
2.1.23. మల్లయుద్ధ విద్య 64
2.1.24. గణితశాస్త్ర విద్య 68
2.1.25. జ్యోతిశ్శాస్త్ర విద్య 68
2.1.26. ఛందశ్శాస్త్ర విద్య 71
2.2. యంత్ర – మంత్ర విద్యలు 74
2.2.1. పద్మినీ విద్య, మృగపక్షి భాషలు తెలుసుకునే విద్య 74
2.2.2. కామరూపిణి విద్య 76
2.2.3. అస్త్రహృదయ విద్య 77
2.2.4. శాంబరీ విద్య 78
2.2.5. చింతామణి మంత్ర విద్య 79
2.2.6. తిరస్కరణీ విద్య 81
2.2.7. జలస్తంభన విద్య 83
2.2.8. వశీకరణ విద్య 84

2.2.9. ప్రతిస్మృతి విద్య 85

2.2.10. అస్త్ర విద్య 87

2.2.11. సంస్తంభన విద్య 88

2.2.12. అంజనం చూసే విద్య 89

2.3. వినోద విద్యలు 89

2.3.1. గారడి విద్య 89

2.3.2. పాములాట 91

2.3.3. జూదవిద్య 93

2.3.4. తూర్పునాటిగడిడు 94

2.4. ప్రవృత్తి విద్యలు 95

2.4.1. గృహనీతి విద్య 95

2.4.2. దాన విద్య 98

3. మానసిక విద్యలు – కావ్యానుశీలన 106–202

3.1. మనస్సు - వ్యుత్పత్తి 106

3.2. మనస్సు - బుద్ధి 107

3.3. మనస్సు – భారతీయుల అభిప్రాయాలు 108

3.3.1. వేదాలు - మనస్సు 108

3.3.2. ఉపనిషత్తులు - మనస్సు 109

3.3.3. భగవద్గీత - మనస్సు 109

3.3.4. చార్వాకులు - మనస్సు 110

3.3.5. బౌద్ధం - మనస్సు 111

3.3.6. న్యాయవైశేషికములు - మనస్సు 111

3.3.7. సాంఖ్యం – మనస్సు 111

3.4. మనస్సు – పాశ్చాత్యుల అభిప్రాయాలు 113

3.4.1. హైరాక్లైటస్ 113

3.4.2. సోక్రటీస్ 113

3.4.3. ప్లేటో 113

3.4.4. అరిస్టాటిల్ 114

3.5. మనస్సు – విభిన్న ప్రవృత్తులు 114

3.5.1. మనస్సు - క్రియాప్రవృత్తి 114

3.5.2. మనస్సు – జ్ఞానసంపాదన ప్రవృత్తి 116

3.5.3. మనస్సు - సౌందర్యరసజ్ఞానోపలబ్ధి 116

3.5.4. మనస్సు - భావప్రవృత్తి 117

3.5.5. మనస్సు – సాంఘికజ్ఞానం 118

3.6. మానసిక విద్యలు – కావ్యానుశీలన 118

3.6.1. ప్రబోధాత్మక మానసిక విద్యలు 119

3.6.1.1. పురాణ విద్య 119

3.6.1.2. ఇతిహాస విద్య 125

3.6.1.3. ఉపాఖ్యాన విద్య 129

3.6.1.4. ఉపదేశ విద్య 130

3.6.2. ప్రయోగాత్మక మానసిక విద్యలు 133

3.6.2.1. కవిత్వ విద్య 134

3.6.2.2. సంగీత విద్య 139
3.6.2.3. నాట్య విద్య 149
3.6.2.4. శిల్ప విద్య 161
3.6.2.5. చిత్రలేఖన విద్య 177
4. ఆధ్యాత్మిక విద్యలు – కావ్యానుశీలన 203–291
4.1. దర్శన సంప్రదాయం – ఆధ్యాత్మిక విద్య 203
4.1.1. వేదాలు 204
4.1.2. ఉపనిషత్తులు 206
4.1.2.1. ఈశోపనిషత్తు 206
4.1.2.2. ఛాందోగ్యోపనిషత్తు 207
4.1.2.3. బృహదారణ్యకోపనిషత్తు 207
4.1.2.4. ఐతరేయోపనిషత్తు 208
4.1.2.5. తైత్తిరీయోపనిషత్తు 208
4.1.2.6. ప్రశ్నోపనిషత్తు 208
4.1.2.7. కేనోపనిషత్తు 209
4.1.2.8. కఠోపనిషత్తు 209
4.1.2.9. ముండకోపనిషత్తు 210
4.1.2.10. మాండూక్యోపనిషత్తు 211
4.1.2.11. కౌషీతకి ఉపనిషత్తు 212
4.1.2.12. మైత్రీ ఉపనిషత్తు 212
4.1.2.13. శ్వేతాశ్వతర ఉపనిషత్తు 213
4.1.3. లోకాయత దర్శనం 213
4.1.4. జైనదర్శనం 214
4.1.5. బౌద్ధ దర్శనం 215

4.2. వేదాంత ప్రస్థానాలు – ఆధ్యాత్మిక విద్య **216**

4.2.1. అద్వైతం - శంకరుడు 216

4.2.2. విశిష్టాద్వైతం - రామానుజాచార్యులు 220

4.2.3. ద్వైతం – మాధ్వదర్శనం 225

4.2.4. భగవద్గీత – ఆధ్యాత్మిక విద్య 227

4.3. షడ్దర్శనాలు – ఆధ్యాత్మిక విద్య **233**

4.3.1. న్యాయ దర్శనం 233

4.3.2. వైశేషిక దర్శనం 238

4.3.3. సాంఖ్య దర్శనం 242

4.3.4. యోగ దర్శనం 251

4.3.5. మీమాంసా దర్శనం 271

4.3.6. వేదాంత దర్శనం 277

4.4. జీవన్ముక్తి **281**

5. ప్రాచీన విద్యలు – బోధన పద్ధతులు **290–313**

5.1. ఉపాఖ్యాన పద్ధతి 293

5.2. చర్చా/గోష్ఠీ పద్ధతి 295

5.3. సంవాద పద్ధతి 296

5.4. ప్రశ్నోత్తర పద్ధతి 298

5.5. ఉపన్యాస/ప్రవచన పద్ధతి 299

5.6. ఆలంకారిక పద్ధతి 300

5.7. ఉదాహరణ – ప్రత్యుదాహరణ పద్ధతి 303

5.8. అన్యాపదేశ పద్ధతి 303

5.9. ప్రవృత్తి పద్ధతి 305

5.10. ఆనుపూర్వి పద్ధతి 307

5.11. విశ్లేషణ పద్ధతి 309

5.12. ప్రయోగ పద్ధతి 310

5.13. ప్రదర్శన పద్ధతి 311

6. గురుశిష్య సంబంధాలు – కావ్యానుశీలన 314–368

6.1. గురువు – శిష్యుడు 315

6.1.1. ఆచార్యుడు – పద వ్యుత్పత్తి 315

6.1.2. ఉపాధ్యాయుడు – పద వ్యుత్పత్తి 315

6.1.3. అధ్యాపకుడు - లక్షణాలు 316

6.1.4. పండితుడు - లక్షణాలు 316

6.1.5. గురువు - లక్షణాలు 317

6.1.6. శిష్యుడు – పద వ్యుత్పత్తి 319

6.1.7. విద్యార్థి - భిక్షాటనం 320

6.1.8. గురు సన్నిధిలో అంతేవాసి 321

6.1.9. బ్రహ్మచారి – నియమాలు 322

6.2. గురుశిష్యులు – ఆశ్రమజీవనం – కావ్యానుశీలన 326

6.2.1. ఉదంకుడు 329

6.2.2. కచుడు 330
6.2.3. కృపాచార్యుడు 332
6.2.4. ద్రోణుడు 333
6.2.5. ఏకలవ్యుడు 334
6.2.6. భీష్ముడు 336
6.2.7. విదురుడు 337
6.2.8. పాండురాజు 337
6.2.9. ధర్మరాజు 338
6.2.10. భీముడు 339
6.2.11. అర్జునుడు 341
6.2.12. నకులుడు 343
6.2.13. సహదేవుడు 344
6.2.14. కర్ణుడు 345
6.2.15. శ్రీకృష్ణబలరాములు 346
6.2.16. దుర్యోధనుడు 347
6.2.17. నారదుడు 348
6.2.18. శ్రీరామలక్ష్మణులు 350
6.2.19. లవకుశులు 351
6.2.20. ఆంజనేయుడు 352
6.2.21. రావణుడు 352
6.2.22. శుకయోగి 353
6.2.23. ఇందీవరాక్షుడు 355

6.2.24. అయుతనియుతులు 356

6.3. ఉపనయనం 359

6.4. సమావర్తనం 360

6.5. గురుదక్షిణలు 361

ఉపసంహారం 369–374

ఉపయుక్త గ్రంథాలు 375–382

మొదటి అధ్యాయం

విద్యావిధానం – స్వరూప స్వభావాలు

1. విద్యావిధానం–స్వరూపస్వభావాలు

సృష్టిలోని మిగతా ప్రాణులకి, మనిషికి మధ్యగల ప్రధానమైన తేడా జ్ఞానం. మనిషి బుద్ధిజీవి. తన గురించి తాను తెలుసుకోగలిగిన జ్ఞానం ఉన్నవాడు. భూత, భవిష్యత్, వర్తమాన కాలాలతో తన జీవితాన్ని సమన్వయించుకొని చూసుకోగలడు. ఇటువంటి మేధాశక్తి మిగిలిన ప్రాణులకి లేదు. అందుకే మనిషి సృష్టిలో విజ్ఞానవంతమైన జంతువు. వివేచనాశక్తి గల ప్రాణి. అయితే ఈ వివేచనాశక్తి మనిషికి పుట్టుకతోనే ఉంటుందా? తరువాత అభ్యాసం వలన అలవడుతుందా? అనేది పరిశీలించదగిన అంశం. మనస్తత్వశాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, మనిషికి జ్ఞానం అన్నది వంశపారంపర్యంగానూ కొంత వస్తుంది. తర్వాత అభ్యాసం వల్ల కొంతవస్తుంది. మొదటిదానిని ఆనువంశిక అని, రెండవదానిని ఆర్జితం అని అంటారు. ఈ రెండూ ఉంటే అతడు మేధావి అవుతాడు.

1.1. విద్య–వ్యుత్పత్తి :–

'విద్య' అంటే ఏమిటి అసలు ఎందుకు విద్యనభ్యసించాలి? విద్యలేకపోతే మనిషిలో ఎదుగుదల ఉండదా? అనే ప్రశ్న మనకు మెదడులో మెదులుతుంది. దీనికి సమాధానం ప్రహ్లాదుడి తండ్రినోట పలికించాడు పోతన.

"చదువనివాఁడజ్ఞుండగు, జదివిన సదసద్వివేక చతురత గలుగుం
జదువగఁవలయును జనులకుఁ, జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ!"[1]

చదవనివాడు అజ్ఞాని అవుతాడు. తనను తానే తెలుసుకోలేడు. ఇతరుల గురించి అసలు తెలుసుకోలేకపోతాడు. చదవడం వల్ల మంచిచెడుల తారతమ్యం తెలుస్తుంది. కాబట్టి మనిషికి 'విద్య' చాలా అవసరం అని ప్రహ్లాదుడికి, అతడి తండ్రి అయిన హిరణ్యకశిపుడు తెలియజేస్తాడు. దీన్నిబట్టి మనిషి పురోగతికి విద్య ఎంత ఆవశ్యకమో అవగతమవుతున్నది.

'విద్య' అన్న పదం 'విద్' అనే ధాతువు నుండి వచ్చింది. విద్ అంటే తెలుసుకోవడం అని అర్థం. దేని గురించి అయినా మనం కొంత విషయాన్ని గ్రహించగలుగుతున్నామంటే అది విద్య అవుతుంది. ఈ విద్

ధాతువు నుండే వేదం అన్న పదం కూడా పుట్టింది. వేదం అన్న పదానికి జ్ఞానం అని అర్థం. దాన్ని తెలుసుకోవడానికి సాధనం విద్య. 'వేత్తి అనయా ఇతి విద్యా' అని లోకోక్తి. ఏ విషయాన్ని గురించి అయినా కొంత జ్ఞానాన్ని పొందితే దాన్ని విద్య అనవచ్చును.

'విద్య' అన్న పదానికి ఆంగ్లంలో సమానార్థకంగా 'Education' అన్నపదాన్ని వాడుతున్నారు. ఇందులో 'e'+ 'ducation' అనే రెండు పదాలు కలిసి ఉన్నాయి. 'e' అంటే 'బయటకు' అనీ, 'ducation' అంటే లాగుట అని అర్థాలున్నాయి. వీటినిబట్టి చూస్తే, ఒక వ్యక్తిలోని సహజశక్తిని ఉద్బుద్ధమొనర్చేది విద్య అని చెప్పవచ్చు. అంటే మనిషిలో అంతర్గతంగా దాగివున్న ప్రతిభను బయటకు తీసేది విద్య. ఈ అంతర్గతంగా దాగివున్న ప్రతిభకు(శక్తికి) కారణం ఆనువంశికత. బయటకు రావటానికి కారణం అభ్యాసం.

అయితే 'Education' అన్న పదానికి మూలం లాటిన్ భాషలోని 'Educare' అని ఆర్.మల్లేశుడి గారి అభిప్రాయం[2]. ఈ పదానికి 'To bring up' అంటే 'పొందుట' అని అర్థం.. మనిషి తన చుట్టూ ఉన్న పరిసరాల నుండి జ్ఞానాన్ని పొందటం అన్న అర్థాన్ని సూచిస్తుంది ఈ పదం. Education ప్రకారం మనిషిలో వంశపారంపర్యంగా దాగివున్న సహజశక్తులు బహిర్గతమౌతాయి. Educare ప్రకారం మనిషి తనచుట్టూ ఉన్న పరిసరాల (సమాజం) నుండి విద్యను గ్రహిస్తాడు. మొదటిది నిసర్గమైంది. రెండవది స్వయంసముపార్జితమైంది. మొదటి అభిప్రాయం ప్రకారం 'విద్య' అంతర్గతమైన శక్తి. రెండవ అభిప్రాయం ప్రకారం బాహ్యమైంది. అయితే ఈ రెండూ విద్యార్జనలో సమప్రాధాన్యం వహిస్తాయి. వాసనాజ్ఞానం లేనివాడికి ఎంత బోధించినా వ్యర్థమే. అలాగే బోధన లేకుంటే ఆ వాసనాజ్ఞానానికి వెలుగుండదు. కాబట్టి విద్యార్జనలో పై రెండు రకాల వ్యుత్పత్తుల్ని మనం దర్శించడానికి వీలవుతుంది.

విద్యార్జనలో పరిసరాల ప్రభావాన్ని గూర్చి మనస్తత్వ శాస్త్రవేత్తలు ఇలా తెలియచేశారు. "since fraternal twins are more alike in intelligence than ordinary siblings, we know that environment must also play a part in the determination of intelligence" [3]. దీన్నిబట్టి విద్యాధ్యయనంలో పరిసరాల ప్రభావం కూడా ప్రముఖ పాత్ర వహిస్తుందని చెప్పవచ్చు. ఒక వ్యక్తి పుట్టుకతో గొప్పవంశంలో పుట్టినా, అతడు పెరిగే పరిసరాలు సరైనవి కాకపోతే అతనిలోని

వంశపారంపర్యశక్తి క్రమంగా నశిస్తుంది. ఏ వ్యక్తీ పుట్టుక చేత నేరస్థుడు కాడు. అతడు పుట్టి పెరిగిన పరిసరాలు అతడిమీద ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాయి. చుట్టూవున్న సమాజం అతడిని దొంగగానూ మార్చవచ్చు. దొరగానూ మార్చవచ్చు. కడుపు నిండినవాడు శ్రీనాథుడిలా కవిత్వం చెపితే, కడుపు మండినవాడు శ్రీశ్రీ లాగ కేకలు వేస్తాడు. సమాజం మీద తిరగబడతాడు. అందువల్ల విద్యాధ్యయనంలో వంశపారంపర్య లక్షణంతో పాటూ, పరిసరాల ప్రభావం కడా ప్రాధాన్యం కలిగి ఉంటుంది. ఈ విషయాన్నే Education, Educare అన్న పదాలు సూచిస్తున్నాయి.

ఇక్కడ మనకు ఒక సందేహం వస్తుంది. వంశపారంపర్య లక్షణం అన్ని సందర్భాల్లో సాధ్యమేనా? అని. గొప్ప మేధావి కడుపున అజ్ఞాని పుట్టవచ్చు. అజ్ఞాని కడుపున మేధావి పుట్టవచ్చు. అప్పుడు వంశపారంపర్యలక్షణం అనేది విద్యార్జన విషయంలో ఎలా వర్తిస్తుంది? అందుకే దీన్ని నిసర్గమైంది అన్నారు. కొన్ని సందర్భాల్లో జరగవచ్చు, కొన్ని సందర్భాల్లో జరగకపోవచ్చు. ఉదాహరణకు హిరణ్యకశిపుడు రాక్షసుడు. అతడు అహంభావి, ఈర్ష్యాసూయలు కలవాడు. కానీ అతడికి మహాభక్తుడైన ప్రహ్లాదుడు జన్మించాడు. తన విష్ణుభక్తిచేత భక్తశ్రేణిలో అగ్రగామిగా నిలబడ్డాడు. అన్ని విద్యల్లో ఆరితేరాడు. ఆ చదువుల్లో ఉన్న మర్మాల్ని కూడా తెలుసుకోగలిగాడు. కానీ అతడిలో పుట్టుకతో వచ్చిన రాక్షసగుణం పూర్తిగా అంతరించిపోలేదు. అతడిలో ఆ వంశపారంపర్యగుణం అంతర్గతంగా ఉండి, వీలైనపుడు బహిర్గతం అవుతుంది. ప్రహ్లాదుడు, నరనారాయణులతో యుద్ధం చేసిన సందర్భంలో అతడిలోని ఆసురీశక్తులు వ్యక్తమవడాన్ని మనం గుర్తించవచ్చు. అయితే అతడిలో ఈ ఆసురీశక్తుల్ని అధిగమించినవి, పరిసరాల ప్రభావం వల్ల చేకూరిన సత్త్వగుణాలు. నారదముని ఆశ్రమ పరిసరాల ప్రభావం వల్ల అతనిలోని రాక్షసగుణాల కన్నా, సాత్త్విక గుణాలే ఉజ్జ్వలించాయి. కాబట్టి విద్యార్జనలో వంశపారంపర్య లక్షణం, పరిసరాల ప్రభావం సమప్రాధాన్యం కలిగివున్నట్లు తెలుస్తున్నది.

1.2. విద్యావిధానం – ప్రాచ్యపాశ్చాత్యపండితుల అభిప్రాయాలు:–

'విద్య' గురించి ప్రాచ్యపాశ్చాత్యులు చాలామంది పరిశీలించి కొన్ని అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. వాటిలో భారతీయులు చెప్పిన నిర్వచనాలు ప్రధానంగా నైతికదృష్టి కలవి లేదా ఆధ్యాత్మికదృష్టి కలవి.

పాశ్చాత్యులు ప్రధానంగా భౌతికదృష్టి కలవారు. అయితే వీరిలోనూ కొందరు నైతికదృష్టితో విద్యను నిర్వచించిన వారూ ఉన్నారు.

విద్యను గురించి వ్యాఖ్యానించిన భారతీయుల్లో మొదట పేర్కొనదగినవాడు భర్తృహరి. ఈయన విద్య ఔన్నత్యాన్ని ఇలా కొనియాడాడు.

శ్లో. "హర్తుర్యాతి న గోచరం కిమపి శం పుష్ణాతి యత్సర్వదా
ప్యర్థిభ్యః ప్రతిపాద్యమానమనిశం ప్రాప్నోతి వృద్ధిం పరాం,
కల్పాన్తేష్వపి న ప్రయాతి నిధనం విద్యాఖ్యమన్తర్ధనం
యేషాం తాన్ప్రతి మాన ముజ్ఝతనృపాః కస్తైస్సహ స్పర్ధతే!!"[4]

విద్య అనే ధనాన్ని దొంగలు దోచుకోలేరు. రాత్రింబవళ్ళు సుఖమును కలిగిస్తుంది. మంచి పేరును తెస్తుంది. యాచకులకు ఇచ్చేకొద్దీ వృద్ధిచెందేది ఈ 'విద్య' అనే ధనం. కాబట్టి అలాంటి విద్యాధికుల విషయంలో రాజులకు గర్వం పనికిరాదని భర్తృహరి అభిప్రాయం. దీన్నిబట్టి విద్యార్జన మనిషికి ఎంత విలువను తెస్తుందో తెలుస్తున్నది.

భర్తృహరి 'విద్య' గొప్పదనాన్ని ఇలా కీర్తించాడు.

"విద్యా నామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్న గుప్తం ధనం
విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యా గురూణాం గురుః
విద్యా బన్ధుజనో విదేశగమనే విద్యా పరాదేవతా
విద్యా రాజసుపూజ్యతే నహి ధనం విద్యావిహీనః పశుః!!"[5]

విద్య మానవులకు రూపము వంటిది. అది వారిలో నిగూఢంగా దాచిపెట్టబడింది. విద్య సుఖాలనూ, భోగాలనూ, కీర్తిని కలిగిస్తుంది. విద్య గురువులకు గురువు వంటిది. విద్య విదేశాల్లో కూడా బంధువులాగ తోడుగా ఉంటుంది. విద్య పరాదేవత. కాబట్టి విద్య లేనివాడు పశువుతో సమానమని భర్తృహరి అభిప్రాయం. దీన్నిబట్టి విద్య ఔన్నత్యాన్ని మనం గుర్తించవచ్చు. బంధువులు, స్నేహితులు కొద్దికాలం మాత్రమే మనతో పాటు నడవగలరు. మనతో పాటు చివరివరకూ నడిచేది, మనల్ని నడిపించేది మనం సంపాదించుకున్న 'విద్య' మాత్రమే. అందుకే డా. శ్రీపతి రెడ్డిగారు ఇలా అన్నారు.

"అమ్మ చెప్పిన చదువది అమృతసమము
నాన్న బోధలు పరికింప నాణ్యమౌర
గురువు నేర్పిన విద్యలు 'గురిగ' కుదురు
నీవు నేర్చిన జ్ఞానము నిలుచునెపుడు"[6]

విద్య నాలుగు విధాలుగా మనకు అందుతుంది. తల్లి నుండి, తండ్రి నుండి, గురువు నుండి, స్వానుభవం నుండి. ఇవి ఉత్తరోత్తరం బలీయమైనవి. విద్య కేవలం ఏ ఒక్కరి వల్లనో సముపార్జించబడదు. అది తరతరాలుగా ఒకరి నుండి మరొకరికి అందే సంపద. అందులో ప్రతి ఒక్కరు తమ వంతు చిన్న జ్ఞానరేణువును చేరుస్తూ వస్తూంటారు. ఈ విద్య స్వానుభవం వల్ల సార్థకత పొందుతుంది.

భర్తృహరి చెప్పిన మాటల్లో మనం ఒక విశేష అంశాన్ని గుర్తించవచ్చు. విద్య మానవునిలో "ప్రచ్ఛన్న గుప్తం ధనం" అన్నాడు. అంటే 'విద్య' మానవునిలో దాగివుండే సహజశక్తి అని అర్థం. ఈ సహజ శక్తిని బయటకు లాగి, దాన్ని ప్రజ్వలింపచేసేదే విద్య. అలా చేసేవాడే గురువు. 'Educare' అన్న పదానికి ఉన్న 'బయటకులాగుట' అన్న అర్థాన్ని భర్తృహరి ఇందులో సూచించాడు. ఈ ప్రచ్ఛన్న గుప్తమైన ధనాన్ని రెట్టింపు చేసేది గురువు, స్వాధ్యాయం. దీన్నిబట్టి విద్యాబోధనలో విద్యార్థిలో సహజంగా, అంతర్గతంగా ఉండే శక్తుల్ని బయటకు తీయడమే ప్రధానలక్ష్యంగా కనిపిస్తుంది. వంశపారంపర్యంగా వ్యక్తిలో ఉండే ఈ సహజశక్తి, పరిసరాల ప్రభావం వల్ల, గురువు బోధన వల్ల పరిపూర్ణతను పొందుతుంది. ఆచార్యుడు, అంతేవాసి, ప్రవచనం అనే మూడింటి కలయికే 'విద్య'. ప్రాచీన విద్యావిధానం ఈ పద్ధతిలోనే కొనసాగింది.

పాశ్చాత్యులలో ప్రముఖ విమర్శకుడైన అరిస్టాటిల్ 'విద్య' ను ఈ విధంగా నిర్వచించాడు. "Education is the creation of sound mind in a sound body" (నిర్మలమైన శరీరాన్ని, మనస్సును ప్రసాదించేది విద్య)[7]. ఈ నిర్వచనం విద్య యొక్క ప్రయోజనాన్ని సూచిస్తుంది. ప్రశాంతమైన మనస్సును, ఆరోగ్యవంతమైన శరీరాన్ని కలిగించేది విద్య అని అరిస్టాటిల్ అభిప్రాయం. అంటే కేవలం మేధాపరిజ్ఞానమే కాకుండా మానసిక పరిపక్వత కూడా విద్యకు పరమప్రయోజనమని తెలుస్తున్నది.

హార్న్ అనే ఆంగ్లపండితుడు 'విద్య' ప్రయోజనాన్ని ఇలా నిర్వచించాడు. "Education is the superior adjustment of a physically and mentally developed conscious human being to the intellectual, emotional and violitional environments"[8] (శారీరకంగా,

మానసికంగా ఎదిగిన సచేతనుడైన మానవుని బౌద్ధిక, హార్ధిక, ఐచ్ఛిక పరిసరాలను ఆనుగుణ్యం పొందునట్లు చేసేది విద్య). అరిస్టాటిల్ నిర్వచనం లాగానే ఇది కూడా మనిషి శారీరక, మానసిక వృద్ధినే 'విద్య' గా తెలియచేస్తుంది. అయితే హార్న్ నిర్వచనంలో 'environments' అన్న పదం గుర్తించదగింది. శారీరక, మానసిక, ఐచ్ఛిక పరిసరాలు అంటే ఏమిటి? అనే ప్రశ్న ఉదయిస్తుంది. శారీరకమైన పెరుగుదలలో వంశపారంపర్యమైన జన్యుసంస్కారం కొంత పనిచేస్తుంది. కొంత అతడు తినే పదార్థాల వల్ల లభిస్తుంది. దీనివల్లే కొందరు పొడవుగాను, కొందరు పొట్టిగాను ఎదగడం. ఈ ఎదుగుదలలో వంశపారంపర్య లక్షణాలు ప్రధానపాత్ర వహిస్తాయి. ఇక మానసిక, ఐచ్ఛిక పరిసరాలు అనేవి చుట్టూ ఉండే పరిసరాల చేత ప్రభావితం అవుతాయి. ఒక వ్యక్తి పుట్టుక చేత రజోగుణం కలవాడైనా, పరిసరాల ప్రభావం వల్ల సత్త్వగుణాన్ని పొందవచ్చు లేదా సత్త్వగుణం రజోగుణంలోకి కూడా మారవచ్చు. కాబట్టి మానసికమైన పెరుగుదలలో పరిసరాల ప్రభావం విశిష్టమైంది.

పులి సాధారణంగా క్రూరజంతువు. కానీ చిన్నప్పుడే దాన్ని తల్లి నుండి వేరుచేసి సాధుజంతువుల మధ్య పెంచితే దానిలో కూడా ఆ సాధులక్షణాలు వస్తాయి. కానీ ఒక్కసారి రక్తాన్ని రుచి చూసిన పులి ఇక ఎప్పటికీ తన క్రూరత్వాన్ని వదిలిపెట్టదు. అలాగే సాధుజంతువైన మేక రక్తమాంసాల్ని తినడం ప్రారంభిస్తే, ఇక అది ఎప్పటికీ ఆకులు మేయదు. కాబట్టి వ్యక్తి మానసికమైన ఎదుగుదల మీద పరిసరాలు ఎంతో ప్రభావాన్ని చూపిస్తాయి. మొత్తంమీద హార్న్ నిర్వచనం ప్రకారం విద్య అంటే వ్యక్తిలోని వంశపారంపర్య, ఆర్జిత శక్తులను ఉజ్జ్వలింపచేసేది అని తేలుతుంది.

అయితే విద్యవల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఆర్.మల్లేశుడు గారు వివరించారు. "శుశ్రూష, శ్రవణం, గ్రహణం, ధారణం, ఊహ, అపోహ, అర్థజ్ఞానం, తత్త్వజ్ఞానం" అనే ఎనిమిది మేధాశక్తులు. అంతేవాసి (శిష్యుడు) భక్తి శ్రద్ధలతో త్రికరణశుద్ధిగా ఆచార్యునికి సంతోషాన్ని కలిగించే పనులు చేయడం, నమస్కరించడం, ఆయన ఆజ్ఞను శిరసావహించడం, గురువు ఎడల అనుకూల ప్రవర్తనతో ఉండడం, గురుశుశ్రూష. గురువు చెప్పే ఎన్నో విషయాలను ఎంతోకాలం వినడం శ్రవణం. వాటిని అర్థం చేసుకోవడం గ్రహణం. అర్థంచేసుకున్న విషయాలను మనస్సులో నిలుపుకోవడం ధారణం. అవసరమైన భావాలను స్వీకరించడం ఊహ. అనవసరమైన భావాలను పరిహరించడం అపోహ. విద్యార్థి

తన వివేచనాశక్తితో మంచి విషయాలను గ్రహించి, చెడు విషయాలను పరిత్యజించవలసి ఉంటుంది. మంచిని గ్రహించడమే అతనికి అర్థజ్ఞానం కలిగినందుకు నిదర్శనం. గ్రహించిన మంచి విషయాలను జీవితంలో ఆచరించడం తాత్పర్యవిజ్ఞానం''[9].

పై వివరణనుబట్టి విద్యార్జన ఎంత శ్రమతో కూడుకున్నదో మనకు తెలుస్తున్నది. బాల్యంలో పిల్లలు తల్లిదండ్రుల్ని వదిలి గురువు వెంట ఆశ్రమానికి వస్తారు. విద్య ముగిసేవరకు గురువు ఆశ్రమంలోనే జీవిస్తారు. గురువుకు సేవలు చేస్తూ, వీలుకలిగినపుడు అతడినుండి విద్యను నేర్చుకొనేవారు. ఇది రాజుల బిడ్డలకు కూడా తప్పనిసరి నియమం. వారెంత ధనవంతులైనప్పటికి గురుకులానికి వచ్చేటప్పుడు కాషాయవస్త్రాలను ధరించి వచ్చేవారు. భిక్షాటన ద్వారా జీవితాన్ని గడిపేవారు. దీనివల్ల వారికి కష్టసుఖాల విలువ తెలిసివస్తుంది. సమాజంలో ఎలా నడుచుకోవాలో ఈ అనుభవం వల్ల తెలిసివస్తుంది. తల్లిదండ్రులకు దూరంగా ఉండడం వల్ల క్రమశిక్షణ, సంస్కారం అలవడతాయి. తల్లిదండ్రుల గారాబం అతడికి దూరమవుతుంది. తనతోటి వాళ్ళతో, గురువుతో మర్యాదగా నడుచుకోవడం అలవాటు చేసుకొంటాడు. ఇది అతడి ప్రవర్తనను మంచి మార్గంలో నడిపించడానికి ఏర్పాటుచేసిన నియమం.

శ్రవణం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మానసిక ప్రశాంతత చేకూరుతుంది. శ్రవణం వల్ల విద్యార్థిలోని లోపాలు తొలగి, మంచి గుణాలు రావడానికి అవకాశం ఏర్పడుతుంది. అయితే ఈ శ్రోతల్లో మూడు రకాల వారుంటారు. మొదటిరకం శ్రోతలు, గురువు చెప్పిన విషయాలను ఒక చెవితో విని రెండవ చెవితో వదిలిపెడతారు. వీరు అధములు. రెండవ రకంవారు, ఇతరుల నుండి విన్నదాన్ని ముఖం ద్వారా వ్యక్తపరుస్తారు. అంటే ఇతరులకు నీతులు చెప్పడమే కాని తాము మాత్రం ఆచరించరు. వీరు మధ్యములు. ఇక మూడవ రకం శ్రోతలు, ఎదుటివ్యక్తి చెప్పినదాన్ని వింటారు. దాన్ని మనసులో నిలుపుకొంటారు. అందులోని మంచి విషయాల్ని గ్రహంచి ఆచరిస్తారు. వీరు ఉత్తములు. కాబట్టి శ్రవణం వల్ల మనం మన జీవితాన్ని సరిదిద్దుకోవడానికి వీలుకలుగుతుంది.

శ్రోత విన్న విషయాలను మనసులో నిలుపుకొని, అందులోని మంచిని గ్రహించగలుగుతాడు. దీన్ని ఊహ అంటారు. హంస పాలను నీటినుండి ఎలా వేరుచేసి గ్రహిస్తుందో, అలాగ విద్యార్థి తన చుట్టూ ఉన్న పరిసరాల నుండి మంచిని గ్రహించాలి. అయితే నిజంగా పాలసముద్రం ఉందా? హంసలు ఆ పాలనుండి

నీటిని ఎలా వేరు చేస్తాయి? అనే ప్రశ్నలు మనకు రావచ్చు. వాస్తవానికి హంస వేరుచేసేది నీటిలో కలిసిన తామరతూడుల పాలను మాత్రమే. హంస తామరతూడుల్ని త్రుంచినపుడు వాటి సొన (తెల్లటిరసం) నీటిలో కలుస్తుంది. హంస ఆ 'సొన' ను మాత్రమే నీటినుండి వేరుచేసి స్వీకరిస్తుంది. అలాగే మన చుట్టూ ఉన్న సమాజంలో మంచి, చెడు రెండూ ఉంటాయి. హంస ఎలా నీటినుండి పాలను వేరుచేస్తుందో విద్యార్థి కూడా అలా తన చుట్టూ ఉన్న పరిసరాల నుండి మంచిని గ్రహించాలి.

'ధారణ' అంటే 'మనసులో నిలుపుకోవడం' అని అర్థం. అంటే విన్నదాన్ని ఎక్కువసేపు మనసులో నిలిపి, తిరిగి చెప్పడం. దీనివల్ల మేధ ఎంతో వికసిస్తుంది. ఆ ధారణశక్తివల్ల విద్యార్థికి సూక్ష్మపరిశీలనాశక్తి అలవడుతుంది. దీనివల్ల మానసికమైన పెరుదలతోపాటు, శారీరక ఆరోగ్యం కూడా వస్తుంది. బాగా తలనొప్పితో బాధపడుతున్న వ్యక్తి కొంతసేపు కళ్ళు మూసుకొని కొన్ని పద్యాలో, శ్లోకాలో మననం చేయడం ప్రారంభిస్తే కొద్దిసేపటికి అతనికి గల తలనొప్పి పోతుంది. ఇంక ఎలాంటి మందులూ అక్కరలేదు. తిరిగి చదువుకోవడానికి (పనిచేయడానికి) మెదడు సిద్ధమవుతుంది. కాబట్టి ధారణ వల్ల దేహానికి శాంతి, మెదడుకు మేత రెండూ లభిస్తాయి.

శ్రవణం వల్ల, పఠనం వల్ల, చూడడం వల్ల కలిగిన జ్ఞానాన్ని ఆచరణలోకి తీసుకురావడమే విద్యార్జనలోని ప్రధాన లక్ష్యం. ఆచరణలేని ఆదర్శం ఎందుకూ పనికిరాదు కదా! అందుకే పెద్దలంటారు. పండితుడు కావాలంటే నాలుగు వేదాలు చదవనక్కరలేదు. సచ్ఛీలుడైన బ్రాహ్మణుడు ఒక్క గాయత్రీమంత్రం నేర్చుకొన్నా చాలు అని. దీన్నిబట్టి విద్యార్జన పరమలక్ష్యం ఆచరణ అని తేలుతుంది.

హార్న్ చెప్పిన పై అభిప్రాయాన్నే మహాభారతకర్త వ్యాసుడు కూడా ప్రతిపాదించాడు.

> "యుధిష్ఠిరస్య శౌచేన ప్రీతాః ప్రకృతయోఽభవన్
> ధృత్యా చ భీమసేనస్య విక్రమేణార్జునస్య చ
> గురుశుశ్రూష యా క్షాన్త్యా యమయోర్వినయేన చ
> త తుతోష లోకః సకలస్తేషాం శౌర్యగుణేన చ!"[10]

పై శ్లోకాన్నిబట్టి యుధిష్ఠిరునిలో శౌచము, భీమునిలో ధృతి, అర్జునుడిలో సర్వాతిశయ సామర్థ్యము, కవలల్లో గురుశుశ్రూష, వినయము, సహనము ప్రధానమైన గుణాలని బోధపడుతుంది. అయితే ఇవన్నీ ఒక

వ్యక్తిలో ఉండడం సాధ్యమయ్యే పనికాదు. ఎందుకంటే ఈ భూమి మీద సర్వసంపూర్ణమైన మానవుడు పుట్టలేదు. ప్రతి ఒక్కరిలోను ఏదో ఒక లోపం ఉంటుంది. దీనికి భారతమే నిదర్శనం. భారతంలో పై గుణాలలో ఎవరు ఎక్కువ శాతం కలిగియుంటారో వారు ఉత్తములుగా ప్రసిద్ధిపొందుతారు. అలాంటివాడే భీష్ముడు. ఇతనిలోనూ అహంభావం, క్రోధం లేకపోలేదు. అయితే వాటికన్నా అతనిలోని సత్త్వగుణాలు అధికంగా కనిపిస్తాయి. ఆ గుణాలమధ్య, దోషాలు మరుగునపడ్డాయి. విద్యార్థి కూడా వీలైనంత వరకు పై గుణాలను సముపార్జించుకోవాలని తాత్పర్యం. ఆ సముపార్జించిన జ్ఞానాన్ని ఆచరణలోకి తీసుకురావడమే అంతిమలక్ష్యం.

ఇంకొందరు భారతీయ మేధావులు విద్యను క్రింది విధంగా నిర్వచించారు. 'మనిషిని స్వావలంబకుడిగా, నిస్వార్థిగా తయారుచేయునదే విద్య' అని ఋగ్వేదంలోను, 'మనిషిని శీలవంతుడిగాను, సమాజానికి ఉపయోగపడేవాడిగాను తీర్చిదిద్దునదే విద్య' అని యాజ్ఞవల్క్యస్మృతిలోను చెప్పబడింది. 'మానవునిలో ఉన్న దైవభక్తిని బయటకు లాగడమే విద్య' అని వివేకానందుడు, 'మనిషిలోని అత్యున్నత శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తులను బహిర్గతం చేయడమే విద్య' అని గాంధీజీ, 'మనిషి మనసు, ఆధ్యాత్మిక శక్తులను అభివృద్ధి పరచడమే విద్య' అని అరవిందుడు విద్యను నిర్వచించారు[11].

పై అభిప్రాయాల్నిబట్టి చూస్తే విద్య అంటే కేవలం మేధలో పెరుగుదల మాత్రమే కాదని, మనిషి సంపూర్ణమైన వికాసమే అసలైన విద్య అని తెలుస్తున్నది. అయితే ఇది పాఠశాలల నుండి, కళాశాలల నుండి మాత్రమే నేర్చుకొనేది కాదు. వ్యక్తి తనచుట్టూ ఉన్న పరిసరాల నుండి కూడా విజ్ఞానాన్ని పొందుతాడు. తరగతి గదిలో గురువు ఒక క్రమబద్ధమైన, ప్రణాళికాబద్ధమైన పద్ధతిలో విద్యను శిష్యుడికి బోధిస్తాడు. విద్యార్థి శక్తిసామర్థ్యాలతో తనకు పనిలేదు. తన ప్రణాళిక ప్రకారం విద్యనేర్పడమే ఈ రకపు విద్యావిధానంలో గురువు చేస్తున్న పని. అయితే ఇది సరియైన విధానం కాదు.

ప్రతి వ్యక్తిలోను ఏదో ఒక ప్రతిభ పుట్టుకతోనే ఉంటుంది. విద్యార్థిలోని ఈ సహజసిద్ధమైన ప్రతిభను గుర్తించి, దాన్ని ఉజ్జ్వలింపచేయడమే సరియైన విద్య. 'గురువు' అన్న పదానికి ఉన్న అర్థం కూడా ఇదే. విద్యార్థిని, అతడి అభిరుచులకు తగ్గట్టుగా, అతనికి ఇష్టమైన రంగంలో నిష్ణాతుణ్ణి చేయడమే నిజమైనవిద్య. సరియైన విధానం.

పాశ్చాత్య పండితుడైన రెడెన్ (Redden) విద్యను క్రింది విధంగా నిర్వచించాడు. "పరిణతి గల వ్యక్తి, అపరిణతి గల వ్యక్తిపై ఉద్దేశపూర్వకంగా, క్రమబద్ధంగా, వ్యక్తి, సమాజ అవసరాలనుబట్టి, శారీరక, మానసిక, సౌందర్య, ఆధ్యాత్మిక శక్తుల సమ్మేళనాభివృద్ధి కోసం, శిక్షణ (instruction), క్రమశిక్షణ (discipline) ద్వారా చేయు ప్రభావమే విద్య"[12]. పై నిర్వచనం ప్రకారం వ్యక్తిగత అవసరాన్నిబట్టి, సామాజిక అవసరాల్నిబట్టి విద్య నేర్పడం వల్ల విద్యార్థిలో ఉన్న సహజశక్తులు నిర్వీర్యమౌతాయి. కళల పట్ల అభిరుచి ఉన్న విద్యార్థికి, సాంకేతిక విద్యను నేర్పించడానికి ప్రయత్నిస్తే ఫలితం ఆశాజనకంగా ఉండదు. అలాగే సాంకేతిక విద్యను ఎంతో బాగా అభ్యసించిన ప్రతి ఒక్కరికి కళల్లో అభిరుచి ఉండకపోవచ్చు. ఈ రకం చదువుల వల్ల డిగ్రీలు రావచ్చునేమో కానీ మానసికమైన ఎదుగుదల మాత్రం ఉండదు. కాబట్టి విద్యార్థిలో ఎలాంటి ప్రతిభ ఉందో గుర్తించి, ఆ రంగంలో నిష్ణాతుడైన గురువువద్ద విద్యను క్రమబద్ధంగా నేర్పించడమే సరియైన విధానం. తల్లిదండ్రులు తమ ఆదర్శాలకు అనుకూలంగా పిల్లల్ని చదివించడం కన్నా, ఆ పిల్లల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి వారికి శిక్షణను ఇప్పించినపుడే వారు ప్రయోజకులౌతారు. కొత్తబాణీలను సృష్టించగలరు. కాబట్టి పై నిర్వచనం ప్రకారం 'ఉద్దేశపూర్వకంగా' విద్యను అందించడమంటే విద్యార్థి ఉద్దేశం ప్రకారమనే అర్థాన్ని మనం గ్రహించాలి.

ఆధునికుల్లో విశ్వనాథ, చలం వంటివారు కూడా విద్యను నిర్వచించారు. విశ్వనాథ సత్యనారాయణగారు, "విద్య ప్రధానంగా రెండు విధములు. ఒకటి వృత్తివిద్య. రెండవది జ్ఞానం కొరకు చదువువిద్య. ఇవి రెండునూ కలుపరాదు. వృత్తివిద్య జీనాధారమైనది. జ్ఞానం కొరకైన విద్య హృదయమునకు సంస్కారము తెచ్చుటకేర్పడినది"[13]. అని నిర్వచించారు. విశ్వనాథ వారు చేసిన ఈ విభజన ఎంతో సమంజసంగా కనిపిస్తుంది. విద్యలు రెండు రకాలు. 1. వృత్తివిద్యలు, 2. నైతిక విద్యలు. వృత్తివిద్యలు జీవనానికి మార్గం చూపిస్తాయి. ఇవి భౌతికమైన విషయంతో కూడిన విద్యలు. రెండవరకపు విద్యలు మనస్సుకు సంబంధించినవి. సాహిత్యం, చిత్రలేఖనం, శిల్పం, సంగీతం వంటి కళలు ఇందులో చేరుతాయి. అయితే ఇక్కడ ఒక విషయాన్ని మనం గమనించాలి. శారీరక విద్యల్లో మనస్సు ప్రమేయం ఉండకపోదు. అలాగే మానసిక సంబంధ విద్యల్లో శరీర ప్రమేయం ఉండవచ్చు. మనస్సులోని సాత్విక గుణాలు శరీరం మీద ప్రతిఫలిస్తాయి. కన్నీటిధారలు, శరీరం పులకలు వేయడం మొదలయినవి మనస్సుకు సంబంధించినవి. అయినా శరీరప్రమేయం కూడా ఉంటున్నది. వీటినే అనుభావాలు అంటారు. అయితే

శారీరక విద్యల్లో (వృత్తివిద్యల్లో) శరీరం ప్రధానంగా, మానసిక విద్యల్లో మనస్సు ప్రధానంగా పనిచేస్తాయి. కాబట్టి పై రెండు విద్యలు పరస్పర సంబంధం కలిగినవిగా కనిపిస్తాయి. వృత్తివిద్యలు వ్యక్తి తన పెద్దలనుండి (వంశపారంపర్యంగా) నేర్చుకొనే విద్యలు. నైతిక విద్యలు సుశిక్షితులైన ఆచార్యుల వద్ద నేర్చుకొనేవి. ప్రాచీనకాలంలో విశ్వవిద్యాలయాల్లో నైతిక విద్యలతోపాటు, వృత్తివిద్యల్ని కూడా నేర్పడం గమనించదగిన విషయం. దీన్ని దృష్టిలో ఉంచుకునే శరత్ చంద్రబాబుగారు ఇలా అన్నారు.

"మార్కులు, ర్యాంకులు, డిగ్రీలు – మంచి జీవిక ఏర్పిరిస్తే, నైతిక విద్య మంచి జీవితాన్నే చేకూర్చుతుంది"[14]. ఇందులో విప్రతిపత్తి లేదు. కేవలం శాస్త్రజ్ఞానాన్ని సంపాదించినంత మాత్రాన్నే అతడు మేధావి కాలేడు. సమయజ్ఞానం, సమ్యక్ దర్శనం, సమ్యక్ వాక్ కలిగినవాడే విజ్ఞాని అవుతాడు. అందుకే నార్లవేంకటేశ్వరరావుగారు ఇలా అన్నారు.

"చదివినంత చిత్త సంస్కారమబ్బదు
చదివిచదివి కూడ జడులు కారె!
యెదను పెంచినపుడె చదువుసార్థకమొందు
నవయుగాల బాట నార్లమాట"[15]

కాబట్టి మేధాశక్తితో పాటు, మానసికమైన ఎదుగుదల సాధించినపుడే చదువు పరిపూర్ణతను పొందుతుందని తెలుస్తుంది. చలంగారు కూడా మానసికమైన వైశాల్యాన్ని దృష్టిలో ఉంచుకొని 'విద్య'ను నిర్వచించారు. "విద్య అంటే ఆనందించే శక్తిని వృద్ధి చెయ్యటం, సౌందర్యాలకు కళ్ళుతెరవటం, బాధల నుంచి, కష్టాల నుంచి తప్పించుకొనే నేర్పునివ్వడం. ఇతరుల స్వేచ్ఛలను అడ్డగించే స్వార్థపరత్వం నుండి, అంతా తనకే కావాలని దాచుకునే కౌపీనం నుంచి, భయాల నుంచి తప్పించగలగటం"[16] అని తమదైన బాణీలో వ్యాఖ్యానించారు. వీరి సిద్ధాంతం ప్రకారం విద్య మానవుడికి స్వేచ్ఛని కలిగించాలి, తనకెదురైన సమస్యలనుండి ఎలా బయటపడాలో ఆలోచించుకోగల నేర్పునివ్వాలి. అంటే మేధాశక్తి మరియు మానసిక శక్తి రెండూ కలిగించాలి అని అర్థం. ఈయన అభిప్రాయం కూడా పైన చెప్పిన అభిప్రాయాలనకు దగ్గరగా ఉంది.

మనవు తన 'మనుధర్మశాస్త్రం'లో,

"ఆచార్యాత్ పాదమాదత్తే పాదం శిష్యః స్వ మేధయా

పాదం సబ్రహ్మచారిభ్యః పాదం కాలక్రమేణ చ"[17].

విద్యార్థి నాల్గవ వంతు తన ఆచార్యుని నుండి, నాల్గవ వంతు స్వీయప్రతిభ ద్వారా, నాల్గవ వంతు సహజవనరుల నుండి, నాల్గవ వంతు తర్వాతి కాలంలో అనుభవం ద్వారా అభ్యసిస్తాడు అని తెలిపాడు. దీన్నిబట్టి ఆ కాలంలో మానవుని మూర్తిమత్వ వికాసమే విద్య పరమావధిగా కనిపిస్తుంది. దీన్నే పి. మల్లికార్జున్ గారు తమ సిద్ధాంత గ్రంథంలో ఉటంకించారు. "వ్యక్తిత్వవికాసం లేని మేధావికాసం, ఆచరణలేని విద్యాధ్యయనం విద్య ప్రాథమిక లక్ష్యాలనే దెబ్బతీస్తాయని గుర్తించారు. అందుకే కేవలం మేధ మాత్రమే కాకుండా బాలుని సంపూర్ణ మూర్తిమత్వవికాసం ప్రాచీన విద్యావిధాన లక్ష్యంగా పేర్కొన్నారు"[18]. పై వివరణను బట్టి చూస్తే, వ్యక్తి శారీరక, మానసిక, బౌద్ధిక రంగాల పెరుగుదలను విద్యగా చెప్పవచ్చు. ఈ విద్యార్జనలో వంశపారంపర్యలక్షణం, పరిసరాలు ప్రభావాన్ని చూపిస్తాయి. విద్యార్థి మేధావికాసంలో పెరుగుదలతోపాటు, మానసికమైన పెరుగదల కూడా విద్యావిధానం ప్రధాన స్వభావంగా కనిపిస్తుంది. ఆదర్శంతో కూడిన ఆచరణ ప్రాచీన–విద్యావిధానం యొక్క లక్షణంగా కనిపిస్తుంది. దీన్నే శ్రీహర్షుడు నైషధంలో ఇలా చెప్పాడు, "అధీతి బోధాచరణ ప్రచారణైః" (1–4).

1.3. విద్యార్థి – ఆచార్యుడు – సత్ప్రవర్తన:–

విద్యార్జనలో శిష్యుడు, గురువు, ప్రవచనం అనే మూడూ ప్రధానమైనవి. విద్యను అర్థించేవాడు విద్యార్థి (శిష్యుడు). విద్యను బోధించేవాడు గురువు. విద్యార్థిలోని శక్తి బయటకు లాగేవాడు గురువు. వీరిద్దరి మధ్య వారధి ప్రవచనం లేదా బోధన. ఈ మూడింటి సంబంధాన్నే వ్యాసుడు భారతావతారికలో సూచించాడు.

"నారాయణం నమస్కృత్య
నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసమ్
తతో జయ ముదీరయేత్"[19]

ఇందులో విద్యాసంప్రదాయాన్ని సూచిస్తున్నట్లుందని డా. మల్లేశుడు గారు ఈ క్రింది విధంగా వ్యాఖ్యానించారు. "నారాయణుడంటే సర్వజ్ఞుడైన ఆచార్యుడే. నరోత్తముడంటే జిజ్ఞాసువైన విద్యార్థి. ఇక

సరస్వతి జ్ఞానానికి, దాన్ని అందించే విధానానికి ప్రతీక. వేదవ్యాసుడు కూడా ఆచార్యుడే. ఆయన నారాయణుని అవతారమే గదా! కనుక ఆచార్యుడు, అంతేవాసి, ప్రవచనం అనే మూడింటి పరస్పర సంబంధానికి సూచకమే పై శ్లోకం. ఈ సమన్వయాన్ని చక్కగా గ్రహించి అనుభవానికి తెచ్చుకున్నప్పుడే జీవితానికి జయం కలుగుతుందని తాత్పర్యం"[20]. దీన్నిబట్టి విద్యార్జనలో గురుశిష్యులిద్దరూ సమప్రాధాన్యం కలవారని తెలుస్తున్నది.

విద్యారంభంలో గురుశిష్యుల సంబంధాన్ని తెలుపుతూ ఈ క్రింది మంత్రాలను పఠించడం ఉపనిషత్ సంప్రదాయం. "సహనావవతు సహనౌభునక్తు, సహవీర్యం కరవావహైఃు, తేజస్వినావధీతమస్తు, మావిద్విషావహై ఓం శాంతిఃు శాంతిఃు శాతిఃు"[21]. మనమిద్దరం కలిసిజీవిద్దాం, కలిసిభోజనం చేద్దాం, ఇద్దరికీ సమానమైన శక్తిసామర్థ్యాలు లభించాలి, తేజస్సు లభించాలి, మనిద్దరి మధ్య విద్వేషాలు ఉండకూడదు అని పై మంత్రానికి అర్థం. ప్రాచీనకాలంలో గురుశిష్యుల మధ్య ఎలాంటి సత్సంబంధం ఉండేదో పై మంత్రం వల్ల తెలుస్తుంది. విద్యాధ్యయనానికి గురుశిష్యుల పరస్పర సహకారం ఎంతో అవసరం. వారిద్దరిలో ఎవరు ఎక్కువ?, ఎవరు తక్కువ? అనే భేదం రాకూడదు. దీనికి ఉదాహరణగా మల్లేశుడు గారు ఈ క్రింది శ్లోకాన్ని ఉదహరించారు.

"అరణీం బ్రాహ్మణీం విద్ధి గురురస్యోత్త రారణీమ్!
తపఃశ్రుతేఽ భిమధ్నీతోజ్ఞా నాగ్నిర్జాయతే తతఃు!!"[22]

అగ్ని పుట్టాలంటే రెండు జమ్మికొయ్యలవసరం. అందులో ఒకటి పూర్వారణి. రెండవది ఉత్తరారణి. ఆ రెండింటికి మధ్య ఘర్షణ జరిగినపుడే అగ్నిపుడుతుంది. ఇచ్చట శిష్యుని బుద్ధి ఒక ఆరణి. ఇది పూర్వారణి. గురువు యొక్క బుద్ధి ఉత్తరారణి. తపస్సూ, శ్రవణమూ, మననమూ విద్యాసాధనాలు. వీటివల్ల జ్ఞానాగ్ని పుడుతుంది. అగ్ని రెండు పనులను చేస్తున్నది. ఒకటి చీకటిని తొలగించడం. రెండు పదార్థాన్ని చూపంచడం. అట్లాగే జ్ఞానం వల్ల అజ్ఞానం తొలగడం, సత్పదార్థం గోచరించడం జరుగుతుంది. కాబట్టి జ్ఞానార్జనలో గురుశిష్యులిద్దరూ సమప్రాధాన్యం కలిగినవారని తెలుస్తుంది. ఈ గురుశిష్యుల సహకారం వల్ల విద్య ఉన్నతిని పొందుతుందని తెలుతున్నది. అందుకే ప్రాచీన కాలంలో గురువు వెంటే శిష్యుడు నడిచేవాడు. విద్యార్థి తల్లిదండ్రులు ఎంత సంపన్నులైనా, తమ బిడ్డను గురువువెంట ఆశ్రమానికే పంపేవారు. హిరణ్యకశిపుడు మూడు లోకాలను శాసించగల సామర్థ్యం సంపాదించినా, తన బిడ్డను మాత్రం గురువు

ఆశ్రమానికి సాధారణంగా పంపించాడు. దీన్నిబట్టి గురుశిష్యులు పరస్పరం సహకరించినపుడే 'విద్య' అనే అగ్ని పుట్టగలదని తెలుస్తుంది.

అయితే ఈ గురుశిష్యుల సంబంధం చివరివరకు సాగాలంటే వారి మధ్య ఉండవలసినవి సదవగాహన, సత్ప్రవర్తన. సచ్ఛీలం లేని చదువు అడవికాచిన వెన్నెల వంటిది. సకల శాస్త్రాలు చదివినా, సత్ప్రవర్తన లేకపోతే సమాజం అతడిని గౌరవించదు. ఉదాహరణకు, నిగమశర్మ పండిత వంశంలో జన్మించినవాడు. అన్నివేదాలు చదివినవాడు. కానీ అతడి ప్రవర్తన గాడి తప్పుతుంది. అతడిని సరిచేయడానికి 'నిగమశర్మ అక్క' పూనుకుంటుంది. మంచిమాటలతో మందలిస్తుంది. చివరకు కటువుగా ఇలా అంటుంది.

"శీల మఖిలంబు నిదిపిల్లిశీలమనుచు
చదువులన్నియునివి జిల్క చదువులనుచు
దోడి వారలు నవ్వనాతోడ యేల
బైలవైతివి యీగుణం బేల నీకు!"[23]

కాబట్టి శీలం లేని చదువులు చిల్కచదువులు అవుతాయి. సమాజం చేత హేళన చేయబడతాయి. గురుశిష్యుల ప్రవర్తన సరిగా ఉన్నప్పుడే విద్యాసాధన కొనసాగుతుందని సారాంశం. ఈ సచ్ఛీలం గురించి భర్తృహరి ఇలా అన్నాడు.

"విద్యచే భూషితుండయి వెలయుచున్న
దొడరి వర్జింపనగుజుమీ దుర్జనుండు
చారు మాణిక్య భూషిత శస్తమస్త
కంబయిన పన్నగము భయంకరముగాదె!"[24]

ఎంత విద్యావంతుడైనా, ఎని శాస్త్రాలు చదివినా దుర్జనుడు తన చెడు స్వభావాన్ని విడిచిపెట్టలేడు. కాబట్టి అతడికి దూరంగా ఉండడం మంచిది. ఎలాగంటే ప్రకాశవంతమైన, విలువైన మణిని తలమీద కలిగియున్న పాము భయంకరమైనదే కదా! కాబట్టి అలాంటి వారిని దూరంగా ఉంచటం శ్రేయస్కరమని భర్తృహరి అభిప్రాయం. దీన్నిబట్టి శీలం లేని చదువు ఎంత నిరర్థకమైందో మనకు తెలుస్తున్నది. ఈ సత్ప్రవర్తన గురించే వేమన ఇలా అంటాడు.

"ఎంత చదువు చదివి ఎన్ని విన్ననుగాని
హీనుడవగుణంబు మానలేడు
బొగ్గుపాలగడుగ పోవునామలినంబు
విశ్వదాభిరామ వినురవేమ"[25]

హీనుడు ఎన్ని చదువులు చదివినా, తనకు సహజంగా ఉన్న దుర్గణాన్ని వదులుకోలేడు. ఎలాగంటే నల్లటిబొగ్గును పాలతో కడిగినా నలుపురంగు పోదు కదా! అలాగే హీనుడు తన చెడ్డగుణాలను విడిచిపెట్టలేడు అని వేమన అభిప్రాయం. విద్య మనిషికి మంచి నడవడిని కలిగించాలి. లేకపోతే చదివిన చదువంతా వృధా అయిపోతుంది. కుండెడు పాలలో చిటికెడు ఉప్పు పడితే ఆ పాలన్నీ విరిగిపోయినట్లే, ఎన్ని మంచి లక్షణాలు కలిగివున్నా, అతడు చేసిన చిన్న తప్పువల్ల ఆ గుణాలన్నీ మాసిపోతాయి. చివరికి ఆ విద్య ఎవరికీ పనికరాకుండా పోతుంది. ఈ శీలాన్ని గురించే అశ్వఘోషుడు, తన 'సౌందరనందం' లో ఇలా వ్యాఖ్యానించాడు. "శీలంహి శరణం సౌమ్యకాంతార ఇవదైశికః, మిత్రం, బంధుశ్చరక్షా చ ధనం చ బలమేవ చ ------ శీలం సంస్కర్తు మర్హసి"[26]. దట్టమైన అడవిలో చిక్కుకున్న దారి తెలియని బాటసారికి, ఆ అడవి చెంత నివాసముంటున్నవాడు, అతనికి బయటపడే మార్గం చూపగలడు. అలాగే సంసారమనే అరణ్యంలో చిక్కుకున్న వాడికి బయటపడే మార్గాన్ని చూపగలిగింది శీలమే. శీలమే మన స్నేహితుడు, బంధువు, రక్షకుడు, బలం, ధనం. కావున ప్రతి మానవుడూ తన శీలాన్ని సంస్కరించుకోవాలని అశ్వఘోషుడు హితవు పలికాడు. అయితే ఈ శీల సంస్కరణ కేవలం పాఠ్యగ్రంథాలను చదవడం వల్ల లభించదు. లోకానుభవం వల్ల సిద్ధిస్తుంది. తన చుట్టూ ఉండే పరిస్థితులే మనిషికి జ్ఞానాన్నీ, తద్వారా సత్ప్రవర్తనను కలిగిస్తాయి. విద్య గొప్పదనాన్ని భర్తృహరి క్రింది విధంగా వివరించాడు.

"విద్యా దదాతి వినయం వినయా ద్యాతి పాత్రతాం
పాత్రత్వా ద్ధనమాప్నోతి ధనాద్ధర్మం తతః సుఖమ్"

విద్య గురించి, విద్యార్జనలో గురుశిష్యుల సంబంధం, విద్యార్థికి ఉండవలసిన ఆనువంశిక, ఆర్జిత లక్షణాల గురించి ఈ అధ్యాయంలో చర్చించబడింది. విద్యార్థి శారీరక, మానసిక, బౌద్ధిక రంగాల పెరుగుదలే సంపూర్ణవిద్యగా తేలింది. ఈ విద్యాసౌధానికి గురుశిష్యులు, ప్రవచనం, శీలం నాలుగు స్తంభాలు.

పాదసూచికలు

1. శ్రీమద్భాగవతము – సప్తమస్కంధం, 130 ప.

2. మహాభారతంలో విద్యావిధానం, పు.7.

3. Introduction to Psychology, P. 454.

4. సుభాషిత త్రిశతి, 12 శ్లో.

5. సుభాషిత త్రిశతి, 16 శ్లో.

6. శ్రీపతిసూక్తులు, 5 ప.

7. Advanced Education Psychology, P.3.

8. పైదే, పు.4.

9. మహాభారతంలో విద్యావిధానం, పు. 12.

10. వ్యాసభారతం, వనపర్వం, పు.10, 126 శ్లో.

11. వజ్రభారతి, పు.789.

12. పైదే

13. వేయిపడగలు, పు. 543.

14. వజ్రభారతి, పు. 906.

15. నార్లవారిశతకం, 15 ప.

16. మ్యూజింగ్స్, పు. 184.

17. మనుధర్మశాస్త్రం, పు. 478.

18. స్వాతంత్ర్యానంతర తెలుగు సాహిత్యం – విద్యావిమర్శ, పు. 8–9.

19. వ్యాసభారతం – అవతారిక శ్లోకం

20. మహాభారతంలో విద్యావిధానం, పు. IX

21. తైత్తిరీయోపనిషత్తు

22. వ్యాసభారతం, అశ్వమేధపర్వం, పు.6172, 3 శ్లో.

23. పాండురంగమాహాత్మ్యం, 2 ఆ, 36 ప.

24. సుభాషితరత్నావళి

25. వేమనశతకం

26. సౌందరనందం, 2 అం, 15 శ్లో.

రెండవ అధ్యాయం

భౌతిక విద్యలు – కావ్యానుశీలన

2. భౌతిక విద్యలు – కావ్యానుశీలన

వెనుకటి అధ్యాయంలో చెప్పినట్లు మానవుని శారీరక, మానసిక, ఆధ్యాత్మిక రంగాల సమగ్రవికాసమే విద్య అవుతుంది. ఈ అధ్యాయంలో మానవుని శారీరక వికాసానికి సంబంధించిన విద్యలను గురించి విశ్లేషించడం జరుగుతుంది. ఈ శారీరక విద్యలనే భౌతిక విద్యలు అంటారు. ప్రాచీన తెలుగు కావ్యాల్లో ఈ శారీరక విద్యలు ఏవిధంగా ప్రతిఫలించాయో వివరించడమే ఈ అధ్యాయపు ప్రధాన లక్ష్యం.

భౌతిక విద్యలు – అర్థవివరణ:–

భౌతికము అనే పదానికి వ్యవహారంలో కంటికి కనిపించేది, రూపాన్ని కలిగవుండేది అనే అర్థాలున్నాయి. అంటే ఏదో ఒకరకమైన శరీరాన్ని కలిగివుండే పదార్థము లేదా జీవి అని చెప్పవచ్చు.

'భౌతికము' అనే పదానికి సూర్యరాయాంధ్ర నిఘంటువులో ముత్తెము, భూతసంబంధమైనది అనే అర్థాలున్నాయి. సి.పి.బ్రౌన్ గారి 'ఇంగ్లీషు–తెలుగు నిఘంటువు' లో భౌతికము అన్న పదానికి physical అన్న ఆంగ్లపదం సమానార్థకంగా కనిపిస్తుంది. Physical అన్న పదానికి ఈ నిఘంటువులో సహజమైన, స్వాభావికమైన, ప్రకృతిసిద్ధమైన అనే అర్థాలున్నాయి. Physical Education అన్న పదానికి సి.పి.బ్రౌన్ గారి 'ఇంగ్లీషు–తెలుగు నిఘంటువు' లో, "విద్యార్థులు తమ చుట్టూ ఉన్న పరిసరాల నుండి నేర్చుకొనే విద్యలు, స్వాభావికమైన విద్యలు"[1] అని ఉన్నది.

భౌతికశాస్త్రానికి సంబంధించిన విజ్ఞానసర్వస్వంలో 'భౌతికశాస్త్రం' అన్న పదానికి "పదార్థాల భౌతిక ధర్మాలను వాటిపై ప్రకృతి శక్తుల ప్రభావాన్ని గూర్చి వివరించే శాస్త్రం"[2] అని ఉన్నది. అంటే పదార్థాల శారీరక ధర్మాలను, వాటి తత్వాన్ని గురించి తెలిపే శాస్త్రం భౌతికశాస్త్రం అని చెప్పవచ్చు.

'శాస్త్రనామ నిఘంటువు' లో 'Physical Education' అన్న పదానికి "శారీరక అధ్యాపన శాస్త్రం, శరీరారోగ్యాన్ని, బలాన్ని పెంపొందించే వ్యాయామం, క్రీడలు బోధించే శాస్త్రం"[3] అని ఉన్నది.

పై వివరణల్ని బట్టి చూస్తే, భౌతిక విద్యలంటే పంచభూతాలతో కూడిన ప్రకృతికి సంబంధించిన విద్యలని ఆ పంచభూతాలతో తయారైన మానవుడి శరీరానికి సంబంధించిన పోషణ, రక్షణ, నివాసం, వికాసం మొదలైన వాటికి సంబంధించిన విద్యలని తెలుస్తున్నది. కారణం మనిషి కూడా ఈ ప్రకృతిలో ఒక భాగమే కాబట్టి, ఆ ప్రకృతి పదార్థాల చేతనే మనిషి శరీరం కూడా నిర్మితమౌతుంది కాబట్టి.

ప్రకృతిలోని ఇతర జంతువులు, పక్షులు మొదలైన వాటికి సంబంధించిన విద్యల గురించి మనిషి నేర్చుకున్నాడు. వాటితో మమేకమయ్యాడు. సృష్టిలోని ఇతర జీవరాశిని తన అవసరాలకు ఎలా ఉపయోగించుకోవాలో నేర్చుకున్నాడు. అందువల్ల మనిషి బుద్ధిజీవి అయ్యాడు. మనిషి ప్రకృతి నుండే విజ్ఞానాన్ని పొందటం ప్రారంభించినుపుడు మనిషి, తన శరీర పోషణకు, రక్షణకు, నివాసానికి, బుద్ధివికాసానికి అవసరమైన జ్ఞానాన్ని ప్రకృతి నుండి సహజంగా పొందడం ప్రారంభించాడు. వ్యవసాయం, వ్యాపారం, వర్తకం మొదలైనవి మానవుడి శరీరపోషణకు ఉపయోగపడే సహజవిద్యలు. రక్షణకు సంబంధించిన ధనుర్విద్య, ఖడ్గవిద్య, యుద్ధతంత్రాలు మొదలైనవి నేర్చినాడు. ఆయుర్వేదం, వైద్యశాస్త్రం, అశ్వశాస్త్రం, గజశాస్త్రం, తర్కశాస్త్రం లాంటి బుద్ధివికాసానికి, శరీర ఆరోగ్యానికి సంబంధించిన విద్యలను కూడా నేర్చాడు. అందువల్ల స్థూలంగా భౌతికవిద్యలంటే మానవుడు ప్రకృతి నుండి నేర్చుకున్న సహజ విద్యలు అని చెప్పవచ్చు. ఈ శారీరకవిద్యలు లేదా భౌతికవిద్యలు ప్రాచీన తెలుగు కావ్యాల్లో ఏవిధంగా ప్రతిఫలించాయో ఈ అధ్యాయంలో చర్చించడం జరుగుతుంది.

అయితే ఈ భౌతికవిద్యల విషయంలో మనస్సు ప్రమేయం ఉండదా? అనే ప్రశ్న రావచ్చు. ఈ భౌతిక లేదా శారీరక విద్యల్లో శరీరం ప్రధానంగాను, మనస్సు ఆనుషంగికంగాను ఉంటుంది. అంటే మనస్సు కంటే శరీరం చేసే పని ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు నేతపని చేస్తున్న వ్యక్తికి శరీరమే ఆధారం. చేతులతోనే మగ్గంనేస్తాడు. అయితే ఈ సందర్భంలో అతడి మనస్సు కూడా కొంత సహాయపడుతుంది. లేకుంటే ఆ పని లక్ష్యం లేకుండా సాగి, చివరకు వ్యర్థమౌతుంది.

కానీ లలిత కళల విషయంలో మనస్సు, శరీరం రెండూ సమానపాత్ర వహిస్తాయి. ఉదాహరణకు నృత్యం చేస్తున్న వ్యక్తికి శరీర సహకారం, మనస్సు సహకారం రెండూ అవసరమే. కవిత్వం రాస్తున్న వ్యక్తికి మనస్సు సహకారం వల్ల భావన కలుగుతుంది, శరీర సహకారం వల్ల ఆ భావనకు అక్షరరూపం లభిస్తుంది. అందువల్ల శారీరకవిద్యల్లో శరీరమే ప్రధానపాత్ర వహిస్తుందని, లలితకళల విషయంలో శరీరం, మనస్సు రెండూ సమాన ప్రాధాన్యం కలిగివుంటాయని చెప్పవచ్చు.

'విద్య' అంటే నేర్చుకోదగింది, జ్ఞానాన్ని ప్రసాదించేది అని అర్థం. ప్రాచీనకాలంలో ఈ 'విద్య' అన్న పదానికి విస్తృతార్థం ఉండేది. ఒక వ్యక్తి చిన్నతనం నుండి చనిపోయేంత వరకు అతను సంపాదించిన జ్ఞానమంతా విద్య అవుతుంది. అది వ్యవసాయం కావచ్చు, వ్యాపారం కావచ్చు. వంటచేయడం, ఇంటిని అలంకరించడం, పశుపోషణ, వస్త్రాలను తయారుచేయడం ఇవన్నీ జ్ఞానాన్ని ప్రసాదించేవే. అయితే ప్రస్తుతం 'విద్య' అంటే తరగతుల్లో ఉపాధ్యాయులు బోధించే శాస్త్రజ్ఞానమే అనే పరిమితార్థం ఏర్పడింది.

వాస్తవానికి మనిషి తన బాల్యం నుండి పరిసరాలను గమనిస్తూ జ్ఞానాన్ని పొందుతున్నాడు. తల్లిదండ్రులు చేసే పనుల్ని చూసి వాటిని నేర్చుకుంటున్నాడు. వారు మాట్లాడే భాషను నేర్చుకుంటున్నాడు. వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే ప్రతి సందర్భంలోంచి ఆ వ్యక్తి కొంత జ్ఞానాన్ని పొందుతున్నాడు. జ్ఞానం అంటే వివేచనాశక్తి, పదార్థజ్ఞానం, వ్యవహార జ్ఞానం. ఇవన్నీ తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించకపోవచ్చు. అయితే మనిషి ప్రకృతి నుండి నేర్చుకొనే ప్రతి జ్ఞానరేణువు కూడా విద్య అవుతుంది. ఈ విద్యనే "సహజవిద్య" అంటారు. పాఠశాలల్లో విద్యార్థి నేర్చుకున్న చదువు అతనికి జీవనోపాధిని కల్పిస్తే, పరిసరాల నుండి సహజంగా పొందినజ్ఞానం అతనికి మంచి జీవితాన్ని ఏర్పరుస్తుంది. అతడిని ఉన్నతమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది.

అందుకే జేమ్స్‌ఆడమ్స్ అనే పాశ్చాత్య పండితుడు విద్యను క్రిందివిధంగా నిర్వచించాడు. "మనకు రండు రకాల విద్యలవసరం. ఒకటి జీవనోపాధి ఎలా కల్పించుకోవాలో నేర్పాలి. రెండవది ఎలా జీవించాలో నేర్పాలి"[4]. పాఠశాలల్లో బోధించే చదువుల వల్ల మనిషికి జీవనోపాధి తప్పకుండా లభిస్తుంది. అలాగే తల్లిదండ్రుల నుండి వంశపారంపర్యంగా వృత్తివిద్యలకు సంబంధించిన జ్ఞానం అందుతుంది. రెండూ జీవనోపాధిని కల్పిస్తాయి. పాఠశాలల్లో గురువుల బోధన వల్ల విద్యార్థి కొంత వ్యవహారజ్ఞానాన్ని పొందుతాడు. కానీ నిత్యజీవితంలో అతడు అనుభవ పూర్వకంగానే సంపూర్ణమైన వ్యవహారజ్ఞానాన్ని పొందుతాడు.

ఉపనిషత్ సుధాలహరి అనే గ్రంథంలో విద్యలోని రెండు భిన్న దశల గురించి ప్రస్తావించబడింది. "విద్య రెండు రకాల మార్గాలు ఎంచుకోవలసి ఉంటుంది. ఒక స్థాయిలో అది నెమ్మదిగా తనతోపాటు తోటి మనుషులు కూడా ఈ ప్రపంచంలో జీవిస్తున్నారని తెలుసుకుంటూరావటం. మరొక స్థాయిలో జీవితం పొడుగునా తోటివారితో కలిసి ఉమ్మడి ధ్యేయాల్ని, ఉమ్మడి ప్రయత్నాల్ని పంచుకుంటూ రావటం"[5]. ఈవిధంగా మనిషి ఎదగాలంటే కేవలం పాఠశాల బోధన మాత్రమే సరిపోదు. మనిషి తనచుట్టూ విశాలమైన ప్రపంచాన్ని గమనిస్తూ పొందవలసి ఉంటుంది.

మొత్తం మీద ఒక వ్యక్తి ప్రకృతి నుండి గాని, తల్లిదండ్రుల నుండి గాని, గురువుల నుండి గాని పొందిన జ్ఞానాన్ని విద్య అనవచ్చు. శరీరపోషణ, రక్షణాది విద్యలు భౌతికవిద్యలు. వీటి గురించి ఈ అధ్యాయంలో విశ్లేషించడం జరుగుతుంది.

ఈ భౌతిక విద్యలను నిబద్ధ, అనిబద్ధ అని రెండు రకాలుగా విభజించవచ్చు. ఖచ్చితమైన పాఠ్యప్రణాళిక ఉండి, పాఠ ప్రవచనాల్లో ఉన్నటువంటివి నిబద్ధవిద్యలు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో

బోధించేవాటిని నిబద్ధవిద్యలు అని చెప్పవచ్చు. అనిబద్ధ విద్యలకు ఖచ్చితమైన పాఠ్యప్రణాళిక ఉండదు. కుటుంబంలోని తల్లిదండ్రులు, గ్రామపెద్దలు తమ తరువాతి తరాలకు వీటిని నేర్పిస్తారు. ఉదాహరణకు:– వృత్తివిద్యలు. దేవతల వరాల వల్ల మంత్ర–యంత్ర విద్యలు నేర్చుకోకుండానే లభిస్తాయి. అందువల్ల వీటిని కూడా అనిబద్ధ విద్యలని చెప్పవచ్చు. వినోద విద్యలు, ప్రవృత్తి విద్యలు కూడా అనిబద్ధ విద్యలే.

స్వభావాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ భౌతిక విద్యలను నాలుగు రకాలుగా విభజించవచ్చు. అవి:– 1. వృత్తి విద్యలు, 2. యంత్ర–మంత్ర విద్యలు, 3, వినోద విద్యలు, 4. ప్రవృత్తి విద్యలు. వీటిని గురించి క్రింది పుటలలో వివరించడం జరుగుతున్నది.

క్రమ సంఖ్య	విద్య	నిబద్ధ	అనిబద్ధ
1	ఆయుర్వేద విద్య	✓	–
2	వైద్య విద్య	✓	–
3	వర్తక విద్య	✓	–
4	వ్యవసాయ విద్య	–	✓
5	పాముకాటు విద్య	–	✓
6	విషహారిణి విద్య	✓	–
7	వాస్తు విద్య	✓	–
8	రసవాద విద్య	✓	–
9	బొమ్మలతయారీ విద్య	–	✓
10	రాజనీతి విద్య	✓	–
11	ధనుర్వేద విద్య	✓	–
12	శబ్దభేది విద్య	✓	–
13	అశ్వశాస్త్ర విద్య	✓	–
14	పశుపాలన విద్య	–	✓
15	స్వప్న విద్య	–	✓
16	నేపథ్య విద్య	✓	–
17	కవచధారణ విద్య	✓	–

18	దండనీతి విద్య	✓	–
19	శకున విద్య	–	✓
20	వస్త్ర తయారీ విద్య	–	✓
21	అద్దకపు విద్య	–	✓
22	చోర విద్య	–	✓
23	మల్లయుద్ధ విద్య	✓	–
24	గణితశాస్త్ర విద్య	✓	–
25	జ్యోతిశ్శాస్త్ర విద్య	✓	–
26	ఛందశ్శాస్త్ర విద్య	✓	–
27	పద్మినీ విద్య	–	✓
28	మృగపక్షి భాషలు తెలుసుకునే విద్య	–	✓
29	కామరూపిణీ విద్య	–	✓
30	అస్త్రహృదయ విద్య	–	✓
31	శాంబరీ విద్య	–	✓
32	చింతామణి మంత్ర విద్య	–	✓
33	తిరస్కరిణీ విద్య	–	✓
34	జలస్తంభన విద్య	✓	–
35	వశీకరణ విద్య	–	✓
36	ప్రతిస్మృతి విద్య	✓	–
37	అస్త్ర విద్య	✓	–
38	సంస్తంభన విద్య	✓	–
39	అంజనం చూసే విద్య	–	✓
40	గారడి విద్య	–	✓
41	పాములాట	–	✓

42	జూద విద్య	–	✓
43	తూర్పునాటిగడిడు	–	✓
44	గృహనీతి విద్య	–	✓
45	దాన విద్య	✓	–

2.1. వృత్తివిద్యలు – కావ్యానుశీలన:–

2.1.1. ఆయుర్వేద విద్య:–

మన ప్రాచీనులు నేర్చిన విద్యలలో ఆయుర్వేదవిద్య చాల ప్రధానమైంది. ప్రకృతిలో సహజంగా దొరికే ఓషధులతో మందులను తయారుచేసి రోగాలను నయం చేయడాన్ని ఆయుర్వేదవిద్య అంటారు. భారతరామాయణాల్లో చాలచోట్ల ఆయుర్వేదవిద్య ప్రస్తావన ఉంది.

అల్లసాని పెద్దన రాసిన మనుచరిత్రలో ఈ ఆయుర్వేదవిద్య ప్రస్తావన ఉంది. ఇందీవరాక్షుడు అనే గంధర్వుడు మనోరమను తినివేయడానికి ఆమెను తరుముతూ వెంబడించాడు. స్వరోచి ధైర్యసాహసాలతో అతడిని ఎదరించి నిలిచాడు. అప్పుడు ఇందీవరాక్షుడు శాపవిముక్తుడై గంధర్వరూపం ధరించాడు. తన స్వగతాన్ని అతనితో ఇందీవరాక్షుడు ఇలా నివేదించాడు.

నేను బ్రహ్మమిత్రుడన్న గొప్ప ఆయుర్వేద పండితుడి వద్ద ఆయుర్వేదవిద్యను అభ్యసించడానికి వెళ్ళాను. కానీ అతడు నిరాకరంచాడు. కారణం నేను గంధర్వుడిని, రాజసగుణం కలవాడిని. కానీ నేను అతనిని ఎంతగానో బ్రతిమాలుకున్నాను. అతడు నీకు ఆయుర్వేద విద్యార్హత లేదుపొమ్మన్నాడు. అంతేకాక దయారహితుడై ఇలా పలికాడు.

“నట విట గాయక గణికా / కుటిల వచః మధుర రసము గ్రోలెడు చెవికిం
గటు వీశాస్త్రము వలది / చ్చట నిను జదివింపకున్న జరుగదెమాకున్?”[6]

ఆయన మాటలకు నాకు చాల బాధ కలిగింది. నటులకు, గాయకులకు ఆయుర్వేదం నేర్చుకునే అర్హతలేదు. నిన్ను చదివించుకుంటే మాకేం జరగదా? అని నన్ను చూసి ఆ గురువు తూలనాడాడు. ఆ మాటలకు, నేను అటువంటివాడను కాను. నేను కొంతకుకొంత మీవంటి పెద్దల శిక్షణలో పెరిగాను. కాబట్టి నన్ను శిష్యునిగా స్వీకరించమన్నాను. అతడు మాత్రం నన్ను శిష్యునిగా స్వీకరించడానికి అంగీకరించలేదు.

అప్పుడు నేను కపట శిష్యుడిగా మారి ఆయన వద్ద ఆయుర్వేదవిద్య అంతా నేర్చుకున్నాను. చదివినవాడిని నా దారిన నేను పోకుండా, ఆయన వద్దకు వెళ్ళి 'నాకు చదువు చెప్పనంటివి కదా! ఇదిగోనేను నీ వద్దనే చదివితిని' అని పొగరుబోతుతనంతో మాట్లాడాను. అందుకు ఆయన కోపించి, నన్ను ఇలా రాక్షసుడిగా పడివుండమని శపించాడు. నేను పశ్చాత్తాపంతో శాపవిమోచనం తెలుపమని కోరాను. కన్నకూతురిని తినడానికి ప్రయత్నించి, స్వరోచి చేతికి చిక్కి చివరకు విముక్తుడవుతావు అన్నాడు. ఈవిధంగా నేను నీవల్ల శాపవిమోచనం పొందగలిగాను అని స్వరోచితో ఇందీవరాక్షుడు పలికాడు. తనకు శాపవిమోచనాన్ని కలిగించినందుకు ఇందీవరాక్షుడు స్వరోచికి కృతజ్ఞతగా తాను నేర్చుకున్న ఆయుర్వేద విద్యతోపాటు, తన కూతురు అయిన మనోరమను ఇచ్చి వివాహం చేశాడు.

ఇందీవరాక్షుడు ఆయుర్వేద విద్యలో క్రింది అంశాల్ని నేర్చుకున్నాడు. "కాయము, బాలము, గ్రహము, ఊర్ధ్వాంగము, శల్యము, దంష్ట్రజర, వృషము అను ఎనిమిది విభాగములుగా గల వైద్యశాస్త్రమందలి అష్టాంగాలను ఇందీవరాక్షుడు మోసముచే ఎనిమిది మాసములలో నేర్చెను"[7]. అంతేకాకుండా ఇందీవరాక్షుడు, "షడ్రుచులగు లవణము మొదలగు ఆరురసములందు ఏదేని చవిగాని యెడల ఆయా రుచి దేనిచే గలిగెనో ఆ రోగమును తెలిసికొని తన్నివారణముకై చేయువాని చికిత్సలను జ్వరాది రేతస్సంబంధ రోగచికిత్సలతో కూడిన శాస్త్రమంతయును తెలుసుకున్నాడు"[8]. దీన్నిబట్టి ఆనాడు ఆయుర్వేదవిద్య ఉన్నతస్థానంలో ఉందని తెలుస్తుంది. నాటి ఆశ్రమాల్లో ఆయుర్వేద విద్యను బోధించడానికి ప్రత్యేకంగా గురువులు ఉండేవారని ఈ కథవల్ల తెలుస్తున్నది.

ఆనాటి ఆయుర్వేద వైద్యులు ఎంతగొప్పవారో నన్నయ ఇలా తెలియజేశాడు.

"అనిశము సేవింతురె ని, న్న నఘాయష్టాంగమైన యాయుర్వేదం
బున దక్షులైన వైద్యులు, ఘనముగననురక్తులై జగద్ధితబుద్ధిన్"[9]

ఆయుర్వేదంలో ఎనిమిది శాఖలు ఉన్నాయి. ఈ ఎనిమిది శాఖలను ఆనాటి వైద్యులు నేర్చుకొనేవారని పైపద్యం వల్ల తెలుస్తున్నది. కాయచికిత్స, బాలచికిత్స, గ్రహచికిత్స, ఊర్ధ్వాంగచికిత్స, శల్యచికిత్స, దంష్ట్రాచికిత్స, జరాచికిత్స, వృషచికిత్స మొదలైన ఎనిమిది చికిత్సలు ఆయుర్వేదంలో చెప్పబడిన అష్టాంగాలు.

ఈ అష్టాంగాల గురించి ఆర్. మల్లేశుడు గారు క్రింది విధంగా వివరించారు. "అష్టాంగాలలో మొదటిది కాయచికిత్స. ఇది రక్తపిత్తమూ, జ్వరమూ, అతిసారమూ మొదలైన వ్యాధులకు సంబంధించింది. తల్లిపాలలోగానీ, దాదిపాలలోగానీ దోషాలుంటే వాటిని పరిహరించడాన్ని వివరించేది బాలచికిత్స. గ్రహపీడన పద్ధతులను తెలిపేది గ్రహచికిత్స. ఊర్ధ్వాంగాలై కన్ను, ముక్కు, చెవి, నోరు, తల వీటికి వచ్చే రోగ

లక్షణాలను, నివారణ పద్ధతులను తెలిపేది ఊర్ధ్వాంగచికిత్స. శరీరంలో గుచ్చుకున్న బాణాలను, కురుపుల్లో కూడుకున్న చెడు పదార్థాన్ని తొలిగించే పద్ధతిని వివరించేది శల్యచికిత్స. విషజంతువుల కోరల వలన కలిగిన బాధలను నివారించే పద్ధతిని తెలిపేది దంష్ట్రాచికిత్స. సహజంగా సంక్రమించే వార్ధక్యాన్ని లేదా విషప్రయోగాల వల్ల కలిగిన వార్ధక్యాన్ని తొలగించే పద్ధతి జరాచికిత్స. రేతోధాతువు చెడినపుడు, సురతంలో తృప్తినీ, స్వస్థతను పొందడానికి, మగతనం లేనివానికి మగతనం కల్గించడానికి చేసే చికిత్సను వృషచికిత్స అంటారు"[10].

ఈవిధంగా వివిధ శాఖలుగా విస్తరించి ఉన్న ఆయుర్వేదవిద్యను ఇందీవరాక్షుడు స్వరోచికి ఉపదేశించాడు. దీన్నిబట్టి ఆనాడు వైద్యవిద్య ఎంతగా అభివృద్ధి దశలో ఉండేదో మనం తెలుసుకోవచ్చు. దాని స్వరూపాన్ని, స్వభావాన్ని మనం తెలుసుకోవచ్చు. దాని స్వరూపాన్ని, స్వభావాన్ని అర్థంచేసుకోవడానికి ఇందీవరాక్షుడి కథ ఎంతో ఉపయోగపడుతున్నది.

ఆనాడు భారతదేశంలో శస్త్రచికిత్సలను కూడా చేసేవారు. దానికి తగిన సౌకర్యాలను కూడా నాటి వైద్యులు ఏర్పాటుచేసుకున్నారు. భారతదేశంలోని ప్రాచీన శస్త్రచికిత్సాలయాలను గురించి వెల్ నన్ కోలమన్ అనే రచయిత ఇలా పేర్కొన్నాడు. "In India 4000 years ago operating theatres were purified with fragrant smoke. Sheets were cleaned with steam and instruments boiled before use. Hospitals were filled with soothing music, perfumed flowers and decorated to let in sun shine. Surgeons had to keep their hands scrubbed, wear white clean clothing, kept their nails short, and their mouths closed during the operations in case the breath contaminated the wound"[11].

ప్రాచీనకాలంలో శస్త్రచికిత్సలు జరిగేవని, వైద్యులు ఎంతో శ్రద్ధతో ఈ చికిత్సలు చేసేవారని పై వివరణ వల్ల తెలుస్తున్నది. ఆనాటి చికిత్సాలయాలను ఎంత సుందరంగా, పరిశుభ్రంగా ఉంచేవారో, వైద్యుల వస్త్రధారణ ఎలా ఉండేదో కోలమన్ చాల వివరంగా తెలియజేశారు.

పూర్వం మనుషులకు సంక్రమించిన రోగాల గురించి భారతంలో క్రిందివిధంగా తెలుపబడింది.

"జలోదరే తృషారోగే జ్వరగండే విషూచ కే
శ్వి త్రకుష్ఠేఽగ్ని దగ్ధేచ సిధ్మా పస్మార యోరపి"[12]

దీన్నిబట్టి జలోదరము, తృషారోగము, జ్వరరోగము, విషూచికము, తెలుపురోగము, అగ్నిదాము, సిధ్మము, అపస్మారము అనే రోగాలు నాటి మనుషులకు సంక్రమించినట్లు తెలుస్తున్నది. వీటికి చికిత్స చేయడానికి ప్రత్యేకంగా వైద్యులు ఉండేవారు. ఈ రోగాలకు సంబంధించిన చికిత్సావిధానాల గురించి అధ్యయనం, అధ్యాపనం జరిగాయి. ఒక్కొక్క వైద్యవిషయాన్ని ప్రత్యేక అంశంగా తీసుకొని నాటి వైద్యవిద్యార్థులు శిక్షణ పొందేవారని కోలమన్ వ్యాఖ్యల వల్ల తెలుస్తున్నది.

ఆంధ్రమహాభారతంలోని సభాపర్వంలో ఆయుర్వేదవిద్య గురించి ఇలా ఉంది. "ఆయుర్వేదంలో సమర్థులైన వైద్యులు లోకానికి మేలుచేసే బుద్ధితో ప్రజలమీది ప్రేమతో ఎనిమిది శాఖలుగా వ్యాపించిన ఆ వైద్యవిధాంలో సేవలు చేస్తున్నారు"[13]. 'ఆయుర్వేదం' అంటే ఆయువును వృద్ధిచేసే మార్గాలను చెప్పేవేదం. పై పద్యార్థాన్ని బట్టి నాటి వైద్యులకు లాభాపేక్ష లేదు కాబట్టి ప్రజలకు సేవ చేయడమే వారి విద్యకు పరమావధి అని తెలుస్తున్నది. ఈ ఆయుర్వేదం ఉపవేదాల్లో ఒకటి. బ్రహ్మ, అశ్వనీదేవతలు, ధన్వంతరి మొదలైన వాళ్ళు దీని కర్తలు. దీన్ని గురువుల నుండి జిజ్ఞాసువులైన విద్యార్థులు నేర్చుకొనేవారు.

"ఆయుర్వేద విద్యను అభ్యసించడానికి గురువు వద్ద చేరే విద్యర్థికి ఒక ప్రత్యేక ఉపనయన కార్యక్రమం ఉంటుంది. ద్విజులందరికీ ఉపనయనం తప్పనిసరి. అదీకాక ఆయుర్వేద విద్యార్థికి ఈ ప్రత్యేక ఉపనయనం తప్పనిసరి"[14].

ఆయుర్వేద విద్య నేర్చుకొనే విద్యార్థికి ఏయే లక్షణాలు ఉండాలో ఇలా చెప్పబడింది. "నాలుక, పెదవులు, దంతాలు, నేత్రాలు, ముక్కు, నేరు వంటి శరీరావయవాలు, నైతిక విలువలు, ధైర్యం, వినయం, శక్తి, వివేకం, ఓర్పు, ధారణ, ఆసక్తి, శారీరక బౌద్ధికవాక్కుద్ధి, బాధలకు ఓర్చుకోగలిగే సహనం ఉండాలి. ఈ అర్హతలు లేనివాడికి ఆయుర్వేద విద్యాభ్యాసానికి ప్రవేశం లేదు"[15].

పై వివరణను చూస్తే ఆనాడు అన్నిరకాలుగా సమర్థుడైన విద్యార్థులకే ఆయుర్వేద విద్యను నేర్పినట్లు తెలుస్తుంది. విద్యార్థి ఆసక్తి, సామర్థ్యం, శ్రద్ధ నాడు ప్రధానంగా పరీక్షింపబడేవి. పైన చెప్పిన లక్షణాలు కేవలం విద్యార్థులకే కాకుండా ఆయుర్వేదాన్ని నేర్పే గురువులకు కూడా వర్తిస్తాయి. గురుశిష్యుల సహకారం వల్లనే కదా ఏ విద్య అయినా సంపూర్ణం అవుతుంది.

ప్రాచీనకాలంలో విద్యాభ్యాసం ఎలా జరిగేదో డా. డి. చంద్రశేఖరరెడ్డిగారు ఇలా తెలియజేశారు. "ఆయుర్వేదంలో విద్యాభ్యాసం ఆరంభించడం ఒక ప్రక్రియ. ఒక శుభముహూర్తంలో 18 అంగుళాల చతురస్రాకారపు వేదిక నేర్పరచాలి. భగవంతునికి, బ్రాహ్మణునికి, వైద్యులకు అర్చన చేయాలి. తరువాత ఖదిర, పలాస, దేవదారు, బిల్వవృక్షాల దారువులను పెరుగు, తేనె, నేతులలో ముంచి సమిధలుగా

హోమంలో మహావ్యాహృతి మంత్రాన్ని (ఓం భూః స్వాహా ఓం భువః స్వాహా ఓం స్వస్వాహా ఓం భూర్భువః స్వః స్వాహా) ఉచ్చరిస్తూ వ్రేల్చాలి. తర్వాత బ్రహ్మ,ప్రజాపతి, అశ్వినీకుమారులు, ఇంద్రుడు, ధన్వంతరి, భరద్వాజుడు, ఆత్రేయాది ఋషులను ఆమంత్రణం చేయాలి. కామక్రోధ మదమాత్సర్యాలను త్యజించాలి. ఎల్లప్పుడూ శుభ్రమైన పట్టువస్త్రాలను ధరించాలి. బ్రహ్మచర్యాన్ని, సత్యవ్రతాన్ని పాటించాలి. ఆచార్యుడు తన విధులను నిర్వర్తించినట్లే శిష్యుడూ తన విధులను నిర్వర్తించాలి. ద్విజులకు, అనాధలకు, అతిధికి శుల్కం తీసుకోకుండా, ఔషధాల మూల్యం తీసుకోకుండా చికిత్సచేయాలి. వేటగాడికి, పక్షులు పట్టేవాడికి, నీచుడికి, పాపికి వైద్యం చేయరాదు"[16]. ఇన్ని నియమాలను పాటించేవారికే విద్యాలయంలోకి ప్రవేశం ఉండేది. ధనప్రలోభాలకు లొంగకపోవడం, మమకారవికారాలు లేకపోవడం ఆనాటి గురువుల ప్రత్యేకత.

ఆనాడు శిష్యుని అర్హతను పరీక్షించిగాని ఉపనయనం చేసేవారు కాదు. అందుకు శిష్యుడు ఆరునెలలు గురువు దగ్గర పనిచేయాలి. బ్రాహ్మణ గురువు – త్రివర్ణాలవారికి, క్షత్రియ గురువు – క్షత్రియ, వైశ్యులకు, వైశ్యగురువు – వైశ్యుడికి ఉపనయనం చేయవచ్చు. శీలవంతుడు, మచ్చలేని వంశానికి చెందిన వాడైతే శూద్రునికి కూడా ఆయుర్వేద విద్యకు ప్రవేశం ఉంది. దీన్నిబట్టి ఆయుర్వేద విద్య నేర్చుకోవడానికి వర్ణం ప్రధానం కాదని, ఆ విద్యార్థి గుణశీలాలు ప్రధానమని తెలుస్తుంది. శూద్రులకు వేదాధ్యయనంలో ప్రవేశం లేదు కానీ ఉపవేదం అయిన ఆయుర్వేదం మాత్రం నేర్చుకోవచ్చు.

2.1.2. వైద్యవిద్య:-

ముందు పుటలలో ఆయుర్వేదవిద్య గురించి, దానిలోని ప్రత్యేకతల గురించి వివరించడం జరిగింది. ప్రస్తుతం మిగిలిన వ్యాధులకు, వాటికి సంబంధించిన వైద్యవిద్య గురించి వివరించడం జరుగుతుంది.

పూర్వం గురువులు వైద్యగ్రంథాలను పద, పాద, శ్లోకాలుగా శిష్యుని చేత వల్లెవేయించేవారు. తర్వాత సమగ్రంగా అర్థం వివరిస్తారు. వైద్య విద్య అనేక శాఖలుగా విస్తరించింది. ఒక శాఖ మాత్రమే అధ్యయనం చేస్తే చాలదు. అన్ని శాఖలనూ ఆయా గురువుల నుండి అధ్యయనం చేయాలి. కారణం ఒక శాఖను అర్థం చేసుకోవడానికి మరో శాఖ అవసరమౌతుంది. అందువల్ల వైద్యశాస్త్రజ్ఞుడు బహుశ్రుతుడై ఉండాలి. వైద్యవిద్యార్థి శాస్త్ర, కర్మలలో నిష్ణాతుడై ఉండాలి. వైద్యుడి అజ్ఞానం వల్ల రోగికి అమృతం కూడా విషమౌతుంది. వైద్యుడెంతటి శాస్త్రకోవిదుడైనా ఛేదన, స్నేహాది కార్యాలు తెలియకపోతే అతడు చికిత్స చేయడానికి పనికిరాడు. ఏయే వ్యాధికి ఏయే మందులు ఇవ్వాలో, ఆ మందుల సమర్థత ఏమిటో అతనికి క్షుణ్ణంగా తెలిసివుండాలి. వైద్యవిద్యను అభ్యసించేవారికి సహనం, అణకువ, సేవాప్రవృత్తి ముఖ్యం. ఇవి లేకపోతే అతడు మంచి వైద్యుడిగా రాణించలేడు.

ఆనాడు వైద్యవిద్య ఎంత అభివృద్ధి దశలో ఉండేదో ఆర్.మల్లేశుడు గారు క్రిందివిధంగా వ్యాఖ్యానించారు.

"రాజయక్ష్మ, కుష్ఠమూ మొదలైన భయంకరమైన వ్యాధులున్నాయి. ఇద్దరు ముద్దుగుమ్మలతో నిరంతరం రతిలో మునిగి తేలి చివరకు రాజయక్ష్మతో మరణించిన విచిత్రవీర్యుడూ, కుష్ఠువ్యాధిచే శరీరంలోని కండలు కరిగిపోయి, రక్తము శూన్యమై, ఎముకలూ, నరాలూ, చర్మమూ మాత్రం మిగిలిన మౌద్గల్యుడూ ఉగ్రరోగ బాధితులు. అలాంటివారు ఇంకా మహాభారతంలో కనిపిస్తారు. సంతానం లేని వారికి సంతానాన్ని కలిగించడం, వికలాంగులను సర్వాంగ సంపన్నులుగా చేయడం, ఆయుష్షును మార్చుకోవడం, వార్ధక్యాన్ని బదిలీ చేయడం, పుంస్త్వాన్ని కలిగించడం, తొలగించడం, వృషణాలను మార్చడం, శరీరాన్ని ముక్కలుగా చేసి వాటిని సంధించి ప్రాణులను బ్రతికించడం, భస్మమైన ప్రాణులను మరలా బ్రతికించడం ఇలాంటి సంఘటనలు మహాభారతంలో కనిపిస్తాయి"[17]. ఆనాటి మునులు వైద్యవిద్యను కూడా బోధించేవారు. నాటి ఆశ్రమాలు విద్యానిలయాలు. వీటికి రాజుల అండదండలు ఉండేవి.

మహాభారతంలో లేనిది ప్రపంచంలో లేదని వేదవ్యాసుని సందేశం. అలాగే వైద్యవిద్యకు సంబంధించిన చాలా విషయాలు ఈ మహాభారతంలో ప్రస్తావించబడ్డాయి. కథలరూపంలో ఆనాటి సమాజంలోని సాంఘిక పరిస్థితులను, విద్యావ్యవస్థను, పరిపాలనా విధానాన్ని మనకు వేదవ్యాసుడు తెలియజేశాడు.

మహాభారతంలో ప్రస్తావించబడిన సందర్భాలనుబట్టి నాటి ప్రజలకు వైద్యవిద్యలో ఎంతో అనుభవం ఉన్నట్లు తెలుస్తున్నది. కద్రువ పెట్టిన గ్రుడ్లను పరిచారికలు నేతికుండల్లో భద్రపరచడం వల్ల వాటి నుండి కొంతకాలానికి నాగులు జన్మించడం జరిగింది. వసురాజు వీర్యాన్ని త్రాగడం వల్ల చేప గర్భంధరించి మత్స్యగంధి, మత్స్యరాజు అనేవారికి జన్మనిచ్చింది. గాంధారి గర్భశకలాలను నేతిపాత్రల్లో భద్రపరచడం వల్ల కౌరవులు పుట్టారు. శరద్వంతుని రేతస్సు శరస్తంభంలో పడడం వల్ల కృపుడు, కృపి అనేవారు పుట్టారు. అగ్నితో స్వాహాదేవి కలిసినందువల్ల జారిపడిన రేతస్సును రెల్లుగడ్డితో, బంగారు కుండలలో పెట్టడం వల్ల కుమారస్వామి కలిగాడు. దీనికి ఆర్.మల్లేశుడు గారి వ్యాఖ్యానం ఇలా ఉంది. "పై సంఘటనలన్నీ పిండోత్పత్తికి సంబంధించినవే. జీవశాస్త్రంలో ప్రత్యుత్పత్తి (Reproduction)సంబంధించినంత వరకు శుక్లకణము (Sperm), అండగణము (Egg)కలియకపోతే పిండోత్పత్తి జరగదని చెప్పబడింది. శుక్లకణము, అండకణము కలిసినప్పుడు సంయుక్తబీజం ఏర్పడుతుంది. అది పెరగడానికి అనుకూలంగా ఉండే ఏ ఉపాధిలోనైనా పిండం వృద్ధిచెందుతుంది. ఆనాడు అండాలను ఘృతకుండాలలో ఉంచడంలో ఉద్దేశం వాటి జీవశక్తిని కాపాడడమే"[18]. దీన్నిబట్టి మన ప్రాచీన మహర్షులు పిండోత్పత్తికి సంబంధించిన

జ్ఞానాన్ని కలిగివున్నారని తెలుస్తున్నది. దీనకి వేదవ్యాసుడే మంచి నిదర్శనం. ఆయన గాంధారి గర్భశకలాలను నేతికుండల్లో పెట్టడం వల్లే దుర్యోధనాదులు పుట్టారు. భరతవంశం నిలిచింది.

ప్రాచీనులు ఎంతో శ్రమకోర్చి వైద్యశాస్త్రాన్ని అభ్యసించారు. కఠినమైన గురుశుశ్రూష చేసి, ఓర్పు, సహనం పొందేవారు. మంచి పౌరుడిగా ఆ వ్యక్తి ఎదగడానికి గురుకులం మంచి కార్యశాల లాగ పనిచేసేది.

వైద్యశాస్త్రానికి సంబంధించిన మరికొన్ని విశేషాలు కూడా మహాభారతంలో కనిపిస్తున్నాయి. చండకౌశికుడు అభిమంత్రించి ఇచ్చిన మామిడిపండు మహిమ వల్ల బృహద్రథునికి జరాసంధుడు పుట్టాడు. అష్టావక్రుడు గంగలో మునిగి తన వక్రత్వాన్ని తొలగించుకున్నాడు. శంతనుడి చేయి తగిలితో చాలు వృద్ధుడు యువకుడిగా మారడం కనిపిస్తుంది. ఊర్వశి శాపం వల్ల అర్జునుడు షండుడుగా కొంతకాలం గడిపి తిరిగి మగతనాన్ని పొందడం జరిగింది. శివుని వరం వల్ల అంబకు పుంస్త్వం కలగడం, స్థూలకర్ణుడనే యక్షుడు శిఖండికి తన మగతనాన్ని ఇచ్చి స్త్రీగా మారిపోవడం జరిగింది. గౌతమ ముని శాపం వల్ల వృషణాలను పోగొట్టుకున్న ఇంద్రునికి మేషవృషణాలను అతికించడం జరిగింది. రాక్ష,లు కచుడిని ముక్కలుగా చేసి తోడేళ్ళకు వేసినా, కచుని శరీరాన్ని పిండిచేసి నీటిలో కలిపినా, కాల్చి భస్మంచేసి సురలో కలిపి శుక్రాచార్యుడి చేత త్రాగించినా మృతసంజీవిని విద్య వల్ల తిరిగి బ్రతికించాడు. కశ్యపుడు తన మంత్రబలంతో, పాముకాటు చేత కాలిభస్మమైన మఱ్ఱిచెట్టును, బ్రాహ్మణుడినీ ఉపమన్యుడు దృష్టిని పొందాడు. విషాన్నాన్ని తిన్నా, పాములు కరిచినా భీముడు బ్రతికాడు. అశ్వినీదేవతలు జరాభారంతో బాధపడుతున్న చ్యవనునికి యౌవనాన్ని ప్రసాదించారు. పై సంఘటనలన్నీ ప్రాచీన భారతదేశంలో వైద్యశాస్త్రం ఎంత పురోగతిని సాధించిందో తెలియజేస్తున్నాయి.

మన ప్రాచీన భారతీయ సమాజం విద్యాపరంగా శూద్రుల పట్ల, స్త్రీల పట్ల విచక్షణ చూపించింది. వేదాదివిద్యాశాస్త్రాలు కొందరికే పరిమితం. కానీ ఆయుర్వేదం వంటి కొన్ని వైద్యవిద్యల్ని మిగిలిన వర్ణాలతోపాటు శూద్రులు కూడా నేర్చుకున్నారు. ఇది మంచి పరిణామం. వైద్యరంగం క్రీ.శ. 19వ శతాబ్దం తర్వాతనే అభివృద్ధి చేందిందనే భావన ఆధునికులమైన మనకు ఉన్నది. కానీ పై ప్రాచీన వైద్యవిధానాన్ని పరిశీలించి చూస్తే ఆనాడు వైద్యరంగం ఎంత సుసంపన్నంగా ఉందో మనకు తెలుస్తుంది.

2.1.3. వర్తకవిద్య:–

ప్రాచీనులు నేర్చుకున్న విద్యల్లో ప్రధానమైంది వర్తకం. ఇది వైశ్యవర్ణం వారికి ప్రధాన వృత్తివిద్యగా కనిపిస్తుంది. వేదాదివిద్యల్ని బోధించే గురువులే వైశ్యుల బిడ్డలకు వర్తకవాణిజ్యాల గురించి కూడా నేర్పేవారు.

గణితం, తూనికలు, రత్నపరీక్ష, నానాదేశభాషలు నేర్చుకోవడం మొదలైనవి నాటి వైశ్యవిద్యార్థులకు తప్పనిసరిగా బోధించే విద్యలు. వీటిని బోధించటానికి ప్రత్యేకమైన గురువులు కూడా ఉండేవారు.

క్రీ.శ. 14వ శతాబ్దం నాటికి తెలుగువారు వర్తకవాణిజ్యాల్లో మంచి అభివృద్ధిని సాధించారు. దేశవిదేశాలతో వ్యాపారం చేసేవారు. అవచితిప్పయ్యశెట్టి రెడ్డిరాజుల కాలంలో సుగంధద్రవ్యాలను విదేశాలకు ఎక్కువగా ఎగుమతి చేసేవాడు. దిగుమతుల్లో గుర్రాలు, చీనిచీనాంబరాలు, ముత్యాలు, పన్నీరు వంటి సుగంధద్రవ్యాలు ఇండేవి. ఈ వర్తకానికి సంబంధించిన గ్రంథాలు, శిక్షణాలయాలు ఆనాటి విద్యార్థులకు అందుబాటులో ఉండేవి. గణితసారసంగ్రహం, హయలక్షణవిలాసం వంటి శాస్త్రగ్రంథాలు ఈ కాలంలోనే రచించబడ్డాయి.

శ్రీనాథుడు హరవిలాసంలో ఆనాటి తెలుగువారు ఏయే వస్తువులను ప్రధానంగా దిగుమతి చేసుకునేవారో క్రిందివిధంగా వర్ణించాడు.

"పంజాబు కర్పూర పాదపంబులు తెచ్చె
జలనోగి బంగారు మొలకదెచ్చె
సింహళంబున గంధసింధూరంబులు తెచ్చె
హురముంజి బలుతేజి హరులుతెచ్చె
గోవసంశుద్ధ సంకుమద ద్రవముతెచ్చె
యాపగ నాణిముత్యాలు తెచ్చె
చోటంగా కస్తూరికాటంకముల తెచ్చె
చీనిచీనాంబర శ్రేణిదెచ్చె -----"[19]

పంజాబు దేశం నుండి కర్పం, జలనోగి నుండి బంగారం అవచితిప్పయ్యశెట్టి తెప్పించేవాడు. సింహళం నుండి గంధసింధూరాలు, గోవా నుండి సంకుమద ద్రవము, ఆణిముత్యాలు, చోటంగి నుండి కస్తూరికాటంకాలు, చీనిచీనాంబరాలు ఆంధ్రదేశానికి దిగుమతి అయ్యేవి. ఇవేకాకుండా ఆడవాళ్ళు కట్టుకునే చీని తవాయి, గోవా నుండి చందనం, కర్పూరం, కుంకుమ, కస్తూరికాద్రవ్యాలు మొదలైన వాటిని తెప్పించటంలో వైశ్యకులోత్తముడైన అవచితిప్పయ్యశెట్టి ప్రసిద్ధిగాంచాడు.

అవచితిప్పయ్యశెట్టి విదేశాలకు కూడా కొన్ని వస్తువుల్ని ఎగుమతి చేసినట్లు హరవిలాసంలోని అవతారికనుబట్టి తెలుస్తున్నది. 'పండువా, ఢిల్లి, రాఢాది పట్టణాల అధిపతులు శిరస్సున ధరించే రత్నాంకురాల్ని అవిచిత్రిపురాంతకుడు సింహళద్వీపానికి ఎగుమతి చేసేవాడు'[20]. దీన్నిబట్టి క్రీ.శ. 14,15 శతాబ్దాల కాలం నాటికి ఆంధ్రదేశం పొరుగుదేశాలతో వర్తకవాణిజ్యాలు జరిపినట్లు తెలుస్తున్నది.

తిప్పయ్యశెట్టి శ్రీనాథుడి బాలమిత్రుడు. అతడు ధనవంతుడే కాదు, మంచి సాహిత్యప్రియుడు కూడా. శ్రీనాథుడు రాసిన 'హరవిలాసం' అవచితిప్పయ్యశెట్టికే అంకితమివ్వబడింది.

2.1.4. వ్యవసాయ విద్య:-

అనాది నుండి మనిషికి ప్రధాన జీవనాధారంగా నిలిచిన వృత్తి వ్యవసాయం. ప్రాచీన మానవుడు మొదట వేట ద్వారా ఆహారాన్ని సంపాదించుకున్నాడు. తర్వాత పరిణతి చెంది పోడువ్యవసాయం చేస్తూ సంచారజీవనం సాగించడం ప్రారంభించాడు. క్రమంగా స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుని వ్యవసాయమే ప్రధానవృత్తిగా చేసుకుని నాగరికుడు అయ్యాడు.

ఈ వ్యవసాయవిద్యను ప్రాచీనకాలంలో పాఠశాలల్లో ప్రత్యేకంగా బోధించినట్లు కనిపించదు. పిల్లలు తమ తల్లిదండ్రుల నుండి వంశపారంపర్యంగా దీన్ని నేర్చుకునేవారు. తమ కుటుంబంలోని పెద్దలే గురువులు. వారి అనుభవసారమే తమ సంతానానికి అందేది.

అయితే కాకతీయుల కాలంలో నీతిగ్రంథాలే కాకుండా వ్యవసాయ సంబంధమైన గ్రంథాలు కూడా వచ్చాయి. "ఎలమంచిలి రాజైన మూడవఉపేంద్రుని ఆస్థానకవి వ్యవసాయశాస్త్రాన్ని పద్యాల్లో రాశాడు. దీనిలో వ్యవసాయదారునికి వర్షాలు పడడం, వాని ప్రాముఖ్యం తెలియజేశాడు. భూముల్లో రకాలు, వాటిసాగు, ఏయే ఋతువుల్లో ఏయే పంటలు వేస్తే ఎక్కువ ఫలసాయం వస్తుందో, వాటి పోషణ పద్ధతులేమిటో ఈ గ్రంథంలో వర్ణించబడింది"[21]. అయితే ఆ కవి పేరు ఏమిటో తెలియడం లేదు.

రెండవ ప్రతాపరుద్రుని కాలంవాడైన ఆరవ నరసింహుడు, వ్యవసాయం విస్తరించి పుష్కలంగా పంటలు పండటాన్ని వస్తువుగా తీసుకుని సంస్కృతంలో నిరోష్ఠ్యకావ్యం రాసాడు. 'దీని గురించి హనుమకొండ శాసనంలో ఉంది. ఇందులో, మణులతో నిండిన మేరుపర్వతపు సానువులను తలపింపజేస్తూ బంగారు రంగులీను శాలిపొలాలతో ఆంధ్రదేశం నిండి ఉందని చెప్పబడింది'[22]. దీన్నిబట్టి కాకతీయుల కాలంలో వ్యవసాయం మీద గ్రంథాలు వచ్చాయని, వ్యవసాయం లాభసాటిగా సాగడానికి నాటి ప్రజలు కృషిచేశారని తెలుస్తున్నది.

క్రీ.శ. 1323-1330లో ఫ్రయర్ జోర్డానెస్ 'వండర్స్ ఆఫ్ ది ఈస్ట్' అనే పుస్తకంలో తెలుగుదేశంలోని వ్యవసాయం, పంటల గురించి ఇలా వర్ణించాడు. 'త్రిల్లింగ్ రాజ్యంలో ధాన్యం, చక్కెర, మైనం, తేనె, నూనెలు, పప్పులు, గుడ్లు, గొర్రెలు, గేదెలు, పాలు, వెన్న, ఎనో రుచికరమైన పండ్లు, ఇండీస్ లో మరెక్కడా లేనంతగా ఉన్నాయి' అని చెప్పాడు. దీని గురించి 'కాకతీయ యుగ సాహిత్యంలో సంస్కృతి' అనే గ్రంథంలో రచయిత చాలా విపులంగా తెలియజేశారు.

ఈ సమాచారాన్నిబట్టి కాకతీయుల కాలంలో వ్యవసాయానికి మంచి ఆదరణ ఉందని, శాస్త్రకారులు దీనికి సంబంధించిన రచనలు కూడా చేశారని తెలుస్తున్నది. అయితే ఆ రచయితల గురించి ఇప్పుడు మనకు పూర్తి సమాచారం లభించడం లేదు.

2.1.5. పాముకాటు వైద్యం:–

బైచరాజు వేంకటనాథుని 'పంచతంత్రం'లో ఆనాడు పాముకాటుకు ఏవిధంగా వైద్యం చేసేవారో వర్ణించబడింది. 'పాము కాటువేసిన తావున కత్తితో కాటుపెట్టి రక్తము స్రవింపజేయటం, ఘటపూర్ణమంత్ర పుష్కరధారలెత్తించటం, పసరు నడినెత్తిన రుద్దించి బెత్తంతో నిట్టటుమోదటం, బింగిచుకొనిపోయిన దౌడలతో కర్రుజొనిపి మందులు పోసి మంత్రాలు చదివించటం అనేవి కొన్ని అవస్థలై ఉండెను'[23]. ఈ వివరణను బట్టి ఆనాటి ప్రజలకు పాముకాటు వైద్యం తెలిసినట్లు అనిపిస్తుంది. మనం ఈనాడు అంటున్న FIRST AID లాంటిదే పైన చేసిన పరిచర్య అంతా. అయితే నాటికి వైద్యవిద్య పూర్తిగా అభివృద్ధి దశలో లేదు. మరణాల సంఖ్య కూడా ఎక్కువే.

పాముకాటుకు గురైన చోట రక్తం కారకుండా కాటుపెట్టడం, విషం తల వరకు చేరకుండా తలమీద పసరు రుద్దడం, నోట్లో కర్రపెట్టి మందులుపోయడం ఇప్పటికీ పల్లెల్లో మనం గమనించవచ్చు. పాము విషం తల వరకు రాకుండా చేయడానికి కొందరు మంత్రతంత్రాలను నేర్చుకొని ఉండేవారు. ఏయే పాముకు ఏయే మూలికతో వైద్యం చేయాలో నాటి పల్లెప్రజలకు తెలుసు. దీని గురించి జానపదగ్రంథాల్లో చాలా విపులంగా చర్చించబడింది. జానపదుల వైద్యం మీద ప్రత్యేక పరిశోధనలు కూడా జరిగాయి. ఈ విద్యను గురువులు ఆశ్రమాల్లో విద్యార్థులకు బోధించేవారు. అలాగే కుటుంబంలోని పెద్దలు కూడా తమ పిల్లలకు జానపదవైద్యం గురించి తెలిపేవారు. మొత్తం మీద జానపదుల వైద్యవిద్య అనిబద్ధవిద్యగా కనిపిస్తుంది.

2.1.6. విషహారిణివిద్య:–

మహాభారతంలోని ఆదిపర్వంలో ఈ విషహారిణివిద్య ప్రస్తావన ఉన్నది. 'విషం నుండి విముక్తిని కలిగించి, తిరిగి బ్రతికించడమే' విషహారిణివిద్య లక్షణం. పాముకాటు నుండి రక్షించేది విషహారిణి విద్య. ఇది ఒక శాస్త్రంగా ఆనాడు అభివృద్ధి చెందింది. దీన్ని కొందరు ప్రత్యేకంగా నేర్చుకునేవారు. వారిలో 'కశ్యపుడు' మహాభారతకాలంలో నాటికి పేరుగాంచిన విషహారిణివైద్యుడు.

శృంగి శాపం వల్ల పరీక్షితుడు తక్షకుడి కాటుతో మరణించవలసి ఉంది. పాముకాటుకు భయపడి పరీక్షితుడు సాగరమధ్యంలో ఒంటిస్తంభపు మేడలో నివసిస్తున్నాడు. అతణ్ణి కాటువేయడానికి తక్షకుడు

బయలుదేరాడు. అదే సమయంలో 'కశ్యపుడు' అనే విషహారిణివిద్య తెలిసిన వైద్యుడు పరీక్షిత్తుని రక్షించడానికి అడవిలో వస్తూంటాడు. తక్షకుడు అతడికి ఎదురుపడి, వెనక్కు వెళ్ళిపొమ్మని కోరుతాడు. ముని కుమారుని శాపం తప్పదని, పరీక్షిత్తు తనకాటుకు గురికాక తప్పదని అంటాడు. తన శక్తి ఎలాంటిదో చూపించటానికి ఆ అడవిలో ఉన్న పెద్ద మర్రిచెట్టును తన కాటుతో భస్మం చేశాడు.

అప్పుడు కశ్యపుడు కాలిన చెట్టు బూడిదను పోగుచేసి తన మంత్రతంత్రాల బలంచేత పూర్వంలాగ చెట్టుగా చేయగా, తక్షకుడు ఆశ్చర్యపడ్డాడు. కశ్యపుడితో ఇలా అంటాడు. 'ఓ మునిశ్రేష్ఠా! నీ విద్య యొక్క శక్తి చేత ఈ చెట్టు చక్కగా బ్రతికినప్పటికీ, మిక్కిలి కోపించిన బ్రాహ్మణుడైన శృంగి శాపానికి తిరుగులేదు, పరీక్షిత్తు బ్రతకజాలడు. అతడిచ్చే సొమ్ముకంటే నేను నీకు ఎక్కువ సొమ్మును ఇస్తాను. తీసుకొని వెళ్ళిపొమ్ము' అంటాడు. కశ్యపుడు మారుపలుకకుండా ఆ ధనం తీసుకొని వెళ్ళిపోతాడు. ఈ కథ వల్ల ప్రాచీనకాలంలో విషహారిణివిద్య చాలా ప్రసిద్ధిపొంది ఉండేదని, ధనాశాపరులైన వైద్యులు కూడా ఉండేవారని తెలుస్తున్నది.

2.1.7. వాస్తువిద్య:-

ప్రాచీనులు నేర్చుకున్న విద్యల్లో ఈ వాస్తువిద్య ప్రసిద్ధి చెందిననిద్య. యజ్ఞవేదిక నిర్మాణం ఎలా ఉండాలో, గృహనిర్మాణం ఎలా చేయాలో వాస్తువిద్య తెలియజేస్తుంది. ఇది వేదకాలంనాటి విద్య. నాటి అధ్యయన, అధ్యాపనల్లో ఈ విద్య తప్పనిసరిగా ఉండేది.

మహాభారతంలో, సర్పయాగం సందర్భంలో ఈ వాస్తువిద్య ప్రస్తావన ఉన్నది. జనమేజయ మహారాజు, కాశీరాజు కూతురైన 'వపుష్టమ' అనే మహారాణి ధర్మపత్నిగా సర్పయాగం చేయటానికి దీక్షవహించి, శాస్త్రంలో చెప్పబడిన కొలతలతో, క్షణాల్లో నేర్పరులైన శిల్పశ్రేష్ఠుల చేత ఒక యజ్ఞగృహాన్ని నిర్మింపజేశాడు. అది యజ్ఞానికి కావలసిన చాలా రకాల సాధనాలతో, వస్తువుల సముదాయంతో, అధికమైన ధనంతో, ధాన్యంతో, విప్రుల సమూహంతో కూడివున్నది. ఆ సమయంలో యజ్ఞగృహంలో ఉన్న జనమేజయుడితో గృహనిర్మాణశాస్త్రంలో నేర్పరి అయిన పురాణజ్ఞుడు ఇలా అంటాడు. "పుణ్యాత్ముడవైన జనమేజయా! నీవు చేయబోయే యీ యజ్ఞం ఋత్విక్కులు శాస్త్రోక్తంగా చేసే క్రియాకలాపం చేత సమగ్రమైనప్పటికిన్నీ చివరిదాకా సాగదు. ఒక బ్రాహ్మణోత్తముని కారణంగా మధ్యలోనే ఆగిపోతుంది"[24]. దీనికి కారణం యజ్ఞవేదిక నిర్మాణంలో జరిగిన స్వల్పదోషమే.

ఈ కథనుబట్టి ఆనాడు వాస్తుశాస్త్రజ్ఞులు గొప్ప పాండిత్యాన్ని సంపాదించారని, స్వల్పదోషాలను కూడా గుర్తించి ఫలితాను చెప్పగలిగిన సామర్థ్యం వారికి ఉండేదని తెలుస్తుంది. ఈ విద్యను నాడు బ్రాహ్మణ,

క్షత్రియ, వైశ్యులు నేర్చుకున్నట్లు కనిపిస్తుంది. ఇది నిబద్ధవిద్య. పై మూడు వర్ణాల వారు ఆనాడు తప్పకుండా నేర్చుకోవలసిన విద్య.

2.1.8. రసవాదవిద్య:–

ఇనుమును బంగారంగా మార్చడమే రసవాదం. ఇది చాలా ప్రాచీనమైన విద్య. ఆచార్య నాగార్జునుడు ఈ రంగంలో ప్రాచీనప్రసిద్ధవ్యక్తిగా కనిపిస్తున్నాడు. "నాగార్జునుడు (సిద్ధ) స్వహస్తాక్షరాలతో వ్రాసిన 'రసతంత్రం' అనే గ్రంథం, కర్ణాటకలోని తుముకూరు జిల్లా, మధుగిహరి అనే గ్రామంలో దొరికినదని ఈ మధ్య కొన్ని పత్రికలు ప్రకటించిన వి. దీని మీద పరిశోధన ఇంకా జరుగలేదు"[25] అని మరుపూరు కోదండరామిరెడ్డి గారు తెలిపారు.

పై వివరణనుబట్టి నాగార్జునుడి కాలానికి రసవాదం అభివృద్ధి చేందిన విద్య అని తెలుస్తుంది. దీన్ని సన్న్యాసులు ఎక్కువగా నేర్చుకున్నారు. వేమన కూడా రసవాదవిద్య నేర్చుకున్నట్లు, దానికి సంబంధించిన జ్ఞానం ఆయనకి తెలిసినట్లు వేమన పద్యాల్లో ప్రస్ఫుటమవుతుంది.

నన్నెచోడుడి 'కుమారసంభవం'లో ఈ రసవాదవిద్య ప్రసక్తి ఉన్నది.

"ఇనుము రసంబులో నుడుగ కెప్పుడు నూనినఁగాని కాదె కాం
చన? మమరాద్రి వాయసము సంతతమున్ వసియించికాని యే
కనకము చాయగాదు చిరకాలసుసేవనఁగాని కాదె స
న్మనమున నిన్ దలంచు డొక మాత్రయ చాలదె ముక్తి కీశ్వరా?"[26]

ఓ ఈశ్వరా! ఇనుము, పాదరసంలో మానక ఎప్పుడూ ఉంటేనే కాని బంగారం కాదా?, కాకి బంగారుకొండపై ఎల్లప్పుడూ ఉంటేనేకాని బంగారు కాంతిని పొందదా? అట్లే నిన్ను చిరకాలం సేవిస్తేనే కాని మోక్షం లభించదా? అని భావం. దీన్నిబట్టి నన్నెచోడుడి కాలానికే ఈ రసవాదవిద్య చాలా ప్రసిద్ధిలో ఉండేదని తెలుస్తున్నది.

వేమన పద్యాల్లో రసవాదానికి సంబంధించిన పోకడలను మనం గమనించవచ్చు.

"హేమ కార విద్య నెరిగిన వారెల్ల
వెతల బడనియట్లు, విద్య చేత
తత్త్వ మెరుగు వెనుక తనకు చింతేలరా
విశ్వదాభిరామ వినురవేమ"[27]

హేమకారవిద్య (ఇనుమును బంగారంగా మార్చడం) తెలిసిన వారికి బాధలు, ఇబ్బందులు ఉండని విధంగా, విద్యచేత (ఆత్మజ్ఞానం) వాస్తవాన్ని తెలుసుకున్న వాడికి ఏ చింతలూ ఉండవు. అతడు భౌతికమైన కోరికలను వదిలివేస్తాడు అని వేమన సూచన.

శ్రీనాథుడి 'శృంగారనైషధములో' ఈ రసవాదవిద్య ప్రస్తావన ఉన్నది. చంద్రోద వర్ణన సందర్భంలో శ్రీనాథుడు క్రింది వర్ణన చేశాడు.

"శుద్ధకాంచన పిండంబు సూర్యుఁదిగిచి
పూర్ణశశి పూఁత బంగారు బూదెనొసఁగి
సాయ మను ధూర్తు – వంచించె జగమునెల్లఁ
దెల్లఁబాఱెడు నదె చూడు తెఱవ! విధుఁడు"[28]

సాయంకాలమనే మోసగాడు (ధూర్తు) పరిశుద్ధమైన బంగారపు ముద్ద (పిండంబు) అయిన సూర్యుణ్ణి తటాలున లాగుకొని, నిండు చంద్రుడనే, పూతబంగారు పూసను – అంటే బంగారు పూత పూసిన పూసను ఇచ్చి లోకాన్ని మోసం చేశాడు. చెలియా! కావాలంటే అదిగో చూడు. చంద్రుడు తెల్లబడుతున్నాడు అని భావం.

ఈ వర్ణనను బట్టి లోహాలను బంగారంగా మార్చడం, పూసలకు బంగారు తొడుగు అతికించడం శ్రీనాథుడి కాలానికే లోకంలో ప్రసిద్ధమైనట్లు తెలుస్తున్నది. ఈ బంగారుపూత కొంతకాలానికి చెదిరిపోగా, ఆ లోహాల అసలు రంగు బయటపడుతుంది. దాన్నే కవి ఇందులో, 'చంద్రుడు (లోహం) తెల్లబడటం' అన్న ఉపమానం ద్వారా తెలియజేశాడు. శ్రీనాథుడి కాలంలో అవిచితిప్పయ్యశెట్టి వంటి వ్యాపారులు విదేశాలకు పూసలను, సుగంధద్రవ్యాలను ఎగుమతి చేసేవారు. ఇతర దేశాల నుండి కొన్ని వస్తువులను దిగుమతి చేసేవారు. ఈ లావాదేవీల్లో లోహాలకు బంగారుపూతపోసి, వాటినే అసలు బంగారంగా నమ్మించి ప్రజలకు విక్రయించినట్లు, కొంతకాలానికి ఆ పూత పోగా, అసలు లోహాలు బయటపడేవని పై వర్ణన ద్వారా మనం తెలుసుకోవచ్చు. నేటికీ ఇత్తడికి బంగారురంగు పూసి ఆభరణాలుగా అమ్మే వ్యాపారులను మనం చూస్తూనే ఉన్నాం.

'పార్వతీపరిణయం' అనే కావ్యంలో కూడా ఈ 'రసవాదవిద్య' ప్రస్తావన ఉంది. చంద్రోదయాన్ని రసవాదానికి అన్వయిస్తూ కవి క్రింది వర్ణన చేశాడు.

"ఉదయోర్వీధరవన్యధైనవకరీ షోఘుంబునుం గూర్చి యం
దుదినాంతంబను నిద్ధవర్యుఁడు నిజ ద్యోతాగ్ని రాఁజించి, వె

చ్చఁదగన్సీసపు బిళ్ళ వెండిగఁ గొనన్ చా దొక్క మందాకు చే
నదనం బిండుచు, నెత్తి మీటుగతి సారంగాంకుఁ డొప్పెన్ వడిన్"[29]

సీసపు బిళ్ళను కాల్చి, కరిగించి ఏవో ఆకుపసరులు పోసి దాన్ని వెండిబిళ్ళగా మార్చి సొంతం చేసుకోవాలి అని ఒక ఉత్తమోత్తముడు భావించాడట. ఆయన ఎవరంటే సాయంకాలం అనే ఇద్దవర్యుడు. అలా భావించి, ముందుగా ఉదయపర్వతం మీద ఉన్న అడవిలోని ఆవుపేడ పిడకలను ఏరి తెచ్చి కుప్పగా పేర్చాడు. అందులో తన ప్రకాశము అనే అగ్నిని – అంటే సాయంకాలపు కాంతి అనే నిప్పును వేసి రాజేశాడు. అందులో సీసపు బిళ్ళను వెచ్చేశాడు. బాగా కాల్చాడు. అదను అయినప్పుడల్లా దాని మీదకి ఒకానొక ఓషధి ఆకు నలిపి నలిపి నల్లని రసం పిండుతున్నాడు. చివరికి అది వెండి బిళ్ళలాగా మారింది. ఇప్పుడు దాన్ని కొలిమి నుండి పైకి ఎత్తి దులుపుతున్నాడు. బూడిద పోయే లాగా చేస్తున్నాడు. అదిగో అలా ఎత్తి పట్టుకున్న వెండి (సీసం) బిళ్ళలాగా ఉన్నాడట చంద్రుడు. బింబం మధ్యలో నల్లని లేడి గుర్తు – గడ్డగట్టిన ఆకుపసరు.

పై విధంగా లోహాన్ని ఏవిధంగా మరొక లోహంగా మార్చవచ్చో ప్రాచీనకావ్యాల్లో విపులంగా వర్ణించబడింది. వేమన పద్యాల్లోని కొన్ని పదాలు కూడా నర్మగర్భంగా ఈ రసవాదవిద్యను తెలియజేస్తున్నాయని శ్రీమరువూరు కోదండరామిరెడ్డిగారు "లోకకవివేమన" అనే గ్రంథంలో వివరించారు.

2.1.9. బొమ్మల తయారీ విద్య:–

ప్రాచీనకాలం నాటి వృత్తివిద్యల్లో బొమ్మలతయారీ కూడా ఒకటి. ఇది అనిబద్ధవిద్య. ఎవరి ఇంట్లో వారే బొమ్మలను తయారుచేసి అమ్మేవారు. పిల్లలు తల్లిదండ్రుల వద్ద ఈ విద్యలో శిక్షణ పొందేవారు. మట్టితోను, కొయ్యతోను, దంతాలతోనూ, గవ్వలతోనూ నాడు బొమ్మలు తయారుచేసేవారు. ఇవి విదేశాలకు కూడా ఎగుమతి చేయబడేవి. కాకతీయుల కాలంలో 'నిర్మల్' బొమ్మల తయారీకి ప్రసిద్ధిచెందింది.

నన్నెచోడుడి 'కుమారసంభవం'లో బొమ్మలతయారీ గురించి ఉన్నది. పిల్లలు ఆటవస్తువులుగా వీటిని ఉపయోగించినట్లు కవి వర్ణించాడు.

"తరుణులు చిల్క బొమ్మలను దంతపుబొమ్మలు మేలిగాజు బ
న్నరులును మ్రాని చొప్పికలు నల్గడ నోలిన పేర్చి లీల చే
కుర బొమర్లా జేయనగు కూళ్ళను వండుచు బొమ్మపెండ్లిమా
సరముగ జేసి యాడ నగజాత శివార్చన సేయు నయ్యెడన్"[30]

పార్వతీదేవి చెలికత్తెలు చిలుకల బొమ్మలను, దంతపు బొమ్మలను మేలి గాజుపూసలు గ్రుచ్చిన హారములను, కొయ్య బొమ్మలను నాలుగు వైపుల అందంగా అమర్చి బొమ్మరిండ్లలో చేసేటువంటి కూడులు వండుచు బొమ్మల పెండ్లిండ్లు విశేషంగా చేస్తూవుండగా, పార్వతీదేవి మాత్రము ఆ సమయంలో శివపూజ చేసేది అని అర్థం. దీన్నిబట్టి 12వ శతాబ్దానికి ఆంధ్రదేశంలో బొమ్మలతయారీ పరిశ్రమ, గాజుల తయారీపరిశ్రమ ఉండేవని తెలుస్తున్నది. ఈ వృత్తివిద్యను పిల్లలు ఇంట్లోని పెద్దల్ని చూసి నేర్చుకునేవారు. ఇది నాడు లాభసాటి వృత్తిగా ఉన్నట్లు తెలుస్తున్నది. వీటిల్లో రాతితో తయారు చేసిన బొమ్మలు, మట్టితో చేసిన బొమ్మలు, తోలుతో చేసిన బొమ్మలు, దంతపు బొమ్మలు, పింగాణిబొమ్మలు వంటి రకాలున్నాయి.

క్రీ.శ. 14వ శతాబ్దం నాటికి లక్కబొమ్మలను తయారుచేయడం విరివిగా ఉండేది. అంతేగాక బొమ్మలను అచ్చుల ద్వారా తయారుచేసే విద్య ఈ కాలానికి ప్రజలు నేర్చుకున్నారు. నాచన సోమనాథుడి 'ఉత్తరహరివంశం'లోని క్రింది పద్యం ఈ విశేషాల్నే తెలియజేస్తుంది.

"తోరపుఁజన్నుదోయి పయిఁ దొంగలిఱెప్పలు దాఁచి, చూపు నీ
హారములోని క్రొమ్మెఱుఁగు లై నిలువం గొలు వల్లఁ జొచ్చి, య
చ్చేరువకంబముం గదిసి చిత్తురువో కరువో యనంగ గం
డారపు బొమ్మవోలె నచటం గద లించుక లేక యుండగన్"[31]

నరకుని ఆస్థానంలోకి తీసుకురాబడిన ఊర్వశి తలవంచుకొని, విచారంతో ఒక స్తంభానికి దగ్గరగా నిలబడింది. ఆమె చిత్తరువు బొమ్మ అవునో? లేక పోఁత పోసిన బొమ్మ అవునో? లేక అచ్చొత్తి తీసిన బొమ్మ అవునో? అని సభలోని వారికి భ్రాంతి కలిగిందట. దీన్నిబట్టి నాటికే బొమ్మలతయారీ పరిశ్రమ అభివృద్ధి దశలో ఉన్నట్లు, రకరకాల పద్ధతుల్లో బొమ్మలను తయారు చేసినట్లు తెలుస్తున్నది.

2.1.10. రాజనీతివిద్య:-

ప్రాచీన తెలుగు కావ్యాల్లో రాజనీతిని గురించి చాలా సందర్భాల్లో ప్రస్తావించబడింది. రామాయణం, మహాభారతంలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ప్రాచీన తెలుగు కావ్యాలన్నీ దాదాపు రాచరిక వ్యవస్థలోనే వెలువడ్డాయి కాబట్టి నాటి కావ్యాల్లో ఎక్కువగా రాజనీతివిద్యకు సంబంధించిన అంశాలు ప్రతిఫలించాయి.

ప్రాచీనయుగంలో రాజకుమారులు తప్పకుండా నేర్చుకోదగిన విద్యల్లో రాజనీతివిద్య మొదటిది. ఇది నిబద్ధవిద్య. దీన్ని అన్ని ఆశ్రమాల్లోని గురువులు విద్యార్థులకు బోధించేవారు. రాజకుమారులు కూడా ఆశ్రమాలకు వచ్చి గురువుల వద్ద శిక్షణ పొందేవారు.

కౌటిల్యుడు రాసిన 'అర్థశాస్త్రం' ప్రాచీనకాలపు రాజనీతి శాస్త్రానికి నిలువెత్తు నిదర్శనం. ఇది ఆనాటి రాచరిక వ్యవస్థను సమగ్రంగా వ్యాఖ్యానించిన గ్రంథం.

మహాభారతకాలం నాటి రాజనీతివిద్య గురించి శ్రీమతి ద్వివేది కృష్ణగాయత్రి గారు "వ్యాసుడు – తిక్కన – మహాభారత రాజనీతి దర్శనం" అనే సిద్ధాంత గ్రంథాన్ని రాసారు. ఇందులో వారు ప్రాచీనరాజనీతిశాస్త్రాన్ని గురించి చాలా విపులంగా చర్చించారు. భారతేతర కావ్యాల్లోనూ రాజనీతి ప్రస్తావన ఉన్నది.

ప్రాచీన ధర్మశాస్త్రాల్లో 'రాజనీతి'కి, 'దండనీతి' అనే పదాన్ని పర్యాయంగా వాడినట్లు కనిపిస్తుంది. రాజనీతి అంటే రాజు అనుసరించవలసిన నీతి లేదా రాజ్యం స్వరూప స్వభావాలను, పాలనా విధానాలను తెలియజేసేది అని అర్థం. వేదాలు, శుక్రనీతిసారం, మహాభారతం, కౌటిల్యుని అర్థశాస్త్రం, ఆశ్వలాయన గృహ్యసూత్రాలు, ఆపస్తంభధర్మసూత్రాలు, విష్ణుస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి మొదలైన గ్రంథాలన్నీ రాజనీతిని గురించి వివరిస్తున్నాయి. అంతేగాక శుక్రుడు, కామందకుడు రాసిన గ్రంథాలు 'నీతిసారాలు'గా పిలువబడ్డాయి. 'పంచతంత్రం'లో దండనీతికి 'న్యాయశాస్త్రమ'నే పేరు ఉన్నది. ఛందేశ్వరుని 'రాజనీతిరత్నాకరం', లక్ష్మీధరపండితుని 'కల్పతరు', 'కామధేను' అనే గ్రంథాలు రాజనీతిని బోధిస్తున్నాయి. వైరిమిత్రాధ్యాయం, సరస్వతీవిలాసం, మానసోల్లాసం వంటి సంస్కృత గ్రంథాలు కూడా ప్రాచీన రాజనీతికి నిలువెత్తు నిదర్శనాలుగా ఉన్నాయి. పైన చెప్పిన గ్రంథాల్లోనూ, ప్రాచీన తెలుగు కావ్యాల్లోనూ రాజనీతికి సంబంధించిన క్రింది అంశాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి.

రాజు – విద్యార్హతలు:–

రాజ్యాధికారం పొందగోరే క్షత్రియుడు విద్యాసంపన్నుడు కావాలి. రాజు ఆన్వీక్షకీ త్రయీ వార్తా దండనీతులను అభ్యసించాలని మనవు ఇలా చెప్పాడు.

"త్రైవిద్యేఽభ్యస్త్రయీం విద్యాం దండనీతిం చ శాశ్వతీం
ఆన్వీక్షకీం చాత్మవిద్యాం వార్తారంభాంశ్చలోకతః"[32]

శుచిమంతుడు, సత్యాన్ని తప్పనివాడు, శాస్త్రజ్ఞానం కలవాడు, మిత్రుల సాహాయ్యం పొందగలిగినవాడు, ధీమంతుడు దండనీతి (రాజనీతి)ని పొందగలడు. ద్రోణాచార్యుడు అర్జునుడికి క్రింది విద్యలను నేర్పినట్లు మహాభారతంలో కనిపిస్తుంది. "ద్వంద్వ సంకీర్ణ యుద్ధముల తెఱఁగు రథమహీ వాజివారణములపై నుండి దృఢ చిత్త సౌష్ఠవ స్థితుల నేయ బహువిధ వ్యూహ భేదనోపాయములను, సంప్రయోగ రహస్యాతిశయముగాఁగఁ గఱపె నర్జునుఁడొంటి భార్గవుడు వింటి నిట్టిఁడేయని పొగడంగనెల్ల

జనులు"[33]. ఇవి ఆనాడు రాజకుమారులు ప్రధానంగా నేర్చుకున్న విద్యలు. ధర్మరాజు 'తోమర' ప్రయోగంలో, అర్జునుడు ధనుర్విద్యలో, భీమ, దుర్యోధన, బలరామ, శల్యలు గదాయుద్ధంలో, నకులసహదేవులు ఖడ్గచాలనంలో మంచి పాండిత్యాన్ని సంపాదించారు. అభిమన్యుడు అర్జునుడిని మించిన వీరుడిగా యుద్ధవిద్యల్ని ప్రదర్శించాడు.

రాజు యుద్ధవిద్యలు, శాస్త్రవిద్యలతో పాటు నైతిక విలువల్ని కలిగివుండాలి. ధర్మజ్ఞానం కలవాడు, ఓర్పు, ఇంద్రియనిగ్రహం కలవాడు అయివుండాలి. మహాభారతంలో ఉత్తముడైన రాజుకు ఉండవలసిన లక్షణాలను శల్యుడు, ధర్మరాజుకు వివరించాడు[34].

రాజు – రాజధర్మం:–

రాజు దండనీతిని ప్రయోగించి రాజ్యరక్షణ చేయాలి. రాజు లేని రాజ్యంలో అన్యోన్యకలహాలు, ధనాపహరణం, స్త్రీలను వేధించటం ఎక్కువ అవుతాయి. చిన్నచేపను పెద్దచేప మ్రింగినట్లు బలవంతులు బలహీనులను పీడిస్తారు. వ్యవసాయం, వ్యాపారం దెబ్బతింటాయి. రాజు దండనీతి సహాయంతో లోకంలో ధర్మాన్ని నిలబెట్టవలసి ఉంది. రాజధర్మం యొక్క గొప్పదానాన్ని చెపుతూ ధర్మరాజు భీష్మునితో ఇలా అంటాడు.

"అరయగ రాజధర్మము సమాశ్రయమై నడుపుం ద్రివర్గమున్
గురుతర మోక్ష ధర్మమునకుం దలఁపం దనప్రాపయూఁత భూ
వర విను ఘోటకంబునకు వాగెయు, దంతికి నంకుశంబునే
కరణి నివారకుంబులు జగంబుల కట్టల తాను నెమ్మెయిన్"[35]

కాబట్టి రాజధర్మం చాలా అవసరమైంది. రాజు లేని రాజ్యంలోని ప్రజలు, నీరు ఇంకిపోయిన మడుగులోని జలచరాల లాగా నానాపాట్లు పడవలసి ఉంటుంది.

రాజు – ఆచరణ:–

రాజు ప్రతిరోజూ ఎటువంటి పనులు చేయాలో, అతని ప్రవర్తన ఎలా ఉండాలో, ఆముక్తమాల్యదలోని యామునాచార్య కథలో చెప్పబడింది. యామునాచార్యుడు తన కుమారుడికి రాజ్యాన్ని అప్పగిస్తూ అతనికి ఇలా రాజనీతిని బోధిస్తాడు.

"సౌఖశాయనిక భిషక్పూర్వకము కల్య / వేళ గార్తాంతిక ద్విజులగోష్ఠి;
జాము వోవ నమాత్య సామంత పూర్వకం / బర్థార్జనస్థ కాయస్థ గోష్ఠి;
దిన మధ్యమున మర్దనమల్ల పూర్వకం / బగు సూద సూప కృన్మృగయుగోష్ఠి;

యపరాహ్ణమున దేవతార్చనా పూర్వకం / బార్య ధర్మాది కృద్యతుల గోష్ఠి;"
భుక్తి మీద విదూషక పూర్వకము పు
రాణ కవి గోష్ఠి, చార పూర్వకము సంజ
జాము గాయక గోష్ఠి, నిశన్ సుషుప్తి
పూర్వకము ప్రేయసీ గోష్ఠి పొసగుఁ బతికి."[36]

ఇందులో రాజు, ప్రతిరోజూ ఏయే పనులు ఎప్పుడు చేయాలో కృష్ణదేవరాయలు సూచించారు. ఆయన స్వయంగా మహారాజు కాబట్టి, తన అనుభవసారాన్ని అంతా రాయలు ఇందులో పొందుపరిచారు.

రాజు లేవగానే ప్రాతఃకాల కృత్యానంతరం నాటి గ్రహ శుభాశుభాలు చెప్పే పండితులతో సమావేశమై కార్యాకార్యాలు తెలుసుకోవాలి. తర్వాత సౌఖశాయనికులు, వైద్యులతో గోష్ఠిచేయాలి. ఒక జాము తర్వాత మంత్రులు, సామంతులతో సమావేశం కంటే ముందుగా ఆదాయ సముపార్జన అధికారులతో గోష్ఠి చేయాలి. మధ్యాహ్నం శరీరం పట్టేవారు, జెట్టీలకు ముందు, వంటవాళ్ళు, పప్పు వండేవారు, వేటగాళ్ళతో గోష్ఠిచేయాలి. ప్రొద్దు తిరిగాక దేవతార్చన కంటె ముందుగా పూజ్యులైన ధర్మాధికారులు, సన్న్యాసులతో సమావేశం కావాలి. భోజనం తర్వాత విదూషకులతో గోష్ఠి చేయాలి. దాని కంటె ముందుగా పురాణాలు వినిపించే కవులతో సమావేశం కావాలి. రాత్రిపూట నిద్రకంటె ముందు భార్యతో గోష్ఠి చేయాలి. ఇవన్నీ పాటించిన రాజు జీవితంలో ఉన్నతుడిగా ఎదుగుతాడు. ఈ రాజనీతి శాస్త్రాన్ని రాజకుమారులు బాల్యంలోనే నేర్చుకోవడం వల్ల ఆదర్శవంతులైన చక్రవర్తులుగా తయారవుతారు. భరతుడు ఇందుకు మంచి ఉదాహరణ. కణ్వాశ్రమ సంస్కృతి వల్ల అతడు ఉన్నతమైన విలువలతో జీవించాడు. వంశకర్తగా చరిత్రలో నిలిచిపోయాడు.

రాజు – వర్ణాశ్రమ ధర్మరక్షణ:–

రామాయణభారతాది ఇతిహాసాల్లో మనిషి వర్ణాశ్రమధర్మాన్ని పాటించి జీవన్ముక్తిని పొందాలని సూచన ఉంది. మానవుడు జీవితంలో నాలుగు ఆశ్రమ ధర్మాలను పాటించవలసి ఉంటుంది. అవి – బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం. రాజులకు ఇవి తప్పనిసరిగా పాటించవలసిన నియమాలు. బ్రహ్మచర్యంలో అధ్యయనమే ప్రధాన ధర్మం. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత వివాహం చేసుకుని గృహస్థుడు కావాలి. సంతానాన్ని పొంది, వారిని పెద్దవారినిచేసి విద్యాబుద్ధులు చెప్పించాలి. వార్ధక్యంలో వానప్రస్థానికి వెళ్ళాలి. క్రమంగా భవబంధాల నుండి వైదొలుగుతూ సన్న్యాసిగా మారాలి. ఇవి వర్ణాశ్రమ ధర్మాలు. వీటిని పరిరక్షించడం రాజు ముఖ్య విధి.

అయితే ఒక్కొక్క వర్ణం వారికి ఒక్కొక్క ధర్మం ప్రధానంగా చెప్పబడింది. 'బ్రాహ్మణులకు దయ ప్రధానధర్మం. అధ్యయనం, అధ్యాపనం, దానం వారు చేయవలసిన ముఖ్యమైనవి. విద్యనేర్చినవాడే విప్రుడు. ఈ విప్రుడు దయకలిగినవాడై, ప్రశాంత జీవనం సాగించవలసి ఉంది. అతడు ధర్మబద్ధంగా జీవించాలి.

ప్రజలను రక్షించడం క్షత్రియుడి ధర్మం. యజనం, దానం, అధ్యయనం, దస్యుహింస, ప్రజల అనురాగం పొందేటట్లు పాలన చేయడం, విజయేచ్ఛతో యుద్ధంచేయడం క్షత్రియుల ధర్మం.

వైశ్యులకు దానం, యజ్ఞం, వ్యాపారం, వర్తకం, వ్యవసాయం ముఖ్యమైన ధర్మాలు. వైశ్యుడు ధర్మబద్ధంగా ధనాన్ని సంపాదించాలి.

శూద్రుడు పై మూడు వర్ణాలవారికి సేవ చేయాలి. వ్యవసాయం చేస్తూ ధర్మబద్ధంగా ధనాన్ని ఆర్జించాలి. ఈ విధంగా ప్రాచీన కావ్యాల్లో చెప్పిన వర్ణాశ్రమ ధర్మాలను కాపాడటమే రాజు ముఖ్యమైన విధి'.[37]

రాజు – మంత్రాంగరక్షణ:–

రాజు మంత్రుల ద్వారా రాజ్యపాలన చేస్తాడు. మంత్రులు నీతిపరులైనప్పుడు ఆ పరిపాలన ఆనందదాయకం అవుతుంది. వారు అవినీతిపరులైనప్పుడు ప్రజలకు ప్రభుత్వం మీద విశ్వాసం పోయి, తిరుగుబాటుదారులు తయారవుతారు.

రాజు మంత్రంగాన్ని ఎలా రక్షించాలో, పర్యవేక్షించాలో క్రిందివిధంగా చెప్పబడింది. 'రాజు జాగరూకుడై రాజ్యాంగాలను, మంత్రాంగాన్ని రక్షించాలి. శరత్కాలపు నెమలి వలె పురివిప్పక మంత్రాన్ని రక్షించాలి. స్వల్పంగా మాట్లాడుతూ పండితుడైరాజు శ్రీమంతుడౌతాడు. ఆపదలు తెచ్చే కొండదారుల పట్ల జాగరూకుడై ఉంటూ విద్వాంసుల సాహాయ్యం పొందాలి. శత్రువుల తప్పులను పెద్దవి చేసి చూపుతూ బలవంతులైన శత్రువులను నాశనం చేయడానికి ప్రయత్నిస్తూ ఉండాలి. రాజు ఆత్మరక్షాపరుడై, కవచధారుడై అంగరక్షక పరివేష్టితుడై ఉండాలి. ఆత్మవిశ్వాసమే రాజుకు ధనాగారం'[38]. పై ధర్మాలను ఆచరించిన రాజు మంచి ప్రజాపరిపాలకుడు అవుతాడు.

రాజు – చతుర్విధోపాయాలు :–

ప్రధానంగా నాలుగు రకాల ఉపాయాలను ధర్మశాస్త్రాలు చెపుతున్నవి. అవి:– 1. సామోపాయం, 2. దానోపాయం, 3. భేదోపాయం, 4. దండోపాయం. అయితే ఈ సంఖ్యలో కొంతతేడా ఉందని ద్వివేది కృష్ణగాయత్రిగారు తమ సిద్ధాంతగ్రంథంలో క్రింది విషయాలను తెలియజేశారు. "శాస్త్రాలలో ఉపాయాలు

నాలుగని ప్రధానంగా చెప్పబడినప్పటికీ వీటి సంఖ్యపై భిన్నాభిప్రాయాలున్నాయి. మత్స్యపురాణం, అగ్నిపురాణం, బార్హస్పత్య నీతిసూత్రాలు, విష్ణుధర్మోత్తర పురాణాలలో మరో మూడు కలిపి ఉపాయాలు ఏడు అని వనపర్వంలో 5 ఉపాయాలు అని చెప్పబడింది. అవి ఉపేక్ష, మాయ, ఇంద్రజాలం. 'సరస్వతీవిలాసము'నే గ్రంథంలో ఉపేక్షకు బదులు 'అక్ష' అనే ఉపాయం చెప్పబడింది."[39]. సాధారణ ప్రజలు కూడా 'మాయోపాయం' అనే మాటను వాడటం ఇప్పటికీ మనం గనించవచ్చు. ఈ భిన్నమైన ఉపాయాలను ప్రయోగించి రాజు ప్రజలను కాపాడాలి. రాజ్యంలో శాంతిభద్రతలను పరిరక్షించాలి. పై ఉపాయాలన్నీ పనిచేయనప్పుడు రాజు చివరి ప్రయత్నంగా దండోపాయాన్ని స్వీకరించాలి.

రాజు – యజ్ఞయాగాలు :– రాజు రాజ్యంలో స్థిరమైనపాలన ఏర్పాటుచేసి తర్వాత యజ్ఞయాగాల నిర్వహణ చేపట్టాలి. దానధర్మాలు చేయాలి. యజ్ఞనిర్వహణ ప్రాచీనకాలంలో రాజులకు ముఖ్యమైన విధి. షోడశ మహారాజుల చరిత్రలో ఆయా రాజులు ఆచరించిన యజ్ఞాలన్నీ వివరించబడ్డాయి. భీష్ముడు 300 అశ్వమేధయాగాలు చేసినట్లు, శివుడు 'సర్వమేధమనే' మహాయజ్ఞం చేసినట్లు భారతంలో కనిపిస్తుంది. తిక్కన యజ్ఞ నిర్వహణ రాజుల ముఖ్యకర్తవ్యమని క్రిందివిధంగా చెప్పారు.

"హరుడును సర్వమేధ మనుయాగమునం బ్రచుర ప్రకాశతం
బొరయఁగ వేడ్కఁజేసె విధి పూర్వదిగీశ ముఖామరుల్ మహా
ధ్వరములఁగాదె పేర్కొనుట ధాత్రి సధర్మత నేలియజ్ఞత
త్పరత వెలుంగరే నృపులు పార్థివ ముఖ్య మరుత్తముఖ్యులన్"[40]

దీన్నిబట్టి ఆనాడు సమాజంలో యజ్ఞయాగాలకున్న ప్రాధాన్యతను తెలుసుకోవచ్చు. నహుషుడు నూరు అశ్వమేధయాగాలు చేసినందువల్ల నహుషుడు ఇంద్ర పదవిని పొందగలిగాడు.

రాజు – మంత్రిమండలి:–

సప్తాంగాలతో కూడుకున్న రాజ్యాన్ని రక్షించడానికి అధికారులు అవసరం. రాజు ఒక్కడే రాజ్యరక్షణను చేయలేడు. అందువల్ల మంత్రుల సహాయం తప్పకుండా తీసుకోవలసి ఉంటుంది. అయితే ఈ మంత్రులు ఎంతమంది ఉండాలి అనే దానిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అయితే ఎనిమిది మంది మంత్రులుండాలని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. వారు. 1. ముఖ్యసచివుడు, 2. సేనాపతి, 3. కోశాధ్యక్షుడు, 4. పురోహితుడు, 5. గుప్తదూత (గుఢచారి), 6. దుర్గాధ్యక్షుడు, 7. జ్యోతిష్కుడు, 8. వైద్యుడు.

రాజు – రహస్యపరీక్షలు :–

ప్రాచీన కాలంలో మంత్రులను నియమించేటప్పుడు రాజు ఏయే పరీక్షలు పెట్టేవాడో కృష్ణగాయత్రిగారు ఇలా వివరించారు.

"'ఉపధాశుద్ధులు' అయినవారినే ఉన్నత పదవులలో రాజు నియమించాలి.
'ఉపధ' అనగా రహస్యపరీక్ష. ధర్మపూర్వకమైన, కామ పూర్వకమైన,
లోభపూర్వకమైన, భయ పూర్వకమైన రహస్యపరీక్షలు రాజు నిర్వహించాలి.
ఉన్నతాధికారులుగా నియమించగోరే వారిని రాజు స్వయంగా పరీక్షించాలి"[41]

రాజు – ఆదాయ వనరులు:–

రాజు ఏయే మార్గాల నుండి ఆదాయాన్ని కూర్చుకోవాలో తెలుసుకొని ఉండాలి. ముఖ్యంగా ఏడు విధాలుగా రాజ్యానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అవి:– కోటలు, గనులు, అడవులు, పశుసంపద, చతుష్పథాలు, స్వదేశీకోటలు, నగరాలు. వీటినుండి కప్పాల రూపంలో, శిస్తుల రూపంలో రాజు ఆదాయాన్ని సంపాదించుకోవాలి. పూర్వపురాజులు తమ సంపదలను రహస్యస్థలాల్లో దాచిపెట్టేవారు. యుద్ధాల సమయంలో శత్రువులబారి నుండి ధనాన్ని కాపాడుకోవటానికి వారు ఈ విధంగా చెసేవారు.

రాజు – పన్నుల విధానం:–

రాజు ప్రజలను రక్షిస్తున్నందుకుగాను, వారు ధనధాన్యాల రూపంలో చెల్లించే పన్నులు. రాజు ప్రజలన మీద ఏవిధంగా పన్నులు విధించాలో భీష్ముడు, ధర్మరాజుకు క్రిందివిధంగా వివరించాడు. 'తోటవాడు కుసుమ ఫలాలను కోయునట్లు, రాజు ప్రజల నుండి పన్ను వసూలు చేయాలి. పరుష వచనాలతో పన్నులు స్వీకరించరాదు. ఎక్కువగా పన్నులు వసూలు చేయడం వలన నరపతి ప్రజల చేత సాధించబడతాడు. గోపాలుడు గోవులనుండి పాలు పితికినట్లు, తుమ్మెదలు పూవుల నుండి మకరందం స్వీకరించినట్లు, పులి తన పిల్లలను నోట కరచుకొని ఎంతో జాగ్రత్తగా ఒక చోట నుండి మరోచోటుకి తీసుకువెళ్ళినట్లు రాజు మృదువుగా పన్నులు వసూలు చేయాలి'[42]. కోశబలం లేని రాజుకు మిత్రబలం ఉండదు. బలహీనుడికి రాజ్యప్రాప్తి ఉండదు. అందువల్ల రాజు, పొరుగున ఉన్న రాజులతో మిత్రత్వాన్ని ఏర్పరుచుకోవాలి.

ఉగ్రమైన పన్నుల వల్ల రాజు యొక్క కీర్తి, ప్రాణాలు కూడా నశిస్తాయని భీష్ముడు ధర్మరాజుకు క్రిందివిధంగా తెలియజేశాడు.

"కావున నర్థసంపదలు గల్గియ యింతకు మూలమైన ను
ర్వీవరుఁ డాత్మశక్తి కతిరిక్తములైన సముద్యమంబులం

దావలియం దలంచి సముదగ్రత గైకొనుటొప్ప దవ్విధం
బావిభుతొంటికల్మికిని హాని యొనర్చు హరించుఁ బ్రాణముల్"[43].

కాబట్టి రాజు ప్రజలను బాధించని రీతిలో పన్నులు వసూలు చేయాలి. ప్రజలే రాజ్యానికి రక్ష. కాబట్టి రాజు దయాహృదయుడై ప్రజలతో మెలగాలి.

రాజు – యుద్ధతంత్రం :-

రాజు క్షత్రియ ధర్మాన్ని అనుసరించి వీరభోజ్యమైన రాజ్యాన్ని యుద్ధంలో గెల్చుకోవాలని ప్రాచీనుల అభిప్రాయం. క్షత్రియులు ఎవ్వరికీ ఎన్నటికీ తలవంచరాదు. భయం చేతగాని, బ్రతుకు తెరువుకొరకు గాని ఒకరి మీద ఆధారపడకూడదు.

యుద్ధం వల్ల దేశ ఆర్థికవ్యవస్థ ఛిన్నాభిన్నమై అరాచకాలపాలు అవుతుందని అర్జునుడు శ్రీకృష్ణునితో ఇలా అంటాడు.

"కులనాశనము సేసినఁద
త్కుల ధర్మము నడఁగు నష్టకులధర్మములకుం
గలుగును దుస్సంకరమ,
క్కులఘ్ను లేఁగుదురు నరక కూపంబులకున్"[44]

యుద్ధంలో జయాపజయాలు దైవాధీనాలు. ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా ఇరుపక్షాలు నష్టభారాన్ని మోయవలసిందే. విజయం లభించినప్పటికీ మరణించిన ఆప్తులు, మిత్రులు, బంధువులు తిరిగిరారు. కాబట్టి యుద్ధం అనర్థదాయకం అని భారతసారాంశం. దుర్యోధనుడికి గల రాజ్యకాంక్ష, భారతవీరుల్లోని యుద్ధప్రీతి కురుక్షేత్రమహా సంగ్రామానికి కారణం.

యుద్ధనిర్వహణ భాగంగా నాటి రాజులు యుద్ధవ్యూహాలను ప్రత్యేకంగా నేర్చుకున్నారు. వ్యూహాలు పన్నడంలో భీష్ముడు, ద్రోణుడు, శల్యుడు, కర్ణుడు, ధృష్టద్యుమ్నుడు, ధర్మరాజు, అర్జునుడు గొప్ప పాండిత్యం సంపాదించినవారు.

ఈ వ్యూహాలలో రెండుపక్షాలు, రెండు కక్షాలు, ఒక ఉరోభాగం, ప్రతిగ్రహం ఉంటాయి. ఈ వ్యూహాలు దండ, భోగ, మండల, అసంహతాలని నాలుగురకాలు. ఈ చతుర్విధ వ్యూహాల గురించి శ్రీ ద్వివేది కృష్ణగాయత్రి గారు 'వ్యాసుడు – తిక్కన – మహాభారహత రాజనీతిదర్శనం' అనే తమ సిద్ధాంతవ్యాసంలో క్రిందివిధంగా వివరించారు. "వీటిలో తిర్యగ్వ్యతి కలిగినది దండవ్యూహం, వెనక్కి తిరిగి యుద్ధం చేయుటకు వీలైనది. సైనిక విభాగాలన్నీ ఒకటి తర్వాత ఒకటి యుద్ధం చేయునట్లు సర్పాకారంలో అమర్చబడినది

భోగవ్యూహం. సైనిక విభాగాలన్నీ ప్రక్కల నుండి యుద్ధం చేయునట్లు అమర్చబడినది మండలవ్యూహం. నిర్ణీత స్థానాలనుండి (వేర్వేరుగా) యుద్ధం చేయునట్లు సైనిక విభాగాలను అమర్చబడినది అనంతవ్యూహం"[45]. దీన్నిబట్టి ప్రాచీనకాలంలో రాజులు యుద్ధవిద్యకు సంబంధించిన సంపూర్ణజ్ఞానం కలిగివున్నట్లు తెలుస్తున్నది. రాజనీతిలో యుద్ధవిద్య కూడా చాలా ప్రధానమైంది.

ఈ యుద్ధంలో ఆనాడు రాజులు కొన్ని నైతిక విలువల్ని కూడా పాటించారు. యుద్ధంలో వెన్ను చూపిన వాడి మీద, నపుంసకులు, బాలలు, స్త్రీలు, వృద్ధులు మొదలైన వారి మీద ఆయుధం ఎక్కుపెట్టేవారు కాదు. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు శిఖండిని అడ్డుపెట్టుకొని రాగా భీష్ముడు అస్త్రసన్యాసం చేశాడు. ఆ సమయంలోనే అర్జునుడు భీష్ముడిని పడగొట్టాడు.

రాజు – మైత్రీసంబంధాలు:-

రాజ్యాంగాల్లో మిత్రుడొకడు. మిత్రబలం అధికంగా కలిగిన రాజు ఏ కార్యాన్నైనా సాధించగలడు. శుక్రనీతి, హితోపదేశం, భారతం నాలుగు విధాలుగా రాజు మైత్రీబంధాలను ఏర్పరుచుకోవాలని చెపుతుంది. రాజు మిత్రులను పూర్తిగా నమ్మకూడదు. అలాగని నమ్మకుండా ఉండకూడదు. నమ్మితే మృత్యువు, నమ్మకపోతే అపమృత్యువు. కాబట్టి రాజు మిత్రులను నమ్మీనమ్మనట్లు ఉండాలి. తనకు మేలు చేసే మిత్రుణ్ణి రాజు ఆత్మభావంతో గౌరవించాలి. ఈవిధంగా రాజనీతిని ఉపయోగించిన రాజు ప్రజారంజకంగా పాలన చేస్తాడు.

రాజు – రాయబారాలు :-

రాజులు యుద్ధాల సమయంలో, ఇతరమైన రాజ్యాంగవిషయాల్లో రాయబారుల ద్వారా పొరుగుదేశాలతో సమాచారం అందించేవారు. రాయబారులు సకలశాస్త్రకోవిదులు, రాజనీతిజ్ఞులు, సమయజ్ఞానం, ఓర్పు, నేర్పు, వాక్చాతుర్యం, ఇంద్రియనిగ్రహం, శాంతగుణం కలగినవారై ఉండాలి. రాయబారులు, తమ ప్రభువుల మాటలనే కలిగినవారై ఉండాలి. రాయబారులు, తమ ప్రభువుల మాటలనే ఇతర రాజుల దగ్గర ప్రస్తావించాలి. వారి సొంత వ్యాఖ్యానాలు అక్కడ ఉండవు. మహాభారతంలో సంజయరాయబారం, ఉలూకుని రాయబారం, శ్రీకృష్ణరాయబారం వంటి ఘట్టాలు ప్రసిద్ధమైనవి. రామాయణంలో ఆంజనేయుడి రాయబారం, అంగదుని రాయబారం ముఖ్యమైనవి.

శ్రీకృష్ణుడిని రాయబారానికి పంపుతూ ధర్మరాజు అతనికి రాయబారికి ఉండవలసిన లక్షణాలను గురించి ఇలా తెలియజేశాడు.

"మనమునఁబక్షపాతగతి మాదెస మానుము ధర్మనీతి వ

ర్తనముల రెండుదిక్కుల హితంబును బెంపును గల్గునట్టి చొ
ప్పున విదురాదిసజ్జనుల బుద్ధికి రా నుచితంబుతోడి మె
ల్పునఁ బరుసందనంబునను భూపతు లెల్ల నెఱుఁగ నాడుమీ"[46]

"తగవునఁ బోక రాజు బెడిదంబులు వల్కెనయేని సైఁచి యొ
ప్పున నిలుమీ గురుత్వముఁ బ్రభుత్వమునుం గల పెద్దవారి మా
టగొనమి యాసుయోధనుకడన్ నిలువన్ మన మెల్ల గారవం
బుగఁగురువృద్ధపల్కుఁ దలపుం జన నిచ్చిన మెచ్చరేజనుల్."[47]

నిష్పక్షపాతబుద్ధితో, ధర్మాన్ని, నీతిని పాటిస్తూ రెండు వైపుల వారికి మేలు కిగే విధంగా మంచిని చెప్పమని ధర్మజుడు శ్రీకృష్ణునితో అంటాడు.

ద్రుపద పురోహితుడు మొదటగా పాండవుల తరపున కౌరవసభకు రాయబారిగా వెళ్ళాడు. ఈ సందర్భంలో తిక్కన, శ్రీకృష్ణుడికి గల ప్రతిభాపాటవాలను ద్రుపదపురోహితుని నోట పలికించాడు.

"వివిధోపాయ పరాయణుండు రిపుదోర్వీర్యాపహారక్రియా
ప్రవణోద్యోగుఁడు మంత్రరక్షణకళా ప్రావీణ్యగణ్యుండు ధై
ర్యవివేకాదిగుణోత్తరుండఖిల విద్యాజాలసంవేది మా
ధవుఁ డాదిక్కటె పాండవేయుల కసాధ్యం బెద్దియుం గల్గునే"[48]

శ్రీకృష్ణుడు వివిధ రకాలైన ఉపాయాలు తెలిసినవాడని, శత్రువుల గుండెలను చీల్చగలిగిన వీరుడని, యుద్ధతంత్రం తెలిసినవాడని, అఖిల విద్యాజాలసంవేది అని వివిధ విశేషణాలతో ఇక్కడ కీర్తించబడ్డాడు.

ఇక్కడ ప్రయోగించిన 'అఖిలవిద్యాజాలసంవేది' అనే సమాసం చాలా విశాలమైన అర్థాన్నిస్తుంది. రాజనీతికి సంబంధించిన విద్యలన్నీ నేర్చినవాడని పై సమాసానికి అర్థం. 'ఆన్వీక్షకీ, త్రయీ, వార్తా, దండనీతిశ్చేతి విద్యాః' అని అర్థశాస్త్రంలో చెప్పబడింది. పదార్థాల స్వరూపాన్ని ఉపాయాల చేత, హేతువుల చేత పరీక్షించే విద్య ఆన్వీక్షకి (Philosophy), ఋగ్యజుస్సామ వేదాలు – త్రయి, కృషి (వ్యవసాయం), పశుపాలన, వర్తకం వీటికి వార్త (Economics) అని పేరు. దండనీతి అంటే రాజనీతి (Political Science). ఈ నాల్గింటిని సమగ్రంగా చదివినవాడు 'అఖిలవిద్యాజాలసంవేది' అవుతాడు. శ్రీకృష్ణుడు అటువంటి జ్ఞాని అని, ఆయన రక్షణలో ఉన్న పాండవులను ఎదిరించడం అసాధ్యమని ద్రుపద పురోహితుడు కౌరవసభలో పలుకుతాడు.

పై విధంగా మన ప్రాచీన విద్యార్థులు రాజనీతిని అభ్యసించి, ఉత్తమ పరిపాలకులై రాజ్యపాలన చేశారు. కొందరు ఈ నీతిని పాటించక ప్రజలను హింసించి కాలగర్భంలో కలిసిపోయారు.

2.1.11. ధనుర్వేద విద్య:-

ప్రాచీనులు నేర్చిన విద్యల్లో ధనుర్వేదం చాలా ప్రసిద్ధమైంది. ఇది చతుర్వేదాలకు భిన్నమైంది. చతుర్వేదాల్లో సిద్ధాంతజ్ఞానం ప్రధానం. ధనుర్వేదంలో సిద్ధాంతజ్ఞానం కన్నా ప్రయోగ జ్ఞానమే ప్రధానం. నాటి రాజకుమారులు, బ్రాహ్మణ బాలురు ఈ ధనుర్వేదాన్ని గురుకులాల్లో నేర్చుకున్నారు.

ఆంధ్రమహాభారతంలోని ఆదిపర్వంలో ఈ ధనుర్వేదవిద్య ప్రస్తావన ఉంది. గౌతముడు అనే మహామునికి శరద్వంతుడు అనే కొడుకు బాణసమూహంతో పుట్టాడు. అతడు వేదాలు చదవటానికి ఇష్టపడక, అతిభయంకరమైన తపస్సు చేసి, బ్రాహ్మణులు వేదాలు చదివే విధంగా తాను కూడా ధనుర్వేదాన్ని సాధించాడు. శరద్వంతుడు మహానిష్ఠతో తపస్సు చేస్తుండగా, దేవేంద్రుడు అది తెలుసుకొని భయపడ్డాడు. అతడి తపస్సును భగ్నం చేయటానికి 'జలపద' అనే యౌవనవతిని పంపిస్తాడు. వేదాలకు విరుద్ధమైన మరొకవేదం లోకంలో ఉండకూడదు, అధ్యయనం వల్లనే ఏ విద్యనైనా నేర్చుకోవాలి అనేది ఇంద్రుడి అభిమతం. అందుకే స్వశక్తితో సాధన చేస్తున్న, లోకవిరుద్ధమైన పనిచేస్తున్న శరద్వంతుడికి తపోభంగం కలిగించడానికి ఇంద్రుడు ప్రయత్నించాడు.

'జలపద'ను చూడగానే శరద్వంతుడికి ఆమెపై మోహం కలిగింది. రాగపరవశుడైన శరద్వంతుడు రేతస్సును విడిచాడు. ఆ రేతస్సు ఒక శరస్తంభంలో రెండు భాగాలుగా పడింది. శరద్వంతుడు అక్కడి నుండి వేరొక చోటికి వెళ్ళిపోయాడు. శరస్తంభంలో పడిన రేతస్సు వల్ల, దాని నుండి ఒక మగశిశువు, ఒక ఆడశిశువు పుట్టారు. అదే సమయంలో అడివికి వేటకై వచ్చిన శంతనుడు ఆ బిడ్డలు దిక్కులేక పడివుండటం, వారి ప్రక్కన బాణాలు, అమ్ములపొది ఉండటం చూశాడు. ఆ బిడ్డలు ఎవరో ఒక ధనుర్విద్యా వేత్త సంతానమని గుర్తించి, వారిని తనతోపాటు తీసుకెళ్ళి పెంచాడు. తర్వాత కొంతకాలానికి శరద్వంతుడు హస్తినాపురం వెళ్ళి శంతునుడికి తన గురించి వివరిస్తాడు. శంతనుడి దగ్గర ఉన్న బిడ్డలు తన సంతానమేనని, వారిని తనకు అప్పగించమని కోరుతాడు. ఈవిధంగా శంతనుడి కృపవల్ల పెరిగినందున వారికి కృపుడు, కృపి అనే పేర్లు ఏర్పడ్డాయి. శరద్వంతుడు, తన కుమారుడైన కృపుడికి క్రిందివిధంగా విద్యాబుద్ధులు చెప్పించాడు.

"వేదంబుల్ సదివించె భూసురులతో విఖ్యాతి గా నాత్మసం
వేది జేసెఁ జతుర్విధం బగుధను ర్వేదంబు నానాస్త్ర వి
ద్యాదాక్షిణ్యముతోడఁ దాన కఱపెఁ దద్విత్తముల్ సూచి సం

వాదుల్ గాఁదననందనుం గృపు శరద్వంతుఁడు దాంతాత్ముఁడై"[49]

కృపుడికి శరద్వంతుడు వేదాలు చెప్పించాడు. అతడిని ఆత్మసంవేదిగా చేశాడు. గొప్పదైన ధనుర్వేదాన్ని తానే పుత్రుడికి, లోకం అంతా చూసి కీర్తించేలాగా నేర్పాడు.

ఈ విధంగా ధనుర్వేదవిద్య శరద్వంతుని నుండి కృపుడికి, అతని నుండి కౌరవ, పాండవ, యాదవాది వీరులందరికి లభించింది. తర్వాత ఈ విద్య లోకంలో విశేష ప్రచారాన్ని పొందింది.

ఇక్కడ మనకు ఒక సందేహం రావచ్చు. ధనుర్విద్య, ధనుర్వేదం రెండూ ఒక్కటేనా? కాదా? అని. మహాభారతం ప్రకారం ధనుర్వేదం అనేది శరద్వంతుడి వల్ల ఏర్పడింది. అతడి నుండి కృపుడికి, అతని నుండి బ్రాహ్మణ, క్షత్రియులకు సిద్ధించింది. విలువిద్య దీనికి భిన్నమైంది. విలువిద్యను అన్ని వర్ణాల వారు సాధన చేయవచ్చు. దీనికి ఎటువంటి ప్రత్యేక నియమాలు లేవు. కానీ ధనుర్వేదాన్ని మాత్రం మిగిలిన వేదాల లాగా బ్రాహ్మణక్షత్రియులే నేర్చుకున్నారు. శూద్రులకు ఇందులో ప్రవేశార్హత లేదు.

ధనుర్వేదం శరద్వంతుడి కాలం నుండి లోకంలో వ్యాపించింది. కాని ధనుర్విద్య లేదా విలువిద్య ఆనాది నుండి వ్యాప్తిలో ఉంది. పరశురాముడు, దశరథుడు, రాముడు మొదలైన వీరులు ధనుర్విద్య (విలువిద్య)లో మంచి ప్రావీణ్యం కలవారు. అయితే రామాయణ కాలానికి విలువిద్యకు వేదసారూప్యం లేదు. అది కేవలం సాధనప్రధానమైన విద్య. దీనికి సిద్ధాంతజ్ఞానం అవసరం లేదు. ప్రయోగజ్ఞానం ఉంటే చాలు. శరద్వంతుడు దీనికి భిన్నంగా వేదాలతో సమానమైన ధనుర్వేదాన్ని రూపొందించాడు. మొదట తన కుమారుడైన కృపుడికి ఈ వేదాన్ని నేర్పాడు.

మొత్తం మీద ధనుర్వేదం సిద్ధాంతప్రధానమైంది అని, ధనుర్విద్య (విలువిద్య) ప్రయోగప్రధానమైనదని చెప్పవచ్చు. విలువిద్య సార్వజనీనమైంది. ధనుర్వేదం బ్రాహ్మణక్షత్రియులకు పరిమితం.

2.1.12. శబ్దభేది విద్య:–

శబ్దాన్ని విని లక్ష్యాన్ని ఛేదించడాన్ని శబ్దభేది విద్య అంటారు. ఇది చాలా ప్రాచీనవిద్య. పూర్వం రాకుమారులంతా ఈ విద్యను నేర్చుకొనేవారు. ఎందుకంటే వేటకు వెళ్ళిన సమయంలో ఈ విద్య తెలియడం వల్ల క్రూర జంతువులను సులభంగా వేటాడవచ్చు. అందువల్ల నాటి క్షత్రియ కుమారులు శబ్దభేది విద్యను నేర్చుకొనేవారు.

రామాయణంలో దశరథుడికి శబ్దభేదివిద్య తెలుసునని ఋజువవుతున్నది. ఒకరోజు 'శ్రావణ కుమారుడు' అనే బాలుడు తన వృద్ధులైన తల్లిదండ్రులను కావడికి కట్టుకుని అడవిలో వస్తూంటాడు. మార్గమధ్యంలో బాలుడి తల్లిదండ్రులకు దాహం వేస్తుంది. వారి కోసం నీళ్ళు తేవడానికి దగ్గరలోని కొలను దగ్గరకు వెళుతాడు. అదే సమయంలో దశరథుడు ఆ అడవికి వేటకు వచ్చివుంటాడు. శ్రావణుడు కుండను నీళ్ళలో ముంచుతుండగా బుడబుడమని శబ్దం వస్తుంది. అదే జంతువులు చేసే శబ్దమని భ్రమపడి పొదచాటునుండి శబ్దభేదివిద్య సహాయంతో దశరథుడు బాణం విడుస్తాడు. బ్రాహ్మణ బాలుడు శ్రావణుడు అక్కడికక్కడే మరణిస్తాడు.

ఆ విషయం వృద్ధదంపతులకు దశరథుడు తెలుపుతాడు. మేము ఏవిధంగా పుత్రుడికి దూరమై మరణిస్తున్నామో, నీవు కూడా అదేవిధంగా మరణిస్తావని ఆ దంపతులు దశరథునికి శాపం పెట్టి చనిపోతారు.

ఈ కథ వల్ల రామాయణకాలానికి శబ్దభేది విద్య లోకంలో ప్రచారం పొందివుందని తెలుస్తుంది. ఈ విద్య విశేషవిద్య. బ్రాహ్మణక్షత్రియులు మాత్రమే నాడు దీన్ని గురువుల నుండి నేర్చుకునేవారు.

మహాభారతంలోని అరణ్యపర్వంలో, భీమార్జున నకుల సహదేవులు గంధర్వులతో యుద్ధం చేసేటప్పుడు అర్జునుడు శబ్దభేదివిద్యను ఉపయోగించినట్లు చెప్పబడింది.

"దాని నుఱక యింద్ర సూనుండు గాండీవి / శబ్దవేధు లయిన సాయకములఁ
జిత్రసేను సర్వగాత్రంబు భేదించి / యొక్క మాత్రలోన నుడిపెఁగడఁక"[50]

కళ్ళకు కనిపించకుండా చాటునదాగి, మేఘంలాగా గర్జిస్తూ బాణాలు ప్రయోగిస్తున్న చిత్రసేనుడి మాయ వ్యర్థం అయ్యేటట్లు, శబ్దాన్ని బట్టి లక్ష్యాన్ని భేదించే అమ్ములచేత అర్జునుడు చిత్రసేనుడి శరీరాన్ని తూట్లుపడేటట్లు చేసి అతని పూనికను వమ్ముచేశాడు.

ఒకరోజు అర్జునుడు మొదలైన కౌరవబాలురతో కలిసి ద్రోణుడు నదీస్నానానికి వెళుతాడు. నదిలో దిగి స్నానం చేస్తున్న ద్రోణుడి చిరు తొడను ఒక మొసలి వచ్చి పట్టుకున్నది. ద్రోణుడు దాని నుండి విడిపించుకోగలిగిన శక్తి ఉండి కూడా శిష్యులను పరీక్షించదలచుకున్నాడు. మీలో ఎవరైనా నన్ను ఈ మొసలి బారి నుండి కాపాడండి అన్నాడు. అప్పుడు అర్జునుడు ఈవిధంగా చేశాడు.

"దానిన్ నేరక యందఱున్ వివశులై తారున్న నన్నీరిలోఁ
గానం గానిశరీరముం గలమహోగ్ర గ్రాహమున్ గోత్రభి
త్సూనుం డేను శరంబులన్ విపులతేజుండేసి శక్తిన్ మహా
సేనప్రఖ్యుఁడు ద్రోణుజంఘ విడిపించెన్ విక్రమం బొప్పఁగన్"[51]

ఈ విధంగా నీటిలో ఉన్న మొసలిని అర్జునుడు కొట్టడానికి కారణం అతడు నేర్చుకున్న శబ్దభేది విద్య. నీటిలో మొసలి కలదికలను కనిపెట్టి బాణాలు విడిచాడు గురితప్పలేదు. అర్జునుడిలోని ఈ లక్ష్యశుద్ధి, గురువుమీద అభిమానం ద్రోణాచార్యుడిని ముగ్ధుడిని చేశాయి. ఈ విధంగా రామాయణభారతాల్లో శబ్దభేదివిద్య ప్రస్తావన కనిపిస్తున్నది.

2.1.13. అశ్వశాస్త్ర విద్య:–

ప్రాచీనులు నేర్చిన విద్యల్లో అశ్వవిద్య, గుర్రపుస్వారీ, రథాలను తోలటం చాలా ప్రధానమైనవి. ఎందుకంటే ఆనాడున్న ప్రధాన వాహనం గుర్రపురథం. ఎవరికి ఎన్ని రథాలు ఉంటే అతడు అంతగొప్ప చక్రవర్తి అనిపించుకుంటాడు. అందుకే అయోధ్య రాజుకు దశరథాలు ఉండటం వల్ల దశరథుడు అనే పేరు వచ్చింది. ఏ రాజ్యంలో ఆశ్వికదళం ఎక్కువగా ఉండే, ఆ రాజ్యానికి అంతటి రక్షణ ఉంటుంది. కాబట్టి ప్రాచీనకాలంలో రాకుమారులు అశ్వశాస్త్రం తప్పకుండా అభ్యసించేవారు. గుర్రపుస్వారీ నేర్చుకునేవారు. గుర్రాల వ్యాపారం ఆనాడు చాలా ప్రసిద్ధి చెందింది. విదేశాల నుండి మేలురకం గుర్రాలను భారతదేశానికి దిగుమతి చేసుకొనేవారు. ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయల కాలంలో యవనరాజ్యం నుండి (పోర్చుగీస్) భారతదేశానికి గుర్రాలు దిగుమతి ఎక్కువగా జరిగింది. రాజుగారి కొలువులో గుర్రాల పర్యవేక్షణకు ప్రత్యేక మంత్రి ఉండేవాడు.

ఈ మంత్రి అశ్వశాస్త్రంలో మంచి పాండిత్యాన్ని సంపాదించి ఉండాలి. మేలురకం గుర్రాలను ఎంపిక చేయగలిగి ఉండాలి. లొంగని గుర్రాలను ఎలా లోబరుచుకోవాలో తెలిసివుండాలి. అందువల్ల ఈ అశ్వశాస్త్రవిద్య చాలా ప్రాచుర్యం వహించింది. మనుమంచిభట్టు 'హయలక్షణవిలాసం' అనే అశ్వశాస్త్ర గ్రంథాన్ని తెలుగులో రాసాడు. ఇందులో గుర్రాల్లోని జాతిభేదాలు, వాటిపోషణ, రక్షణ మొదలైన విషయాలు చర్చించబడ్డాయి.

ప్రాచీన తెలుగు కావ్యాల్లో ఇంద్రుడి రథసారథి మాతలి, నలుడు, శ్రీకృష్ణుడు, శల్యుడు, ఉత్తరుడు రథాన్ని నడపడంలో మంచి ప్రతిభావంతులుగా కనిపిస్తారు. మహాభారతంలోని అరణ్యపర్వంలో (నలుడి) బాహుకుడి సారథ్యాన్ని చూసి ఋతుపర్ణుడు క్రిందివిధంగా అంటాడు. "ఈ బాహుకుడు అశ్వశాస్త్రకర్త అయిన శాలిహోత్ర మునీంద్రుడా? దేవేంద్రుడి రథసారథి అయిన మాతలియా? లేక నలుడా? తదితర మానవులు ఇంత శక్తిమంతంగా ఈ భూలోకంలో రథాలను గురించిన, గుర్రాలను గురించిన దర్శనజ్ఞానం కలవారు ఉన్నారా?"[52]. ఈ వివరణనుబట్టి ఆనాడు అశ్వశాస్త్రం ఎంతటి అభివృద్ధి దశలో ఉండేదో మనకు తెలుస్తున్నది.

మహాభారతంలో, నకులుడు అశ్వశాస్త్రంలో మంచి ప్రావీణ్యం సంపాదించినట్లు చెప్పబడింది. అజ్ఞాతవాసం ప్రారంభమౌతున్న సందర్భంలో, విరాటుని కొలువులో చేరడానికి తనకు గల అశ్వశాస్త్ర పాండిత్యాన్ని నకులుడు క్రింది విధంగా ధర్మరాజునికి తెలియజేశాడు.

"గోడిగ జాతిలోఁ గొదమ పెంటుల నేర్చి / మావుల హత్తించు మార్దవంబుఁ
ద్రాళ్ళఁ బట్టింపంగఁ గఱి యైన కొదమల / సంచంబు లెఱిఁగి శిక్షించు నేర్పుఁ
గళ్యాలఁ బదిలంబు గాని గుఱ్ఱంబులఁ / గ్రొత్త ముట్టున కియ్య కొలుపువెరవుఁ
బెనగుశూకలముల బిరుదుతనంబులఁ / జలము డింపక తీర్పఁజాలుటయును

నలవరించినవాఁడ లా యముననున్న / యపుడు దొడకించుకయు లేని యట్లుగాఁగ
మాటిమాటికిఁ బరికించి మందడీల / కెల్ల నూఱట యగుచు వర్తిల్ల నేర్తు" [53]

వయసు వచ్చిన ఆడు గుర్రాలలో ఎదకు వచ్చిన వాటిని గుర్తిస్తాను. ఎన్నిక చేసిన మగ గుర్రాలతో వాటిని కలిపే నేర్పు నాకున్నది. పిల్లగుర్రాల లక్షణాలను గుర్తించి వాటిని తాళ్ళతో అలవాటు చేసే నేర్పు నాకున్నది. కళ్ళేలకు లొంగని గుర్రాలు ఉండవచ్చు. వాటిని కేవలం నూలుపోగు కళ్ళెం చేతనే లోబరుచుకునే నేర్పు నాకున్నది. మారాం చేసే మొండి గుర్రాలకు ఎటువంటి రోగాలు రాకుండా, లోపాలు లేకుండా మెలకువతో వాటిని రక్షిస్తానని నకులుడు అంటాడు. దీన్నిబట్టి భారతకాలం నాటికి అశ్వశాస్త్రంలో మంచి అధ్యయనం జరగిందని, నకులుడు వంటి అశ్వశాస్త్రాన్ని అభ్యసించిన విద్యార్థులు ఉండేవారని తెలుస్తున్నది. ఇది బ్రాహ్మణక్షత్రియవైశ్యులు నేర్చిన ప్రాచీన విద్య.

2.1.14. పశుపాలన విద్య:–

ప్రాచీనకాలంలో మానవులకు ప్రధాన జీనాధారం పశుపోషణ తర్వాతికాలంలో వ్యవసాయం, వాణిజ్యం అభివృద్ధి చెందాయి. పశువులను ఎలా పెంచాలి, వాటికి ఏయే మేతలు వేయాలి, వాటిలోని రకాలు ఏవి, పశువులకు వచ్చే వ్యాధులు, వాటికి సంబంధించిన వైద్యం మొదలైన విషయాల్ని ప్రాచీన మానవులు తెలుసుకొని ఉన్నారు. అయితే ఈ విజ్ఞానం గ్రంథరూపం ధరించకపోయినా, మౌఖికంగా ఒకరి నుండి మరొకరికి అందేది. ఇది వృత్తివిద్య. ఇది అనిబద్ధవిద్య. ప్రత్యేకించి పాఠశాలల్లో నేర్పకపోయినా, పిల్లలు తమ తల్లిదండ్రుల నుండి ఈ పశుపాలనవిద్యను నేర్చుకున్నారు.

ప్రాచీనకాలంలో యాదవజాతివారు పశుపోషణే ప్రధానవృత్తిగా చేసుకొని జీవించారు. నందుడు వారికి నాయకుడు. శ్రీకృష్ణుడు, బలరాముడు ఇరువూరూ బాల్యంలో గోవులను మేపినవారే.

పాండవులలో సహదేవుడికి పశుపాలనలో మంచి అనుభవం ఉంది. విరాటపర్వం ఆరంభంలో, ధర్మరాజు సుకుమారుడైన సహదేవుడు విరాటుని కొలువులో ఏలా బ్రతుకుతాడో అని బాధపడుతుండగా, సహదేవుడు ముందుకు వచ్చి తనకు పశుపాలన విద్య తెలుసునని, కాబట్టి విరాటుని కొలువులో తంత్రీపాలుడన్న పేరుతో చేరి పశుపాలన చేస్తానని చెప్తాడు. ఈ సందర్భంలో సహదేవుడు, తనకు పశుపాలనవిద్యలోగల ప్రావీణ్యాన్ని క్రిందివిధంగా తెలియజేశాడు.

"వంజల నైనను వల నేర్పడఁగ నొక / భంగిఁ జేఁపఁగ జేసిపాఁడి గొనఁగ
బడుగుల నైనను బాటించి పరికించి / గోమున మైఁగండ క్రొవ్వు దేఱఁ
దెవులుగొంటుల నైనఁ దేర్చుసంకటమున / కోపి ముందటియట్ల రూపుసేయ
నఱ్ఱల నైనను నలువైన వెరవున / ముట్టె యంటఁగఁబట్టి కట్టి విడువఁ
బిదుకఁ గదుపు సేర్ప బెదరు వాపఁగ నీరు / మేపు గలుగునెడకు మెలఁగ వెలువ
మృగము నరయ ఘ్రుచ్చు రేవగలును గొట్ట / నేర్తుఁ బసికిఁ జాఁగూర్తు నేను"[54]

గొడ్డుటావులను కూడా చేపేటట్లు చేసి పాలు పితుకుతాను. బక్కచిక్కిన వాటిని కూడా బాగా పరీక్షచేస్తాను. కండపట్టేటట్లు, క్రొవ్వు పట్టేవిధంగా మేపుతాను. తరచు రోగాల పాలయ్యే పశువులకు రోగం నయమయ్యేటట్లు చేస్తాను. ఎంత పొగరుబోతు ఆవునైనా పట్టుకొని ముకుతాడు బిగించి కట్టివేస్తాను. ఆవుల పాలు పిదుకుతాను. వాటిని మందలో చేరుస్తాను. వాటి బెదురు పోగొడతాను. నీరు, మేత ఉన్నచోట తెలుసుకొని మేపుతాను. సింహం మొదలైన క్రూరమృగాలుండే ప్రదేశాలను గుర్తిస్తాను. దొంగలను పసిగడతాను. వారిని శిక్షిస్తాను. పశువులకు ప్రీతికరంగా వ్యవహరిస్తాను అని సహదేవుడు ధర్మరాజుతో అంటాడు. దీన్నిబట్టి నాటి ప్రజలకు పశువైద్యం కూడా తెలుసునని అనిపిస్తుంది. ఈ విజ్ఞానం ఆనాడు ప్రత్యేకశాస్త్రంగా రూపొందకపోయినా మౌఖికంగా ప్రచారంలో ఉంది. దీనికి భారతమే నిదర్శనం.

2.1.15. స్వప్నశాస్త్ర విద్య:-

ప్రాచీన భారతీయులకు శకునశాస్త్రం మీద ఏవిధంగా నమ్మకం ఉందో, స్వప్నశాస్త్రం మీద కూడా అంతటి విశ్వాసం ఉండేది. భారతీయ పండితులు కలలను భావి సూచకాలుగా భావిస్తారు. కొందరు అవి శుభాశుభ శకునాలుగా విశ్వసిస్తారు.

కలలు వచ్చే సమయాన్ని బట్టి వాటి ఫలితాలను చెప్పే శాస్త్రజ్ఞానం ప్రాచీన పండితులకు ఉండేది. మంచి కల వస్తే మేలుకొన్ని తర్వాత నిద్రపోకూడదని శాస్త్రం. అందువల్లనే తిక్కన తన కలను తలచుకుంటూ భక్తిపారవశ్యంలో ఉన్నాడు. తిక్కనకు కలలో హరిహరనాథుడు దర్శనమిచ్చాడు. అలాగే శ్రీకృష్ణదేవరాయలకు కలలో శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు దర్శనమిచ్చి, తాను గోదాదేవిని వివాహం

చేసుకున్న వృత్తాంతాన్ని ప్రబంధంగా తెలుగులో రాయమని కోరాడు. ఈ ఉదాహరణల్ని బట్టి ప్రాచీనకాలంలో సామాన్యులకే కాక విద్యాధికులకు కూడా స్వప్నశాస్త్రంపై నమ్మకం ఉన్నట్లు తెలుస్తుంది.

తిక్కన విరాటపర్వం అవతారికలో తనకు వచ్చిన స్వప్నాన్ని ఇలా తెలిపాడు.

"ఎలమియు నచ్చెరువును సరి / నెలసి పొదలు మానసమున నెంతయుఁ బ్రొద్దేఁ
గలలోనఁ గన్న చందము / దలఁచుచు నుండితిని భక్తి తాత్పర్యమునన్"[55]

నా మనస్సు సంతోషంతో, ఆశ్చర్యంతో సమానంగా నిండిపోయింది. నేను కలలో దర్శించిన దృశ్యాన్ని తలచుకొంటూ ఎంతోసేపు భక్తిపారవశ్యంతో ఉండిపోయాను అని తిక్కన తెలిపాడు. తిక్కనకు తెల్లవారి జాములో కల వచ్చింది. అందువల్ల తిక్కనకు నిద్రపట్టలేదు. స్వప్నశాస్త్రం ప్రకారం వేకువజామున వచ్చిన కలలు నిజమవుతాయి. కాబట్టి తిక్కన ఆనందంలో మునిగితేలుతూ మేలుకొని ఉండిపోయాడు.

కొఱవి గోపరాజు రాసిన 'సింహాసన ద్వాత్రింశిక'లో ఆనాటి జనుల వ్యవహారంలో ఉన్న శుభాశుభస్వప్నాలను గురించి ఈ విధంగా వివరించడం జరిగింది. "ఏనుగు, గుఱ్ఱము, పచ్చని ఱాను, మేడ, పోతు పసరమును ఎక్కునట్లు వచ్చిన కలలు శుభములు. పాములు, తేళ్ళు, జలగలు కరిచినట్లు వచ్చిన చావును చెప్పును. శరీరానికి మలము పూసుకున్నట్లు, స్త్రీలతో రమించినట్లు వచ్చిన శుభములు. తలను పేను కొరుకుట, ప్రేవులు చుట్టుకున్నట్లు కనిపించుట, నెత్తురు, కండలు, పాలు, పెరుగు, కల్లు, నేయి త్రాగినట్లు కనిపించిన శుభము. నీటిని, రక్తాన్ని చూసినట్లు కలవస్తే దీర్ఘాయువు. మంట, గంట, పచ్చని పంట, తెలుపురంగు కనబడితే మంచి జరుగుతుంది. బూడిద, ఎముకలు, ధాన్యపుపొట్టు, ప్రత్తి, ఉప్పు కనబడితే చెడ్డది. ఎద్దును, గాడిదను, దున్నపోతును, ఒంటెను ఎక్కినట్లు కల వస్తే కీడు కలుగుతుంది. అన్నాన్ని, పిండిని, నువ్వులను తింటునట్లు కల వస్తే చెడు జరుగుతుంది.

అలాగే ఏనుగు, దేవత, కస్తూరి, గోపురం, నీలమణులు, మేఘాలు, భూమి, యమునానది, కుండలు తప్ప కలలో ఇతరాలైన నలుపు వస్తువులు కనిపిస్తే చెడు జరుగుతుంది. నూనె, కలినీళ్ళు, క్రొవ్వు, తేనె త్రాగినట్లు కలవస్తే చెడ్డది. కోతి, పొగ, కాకి మొదలైనవి కనిపిస్తే చెడు జరుగుతుంది"[56].

పై సమాచారాన్నిబట్టి ప్రాచీన మానవులకు స్వప్నశాస్త్రం పట్ల మంచి అవగాహన ఉందని తెలుస్తుంది. ఈ విజ్ఞానం మౌఖికంగా తర్వాతి తరాలకు అందుతూ వచ్చింది. దీనికి ప్రత్యేకంగా పాఠ్యప్రణాళికలుగాని, అభ్యాసం గాని ఉండవు. గురువులు ఏదైనా సందర్భం వచ్చినప్పుడు మాత్రమే విద్యార్థులకు బోధించేవారు. ఇది ఖచ్చితంగా నేర్చుకోవలసిన విద్య కాదు.

2.1.16. నేపథ్య విద్య :-

నేపథ్యం అనే మాటకు సాధారణ వ్యవహారంలో పూర్వరంగం, ముందు జరిగిన కథ అనే అర్థాలున్నాయి. నాట్యశాస్త్ర పరంగా 'నేపథ్యం' అనే మాటకు నాట్యస్థానం, వస్త్రాద్యలంకారం అనే అర్థాలున్నాయి. రంగస్థలం మీద ప్రదర్శనకంటే ముందు చేసే అలంకారమంతా నేపథ్యవిద్య క్రిందకు వస్తుంది. నాట్యం నేర్పే గురువులే విద్యార్థులకు ఈ నేపథ్యవిద్యను కూడా నేర్పినట్లు కనిపిస్తుంది.

మహాభారతంలోని విరాటపర్వంలో, బృహన్నల తన నాట్యవిద్యాకౌశలం గురించి విరాటమహారాజుతో తనకు నేపథ్య విద్యలో (అలంకరణ విద్య) గల చాతుర్యాన్ని క్రిందివిధంగా తెలిపాడు.

"ఇన్ని తెఱఁగుల శ్రమము సేయింతుఁ జతుర / తా విహీనములైన పాత్రములనైన
నట్టు వొజ్జయై మెలఁగుదు నగళులందు / నిపుణనైపథ్య విధులకు నేర్తు నధిప"[57]

దీన్నిబట్టి నాట్యశాస్త్రం నేర్పే గురువులు తప్పకుండా నేపథ్యవిద్యను కూడా నేర్చుకోవాలని తెలుస్తున్నది. ఇది నిబద్ధవిద్య. దీనికి శాస్త్రనిర్మాణం, బోధనావిధానం కూడా ఉండేవి. ఇది రాకుమార్తెలకు మాత్రమే అందుబాటులో ఉండేది.

2.1.17. కవచధారణ విద్య :-

మహాభారతంలో ద్రోణుడు కర్ణుడికి కవచధారణ విద్యను గురించి చెప్పాడు. అభిమన్యుడిని యుద్ధంలో ఓడించలేక అందరూ పారిపోతున్న సందర్భంలో, అతడిని జయించాలంటే కవచధారణ విద్యను ఛేదించాలని ద్రోణుడు కర్ణుడితో అంటాడు. ఇది యుద్ధవిద్యల్లో ఒకటి. 'కవచము' అనే మాటకు "బొందళము, ఇనుపచొక్కాయ (యుద్ధకాలమందు తొడుగుకొనునది), (తంత్ర) మంత్రసాధనంగమగు స్తోత్ర విశేషము"[58] అనే అర్థాలున్నాయి. కురుక్షేత్ర యుద్ధంలో అభిమన్యుడు ధరించింది కేవలం ఇనుపచొక్కయ కాదు. మంత్రపూరితమైన రక్షణకవచాన్ని అభిమన్యుడు ధరించాడు. అది అతని శరీరాన్ని మొత్తాన్ని కప్పివుంచుతుంది. దాన్ని ఛేదించడానికి ఏమి చేయాలో ద్రోణుడు కర్ణుడితో క్రిందివిధంగా చెప్పాడు.

"కవచధారణమను ఘనవిద్య గవ్వడి / కే నెరింగించితి; నితఁడు దాని
నేర్చుట నీతని నెట్టన నొప్పింప / శక్యంబు గాదు; వంచన గుణంబు
నఱకంగఁ జాపంబు విఱుగనేయఁగ ఘోట / కములఁ జంపఁగ, సూతుసమయఁజేయ
నగుఁ; జాలు దీని నీ వట్ల సేయుము; చేత / ధనువుండ నవ్వీరుఁ జెన వశమె
దేవతలకునైనఁ? గావున నొక్కమై / విల్లు ద్రుంచి తఱిమి విరథుఁజేసి
చూచికొంద మలవు చొప్పునఁదగునె యీ / రథిక వరుని పటుపరాక్రమంబు"[59]

నేను కవచధారణం అనే విద్యను అర్జునుడికి తెలియజేశాను. అభిమన్యుడు ఆ విద్యను తండ్రి వాల నేర్చుకున్నాడు. ఆ విద్యవల్ల అతడిని నొప్పించటానికి సాధ్యంకాదు. వంచన చేత అల్లెత్రాటిని త్రెంచాలి, విల్లు విరవాలి, గుర్రాలను, సూతుడిని కూల్చాలి. ఇవన్నీ ఒక్కుమ్మడిగా జరగాలి. నీ చేతనైతే ఈ పనిచేయుము. చేతిలో ధనువుండగా అతడిని దేవతలైనా సమీపించలేరు. మనం అతడిని జయించలేము అని ద్రోణుడు కర్ణుడితో అంటాడు.

ఈవిధంగా కవచధారణ విద్య యుద్ధతంత్రంలో ఒక భాగంగా కనిపిస్తుంది. రాజకుమారులు దీన్ని నేర్చుకునేవారు. ఇది చాలా రహస్యమైన విద్య. దీన్ని ధరించినవాడు అమేయ పరాక్రమవంతుడు కాగలడు. భౌతిక శరీరం కాకుండా, ప్రతివ్యక్తికి మంత్రమయ శరీరం కూడా ఉంటుంది. దీన్నే కవచం అంటారు. సూక్ష్మశరీరం (మంత్రమయశరీరం) పవిత్రీకరణ జరిగిన తర్వాత, మనస్సు మంత్రంలో లయించడంతో మంత్రమయ కవచశరీరం ఏర్పడుతుంది. రాముడు తన మంత్రమయ శరీరంలోకి అస్త్రదేవతలను స్వీకరించాడు. గురువు నుండి శిష్యుడు ఉపదేశం పొందనప్పుడు ఒక ముద్ర ఉంటుంది. గురుశిష్యులిద్దరూ ఆ ముద్ర పట్టినప్పుడు మంత్రప్రజ్ఞ గురువులో నుండి శిష్యునిలోకి ప్రవహిస్తుంది. విశ్వామిత్రుడు రామలక్షణుల మంత్రమయ శరీరాలను శుద్ధిచేసి, వారిలోనికి అస్త్రదేవతలను ప్రవేశపెట్టాడు. ఈవిధంగా రక్షాకవచాన్ని ధరించినవాడికి ఆపదల నుండి రక్షణ లభిస్తుంది. మృత్యువు అతని దగ్గరికి రాలేదు. యుద్ధంలో అతనిని ఎదిరించేవారు ఉండరు.

2.1.18. దండనీతి విద్య:–

మహాభారతంలోని శాంతిపర్వంలో వసుహోముడు, మాంధాతకు దండోత్పత్తి ఎలా జరిగిందో తెలియజేశాడు. దానివల్ల కలిగే ప్రయోజనాలను కూడా తెలిపాడు. 'దండనీతి' అనే మాటకు "శిక్ష విధించుట, న్యాయపరిపాలన, నీతివిద్య, అర్థశాస్త్రము (కామందకీయాది)"[60] అనే అర్థాలున్నాయి. లోక పరిపాలన ఎలా జరగాలో తెలపేది దండనీతిశాస్త్రం. ప్రాచీన కాలంలో విద్యార్థులంతా దీన్ని తప్పకుండా నేర్చుకొనేవారు. ముఖ్యంగా రాజకుమారులు దండనీతిని తెలుసుకొని ఉండాలి. లేకపోతే అతనికి పరిపాలన చేయడం కష్టం అవుతుంది.

శాంతిపర్వంలో ఈ దండోత్పత్తి ఎలా జరిగిందో వివరంగా ఒక కథరూపంలో చెప్పబడింది. అంగదేశపు రాజు వసుహోముడు ఒకసారి అతని భార్యతో కలిసి 'మంజుపృష్ఠం' అనే మంచుకొండ శృంగం మీదికి పోయాడు. అక్కడ కొన్నాళ్ళు ఉన్నాడు. తన ప్రవర్తనతో అక్కడి మునుల ఆదరాభిమానాలు వసుహోముడు పొందాడు. ఒకరోజు మాంధాత ఆ వసుహోముడి దగ్గరకు వచ్చి వినయంగా మ్రొక్కాడు.

అతడికి రాజు అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి ఏం పనిమీద వచ్చారు? అని అడిగాడు. దండనీతి శాస్త్రాన్ని తుదముట్ట వివరంగా వినాలనే కోరికతో నీ అండ చేరాను అని మాంధాత అన్నాడు. అప్పుడు వసుహోముడు అతనితో దండోత్పత్తి గురించి ఇలా చెప్పాడు.

బ్రహ్మ ఒక యాగం చేయతలపెట్టి తనతో దీటైన ఋత్విజుడి కోసం గాలించాడు. ఎక్కడా అట్లాంటివాడే కంటబడలేదు. తానే స్వయంగా వెయ్యేళ్ళు గర్భం దరించి తుమ్మగా, ఆ గర్భం బయటపడింది. తుమ్ము కారణంగా పుట్టిన వాడవటం వల్ల అతిడికి 'క్షుతుడు' అని పేరుపెట్టాడు. ఆ 'క్షుతప్రజాపతి' ఋత్విజుడుగా బ్రహ్మ యాగం చేస్తున్నాడు. ఆ దండం ఇష్టం వచ్చినట్లు నడుచుకొనేది కాబట్టి కనబడకుండా పోయింది. దానివల్ల ఏ పని చేయవచ్చు? ఏ పని చేయకూడదు? అనే జ్ఞానం శూన్యమైంది. అందువల్ల ప్రజలంతా కలవరపడ్డారు. మర్యాద మంటగలిసింది. బ్రహ్మ విష్ణువును ఆశ్రయించాడు.

బ్రహ్మ, విష్ణువును ప్రార్థించి అతడిని శివుడి దగ్గరకు తీసికొనిపోయి ఇలా అంటాడు. ఇతడు నీ మిత్రుడు. అతడు ఏ పని మీద వచ్చాడో చెపుతాడు. దయతో వినవలసింది అంటూ దండనీతి విధానం అంతా చెవికి ఇంపుగా వివరిస్తాడు[61]. ఈ విధంగా విష్ణువును ఆసరాగా చేసుకొని బ్రహ్మ, దండనీతి మాయమవటం వల్ల ప్రపంచం ఎట్లా అల్లకల్లోలమైందో శివుడికి వివరించి చెప్పాడు. ఆ మాటలు శివుడికి మనస్కరించాయి. వెంటనే తన మహిమతో దండాన్ని కల్పించాడు. ఆ దండానికి తానే ఆధారం అయ్యాడు[62].

ఈ విధంగా ప్రయత్నించి దండనీతిని, పద్దెనిమిది రకాలైన విద్యలను శివుడు, విష్ణువుకు అప్పగించాడు. ఆ బ్రహ్మకు తుమ్ము పుట్టింది క్షుతబ్రహ్మను పుట్టించాడు. దండనీతి ప్రపంచంలో వ్యాపించింది. ప్రపంచం మొత్తం సంతోషించింది. బ్రహ్మదేవుడి యాగం శాస్త్రోక్తంగా జరిగింది.

ఈ దండనీతిని విష్ణువు అంగిరసుడికీ, అతడు దేవేంద్రుడికీ, మరీచికి, మరీచి భృగు మహర్షికి తెలియజెప్పారు. ఇట్లా ఈ దండనీతిశాస్త్రం అన్ని లోకాల్లో విస్తరించింది[63]. ఈ కథను బట్టి దండనీతి అనేది పరిపాలనకు సంబంధించిన శాస్త్రమని, అది బ్రహ్మ ప్రేరణతో శివుడి అనుగ్రహం వల్ల పుట్టి క్రమంగా లోకంలో వ్యాపించిందని తెలుస్తుంది. దండనీతి మొదట మౌఖికంగా ఉండి తర్వాత శాస్త్రరూపాన్ని పొందిందని ఈ కథ వల్ల తెలుస్తున్నది.

2.1.19. శకున విద్య:-

ప్రాచీన కాలపు పాఠ్యాంశంలో భాగంగా శకున విద్యని కూడా అధ్యయనం చేసేవారు. ప్రయాణ సమయాల్లో ఏదైనా పనిని ప్రారంభించేటప్పుడు, వివాహాది కార్యక్రమాల్లో, జననమరణాది విషయాల్లో శకునాలను చూడటం తెలుగువారి ఆనవాయితి. అందుకే తెలుగు ప్రాంతంలో, 'బిడ్డొచ్చిన వేళ గొడ్డొచ్చిన

వేళ' అనే సామెత ఉంది. ఇంటికి కొత్తకోడలు వచ్చే సమయంలోనూ, కొత్త పశువుల్ని తోలుకొచ్చే సమయంలోనూ శకునాలను చూస్తారు.

కొఱవి గోపరాజు 'సింహాసనద్వాత్రింశిక'లో తెలుగువారు సామాన్యంగా భావించే దుశ్శకునాలను చెప్పాడు. క్రింది పద్యాన్ని పరిశీలిస్తే ఆనాటి ప్రజలు ఏయే శకునాలను నమ్మేవారో తెలుస్తున్నది.

"పిల్లులు పోరాడే బల్లి యూరక త్రుళ్ళె / దమ్మళి పొడసూపెఁ దుమ్మి రెదురఁ
దొఱఁగువోయినలేఁగ కొఱలుచు నొక కుఱ్ఱి / పఱతెంచెఁ గ్రంపపై నఱచెఁ గాకి
యులుమఁ డొక్కుఁడు నూనె తలతోడనేతెంచె / మైలచీరల చాకి మ్రోలనెదిరెఁ
గాకియును గొరవంకుయును ఱెక్కలపోతు / నేటిరింతయు దాఁటె నెడమదిశకు
బైట వెవుదప్పఁ బాలగుమ్మయుఁ బాఱె / నొంటి పాటఁ బాఁడికంటి వీచె
నెలుఁగు చేసెఁ బెద్దపులుఁగు పామటు దోఁచె / దబ్బి బొబ్బలిడియె నుబ్బులడర"[64]

పిల్లులు పోరాడటం, బల్లి పలుకుట, తంబళివాడు కనబడుట, ఎదురుగా తుమ్మటం, దూడను పోగొట్టుకున్న ఆవు అరవటం, కంప మీది కాకి అరచుట, కుష్ఠురోగి తలకు నూనె రాసుకొని వచ్చుట, మైలబట్టలతో చాకలివాడు ఎదురవుట, కాకి, గోరువంక, భరద్వాజపక్షి ఎడమవైపుకి వెళ్ళుట, పాలపిట్ట, భరద్వాజపక్షి, పైడికంటి, గుడ్లగూబ కూయుట, పాము ఎదురవుట మదలైన వాటిని దశ్శకునాలుగా నాటి ప్రజలు నమ్మినట్లు గోపరాజు ఇందులో తెలియజేశాడు.

2.1.20. వస్త్ర తయారీ విద్య:–

వస్త్రాలను నేయడం వృత్తివిద్యల్లో ఒకటి. ఈ నేతపరిశ్రమ ప్రాచీన కాలంలో గ్రామీణ ప్రజలకు ముఖ్యమైన జీవనాధారం. ఈ వృత్తివిద్యను గురువులు పాఠశాలల్లో బోధించేవారు కాదు. తల్లిదండ్రులే గురువులు. గృహాలయమే విద్యాలయం. విద్యార్థులు తల్లిదండ్రుల నుండి ఈ వృత్తివిద్యను నేర్చుకొనేవారు. కాబట్టి ఇది అనిబద్ధ విద్య.

కొఱవి గోపరాజు 'సింహాసన ద్వాత్రింశిక'లో, విక్రమార్కుని అంతఃపుర స్త్రీలు చాలా రకాల వస్త్రాలను ధరించేవారని, 49 రకాలైన పట్టునూలు వస్త్రవిశేషాలను తెలియజేశాడు. పాల్కురికి సోమనాథుడు 'బసవపురాణం'లో 56 రకాలైన పట్టు–నూలు వస్త్రాలను గురించి పేర్కొన్నాడు. వాటిలో కొన్నింటిని గోపరాజు కూడా పేర్కొన్నాడు. ఇద్దరూ చెప్పినందువల్ల ఆనాడు కాకతీయ రాజ్యంలో చేనేత పరిశ్రమ అభివృద్ధిదశలో ఉండేదని తెలుస్తున్నది.

కొఱవి గోపరాజు వివరించిన వస్త్రవిశేషాలు క్రింది విధంగా ఉన్నాయి. "చందన గంధులు, చందనకావులు, పట్టెడ కావులు, చెంగావులు, కదంబకావులు, కరకంచులు, బొమ్మంచులు, ముడుగు బొమ్మంచులు, ముయ్యంచులు, చిలుకచాళ్లు, వేటచాళ్ళు, నిండువన్నెలు, ఉఱుతచాఱల వన్నెలు, కంటికి వన్నెలు, పుప్పొడి వన్నెలు, రుద్రాక్ష వన్నెలు, నాగబంధములు, పూజాబంధములు, జలపంజరములు, కామవరంబులు, సూరవరంబులు, తారామండలంబులు, హంసావళులు, హరిణావళులు, తురగావళులు, గజావళులు, సింహావళులు, ద్రౌపదీ స్వయంవరంబులు, లక్షమీవిలాసంబులు, మదన విలాసంబులు, వసంత విలాసంబులు, రత్నకీలితంబులు, రాయశృంగారంబులు, కనకదండెలు, గచ్చిలంబులు, కర్పూరగంధులు, పారువంపుగంధులు, శ్రీతోపులు, శ్రీరామతోపులు, శ్రీకృష్ణవిలాసంబులు, జీబులు, సుగిపుట్టంబులు, సన్నవలిపంబులు, వెలిపట్టులు, హొంబట్టు, పులిగోరుపట్టు, ఉదయరాగపట్టు, నేత్రపట్టు"[65] మొదలైన వస్త్రాల రకాలు ఆనాడు ఉండేవని గోపరాజు తెలిపాడు.

పాల్కురికి సోమన గారి 'బసవపురాణం'లో నాటి వస్త్రాల విశేషాలు క్రిందివిధంగా ప్రస్తావించబడ్డాయి.

"వెంజావళియు జయరంజియు మంచు
పుంజంబు మణిపట్టు భూతిలకంబు
శ్రీవన్నియము మహాచీని చీనియును
భావజతిలకంబు పచ్చనిపట్టు
రాయ శేఖరమును రాజవల్లభము
వాయు మేఘము గజవాళంబు గండ
వడము గావులు సరిపట్టును హంస
పడియు వీణావళి పల్లడదట్టి
వారణాసియు జీకు వాయుఁ గెందొగరు
గౌరిగనయమును క్షీరోదకంబు
పట్టును రత్నంబుపట్టును సంకు
పట్టును మరకతపట్టు పొంబట్టు
నెఱపట్టు వెలిపట్టు నేత్రంబుపట్టు
మఱి తవరాజంబు మాందోళిరవియుఁ
జంద్రాతపంబును సాంధ్యరాగంబు
ఇంద్రనీలంబు మహేంద్రభూషణము
సన్ననడంచును శరధియు మేఘు

వన్నెయు రుద్రాక్షవన్నె కాభోజి
పులిగోరుపుట్టును భుపట్టు రుద్ర
తిలకంబు సరిపట్టు మలయజసిరియు
గొలనిమేఘము గజావళి హయావళియు
వలిపంబు సరి గమ్మితెలుపు దివ్యాంబ
రంబును నుదయరాంబు దేవాంబ
రంబు పొత్తియు గుజరాష్ట్రంపు పట్టు----"[66]

పై ఉదాహరణల్నిబట్టి ఆనాడు వస్త్రతయారీ పరిశ్రమ అభివృద్ధి దశలో ఉండేదని, చేనేతవృత్తి ఎంతో మందికి జీవనాధారమైందని తెలుస్తుంది. ఇంతటి విశేష ప్రతిభ కలవారు ఆనాడు మరే వృత్తిలోనూ కనిపించరు. విదేశీయుల్ని సైతం భారతీయ చేనేతకారులు తమ వస్త్రాలద్వారా ఆకట్టుకున్నారు. నిరుద్యోగం అనేది ఆనాడు చేనేతవృత్తిలో చాలా తక్కువగా ఉండేది.

సురవరం ప్రతాపరెడ్డిగారు 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'లో తూర్పు చాళుక్య యుగంలో ఏయే ప్రదేశాల్లో వస్త్రాలు తయారు అయ్యాయో, ఎక్కటి నుండి వాటిని తెప్పించుకునేవారో వివరించారు. చాళుక్య సోమేశ్వరుడి 'అభిలషితార్థ చింతామణి'లో వీటి ప్రస్తావన ఉన్నట్లు ప్రతాపరెడ్డిగారు తెలియజేశారు. "ఆ కాలమందు రాజుల వద్ద వస్త్రాల భాండారములు ఉండెను. వాటిపై ఒక అధికారి నియుక్తుడై యుండెను. నానా ప్రాంతములందు సిద్ధమయిన వస్త్రములను తెప్పించెడివారు. పోహలపురము, చీరపల్లి, అవంతి, నాగపట్టణము, పాండ్యదేశము, అలికాకరము, సింహళము, గోపాకము, సురాపురము (ఉత్తర సర్కారులోని సురాపురము అనునది;) గుంజణము, మూలస్థానము (ముల్టాన్?) తొండిదేశము (తుండీరము–మద్రాసుకు దక్షిణ ప్రాంతము), పంచపట్టణము, మహాచీనము (చైనా), కుళింగము, వంగము ఈ ప్రాంతాల నుండి వస్త్రములు తెప్పించెడివారు. నానావిధమగు రంగుల బట్టుడెడివి. మంజిష్ఠ, లక్క, కౌసుంభ (రంగుపూలు), సింధూర, హరిద్ర, నీలి మున్నగు రంగులందు ముఖ్యమైనవి. చీరలు, ఘట్టకములు, సెల్లాలు, దుప్పట్లు, అంగీలు (అంగికాః), ఉష్ణీషములు, టోపీలు (టోపికాః), వివిధ వస్తువులు వాడుకలో ఉండెను"[67].

గౌరన 'నవనాధచరిత్ర'లో ఆనాడు చేనేతపరిశ్రమ ఎంత అభివృద్ధి దశలో ఉండేదో ఈ విధంగా సూచించాడు. "అరుదైన పసిడి హంసావళివన్నె; జిగిజిగి ధగధగయను చీనాంబరంబు"[68].

కాకతీయుల కాలంనాటికి ఆంధ్రదేశంలో వస్త్రపరిశ్రమ ఉన్నత స్థితిలో ఉండేదని పాహియాన్, హుయాన్ త్సాంగ్ వంటి విదేశీ యాత్రికుల రచనల వల్ల తెలుస్తున్నది. నాడు తెలుగుదేశంలో మిగిలిన

పరిశ్రమల కంటె వస్త్రపరిశ్రమే అగ్రస్థానంలో ఉండేది. ప్రతి ఇంటిలోనూ రాట్నం ఆడించేవారు. "కదురాడిన, కవ్వమాడిన యింటికి దరిద్రమెన్నడునూ ఉండదని పెద్దలనెడివారు. శూద్రులలో ప్రతి స్త్రీయు రాట్నముపై వడుకుటను నేర్చియుండెననవచ్చును. బీదలు తమ యవసరములకు సరిపోగా మిగిలిన దారపు కండెలను అమ్ముకొంటూ వుండిరి. అవి వస్త్రాలుగా సిద్ధమై తూర్పు పడమటి దేశదేశాంతరాల కెగుమతి యవుతుండెను"[69]. శ్రీనాథుడు పల్నాటి సీమలో పర్యటిస్తూ, ఆ సీమలో 'రంభకూడా యేకులెవడకున్' అనే చాటువును చెప్పాడు.

2.1.21. అద్దకపు విద్య:–

నేత పరిశ్రమకు అనుబంధంగా ఆనాడు అద్దకపు పరిశ్రమ కూడా అభివృద్ధి చెంది ఉండేది. రకరకాలైన లేపనాలతో వస్త్రాలకు రంగులు అద్దేవారు. నేటికీ పల్లెల్లో ఈ పరిశ్రమ మనకు కనిపిస్తుంది. పైన కొఱవి గోపరాజు చెప్పిన వస్త్రవిశేషాలకు సురవరం ప్రతాపరెడ్డిగారు క్రింది వివరణ ఇచ్చారు. "ఇన్ని పేర్లుకల అంచులను గురించి చెప్పునప్పుడు రంగుల పరిశ్రమ విశేషముగా నుండెననుట స్పష్టమే. చెంగావి అనునది లేతవన్నెయై యుండును. కరకంచు అనుటచే కరక్కాయ చెక్కతె వన్నె వేయుచుండిరేమో! (ఆ తర్వాత సూ.రా. నిఘంటువు జూడగా అందు "కరక్కాయ నీటితో వ్రాసిన అంచు" అని యుండుట గాంచితిని). బొమ్మంచు అనిన తెల్లచీరల యెర్ర అంచు. చిలుకచాళ్ళు అనుటచే చిలుక పచ్చనివన్నె వాడిరనవచ్చును. ఉఱత యన ఉడుత, దాని చారల వంటి వన్నెలుండెను. రుద్రాక్ష వన్నె యిప్పటికినీ వాడుకలో కలదు. నీలిమందు చేయుట చాలా ప్రాచీన పరిశ్రమ. ఆ రంగు అన్ని రంగుల కన్న మిన్నయై యుండెను. నీలిరంగు హిందువులే కనిపెట్టిరని దానికి ఇండిగో అని పాశ్చాత్యులు పేరు పెట్టిరి. మంజిష్ఠ, లక్క, పసుపు మున్నగునవి రంగులు చేయుటకు వాడుతూ వుండిరి. పట్టులో నీలిపట్టు అనుటచే దానికి నీలిరంగిచ్చి రన్నమాట. హుంబట్టు అనుటచే జరీ అంచులుకల పట్టు అని యర్థమగును"[70]. విద్య అంటే కేవలం పాఠశాలల్లో నేర్చుకునేదే కాదు. కోటివిద్యలు కూటి కొరకే అన్నారు. కూడు పెట్టే ఏ జీవనాధారమైనా ఉద్యోగమే. ఆ వృత్తికి సంబంధించిన జ్ఞానం కూడా విద్యయే. దీనివల్లనే ప్రాచీనులు విద్యను నిబద్ధవిద్య, అనిబద్ధవిద్య అని రెండుగా విభజించారు. వ్యవసాయం, నేతపరిశ్రమ వంటి వృత్తివిద్యలు అనిబద్ధవిద్యల క్రిందికి వస్తాయి.

2.1.22. చోర విద్య / చోరకళ

ప్రాచీనులు నేర్చుకున్న చతుష్షష్టి కళల్లో ఈ చోరకళ కూడా ఒకటి. దొంగతనం ఎలా చేయాలనేది కొన్ని జాతులవారు నేర్చుకొని తర్వాత దొంగతనానికి వెళ్ళేవారు. అయితే దీనికి పాఠ్య ప్రణాళికలు,

గురుకులాలు ఉండవు. ఆ విద్యలో అనుభవజ్ఞులైన తమ పెద్దల నుండి, తమ కుల నాయకుల నుండి మిగతావారు నేర్చుకునేవారు. నేర్చుకొనేటప్పుడు దొంగతనం ఒక విద్య అవుతుంది. దాన్ని ప్రయోగపూర్వకంగా ఆచరించినపుడు కళ అవుతుంది. అందువల్ల దొంగతనం విద్య, కళ రెండు రూపాల్నీ కలిగివున్నది.

ఈ చోరకళ గురించి సంస్కృత కావ్యాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అందులోనూ శూద్రకుని 'మృచ్ఛకటికమ్' నాటకంలో 'శర్విలకుడు' అనే పాత్ర చోరకళలో ఆరితేరినవాడు. ఈ పాత్ర చిత్రణను పరిశీలిస్తే నాడు చోరకళ ఏవిధంగా సమాజంలో క్రియాశీలంగా మారిందో తెలుసుకోవచ్చు.

'మృచ్ఛకటికమ్' లోని తృతీయాంకంలో శర్విలకుడి పాత్ర ప్రవేశిస్తుంది. అతడు చాలా గర్వంగా, తనకు చోరవిద్యలో గల పాండిత్యాన్ని ఈ విధంగా ప్రకటిస్తాడు.

"కృత్వా శరీర పరిణాహ సుఖప్రవేశం
శిక్షా బలేన చ బలేన చ కర్మమార్గమ్!
గచ్ఛామి భూమి పరిసర్పణ ఘృష్ట పార్శ్వ
నిర్మ్యచ్యమాన ఇవ జీర్ణతనుర్భుజంగః !!"[71]

నేను చోరవిద్యను అభ్యసించాను. ఆ నేర్పుతోనూ, నా భుజబలంతోనూ ఇండ్ల గోడలకి కన్నం వేస్తాను. నా శరీరవైశాల్యానికి సరిపోయేటట్టు, సుఖంగా ప్రవేశించడానికీ, నిర్గమించడానికీ వీలుగా ఉండేట్టు కన్నం వేస్తాను. ఆ కన్నంలో పాకుతూ వెళ్ళడం, రావడం వల్ల నా శరీరం రెండుప్రక్కలా దోక్కుపోయింది. అయితేనేమి కుబుసం విడిచి బయటకు వస్తున్న ముసలి పాములాగా ఈ కన్నం నుంచి మెల్లగా పాకుతూ నేను రాకపోకలు సాగిస్తాను అని శర్విలకుడు విదూషకుడితో అంటాడు.

శర్వలికుడు ఇంకా తన చోరవిద్యాకౌశలాన్ని గురించి క్రిందివిధంగా విదూషకుడితో అంటాడు. రాజోద్యోగులైన రక్షకభటులు ఎప్పుడూ నా కదలికల మీద ఒక కన్ను వేసే ఉంచుతారు. నేనేమో ఇళ్ళు దోచుకోవడంలో ప్రసిద్ధికెక్కిన ఏకైకవీరుణ్ణి. కానీ ఇప్పుడు ఈ రాత్రి నన్ను కన్నతల్లి లాగా కొంగునదాచి కాపాడుతోంది. ఎందుకంటే, చీకట్లు దట్టంగా వ్యాపించి వస్తువులన్నీ తమ ఉనికిని (భావం) కోల్పోయాయి. ఎవరి కంటికీ ఏదీ కనిపించడం లేదు. ఇలా చీకటి కొంగును కప్పి నన్ను దాస్తోంది కన్నతల్లిలాగా ఈ రేయి అని అంటాడు.

ఉద్యోగం కన్నా దొంగతనమే గొప్పవృత్తి అని శర్విలకుడి అభిప్రాయం. "ఎందుకంటే, యజమానులు గాఢనిద్రలో ఉండగా వారి సొమ్ములను అపహరించడం జరుగుతుంది. కనుక ఈ

దొంగతనం పరమనీచం అంటారు. అననివ్వండి గాక. ఇందులో ఉన్న సుగుణాలు ఏమిటంటే – నింద మోయవలసి వచ్చినా అది స్వాయత్తమై ఉంటుంది. నా అకృత్యానికి నేనే కర్తను గనుక ఒక వేళ దొరికిపోయి నిందపడవలసి వచ్చినా అది స్వయంకృతమేనన్న సంతృప్తి ఉంటుంది. ఇవి నయం కాదూ! కానీ సేవకవృత్తిలో ఈ స్వాయత్తత ఉండదు. నువ్వు చెయ్యని తప్పులకి కూడా నువ్వు నిందమోయాల్సి వస్తుంది. ఎవరో చేసిన, చెయ్యని నేరాలకు నువ్వు మాటపడవలసి వస్తుంది. అంతేకాదు, సేవకుడు అడుగడుగునా దండాలు పెడుతూ కూర్చోవాలి. నేను ఈ వృత్తిలో ఇంతవరకూ ఎవడికీ నమస్కరించలేదు. తలవంచలేదు. కాబట్టి సేవక వృత్తికన్నా చోరకవృత్తి ఉత్తమం"[72]. అని ఉద్యోగం కన్నా తాను నేర్చిన చోరవృత్తియే గొప్పదని అంటాడు.

దొంగతనం ఎలా చేయాలో? ఎలా చేయకూడదో? అని తనకు తెలిసిన పద్ధతులన్నీ శర్వీలకుడు వివరించాడు. అతడు చోరవిద్యలో ఎంతటి అనుభవం సంపాదించాడో మనకు ఈ సందర్భం వల్ల తెలుస్తుంది. గోడకు కన్నం వేయాలంటే చూసుకోవాలసిన ఆనుపానుల గురించి తెలిపాడు. గోడకి తేమ ఎక్కిన చోటు అనుకూలం. దీనివల్ల కన్నం వేసేటప్పుడు చప్పుడు కాదు. ఏ రకంగానైనా సరే చప్పుడు కాని చోటే కన్నం వేయాలి. అందరికీ కనిపించేలాగా కన్నం వేయకూడదు. మరుగుగా ఉన్నచోటనే మంచిది. ఈ కన్నం మరీ పెద్దదిగానూ ఉండకూడదు. ఒక్కొక్క ఇటుకనూ మెల్లగా తీస్తూ ఉంటూ ఉంటే కట్టుబడి సున్నం పోయి గోడ బలహీనపడుతుంది. అయితే ఆడవాళ్ళు ఉండే గదిలోకి మాత్రం వెళ్ళకూడదు. ఎందుకంటే వాళ్ళు చాలా మెలకువగా ఉంటారు కాబట్టి. అలాగే ఇనప్పెట్టి ఉండే గదికే కన్నం వేసేలా జాగ్రత్తపడాలి. లేకపోతే పడిన శ్రమ అంతా వృధా అయిపోతుంది. కాబట్టి ముందూవెనుకా చూసుకొని గోడకు కన్నం వేయాలి అని శర్వలికుడు తన చోరకళా పాండిత్యాన్ని ప్రదర్శిస్తాడు. ఈ సన్నివేశాన్ని బట్టి నాటి సమాజంలో శర్వలికుడు వంటి వ్యక్తులు దొంగతనం చేయడంలో మంచి నేర్పు సంపాదించి దోపిడీలు చేసేవారని తెలుస్తుంది.

'సింహాసన ద్వాత్రింశిక'లో, ఆ కాలంలో చోరులు ఎలాంటి వేషాలు ధరించేవారో, వెంట ఏయే వస్తువులు తీసుకొనిపోయేవారో గోపరాజు తెలియచేశాడు. 'మృచ్ఛకటికమ్'లోని శర్వీలకుడు కూడా దాదాపు ఈ పద్ధతినే అనుసరించాడు.

"గాలి చీరయు నొల్కి బూడిద గ్రద్దగోరును గొంకియుం
గోలయు నెలుగార్చు పుర్వులక్రోవి ముండుల బంతియున్
మైల మందుల కొయ్యకత్తెర మాఱుగన్నపుఁగత్తియు
న్నీలిదిండుల నల్లపూఁతయు నేర్పుతోడుగ మ్రుచ్చలున్"[73]

గాలిచీర, బూడిద, గ్రద్దగోరు, కొంకి, కర్ర, పుర్రెలదండ, ముళ్ళబంతి, కొయ్యకత్తెర, కత్తి, నీలిదిండులు, నల్లపూత మొదలైనవి నాటి చోరులు తమ వెంట తీసుకవెళ్ళే వస్తువులు. అవసరాన్ని బట్టి, సందర్భాన్నిబట్టి వీటిని ఉపయోగించేవారు. చప్పుళ్ళువింటూ, తమ చప్పుళ్ళను అదుపుచేసుకొంటూ మెల్లగా వెళ్ళి సందుల్లో కూడా ఎవరూ లేకుండా చూసుకొని, ఊళ్ళో వాళ్లంతా నిద్రపోయిన తర్వాత దొంగలు దోపిడికి బయలుదేరేవారు.

"మాటలు తగ్గేంత వరకు ఒకచోట కదలకుండా మ్రొద్దుల లాగా మెదలకుండా ఉండి, లోపల ఏదైనా అలికిడి అయినప్పుడు జాగ్రత్తగా కోటమలుపు దాటి, బాగా ఆస్తి ఉన్న వారింట్లో దూరి, వారిపై బూడిద చల్లి, మత్తు మందు చల్లి, అంతఃపురాన్ని కత్తిరించినట్లు పెద్ద గొయ్యి తవ్వి, బాగా కొవ్వుపట్టిన పుర్రెల్ని విడిచిపెట్టి, దీపాలు ఆర్చి, కంటి వెలుతురుకు కనిపించకుండా చెలికత్తెల వెనుకగా ఎలాంటి చప్పుడు చేయకుండా ఒక చోరుడు అంతఃపురంలోకి ప్రవేశించాడు"[74]. నాటి చోరులు పై విధంగా సమాయత్తమై దోపిడికి వెళ్ళేవారని, వారు చోరవిద్యలో మంచి అనుభవాన్ని పొంది ఉండేవారని తెలుస్తుంది.

దొంగతనం చేయడం వల్ల ఎదురయ్యే సమస్యలు కూడా 'సింహాసనద్వాత్రింశిక'లో కనిపిస్తున్నాయి. దొంగలు దోపిడీ చేయటానికి ఎన్ని పాట్లు పడ్డారో గోపరాజు ఈవిధంగా వర్ణించాడు. "ఊరిలో నూర్పులు చూసుకొని, ప్రజలంతా నిద్రించే సమయం చూసి, దొంగతనం చేయటానికి సిద్ధపడి, నీటిలోని చేపను గాలం వేసి లాగిన్లు దొంగలు బంగారు ఆభరణాలన్నీ దోచుకున్నారు. దోచుకున్న వస్తువులన్నీ కన్నం అవతలకి అందించేటప్పుడు, పూర్వం స్వయంవరం కోసమని దాచిపెట్టిన నిడుపైన బంగారం ఆభరణాన్ని తీసుకొని కన్నందాటి పోయి, తోటి సంగడికాళ్ళతో కూడి అందరూ ఉత్సాహంతో దూరంగా పోయి సొమ్ములను ఆసక్తిగా చూస్తున్నారు. అదే సమయంలో ఊళ్ళో దొంగలుపడ్డారని పెద్ద రంతి పుట్టింది. భటులు వెంటపడుతూ నలుదిక్కులూ చూస్తూ అప్రమత్తులై వస్తున్నారు. ఆ కలకలాన్ని విని ప్రాణం మీద తీపితో దోచిన నగలన్నీ దేవి ఆలయంలో పడవేసి వెళ్ళిపోయారు"[75].

'మృచ్ఛకటికమ్' లోని శర్విలకుడు కూడా పై చెప్పిన అనుభవాలన్నీ పొందినవాడే. అందుకే అతడు చోరకళలో మంచి పాండిత్యాన్ని సంపాదించాడు. తనకి దొంగతనం వల్ల సొమ్ము దొరక్కపోయినా ఫరవాలేదు. తనకు చెడ్డపేరు వచ్చినా ఫరవాలేదు, ఊళ్ళో వాళ్ళంతా తన చోరకళను చూసి మెచ్చుకోవాలి అన్నది అతడి ఆశయం. శర్విలకుడు, చారుదత్తుడి ఇంటికి కన్నం వేసి, ఇంట్లో ఉన్న నగలన్నీ దోచుకోపోతాడు. తెల్లవారి నిద్రలేచిన చారుదత్తుడు నగలు పోయినందుకు బాధపడేదు. ఆ దొంగ ఎంత అందంగా గోడకు కన్నంవేశాడు. అతడు కన్నం వేయడంలో ఎంత కళాకౌశలాన్ని ప్రదర్శించాడు అని ఆనందిస్తాడు.

"శర్విలకుడు ఎంతటి తెలివైవాడంటే, చివరికి జందెంతో కూడా గోడ కన్నాలకు కొలతలు వేసుకునేవాడు. ఆ కొలతల్ని బట్టి గోడను పగులగొట్టేవాడు. ఇంకా జందెంతో గొలుసులు మొదలైన భూషణాల కొక్కేలను దీనితో ఊడదియ్యవచ్చు. తలుపు గడియలను దీనితో తొలగించవచ్చు. పాములు, తేళ్ళు కుడితే విషం శరీరమంతా పాకకుండా దీనితో బిగించి కట్టుకోవచ్చు. ఇన్ని విధాలుగా ఈ జందెం మా లాంటి దొంగలకు విశేషంగా ఉపకరిస్తుంది అంటాడు"[76]. గదిలో ఉన్న దీపపుస్తంభం దొంగకు ఎలాగ ఉపయోగపడిందో శూద్రకుడు క్రిందివిధంగా వర్ణించాడు.

"శిఖా ప్రదీపస్య సువర్ణ పింజరా మహీతలే సంధిముఖేన నిర్గతా!
విభాతి పర్యంత తమస్సమావృతా సువర్ణరేఖేవ కషే నివేశితా!!"[77]

గదిలో ఉన్న దీపపు వెలుగు రేఖ ఈ కన్నపు సందు నుంచి ఇవతలి చీకటి నేలపైకి ప్రసరించింది. చుట్టూ చీకటి, మధ్యలో సన్నని కాంతి రేఖ. ఇది – నల్లని గీటురాయి మీద పెట్టిన బంగారు గీటులాగా ఉంది అని శర్విలకుడు అంటాడు. ఈ చోరకళ చెడ్డది, పాపము అని తెలిసి కూడా తాను చేస్తున్నందుకు బాధపడతాడు. చేసేది దొంగతనమే అయినా, వ్యక్తిగతంగా శర్విలకుడు మంచివాడు. దీన్నిబట్టి ప్రతివిషయం గమనించే నేర్పు దొంగకు ఉండాలని తెలుస్తుంది.

పైవిధంగా పొట్టకూటి కోసం కొందరు దొంగతనాలు నేర్చుకున్నట్లు, దానికి కావలసిన అనుభవం వారు సంపాదించినట్లు తెలుస్తున్నది. కొందరు నేరప్రవృత్తిలో కూడా చోరులుగా మారి ఉండవచ్చు.

2.1.23. మల్లయుద్ధ విద్య:–

భీముడు మల్లయుద్ధంలో మంచి ప్రావీణ్యం కలవాడు. భీముడికి సమవుజ్జీలు బకాసురుడు, దుర్యోధనుడు, కీచకుడు, జరాసంధుడు మొదలైనవారు. వీరు ఐదుగురు ఒకే సమయంలో, ఒకే నక్షత్రంలో జన్మించారు. వీరిలో భీముడి చేతిలో మిగిలిన ఐదుగురు మరణించారు. భీముడు పై వారినందిరినీ మల్లయుద్ధంలోనే వధించాడు. దీనికి కారణం అతని శరీర సౌష్ఠవం, మల్లయుద్ధవిద్య ఉండటం.

మహాభారతాన్ని బట్టి, నాటి రాజకుమారులు అందరికీ మల్లయుద్ధవిద్య తప్పనిసరిగా నేర్పించేవారు. ఇదీ యుద్ధవిద్యల్లో ఒకభాగమే. కానీ మిగిలిన యుద్ధాలకీ, మల్లయుద్ధానికీ కొంత తేడా ఉంది. సాధారణ యుద్ధంలో ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ మంది వీరులు ఉండవచ్చు. కానీ మల్లయుద్ధంలో ఇద్దరు వీరుల మధ్య మాత్రమే పోరు జరుగుతుంది. సాధారణ యుద్ధంలో ఆయుధాల సహాయంతో యుద్ధం చేస్తారు. కానీ మల్లయుద్ధంలో భౌతికశరీరమే వారికి ఆయుధం.

ప్రాచీనకాలంలో రాజకుమారులు నేర్చిన ప్రత్యేకమైన విద్యల్లో ఇదీ ఒకటి. ఇది నిబద్ధవిద్య. దీనికి పాఠ్యప్రణాళిక, బోధన, సాధన మొదలైనవి ఉండేవి. విరాటపర్వంలో భీముడి మల్లయుద్ధ కౌశలాన్ని తిక్కన చాలా చక్కగా వర్ణించాడు. ఆ మల్లయుద్ధ ఘట్టం తిక్కన కవితలోని జాతివార్తా చమత్కారాలకు చక్కని నిదర్శనం. శ్రీ అనంత పద్మనాభరావు గారి మాటల్లో చెప్పాలంటే, "వ్యాసుడు శాస్త్రవిజ్ఞాని. తిక్కన అనుభవజ్ఞాని. మల్లయుద్ధ శాస్త్రమే కాక, తెలుగునాట ప్రవర్తిల్లే దేశీకుస్తీల పరిజ్ఞానం తిక్కనకు కరతలామలకం. భీమమల్లుల యుద్ధంలోని తెలుగుపేర్లు తెలియజెప్పాడు తిక్కన. ఇది జాతివార్త విశేషం"[78]. దీనికి కారణం తిక్కన కవి మాత్రమే కాదు. మంచి రాజనీతిజ్ఞుడు. యుద్ధతంత్రం తెలిసినవాడు.

విరాటపర్వంలో తిక్కన, భీమమల్లుల మల్లయుద్ధాన్ని ఇలా వర్ణించాడు.

"ఉపయతాయిలోఁదన కొదవినతోరహ / త్తము సూపి వేయక సమదవృత్తిఁ
బాసి క్రమ్మఱఁ జేరు బలువిడి వాఁడు పై / నడరిన జరగక యవని గ్రుంగి
నిలుచు నొత్తారువున వలచియప్పుడు / గొనిపోవు నవలీలఁ గూలనైచు
జళికి పట్టిస మను సన్నపువిన్నాణ / ములు దొరకొన్నను ముట్టగొనడు
కాలిదెసఁజొర వచ్చుట గానిపించి / యుడగు సీసానఁబట్టియు నుప్పళించుఁ
బోవ నిచ్చు మగుడ నేచి పోరఁజేరు / నెడల సరిసేయ నగుతడ వీకహత్తు"[79]

ఈ పద్యంలో మల్లయుద్ధ విశేషాలైన ఉపతాయి, తోరహత్తము, ఒత్తారవు, జళికి మొదలైన పద్ధతులను ఉపయోగిస్తూ భీముడు, మల్లుడితో యుద్ధం చేసినట్లు వర్ణించబడింది. ఈ ఉపతాయి మొదలైన మల్లయుద్ధ విశేషాల గురించి శ్రీ అనంతపద్మనాభరావు గారు ఆంధ్రమహాభారతవ్యాఖ్యానం (తి.తి.దే.)లో క్రిందివిధంగా వివరించారు.

1. ఉపతాయి :– మల్లయుద్ధంలో అపారమైన అనుభవజ్ఞానం, శాస్త్రవైదుష్యం.
2. తోరహత్తము :– ఒకచోట పిడికిలితో పట్టడం (పట్టి చరచకుండా వదలటం)
3. ఒత్తారవు :– మిక్కిలి అదమటం, సంపీడనం. దేహాన్ని గట్టిగా ఒడిసిపట్టడం.
4. జళికి :– రొమ్ము నడుమ పిడికిళ్ళతో కొట్టడం.
5. పట్టిసము :– మెడలు వంచి చేతులు భుజం మీద పెట్టి చరచటం.
6. సీసం :– కాళ్ళు చేతులు మెడ కదలకుండా బంధించటం.
7. ముష్టిబలుపు :– పిడికిలితో ఎదుటివారి చేతులను గట్టిగా పట్టి వారిని బలహీనపరచటం
8. మండిపెట్టుట :– ఒక కాలు నేల మీద, మరొక మోకాలు శత్రువు వీపు మీద పెట్టి నొక్కిపెట్టడం.
9. పెలుకుడి తాళము :– ఒక్క పెట్టున లాగి తాళం వలె యుద్ధం చేయటం, ఉక్కిరిబిక్కిరి ఆడకుండా చేయటం.
10. అప్పళించటం :– చరచటం, భుజాస్థాలనం.

11. విఱుచుట :– నడుము విరిగేటట్లు చేయటం, వికారంగా ఎముకలు విరిగేటట్లు చేయటం, ఓడించటం, చరిపటం, చేతులు వెనుకకు త్రిప్పికట్టడం, అడునుల కీళ్ళు విరిచివేయడం, శరీరం నుండి ఒక అంగాన్ని వేరు చేయడం మొదలైనవి[80].

పై వివరణను గమనిస్తే మహాభారత కాలానికే మల్లయుద్ధం ఎంతో ప్రాచుర్యాన్ని పొందిందని తెలుస్తున్నది. రాజకుమారులు దీన్ని తప్పనిసరిగా నేర్చుకునేవారు. కురువీరులకు ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు మల్లయుద్ధాన్ని నేర్పిన గురువులు. భీమ దుర్యోధనులకు బలరాముడు కూడా మల్లయుద్ధాన్ని నేర్పించాడు.

'కీచక వధ' ఘట్టంలో తిక్కన భీమకీచకుల మల్లయుద్ధాన్ని క్రిందివిధంగా వర్ణించాడు.

"తిగిచిన నడుగులు దెరలక యొండొరుఁ / గ్రమ్మఱఁ దిగుచుచుఁ గడిమి మెఱయఁ
బొడిచిన వెస బీఱు వోపక యొండొరు / నందంద పొడుచుచు నవనిఁ బెట్టి
యొత్తిన బెగ్గలం బొందక యొండొరు / బలువిడి నొత్తుచు నలవు మిగిలి
యడఁగంగఁ బొదివిన నడిచిపాటించుక / యును లేక వీఁక నొండొరుల నడిరి
యడఁగఁ బొదువుచు నలుక యంతంత కగ్గ
లించి యాయముల్ నొంచి దోర్లీల నెఱపి
యుల్లసిల్లిన స్రుక్క కొండొరుల రౌద్ర
వృత్తి నొంచు చొండొరులకు వెక్కసముగ."[81]

ఒకరిని ఒకరు లాగగా అడుగులు కదలకుండా గట్టిగా నిలబడుతున్నా నేర్పు మీర పరస్పరం లాగుతూ ఉండేవారు. ఒకరిని ఒకరు గడుసుగా పిడికిళ్ళతో పొడిచినా వెనుకాడక పరస్పరం అవే చోట్ల తిరిగి పొడుచుకుంటూ ఉండేవారు. ఒకరిని మరొకరు నేలమీద పడవేసి గట్టిగా ఒత్తినా భయపడక ఒకరినొకరు బలప్రయోగంతో ఒత్తుతూ ఉండేవారు. కోపం పెరిగి ఒకరి నొకరు లోబడేటట్లు క్రమ్మిపట్టుకున్నా లొంగుబాటు ఏమాత్రం లేకుండా పౌరుషంతో ఒకరినొకరు అణచుకొనటానికి యత్నించేవారు. కోపం అంతకంతకూ పెరుగుతూ ఉండగా విజృంభించి ఆయువు పట్టులను బాధించి భుజబలాన్ని ప్రదర్శించి పొంగిపోయేవారు. ఎన్ని విధాలైనా ఒకరికొకరు తగ్గేవారు కాదు. ఒక్కొక్కరిలో ఆయా సమయాల్లో కలిగే రౌద్రరస మనఃప్రవృత్తుల చేత ఇరువురూ ఒకరికి మరొకరు అసాధ్యులై పోరాడేవారు. ఈ సందర్భాన్నిబట్టి భీమకీచకులు ఇరువురూ మల్లయుద్ధవిద్యలో ఆరితేరినవారని తెలుస్తున్నది.

అరణ్యపర్వంలో 'కిమ్మీరవధ' ఘట్టంలో కూడా భీముడు మల్లయుద్ధంలోనే కిమ్మీరుడు అనే రాక్షసుడిని సంహరించాడు. ఈ సందర్భాన్ని నన్నయ ఇలా వర్ణించాడు.

"బక హిడింబులు హతులైనఁ బనవి పనవి / య ఱచి శోకింపఁ గానక యమపురమున

కరిగి తక్కట రాక్షస!' యనుచుఁ దెరువు / వాయఁ బావని ద త్కళేబరమువైచె"[82]

బకుడు, హిడింబుడు చనిపోయారని మిక్కిలి దుఃఖించి ఓ రాక్షసుడా! నీవు కూడా వారిని కలిసికొనటానికి నరకానికి పోయావు కదా! అని భీముడు కీచకుడి శవాన్ని దూరంగా పారవేశాడు. వాళ్ళిద్దరూ మొదట చెట్లతో కొట్టుకున్నారు. దగ్గరలోని చెట్లన్నీ నశించిన తర్వాత రాళ్ళతో కొట్టుకున్నారు. దగ్గరలోని చెట్లన్నీ నశించిన తర్వాత రాళ్ళతో కొట్టుకున్నారు. అప్పుడు కిమ్మీరుడు రాహువు, సూర్యుడిని పట్టుకొన్నట్లు భీముడిని పట్టుకున్నాడు. భీముడు వాడిని బలహీనుడిగా గుర్తించి ఆ రాక్షసుడి మొలను, కంఠాన్ని పట్టుకొని నేలపై పడవేసి, పూర్వం బకాసురుడిని చంపిన విధంగా మోకాలితో వాడిదేహాన్ని విరుగబొడిచి వధించాడు. ఈ సందర్భంలో కూడా భీముడి మల్లయుద్ధ పాండిత్యాన్ని మనం తెలుసుకోవచ్చు. ఆయువు పట్టులను గ్రహించి, వాటిని విరుగొట్టడం మల్లయుద్ధంలో కీలకం. శత్రువును బలహీనుడిగా చేయటానికి ఈ విధమైన మల్లయుద్ధ పద్ధతులను వాడాడు.

భీమసేనుడు, హిడింబాసురుడిని కూడా మల్లయుద్ధంలోనే సంహరించాడు. తనకు సరియైన పరాక్రమం కలిగిన వీరులు ఎదురైనపుడు, వారిని జయించటం కష్టం అనిపించినప్పుడు భీముడు మలమలయుద్ధవిద్యను ఉపయోగించి, వారిని చిత్రవధ చేసి చంపేవాడు. శరీరంలో ఆయువుపట్లను చూసి కొట్టడమే మలమలయుద్ధంలో ముఖ్యమైన అంశం.

కుంతీదేవి, పాండవులు అడవిలో నిద్రిస్తున్నారు. వారికి నిద్రాభంగమవుతుందని భావించి, భీముడు ఆ రాక్షసుడిని సింహం చిన్న జంతువును వదలక గట్టిగా ఈడ్చినట్లు ఆ ప్రదేశానికి ఎనిమిది ధనుస్సుల కొలత గల దూరానికి లాక్కొని పోయాడు.

భీముడు, హిడింబాసురుల మల్లయుద్ధాన్ని నన్నయ క్రిందివిధంగా వర్ణించాడు.

"చరణహతిన్ మహాతరులు సాల్వడి జర్జరితంబు లై మహిం
దొరఁగఁగ నిట్టు లొండొరులతోడ మదోద్ధత షష్టిహాయన
ద్విరదములట్లు ఘోరరణవీరులు సేసిరి మల్లయుద్ధము
ద్ధురబలులై సమీరణసుతుండు హిడింబుఁడు తద్వనంబునన్"[83]

భీమ హిడింబాసురుల కాళ్ళ తొక్కిడికి వరుసగా పెద్ద పెద్ద వృక్షాలు విరిగి నేల కొరిగేటట్లు, అరవయ్యేండ్ల మదపుటేనుగుల లాగా ఆ అడవిలో ఒకరితో ఒకరు మల్లయుద్ధం చేశారు. అసుర సంధ్యవేళ సమీపించగా, అర్జునుడు భీముడికి ఆ విషయాన్ని గుర్తు చేస్తాడు. అసుర సంధ్యలో రాక్షసులకు బలం పెరుగుతుంది. కాబట్టి ఆలస్ చేయక మల్లవిద్య చేత ఆ రాక్షసుడిని వెంటనే సంహరించు అని అర్జునుడు అంటాడు.

"తూర్పురుణంబుగాఁ దొడఁగె దుష్టనిశాచరవేళ యయ్యెడున్
మార్పము కాలయాపన మమర్పక యప్పిశితాశిఁ బట్టి పా
లార్పఁగ నేల నావుడు బలాఢ్యుఁడు భీముఁడు మల్లవిద్యనే
ర్పేర్పడఁగా హిడింబు బలహీనపరాక్రముఁ జేసెఁ జెచ్చెరన్."[84]

అర్జునుడి ప్రోత్సాహంతో భీముడు విజృంభిస్తాడు. హిడింబాసురుడి నోట్లో, ముక్కులో ఆగకుండా నెత్తురు ధారలు కారుతూ ఉండగా, భీముడు అతడి కడకాలు పట్టి గాలిలోకి ఎత్తి గిరగిరా వందసార్లు త్రిప్పాడు. బలం క్రుంగేటట్లు ఈ విధంగా విసరటం చేత అవయవాల కదలికలు కోల్పోయిన హిడింబుడిని బిగబట్టి, నేలమీదపెట్టి, అతడి వెన్నెముక విరిచి, నడుము త్రుంచి విసిరివేశాడు. ఈవిధంగా భీముడు మల్లయుద్ధవిద్య వల్ల సులభంగా హిడింబుడు, జరాసంధుడు, కీచకుడు, దుర్యోధనాది వీరులను యుద్ధంలో చంపగలిగాడు.

2.1.24. గణితశాస్త్ర విద్య :-

పంచపాండవులలో ధర్మరాజుతో పాటు భీముడికి కూడా గణితశాస్త్ర పరిజ్ఞానం ఉంది. అరణ్యపర్వంలో భీముడు మాట్లాడిన మాటలను బట్టి అతనికి గణితశాస్త్రంలో మంచి ప్రావీణ్యం ఉన్నట్టు తెలుస్తున్నది. ఒకరోజు భీముడు, ధర్మరాజుతో ఇలా అంటాడు. "ఓ ధర్మరాజా! నీవు రాజులలో సూర్యుడి వంటి తేజస్సు కలవాడివి. చిన్న బిడ్డల నుండి ముసలివారి వరకు అందరూ నీ కీర్తి విని, నిన్ను ఎరిగిన వారే. నీ తమ్ములా సింహశరీరులు. అరణ్యవాసాన్ని ఎట్లాగో గడపవచ్చును. అజ్ఞాతవాసాన్ని ఇతరులకు తెలియకుండా గడపటం ఎట్లా వీలవుతుంది? ఇలాగైతే ఈ మన వనవాసక్లేశం ఎప్పటికీ తొలగిపోదు. ఒక సంవత్సరానికి బదులుగా ఒక నెలను పరిగణించే గణితం లోకంలో బహుళప్రచారంలో ఉన్నది కదా! మనం ఈ అడవిలో పదమూడు నెలలు గడిపాము కాబట్టి వీటిని పదమూడు సంవత్సరాలుగా సరిపెట్టవచ్చును. ఇందులో ధర్మవిరోధం లేదు ఇది విజయ సాధనకు ఒక ఉపకరణం"[85]అని అంటాడు. దీన్నిబట్టి ఆనాడు లోకంలో గణితశాస్త్రం బాగా అభివృద్ధి దశలో ఉండేదని తెలుస్తున్నది. రాజకుమారులకు గణితశాస్త్రం తప్పకుండా నేర్చుకోవలసిన విద్య. ఇది నిబద్ధవిద్య. కౌరవవీరులంతా గణితశాస్త్రాన్ని బాల్యంలో నేర్చుకున్నట్లు భారతం వల్ల తెలుస్తున్నది.

2.1.25. జ్యోతిశ్శాస్త్ర విద్య :-

గ్రహాల గమనాన్నిబట్టి అవి ఏయే రాశుల్లో ప్రవేశిస్తే ఏయే పరిణామాలు సంభవిస్తాయి? మనుషుల మీద ఈ గ్రహగమనాల ప్రభావం ఎలా ఉంటుంది? ఏయే సమస్యలు వస్తాయి? వాటి పరిష్కారాలు ఏమిటి?

అనే విషయాల గురించి తెలుపుతుంది జ్యోతిశ్శాస్త్రం. ఇది పురాతనవిద్య. వేదకాలం నుండి ఇది వ్యాప్తిలో ఉంది.

వేదాంగాల్లో ఈ జ్యోతిషం ఆరవది. వేదపఠనానికి ఇది కూడా ఎంతో అవసరం. యజ్ఞయాగాదులను ప్రారంభించే సమయంలో, సమాప్తి చేసే సమయంలో సుముహూర్తాన్ని నిర్ణయించటం కోసం జ్యోతిషం అవసరమైంది. "వేదాంగాల్లో జ్యోతిషం చివరిదైనా నెమలికి శిఖ శిరస్సుమీద ఉన్నట్లు వేదాంగాల్లో ఇది మూర్ధన్య స్థానాన్ని వహిస్తుందని వేదాంగ జ్యోతిషంలో చెప్పబడింది"[86]. ప్రాచీనకాలంలో కాలాన్ని గణించటం చాలా అవసరమైంది. కొన్ని యజ్ఞాలు కొన్ని ఋతువులతో, మాసాలతో, నెలలతో సంబంధం కలిగివుంటాయి. అందువల్ల గ్రహాల అనుకూల, ప్రతికూలత్వాలను తెలుసుకోవటం కోసం జ్యోతిషం అధ్యయనం చేయటం జరిగింది. వేదాభ్యాసం చేసే ప్రతి విద్యార్థి జ్యోతిషాన్ని తప్పకుండా అధ్యయనం చేయాలి. జ్యోతిషాన్ని నేర్చుకుంటేనే యజ్ఞయాగాదులకు సంబంధించిన సంపూర్ణజ్ఞానం ఆ విద్యార్థికి అందుతుంది.

వేదాంగ జ్యోతిష ఆవిర్భావం గురించి 'సంస్కృత సాహిత్య చరిత్ర' గ్రంథంలో ఈ విధంగా చెప్పబడింది. "వేదాంగ జ్యోతిషజ్ఞానం మొట్టమొదట బ్రహ్మకు లభించిందని, దాన్ని అతడు తన కుమారుడు వసిష్ఠుడికి చెప్పాడని చెప్పబడింది. అది వసిష్ఠ సిద్ధాంతంగా ప్రఖ్యాతమైంది. మరొక కథనుబట్టి విష్ణువు, సూర్యునికి జ్యోతిషజ్ఞానాన్ని ఇచ్చాడు. పులిశుడు ఒక సిద్ధాంతాన్ని వేరుగా నిర్మించి ఋషులకు ఇచ్చాడు. సూర్యుడు శాపగ్రస్తుడై యవనజాతిలో జన్మించి రోమక సిద్ధాంతాన్ని నిర్మించాడని ఒక కథ"[87]. ఏది ఏమైనా ఈ జ్యోతిషవిద్య అతి ప్రాచీనమైనదని తెలుస్తున్నది. దీన్ని ఆశ్రమాల్లో గురువులు అన్నివర్ణాల విద్యార్థులకు (శుద్రులకు తప్ప) నేర్పించేవారు. తర్వాత కాలంలో జ్యోతిషశాస్త్రం సంహిత, గణిత, జాతక అన్న విభాగాలుగా విడిపోయింది. ఆర్యభట్టు, వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు, భాస్కరాచార్య మొదలైనవారు జ్యోతిషవిద్య వికాసానికి ఎంతగానో కృషిచేశారు.

కొఱవి గోపరాజు 'సింహాసనద్వాత్రింశిక'లో ఇరవై ఐదవ బొమ్మ చెప్పిన కథలో జ్యోతిశ్శాస్త్రం విషయాలు ఉన్నాయి. అవంతి నాటకుడు మహావైభవంతో రాజ్యాన్ని పరిపాలిస్తూండగా, ఒకరోజు అతనివద్దకు ఒక జ్యోతిష్కుడు వచ్చి ఇలా అంటాడు.

"సర్వ శుభంబులు నీకడ
నిర్వాహము గలిగి యుండు నీకేమని యా
శీర్వాదం బొసఁగుదు నా
యుర్వృద్ధి దలంప నవియ యునికికిఁగోరున్"[88]

ఈ భూమి మీద అధికంగా దానధర్మాలు చేసేవారికి అపారమైన ఆయుష్షు కలుగుతుందని పలికి, తిథివారనక్షత్రయోగకరణాలను అతడు అప్పజెప్పాడు. ఆ జ్యోతిష్కుడు ఏయే గ్రహాలకు ఏయే స్థానాలు మంచివో క్రిందివిధంగా రాజుకు తెలిపాడు.

"ఐదింటఁ దానొప్పఁ డట నెమ్మిదింటఁ దొ
మ్మిదియింటఁ బండ్రెంట మేలు శుక్రుఁ
డిందుఁ డాఱింటను నేడింట మూఁటను
బదిటఁ జేకొన్న శుభప్రదుండు
శనిరాహు కేతుభూతనయ సూర్యులు మూఁట
నాఱింట మేలర్కుఁడట్ల పదిట
రెంట నైదింట నేడింటఁ దొమ్మిదటను గు
రుం డున్న నెల్లకోర్కులు ఫలించు
బుధుఁడు బేసిగానిపొందుల నిష్టుఁడా
వీని కెల్ల దుష్ట వేధ లేమి
ఫలముఱొప్పు జననభవనంబు మొదలుగాఁ
బదునొకంటనున్నఁ బరమ సుఖము"[89]

"అందు రవితనుజాతి మహాగ్రహంబు
లిప్పు డాఱింటమనికి నీయిష్ట మొనరు
గురుఁడు బుధుఁడును బైపయికొనుట మేలు
శుక్రచంద్రులు మూఁటనిల్పుట శుభంబు"[90]

పై విధంగా గ్రహస్థానాలు, వాటి శుభాశుభ పరిణామాలు గురించి గోపరాజు వివరించాడు. ఇవన్నీ నాడు ప్రజల విశ్వాసాన్ని పొందివుండేవి. ఈ జ్యోతిష శాస్త్రాన్ని విద్యార్థులంతా ఖచ్చితంగా అభ్యసించేవారు. ఇది శాస్త్రరూపాన్ని పొందిన నిబద్ధవిద్య. దీన్ని బోధించటానికి ప్రత్యేకంగా గురువులు ఉండేవారు.

అవంతిరాజు, సిద్ధుడితో ఈ యేటి గ్రహగతుల్నిబట్టి తన రాజ్య పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పమని ప్రార్థించాడు. అప్పుడు సిద్ధుడు రాజుతో ఈవిధంగా అంటాడు.

"మహిమాఖండలుఁ డంచు భూజనులు సంభావింప నీవింపుతో
మహిఁ బాలించుచుఁ బుణ్యకృత్యముల ధర్మద్రవ్యమార్జింపఁగా
గ్రహదోషంబులు పుట్ట వట్లయిన నోరాజేంద్ర యీయేఁట దు
స్సహపాపగ్రహసంభవం బగునతిక్షామంబు వర్తిల్లెడిన్"[91]

ఓ రాజా! వక్రగతిలో సూర్యతనూజుడు (శనీశ్వరుడు) మొదట ఉన్నటువంటి శుక్రుడి రాశిని విడిచి, బండిచక్రం ఆకృతిలో ఉన్న రోహిణి నక్షత్రంలో దూరి, అంగారకుని చక్రం చేరుటకు ప్రయత్నించి వక్రగతిలో సంచరించడం వల్ల ఈ రాజ్యంలో కొన్ని సంవత్సరాలు వర్షాలు కురిసే అవకాశం లేదు అని సిద్ధుడు అంటాడు. అప్పుడు ఆ రాజ్యంలో ఎటువంటి ఆపదలు సంభవిస్తాయో కూడా అతడు రాజుకు వివరించాడు.

"పఱిపఱి నిల పఱియలుగా
నెఱిసిన వనపంక్తు లెండ నిరుపముమగునా
వఱుపునఁ బండ్రెండేడులు
కఱు విఁక నతిదుస్తరంబు గాఁగల దధిపా"[92]

అని సిద్ధుడు చెప్పాడు. తర్వాత కాలంలో సిద్ధుడు చెప్పినట్లుగానే జరిగింది. దీనికి నివారణంగా దేవతార్చన, హోమాలు, గ్రహపూజ మొదలైని చేస్తే వర్షాలు కురుస్తాయని తెలియచేశాడు.

పై విధంగా ప్రాచీనకాలంలో జ్యోతిషశాస్త్రం బాగా ప్రసిద్ధి చెందింది. రాజాస్థానంలో కచ్చితంగా ఒక జ్యోతిషపండితుడు ఉండేవాడు. ఉత్సవాల సమయంలో, యుద్ధారంభ సమయంలో, వేటకు వెళ్ళే సందర్భంలో, పుత్రులు కలిగిన సందర్భంలో గ్రహగతుల్ని పరిశీలించి దోషనివారణలు చేయటానికి జ్యోతిషశాస్త్రం ఆనాడు అవసరమైంది.

2.1.26. ఛందశ్శాస్త్ర విద్య :–

ప్రాచీనులు నేర్చిన షడంగ విద్యల్లో ఛందస్సు కూడా ఒకటి. ఇది వేదకాలం నుండే ఉంది. 'ఛందస్సు' అంటే ఆహ్లాదాన్ని ఇచ్చేది అని అర్థం. 'ఛది ఆహ్లాదనే; ఛదిర్ ఆవరణే' – అనే ధాతువుల నుండి ఈ ఛందశ్శబ్దం ఏర్పడుతుంది. వేదాల్లోని మంత్రాలు చాలా రకాల ఛందస్సుల్లో ఉన్నాయి. ఛందస్సు లేకుండా కవిత్వం లేదన్నది ప్రాచీన పండితుల విశ్వాసం. వేదానికి ఛందస్సు పాదం వంటిది. దీని మీద ఆధారపడే మంత్రసృష్టి జరిగింది.

కొఱవిగోపరాజు 'సింహాసనద్వాత్రింశిక'లో ఆనాడు వ్యవహారంలో ఉన్న ఇరవై ఆరు ఛందస్సులను గురించి పేర్కొన్నాడు.

"చొచ్చి యనుష్టుప్ఛందంబునుం బోలె హంసరుతయుఁతంబైత్రిష్టుప్ఛందంబునం
బోలె భ్రమరవిలసితంబై జగతీచ్ఛందంబునుంబోలెఁగుసుమవిచిత్రాంబరంబై---"[93]

అనుష్టుప్, త్రిష్టుప్, జగతీఛందస్సు, శక్వరీ, అతిశక్వరీ, యష్టిఛందస్సు, హరిణీవృత్తం, ధృతిఛందస్సు, మత్తకోకిల, శార్దూల విక్రీడితం, కృతిఛందస్సు, ఉత్పలమాల, ప్రకృతిఛందస్సు, సంకృతిఛందస్సు, భుజంగ విజృంభితం మొదలైన ఇరవై ఆరు రకాల ఛందస్సులను పేర్కొన్నాడు.

మూలంలో లేని ఛందోవిశేషాల్ని గోపరాజు ఇక్కడ చెప్పాడు. దండకారణ్యాన్ని వర్ణించే సందర్భంలో 13 రకాల ఛందస్సుల్ని మాత్రము మూలానుసారం గోపరాజు చెప్పాడు. అనుష్టుప్, త్రిష్టుప్ మొదలైన వాటితో కొత్త వృత్తాలైన ధృతి, కృతి, ప్రకృతి, సంకృతి, ఉత్కృతి మొదలైన వాటిని గోపరాజు చెప్పాడు.

ఈ ఛందస్సును గురుకులాల్లో తప్పనిసరి పాఠ్యాంశంగా బోధించేవారు. అందరూ దీన్ని అభ్యసించేవారు. వైదిక ఛందస్సు, లౌకికఛందస్సు అనే రెడు రకాలు ఇందులో ఉన్నాయి. వైదిక ఛందస్సు యజ్ఞయాగాదులకు సంబంధించినది. లౌకిక ఛందస్సు సాహిత్యం మొదలైన వాటికి చెందింది. ప్రాచీనకాలపు గురువులు ఈ ఛందస్సును విద్యార్థులకు ప్రాథమిక దశలోనే నేర్పేవారు. తర్వాతనే ఉన్నత విద్యాభ్యాసానికి అనుమతి ఇచ్చేవారు.

ముదిగంటి గోపాలరెడ్డి, సుజాతరెడ్డి గార్ల సంకలన గ్రంథమైన 'సంస్కృత సాహిత్య చరిత్ర'లో ఛందస్సు ఆవిర్భావవికాసాల గురించి క్రింది విధంగా వివరించడం జరిగింది[94]. పాణినీయశిక్షలో 'ఛందః పాదౌతు వేదస్య' – ఛందస్సు వేదానికి పాదమని చెప్పబడింది. మనిషి పాదాల సహాయంతో నిలబడినట్లుగా, నడచినట్లుగా వేదపురుషుడు ఛందస్సు సహాయంతో నడుస్తాడు. వేదాల విశుద్ధమైన , లయబద్ధమైన ఉచ్చారణకు, పాఠానికి ఛందఃశాస్త్రాధ్యయనం అవసరం. 'ఛందః' శబ్దానికి రుచికరమైంది. శ్రుతిపేయమైనది, లయబద్ధమైన వాణి అనే అర్థాలున్నాయి. "ఛందయతి పృణాతి రుచతే ఇతి ఛందః"[95] అని వ్యుత్పత్తి. ఏ వాణిని వింటే మనస్సు ఆహ్లాదాన్ని పొందుతుందో ఆ ఛందోమయ వాణి వేదం. ఆసురబంధమైన విఘ్నాల నుంచి వేదాన్ని రక్షించే కవచం వంటిది ఛందస్సు అని ప్రాచీనుల విశ్వాసం.

ఇతర శాస్త్రాలన్నిటికి శివుడు ప్రథమ ప్రవర్తకుడు అయినట్లే ఛందశ్శాస్త్రానికి కూడా అతడే ప్రథమ ప్రవర్తకుడు. శివుని దగ్గర నుంచి బృహస్పతి ఛందోజ్ఞానాన్ని సంపాదించాడు. బృహస్పతి నుంచి దుశ్చ్యవనుడు, అతని నుంచి ఇంద్రుడు, ఇంద్రుని నుంచి మాండవ్యుడు ఆ శాస్త్రాన్ని గ్రహించారు. ఇప్పుడ లభించే ఛందశ్శాస్త్ర విషయకమైన గ్రంథాలల్లో బుక్ ప్రాతిశాఖ్యయే ప్రాచీనమైంది. దీనిలో ప్రధానంగా చర్చించిన విషయం వ్యాకరణమే అయినా, పుస్తకం చివర వైదిక ఛందస్సులను గూర్చి చర్చ ఉంది.

తెలుగులో ఉన్న చాలా రకాల ఛందస్సులకు మార్గదర్శి సంస్కృత సాహిత్యమే. సంస్కృత భాషా ప్రభావం వల్ల శార్దూలం, ఉత్పలమాల వంటి ఛందస్సులు తెలుగులోకి వచ్చాయి. ఛందస్సును ప్రాచీనులు

గురువుల వద్ద అభ్యసించారు. దీనికి గ్రంథాలు, అధ్యన ప్రణాళిక, ప్రయోగ విధానం ఉండేవి. నాటి విద్యార్థులు వేదఛందస్సుతో పాటు, లౌకిక ఛందస్సును కూడా అధ్యయనం చేసేవారు. అందువల్ల ఛందోపరమైన గ్రంథాలు కూడా విరివిగా రాయబడ్డాయి. ఛందస్సును గురించి మొదటగా సంస్కృతంలో కనిపిస్తున్న గ్రంథం పింగళుని 'ఛందశ్శాస్త్రం'. దీనిలో పూర్తిగా ఛందోవిషయాలు మాత్రమే ఉన్నాయి. ఇది సూత్రరూపంలో రాయబడింది. దీనిలో ఎనిమిది అధ్యాయాలు ఉన్నాయి. మొదటి నాల్గింటిలో వైదిక ఛందస్సు, తర్వాత నాల్గింటిలో లౌకిక ఛందస్సులు వివరించబడ్డాయి.

పింగళుని ఛందశ్శాస్త్రానికి, భట్టహలాయుధుడు 'మృతసంజీవని' అనే వ్యాఖ్యను రాశాడు. పింగళుని గ్రంథానికి రూపాంతరమైన 'ప్రాకృత పింగళం' ప్రస్తుతం లభిస్తున్నది. తర్వాత అపభ్రంశ భాషలో 'కవి స్వయంభు' రాసిన 'స్వయంభు ఛందః' గ్రంథం ప్రసిద్ధం. కాళిదాసు పేరుతో వృత్తరత్నావళి, శ్రుతబోధ అనే ఛందోసంబంధ గ్రంథాలు సంస్కృతంలో ఉన్నాయి. ఇంకా వరాహమిహిరుడు రాసిన బృహత్సంహిత, జనాశ్రయుడి 'ఛందోవిచితి', క్షేమేందరుడు రాసిన 'సంవృత్త తిలకం', హేమ చంద్రుడు రాసిన 'ఛందోఽనుశాసనం', కేదారభట్టు 'వృత్త రత్నాకరం', దుర్గాదాసు రాసిన 'ఛందోమంజరి', దామోదరమిశ్రుడు రాసిన 'వేణీభూషణం', దుఃఖభంజనుడు రాసిన 'వాగ్వల్లభ' సంస్కృతంలో వెలువడిన ఛందశ్శాస్త్ర సంబంధమైన గ్రంథాలు. ఇవి నాడు అధ్యయన, అధ్యాపనల్లో ఉండేవి. ఛందస్సును ప్రత్యేకమైన విద్యగా నేర్చుకునే విద్యార్థులు, నేర్పే గురువులు నాటి గురుకులాల్లో తప్పనిసరిగా ఉండేవారు. వేదాలను అధ్యయనం చేయటానికి ముందే గురువులు విద్యార్థులకు ఛందశ్శాస్త్రాన్ని బోధించేవారు.

తెలుగులో కవిజనాశ్రయం, ఛందోదర్పణం, అప్పకవీయం వంటి గ్రంథాలు ప్రసిద్ధమైనవి. ఇవి మార్గపద్ధతిలో వచ్చిన ఛందస్సులతోపాటు, తరువోజ, మధ్యాక్కర వంటి దేశీయ ఛందస్సుల్ని గురించి కూడా చర్చించాయి. ఛందో గురుపరంపరను 'సాహిత్యరత్నాకరం' క్రింది విధంగా తెలియచేస్తుంది.

"ఛందోజ్ఞాన మిదం పురా త్రిణయాత్ లేభే శుభం నందిరాట్
తస్మాత్ ప్రాపసనత్కుమారకతతో గస్త్యస్తతో నైఋతిః
తస్మాద్దేవ పతిస్తతః ఫణిపతిః తస్యానుజోపింగళః
తచ్ఛిష్యైర్మని భర్మహత్మభిరదం భూమౌ ప్రతిష్ఠాపితమ్"[96]

ఈ విధంగా శివుని నుండి పింగళుని దాకా ఈ గురుపరంపర కనిపిస్తుంది. పింగళుడు ఈ గురుపరంపరలో చివరివాడు. అతని గ్రంథమే లోకంలో ఛందశ్శాస్త్రం వ్యాపించడానికి ఉపయోగపడింది. ఈ వారసత్వమే తెలుగు వారు కూడా అనుసరించారు.

2.2. యంత్ర – మంత్ర విద్యలు:-

2.2.1. పద్మినీ విద్య, మృగపక్షి భాషలు తెలుసుకునే విద్య :-

మనుచరిత్రలో, ఇందీవరాక్షుడి కథలో ఆయుర్వేద విద్య.తో పాటు పద్మినీవిద్య, మృగపక్షి భాషలు తెలుసుకునే విద్య గురించి ప్రస్తావన ఉంది. మనుచరిత్రలో మూడు తరాల కథ ఉంది. అలాగే స్వరోచి కథలో మూడు రకాలైన విద్యల ప్రస్తావన ఉంది. ఇవి రెండు చాలా మహిమ కలిగిన విద్యలు. కళావతి పద్మినీవిద్యను, విభావసి మృగపక్షిభాషలు తెలుసుకునే విద్యను పొందారు. ఇవి సాధారణ ప్రజలకు తెలియవు. రాయల కాలంలో వెలువడిన ప్రబంధాల్లో మరెక్కడా ఈ విద్యల గురించి ప్రస్తావన రాలేదు. ఎందుకంటే ఇవి గంధర్వాది దేవతలకు సంబంధించినవి కాబట్టి.

ఇందీవరాక్షుడు అనే గంధర్వుడు, తన కుమార్తె మనోరమతోపాటు ఆయుర్వేదవిద్యను కూడా స్వరోచికి ఇస్తాడు. వివాహానంతరం మొదటిరాత్రి ఆ దంపతులిద్దరూ కలుసుకున్నారు. కానీ మనోరమకు సంతోషం లేదు. ఎంతో కోరికతో ఎదురుచూస్తున్న స్వరోచి మనస్సుకు బాధకలిగింది. అతనికి దుఃఖం వచ్చింది. ఎందుకు నువ్వు ఇంత విచారంగా ఉన్నావు? అని భార్యను అడిగాడు. నీకేమైనా ఆరోగ్యం సరిగాలేదా? నా దగ్గర మీ తండ్రి ఇచ్చిన ఆయుర్వేదవిద్య ఉంది కదా? ఎందుకింత విచారంగా ఉన్నావు అంటాడు.

అప్పుడు మనోరమ తన చెలికత్తెల గురించి చెపుతుంది. తనను పూర్వం ఒక ఋషి శపించాడని, అతడే తన చెలికత్తెలను రాజయక్ష్మవ్యాధికి గురికమ్మని శపించాడని వివరిస్తుంది. అప్పుడు స్వరోచి, మనోరమను వెంట తీసుకొని ఆ చెలికత్తెల వద్దకు వెళతాడు. తన ఆయుర్వేద విద్యను ఉపయోగించి వారికి రోగాన్ని పోగొడతాడు. వారికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తాడు.

అప్పుడు ఆ చెలికత్తెలలో ఒకరైన విభావసి, స్వరోచితో ఇలా అంటుంది. నీవు మాకు ఉపకారం చేశావు. కాబట్టి నేను కూడా నీకు ప్రత్యుపకారం చేయానుకుంటున్నాను. దయచేసి స్వీకరించుము అంటుంది. స్వరోచితో తనకు తెలిసిన విద్య గురించి ఇలా చెప్పింది. నా తండ్రి పేరు మందారుడు. ఆయన విద్యాధరుడు. నా పేరు విభావసి. నాకు మృగముల, పక్షుల భాషలు తెలుసుకునే విద్యవచ్చును. ఆ విద్యను నా నుండి గ్రహించి, నన్ను పెండ్లి చేసుకోమని అంటుంది.

రెండవ చెలికత్తె అయిన కళావతి తన గతం గురించి, తనకు పద్మినీవిద్య లభించిన వృత్తాంతం గురించి స్వరోచితో ఇలా చెప్పింది. నా తండ్రి ఒక బ్రహ్మర్షి. ఆయన పేరు పారుడు. ఆయన గొప్ప తపస్సు

చేయడం వల్ల స్వర్గంలోకంలో మంటలు వ్యాపించాయి. భయపడిన ఇంద్రుడు ఆ తపస్సును భగ్నం చేయమని 'పుంజికస్థల' అనే అప్సరసను, పదిమంది చెలికత్తెలను పంపించాడు. ఆ మహర్షికి ఆ అప్సరస పట్ల మోహం కలిగింది. ఫలితంగా ఆ ఇరువురికి నేను (కళావతి) పుట్టాను.

నా తల్లి నన్ను అడవిలో విడిచి వెళ్ళిపోయింది. నా తండ్రి కూడా నన్ను వదిలి వెళ్ళిపోయాడు. అటువంటి దీనావస్థలో నేను చంద్రకిరణములలోని అమృతం త్రాగుతూ కొన్ని రోజులు బ్రతికి ఉన్నాను. చావుబ్రతుకుల మధ్య ఉన్న నన్ను చూసి నా తండ్రికి జాలి కలిగింది. నన్ను తీసుకెళ్ళి పెంచి పెద్దచేశాడు.

నేను యౌవనంలోకి వచ్చిన తర్వాత, ఒకరోజు దేవాపి అనే వేల్పు నన్ను చూసి మోహించాడు. నా తండ్రి వద్దకు వచ్చిన నన్ను తనకు ఇచ్చి పెళ్ళిచేయమన్నాడు. అతడు తలలో పువ్వులు ధరించి, మెడలో నగలు ధరించి, దండకండెములు ధరించి, పచ్చకర్పూరపు తాంబూలాన్ని నములుతున్నాడు. అతడి వేషాన్ని చూసిన నా తండ్రికి కోపం వచ్చింది. అతడిని ఆక్షేపిస్తూ ఇలా పలికాడు. 'మా వంశము పవిత్రమైన దోయీ! మా హోమములు ఫలించినవోయీ! బోగములాడవు, నీవు వచ్చి నా బిడ్డ నడుగుట కంటె కావలయునా? ఛీ! ఛీ! పోరా!' అని నిందించి వెళ్ళిపొమ్మన్నాడు.

ఆ దేవాపికి కోపం వచ్చింది. ఆ రాత్రి అతడు వచ్చి నా తండ్రి మెడకాయ కోసివేశాడు. పొరుగిళ్ళలోని తాపసులు వచ్చారు. అప్పటికే దేవాపి పారిపోయాడు. నేను నా తండ్రికి అగ్నిహోత్రాదికాలు జరిపించాను. అప్పటి నా దీనస్థితికి నాలో నేను కుమిలిపోయాను. చిన్నప్పుడే తల్లికి దూరమయ్యాను. ఇప్పుడు తండ్రి ఇలా అయ్యాడు. ఇంక నేనెవరి కోసం బ్రతకాలి అని రోదిస్తూ చచ్చిపోవటమే మంచిదని అగ్నిలో దూకడానికి ప్రయత్నం చేయబోతుండగా ఆకాశం నుండి ఒక పిలుపు వినిపించింది.

ఆ వేళ ఎందుకో తల్లియైన పార్వతీదేవి ఆకాశంలో వెళుతున్నది. ఆమె నన్ను చూసి క్రిందకు దిగివచ్చి దయతో ఇలా అన్నది. 'ఓసి పిల్లా! దుఃఖపడకు. నీకు స్వరోచి అనేవ్యక్తి భర్త అవుతాడు. నేను నీకు 'పద్మినీ' అనే విద్యను ఇస్తున్నాను. నీకు సర్వసౌఖ్యములు లభించును' అని పిలికింది. నీవే ఆ స్వరోచివి అయివుంటావు. కాబట్టి నువ్వు పద్మినీవిద్యతో పాటు నన్ను కూడా స్వీకరించు అని కళావతి స్వరోచితో అంటుంది.

ఈ విధంగా స్వరోచి ముగ్గురు భార్యల వల్ల మూడు విద్యలను పొందగలిగినాడు. ఆయుర్వేదవిద్య, పద్మినీవిద్య, మృగపక్షి భాషలు తెలుసుకునే విద్య అతడి సొంతమైనాయి. రాయల కాలం నాటికి వైద్యవిద్య బాగా వ్యాప్తిలో ఉండేదని పై కథల వల్ల తెలుస్తున్నది.

2.2.2. కామరూపిణి విద్య:–

శ్రీనాథుడు రాసిన 'శృంగారనైషధం'లో ఈ కామరూపిణి విద్య ప్రసక్తి ఉంది. 'కామరూపిణి' అంటే అవసరమైనప్పుడు ఇష్టం వచ్చిన రూపంలోకి మారడం. చిలుకగానో, జంతువుగానో, మరో పక్షిగానో మారవచ్చు. రామయణ మహాభారతాల్లో కూడ ఈ కామరూపిణివిద్య ప్రసక్తి ఉంది. ఉదంకోపాఖ్యానంలో ఉదంకుడు నాగలోకానికి వెళ్ళేటప్పుడు అతిసూక్ష్మరూపం ధరించివెళ్ళడం ఈ కామరూపిణి విద్యవల్లనే సాధ్యమౌతుంది. అలాగే రామయణంలో ఆంజనేయుడు ఎప్పుడైనా అతిదీర్ఘశరీరం పొందగలడు లేదా అతి సూక్ష్మరూపంలోకైనా వెళ్ళగలడు. దీనికి కారణం ఈ కామరూపిణివిద్య తెలుసుకొని ఉండటమే. యోగంలో అణిమాది అష్టసిద్ధులున్నాయి. ఆ సిద్ధుల వల్ల సూక్ష్మరూపం పొందవచ్చు (లగిమా సిద్ధి). కాబట్టి ఆంజనేయునిది యోగసిద్ధి అని కూడా భావించవచ్చు. ప్రాచీనకాలంలో విద్యార్థులు నేర్చుకున్న విద్యలో 'కామరూపిణి విద్య' చాలా ఉన్నతమైంది.

శృంగారనైషధంలో భారతీదేవి, దమయంతికి ఈ కామరూపిణి విద్యను ప్రసాదిస్తూ, దాని మాహాత్మ్యాన్ని ఇలా తెలియజేసింది.

"సకల పుణ్యాంగనాజన శిరోమణివైన
నీకు పాతివ్రత్యనియతిజేసి
సాధింపరాని యశాస్యంబు గలుగునే?
యైన, దేవతలమైనట్టి మాకు
బ్రత్యక్షమై మనోరథ మీక పోరాదు
మర్త్యుల; కటుగాన మగువ, వినుము;
నీదు పాతివ్రత్య నియమంబునకు దప్పు
ఖలుడు భస్మంబవుంగాత మపుడ;
కామరూపుల మగు మమ్ము గాంచి నీవు
డెందమున జాల నాశ్చర్య మంది తిపుడు;
నిక్క, మిది యాదిగాగ నో నీరజాక్షి,
కామరూపిణి వగుము మా కరుణజేసి."[97]

ఓ పుణ్యాంగనా! దమయంతీ! నీ పాతివ్రత్య మహిమతో సాధించలేనిది అంటూ ఏమీ లేదు. కానీ మేము దేవతలం కాబట్టి, మానవులకు ప్రత్యక్షమై వారికి ఏ వరాలు ఇవ్వకుండా తిరిగి వెళ్ళకూడదు. అందువల్ల ఇదిగో నీకు కామరూపిణి విద్యను ప్రసాదిస్తున్నాను. దీని మహిమ వల్ల నీ పాతివ్రత్యానికి పర

పురుషుల వల్ల హాని కలిగినపుడు అతడు భస్మమవుతాడు. అని భారతీదేవి దమయంతికి ఈ విద్యను ప్రసాదించింది.

ఈ కామరూపిణివిద్య దమయంతికి భవిష్యత్తులో ఉపయోగపడింది. రాజ్యాన్ని కోల్పోయి నలుడితోపాటు దమయంతి అతడిని వెదుకుతూ వెళ్ళింది. ఆ సమయంలో అడవిలోని ఒక పెద్ద సర్పం ఆమెను మ్రింగబోగా ఒక బోయవాడు ఆ పామును చంపి దమయంతిని రక్షిస్తాడు. కానీ అతడు దమయంతిపై మోహంతో బలాత్కరించడానికి ప్రయత్నిస్తాడు. ఆ సమయంలో దమయంతికి భారతీదేవి ఇచ్చిన కామరూపిణివిద్య వల్ల ఆ కిరాతుడు కాలిభస్మమయ్యాడు. ఈవిధంగా దమయంతి నేర్చుకున్న కామరూపిణి విద్య ఆమెకు రక్షణగా నిలిచింది. విద్య మాత్రం ఆమెకు దూరం కాలేదు. అందుకే భర్తృహరి అన్నట్లు విద్య బంధువు, రక్షకుడు, మిత్రుడు. ఆ విద్యను సరియైన విధంగా ఉపయోగించుకున్నప్పుడు మనిషి, మహాత్ముడు అవుతాడు.

2.2.3. అస్త్రహృదయ విద్య:-

అల్లసాని పెద్దన గారి మనుచరిత్రలో ఈ అస్త్రహృదయమనే విద్య ప్రసక్తి కనిపిస్తుంది. సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'అస్త్రవిద్య' అన్న పదానికి 'అస్త్ర ప్రయోగోపసంహారాలను తెలుపు శాస్త్రము'[98] అని ఉన్నది. మనోరమ, స్వరోచికి ఈ విద్యను ఇస్తుంది. ఇందీవరాక్షుడు, మనోరమను తినడానికి వెంటబడి తరుముతూ అడవిలోకి వస్తాడు. ఆ సమయంలో మనోరమకు స్వరోచి ఎదురువుతాడు. తనను కాపాడమని స్వరోచిని ఆమె అడుగుతుంది. అతడిని జయించటానికి తనవద్ద 'అస్త్రహృదయం' అనే విద్య ఉందని, దాన్ని స్వీకరించి ఆ రాక్షసుడి బారినుండి తనను కాపాడమని అంటుంది. మనోరమ, స్వరోచితో ఇలా పలికింది.

"ఇచ్చెద నీ కస్త్రహృదయంబు నివ్విద్య
నరనాథ మున్ను పినాకపాణి
యగు రుద్రుడిచ్చె స్వాయంభువ మనువున
కతడిచ్చె మఱి వసిష్ఠాఖ్యమునికి
నతడిచ్చె గరుణ జిత్రాయుధుండను పేర
దనరు మదీయ మాతామహునకు
నతడిచ్చె బెండ్లి యౌనపు డరణంబుగా
మా తండ్రి కత డిచ్చె మమతనాకు
సకల రిపునాశకము యశస్కరమునైన
దీని వేవేగ నా చేబ్రతిగ్రహించి

యడపు మాదైత్యువీరువారనగ వలవ
దనఘ సద్విద్యయెందున గొనగవలయు."[99]

ఈ విధంగా మనోరమకు 'అస్త్రహృదయవిద్య' క్రమానుగతంగా ఎలా లభించిందో వివరించబడింది. అయితే ఈ విద్యను స్త్రీ వద్ద నుండి తీసుకోవడం ఎలా? అని నీవు సంశయించవద్దు. 'నీచా దుష్కృత్తమా విద్యా' అంటే సద్విద్య ఎవరి వల్లనైనా నేర్చుకోవచ్చు, అందులో దోషమేమీ లేదు అని మనోరమ స్వరోచితో అంటుంది. అప్పుడు స్వరోచి శుచిగా వచ్చి నిలబడతాడు. మనోరమ అతనికి ప్రయోగపసంహారాలతో ఈ అస్త్రహృదయవిద్యను ఇస్తుంది. ఈ శక్తితో స్వరోచి ఇందీవరాక్షుడిని జయిస్తాడు. అతడికి శాపవిమోచనాన్ని కలిగిస్తాడు.

2.2.4. శాంబరీ విద్య :-

ప్రాచీన తెలుగు కావ్యాలలో కనిపించే మరొకవిద్య ఈ 'శాంబరీవిద్య'. శాంబరీ అన్న పదానికి మాయ, గారడి అనే అర్థాలున్నట్లు సూర్యరాయాంధ్ర నిఘంటువు వల్ల తెలుస్తున్నది[100]. ఒక వ్యక్తి మాయచేసి ఇతరుల రూపంలోకి మారడం, ఇతరుల లాగే మాట్లాడటం మొదలైనవి ఈ శాంబరీవిద్యకున్న ప్రయోజనాలు.

మనుచరిత్రలో అవతారికలో శాంబరీవిద్య ప్రసక్తి కనిపిస్తుంది.

"ఉల్లమునందు నక్కటిక మూనుట మీకులమందుఁగంటి మం
చల్లన మేల మాడునచలాత్మజ మాటకు లేఁతనవ్వు సం
ధిల్లుఁ గిరీటిఁ బాశుపత దివ్యశరాధ్యునిఁ జేయుశాంబరీ
భిల్లుఁడు గృష్ణరాయల కభీష్ట శుభప్రతిపాది గావుతన్."[101]

పై పద్యంలో పెద్దన, పరమేశ్వరుడిని 'శాంబరీభిల్లుడు' అని వర్ణించాడు. పశుపతాస్త్రాన్ని కోరి ఘోరమైన తపస్సు చేస్తున్న అర్జునుడిని పరీక్షించేందుకు మాయాభిల్లుడు (శాంబరీ=మాయ) గా వచ్చాడని అర్థం.

మనుచరిత్రలో గంధర్వకన్య అయిన వరూధిని, బ్రాహ్మణుడైన ప్రవరాఖ్యుడిని ప్రేమించింది. కానీ అతడు తిరస్కరించి, అగ్నిహోత్రుని కరుణ వల్ల హిమాలయాల నుండి స్వగృహానికి తిరిగి వెళ్ళిపోయాడు. వరూధినికి మాత్రం అతడిపై మోహం తీరలేదు. అదే సమయంలో ఒక గంధర్వుడు వరూధినికి ప్రవరుడిపై గల ప్రేమను తెలుసుకున్నాడు. శాంబరీవిద్య ప్రభావంతో మాయాప్రవరుడిగా మారి ఆమెను ఆకర్షిస్తాడు. ఆమెతో సుఖిస్తాడు. వరూధిని గర్భవతి అయిన తర్వాత అక్కడ నుండి వెళ్ళిపోతాడు.

అలాగే మనుచరిత్రలో ఇందీవరాక్షుడి కథలో కూడా శాంబరీ విద్య ప్రసక్తి ఉంది. అతడు బ్రహ్మమిత్రుడనే ఆయుర్వేద పండితుడి వద్ద ఆయుర్వేదాన్ని నేర్చుకోవడానికి వెళతాడు. కానీ బ్రహ్మమిత్రుడు అతనికి విద్య నేర్పనంటాడు. నటవిట గాయకులకు ఆయుర్వేదవిద్య ఎందుకు? నీకు నేర్పకుంటే నాకు జరుగదా? అని తిరస్కరించి పంపివేస్తాడు. కానీ ఇందీవరాక్షుడు 'శాంబరీవిద్య' సహాయంతో కపటవిద్యార్థిగా మారి అతడి వద్ద ఆయుర్వేదాన్ని సంపూర్ణంగా నేర్చుకున్నాడు.

ఈ విధంగా మనుచరిత్రలో శాంబరీవిద్య ప్రస్తావన ఉంది. క్రీ.శ. 16వ శతాబ్దంలో సమాజంలో గారడివిద్య/ఇంద్రజాలం వంటి విద్యలు ప్రచారంలో ఉన్నట్లు పై కథల వల్ల తెలుస్తున్నది. నిరంకుశోపాఖ్యానంలోనూ 'శాంబరీవిద్య' ప్రస్తావన ఉంది.

"—శాంబరీ చంగ భుజంగకృత్య వివేక పుంజ
భూరుహవల్లి లంజ తల్లి"[102]

ఇది వేశ్యమాతను వర్ణించే సందర్భంలోని పద్యం. ఈ వేశ్యమాత తన మాయ అందలి నేర్పుచేత విటుల యొక్క చేష్టలను తెలుసుకునే బలమైన ఓషధీలత వంటిది అని అర్థం. అంటే ఈమెకు మాయవిద్య తెలుసునని అర్థం.

పై విధంగా ప్రాచీన తెలుగు కావ్యాల్లో శాంబరీవిద్య ప్రస్తావన ఉంది. ఇది గారడివిద్యతో సమానమైనది. తెలుగు కావ్యాల్లో గారడి, శాంబరీ పదాలను పర్యాయపదాలుగానే వాడారు. అయితే వీటికి స్వల్పమైన తేడా ఉన్నది. గారడి విద్యలో చేసేవాడు మారడు. ఇతరమైన వాటిని మారినట్లు చూపిస్తాడు. గారడివాడు అలానే ఉంటాడు. శాంబరీ విద్యలో చేసేవాడు మారిపోతాడు. ఇతరులను మార్చడు. ఇది ఈ రెండింటికీ ఉన్న ప్రధానమైన భేదం.

2.2.5. చింతామణి మంత్ర విద్య :–

శ్రీనాథుడు ఆంధ్రీకరించిన 'శృంగారనైషధం'లో ఈ చింతామణి మంత్ర ప్రసక్తి ఉన్నది. చింతామణి అంటే "ధ్యానింపగా కోరిన కల నెల్ల నిచ్చు మణి – దేవమణి"[103] అని సూర్యారాంధ్ర నిఘంటువులో ఉన్నది (పుట.864). శృంగారనైషధంలోని షష్ఠాశ్వాసంలో 'చింతామణిమంత్ర విద్య' మహిమ వర్ణించబడింది. దేవతలు పెట్టిన పరీక్షలో నెగ్గి దమయంతి, నలుడిని వరించింది. ఆమె సంకల్పబలం ముందు దేవతలు కూడా ఓడిపోయారు. నలుడి నిస్వార్థబుద్ధికి వారి హృదయం చలించింది. ఆ దేవతలంతా నలదమయంతులకు గొప్పవరాలను ప్రసాదించారు. ఆ సమయంలోనే సరస్వతీదేవి నలుడికి ఈ చింతామణి మంత్రవిద్యను ఉపదేశించింది.

భారతీదేవి నలుడికి చింతామణిమంత్రవిద్య గొప్పదనాన్ని ఇలా తెలియజేసింది. సకల భూలోకాన్ని పరిపాలించే నాయకుడా! నలుడా! వినుము. ఈ చింతామణి ఉత్తమ మంత్రము. మంత్రసమూహంలో కెల్లా గొప్పది ఇది. దానికి నేను (సరస్వతీదేవి) అధిష్ఠానదేవతను. నియమం తప్పకుండా ఉపాసన చేసిన వారికి ఈ చింతామణి మంత్రము కామధేనువు, కల్పవృక్షము వంటిది.

ఓ నలమహారాజా! నేను నీకు ఈ చింతామణి మంత్రాన్ని ఇస్తున్నాను. ఈ మంత్రం నేను దేవతగా కలిగినట్టిది. చంద్రకళ అలంకారంగా కలది. ఎడమది, కుడిది అయిన సగముల ద్వయము స్వరూపంగా కలది. అందువల్ల ఈ మంత్రము సమగ్రము, ఈశ్వరాత్మకము, నిర్దోషము, మంగళము, ఉపాసకులకు కోరికలన్నిటిని ఇచ్చేది, ప్రసిద్ధమైన భగవచ్ఛబ్ద వాచ్యమైన అర్థము కలది ఈ మంత్రము. (అంటే భగవచ్ఛబ్దార్థమైన నా రూపమే అర్థముగా కలది అని అర్థము). దీన్ని స్వీకరించు అని పలికింది.

సరస్వతీదేవి నలుడితో ఇంకా ఇలా అన్నది. ఓ నలమహారాజా! నేను ఈ చింతామణి మంత్రాన్ని, దాని యొక్క ఉద్ధార ప్రక్రియ ప్రకారం (మంత్రశాస్త్రంలో సంజ్ఞావిశేషాలచేత చెప్పబడిన వర్ణవిశేషాలను మాతృకామధ్యము నుండి కూర్చుకోవడాన్ని ఉద్ధారము అంటారు) నీకు ఉపదేశిస్తున్నాను. గురుపరంపరా సంప్రదాయం కీలకమైన అక్షరవిశేషంతో కూడా చదవకుండానే సారస్వతము ఈ మంత్ర ప్రభావం వల్ల సిద్ధిస్తుంది.

ఓ రాజా! నీవు నియమాసక్తితో ప్రతిరోజూ వేకువజామున లేచి ఈ చింతామణి మంత్రాన్ని పఠించు. తూర్పు వైపుకి అభిముఖుడవై దీన్ని జపించు. నీకు శుభం కలుగుతుంది అని పలికి, భారతీదేవి ఇంకా ఇలా అంటుంది. ఈ చింతామణి విద్యను ధరించినవారు ఎవరంటే,

"సర్వాంగీణ రసామృత స్తిమిత వాచా వీచి వాచస్పతుల్
గర్వోన్నద్ధ విరోధి రాడుదధి వాగ్గాంభీర్య కుంభోద్భవుల్
సర్వమా సదృశాంగనాజన మనస్సంచాల పంచాస్త్రులం
తర్వాణుల్ నృప, యస్మదీయ మగు చింతారత్న విద్యాధరుల్"[104]

అని సరస్వతీదేవి పలుకుతుంది. శాస్త్రజ్ఞులు, బృహస్పతి లాగా రసమాధుర్య సంపన్నంగా భాషించేవారు, గర్వం చేత మిడిసిపడుతున్న ప్రతివాదులను జయించగలిగిన అగస్త్యుడగినవారు, అప్సరసలతో సమానమైన సుందరీమణుల హృదయాలను చలింపజేసే మన్మథుని వంటివారు ఈ చింతామణిమంత్రాన్ని ధరించేవారు. అంటే ఈ మంత్రప్రభావం వల్ల పై లక్షణాలన్నీ సిద్ధిస్తాయని అంతరార్థం. అంతేగాక,

"మహిత చింతామణీ దివ్యమంత్ర మూర్తి,
దలప సార్వతం బయత్నమున గలుగు"[105]

అని పలుకుతుంది. మహామహిమ కలిగిన ఈ చింతామణి మంత్రమూర్తి అయిన నన్ను తలిచిన వెంటనే సారస్వతము ప్రయత్నం లేకుండానే కలుగుతుంది అని అర్థం. శారదాదేవి ఈ చింతామణివిద్య గొప్పదనాన్ని క్రింది విధంగా తలియజేసింది.

"ఎంత జడుడైనగానీ! చింతామణి మంత్రరాజ సేవాపరుడ
బ్దాంతంబున గవితా సి! ద్ధాంత రహస్యోపనిష దుపాధ్యాయు డగున్"[106]

విద్యార్థి ఎంత మందబుద్ధికలవాడు అయినప్పటికీ ఈ చింతామణి మంత్రాన్ని సేవించడం వల్ల సంవత్సరం చివరలో అయినా అతడు 'కవితా సిద్ధాంత రహస్యోపనిష దుపాధ్యాయుడు' అవుతాడని అంటుంది. అంతేకాదు ఓ నలమహారాజ దమయంతి లాగా 'వైదర్భి' అనే కవితారీతి కూడా నీకు వశమౌతుంది. ఈ నా మంత్రాన్ని సూర్యోదయవేళ ఆదరముతో జపించు. నీకు సారస్వతసిద్ధి అవుతుంది అని సరస్వతీదేవి పలుకుతుంది.

పైవిధంగా మహిమోపేతమైన చింతామణి మంత్రాన్ని నలుడు భారతీదేవి ప్రసాదంగా పొందగలిగాడు. అయితే ఇది వాస్తవమేనా ఈ కాలంలో ఇటుంటిది సాధ్యపడుతుందా? అని మనకు సందేహం రావచ్చు. అయితే ఇందులో ఒక విశేషం కనిపిస్తుంది. మనస్తత్వ శాస్త్రజ్ఞులు అభిప్రాయం ప్రకారం మన స్మృతిలో ఏదైతే గాఢంగా నాటుకొంటుందో, ఏ విషయాన్ని మనం పదేపదే స్మరిస్తున్నామో అది వాస్తవమవుతుంది. అంటే మనిషి అంతరంగంలోని విషయాలు అతడికి బాహ్యప్రపంచంలో కనిపిస్తూంటాయి. ప్రతిరోజూ సరస్వతీదేవిని ప్రాతఃకాలంలో ఉపాసించడం వల్ల మనిషిలో ఏర్పడిన జ్ఞానతృష్ణ పరిణతి చెంది అప్రయత్నంగా అతనికి సారస్వతసిద్ధిని కలిగిస్తుంది. మనిషి అంతరంగంలోని తపనే అతనికి జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది అని భావించవచ్చు.

2.2.6. తిరస్కరణీ విద్య:-

శ్రీనాథుడు రాసిన 'శృంగారనైషధం' లోని తృతీయాశ్వాసంలో ఈ తిరస్కరిణీవిద్య ప్రస్తావన ఉంది. 'తిరస్కరిణి' అన్న పదానికి 'కప్పునది, మఱుగుపఱుచునది, తెర, యవనిక, పరదా' అనే అర్థాలున్నట్లు సూర్యరాయాంధ్ర నిఘంటువు వల్ల తెలుస్తుంది[107]. ఈ విద్యను ఉపాసించినవాడు పరుల కంటికి కనిపించకుండా తిరగగలడు. ఇది ప్రాచీనకాలంలో ప్రసిద్ధిపొందిన విద్య. దేవతాసంబంధమైన విద్య.

నిషధ దేశాధిపతి అయిన నలమహారాజు దమయంతి స్వయంవరానికి వస్తాడు. అలాగే ఇంద్రాది దేవతలు కూడా ఆ స్వయంవరానికి వచ్చారు. నలమహారాజు, దమయంతి పరస్పరం ప్రేమించుకున్న సంగతిని వారు గమనించారు. అందువల్ల తమలో ఒకరిని వరించమని చెప్పడానికి నలుడినే రాయబారిగా దమయంతి వద్దకు పంపారు దేవతలు. అంతఃపురంలోకి ఋషులకు ప్రవేశం ఉండదు కాబట్టి దేవతలు నలుడికి 'తిరస్కరిణీవిద్య'ను ప్రసాదించారు. దీని సహాయంతో అక్కడున్న భటులు, పరిచారికల కంటబడకుండా వెళ్ళి దమయంతికి తమ సందేశాన్ని అందించమని దేవతలు ఆదేశించారు.

నలుడు దేవతల మాటకు కట్టుబడి, తనలోని బాధను లోపలే అణచుకున్నాడు. తాను ప్రేమించిన దమయంతికి ఇతరులను పెళ్ళిచేసుకోమని చెప్పడానికి తానే దూతగా వెళుతున్నందుకు చింతించాడు. నిస్వార్థపూరితమైన హృదయంతో, ధర్మానికి కట్టుబడి అంతఃపురంలోకి ప్రవేశించాడు. తిరస్కరిణీవిద్య ప్రభావం వల్ల అతడు అంతపురంలో పడినపాట్లను శ్రీనాథుడు క్రిందివిధంగా వర్ణించాడు.

"వంచనమై దాగి వర్తించుటిది యేమి
ప్రాభవంబని సిగ్గుపాటు నొందు;
నాయుధహస్తులై యాయితంబైయున్న
రక్షివర్గముల తీవ్రతకు నవ్వు;
నది యెవ్వరని ప్రతీహారు లెవ్వరి నన్న,
దన్నుగా దలచి చిత్రముగ నొదుగు;
నెదురుగా జనుదెంచు నిందీవరాక్షుల
కొయ్యన దెరువిచ్చి యోసరిల్లు;

దలచి తలచి యళీకవైదర్భి గాంచు;
గాంచి వేల్పుల ప్రియవాచికంబు నొడవు;
నొడివి తన మాట కచ్చెరువడు జనంబు
క్రందుసందడి దెలివొందు రాజసుతుడు"[108]

నిషధ దేశానికి రాజునైన నేను ఇలా మోసం చేత రావడం తగదని సిగ్గుపడ్డాడు. తనను గుర్తించకుండా ఆయుధాలు పట్టుకొని తిరుగుతున్న భటుల్ని చూసి నవ్వుకున్నాడు. అది ఎవరని ప్రతీహారులంటే, అది తానే అని కలవరపడ్డాడు. ఎదురుగా వచ్చే అందమైన చెలికత్తెలను చూసి తిన్నగా ప్రక్కకు వాలుతున్నాడు. చూసి చూసి వస్తున్నది దమయంతి అయివుంటుందని భ్రమించి దేవతల సందేశం

వినిపించాడు. తన మాటలకు ఆశ్చర్యపడే పరివారాన్ని చూసి నలుడు తెలివిని తెచ్చుకొని తన తప్పును తెలుసుకొంటున్నాడు.

నలుడు తిరస్కరిణీవిద్య ప్రభావంతో మొగసాల దాటి, కక్ష్యాంతరాలు దాటి అంతఃపురంలోకి ప్రవేశించేటప్పుడు ఎదురుపడ్డ సుందరీమణుల మధ్యచిక్కి అవస్థపడ్డాడు. అక్కడ ఎదురుపడ్డ లతలను చూసి దమయంతి అని భ్రమపడ్డాడు. ఆ భవనంలో కనిపించిన దమయంతి చిత్రపటాన్ని చూసి విస్మయం పొందాడు.

పూర్వం హంస వర్ణించిన దమయంతి రూపలావణ్యాలను తలపోస్తూ ఉండటం వల్ల అతడికిలా విస్మయం కలిగింది. ఈ విధంగా నానారకాలైన మన్మథుడి యొక్క లీలలను చూసి ఆశ్చర్యపడతూ అంతఃపురంలో దమయంతిని అన్వేషించాడు. చివరికి ఆమెను గుర్తించి దేవతల సందేశాన్ని వినిపించాడు.

పై విధంగా తిరస్కరిణీ విద్య ప్రభావం వల్ల నలుడు పరుల కంటబడకుండా సూక్ష్మశరీరంలో అంతఃపురంలో ప్రవేశించాడు. ఈ తిరస్కరిణీవిద్యకు, శాంబరీవిద్యకు కొంత తేడా ఉంది. శాంబరీవిద్య ప్రయోగిస్తున్నప్పుడు వ్యక్తి భౌతిక శరీరం మనకు కనిపిస్తుంది. అయితే అది ఏ ఆకారంలోనైనా ఉండవచ్చు. ఉదా:– శివుడు – భిల్లుడుగా మాయారూపంలో అర్జునుడి ముందు ప్రత్యక్షం కావడం, కానీ నలుడు ఎవరి కంటా పడకుండా సూక్ష్మరూపంలో తిరగగలిగాడు. మరొక శరీరాన్ని అపేక్షించలేదు. రెంటిలోనూ మాయ ఉంది. అయితే శాంబరీవిద్య కన్నా, తిరస్కరిణీ విద్య కొంత భిన్నమైంది. ఇవి రెండూ గారడివిద్య ఆవిర్భావానికి మూలకారణంగా కనిపిస్తున్నాయి. శాంబరీ, తిరస్కరిణీ దేవతాసంబంధమైనవి, గారడి సాధారణ ప్రజలకు సంబంధించింది. ఇవి మూడు రాయల కాలం నాటి ప్రబంధాల్లో కనిపిస్తున్నాయి. నాటి ప్రజలకు ఈ విద్యల పట్ల నమ్మకం ఉండేదని పై కథల వల్ల తెలుస్తుంది.

2.2.7. జలస్తంభన విద్య :–

మన ప్రాచీనులు నేర్చుకున్న విద్యల్లో జలస్తంభన విద్య ఒకటి. అత్యవసర సమయంలో శత్రువుల బారినుండి తప్పించుకోవటానికి ఇది ఉపయోగపడుతుంది. మహాభారతంలో, దుర్యోధనుడు ఈ విద్యను నేర్చుకున్నట్లు కనిపిస్తుంది. ఇది ప్రధానంగా ఆనాడు రాజుల బిడ్డలు యుద్ధవీరులు నేర్చుకున్న విద్య.

మహాభారతంలోని సభాపర్వంలో ఈ జలస్తంభనవిద్య గురించి ఇలా ఉన్నది. 'ఆ వరుణసభ, మయసభతో సమానమైన (100 ఆమడలు) కళకళలాడుతూ ఉంటుంది. మయబ్రహ్మ జలస్తంభనవిద్యతో నీళ్ళలో ఉండి ఎంతో మనోహరంగా దాన్ని నిర్మించాడు'[109]. ఈవిధంగా మయబ్రహ్మ ధర్మరాజుకి

మయసభను నిర్మించి ఇచ్చాడు. జలస్తంభనం అంటే ఊపిరి బిగపట్టి నీటి అడుగున జీవించగలగటం. ఇది 64 కళలలో ఒకటి. దీన్ని ప్రధానంగా రాజకుమారులు, మునులు నేర్చుకునేవారు.

కురుక్షేత్ర యుద్ధం చివరిరోజున, కర్ణుడి మరణంతో దుఃఖితుడైన దుర్యోధనుడు వైరాగ్యంతో ఒక మడుగులోకి ప్రవేశించి నీటిని స్తంభింపజేసి, ఊపిరిని బిగపట్టి సమాధిలోకి వెళ్ళాడు. ఇది అతడు నేర్చుకున్న జలస్తంభన విద్య వల్ల సాధ్యపడింది. తర్వాత శ్రీకృష్ణుడు, భీముడు మొదలైనవారు కఠినమైన నిందావాక్యాలు పలికి అతడిని తిరిగి యుద్ధానికి ఆహ్వానించారు. భీముడితో వీరోచితంగా పోరాడి దుర్యోధనుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ భారతం వల్ల ఆనాడు జలస్తంభనవిద్యను ఉపయోగించి భవనాలు నిర్మించడం, రక్షణ కల్పించుకోవడం ప్రజలు నేర్చుకున్నట్లు తెలుస్తున్నది.

2.2.8. వశీకరణ విద్య:–

ప్రాచీనకాలంలో ఈ వశీకరణవిద్య బాగా ప్రచారంలో ఉండేది. ఎదుటివ్యక్తుల్ని వశపరుచుకోవటానికి, వారిని కీలుబొమ్మలుగా చేసి ఆడించటానికి ఈ వశీకరణవిద్య ఉపయోగపడుతుంది. 'వశీకరణం' అంటేనే సొంతం చేసుకోవడం. ముఖ్యంగా స్త్రీలు, పురుషుల్ని వశం చేసుకోవడానికి ఈ విద్యను ప్రయోగించేవారు. ఇప్పటికీ కొన్ని పల్లెల్లో ఈ ప్రస్తావన వినిపిస్తుంది. ఆకుపసరునో లేక ఔషధాల్నో మాత్రలుగా చేసి స్త్రీ, పురుషుడికి తినిపిస్తే అతడు ఆమె వశమౌతాడు. పసరును తలకు పూస్తే ఇక అతడు ఆమె మాటకు ఎదురుచెప్పడు. ఇది ప్రాచీనకాలంలో కూడా ఉంది అని మహాభారతంలోని 'సత్యాద్రౌపది సంవాదం' వల్ల తెలుస్తున్నది.

పాండవులు అరణ్యవాసం గడుపుతున్నప్పుడు, వారిని చూడటానికి శ్రీకృష్ణుడు, సత్యభామ ఇద్దరూ వస్తారు. ఆ సందర్భంలో సత్యభామ, భర్తను వశం చేసుకోవాలంటే ఏయే మందులు, మాకులు పెట్టాలో చెప్పమని ద్రౌపదిని అడుగుతుంది. అందుకు ద్రౌపది ఇలా సమాధానం చెప్పింది.

"అలయక మంత్రతంత్ర వివిధౌషధ భంగులజేసి యెంతమున్
వలతురు నాథులంట మగువా! కడుబేలతనంబు; దానమున్
గలిగిన ప్రేమయుంబొలియుగాని యొకండును సిద్ధిబొంద; ద
ప్పాలతుక తోడి మాన్కి యహిపొత్తుగ జూచు విభుండెఱింగినన్"[110]

ఓ సత్యభామా! మంత్రతంత్రాలతో, మందులు మాకులతో భర్త వశుడవుతాడని అనుకోవడం తెలివితక్కువతనం మాత్రమే. దానివలన భార్యపై భర్తకు అంతకుముందు ఏర్పడిన అనురాగం కూడా నశిస్తుంది. ఎట్టిలాభం కలుగదు. అట్టి భార్యతో కాపురం చేయటం, పాముతో చెలిమి చేయటం వంటిదే అని

భర్త భావిస్తాడు. కాబట్టి భర్త అనురాగం పొందటడానికి నీవు చెప్పిన అల్పమైన ఈ పద్ధతుల వల్ల అనర్థాలు జరుగుతాయే కాని ప్రయోజనం ఉండదు. సేవల ద్వారా, మంచి చేష్టల ద్వారా భర్త మనస్సును దోచుకోవాలిగని, ఇలాంటి కపట కర్మల ద్వారా కాదు అని ద్రౌపది సూటిగా, ఘాటుగా చెపుతుంది.

"మగువ యొనర్చు వశ్యవిధి మందులు మాకులు నరిండుచందమై
మగనికి దెచ్చు రోగములు, మానక మూక జడాదిభావముల్
మొగినొనరించు, నద్దురితముల్ దన చేసిన చేతలై తుదిన్
జగమున కెక్కినిందయును సద్గతిహానియు వచ్చు నింతికిన్"[111]

భర్త తనకు లోబడి ఉండాలనే ఆరాటం చొప్పున భార్య వశీకరణ తంత్రాలు, మందులు, మాకులు ప్రయోగిస్తే అవి బెడిసికొట్టి, అనుకోని విధంగా భర్తకు మూగతనం, మనస్సు, శరీరం మొద్దుబారటం మున్నగు జబ్బులు కొనితెచ్చి పెట్టుతాయి. ఆమెకు లోకంలో అపకీర్తి వస్తుంది. అది అంతా ఆమె స్వయంకృతాపరాధమే కాబట్టి, ఆమెకు ప్రాప్తించేది చివరకు నరకయాతన మాత్రమే అని బుద్ధిచెప్పి పంపిస్తుంది. దీనివల్ల ఆనాడు వశీకరణ విద్య బాగా వ్యాప్తిలో ఉండేదని, దానివల్ల ఎన్నో విపరీతాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తున్నది.

ఈ వశీకరణ విద్య గురించి 'దశకుమారచరిత్ర'లో కూడా కనిపిస్తుంది. "నా యొద్దను నిపుడొక మందున్నది. అది ఒంటికి పూస్తే నీవు (కోమలి) ఆడుకోతివి అవుతావు. ఆ రాజుకు నీ మీద ప్రేమ పోతుంది"[112] అని ఉంది. ఈ విధంగా ప్రాచీన సాహిత్యంలో వశీకరణవిద్య, దాని ఫలితాలు ప్రస్తావించబడ్డాయి.

2.2.9. ప్రతిస్మృతి విద్య:–

ప్రాచీన కాలపు విద్యల్లో విశేషమైనది, అతి రహస్యమైనది ఈ ప్రతిస్మృతివిద్య. ఈ విద్య వల్ల విద్యార్థికి ఏకాగ్రత, దీక్షాశక్తి లభిస్తాయి. గొప్పకార్యాలు సాధించడానికి ఈ విద్య శారీరక, మానసిక బలాల్ని ఇస్తుంది. ఆంధ్రమహాభారతంలోని అరణ్యపర్వంలో ఈ ప్రతిస్మృతి విద్య ప్రస్తావన ఉంది.

దుర్యోధనుడి పక్షంలో ఉన్నటువంటి భీష్మ, ద్రోణ, కర్ణాది వీరులను జయించగలమా? అనే ఆలోచనలో ఉన్న ధర్మరాజు దగ్గరకు వేదవ్యాసుడు వస్తాడు. పాండవులు అతనికి సాదరంగా ఆహ్వానం పలుకుతారు. అప్పుడు వ్యాసమహర్షి, ధర్మరాజుతో ఇలా అంటాడు.

"దాని నపనయింగాఁగా నిప్డు వచ్చితి / నధిక యోగలబ్ధ మతి రహస్య
మీ విశేష విద్య సేవింపఁగాఁబార్థుఁ / బనుపు మితడుఁ దీనఁ బడయుసిద్ధి"[113]

ఓ ధర్మరాజా! నీ మనస్సులో ఉన్న ఆలోచనను గుర్తించాను. దిగులుపడవలసిన పనిలేదు. నేను నీకు ప్రతిస్మృతి అనే విశేషవిద్యను ప్రసాదిస్తాను. నీవు దీనిని అర్జునుడికి తెలుపు. ఈ విద్యవల్ల అతడు ఇంద్రయమవరుణకుబేరాది దేవతలను, ఈశ్వరుడిని ప్రత్యక్షం చేసికొని దివ్యాస్త్రాలను పొంది శత్రువులను జయించగలడు అని చెప్పి వ్యాసుడు వెళ్ళిపోతాడు. ఈవిధంగా మహాభారతంలో ప్రతిస్మృతివిద్య గురించి కనిపిస్తుంది. ఇతర కావ్యాల్లో దీని ప్రస్తావన లేదు.

ఇక్కడ మనకు ఒక సందేహం రావచ్చు. వేదవ్యాసుడు నేరుగా అర్జునుడికే ప్రతిస్మృతివిద్యను నేర్పించవచ్చు కదా? ధర్మరాజుకే ఎందుకు మొదట బోధించాడు? ఇద్దరూ ఆయన ఎదురుగానే ఉన్నారు కదా?

దీనికి సమాధానం క్రిందివిధంగా చెప్పవచ్చు. ధర్మరాజు ధర్మానికి ప్రతీక. భీముడు అర్థానికి, అర్జునుడు కామానికి, కవలలు మోక్షానికి ప్రతీకలు. చతుర్విధ పురుషార్థాలు ఆత్మధర్మాలుగా కలిగినవారు పాండవులు. అందువల్లే వేదవ్యాసుడు మొదట ధర్మానికి ప్రాధాన్యతను ఇచ్చాడు. ధర్మమార్గంలో ప్రయాణించి ప్రతిస్మృతివిద్య ద్వారా అర్జునుడు తన కోరికలను తీర్చుకోవాలన్నది వ్యాసుడి ఆంతర్యం. అందుకే అతడు నేరుగా ఈ విద్యను అఱ్జునుడికి బోధించకుండా, ధర్మరాజుకే మొదట బోధించాడు. ఈ విద్య వల్ల కార్యసాధనకు గల అడ్డంకులన్నీ తొలగి విజయం లభిస్తుంది. ఈవిద్యను నేర్చిన వాడికి ఆకలిదప్పులు, శారీరక అలసట ఉండవు.

ఈ ప్రతిస్మృతివిద్యను స్వీకరించాలంటే ఆ విద్యార్థికి కార్యదీక్ష కావాలి. అటుంటి నియమపూర్వకమైన దీక్ష కలవాడు కాబట్టే అర్జునుడికి ధర్మరాజు ఈ విద్యను బోధించాడు. ఈ విద్యను పొందదలచిన వ్యక్తి యోగసాధన కూడా చేయాలి. పతంజలి చెప్పినటువలంటి యమం, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధ్యానం, ధారణ, సమాధి అనే అష్టాంగాలను సాధన చేయాలి. అప్పుడే అతని స్మృతి పరిపక్వతను పొందుతుంది.

వ్యాసభగవానుడు ప్రతిస్మృతి విద్యను ధర్మరాజుకే మొదట బోధించటానికి మరో కారణఁ కూడా కనిపిస్తుంది. ధర్మరాజు మహారాజు, దేశాధినేత. కాబట్టి అతని ద్వారా అతని ప్రజలకు సమాచారం అందాలి. రాజు అనుమతి లేకుండా రాజ్యంలో ఏమీ జరగటానికి అవకాశం లేదు. అర్జునుడు తపస్సు చేసి అస్త్రాలను సంపాదించాలన్న ధర్మరాజు అనుమతి తప్పకుండా ఉండాలి. కాబట్టి వ్యాసుడు మొదట మహారాజు అయిన ధర్మరాజుకు ప్రతిస్మృతివిద్యను చెప్పాడు. అతని ద్వారా అర్జునుడికి చెప్పించాడు. మహారాజు కన్నా మిగిలినవారు రాజ్యంలో ఉన్నతులైతే ఆ రాజ్యానికే ప్రమాదం. ఇది నాటి రాజనీతికి నిదర్శనం.

2.2.10. అస్త్ర విద్యలు :-

ప్రాచీన తెలుగు కావ్యాల్లో దేవతలు లేదా రాజులు వివిధ రకాల అస్త్రాలను ప్రయోగించినట్లు వర్ణించబడింది. విద్యార్థి, గురువు నుండి వీటిని ప్రయోగోపసంహారాలతో నేర్చుకునేవాడు. ప్రాచీన కాలంలో, ప్రతి రాజకుమారుడు నేర్చుకోవలసిన విద్యల్లో అస్త్రవిద్య తప్పనిసరిగా ఉండేది. 'శ్రీమద్రామాయణం'లో వాల్మీకి మహర్షి క్రింద పేర్కొనబడిన అస్త్రాలను గురించి తెలియజేశాడు.

"దండచక్రం, ధర్మచక్రం, విష్ణుచక్రం, ఇంద్రచక్రం, వజ్రాస్త్రం, శైవాస్త్రం, శూలవత్, బ్రహ్మశీర్షాస్త్రం, ఐషికాస్త్రం, బ్రహ్మాస్త్రం, శిఖరిగదాస్త్రం, మోదకిగదాస్త్రం, ధర్మపాశము, కాలపాశము, వారుణాస్త్రము (లేక) వామనాస్త్రము, శుష్కాశని అస్త్రం, ఆర్ద్రాశని అస్త్రం, పైనాకాస్త్రం, నారాయణాస్త్రం, ఆగ్నేయాస్త్రం, శిఖరాస్త్రం, వాయువ్యాస్త్రం, శక్తిద్వయాస్త్రం, కంకాళాస్త్రం, ముసలాస్త్రం, కపాలాస్త్రం, కింకిణీ అస్త్రం, వైద్యాధరాస్త్రం, నందన-అసిరత్న-అస్త్రం (Laughing gas), గాంధర్వాస్త్రం (మోహనాస్త్రం), పుస్వాపనాస్త్రం, సౌమ్యాస్త్రం, ప్రశమనాస్త్రం, సంతాపనాస్త్రం, వర్షణాస్త్రం, శోషణాస్త్రం, విలాపనాస్త్రం, మదనాస్త్రం, మానవాస్త్రం, పైశాచాస్త్రం, తామసాస్త్రం, సోమనాస్త్రం, సంవర్తనాస్త్రం, మౌసలాస్త్రం, సత్యాసనం, మాయామాయాసనం, పౌరాస్త్రం (తేజఃప్రభం), సోమశిఖరాస్త్రం, త్వాష్ట్రాస్త్రం, భాగమాస్త్రం, శీతేషు అస్త్రం, మానదాస్త్రం"[114].

ఈ విధంగా వాల్మీకి మహర్షి, రామలక్ష్మణులకు వివిధ అస్త్రశస్త్రాలను గురించి తెలిపాడు. తర్వాత వాటికి క్రిందివిధంగా ఉపసంహారాలను తెలియజేశాడు.

"సత్యవాన్, సత్యకీర్తి, ధ్రుష్ణ, రభస, ప్రతీహారతర, పరాఙ్ముభాసము, అవాంగ్ముఖము, లక్ష్య, అలక్ష్య, దృఢనాభ, సునాభ, దశాక్ష, శతవక్త్ర, దశశీర్ష, శతోదర, పద్మనాభ, మహానాభ, దన్దునాభ, స్వనాభ, జ్యోతిష, శకువ, వైరాశ్య, దైత్యనాశక, యౌగంధర, వినిద్ర, శుచిబాహు, మహాబాహు, నిష్కలి, విరుచ, సార్చిమాలీ, ధూతిమాలీ, వృత్తిమాన్, రుచిర, పిశ్య, సౌమనస్య, విధూత, మకర, పరివార, రతి, ధన, ధాన్య, కామరూప, కామరుచి, మోహ, ఆవరణ, జృంభక, సర్పనాథ, పన్దాన, వరుణ"[115].

దీన్నిబట్టి ప్రాచీనకాలంలో మహర్షులు అస్త్రవిద్యలో ఎంతటి ప్రావీణ్యం సంపాదించారో మనం అర్థం చేసుకోవచ్చు. ఇంతటి శాస్త్రవిజ్ఞానం ఉన్న ప్రాచీన భారతదేశం అభివృద్ధి దశలో ఉండేదని చెప్పకతప్పదు. మన పూర్వులు తమ శాస్త్ర పాండిత్యాన్ని ఇతరుల మేలు కొరకే ఉపయోగించేవారు. స్వార్థం కోసం కాదు. ప్రకృతికి విరుద్ధంగా, ధర్మవిరుద్ధంగా వాళ్ళు యుద్ధాలు చేయలేదు. నైతికత, శాస్త్రవిజ్ఞానం, వీరత్వం

ముప్పేటగా మూర్తీభవించిన మానవీయ మూర్తులు మన ప్రాచీన భారతీయులు. శాస్త్రవిజ్ఞానం ప్రగతికి బాటలు వేయాలి. ఇతరులను బాధపెట్టేందుకు కాదు అన్నది వాళ్ళు నమ్మిన సిద్ధాంతం.

2.2.11. సంస్తంభన విద్య:-

'స్తంభనం' అంటే కదలకుండా చేయడం అని అర్థం. అగ్ని, వాయు, జల స్తంభనాది చాలా రకాల స్తంభనవిద్యలు ప్రాచీనకావ్యాల్లో కనిపిస్తాయి. వాటిలో ఒకటి – వస్తువులను, మనుషులను కదలకుండా ఉండేటట్లు చేయడం. మహాభారతంలోని అశ్వమేధపర్వంలో అగ్నిదేవుడు, ఇంద్రుడికి సందేశాన్ని మరుత్తుకు వినిపిస్తాడు. ఈ సందర్భంలోనే ఈ సంస్తంభనవిద్య ప్రసక్తి వస్తుంది.

గంధర్వ రాజైన ధృతరాష్ట్రుడు, మరుత్తుడితో ఇట్లా అంటాడు. దేవేంద్రుడికి ప్రీతి కలగాలంటే బృహస్పతిని ఉపద్రష్టగా అంగీకరించమని, లేకపోతే అతడికి ఆగ్రహం వచ్చి వజ్రాయుధాన్ని ప్రయోగిస్తాడని అంటాడు. దనితో మరుత్తుడు, సంవర్త మహర్షిని ప్రార్థించి ఇంద్రుడి ఆజ్ఞను తెలియజేశాడు. అప్పుడు సంవర్తుడు క్రిందివిధంగా ధైర్యం చెపుతాడు.

"ఇంద్రునిదెస భయం బించుకేనియు వల / దతఁడు నన్నెఱుఁగడే యధిప! వినుము
సంస్తంభవిద్యా ప్రశస్తవైభవమున / వజ్రంబు నడఁతు నవ్వాసవాది
దైవతంబుల యాయుధంబులు నా చేతఁ / బ్రతిహతంబొందు; దుష్పవనచండ
వృష్టి ప్రముఖమహా వికృతుల బాధింతు / 'ననుడు మ్రోయుచు నిదె యరుగుదెంచె
భిదుర మెవ్విధమున భీతి దొఱంగుదు?' / ననియె నృపతి; యాతఁడల్ల నగుచు
దాని సరకుగొనకు 'తగు వర; మడుగు నా / తపము పేర్మి నిత్తు ధరణినాథ!"[116]

ఓ రాజా! ఇంద్రుడి విషయంలో కొంచెం కూడా భయంవద్దు. అతనికి నా గురించి తెలియదా! చెపుతున్నాను విను. సంస్తంభవిద్యకు ఉన్న గొప్పశక్తితో అతడి వజ్రాన్ని అణచివేస్తాను. ఆ ఇంద్రాది దేవతల ఆయుధాలు నా ముందర పనిచేయవు. సుడిగాలులతో, భయంకరమైన వర్షాలలో దేవతాసముహాన్ని ముప్పుతిప్పలు పెట్టుతాను' అంటుండడగానే ఇంద్రుడు వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. ఇదిగో వజ్రాయుధం పెనుమ్రోతతో ఇటు వైపే వస్తున్నది అని మరుత్తుడు సంవర్తుడిని శరణువేడుతాడు. అప్పుడు సంవర్తుడు తన సంస్తంభనవిద్యతో వజ్రాయుధాన్ని కదలకుండా నిలిపివేస్తాడు. నీకు భయంలేదు. నీకు ఏమి వరం కావాలో కోరుకో? అని మరుత్తుడిని అడుగుతాడు.

ఈ కథను బట్టి ప్రాచీన యుద్ధతంత్రంలో ఈ సంస్తంభనవిద్య కూడా ఒకటని తెలుస్తున్నది. జలస్తంభన విద్యను దుర్యోధనుడు నేర్చుకున్నాడు. కురుక్షేత్రయుద్ధం చివరలో నీటి అడుగున ఈ విద్య ప్రభావంతో దాక్కున్నాడు. ఇలా స్తంభనవిద్య ప్రాచీనవిద్యల్లో ప్రత్యేకవిద్యగా కనిపిస్తున్నది.

2.2.12. అంజనం చూసే విద్య :-

ప్రాచీనకాలంలో సన్న్యాసులు, సిద్ధులు నేర్చిన విశేష విద్యల్లో అంజనం చూడటం కూడా ఒకటి. భవిష్యత్తులో ఏమి జరుగబోతోందో దీని ద్వారా తెలుసుకోవచ్చు. పల్లెప్రజలకు దీని పట్ల విశ్వాసం ఎక్కువ. పెంకులో కాటుకను పూసి, మంత్రాలను చెపుతూ కోరిన వ్యక్తిని, కోరిన పదార్థాన్ని దానిలో చూడటం జరుగుతుంది. ఇప్పటికీ గ్రామాల్లో ఇటువంటి విద్య తెలిసినవారు కనిపిస్తారు.

నన్నెచోడుని 'కుమారసంభవం'లో ఈ అంజనం చూడటం గురించి ప్రస్తావన ఉంది.

"పరమ స్నేహము హృత్సరోరుహమునం బాత్రంబు గావించి, సు
స్థిరతం బుణ్యదశం దపోగ్ని మది నుద్దీపించి, బ్రహ్మాండ క
ర్పరఖండంబున మంత్రకజ్జల మొగిన్ ఫాలాక్షుఁ గూర్పింప న
గ్గిరిరాజాత్మక పట్టె నా నమరి నింగి బర్వె నీలాభ్రముల్"[117]

పర్వతరాజు కుమార్తె అయిన పార్వతీదేవి, శివుని కూడేటట్లు చేయటానికి నెయ్యము అనే చమురును, హృదయమనే పద్మమునందు నింపి, సుస్థిరతతో పుణ్యము అనే వత్తిని వేసి, తపస్సనే అగ్నితో వెలిగించి, బ్రహ్మాండమనే కుండపెంకులో సమంత్రకమైన కాటుకను పెట్టినట్లుగా నల్లని మేఘాలు ఆకాశమంతా వ్యాపించి ఉన్నాయి.

దీన్నిబట్టి 12వ శతాబ్దం నాటికే ఈ విద్య సమాజంలో వ్యాపించి ఉందని తెలుస్తున్నది. లోకంలో 'మసిపూసి మారేడు కాయ చేయడం' అనే జాతీయం ఉంది. ఇది అంజనం చూడటానికి సంబంధించిన జాతీయమే. అయితే కొందరు సిద్ధులు స్వార్థం కోసం అంజనం వేసి ప్రజల్ని మోసం చేసేవారు. తప్పిపోయిన వారిని వెతకటానికి, పశువుల జాడను గుర్తించడానికి నేటికీ తెలుగుప్రాంతంలో ఈవిద్యను వాడుతున్నారు.

2.3. వినోద విద్యలు

2.3.1. గారడి విద్య:-

'గారడివిద్య' అన్న పదానికి సాధారణంగా లోకంలో 'మోసంచేయడం' అనే అర్థం ఉన్నది. ప్రాచీన కావ్యాల్లో ఈ విద్య ప్రస్తావన ఉంది. దీనికే కనికట్టువిద్య, ఇంద్రజాలవిద్య, బిందుమతీవిద్య అనే పేర్లున్నాయి. 'గారడి' అనే పదానికి శబ్దరత్నాకరంలో 'పాములవాడు, అవతుంజికుడు'[118] అనే అర్థాలున్నాయి. 'బిందుమతీ' అనే పదాన్ని గురించి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' గ్రంథంలో సురవరం ప్రతాపరెడ్డి గారు క్రిందివిధంగా తెలిజయజేశారు. "ఇది గారడి (ఇంద్రజాలవిద్య) శబ్దరత్నాకరంలో ఈ శబ్దమే లేదు.

సంస్కృత నిఘంటువగు 'శబ్దకల్పద్రుమము'లోనూ ఈ పదము లేదు. బిందుమతి అనునది 'విప్రవినోదం' అనే ఇంద్రజాలవిద్య వంటిది విప్రవినోదమను విద్యను ఒక విధమగు బ్రాహ్మణజాతి వారే, వారును తెనుగు దేశమందే ఒక గారడి విద్యగా ప్రదర్శించెడివారు"[119] అని వారు వివరించారు. దీన్నిబట్టి ఈ బిందుమతీవిద్య తెనుగు ప్రాంతంలోనే విశేషంగా ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది. అయితే 'బిందుమతీవిద్య' బ్రాహ్మణజాతి వారు మాత్రమే ప్రదర్శించగా, 'గారడివిద్య' మిగిలిన అన్ని వర్ణాల వారి చేత ప్రదర్శించబడేది.

ప్రాచీనకాలంలో కొన్నిజాతులవారు ఈ గారడివిద్యను వృత్తిగా చేసుకొని బ్రతికేవారు. వారిలో పాములను ఆడించేవారు, కోతిని ఆడించేవారు ముఖ్యమైనవారు. ఇది వినోదం కోసం ఆడే ఆట. మనిషి జంతువుగా మారిపోవటం, జంతువు మనిషిగా మారటం, నోటిలోంచి వివిధ రకాల వస్తువుల్ని బయటకు తీయడం లాంటివి గారడివిద్యలో కనిపిస్తాయి. చూసేవారికి వినోదాన్ని, ఆడేవారికి ఆకలినీ తీరుస్తుంది ఈ గారడివిద్య. ఈ గారడివిద్యను గురించి సురవరం ప్రతాపరెడ్డి గారు ఇలా వివరించారు. "ఇంగ్లండులోని ఇంగ్లీషు పత్రికలలో ఇంచుమించు 40 యేండ్ల క్రిందట ఒక ఇంగ్లీషు వాడొక ఇంద్రజాల ప్రదర్శనమును హిందూస్థానములో చూచి దాన్ని చాలా మెచ్చుకొని ఆనాడే పత్రికలో వ్రాసెను. ఆ ఇంద్రజాలములో ఒకడు త్రాటినొక దానిని పైకి నిలువుగా విసరి గాలిలో నిలబెట్టి దానిపైకి ఎగబ్రాకి మాయము కాగా, వాని యంగములు ఖండఖండములుగా క్రిందబడెననియు, మరికొంతసేపటికి వాడు త్రాటి నుండి గబగబ దిగివచ్చెననియు వ్రాసెను. అది యబద్ధమనియు అట్టి విద్యను ప్రదర్శించు వానికి ఇంగ్లండుకు రానుపోను వ్యయమును భరించి వేలకొలదిగా బహుమానములిత్తు మనియు కొందరు ప్రకటించిరి"[120]. దీన్నిబట్టి క్రీ.శ. 15 శతాబ్దం నాటికి ఆంధ్రదేశంలో గారడివిద్యకు మంచి ప్రాచుర్యం ఉందని, అది విదేశీయుల్ని సైతం ఆకర్షించిందని తెలుస్తున్నది. అయితే 'గారడి' నేర్చుకునేటప్పుడు విద్య అవుతుంది. ఈ విద్యను నేర్చుకున్న వ్యక్తి తన ప్రజ్ఞాపాటవాలతో ఈ విద్య భిన్నరీతుల్లో ప్రదర్శించి ప్రేక్షకుల మనస్సులను ఆకట్టుకున్నప్పుడు ఇది కళ అవుతుంది.

కొఱవి గోపరాజు 'సింహాసన ద్వాత్రింశిక' లో ఇటుంటి ఇంద్రజాల విద్య గురించి వర్ణించాడు. ఒకడు తనభార్యను తీసుకువచ్చి రాజు సన్నిధిలో నిలిపాడు. ఓ మహారాజా! నేను దేవతలకు యుద్ధంలో సహాయం చేయడానికి వెళుతున్నాను. నేను తిరిగి వచ్చేంత వరకు నాభార్య రక్షణ మీకు అప్పగిస్తున్నాను అని పలికి పెద్ద త్రాడు పైకి విసిరి, దాని పైకి ఎగబ్రాకి మాయమయ్యాడు. కొంతసేపటికి అతడి కాళ్ళూచేతులు, తల, మొండము ముక్కలై క్రిందపడ్డాయి. దాన్ని చూసి తన భర్త యుద్ధంలో చనిపోయాడని భావించిన అతడి భార్య రాజు వద్ద ఆజ్ఞ తీసుకొని అగ్నిప్రవేశం చేసింది. కొద్దిసేపటికి త్రాడు పైకి పోయిన భటుడు క్రిందికి దిగివచ్చి

తన భార్యను చూపించమని రాజును అడిగాడు. రాజు విచారంతో జరిగిన విషయం చెప్పాడు. ఆ వీరుడు ఏంతో బాధపడ్డాడు. భార్యలేని జీవితం వ్యర్థమనుకున్నాడు. అతను కూడా సహగమనం చేశాడు. దీన్ని కొఱవి గోపరాజు ఇలా వర్ణించాడు.

"ఆ వీరుండప్పుడె నిజభావము ప్రకటముగ నాత్మభామిని తోడన్
దా వైతాళికుడగుచున్ గైవారము చేసె జనులు కడువెరగందన్."[121]

దీన్నిబట్టి ఆనాటి ప్రజలకు, యుద్ధవీరులకు గారడి విద్య తెలుసునని బుజువవుతున్నది. యుద్ధాల సమయంలో భటులు దీని సహాయంతో శత్రువులను ఎదిరించే అవకాశం ఉంది. ఇది కేవలం పొట్టకూటికోసం పనికివచ్చే విద్యగానే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో ఆత్మరక్షణకు కూడా ఉపయోగపడుతుంది. 'కుమారసంభవం'లో గారడివిద్య గురించి ఇలా వర్ణించబడింది.

"దొరకొను నింద్రజాలమున దోచిన రూపము లింద్రజాల మం
చరయగలేక చూపఱకు నన్నియు నిక్కమ వోలెనైనయ
ట్లెరవుగ బారమార్థికుల కెప్పుడు ద్రవ్యములెల్ల మిథ్యలై
నిరతముజూడ లోకులకు నిక్కములై చను భ్రాంతి పెంపునన్"[122]

ఇంద్రజాలం వల్ల సామాన్యులకు భ్రాంతి కలుగుతుందని, కానీ సత్యం తెలుసుకోగలిగిన వారికి వాస్తవం తెలుస్తుందని భావం. జ్ఞానులు గారడివిద్యకు మోసపోక సత్యాన్ని గ్రహిస్తారని కవి తెలిపాడు.

2.3.2. పాములాట :–

ఈ పాములాట వృత్తివిద్యల్లో ఒకటి. ఇది కేవలం వినోద కళ మాత్రమే కాదు. జీవనభృతికి కూడా ఈ విద్య ఉపయోగపడేది. దేశీయమైన కళల్లో ఇదీ ఒకటి. కుటుంబంలోని వారంతా ఈ ఆటలో పాల్గొంటారు. పాముల చేత ఆటలాడిస్తారు. నాగస్వరం ఊదుతూ నాగుల చేత నాట్యం చేయిస్తారు. ఈ ఆట ఆడేవారికి జీవనాధారం, చూసే వారికి వినోదం.

క్రీడాభిరామంలో పాములట గురించి ఈవిధంగా ఉన్నది.

"కడగోరఁ దీర్చిన కస్తూరి గీర్బొట్టు / నెక్కసక్కెబుగాఁ జుక్కమెఱయ,
నడ్డంబు ద్రిక్కటంబునై యురస్ స్థలమున / గంధసార స్థాసకముల మెఱయఁ
జాల నిగ్గులు గుల్కు పాలఱెక్కల కుచ్చు / వామ కర్ణంబుతో పక్కళింపఁ,
బెనచి వెండ్రుకలతోఁ బిరివెట్టి చుట్టిన / ప్రాఁత చంద్రిక వన్నె పాగ యమర,
జన్నిదంబుగఁ బెను బాము సవదరించి / యంఘ్రికటకంబు ఘుల్లుఘుల్లునుచు మెరయ
నాహితుఁడిక గరళ విద్యాధిరాజు / వచ్చెఁబాముల మెంగఁడు వదరులాఁడు"[123]

ముఖానికి కస్తూరిబొట్టు, ఎకసెక్కంలాగా బుగ్గన సుక్క, మెడలో గంధసార స్థాసకాలు, తెల్లని తలపాగ ధరించి, చేతిలో పెద్ద పామును పట్టుకొని పాములమెంగడు వచ్చాడు అని ఇందులో వర్ణించబడింది. నాడు ఈ పాములాట సమాజంలో ప్రదర్శించబడింది కాబట్టే ఈ కావ్యంలో స్థానాన్ని పొందింది. నాటికే పాములాడించు వారికి వాటి కోరలు తీసివేయుటం, మచ్చిక చేసుకోవటం బాగా తెలుసు. పోతన భాగవతంలోని ప్రహ్లాద చరిత్రలో కూడా పాములాడించువారి ప్రస్తావన ఉంది. హిరణ్యకశిపుడు తన మాట వినని ప్రహ్లాదుడిని పాముల చేత కరిపించాడు. ఈ సందర్భంలో పాములవాడు, తాను తెచ్చిన పాముల విశిష్ఠతను ప్రహ్లాదుడికి వివరించి చెప్తాడు. ఇకనైనా మనసు మార్చుకుని హరిభక్తి మానకపోతే ఆ పాముల చేత కరిపిస్తాను అంటాడు.

క్రీడాభిరామంలో, పాములమెంగడి నాదస్వర నైపుణ్యం క్రిందివిధంగా వర్ణించడం జరిగింది.

"ఫూత్కార పవనంబు పూరించు పుక్కిళ్ళు
ము సిఁడి పండులతోడ ముద్దుఁ గురియ
సందిట సంకుపూసల సద్దుకటు తుంబి
నాద స్వరోజ్జృంభణముల నడఁపఁ
నేడు రంధ్రమ్ములు నిరుఁగేల వ్రేళ్ళను
వివృతి సంవృతి లీల విస్తరింప,
నాలాప తాళాంతరాంతరంబులయందుఁ
గిక్కను శబ్దముల్ చొక్కటముగ.
నాగసిధు ప్రభేద నానా వరాట
రాగ గంధర్వలహరి కారంభణముల
మిహి పదంబుగఁ బాముల మెంగఁడూఁదె
భోగిరాజులు నర్తింప నాగ సొరము"[124]

పై విధంగా నాడు పాములవాళ్ళు నాదస్వరం ఊదుతూ పాములాడించినట్లు, రాజులను ఆనందపరిచి వారిచ్చిన ధనంతో జీవనం సాగించినట్లు తెలుస్తున్నది. ఈ నాదస్వరానికి ఏడు రంధ్రాలు ఉండేవి. పాములవాడు తన చేతివ్రేళ్ళను ఆ రంధ్రాల మీద అటూ ఇటూ మారుస్తూ కొత్తకొత్త రాగాలను పలికించేవాడు. ఈ రాగాల్లో 'నాగసింధు' అనేది ఒకటి. ఈ పాములాటను చూసి ముసలివాళ్ళు కూడా ఆనందించినట్లు చెప్పబడింది. ఈ పాములాటను ఇప్పటికీ గ్రామాల్లో ప్రదర్శిస్తున్నారు.

2.3.3. జూదవిద్య:–

'జూదం' ప్రాచీనవిద్యల్లో ప్రఖ్యాది పొందింది. ఇది వినోదక్రీడ. కానీ కొన్ని సందర్భాల్లో ఇది యుద్ధాలకి, పతనానికి దారితీస్తుంది. ఈ వ్యసనానికి అలవాటుపడితే సర్వసంపదలు పోగొట్టుకొని వీధుల వెంబడి పోవలసిందే. పాండవులు రాజ్యం పోగొట్టుకొని అడవులపాలు కావటానికి ఈ జూదవిద్యే కారణం. ధర్మరాజు జూదవ్యసనపరుడు. శకుని మయాజాలం ముందు ఓడిపోయాడు. ద్రౌపది పరాభవించబడింది. పాండవులు సకటుంబంగా అడవుల పాలు కావటానికి ఈ జూదవిద్య కారణం అయింది. దీన్ని గురువులు విద్యార్థులకు పాఠశాలల్లో నేర్పినా, నేర్పకపోయినా సమాజం నుండి ఈ విద్యను నేర్చుకునేవారు. పెద్దలు, స్నేహితులు ఆడుతుండగా చూసి నేర్చుకునేవారు.

జూదం ఆడి పాండవులను ఓడిస్తానని దుర్యోధనుడు అన్నప్పుడు, అతడిని వద్దని వారిస్తూ ధృతరాష్ట్రుడు ఇలా అంటాడు.

"జూద మిది యేల? దీనను / భేదము మీలోనఁ బుట్టుఁ బెలుచన; యుష్మ
ద్భేదమునఁజేసి యెగ్గు / త్పాదిల్లు ధఖిత్రిఁ బ్రజకు భయజననంబై"[125]

ఈ జూదం ఎందుకు? దీనివల్ల మీలో మీకు తీవ్రమైన వైరం పుడుతుంది. ఈ వైరం వల్ల ప్రజలందరికి భయంకరమైన కీడు కలుగుతుంది కాబట్టి జూదం ఆడటం శ్రేయస్కరంకాదు అని దుర్యోధనుడితో అంటాడు.

ధృతరాష్ట్రుడు కొడుకుతో ఇంకా ఇలా అంటాడు.

"ఇమ్మహి నీవుఁ బాండవులు నెప్పటియట్ల పరస్పరాను రా
గమ్మున నేలుచున్కి యిది కార్యము; పాండవలక్ష్మి నీ కస
హ్యమ్మున నేల? వంచనఁ బరార్థ పరిగ్రహ బుద్ధిఁ జేసి పా
పమ్మగుఁ; బాపకారులకుఁబాయు నవశ్యము నర్థధర్మముల్"[126]

ఈ భూమిని నీవు, పాండవులు ఎప్పటిలాగే పరస్పర ప్రేమతో పాలిస్తూ ఉండటం మంచిది. పాండవుల సంపద నీకు ఎందుచేత సహింపరానిదైంది? మోసంతో ఇతరుల సంపద పరిగ్రహించాలనే ఆలోచన వల్ల పాపం కలుగుతుంది. పాపాత్ములకు సంపద, ధర్మం తప్పక నశిస్తాయి. దీనివల్ల జూదవిద్య సర్వనాశనం కలిగిస్తుందని తెలుస్తుంది.

ప్రాచీనకాలంలో ధర్మరాజు, శకుని, నలుడు, శల్యుడు మొదలైనవారు జూదవిద్యల్లో ప్రావీణ్యం కలవారని తెలుస్తుంది. నలచక్రవర్తి కూడా జూదంలోనే రాజ్యాన్ని కోల్పోయి భార్యోతో పాటు అడవుల పాలయ్యాడు. పడరాని కష్టాలు పడ్డారు నలదమయంతులు.

అలాగే శ్రీకృష్ణదేవరాయల తల్లి, పినతల్లితో జూదంతో ఓడిపోయి ఆమెకు దాసిగా మారింది. శ్రీకృష్ణదేవరాయలు దాసీపుత్రుడయ్యాడు. చరిత్రను గమనిస్తే ఈ జూదవిద్య వ్యసనంగా మారినప్పుడు సర్వనాశనం తప్పదని పై కథల వల్ల తెలుస్తుంది.

కొఱవి గోపరాజు 'సింహాసనద్వాత్రింశిక'లో ఒక జాదగాడు తన జూదవిద్యా కౌశలాన్ని క్రిందివిధంగా తెలిపాడు.

"చెప్పిన దీన నే సిద్ధియౌ నట్లయ్యు
నడిగిన నాకిది యడఁపనేల
మేటి జూదరి యన వాటమౌ తివుటమై
నాడుచుండుదు నే నహర్నిశంబు
దృష్టియేమఱక నందియు జోగరంబును
దిగియును గాళనఁ దేటపడిన
యచ్చులలోన నే యచ్చెనఁగైకొని
మాటలాడిన యట్ల వేటుగలుగఁ
దలఁపుగతి వచ్చుఁగోరిన దాయ మనఁగ
శకుని జూదము నీనియచ్చొకటి యనఁగ
గెలుపునాదిగ నొడ్డుచు గిలుబనేర్చి
యెల్లపిడికిళ్ళు విడిపించి యేనకొందు"[127]

జూదగాడు, నేను చెప్పింది జరుగుతుంది. నేను ఏది కోరితే అదే పందెంలో వస్తుంది. నేను మేటి జూదరి అనిపించుకోవటం జరిగింది. ప్రతిరోజూ నేను ఈ ఆటను నైపుణ్యంతో ప్రదర్శిస్తాను అంటాడు.

పై విధంగా జూదం అనేది అరవైనాలుగు కళల్లో ఒకటి అయినా, అది సర్వనాశన హేతువు అని తెలుస్తుంది. కబాట్టి ప్రాచీనులు దీనిపట్ల ఎక్కువ ఆసక్తి చూపలేదు. ధర్మవేత్తలు దీనిని అంగీకరించలేదు.

2.3.4. తూర్పునాటిగడిడు :–

వినుకొండ వల్లభామాత్యుని 'క్రీడాభిరామం'లో తూర్పునాటిగడిడు అనే ఆటగాళ్ళు గురించి చెప్పబడింది. వీరు ప్రత్యేకమైన వేషధారణ, వాద్యపరికరాలు ధరించి పాటలుపాడుతూ, ఆడుతూ గ్రామాల్లో

సంచరించేవారు. ఈ వృత్తివారు, పిచ్చుకగుంట్ల జాతివారికి దగ్గరగా కనిపిస్తున్నారు. వీళ్ళు సంచారజీవనం చేస్తూ, తమ విద్యను ప్రదర్శిస్తూ జీవించేవాళ్ళు. క్రీడాభిరామంలో ఈ వృత్తవారు ఎలా ప్రదర్శనలు చేసేవారో వర్ణించబడింది.

"నున్ననై నలుపెక్కి నొసలఁ జేరువకంటి
కెకువవైచిన శిఖపెకలుచుండఁ
దటపెట ధిమికిట ధ్వనుతోలిఁ బుట్టిఁపఁ
జాలు గుమ్మెట చంకవ్రేలు చుండ
నలుకనై మీఁజేతనంటిన యాక్రొత్త
మువ్వలత్తెము సారె ములుగుచుండ
నొసుల స్రుక్కించు నావుర్న నోరుదెఱచు
గ్రుడ్లు మిడికించు, రాగంబు గుమ్మడించు
పాడు గతులకుఁదను దానె పరగియాఁడు
నల్ల యాతండు వో తూర్పునాటి గడిఁడు"[128]

ఈ వృత్తివారు నున్నగా నల్లనైన నుదరు, పెద్దదైన శిఖ, ముఖానికి కలివె గంధపుబొట్టుతో వచ్చారు. వీళ్ళ చంకల్లో దటపెట, ధిమికిట అనే ధ్వనుల్ని పుట్టించే గుమ్మెట ఉంది. మరొక చేతిలో మువ్వలత్తెము ఉంది. నొసలు పెద్దదిగా చేస్తూ, నోరు పెద్దదిగా తెరుస్తూ, గ్రుడ్లు మిటకరిస్తూ, పాటపాడుతూ, పాటకు తగిన ఆట ఆడుతూ, తనలో తానే మురిసిపోతూ తూర్పునాటిగడిడు వచ్చాడు. శ్రీనాథుడి కాలానికి ఈ వృత్తివిద్య తెలుగుప్రాంతంలో ఉండేదని దీన్నిబట్టి తెలుస్తున్నది.

2.4. ప్రవృత్తి విద్యలు:–

2.4.1. గృహనీతి విద్య:–

విద్య అంటే కేవలం శాస్త్రజ్ఞానమే కాదు, మనిషి ఎలా జీవించాలో నేర్పేది కూడా విద్య అవుతుంది. జేమ్స్ ఆడమ్స్ మాటల్లో చెప్పాలంటే, మనకు రెండురకాల విద్య అవసరం. 'ఒకటి జీవనోపాధి ఎలా కల్పించుకోవాలో నేర్పాలి. రెండవది ఎలా జీవించాలో నేర్పాలి'[129]. ఇది చాలా విలువైన వివరణ. విద్య బ్రతుకుదెరువును చూపించాలి. అలాగే నైతికంగా మానవుడిని తీర్చిదిద్దాలి. లేకపోతే అతడి విద్య వినాశనానికి దారితీస్తుంది. ఎన్నో సమస్యలను తెచ్చిపెడుతుంది. అందుకే మన పూర్వులు గృహస్థుడు ఎలా జీవించాలో కూడా బోధించారు. బ్రహ్మచర్యాశ్రమం వదలి గృహస్థాశ్రమంలోకి ప్రవేశిస్తున్న వ్యక్తికి ఈ గృహవిద్యను గురువులు, పెద్దలు బోధించేవారు. దీనికి ప్రత్యేకమైన తరగతులు, పాఠ్యగ్రంథాలు ఉండవు.

పెద్దలు తమ అనుభవసారాన్ని తర్వాతి తరాలకు మౌఖికరూపంలో అందిస్తారు. అందువల్ల ఈ గృహవిద్య అనిబద్ధవిద్య. గృహాలయమే విద్యాలయం. తల్లిదండ్రులే గురువులు.

మహాభారతంలోని అరణ్యపర్వంలో, ధర్మరాజుకు శౌనక మహర్షి గృహస్థుడి జీవనవిధానం ఎలా ఉండాలో ఇలా చెప్పాడు. 'ఆర్తుడికి శయ్యాసౌఖ్యం, భయపడినవాడికి శరణం, దప్పిగొన్న వాడికి నీరు, ఆకలిగొన్నవాడికి తిండి, డస్సినవాడికి ఆసనం సమకూర్చటం. గృహస్థుడు నిర్వహించవలసిన సనాతన ధర్మాలు. అతిథుల పట్ల ఆదరాభిమానాలు చూపవలసిన బాధ్యత గృహస్థుడిదే. ప్రక్కన విస్తరిలేకుండా భుజించటం, తనకోసం మాత్రమే వంటచేయటం, నిష్కారణంగా పశువులను హింసించటం పాతకాలు. అంతేకాక అగ్నిహోత్రాలు, అతిథులు, చుట్టాలు, విద్వాంసులు, గురువులు, మిత్రులు, స్త్రీలు–వీళ్ళకు యథోచిత మర్యాద చేయనప్పుడు కీడు చేస్తారు. అందువల్ల గృహస్థుడు అందరికీ సంతృప్తిని కలిగించాలి.

'యజ్ఞశేషానికి 'అమృతమని' పేరు. అతిథి భుక్తశేషానికి 'విఘసమ'ని పేరు. గృహమేధి అమృతాశియు, విఘసాశియు కావాలి. ఉదయాస్తమయ వేళల్లో పక్షి, శునకాదులకు బలి ఆహారం వేయాలి. దానికి వైశ్వదేవయజ్ఞమని పేరు. ఉత్తమ గృహస్థుడు నిర్వహించవలసిన ఇటుంటి కర్తవ్యాలు ఇంకా ఎన్నో ఉన్నాయి'[130]. ఈ వివరణను చూస్తే గృహస్థుడికి నాటి సమాజంలో ఎంతటి విలువైన స్థానం ఉందో మనకు తెలుస్తుంది.

శరీరానికి వెన్నెముక ఎంత అవసరమో, సమాజానికి కూడా గృహస్థుడు అంత అవసరం. పిల్లలు, వృద్ధులు, అనాథలు మొదలైన వారిని సంరక్షించవలసిన బాధ్యత గృహస్థుడి మీద ఉంటుంది. అందుకే అన్ని ఆశ్రమాల్లోకి గృహస్థాశ్రమమే గొప్పదని అంటారు. అల్లసాని పెద్దన 'మనుచరిత్ర'లో గృహస్థుడి ఔన్నత్యాన్ని ఇలా కీర్తించాడు.

"కెలఁగుల నున్నతం గెటిజున్ను గృహమేధి / యజమానుఁడంక స్థితార్థపేటి
పండిన పెరటిక ల్పకము వాస్తవ్యుడు / దొడ్డిఁబెట్టిన వేల్పు గిడ్డి కాఁపు
కడలేని యమృతంపు నడభావి సంసారి / సవిధ మేరునగంబు భవనభర్త
మరుదేశపథ మధ్య మప్రప కులపతి / యాఁకటి కొదవు స స్యము కుటంబి
బధిర పంగ్వంధ భిక్షుక బ్రహ్మచారి / జటి పరివ్రాజ కాతిథి క్షపణ కావ
ధూత కాపాలికాద్యనాథులకు నెల్ల / భూసురోత్తమ! గార్హస్థ్యమునకు సరియె."[131]

చెవిటివారు, గ్రుడ్డివారు, బిచ్చగాళ్ళు, బ్రహ్మచారులు మొదలైన దిక్కులేని వారిందరికి గృహస్థుడు తంగేటిచెట్టులో పెట్టబడిన తేనె వంటివాడు. పశువుల దొడ్డిలో కట్టివేయబడిన కామధేనువు వంటివాడు.

ఇంటి వెనుక పెరటిలో నాటిన కల్పవృక్షము వంటివాడు. కాబట్టి సమాజ నిర్మాణంలో గృహస్థుడు చాలా ప్రధానమైనవాడని పెద్దన గారి అభిప్రాయం.

మహాభారతంలో, శకుంతల ఈ గృహనీతివిద్య గురించి తన భర్త అయిన దుష్యంతునికి క్రిందివిధంగా బోధించింది. లోకాపవాదానికి భయపడి అసత్యం పలుకుతున్న దుష్యంతుడికి కలిగించడానికి అతనితో శకుంతల ఇలా అంటున్నది.

"ధర్మార్థ కామ సాధన కుపకరణంబు / గృహనీతివిద్యకు గృహము విమల
చారిత్ర శిక్ష కాచార్యకం బన్వయ / స్థితికి మూలంబు సద్గతికి నూఁత
గౌరవంబున కేక కారణంబున్నత / స్థిరగుణమణుల కాకరము హృదయ
సంతోషమునకు సంజనకంబు భార్యయ / చూవె భర్తకు నొండ్లుగావు ప్రియము
వంత లెల్లఁబాయునింతులఁ బ్రజలను / నొనరఁ జూడఁ గనిన జనులకెందు"[132]

చతుర్విధ పురుషార్థాలను సాధించదలచకున్న వ్యక్తికి గృహనీతివిద్య చాలా ఉపయోగపడుతుంది. ఈ గృహనీతివిద్య సద్గతికి మూలం వంటిది. దీనివల్ల సమాజంలో గౌరవమర్యాదలు, సంతోషము కలుగుతాయి. భర్తకు భార్యకంటె ప్రియమైనది ఇంకొకటి లేదు. ఎటువంటి ఆపదలు కలిగినా, ఇబ్బందులు వచ్చినా భార్య మాత్రమే తోడుగా నిలుస్తుంది. అని శకుంతల గార్హస్థ్యజీవనంలోని గొప్పదనాన్ని నొక్కి చెప్పింది. తన జ్ఞానవాక్కుల ద్వారా భర్తలోని అజ్ఞానపు పొరల్ని తొలగించటానికి ప్రయత్నించింది.

ఈ గృహస్థాశ్రమానికి భార్యాభర్తలు, సంతానం, సత్యం అనేవి నాలుగు స్తంభాల వంటివి. వీటిలో ఏ ఒక్కటి సరిగా లేకపోయినా ఆ గృహం కుప్పకూలిపోతుంది. ఈ శకుంతల తన భర్తను ఉద్ధరించదలచింది. సత్యవాక్యం యొక్క గొప్పదనాన్ని కీర్తించింది. సావిత్రి, దమయంతి, శకుంతల, సీత వంటి పురాణస్త్రీలు సమాజంలో ఆదర్శమూర్తులైనారు. గృహస్థాశ్రమాన్ని సరియైన దారిలో నడవడానికి భర్తకు భార్య మాత్రమే శరణ్యం అనటానికి పై నారీమణులే నిదర్శనం.

చాతురాశ్రమాల ధర్మాలను వివరించమని ధర్మరాజు భీష్ముని కోరినప్పుడు, అతడు గృహస్థాశ్రమధర్మం గురించి క్రిందివిధంగా చెపుతాడు.

"నిజదా రైక పరత్వముం గరుణయున్ నిక్కంబునుం దాల్మియున్
సుజనాసంగము దేవపిత్రతిథి సంశుద్ధార్చనల్ హవ్యభు
గ్భజనంబున్ సకలాశ్రమస్థులను శక్యప్రక్రియం బ్రోవుఁ బం
కజగర్భుండు గృహస్థధర్మములు గా గల్పించె నుర్వీశ్వరా"[133]

ఏకపత్నీవ్రతం, కరుణ, సత్యవాక్కు, ఓర్పు కలిగి ఉండటం, సజ్జన సాంగత్యం కోరి పొందటం, దేవతల్ని, పితృదేవతల్ని, అతిథుల్ని మంచి మనస్సుతో సేవించడం, నిత్యాగ్నిహోత్రాన్ని జరపడం, మిగిలిన మూడు ఆశ్రమాల వారిని శక్తివంచన లేకుండా సేవించడం గృహస్థుడిగా చేయవలసిన పనులు. వీటిని ఆచరించిన మానవుడు సుఖసంతోషాలను పొందగలడని బ్రహ్మ తెలిపాడు అని భీష్ముడు తెలియజేశాడు. తాను గృహస్థుడు కాకపోయినా, దాంపత్యజీవనం గురించి ఆయన నోట చెప్పించడమే ఈ భారతంలోని గొప్పదనం. లోకానుభవం వల్ల భీష్ముడు సంపాదించిన జ్ఞానమే దీనికి కారణం. అందుకే భీష్ముడు ఉత్తమ బోధకుడు అయ్యాడు. పతనావస్థకు చేరుకున్న తన గృహాన్ని తానే సరిదిద్దడానికి ఇలా ప్రయత్నం చేశాడు. ధర్మరాజును వంశకర్తగా మార్చడం, మహారాజను చేయడం భీష్ముడి బోధనలకు లక్ష్యం.

ఈ గృహస్థాశ్రమం బాధ్యతాయుతమైంది. శరీరానికి ప్రాణం ఎలాంటిదో సామాజిక వ్యవస్థకు గృహస్థాశ్రమం అలాంటిది. ఏవిధంగా అన్ని ప్రాణులు వాయువును ఆశ్రయించి ప్రాణాలను నిలుపుకుంటున్నాయో, ఏవిధంగా సమస్త సదీనదాలు సముద్రంలో కలిసి ఒక్కటవుతున్నాయో, అలాగే అన్ని ధర్మాలు ఈ గృహస్థాశ్రమధర్మంలో ఏకమవుతున్నాయి. ఈ గృహస్థాశ్రమం నిండుకుండ లాంటిది. ఒకవిధంగా 'గృహనీతి విద్య' అంటే గృహస్థ ధర్మాచరణం అని భావించాలి.

2.4.2. దానశాస్త్ర విద్య:-

దానశాస్త్రాన్ని ప్రాచీన కాలంలో విద్యార్థులు రాజనీతిలో భాగంగా నేర్చుకొనేవారు. పెద్దల ప్రబోధాల వల్ల తెలుసుకునేవారు. మహాభారతంలోని శాంతిపర్వంలో, జనకునికి పరాశరమహర్షి దానశాస్త్రాన్ని గురించి క్రిందివిధంగా బోధించాడు.

"ధర్మబద్ధమైన ధనము పాతికయేని! బహుళ ఫలమునిచ్చు; బాపవృత్యు
పార్జితంబ కోటియైన నిష్ఫలమంద్రు! దానశాస్త్ర విదులు మానవేంద్ర!"[134]

ఓ రాజా! దానశాస్త్రాన్ని పరిశోధించిన విద్వాంసులు, ధర్మపద్ధతిలో ఆర్జించిన ధనం కొద్దిపాటిదైనా చాలా ప్రయోజనకారి అని, అధర్మ పద్ధతిలో కూడపెడ్డిన ధనం కోటి అయినా (అత్యధికమైనా) నిష్ప్రయోజనమనీ చెప్తారు. కాబట్టి ధర్మమార్గంలో దానం చేసి పుణ్యాన్ని సంపాదించు అని జనకునికి పరాశరుడు బోధిస్తాడు.

పూర్వకాలంలో మనిషి ఎలా ధనాన్ని సంపాదించాలి, సంపాదించిన ధనాన్ని ఏయే పనులకు ఎలా కేటాయించాలి అనే చర్చ జరిగింది. దీన్ని గురించి శాస్త్రకారులు శాస్త్రరచన కూడా చేశారు. భీష్ముడు, కర్ణుడు,

పాండురాజు, ధృతరాష్ట్రుడు, ధర్మరాజు మొదలైనవారు విశేషమైన దానాలు చేశారు. యజ్ఞయాగాదుల సమయంలో రాజులు బ్రాహ్మణులకు భూదానం, గోదానం, సువర్ణదానం మొదలైనవి చేసేవారు.

దానశాస్త్ర వేత్తల అభిప్రాయం ప్రకారం, మనిషి తన సంపాదనలో ఒకవంతు తన సొంత ఖర్చుల కోసం వినియోగించాలి. రెండవ వంతు కుటుంబపోషణ కోసం ఖర్చుపెట్టాలి. మూడవవంతు భవిష్యత్తు కోసం దాచుకోవాలి. నాల్గవవంతు పుణ్యకార్యాల కోసం, దానధర్మాలకోసం కేటాయించాలి. ఈ ధర్మాన్ని పాటిస్తూ మానవుడు కూడబెట్టే ధనం ఉత్తమమైంది. అది పాతికవంతు అయినా సరే గొప్ప ఫలాన్నిస్తుందని పరాశరుడు జనకునికి బోధిస్తాడు.

పై విధంగా భౌతిక విద్యలు లేదా శారీరక విద్యలు ప్రాచీన తెలుగు కావ్యాల్లో ప్రతిఫలిస్తున్నాయి. వృత్తివిద్యలు మనిషికి జీవనభృతిని అందించేవి. అందువల్ల వీటిని నేర్చుకున్న విద్యార్థులు ఏదో ఒకవిధంగా జీవితంలో స్థిరపడేవారు. సమాజంలో నిరుద్యోగ సమస్య తక్కువగా ఉండేది. మంత్ర, యంత్ర విద్యలు, వినోద విద్యలు ఆనాటి విద్యార్థులు నేర్చుకున్న విశేష విద్యలు. వీటివల్ల కొన్ని సందర్భాలలో మంచి జరగవచ్చు, కొన్ని సందర్భాలలో చెడు జరగవచ్చు. కాబట్టి వీటిని గురువులు అందరికీ నేర్పించేవారు కాదు. యోగ్యులకు మాత్రమే ఈ విశేష విద్యల్ని నేర్పడం జరిగింది. విద్యను దుర్వినియోగం చేయకూడదనేది ఆనాటి గురువుల సంకల్పం.

పాదసూచికలు

1. సి.పి.బ్రౌన్, ఇంగ్లీషు–తెలుగు నిఘంటువు; పు.95

2. విజ్ఞాన సర్వస్వం, భౌతికశాస్త్రములు, 10 సంపుటం, పు.520.

3. శాస్త్రనామ నిఘంటువు, పు.25.

4. ఈనాడు దినపత్రిక, మంచిమాట–వ్యాసం, 12–05–20111.

5. ఉపనిషత్ సుధాలహరి, పు.109.

6. మనుచరిత్ర, 5ఆ, 9ప.

7. పైదే, 15 ప.

8. పైదే, 16 ప.

9. సభాపర్వం, 1ఆ, 34 ప.

10. మహాభారతంలో విద్యావిధానం, పుట. 56–57.

11. Indian Express, P:3.

12. వ్యాసభారతం, వనపర్వం, పు.5235, 6శ్లో.

13. సభాపర్వం, 1ఆ, 34ప.

14. భారతీయ విద్య, పు.84.

15. పైదే, పు. 84,85.

16. పైదే, పు. 85–86.

17. మహాభారతంలో విద్యావిధానం, పు. 58.

18. పైదే.

19. హరవిలాసం, అవతారిక, 26ప.

20. పైదే, 29ప.

21. కాకతీయ యుగ సాహిత్యంలో సంస్కృతి, పు.101.

22. పైదే

23. పంచతంత్రకథలు; పు.35

24. ఆదిపర్వం, 2ఆ, 207ప.

25. లోక కవి వేమన, పు.43

26. కుమారసంభవము, 6ఆ, 146ప.

27. వేమన శతకం

28. శృంగారనైషధము, 8ఆ, ప.167

29. పార్వతీపరిణయము, 5ఆ, 20ప.

30. కుమారసంభవము, 3ఆ, 36ప

31. ఉత్తరహరివంశం, 2ఆ, 30ప.

32. మనుధఱ్మశాస్త్రం, పు.328.

33. ఆదిపర్వం, 5ఆ, 229ప.

34. ఉద్యోగపర్వం, 8ఆ, 35ప

35. శాంతిపర్వం, 2ఆ, 158ప

36. ఆముక్తమాల్యద, 4ఆ, 271ప.

37. మనుధర్మశాస్త్రం, పు.578

38. శాంతిపర్వం, 1ఆ, 119-120 ప.

39. వ్యాసుడు-తిక్కన-మహాభారత రాజనీతి దర్శనం, పు.97.

40. శాంతిపర్వం, 1ఆ, 145ప.

41. వ్యాసుడు-తిక్కన-మహాభారతరాజనీతి దర్శనం, పు.134.

42. శాంతిపర్వం, 1ఆ, 359ప.

43. పైదే, 3ఆ, 172ప.

44. భీష్మపర్వం, 1ఆ, 187ప.

45. అర్థశాస్త్రం, 10-6-158పు, 5-7 శ్లో.

46. ఉద్యోగ, 3ఆ, 23 ప.

47. పైదే, 24 ప.

48. పైదే, 1ఆ, 240 ప.

49. ఆది, 5ఆ, 190ప.

50. అరణ్య, 5ఆ, 426 ప.

51. ఆది, 5ఆ, 258ప.

52. అరణ్య, 2ఆ, 172ప

53. విరాట, 1ఆ, 95ప.

54. పైదే, 101ప.

55. పైదే, 25ప.

56. సింహాసన ద్వాత్రింశిక, 9ఆ, 71ప.

57. విరాట పర్వం, 1ఆ, 242 ప.

58. సూర్యరాయాంధ్ర, పు.175.

59. ద్రోణపర్వం, 3ఆ, 105 ప.

60. సూర్యరాయాంధ్ర, పు.669.

61. శాంతి, 3ఆ, 117ప.

62. పైదే, 118ప.

63. పైదే, 120 ప.

64. సింహాసన ద్వాత్రింశిక, 1ఆ, 231 ప.

65. పైదే, 188 ప.

66. బసవపురాణం, 3ఆ, 45 పు.

67. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, పు.12.

68. నవనాథ చరిత్ర, పు.4.

69. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, పు.95

70. పైదే, పు.96.

71. మృచ్ఛకటికమ్, 3అం, 9శ్లో

72. మృచ్ఛకటికమ్ – తెలుగు వ్యాఖ్యానం (బేతవోలు రామబ్రహ్మం), పు.203.

73. సింహాసన ద్వాత్రింశిక, 10ఆ, 118ప.

74. పైదే, 120–122ప.

75. పైదే, 124–125ప.

76. మృచ్ఛకటికమ్, 360, 16 శ్లో.

77. పైదే, 17 శ్లో.

78. విరాటపర్వం – వ్యాఖ్యానం (తి.తి.దే), పు. 153.

79. విరాట, 2 ఆ, 15 ప.

80. విరాటపర్వం వ్యాఖ్యానం (తి.తి.దే), పు. 155.

81. విరాట, 12 ఆ, 347 ప.

82. అరణ్య, 1ఆ, 120ప.

83. ఆది, 6ఆ, 215 ప.

84. పైదే, 216 ప.

85.. పైదే, 216 ప.

86. సంస్కృత సాహిత్య చరిత్ర, పు.83.

87. పైదే, పు.84.

88. సింహాసన, 10 ఆ, 6ప.

89. పైదే, 8ప.

90. పైదే, 9ప.

91. పైదే, 17ప.

92. పైదే, 19ప.

93. పైదే, 5ఆ, 54 వచనం.

94. సంస్కృత సాహిత్య చరిత్ర;పు.81

95. పైదే

96. సాహిత్యరత్నాకరం, 102 ప.

97. శృంగారనైషధం, 6ఆ, 28ప.

98. సూర్యరాయాంధ్ర, పు.339.

99. మనుచరిత్ర, 4ఆ, 93ప.

100. సూర్యరాయాంధ్ర, పు.23.

101.మనుచరిత్ర, అవతారిక, 2 ప.

102. నిరంకుశోపాఖ్యానము, 2ఆ, 41ప.

103. సూర్యరాయాంధ్ర, పు. 864.

104. శృంగారనైషధము, 6ఆ, 21ప.

105.పైదే, 22ప.

106. పైదే, 23ప.

107. సూర్యరాయాంధ్ర, పు.720.

108. శృంగార, 3ఆ, 84ప.

109. సభాపర్వం, 1ఆ, 71ప.

110. అరణ్యపర్వం, 5ఆ, 296ప.

111. పైదే, 297ప.

112. దశకుమారచరిత్ర, 10ఆ, 37, 38ప.

113. అరణ్య, 1ఆ, 275ప.

114. శ్రీమద్రామాయణము – వ్యాఖ్యానము, పు.155.

115. పైదే, పు.156.

116. అశ్వమేధపర్వం, 1ఆ, 95ప.

117. కుమారసంభవము, 6ఆ, 96ప.

118.శబ్దరత్నాకము, పు.275.

119. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, పు.142.

120. పైదే, పు.129

121. సింహాసనద్వాత్రింశిక, 11ఆ, 164 ప.

122. కుమారసంభవము, 6ఆ, 77ప.

123. క్రీడాభిరామము, 223 ప.

124. పైదే, 224 ప.

125. సభా, 2ఆ, 135 ప.

126. పైదే, 136ప.

127. సింహాసన, 10ఆ, 87ప.

128. క్రీడాభిరామము, 226ప.

129. ఈనాడు దినపత్రిక, జిల్లాసంచిక, పు.5, 15-06-2010

130. అరణ్య, 1ఆ, 31 వచనం.

131.మనుచరిత్ర, 1ఆ, 66ప.

132. ఆది, 4ఆ, 84ప.

133. శాంతి, 2ఆ, 231ప.

134. పైదే, 5ఆ, 492 ప.

మూడవ అధ్యాయం

మానసిక విద్యలు – కావ్యానుశీలన

3. మానసికవిద్యలు – కావ్యానుశీలన

3.1. మనస్సు–వ్యుత్పత్తి:–

'మనస్సు' అన్న పదం 'మన్' ధాతువు నుండి వచ్చింది. 'మనస్సు' అన్న పదానికి 'అంతఃకరణము, అంతరంగము, అంతరింద్రియము, అనంగము' అనే అర్థాలున్నాయి[1].

'మనస్సు' అన్న పదానికి శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువులో, 'చిత్తము, ఉల్లము, అనురాగము, వలపు, కోర్కి, అభిలాషము, తలంపు, అభిప్రాయము, ఉద్దేశము, ఇష్టము' అనే అర్థాలున్నాయి[2]. (పుట.387). 'తెలుగు–తెలుగు నిఘంటువు'లో ఈ పదానికే 'చిత్తం, హృదయం, జీవాత్మ కంటె భిన్నమైన జ్ఞానజనక ద్రవ్యం, అనురాగం, వలపు, కోరిక, అభిప్రాయం, మణిశిల, మనసు(రూ), ఇష్టమైన(విశే)' అనే అర్థాలున్నాయి[3]. ఈ మనస్సుకే 'అవధానం, ఉపధారణము, ధారణి, నిబ్బరము, ప్రణిధి, రంధి, సంవిత్తు, సమాధి'[4] అనే అర్థాలు కూడా చెప్పబడ్డాయి.

దీన్నిబట్టి 'మనస్సు' అనే అంతరంగంలో ఒక భాగమని, దానికి హృదయం, చిత్తం వంటి ఇతరమైన పేర్లు ఉన్నాయని తెలుస్తున్నది.

పర్యాయపద నిఘంటువులోనే 'మనస్సు' అన్న పదానికి 'కోరిక' అనే అర్థంలో క్రింది పర్యాయనామాలు కనిపిస్తున్నాయి. "అక్కఱ, అత్తి, అనుకాంక్ష, అనుతర్షము, అపేక్ష, అభికాంక్ష, అభిధ్య, అభిప్రీతి, అభిరతి, అభిలాష, అభీష్టము, అర్ధి, అర్మిలి, అవలోభనము, ఆకాంక్ష, ఆదట, ఆశ(స), ఆశంస, ఆశంసనము, ఆసక్తి, ఆసత్తి, ఆసపాటు, ఆస్థ, ఇచ్చ(చ్ఛ), ఇతము ----"[5] మొదలైన అర్థాలున్నాయి (పు.64).

'బ్రౌణ్య తెలుగు–ఇంగ్లీషు నిఘంటువు'లో మనస్సు అన్న పదానికి "The internal organ of cognition, the intellect, understanding, mind, inclination, wish, will, pleasure"[6] (పు.578) అనే అర్థాలున్నాయి.

ఈ విధంగా మనస్సు అన్నపదం చాలా రకాల నామాలతో, పర్యాయపదాలతో కనిపిస్తుంది. ఈ పేర్లన్నీ మనస్సు యొక్క విభిన్న లక్షణాలను వ్యక్తపరిచేవి మాత్రమే. అంతరంగంలో 'మనస్సు' ఒక భాగం. ఇది చంచలమైన ప్రవృత్తి కలిగింది. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్కవిధంగా మారుతూంటుంది. అందువల్లనే దీనికి ఇన్నిరకాల పేర్లు, లక్షణాలు కనిపిస్తున్నాయి. సముద్రంలోని కెరటాల్లాగా, అంతరంగం నుండి బయటకు వచ్చే భావాలే మనస్సు భిన్నభావాల కలయికే మనస్సు.

3.2. మనస్సు – బుద్ధి:-

అంతరంగ వృత్తుల్లో మనస్సు మొదటిది కాగా, బుద్ధి రెండవది. మనస్సులోని భావాలు నీటి బుడగలాగా కొద్దిసేపు నిలిచివుంటాయి. ఇవి చంచలమైన భావాలు. కానీ బుద్ధి స్థిరమైంది. వివేచనాశక్తి కలిగింది. తార్కికమైన ఆలోచనాశక్తికే 'బుద్ధి' అని పేరు. ఇది స్థిరమైంది.

'బుద్ధి' అన్న పదానికి 'శబ్దరత్నాకరము'లో క్రింది వివరణ ఉంది. "అంతఃకరణ వృత్తులు నాలుగింటిలో నొకటి. ఇది పండ, మేధ, చార్వి, గృహీతి, శ్రౌతి, చత్వరి అని ఆఱు విధములు గలది"[7]. పండగలిగినవాడే పండితుడు. మేధస్సు కలిగినవాడు మేధావి. అంటే ఆలోచనాశక్తి, కార్యాకార్య వివేచనాజ్ఞానం, తార్కికమైన బుద్ధి, స్థిరమైనమతిని కలిగివుండటం బుద్ధిమంతుల లక్షణం. 'తెలుగు–తెలుగు నిఘంటువు'లో 'బుద్ధి' అన్న పదానికి, "మతి, తెలివి, ఎరుక, జ్ఞానం, మనస్సు, మూర్ఛాదుల నుండి తేరుకోవడం, ఆలోచన, సుఖదుఃఖాలు మొదలైన ఎనిమిది ధర్మాలు గల ఒక ప్రకృతి పరిణామం, నిశ్చయాత్మక వృత్తిగల అంతఃకరణం"[8] అనే అర్థాలున్నాయి.

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'బుద్ధి' అన్న పదానికి క్రింది అర్థాలున్నాయి. "1. మనీష, మతి, 2. ఎఱుక, జ్ఞానము, 3. వివేకము, తెలివి, 4. మనస్సు, 5. ప్రతిభ, 6. తెల్పిఱుట, మూర్ఛదేఱుట, 7. సుఖదుఃఖాదులగు నెనిమిది ధర్ములు గల ప్రకృతి పరిణామ భేదము (సాంఖ్య). 8. (వేదాంత) నిశ్చయాత్మకమగు వృత్తిగల అంతఃకరణము, అంతఃకరుణ వృత్తులు నాలుగింటిలోనొకటి. (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము) అని అంతఃకరణము నాలుగు తెఱఁగులు కలది. వానిలో బుద్ధిపండ, మేధ, శ్రౌషి, చార్వి, గృహీతి, చత్వరి అని యాఱు భేదములు కలది). దీనికి (బుద్ధికి) క్షయము కలిగించునవి:– శోకము, క్రోధము, లోభము, కామము, మోహము, పరాసుత, ఈష్యి, మానము, విచికిత్స, హింస, అసూయ, జుగుప్స అనునవి, 9. ఆలోచన, తలఁపు"[9]. ఈ వివరణను బట్టి బుద్ధి, మనిషి అంతరంగంలోని తార్కిక ఆలోచనాశక్తి అని, దానికి ఆరు భేదాలు ఉన్నాయని తెలుస్తుంది. అరిషడ్వర్గాలు ఈ బుద్ధినాశనానికి కారణమవుతున్నాయి.

'బ్రౌణ్య తెలుగు–ఇంగ్లీషు నఘంటువు'లో, 'బుద్ధి'కి క్రింది అర్థాలున్నాయి. "Intelligence, intellect, understanding, mind, judgment, sense, wisdom, intention, inclination, advice"[10].

పై వివరణను బట్టి మనస్సు ప్రధానంగా భావవ్యక్తీకరణకు సంబంధించినదని, బుద్ధి తార్కికమైన ఆలోచనాశక్తికి సంబంధించినదని చెప్పవచ్చు. మనస్సు సువిశాలమైన సముద్రం వంటిది. బుద్ధి ఆ

సముద్రంలో దాగివున్న పర్వతం లాంటిది. నీటికి చలనం ఉంటుంది. కానీ పర్వతానికి చలనం ఉండదు. దానికి స్థిరత్వం ప్రధానం. సముద్రంలోని కెరటాల వలె హృదయ స్పందనలు మనిషిలో మార్పుకు కారణమౌతాయి. బుద్ధి పర్వతం లాగా స్థిరత్వం నిలిచివుండి ఆ మనిషికి స్థిరత్వాన్ని కలిగించటానికి ప్రయత్నిస్తుంది.

3.3. మనస్సు – భారతీయుల అభిప్రాయాలు:-

ప్రాచీనకాలంలో, భారతదేశంలో మనస్తత్త్వశాస్త్రం దర్శనాలకు ఒక అంగంగా ఉండేది. దానికి ప్రత్యేకశాఖ ఆనాడు లేదు. ప్రతి దర్శనంలో సత్తాసిద్ధాంతానికి అనుగుణంగా మనస్తత్త్వాన్ని వివరించడం కనిపిస్తుంది. ఈ మనస్తత్త్వ సిద్ధాంతాలు ఒక్కో దర్శనానికి ఒక్కో విధంగా ఉంటాయి. అయితే అన్నింటిలో కొన్ని సామాన్య లక్షణాలు కూడా ఉంటాయి.

3.3.1. వేదాలు – మనస్సు:-

దర్శనాలకు పూర్వం వేదాల్లో కూడా మనిషి అనుభవం, వర్తన, ప్రబోధం వంటి విషయాల గురించి అమూల్యమైన వివరణలు ఉన్నాయి. ఋగ్వేదంలో, అన్ని మానవ కార్యకలాపాలకి మనస్సే మూలకారణం అని చెప్పడం జరిగింది. 'మనస్సు, హృదయంలో నెలకొని ఉన్న తేజస్సుని మునులు దర్శించారు'[11]. మరికొందరు అది మస్తిష్కంలో ఉంటుందని భావించారు[12].

ఋగ్వేదంలోని యాభై ఏడవ, యాభై ఎనిమిదవ సూక్తాల్లో మనస్సు ప్రస్తావన ఉంది. పూర్వం 'అసముడు' అనే ఇక్ష్వాకురాజు ఉండేవాడు. అతనికి బంధు, సుబంధు, శ్రుతబంధు, విప్రబంధు అనే నలుగురు సోదరులు. వీరు పురోహితులుగా మారి అసముడికి పరిపాలనలో సహాయబడేవారు. కొంతకాలానికి ఆ రాజు తమ్ముల్ని విడిచిపెట్టి 'మాయావుల'ను పురోహితులుగా స్వీకరించాడు. దానికి బంధు మొదలైన సోదరులు కోపించారు. అది తెలుసుకొని మాయావులు బంధు, సుబంధులను చంపివేశారు. మిగిలిన ఇద్దరు సోదరులు, చనిపోయిన తమ అన్నలు బ్రతకాలని దైవాన్ని, "ఇహక్షయాయజీవసే" అని ప్రార్థించారు.

ఈ సూక్తంలో మనస్సు, ప్రాణంగా చెప్పబడింది. "ఇంద్రియాలతో కూడిన మనస్సు తిరిగి తమ సోదరుల్ని చేరాలని, వారు తిరిగి బ్రతకాలని శ్రుతబంధు, విప్రబంధు సోదరులు 'మనస్సు' అనే దేవతను ప్రార్థించారు"[13]. మనస్సును ప్రాచీన మునులు ఆరవ ఇంద్రియంగా భావించారు. 'ఆత్మ' అన్న పదాన్ని

వారు ఇక్కడ వాడలేదు. శరీరం నుండి బయటకు వెళ్ళింది మనస్సు. అదే ప్రాణమని వారి నమ్మకం. ఋగ్వేదంలో మనోవ్యాపారాలకి కామమే మూలాధారమని చెప్పడం జరిగింది.

ఋగ్వేదంలోనూ, అథర్వవేదంలోనూ మనిషి జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు వివరించబడ్డాయి[14]. అథర్వణ వేదం ప్రకారం ఉద్రిక్తమైన మనస్సు స్వప్నాలకు కారణం[15]. ఈ వేదం కూడా పంచేంద్రియాలతో పాటు 'మనస్సు'ను ఆరవ ఇంద్రియంగా గుర్తించింది. బ్రాహ్మణాల దృష్టిలో కూడా ఇంద్రియ వ్యాపారాలకి మనస్సే కారణం. ఈ విధంగా మనిషి – శరీరం, మనస్సుల కలయిక అని భావించడం జరిగింది.

3.3.2. ఉపనిషత్తులు – మనస్సు:-

ఉపనిషత్తుల్లోని ఆత్మసిద్ధాంతానికి పై చెప్పిన వేదసూక్తాలే మూలం. మనిషి ప్రవర్తన – మానసికం, వాచకం, దైహికం (మనోవాక్కాయము) అని మూడు రకాలుగా విభజించడం జరిగింది.

తైత్తరీయోపనిషత్తులోని కోశసూత్రాన్ని అనుసరించి మనిషి అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలతో కూర్చబడినాడు[16]. మనిషిలోని శారీరక, భౌతిక అంశాలపై మానసిక, ఆధ్యాత్మిక అంశాలు ఆధారపడి ఉంటాయని ఈ ఉపనిషత్తులో చెప్పబడింది. మనిషిలో ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు ఉన్నాయని ఇందులో చెప్పడం జరిగింది. కర్మేంద్రియాలు – వాక్కు, పాణి, పాద, పాయు, ఉపస్థలు. మనస్సు ఒక ముఖ్య కరణం. దీన్నే అంతఃకరణం అన్నారు. ఈ మనస్సు, జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియాలను తన ఆధీనంలో పెట్టుకుంటుంది. బయట నుండి వచ్చే ప్రబోధాల్ని జ్ఞానేంద్రియాల వల్ల పొంది, కర్మేంద్రియాల ద్వారా తిరిగి బాహ్యప్రపంచాన్ని మార్చటానికి మనస్సు ప్రయత్నిస్తుంది.

3.3.3. భగవద్గీత – మనస్సు:-

మహాభారతానికి 'పంచమవేదం' అని పేరు. దీనికి భగవద్గీత హృదయం వంటిది. మనస్సులోని సంక్షోభాలను గురించి వివరంగా చర్చించి, ఆత్మ విజయాన్ని సాధించు మార్గాన్ని తెలియజేస్తుంది. ఈ భగవద్గీత. రెండవ అధ్యాయంలో స్థితప్రజ్ఞుని లక్షణాల్ని చెప్పేటప్పుడు, మానసిక ఆరోగ్య సూత్రాలను చెప్పడం జరిగింది. ఇక్కడ మనస్సు, బుద్ధి, ఆత్మ అనే పదాలను అంతరంగానికి సూచకంగా వాడటం కనిపిస్తుంది. అర్జునుడు శ్రీకృష్ణుడితో ఇలా అంటాడు.

"స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ,
స్థితధీః కిం ప్రభాషేత కి మాసీత వ్రజేత కిమ్"[17]

ఓ కృష్ణా! సమాధియందు ఉన్నవాడై, నిశ్చలమైన బుద్ధి కలవాడి లక్షణం ఏమిటి? నిశ్చల బుద్ధి గల పురుషుడు ఏమి చేస్తాడు? ఎలా కూర్చుంటాడు? ఏమి పొందుతాడు? అని అర్జునుడు ప్రశ్నించాడు. దీనికి శ్రీకృష్ణుడు చాలా వివరంగా సమాధానాలు చెప్పాడు ఉదాహరణకు,

1. "అర్జునా! ఆత్మ స్వరూపానుభవముచే సంతోషించిన వాఁడై మనస్సు నందు కలుగునట్టి సమస్త కామములను ఎప్పుడు విడుచునో, అప్పుడు స్థితప్రజ్ఞుడని, లేక వెలుపటి లాభములయందు అపేక్ష లేక తన స్వరూపమునందె తనివిని పొందినవాడు స్థితప్రజ్ఞుడని చెప్పబడును"[18].

2. "దుఃఖములు కలిగినప్పుడు కలతపడని మనస్సు కలవాడును, సుఖములయందు ఆశలేనివాడును, రాగము, భయము, క్రోధము లేనివాడు అయినటువంటి ముని స్థితప్రజ్ఞుడని చెప్పబడుచున్నాడు"[19].

3. "ఓ అర్జునా! పండితుడైనవాడు ఎంత పూనికతో ఉన్నప్పటికిని, బలవంతమైన యింద్రియములు వాని మనస్సును బలాత్కారముగా ఆకర్షించును"[20].

4. "కాబట్టి ఆ యింద్రియములన్నిటిని నిగ్రహించి యోగము పూనినవాడై నా యందే మనస్సు నుంచి యుండవలెను. ఏలయనగా, ఎవనికి యింద్రియములు స్వాధీనమగునో, వాని బుద్ధి నిశ్చలమగును. ఎవడు యింద్రియములను స్వాధీనము చేసికొనునో, వాడే స్థితప్రజ్ఞుడు" [21].

పై విధంగా మనస్సు, దాని లక్షణాలను భగవద్గీతలో శ్రీకృష్ణుడు తెలియజేశాడు. 12వ అధ్యాయంలో కూడా (13-20శ్లో) మనస్సు గురించి చర్చించడం జరిగింది. కామము విఫలమైతే, క్రోధము పుడుతుందని 'గీత' బోధిస్తుంది. కామము, క్రోధము మనస్సు నుండి పుట్టే భావాలు. ఇవి రెండూ ఒకదాని వెంట మరొకటి సంచరిస్తూంటాయి.

3.3.4. చార్వాకులు – మనస్సు:-

ఆత్మ, మనస్సు రెండూ కాల్పనిక వస్తువులని, అవి జ్ఞానేంద్రియాలని కనిపించే వస్తువులు కావని చార్వాకులు వాదించారు. "వీరి అభిప్రాయ. ప్రకారం పృథ్వి, అప్, తేజో, వాయు భూతములు ఒక ప్రమాణంలో చేరి జీవం ఉద్భవిస్తుంది. 'ప్రజ్ఞ' కేవలం శరీర క్రియ మాత్రమే. మానవుని దేహం వివిధ భూతాలుగా విడిపోయినప్పుడు ప్రజ్ఞ నశిస్తుంది. చార్వాకుల దృష్టిలో ప్రజ్ఞ నిరంతరమైన ప్రవాహం కాదు. మానవుడు నిద్రించునుప్పుడు ప్రజ్ఞ తిరోహితమై, మేల్కొన్నప్పుడు తిరిగి వచ్చును"[22] (విజ్ఞాన; 10సం; పు.81). వీళ్ళు ఆత్మ, మనస్సు అనే భావాల్ని అంగీకరించకుండా, భౌతికమైన ప్రజ్ఞకు ప్రాధాన్యతను ఇచ్చారు.

3.3.5. బౌద్ధం – మనస్సు :-

బౌద్ధమతంలో భారతీయ మనోవిజ్ఞానశాస్త్రానికి ఒక చతుర్సరూపం ఏర్పడింది. దేహానికి అతీతమైన ఆత్మను బౌద్ధులు అంగీకరించలేదు. మనిషి ప్రవర్తనను వివరించటానికి, 1) రూపము (దేహము), 2) వేదన (సంవేదనలు, భావములు), 3) సంజ్ఞ (నిర్ణయములు, బింబములు), 4) విజ్ఞానము (చేతన), 5) సంస్కారము (సమన్వయ లక్షణాలు) అనేవి ముఖ్యమని బౌద్ధుల అభిప్రాయం. తర్వాత వచ్చిన బౌద్ధపండితులు రూపము, చిత్తము, చేతసికము (మానసికావస్థ) అని వీటిని మూడు వర్గాలకు తగ్గించారు. అభిదమ్మ సూత్రాలలో ఈ మూడింటిని గురించి చాలా వివరంగా చర్చించారు.

'మానవుడు ఆహారం తీసుకునే తీరు, వర్తనావైఖరి, తరుచుగా అతనికి కలిగే మానసికావస్థలు మొదలైన వాటిని బట్టి, మానవులను బౌద్ధులు ఆరు రకాలుగా వర్గీకరించారు. 1. రాగచరితులు, 2. దోషచరితులు, 3. మోహచరితులు, 4. శ్రద్ధాచరితులు, 5. బుద్ధిచరితులు, 6. వితర్కచరితులు.

'అస్థిరమైన వేదనలకి, ఆలోచనలకి వెనుక స్థిరమైన ఆత్మ ఒకటి ఉందనే భావాన్ని బౌద్ధులు నిరాకరించారు. మనస్సు అనేది వివిధ అనుభవనాల సంఘాతాలని వారు భావించారు'[23].

3.3.6. న్యాయ వైశేషికములు – మనస్సు :-

న్యాయ, వైశేషిక దర్శనాల ప్రకారం పృథ్వి, అప్, తేజస్సు, వాయువు, ఆకాశం, కాలం, దిక్, మనస్సు అనే తొమ్మిది ద్రవ్యములు. ఇక్కడ మనస్సును, ఆత్మను ప్రత్యేక ద్రవ్యములుగా చెప్పటం విశేషం. వీరి అభిప్రాయం ప్రకారం, 'జ్ఞానం' అనే లక్షణంతో కూడిన ద్రవ్యం ఆత్మ. కానీ 'సుషుప్తి' మొదలైన అవస్థల్లో ఆత్మకు జ్ఞానలక్షణం ఉండదు. ప్రతి ఆత్మకు ఒక మనస్సు ఉంటుంది. మనస్సు ఉంటేనే ఆత్మకు జ్ఞానం కలుగుతుంది. మనస్సు వల్లే ఆత్మకు బాహ్యప్రపంచం గురించి, అంతరంగ స్థితుల్ని గురించి జ్ఞానం కలుగుతుంది. రాగ, ద్వేష, సుఖ, దుఃఖాదుల జ్ఞానం మనస్సు వల్లే ఆత్మకు కలుగుతుందని వీరి అభిప్రాయం[24].

3.3.7. సాంఖ్యం – మనస్సు :-

సాంఖ్య సిద్ధాంతం ప్రకారం శరీరంలో ఏదో ఒక్క అవయవంలోనే మనస్సు ఉందని చెప్పటానికి వీలులేదు. మనోవృత్తులే మనస్సు రూపం. ఈ మనస్సు పదిరకాలైన బాహ్య ఇంద్రియాలతో కలిసి పనిచేస్తుంది. "ఇంద్రియుల అనే ద్వారాలకు ద్వారపాలకుని వంటిది మనస్సు"[25]

సాంఖ్యులు మనస్సును పదకొండవ ఇంద్రియంగా కూడా పేర్కొన్నారు. మనోవ్యాపారాలన్ని భౌతిక వస్తువుల లాగే ప్రకృతి నుండి కలిగినవి. ఈ ప్రకృతి – సత్త్వం, రజస్సు, తమస్సు అనే త్రిగుణాలతో కూడి ఉంటుంది. ఈ ప్రకృతిలో 'బుద్ధి' అనే మహత్తత్త్వం పుడుతుంది. ఆ బుద్ధి అనే మహాసముద్రంలో బుడగ లాగా అహంకారం అనే మూడవతత్త్వం పుడుతుంది. పురుషుడితో (మానవులలో) కలిసివున్నప్పుడు ప్రకృతి ఈ రూపాలను పొందుతున్నది. పురుషునిలో మాత్రం ఈ త్రిగుణాలు ఉండవు. కాబట్టి మనోవ్యాపారాలన్న ప్రకృతికి సంబంధించినవే అన సాంఖ్యుల అభిప్రాయం[26].

ఐదు రకాలైన మానసకర్మల్ని పతంజలిమహర్షి పేర్కొన్నాడు. అవి ప్రమాణ, విపర్యయ, వికల్ప, నిద్ర, స్మృతులు. 'ప్రమాణం' జ్ఞానోపలబ్ధి సాధనం. ఈ ప్రమాణం – ప్రత్యక్షం, అనుమానం, శబ్దం అని మూడు రకాలుగా ఉంటుంది. విపర్యయం అనేది భ్రాంతిజ్ఞానం. వికల్పం భావనాశక్తి. నిద్రను కూడా ఒక మానసకర్మగానే యోగదర్శనం పరిగణించింది. జీవి సంపూర్ణంగా నిద్రలో ఉన్నప్పుడు కూడా అతని మనస్సు పనిచేస్తుందని సాంఖ్యులు తెలిపారు. దీనికి వ్యాసుడు కూడా ఒక ఉపపత్తిని కూడా చూపించాడు. మేల్కొన్న తర్వాత 'గాఢ నిద్రపోయాను, సుఖంగా నిద్రపోయాను' అని ఆ నిద్రానుభవాన్ని స్మరించటానికి కారణం మనస్సు పనిచేస్తూ ఉండటమే. గతానుభూతుల స్మరణమే స్మృతి అని వ్యాసుడి అభిప్రాయం[27]. అయితే శంకరాచార్యుల అభిప్రాయం ప్రకారం "సాక్షీభూతమగు చైతన్యము అంతఃకరణము (మనస్సు, అహంకారం, బుద్ధి) చేత పరిచ్ఛిన్నమయినప్పుడు అదే జీవాత్మ అవుతుంది"[28]. సుషుప్తిలో తప్ప అంతఃకరణం ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటుందని శంకరాచార్యులవారి అభిప్రాయం.

భారతీయ దర్శనాల్లోనే కాక, సంస్కృత వ్యాకర్తల 'స్ఫోటవాదం'లోను, భరతుడు, ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు మొదలైన ఆలంకారికుల రససిద్ధాంతాల్లోను, ఆయుర్వేదం, తాంత్రిక సంప్రదాయం మొదలైనవాటిల్లో మనోవిజ్ఞానశాస్త్రం దాగివుంది. అయితే దీనికి ప్రత్యేకంగా ఒక గ్రంథమంటూ లేదు. ఆయా కావ్యాల్లో సందర్భాన్నిబట్టి మనస్సు, అంతరంగం, బుద్ధి వంటి అంశాలు ప్రస్తావించబడ్డాయి.

ఈ సిద్ధాంతగ్రంథంలో ప్రధానంగా మానసిక విద్యల గురించి చర్చించవసివుంది. కాబట్టి ప్రాచీన తెలుగు సాహితంయోలను, సంస్కృత సాహిత్యంలోను మనస్తత్త్వశాస్త్ర పోకడలు ఎలా ఉన్నాయి అనే విషయాన్ని ఇక్కడ స్థూలంగా చర్చించడం జరిగింది. విషయ పరిమితి దృష్ట్యా భారతీయులు మనస్తత్త్వశాస్త్రపరంగా సాగించిన కృషిని ఇక్కడ పరిచయం చేయడం జరిగింది.

3.4. మనస్సు – పాశ్చాత్యుల అభిప్రాయాలు

క్రీ.శ. 19వ శతాబ్దానికి పూర్వం మనస్తత్త్వశాస్త్రం దార్శనిక గ్రంథాల్లో ఒకభాగం మాత్రమే. క్రీ.శ. 1879లో జర్మనీదేశానికి చెందిన 'లీప్‌జిగ్ యూనివర్శిటీ'లో 'ఊంట్' అనే శాస్త్రజ్ఞుడు మొట్టమొదటిసారిగా మనస్తత్త్వశాస్త్ర అధ్యయనం కొరకు ఒక ప్రయోగశాలను స్థాపించాడు. అక్కడ అమీబా నుండి మానవుని వరకు ఉన్న అన్ని జీవరాశుల వర్తనలను, అనుభవాలను పరిశీలించారు. అప్పటినుండి మనస్తత్త్వశాస్త్రం అనుభవాధార పద్ధతుల్ని, ప్రయోగ పద్ధతుల్ని అనుసరిస్తూ ఒక ప్రత్యేకశాఖగా విస్తరించింది.

3.4.1. హెరాక్లైటస్ (క్రీ.పూ. 535–475):–

ఈయన, విశ్వం వస్తువులతో కాక, కేవలం కొన్ని ప్రక్రియలతో నిండి ఉంది ఊహించాడు. బుద్ధుడి లాగా ఆత్మ, మనస్సు క్షణికాలని భావించాడు. డెమోక్రటిస్ (క్రీ.పూ.460–370) కూడా విశ్వమంతా పరమాణు సంభూతమని భావించాడు. శరీరపు పరమాణువుల కంటె, ద్రవ్య పరమాణువుల కంటె, ఆత్మ పరమాణువులు మరింత సూక్ష్మంగా, వాస్తవంగా ఉంటాయని డెమోక్రటిస్ అభిప్రాయం.

3.4.2. సోక్రటీస్ (క్రీ.పూ.469–399):–

సోఫిస్ట్‌లు అనేవారు విశ్వజిజ్ఞాస పట్ల నిరసన భావం కలవారు. సోక్రటీస్ కూడా జగత్తత్త్వ జిజ్ఞాస నిష్ప్రయోజనమని అంగీకరించాడు. కానీ మనిషి ఆత్మజ్ఞానాన్ని పొందవచ్చని, తద్వారా కర్తవ్యాన్ని తెలుసుకొని సన్మార్గజీవనం గడపవచ్చని అభిప్రాయపడ్డాడు.

3.4.3. ప్లేటో (క్రీ.పూ.427–347):–

ఈయన ద్రవ్యానికి, మనస్సుకి స్పష్టమైన భేదం ఉందన్నాడు. అంతేకాక వివేచనాశక్తి చేత గ్రహించదగిన భావాలకి, ఇంద్రియాల ద్వారా తెలుసుకోదగిన వస్తుజిజ్ఞానానికి మధ్య స్పష్టమైన భేదం ఉందని ఈయన అభిప్రాయం. ఇంద్రియాల ద్వారా తెలుసుకోదగిన జగత్తు కంటె, భావాలే సత్యమైనవి అని విశ్వసించాడు. శిరస్సులో వివేచనాశక్తి, హృదయంలో ధైర్యం, కడుపులో రోగాలు ఉండాయని ప్లేటో అభిప్రాయం[29]. ఆత్మను ఒక వస్తురూపంగా ఆయన గ్రహించాడు. 'శక్తిమనస్తత్త్వశాస్త్రాని'కి ప్లేటో పునాది వేసాడు. మనుషుల్లో వ్యక్తిగత భేదాలుంటాయని ప్లేటో తెలిపాడు. "బుద్ధికుశలురు పాలకులుగను, ధైర్య సమన్వితులు యుద్ధవీరులగను, కేవలము క్షుత్పిపాసలు మాత్రమే కలవారు కసుపుదారులుగను, వ్యాపారులుగను, శ్రామికులుగను ఉండవలెనని ఆయన మతము"[30]. ఇక్కడ ప్లేటో 'బుద్ధి'ని గురించి చర్చించడం విశేషం. బుద్ధి అనేది అంతరంగంలో ఒక భాగం.

3.4.4. అరిస్టాటిల్ (క్రీ.పూ. 384–322):-

ఈయన కూడా మనస్సు, ద్రవ్యము వేర్వేరు అన్నాడు. అరిస్టాటిల్, మనస్సుని ఆకృతిగల ఒక వస్తువుగా భావించాడు. ద్రవ్యము, ఆకృతిగల వస్తువులతోనే విశ్వం అంతా నిండివుందని ఆయన అభిప్రాయం. 'మనోవ్యాపారాలను దేహ సంబంధాలైన ప్రవృత్తులుగా అరిస్టాటిల్ భావించాడు. కానీ ఆత్మలో ఒక మర్త్యమైన భాగం, ఒక అమరమైన భాగం ఉంటాయని అభిప్రాయపడ్డాడు. భౌతికదేహ సంబంధాలైన ప్రవృత్తులతో కూడిన మనోభాగం మర్త్యం. అది దేహంతోపాటే నశిస్తుంది. కానీ చైతన్యం మాత్రం అద్రవ్యం, అమరం'[31]. పైన తెల్పిన విధంగా, పాశ్చాత్యదేశాల్లో క్రీ.శ. 19వ శతాబ్దానికి పూర్వం మనోవిజ్ఞానం గురించి కొంత అధ్యయనం జరిగింది.

3.5. మనస్సు – విభిన్నప్రవృత్తులు:-

మనస్సు రకరకాల ప్రవృత్తుల్ని కలిగివుంటుంది. క్రియాప్రవృత్తి, జ్ఞాన సంపాన ప్రవృత్తి, భావప్రవృత్తి, సౌందర్యరస జ్ఞానోపలబ్ధి, సాంఘికజ్ఞానం, ప్రత్యక్షానుభవంలోని భ్రమ మొదలైన వివిధ ప్రవృత్తుల్ని మనస్సు కలిగివుంటుంది. వీటి గురించి స్థూలంగా ఇక్కడ చర్చించడం జరుగుతుంది. మనస్సు, దాని ప్రవృత్తి, క్రియలు తెలుసుకోవటమే ఇక్కడ ప్రధానం.

3.5.1. మనస్సు – క్రియాప్రవృత్తి:-

చాలా కాలం వరకు మనస్సును, మానవ శరీరంలో ఒక భాగంగా భావిస్తూ వచ్చారు. హృదయం, మెదడు వంటి శరీరభాగాల్లో మనస్సు ఉంటుంది తత్త్వవేత్తలు భావించేవారు. కానీ మనస్తత్త్వశాస్త్రం అభివృద్ధి చెందిన తర్వాత, 'మనస్సు' అనే పదాన్ని ప్రాణి యొక్క సర్వమానసిక ప్రవృత్తుల్ని లేదా వ్యాపారాల్ని సాముదాయికంగా తెలపటానికి ఒక భావనగా వాడుతున్నారు. అంటే ప్రత్యక్షంగా భౌతిక క్రియలుగా గుర్తింపదగని, భౌతిక రూపాలుగా గుర్తింపదగని ప్రవృత్తులు. వీటన్నింటిని సముదాయానికే 'మనస్సు' అని పేరు.

మనిషిని మనస్సుకు సంబంధించిన ప్రవృత్తుల్ని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. బోధాత్మకాలు, 2. ఉద్వేగ కారకాలు, 3. క్రియాత్మకాలు

కొందరు ఆధునిక మనస్తత్త్వ శాస్త్రజ్ఞులు వర్గీకరణను అంగీకరిచలేదు. 'బధాత్మకం' అనే పదం 'ప్రరోచనాబోధ'కు దారితీసే అన్ని ప్రవృత్తుల్ని తెలుపుతుంది. ఇది బాహ్యపరిసరాల్లోని విషయం కావచ్చు లేదా ప్రాణిలో జరిగే అంతర పరివర్తనం కావచ్చు. 'ఉద్వేగాత్మకం' అనే పదం వివిధరకాలైన మనిషి

చిత్తవృత్తుల్ని లేదా భావాల్ని తెలుపుతుంది. 'క్రియాప్రవృత్తి' అనే పదం ప్రాణి యొక్క కోరికలు, (అవసరాలు) అక్కరలు, ప్రయత్నాలు మొదలైన ప్రవృత్తుల్ని తెలియజేస్తుంది. ఈ క్రియాప్రవృత్తి మూడు రకాలుగా ఉంటుంది. అవి:– సహజావబోధాలు, ప్రేరకాలు, అక్కరలు.

క్రియాప్రవృత్తులు అజ్ఞాతాలు కావటంవల్ల వాటితో ప్రేరేపితులైనవారు అర్థరహితంగా ప్రవర్తించినట్లు కనిపిస్తారు.

ఉదా:– అసహజ ప్రవర్తన (చిత్రవైకల్యం) కలిగిన వారి ప్రవర్తన కలలు కూడా అజ్ఞాత క్రియాప్రవృత్తుల వల్ల కలుగుతాయని ఫ్రాయిడ్ అభిప్రాయం.

"మనం చేసే క్రియలన్నీ అన్నివేళలా ఒక్క అక్కరచేత మాత్రమే ప్రేరేపించబడుతున్నాయి అని చెప్పటం సరికాదు. మన క్రియలన్నీ సమకాలంలో కలుగుతున్న చాలా అక్కరల యొక్క ఫలితాలు. ఈ క్రియాస్వభావం సమకాలంలో కలుగుతున్న చాలా రకాలైన అక్కరల సాపేక్షబలం వల్ల నిర్ణయించబడుతుంది"[32]. ఇటువంటి సమయంలో కొన్ని అక్కరలు బలమైనవి అయినప్పుడు, ఇతరమైన అక్కరలు గ్రహింపబడవచ్చు లేదా అవి ప్రధానం కాకపోవచ్చు. ఈ అక్కరలు సమానమైనవి అయినప్పుడు, క్రియ మధ్యస్థ స్వభావాన్ని అనుసరిస్తుంది. దీనివల్ల సంఘర్షణ అనేది మనిషిలో పుడుతుంది. ఎటూ తేల్చుకోలేని స్థితి అతనికి ఎదురవుతుంది.

ఇటువంటి మానసిక సంఘర్షణలు కలగటం వల్లనే మనస్తత్త్వ శాస్త్రజ్ఞులు 'ఇచ్ఛ' లేదా 'ఇచ్ఛాశక్తి' అనే ప్రత్యయాన్ని వదిలిపెట్టవలసి వచ్చింది. సంప్రదాయ మనస్తత్త్వవేత్తలు, ఈ 'ఇచ్ఛ' అనేదానికి, మనస్సుకి సంబంధించిన క్రియాప్రవృత్తిలో సమానమైన గుణోత్కర్ష ఉన్నట్లు గుర్తించారు. కానీ ఆధునిక మనస్తత్త్వ శాస్త్రజ్ఞులు ఈ ప్రత్యయాన్ని వాడటం మానివేశారు.

మానసిక క్రియాప్రవృత్తికి, బోధ ప్రత్యయాత్మకాలు ఉద్వేగకారకాలు అయిన ప్రవృత్తులు సన్నిహితంగా ఉంటాయి. మానవుడు చేసే ప్రతి క్రియలోను ఈ మూడు ప్రవృత్తులు ఇమిడివుంటాయి. "బోధనాత్మక అనుభవాలు నూతనమైన క్రియా ప్రవృత్తుల్ని కల్పిస్తాయి. మన అనుభవం పెరిగేకొద్ది, మనం కొత్త వస్తువుల్ని చూసే కొద్ది, వాటి గురించి వినేకొద్ది, ఆ వస్తువుల పట్ల మనకు (అక్కరలు) అవసరాలు కలుగుతాయి. ఈ ప్రవృత్తికి మన క్రియాప్రవృత్తులు, ఉద్వేగకారక ప్రవృత్తులు సన్నిహితంగా ఉంటాయి. అక్కరల యొక్క ప్రేరేపణ, దాని తృప్తి లేదా భావాలను కలుగజేస్తాయి"[32]. శుద్ధక్రియ గాని, శుద్ధ బోధ కాని లేదా శుద్ధ ఉద్వేగ కారకత గాని ఉండవు. ఇవి మూడూ ఒకదానితో ఒకటి కలిసివుంటాయి. అందువల్ల

మానసిక ప్రవృత్తులు – బోధనాత్మకాలు, క్రియాత్మకాలు, ఉద్వేగకారకాలు అని వేర్వేరుగా కాక, సముదాయంగా వ్యవహరిస్తాయి.

3.5.2. మనస్సు – జ్ఞాన సంపాదన ప్రవృత్తి :-

జ్ఞానం అనేది మానవ చైతన్యం యొక్క మూడు దశల్లో ఒకటి. జ్ఞానమంటే తెలుసుకోవటానికి, గ్రహించటానికి, భావించటానికి అవసరమైన మనశ్శక్తి ప్రత్యక్షానుభవము. అయితే ఈ జ్ఞానం అనేది ఇచ్ఛ, అనుభూతి వేటి వాటికి భిన్నమైంది. ఆంగ్లభాషలోని పర్శివ్, ఎప్రెహెండ్ అనే పదాలు దీనికి సమానార్థాలు. ఈ పదాలకు 'గ్రహించుట' అని అర్థం. ఇంద్రియాల ద్వారా తెలుసుకోదగినది జ్ఞానం. ఇందులో చాలా మానసికదశలు ఇమిడివుంటాయి.

అయితే ఇందులో వస్తువుకు సంబంధించిన పూర్వజ్ఞానం గర్భితమై ఉంటుంది. ఇటువంటి సందర్భంలో ప్రత్యక్షానుభవం సంపూర్ణమైన క్రియ కాలేదు. అది కేవలం బాహ్యరూపాన్ని మాత్రమే చూడగలుగుతుంది. 'ప్రత్యక్షోపలబ్ధి' అనేది వర్ణనాత్మకమైంది. ఇది వస్తువుల్ని చూపటానికి మాత్రమే ఉపయోగపడుతుంది. ఆ వస్తువులోని అంతర్భాగాలను చూడటానికి ప్రత్యక్షానుభవం ఉపయోగపడదు.

3.5.3. మనస్సు – సౌందర్యరస జ్ఞానోపలబ్ధి :-

ఇది చాలా సంశిష్టమైనది. శిక్షణపైన, పూర్వజ్ఞానం పైన ఇది ఆధారపడి ఉంటుంది. సౌందర్యం, కరుణ, హాస్యం, ఉదాత్తత వంటి భావాలు ఇంద్రియాల ద్వారా తెలుసుకోదగినవి కావు. అయితే ఇవి వస్తుతంత్రాలా? లేక వస్తువును చూడటం వల్ల ఏర్పడిన మనిషి యొక్క చిత్తవృత్తులా? అనే అంశం చర్చనీయమైంది.

మనస్తత్వవేత్తల అభిప్రాయం ప్రకారం, "సుశిక్షితులైన పెక్కురు వీటిని దర్శింపగల్గుచున్నారు. కొందరు శిక్షితులయ్యును, వాటిని దర్శింపజాలకున్నారు. ఇట్టి మృదుల భావములు ఆస్వాదన విషయములో ఉపేక్ష చేయువారి స్వభావమే వారి అశక్తతకు కారణము"[34]. ఈ శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం మనిషి స్వభావం చేత, శిక్షణ చేత, సౌందర్యోపలబ్ధి కంటె వ్యావహారికోపలబ్ధికే ఎక్కువగా ఆకర్షితులవుతారు. గడ్డిపోచ, అడవిపూలు వంటి సాధారణ వస్తువులు కూడా కొందరిలో సౌందర్య వివేకాన్ని, కవితాభావాల్ని, మోహాన్ని కలిగిస్తాయి. అందువల్ల వ్యక్తుల్లో ప్రవర్తనలు, సౌందర్యరసజ్ఞానం భిన్నంగా ఉంటాయని చెప్పవచ్చు. వాటినిబట్టే వస్తు సౌందర్యాన్ని వారు ఆస్వాదించగలుగుతారు.

3.5.4. మనస్సు – భావప్రవృత్తి:-

మనిషి అంతరంగంలో మూడు దశలు ఉంటాయి. అవి:– 1. స్మృతి, 2. సంకల్పం, 3. భవప్రేరిత మనోవికారం. 'స్మృతి' అనే శబ్దానని గుర్తింపగల శక్తి అని, మనోరజోవృత్తిని సంకల్పశక్తి అని, భావప్రేరిత మనోవికారాన్ని అనుభవం అని చెప్పవచ్చు. అయితే ఇవి మూడు వేర్వేరుగా కాక, ఒకదానితో ఒకటి కలిసివుంటాయి. ఇవి పరస్పరం జాపచారికాలుగా ప్రవర్తిస్తాయి.

భావప్రేరిత మనోవికారాన్ని సాధారణంగా రెండు వర్గాల క్రింద విభజించవచ్చు. 1. సంతోషం, 2. బాధ. వాస్తవానికి ఏ పదార్థంలోనూ ఈ రెండు భావాలు కనిపించవు. కానీ కర్త యొక్క స్థితిని మాత్రం అవి తెలియజేస్తాయి. 'ఇమాన్యుల్‌కాల్' అనే జర్మనీ తత్త్వవేత్త, సంతోషంలో జీవితవర్థకశక్తిని బాధలో జీవిత వినాశక శక్తిని దర్శించాడు.

మనస్తత్త్వ శాస్త్రవేత్తలు, సంభవాన్ని, స్వానుభవాన్ని బట్టి భావాలను విలువకడుతారు. వీరి అభిప్రాయం ప్రకారం, "సుఖానుభవ దినములు మామూలుగా స్వయముగా ఘటిల్లునవి కావు. సుఖము కంటె భిన్నమయిన లక్ష్యమును సాధించుటకై కావింపబడిన చర్యల ఫలితముగా, కాకతాళీయముగా అవి సంభవించును. విజయము వలన కలుగు సంతోషము, అపజయము వలన కలుగు దుఃఖము – ఈ రెండు భావములలో ఏదేని యొక దానిని మాత్రమే ఒక లక్ష్యమును చేరుటకై ప్రయత్నించువారు పొందగలరు"[35]. అందువల్ల భావము, క్రియతో అభేద్యంగా పెనవేసుకొని ఉంటుంది. భాషలో భావచ్ఛాయలను వ్యక్తం చేయటానికి చాలా పదాలు ఉంటాయి.

ఉదా:– ప్రీతి, సుఖము, ఉల్లాసము, ఉప్పొంగుట, ఆనందాతిరేకము, బాధ అనే భావములలో గల ఛాయలను ఈ దిగువ శబ్దాలు సూచిస్తాయి. కోపము, అసంతుష్టి, దుఃఖము, విచారము, భేదము, ఉత్సాహాభాసము.

ఇవేకాకుండా మనోవికారంతో కలిసివుండే ఉద్వేగం కలత వంటి భావభేదాలు కూడా కనిపిస్తాయి. అవి శాంతత, తృప్తి, ఉదాసీనత, అలసట, వెగటు మొదలైనవి. ఈ విధంగా ఎన్ని వర్గాలుగానైనా భావాలను విభజించవచ్చు.

విల్‌హెల్మ్ మాక్స్‌వుంట్ (1832–1920) అనే జర్మనీ తత్త్వవేత్త, 'ఈ భావాలను నిశ్చితమైన పరిమాణాత్మక నిర్ధారణలుగా వర్ణించాడు'[36]. ప్రయోగాత్మక మనస్తత్త్వశాస్త్ర పరిశోధనాలయాన్ని స్థాపించాడు. అక్షాంశం, రేఖాంశం, రేఖాంశవృత్తము అనేవాటితో త్రిముఖ పరిమాణ విధానాన్ని అనుసరించి ఇతడు వివిధ భావపరంపరలను పరిశీలించాడు. ఈ సాంకేతిక విజ్ఞానం వల్ల ఏ భావాన్ని అయినా సంపూర్ణంగా కనిపెట్టడానికి అవకాశం ఉంటుంది.

3.5.5. మనస్సు – సాంఘికజ్ఞానం:–

మానవ సమాజం చాలా సంశిష్టమైంది. చాలా వర్గాలుగా, జాతులుగా, కులాలుగా, మతాలుగా నివసించే మనుషుల మనస్సులను వారి మార్గాలను, పనులను తెలుసుకోవటం చాలా కష్టం. అయితే, మానవులు ఇతరుల ఉద్దేశాలను, నిష్కపటత్వాన్ని, మంచితనాన్ని, తెలివితేటలను గ్రహించగలుగుతన్నారు. అయితే ఈ లక్షణాల్లో ఒక్కటి కూడా ప్రత్యక్షంగా చూడదగింది కాదు, సమగ్రంగా తెలుసుకోదగింది కూడా కాదు. అయినప్పటికీ వాటిని పూర్తిగా చూసినట్లు భావిస్తూంటాము. ఉదా:– ఒక వ్యక్తి కోపంతో ఉన్నాడా? విసుగుతో ఉన్నాడా?, సంతోషంతో ఉన్నాడా? అనే విషయాల్ని మనం చూడగలుగుతున్నాము. శిశువు కూడా, తాను బంధువుల దగ్గర వున్నానా? లేక ఇతరుల దగ్గర ఉన్నానా? అని తెలుసుకోగలుగుతుంది.

పై శాస్త్రం అంతగా పరిపూర్ణమైంది కాదు. వీటి మీద జరిగిన పరిశోధనలు అన్నీ అసత్యాలు అని ఋజువు చేయబడింది. ప్రజలు చేసే పనులను బట్టి మాత్రమే వారి మంచిచెడులను అంచనావేయగలం. వర్గాలనుబట్టి, కులాలనుబట్టి, జాతులనుబట్టి వారిలోని గుణదోషాలను నిర్ణయించలేము. అందువల్ల సముదాయం అంతటికి ఒకే భావాలు, ఒకే ప్రవర్తన ఉంటాయి అనటం వాస్తవం అనిపించుకోదు. అది పరిశోధనకు కూడా నిలిచే అంశం కాదు.

పైవిధంగా పాశ్చాత్యులు మనస్సు గురించి, దాని భిన్న పార్శ్వాల గురించి వివరించారు. విషయ పరిమితిని దృష్టిలో పెట్టుకొని ఇక్కడ సంక్షిప్తంగా వివరించటం జరిగింది. పాశ్చాత్యుల దృష్టిలో మనస్సు అనేది భిన్నభావాల సముదాయం. సుఖం, దుఃఖం, ఆనందం వంటి భావాల ద్వారా ఆ మనస్సు ఉనికిని మనం గుర్తించగలం.

3.6. మానసిక విద్యలు – కావ్యానుశీలన

'మనస్సు' ప్రధాన పాత్ర వహించే విద్యల్ని 'మానసికవిద్యలు' అంటారు. ఈ రకమైన విద్యల్లో శరీరం కూడా కొంత పనిచేస్తుంది. అయితే మనస్సు పాత్ర ఎక్కువగా ఉండటం వల్ల వీటిని మానసిక విద్యలు అనటం జరిగింది. ముందు పుటల్లో మనస్సు అంటే ఏమిటి? మనస్సు గురించి భారతీయులు, పాశ్చాత్యులు చెప్పిన అభిప్రాయాలు ఏమిటి? అనేవి వివరించడం జరిగింది. ప్రస్తుతం తెలుగు కావ్యాల్లో ఈ మానసిక విద్యలు ఏవిధంగా ప్రతిఫలించాయో క్లుప్తంగా వివరించడం జరుగుతున్నది. విషయ పరిమితిని దృష్టిలో పెట్టుకొని క్రింది అంశాలను సంక్షిప్తంగా వివరించడం జరుగుతున్నది.

మానసిక విద్యల్ని ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి

1. ప్రబోధాత్మక మానసిక విద్యలు
2. ప్రయోగాత్మక మానసిక విద్యలు

3.6.1. ప్రబోధాత్మక మానసిక విద్యలు:–

ప్రబోధం అనే మాటకు మేలుకొలుపుట, తెలివినొందుట, యథార్థ జ్ఞానం తెలియజేయటం, వికాసము కలిగించటం, చక్కగా బోధించటం, జ్ఞానోపదేశం చేయటం, ప్రేరేపించటం అనే అర్థాలున్నాయి[37].

ఏదైనా ఒక విషయం గురించి అనుభవజ్ఞుడైన వ్యక్తి ఇతరుల మేలుకోరి చేసే హితబోధలే ప్రబోధాలు. మన సాహిత్యంలో భీష్ముడు, విదురుడు, శ్రీకృష్ణుడు, సూతుడు, శివుడు, నారదుడు మొదలైన వారు గొప్ప ప్రబోధకులుగా కనిపిస్తారు. నిగమశర్మ అక్క, ద్రౌపది, శకుంతల వంటి గృహిణులు కూడా గొప్ప ప్రబోధాలు చేశారు. కష్టాలు ఎదురైనప్పుడు, ఆపదలు వచ్చినప్పుడు ఆయా వ్యక్తుల్ని చేరదీసి, వారిని తమ ప్రబోధాల ద్వారా తిరిగి కార్యోన్ముఖుల్ని చేయటం, వారికి హృదయ వికాసం కలిగించటం ఈ ప్రబోధం యొక్క ప్రయోజనం. ప్రాచీన కాలంలో మునుల ఆశ్రమాల్లో పురాణేతిహాసాలు నేర్చుకొనే విద్యార్థులు, వాటిని బోధించే గురువులు ప్రత్యేకంగా ఉండేవారు.

ఈ ప్రబోధం పురాణ రూపంలో ఉండవచ్చు, ఇతిహాసం కావచ్చు, ఉపాఖ్యానాలు కావచ్చు. వీటన్నిటి ప్రయోజనం లోకానికి హితాన్ని బోధించటం, కర్తవ్యాన్ని తెలియజేయటం. ఆయా వ్యక్తుల మనస్సుల్ని వికసింపజేసి, వారిని మంచి మార్గంలో నడిపించటం. అందువల్ల పురాణం, ఇతిహాసం మొదలైన వాటిని ప్రబోధాత్మక మానసికవిద్యలు అనటం జరిగింది.

3.6.1.1. పురాణవిద్య:–

'పురాణం' అనే పదానికి 'అతి ప్రాచీనమైన కథ' అని అర్థం. 'పురాపి నవమ్ పురాణం' అని భవిష్యపురాణం లక్షణాన్ని తెలియజేస్తుంది. 'పురాభవ మితి పురాణమ్' అని శబ్దకల్పద్రుమంలోను, 'పురానీయతే ఇతి పురాణమ్' అని వాచస్పత్యము లోను పురాణ శబ్దానికి వ్యుత్పత్తులు కనిపిస్తున్నాయి.

మొత్తం మీద పురాణం అంటే పురాతనమైన లేదా ప్రాచీనమైన కథ అని చెప్పవచ్చు. మానవ జీవితంలోని అన్ని అంశాల్ని స్పృశించే పురాతన వస్తువులన్నిటినీ పురాణాలు అని చెప్పవచ్చు. ఈ పురాణాలు వేదహృదయాన్ని విప్పిచెప్పేవి అని భారతీయుల నమ్మకం. వేదాల్లోని కథల్ని పెంపొందించి, వాటికి ఉపాఖ్యానాల్ని జోడించి, నీతిబోధక రీతిలో లోకవృత్తాన్ని ప్రతిబింబించే విధంగా రచించడం పురాణపద్ధతి. కన్నడ ఆదికవి 'పంప' పురాణ మార్గంలోనే భారతాన్ని రాసినట్లు ఆచార్య జి.నాగయ్యగారు ఈ విధంగా తెలియజేశారు., "పురాణాలన్నీ ఉపాఖ్యానాలతో కూడుకొని ఉంటాయి. ఇవి చిన్నవిగా ఉండవచ్చు లేదా పెద్దవి కావచ్చు. అయితే వీటిలో లోకవృత్తం స్పష్టం కావాలి. ఇవి మానవుడిలోని ఆస్తిక భావాల్ని పెంపొందించేటట్లుగా ఉండాలి"[38]. ఈ పురాణాలు అర్థప్రధానమైనవి. ఇవి మిత్రసమ్మితాలు. అంటే మిత్రుడిలాగా నీతిని బోధిస్తాయని అర్థం.

ప్రాచీన నిఘంటుకారుడు అయిన అమరసింహుడు 'పురాణం పంచలక్షణం' అని పురాణ శబ్దానికి వివరణ చెప్పాడు.

పురాణం – పంచలక్షణాలు:-

"సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశోమన్వన్తరాణి చ
వంశానుచరితం చైవ పురాణం పంచలక్షణం"

సర్గము, ప్రతిసర్గము, వంశము, మన్వంతరము, వంశానుచరితము వీటిని పంచలక్షణాలు అంటారు. సర్గము అంటే ఆదిసృష్టి, ప్రతిసర్గము అంటే కల్పాంతంలో జరిగే పునస్సృష్టి. దీనికే 'విసర్గ' అనే పేరు కూడా ఉంది. సూర్యచంద్రాది వంశాల చరిత్రలను తెలియజేయటం వంశం. స్వాయంభువ మనువు మొదలైన మనువుల చరిత్రలను చెప్పేది మన్వంతరము. దేవతలు, దేవర్షి, సూర్యచంద్రాది వంశాల్లో జన్మించిన చక్రవర్తుల చరిత్రల్ని వర్ణించేదే వంశానుచరితం. ఈవిధంగా పురాణం ప్రాచీన చరిత్రకు సంబంధించిన అన్ని అంశాల్ని తెలియజేస్తూ విజ్ఞాన భాండాగారంగా మారింది. అందువల్లనే "అలౌకికములును, అద్భుతములును అయిన భగవల్లీలా కథనములతో నిండినది పురాణము" అని ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు అభిప్రాయపడ్డారు[39]. ప్రాచీనమైన ఒక కథను తీసుకొని దాన్ని వర్ణనలతో, కల్పనలతో, అద్భుతాలతో పెంచి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దటమే పురాణవిద్య. ఈ పురాణవిద్యకు

ఆద్యుడు వేదవ్యాసుడు. ఇతడు సంస్కృతంలో అష్టాదశ పురాణాలను రాశాడు. పంచమవేదమైన భారతాన్ని కూడా ప్రపంచానికి అందించాడు.

వేదవ్యాసుడు – అష్టాదశ పురాణాలు :-

వేదవ్యాసుడు క్రింది అష్టాదశపురాణాలను రాసినట్లు చెప్పబడుతున్నది. అయితే వీటిల్లో చాలా భాగాలు ప్రక్షిప్తాలతో నిండి ఉన్నాయి. కర్త వ్యాసుడు కాబట్టి ఆయన పేరు మీదనే పురాణాలన్నీ చెప్పబడ్డాయి.

అష్టాదశ పురాణాలను శ్లోకరూపంలో క్రింది విధంగా గుర్తుంచుకోవచ్చు.

"భ ద్వయం మ ధ్వయం చైవ బ్ర త్రయం వ చతుష్టయం
అనాపల్లింగ కూస్కాని పురాణాని పృథక్ పృథక్"

భ ద్వయం – భాగవత, భవిష్యపురాణాలు

మ ద్వయం – మత్స్య, మార్కండేయ పురాణాలు

బ్ర త్రయం – బ్రహ్మ, బ్రహ్మవైవర్త, బ్రహ్మాండ పురాణాలు

వ చతుష్టయం – విష్ణు, వరాహ, వామన, వాయు పురాణాలు

అనాప – అగ్ని, నారద, పద్మ పురాణాలు

లింగ – లింగ, గరుడ పురాణాలు

కూస్కా – కూర్మ, స్కాంద పురాణాలు.

వీటిలో విష్ణు, నారదీయ, భాగవత, గరుడ, పద్మ, వరాహ పురాణములు సాత్త్వికములు. బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, మార్కండేయ, భవిష్య, వామన, బ్రహ్మ పురాణములు రాజసములు. మత్స్య, కూర్మ, లింగ, శివ, స్కాంద, అగ్ని పురాణములు తామసములు. శ్రీ దేవీ భాగవత పురాణంలో అష్టాదశ ఉప పురాణాలు కూడా చెప్పబడ్డాయి[40]. అవి

1. సనత్కుమారము, 2. నారసింహము, 3. నారదీయము, 4. శివపురాణము, 5. దౌర్వాసము, 6. కాపిలము, 7. మానవము, 8. ఔశనసము, 9. వారుణము, 10. కాళీ పురాణము, 11. శాంబము, 12.

నంది పురాణము, 13.సౌరము, 14. పారాశరము, 15. ఆదిత్యము, 16. మహేశ్వరము, 17. భాగవతము, 18. వాసిష్ఠము.

పురాణాలు – వివరాలు:-

క్రమసంఖ్య	పురాణం	చెప్పినవారు	విన్నవారు	మొత్తం శ్లోకాలు
1	బ్రహ్మ పురాణము	బ్రహ్మదేవుడు	మరీచి	10,000
2	పద్మ పురాణము	బ్రహ్మదేవుడు	--	55,000
3	విష్ణు పురాణము	పరాశరమహర్షి	--	8,000
4	శివ పురాణము (వాయు పురాణము)	వాయుదేవుడు	--	24,000
5	లింగ పురాణము	నందీశ్వరుడు	--	11,000
6	గరుడ పురాణము	విష్ణుమూర్తి	గరుత్మంతుడు	14,000
7	నారద పురాణము	నారదమహర్షి	----	25,000
8	భాగవత పురాణము	భృగుమహర్షి	--	18,000
9	అగ్ని పురాణము	భృగుమహర్షి	--	8,000
10	స్కంద పురాణము	కుమారస్వామి	--	1,00,000
11	భవిష్య పురాణము	శతానీకుడు	సుమంతుడు	31,000
12	బ్రహ్మవైవర్త పురాణము	వసిష్ఠ మహర్షి	అంబరీషుడు	12,000

13	మార్కండేయ పురాణము	మార్కండేయమహర్షి	పక్షులు, జైమిని మహర్షికి బోధించాయి	12,000
14	వామన పురాణము	బ్రహ్మదేవుడు	--	14,000
15	వరాహ పురాణము	వరాహమూర్తి	భూదేవి	24,000
16	మత్స్య పురాణము	మత్స్యమూర్తి	మనువు	14,000
17	కూర్మ పురాణము	కూర్మమూర్తి	--	6,000
18	బ్రహ్మాండ పురాణము	వేదవ్యాసుడు	--	12,200

పురాణవిద్య – ప్రయోజనాలు:-

వేదాల్లోని సూక్తులు క్లుప్తంగా ఉంటాయి. వాటిని కథలుగా, ఆఖ్యానాలుగా పెంచి చూపుతాయి పురాణాలు. ఒక భావాన్ని క్లుప్తంగా చెపితే అది మనస్సులో నాటుకోకపోవచ్చు. దాని ఫలితమూ కనబడకపోవచ్చు. అయితే దాన్నే ఒక కథగానో, ఉపాఖ్యానంగానో చెపితే మనస్సులో నిలిచిపోతుంది.

ఉదాహరణకు, వేదాలు 'సత్యం వద' అంటాయి. సత్యాన్ని పలకమని అర్థం. సత్యవ్రతాన్ని పాటించడం ఎంతటి మహనీయతకు దారితీస్తుందో హరిశ్చంద్రుని కథలోని వివిధ సన్నివేశాల ద్వారా పురాణాలు తెలియజేస్తాయి. నీటిబిందువు వంటిది వేదసూక్తం. అనంతసాగరం లాంటిది పురాణం. దీని నుండి ఎంత తీసుకున్నా ఇంకా కొంత జ్ఞానం మిగిలే ఉంటుంది. 'ధర్మంచర' అంటే ధర్మాన్ని పాటించు అని అర్థం. రెండు ముక్కల్లో వేదాలు చెప్పిన దాన్ని, మహాభారతంలో కౌరవపాండవుల చరిత్ర తెలియజేస్తుంది. ఈ మహాభారతం విజ్ఞానసర్వస్వం. ఇందులో లేనిది ఏదీ లేదని వేదవ్యాసుడే అన్నాడు. మాతృదేవోభవ,

పితృదేవోభవ – ఇవి వేదవాక్కులు. తల్లిని దైవంగా ఆరాధించు, తండ్రిని దైవంగా ఆరాధించు అని అర్థం. రాముడి కథ వల్ల మాతాపితల సేవ ఎంత గొప్పదో అర్థమవుతున్నది. ఇంద్రియనిగ్రహం, క్షమ, కరుణ, పవిత్రత వంటి ధర్మాల్ని తమ జీవితాల్లో ఎందరో పురాణ పురుషులు, పతివ్రతలు ఆచరించి చూపించారు. ఆ కథల్ని చదవటం వల్ల మన మనస్సు ఆనందాన్ని పొంది, నూతన చైతన్యంతో ముందుకు వెళుతుంది.

పండితుల్ని సంతృప్తి పరచటానికి సర్వశాస్త్రాలూ క్రమక్రమంగా పురాణాల్లోకి చేరిపోయాయి. ఈ పురాణాల్ని సూతుడు శౌనకాది మునులకు వినిపిస్తాడు. ఇక్కడ నుండే సూతసంప్రదాయం ప్రారంభమౌతుంది. దీని గురించి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు ఈ విధంగా అన్నారు. "సంస్కృత వ్యాకరణ నియమాల ప్రకారం సుతుడు అంటే రాజుగారి సక్రమ సంతానం. సూతుడు అంటే అక్రమ సంతానం. వీళ్ళు చాలామంది ఉంటారు. అంతఃపురంలో గొడవలు, కుట్రలు లేకుండా ప్రశాంతంగా ఉండటం కోసం ఈ సూతుల్ని దేశాటనకు తోలేస్తారట రాజులు. అలా దేశాలు తిరిగి తిరిగి ఆఖ్యానాలు (కన్నవి), ఉపాఖ్యానాలు (విన్నవి) పుష్కలంగా సంపాదించుకొని ఎప్పటికో నగరానికి తిరిగివస్తారట. వచ్చి బంధుమిత్రులకు అవి అన్నీ ఇంపుగా వినిపిస్తారట. ఇలా ఇంపుగా వినిపించగలిగినవాడే రోమహర్షణుడట"[41] (వ్యాసపీఠిక; పు.55). ఈ విధంగా పురాణాలు లోకంలో వ్యాపించాయి. ఎన్నో ఆచారాలకు, నీతులకు, విజ్ఞాన విషయాలకు పురాణాలు ఇందువల్లనే నెలవైనాయి.

కథ వినటం వల్ల శ్రోతకు ఆనందం, హృదయాహ్లాదం కలుగుతుంది. లోకనీతుల వల్ల అజ్ఞానం తొలిగి, కర్తవ్యం బోధపడుతుంది. దూరదర్శిని వంటి ఆధునిక ప్రసార మాధ్యమాలు లేని ప్రాచీనకాలంలో పౌరాణికులు ఊరి కూడళ్ళలో చేరి పురాణప్రవచనాలు చేసేవారు. ఇది నాటి ప్రసిద్ధ వినోద విద్య కూడా.

ఈ పురాణ ప్రవచనాల్ని బోధించటానికి ప్రతి ఆశ్రమంలో కూడా ప్రత్యేక శాఖలు, గురువులు ఉండేవారు. వీళ్ళకి రాజులు అగ్రహారాల్ని దానం చేసేవారు. గుప్తుల కాలం నాటి శాసనాల్లో ఈ విధంగా ఉంది. "రెండో హస్తివర్మ సముద్రగుప్తుని సమకాలికుడై ఉంటాడు. అతని పెనుగొండ పత్రాలు ప్రాకృతంలో ఉన్నా, సంస్కృత ప్రభావం గాఢంగా కనిపిస్తుంది. దాన ప్రతిగ్రహీతలు మొట్టమొదటిసారిగా 60మంది కనిపిస్తారు. వాళ్ళు స్వాధ్యాయవేత్తలని, హోమవ్రతం ఆచరించేవాళ్లని, అంటే నిత్యాగ్నిహోత్రం చేసేవాళ్ళని, వేదవేదాంగ, ఇతిహాస, ఆయుర్వేద, ఛందశ్శాస్త్ర విద్వాంసులనీ గుర్తింపు పొందిన వాళ్ళని వాటిలో ఉంది.

వాళ్లు పురాణ వ్యాఖ్యాతలనీ, యజన, యాజన, అధ్యయన, అధ్యాపన, దాన, ప్రతిగ్రహషట్కర్మలని నిర్వర్తించే వాళ్ళనీ ఉంది"[42].

పై ఆధారాన్ని బట్టి గుప్తుల కాలంలో పురాణేతిహాసాలు ప్రత్యేక విద్యలుగా బోధించబడేవని తెలుస్తుంది. పల్లవ రాజైన విక్రమ మహేంద్రవర్మ, పెరువాటకూరు గ్రామంలో 2008 నివర్తనాల్ని 93 మంది బ్రాహ్మణులకు దానం చేశాడు. వీళ్ళంతా వేదవేదాంగాలు, పురాణ ప్రవచనాల్లో అందెవేసిన పండితులు. శౌనకాది ఆశ్రమాల్లో, పండిత పరిషత్తుల్లో, పండుగల సందర్భంలో గ్రామాల్లోనూ పురాణాలు వినిపించేవారు. అటువంటి ఉత్తమ పౌరాణికుల్లో సూతమహర్షి ప్రసిద్ధిగాంచాడు.

3.6.1.2. ఇతిహాసవిద్య:-

'ఇతిహాసము' అనే పదానికి 'పూర్వచరిత్ర ప్రతిపాదక గ్రంథము'[43] అని అర్థం. గతంలో జరిగిన కథ గురించి వివరించేది ఇతిహాసం. దీనికి 'ఇతయుః హాసుః ఇతిహాసుః' అని వ్యుత్పత్తి. 'ఇలా జరిగింది' అని చెప్పడమే ఇతిహాసం. పురాణాల్లో ఏక వాక్యత ఉంటుంది. అనేకములైన ఉపాఖ్యానాల్ని చేరుస్తూ కథను నడుపుతారు. ఈ కథలు ఒకదానితో ఒకటి అతికినట్లు ఉంటాయి. మొదటి నుండి చివరివరకు పురాణాల్లో ఏకవాక్యత ఉంటుంది. కానీ వస్తైక్యం ఉండదు.

కానీ ఇతిహాసం దీనికి భిన్నమైంది. ఇతిహాసంలో ఒక వంశానికి చెందిన లేదా ఒక మహాపురుషుడికి చెందిన కథ వర్ణించబడుతుంది. ఇందులో నాయికానాయకులను నిర్ణయించి చెప్పవచ్చు. ఏ రసం ప్రధానంగా వ్యక్తమైందో చెప్పవచ్చు. కానీ పురాణాల్లో వీటిని గుర్తించలేము. పురాణాల్లో కథ చెప్పుకొంటూ వెళ్ళడమే ప్రధానం. రసనిర్వహణ ప్రధానం కాదు. దీని గురించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు క్రింది విధంగా అభిప్రాయపడ్డారు. "పురాణము లితిహాసముల వలెనే అర్థప్రధానములు. మిత్ర సమ్మితములు. ఈ రెండును వేదార్థములనే యుపదేశించును. పురాణమున శాస్త్రవిషయమధికముగాఁ జెప్పబడును. దృష్టాంత రూపమున బెక్కితిహాస కథాగాథాదులు పేర్కొనఁబడుచుండును. ఇతిహాస కథాకథనమునఁ ప్రధాన వృత్తమునందు మందమయ్యు నొక యవిచ్ఛిన్నత భాసించును. దానియందొక వస్తైక్యము గోచరించును. పురాణ కథాకథనమునందు సామాన్యముగా వస్తైక్యముండని కారణమున నవిచ్ఛిన్నతకు మాఱుగా ననుసంధానమొండు భాసించును. అందైక్యతకుబదు లేకవాక్యత శోభించును"[44]. కాబట్టి పురాణంలోని

కథల మధ్య అనుసంధానం ఉంటుందని గుర్తించవచ్చు. రామాయణంలో సూర్యవంశపు రాజుల చరిత్ర వర్ణించబడింది. ఆ వంశంలో మహాపురుషుడైన శ్రీరాముడి జీవితం సుదీర్ఘంగా వర్ణించబడింది. అలాగే మహాభారతంలో చంద్రవంశపు రాజుల కథ చెప్పబడింది. ఆ వంశంలో మహాపురుషుడైన ధర్మరాజు, అతని సోదరుల కథ వర్ణించబడింది. ఈ విధంగా ఇతిహాసాల్లో వస్తైక్యత ఉంటుంది. పురాణాల్లో ఈ లక్షణం ఉండదు.

పురాణాలు దైవలీలను ఎక్కువగా వర్ణిస్తాయి. శాస్త్రవత్రాది నియమాలు, స్వర్గనరకాలకు సంబంధించిన వర్ణనలు, క్షేత్రమాహాత్మ్యాలు పురాణాల్లో స్వేచ్ఛగా వర్ణించబడి ఉంటాయి. ఇతిహాసాల్లో ఇవి సందర్భాన్నిబట్టి ఔచిత్యవంతంగా చెప్పబడుతుంటాయి.

"ఇతిహాసం పురావృత్తమ్మ"[45]ని అమరసింహుడు, "ఇతిహాసఃఇతిహ పారంపర్యోపదేశ ఆస్తే అస్మిన్ ఆస ఆధారే ఘఞ్. ధర్మార్థ కామమోక్షాణాం ఉపదేశ సమన్వితమ్! పూర్వముక్త కథాయుక్తం ఇతిహాసం ప్రచక్షతే!! ఇత్యుక్త లక్షణే పురావృత్త ప్రకాశకే భారతాది గ్రంథే"[46] అని శబ్దకల్పద్రుమంలో ఇతిహాస లక్షణాలు చెప్పబడ్డాయి. వీటినిబట్టి, ఇతిహాసం అంటే ఒక చారిత్రక కథ అని తెలుస్తుంది. అయితే ఈ కథ కేవలం వార్తలాగా కాకుండా, ధర్మార్థకామమోక్షాలను సమన్వితం చేస్తూ, వాటి ఫలాల్ని తెలియజేయాలి. భారతరామాయణాలు ఇటువంటి చతుర్విధ పురుషార్థాల మాహాత్మ్యాన్ని తెలియజేస్తున్నాయి. అందువల్ల ఇవి ఇతిహాసాలు అని చెప్పవచ్చు.

పాశ్చాత్యులు భారతీయుల వేదపురాణేతిహాసాలను కలిపి ఉమ్మడిగా myths గా గుర్తించారు. కానీ భారతీయులు శ్రుతిస్మృతుల్ని శాస్త్రాలుగా, పురాణేతిహాసాలను శాస్త్రాల కంటె భిన్నమైన సారస్వత ప్రక్రియలుగా భావించటం జరిగింది. Mythsలో ఉండే భేదాల గురించి ఆచార్య జి.వి.యస్. గారు ఇలా వివరించారు. "పాశ్చాత్యులు Mytheలను విభజించిన విధమును పురాణ కథల కన్వయింపజేసినచో, వీటిలోని సర్గ, ప్రతిసర్గ వృత్తాంతములు Explanatory Myths అనియు, మన్వంతర వంశవంశానుచరితములు Aesthetic Myths అనియు స్థూలముగా నేర్పరుపవచ్చును. అందు వంశాను చరితములందలి యైతిహాసిక మహాపురుషుల చరిత్రలు Historical Myths అనియు భావింపవచ్చును"[47]. దీన్నిబట్టి పురాణ లక్షణాల్లో ఒకటి అయిన వంశానుచరితమే ఇతిహాసరూపాన్ని

పొందుతుందని తెలుస్తున్నది. అయితే ఇతిహాసంలో కల్పనల కంటే వాస్తవమైన చరిత్రకు ప్రాధాన్యత ఉంటుంది. ఆ చరిత్ర పురుషార్థాలసాధనను తెలియజేస్తుంది.

దేవాపి శంతనుల కథ, కౌరవ్యుల కథ, ఊర్వశికథ మొదలైనవన్నీ వేదాల్లో బీజప్రాయంగా మంత్రరూపంలో ఉన్నాయి. అవే తర్వాత కాలంలో విస్తరించి మహాభారతానికి పునాదిరాళ్ళు అయ్యాయి. తర్వాత పురాణాల్లోకి కూడా ప్రవేశించి కొన్ని కల్పనలతో మరింత విస్తృతిని పొందాయి. "కావ్యమీమాంస" కర్త రాజశేఖరుడు ఇతిహాసాన్ని రెండుగా విభజించాడు.

"పరిక్రియా పురాకల్పః ఇతిహాస గతిర్ద్విధా
స్యాదేకనాయకా పూర్వా ద్వితీయా బహునాయకా!!"[48]

ఇతిహాసం అనేది పరిక్రియ, పురాకల్పం అని రెండు రకాలుగా ఉంటుంది. పరిక్రియ ఏకనాయకాశ్రమైంది. పురాకల్పం బహునాయకాశ్రయమైంది. రామాయణం ఏకనాయకాశ్రమైంది. మహాభారతం బహునాయకాశ్రయమైంది. అందువల్ల ఇవి రెండూ ఇతిహాసాలు అయ్యాయి.

మొత్తం మీద, ఇతిహాసాలు చారిత్రక వాస్తవికతకు దగ్గరగా ఉంటాయని చెప్పవచ్చు. ఇవి చతుర్వర్గ సాధనా సంపత్తికి ఉదాహరణప్రాయమైన కథలుగా కనిపిస్తాయి. ముసుల ఆశ్రమాల్లో ఇతిహాసాల్ని బోధించటానికి ప్రత్యేకంగా గురువులు ఉండేవారు. వ్యాసుడు జయకావ్యాన్ని నాలుగు లోకాల్లో ప్రచారం చేయటానికి తన నలుగురు శిష్యుల్ని నియమించాడు.

ఇతిహాసవిద్య – ప్రయోజనాలు :-

ప్రాచీనులు నేర్చిన విద్యల్లో ఇతిహాసాలు ఉన్నాయి. ఇతిహాసంలో ఒక మహాపురుషుడి జీవితం వర్ణించటం వల్ల పాఠకుడికి జీవితం పట్ల ఒక అవగాహన ఏర్పడుతుంది. ఆ వ్యక్తి ఎదుర్కొన్న సమస్యలు, కష్టసుఖాలు, వాటి పరిష్కారాలు పాఠకుడి మనస్సులో చెరగని ముద్ర వేస్తాయి. ఆ కథలో తన జీవితాన్ని చూసుకొని, మానసికమైన ఆనందాన్ని పొందుతాడు. తనకు ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారాల్ని ఆ కథల ద్వారా గుర్తించగలుగుతాడు. మానసికమైన పరివర్తన తీసుకురావటంలో ఇతిహాసాలు తోడ్పడుతాయి.

ఉదాహరణకు, అరణ్యపర్వంలో పాండవులు ఎన్నో కష్టాలు అనుభవించారు. ఒకరోజు ధర్మరాజు, బృహదశ్వుడితో, మాలాగా కష్టాలు పడ్డవారు ఇప్పటి వరకు చరిత్రలో ఉన్నారా? అని ప్రశ్నించి ఆవేదన చెందుతాడు. అప్పుడు ఆ మహర్షి ధర్మరాజుకు నలదమయంతుల కథను తెలియజేస్తాడు. జూదం వల్ల నలుడు ఏవిధంగా రాజ్యసంపదలు కోల్పోయింది, అడవిలో అతడు పొందిన బాధలు, దమయంతి చేసిన సాహసం మొదలైన ఎన్నో విషయాలు వివరిస్తాడు. ఆ కథని విన్న తర్వాత ధర్మరాజులో ఆవేదన తగ్గిపోయింది. తమ కంటె నలుడే ఎక్కువ కష్టాలు అనుభవించాడని గుర్తించాడు. అతనికి ఎలా చివరకు మంచి జరిగిందో, తనకు కూడా అలాగే మంచి జరుగుతుందని మానసికమైన ధైర్యాన్ని తెచ్చుకున్నాడు. యుద్ధంలో విజయం సాధించి, తిరిగి రాజ్యాన్ని సంపాదించవచ్చును అన్న ధైర్యం నలచరిత్రను వినటం వల్ల ధర్మరాజుకు లభించింది.

రామాయణంలో ఒక కుటుంబ వ్యవస్థ చిత్రించబడింది. ఆదర్శప్రాయులైన వ్యక్తుల చరిత్ర రామాయణం. తండ్రిమాట కోసం రాజ్యత్యాగం చేసి అడవులకు వెళ్ళాడు రాముడు. భార్యగా భర్త వెంట అడవులకు వెళ్ళి ఎన్నో కష్టాలు పడింది సీతమ్మ. లక్ష్మణుడు అన్నకు తోడుగా వెళ్ళి పన్నెండు సంవత్సరాలు నిద్రాహారాలు వదులుకున్నాడు. బ్రహ్మచర్యాన్ని పాటించాడు. భరతుడు అన్నపాదాలను తలమీద ధరించి, వాటికే పట్టాభిషేకం చేశాడు. నిస్వార్థపూరితుడు భరతుడు. శత్రుఘ్నుడు అన్నల అడుగుజాడల్లో నడచి ఉత్తమ వ్యక్తిత్వాన్ని పొందాడు. ఈవిధంగా ఆయా రంగాల్లో ఉన్నతులైనవారు ఈ కథలోని పాత్రలు. రావణుడు సకలశాస్త్రమర్మాలు తెలిసినవాడు. కానీ పరస్త్రీని కోరటం అతను చేసిన తప్పు. దానికి శిక్షను అనుభవించాడు. అలాగే పరస్త్రీని కోరిన వాలి కూడా వధించబడ్డాడు.

ఈ విధంగా రామాయణ భారతాది ఇతిహాసాల వల్ల ఉన్నతమైన విలువల్ని మనం తెలుసుకోవచ్చు. ఈ కథల్ని విన్నప్పుడు మన మనస్సులోని చీకటిపొరలు తొలగిపోయి విజ్ఞానకిరణాలు ప్రసరిస్తాయి. ఈ కథల వల్ల పాఠకుడి హృదయం వికాసాన్ని పొందుతుంది. విశాలమైన భావాల్ని పాఠకులకు అందిస్తాయి ఈ మహాపురుషుల కథలు. అందువల్ల ఇతిహాసవిద్య మనిషికి మానసిక ఆనందంతోపాటు, భావప్రవృత్తిని, క్రియాప్రవృత్తిని, సాంఘికజ్ఞానాన్నీ అందిస్తుందని చెప్పవచ్చు.

3.6.1.3. ఉపాఖ్యానవిద్య :-

ఉపాఖ్యానం అంటే, 'ఇతరుల వలన విన్నదానిని తిరిగి చెప్పడం అని అర్థం. అందుకే 'శ్రుతస్యార్థస్య కథన ముపాఖ్యానం ప్రచక్షతే' అంటారు. ఇవి స్వయం సమగ్రంగా ఉండి, ప్రధాన కథలో ఏదో ఒక ప్రయోజనాన్ని సాధించడానికి చెప్పబడతాయి. ఉదాహరణకు, రామాయణంలో రాముడు నాయకుడు. లక్ష్మణాదులు అనునాయకులు. వారి కథలు, రాముని కథకు అనుబంధంగా ఉంటాయి. వాటిని గురించిన వివరాలన్నీ రామకథలో భాగంగానూ, దానికి పోషకంగానూ ఉంటాయి. అవసరాన్ని బట్టి పౌరాణికులు శ్రోతలకు వీటిని బోధించి, వారిలో మార్పును కలిగిస్తారు.

రామాయణంలో ఉపనాయకులు విభీషణ సుగ్రీవాదులు. వారి కథలు వారివి. అవి రామకథతో ముడిపడి స్వీయ ప్రయోజనాన్ని సాధించుకొంటూ, ప్రధాన కథా ప్రయోజనాన్ని కూడా సాధించిపెడతాయి. ఆఖ్యానకాలు (ఉపకథలు), ఆఖ్యానానికి (ప్రధానకథ) అంగాలై దాన్ని సమగ్రం చేస్తూంటాయి. వాటికి స్వతంత్ర ప్రతిపత్తి ఉండదు. కానీ ఉపాఖ్యానాలు స్వీయ ప్రయోజనంతోపాటు, ప్రధాన కథ సఫలం కావటానికి దోహదం చేస్తాయి. ఆచార్య జి.వి.యస్ గారు ఇలా అన్నారు. "ఒక్క మాటలో చెప్పాలంటే ఆఖ్యానానికి అండ వంటిది ఆఖ్యానకం. దండ వంటిది ఉపాఖ్యానం. ఈ రెండూ ఉంటేనే ఆఖ్యానం నిండుగా ఉండేది. ఇతిహాసం దండిగా పండేది"[49]. ఇది ఎంతో సమంజసమైన, అర్థవంతమైన వివరణ.

మహాభారతం కూడా అనేకాలైన ఉపాఖ్యానాలతో నిండి ఉంటుంది. శకుంతలోపాఖ్యానం, నలోపాఖ్యానం, సావిత్ర్యుపాఖ్యానం మొదలైన ఎన్నో ఉపాఖ్యానాలు ఇందులో ఉన్నాయి. ఇవన్నీ ధర్మార్థ కామమోక్షాల ఆచరణను, వాటి ఫలితాన్ని తెలియజేస్తున్నాయి. ఉదంకోపాఖ్యానం కూడా ఇటుంటిదే.

ఉదంకుడి కథ సర్పయాగానికి బీజం వేసిన ఆఖ్యానకం. కానీ అది స్వయం సమగ్రంగా ఉండటం వల్ల ఉపాఖ్యానం కూడా అవుతుంది. తక్షకుడు, ఉందంకుడికి చేసిన అపకారానికి ప్రతీకారం చేయాలనే కథలో నుండి పుట్టింది సర్పయాగ సంకల్పం. అయితే ఆ యజ్ఞాన్ని తాను స్వయంగా చేయకుండా జనమేజయుడి చేత చేయించటం వల్ల ఉందుకుడి కథ ఒక వైపు ఉపాఖ్యానంగా, మరోవైపు కార్యకారణ సంబంధం గల ఆఖ్యానకంగా రాణిస్తున్నది. గురుభక్తి, కర్తవ్యదీక్ష, మనిషిలోని పగ, ప్రతీకారం అన్న

విషయాలు ఈ కథ వల్ల తెలుస్తున్నది. పైలుడి వంటి గురవులు, ఉదంకుడి వంటి శిష్యులు మానవుల చిత్తవృత్తికి నిదర్శనమైన పాత్రలు.

భారతంలోని సావిత్రి కథ జ్ఞానం యొక్క గొప్పదనాన్ని తెలియజేస్తుంది. ఈ ఉపాఖ్యానంలోని సత్యవంతుడు 'సత్యానికి' ప్రతీక. సావిత్రి జ్ఞానానికి ప్రతీక. 'సవిత' అంటే 'ఒక కిరణం' అని అర్థం. ఆమె గాయత్రీదేవి అంశంతో జన్మించింది. ఇందులోని యముడు, అజ్ఞానానికి ప్రతీక. కారణం అతడి రంగు, వాహనం నలుపు కాబట్టి. సత్యం అనే సత్యవంతుడిని అజ్ఞానం అనే మృత్యువు కబళించినప్పుడు, సావిత్రి అనబడే ఒక్క జ్ఞాన కిరణం ఆ మృత్యువును జయించి సత్యాన్ని పునరుజ్జీవంపజేస్తుంది. ఇది ఇందులోని అంతరార్థం. ఉపాఖ్యానాల వల్ల పాఠకుడు ఇటుంటి జ్ఞానాన్ని పొందవచ్చు. ప్రాచీన పురాణ కర్తలు, గురువులు వివిధ ఉపాఖ్యానాల ద్వారా శిష్యులకు పైవిధంగా జ్ఞానబోధ చేసేవారు.

3.6.1.4. ఉపదేశవిద్య :-

'ఉపదేశం' అనే పదానికి "బోధనము, హితబోధనము, దీక్షాపూర్వకముగ మంత్రాదులనుపదేశించుట, విధివాక్యము"[50] అనే అర్థాలున్నాయి. ఇతరుల హితం కోరి చేసే బోధనలే ఉపదేశాలు. ఇది ప్రాచీనకాలంలో ఒక విద్యగా ఉండేది. రాజాస్థానంలోని గురువు ఉపదేశకుడుగా ఉండేవాడు. మంత్రులు కూడా అవసరమైనప్పుడు రాజుగారికి హితబోధలు చేసేవారు. దీనివల్ల ఆయా వ్యక్తుల మనస్సు మార్పును పొందుతుంది. వారు సరియైన దారిలో నడవగలిగేవారు.

సందర్భాన్ని బట్టి బోధకులు ఉపదేశాలు చేస్తారు. మహాభారతంలోని భీష్ముడు ఉత్తమ ఉపదేశకుడు. అశ్వమేధపర్వం, శాంతిపర్వం మొదలైన సందర్భాల్లో భీష్ముడు ధర్మరాజుకు ఎన్నో ఉపదేశాలు చేసాడు. అలాగే దుర్యోధనుడిని హెచ్చరిస్తూ చాలాసార్లు హితవు పలికాడు. కానీ అతడు వినిపించుకోలేదు. అలాగే సంజయుడు, వ్యాసుడు, విదురుడు, ద్రోణుడు, కృపాచార్యుడు, శ్రీకృష్ణుడు, అర్జునుడికి బోధించిన 'భగవద్గీత' ప్రతి ఒక్కరికి ఆస్వాదనీయం, ఆచరణీయం. 'విదురనీతులు' వ్యాసభారతంలో కనిపిస్తాయి. మార్కండేయుడు, సూతుడు, నారదుడు వంటి ఋషులు పాండవులకు, కౌరవులకు ఎన్నో ఉపదేశాలు చేసారు. ఇవన్నీ విజ్ఞాన స్వరూపాలు. మనకు ఆచరణీయాలు.

ఉదా:– కురుక్షేత్ర యుద్ధంలో జరిగిన హింసాకాండని చూసి ధర్మరాజు మనస్తాపానికి గురయ్యాడు. అన్నదమ్ములను, అయినవారిని అందరినీ చంపి తాను ఒక్కడినే రాజ్యం ఎలా అనుభవించాలి? అని ఆవేదన పడతాడు. అప్పుడు అర్జునుడు, ధర్మరాజుకు ఈవిధంగా హితోపదేశం చేస్తాడు.

"ధర్మపథంబున ధరణి సేకుఱినఁ బా
లింపక సత్త్వంబు పెంపుమాలి
విడుచుట యొప్పునే విను మిట్టు లైన ము
న్నేల భూపాలుర నెల్లఁజంపి
తడలి రాజ్యముదక్కి యడవికిఁ జనిన బే
లందురుగాక మే లంఁడ్రెజనులు
కిల్బిషశంక గల్గిన నశ్వమేధాది
పుణ్యకర్మంబులఁ బోదె వంశ
ధర్మ మెడలఁ గృపణ కర్మంబుఁ గోరి త
తర్థంబు సువ్వె సకల ధర్మకారి
యొడమి లేనివాఁడ నడపీనుఁగనునహు
ష్టోక్తి వినమె దాని నూఁదవలదె"[51]

ఓ ధర్మరాజా! ఇంత యుద్ధం చేసి రాజ్యం సంపాదించావు. ఇప్పుడు దీన్ని వద్దనటం తగదు. ధర్మబద్ధంగా యుద్ధంలో సాధించిన రాజ్యాన్ని వదిలిపెట్టి అడవులకు పోతే అందరూ దీన్ని బేలతనం అంటారే కాని మేలని అనరు. నీకు పాపచింత ఉంటే, అది పోవటానికి అశ్వమేధం వంటి యజ్ఞాలు ఉన్నాయి కదా! కాబట్టి కర్మ గురించి నీకు బాధ అవసరం లేదు. నీవు క్షత్రియుడికి ఉచితమైన యుద్ధంలోనే రాజ్యాన్ని సంపాదించావు. కాబట్టి ఈ రాజ్యాన్ని స్వీకరించి పాలించు అని అర్జనుడు అన్నకు హితవు పలికాడు. అతనిలోని మనస్తాపాన్ని పోగొట్టి, కొత్త ఆశను కలిగించాడు.

సంస్కృతంలోని పంచతంత్రకథలు ఎన్నో నీతి కథలకు ఆలవాలం. ఈ కథలు ప్రపంచంలోని అన్ని భాషల్లోకి అనువదించబడ్డాయి. ఈ పంచతంత్రంలో మొత్తం ఐదు ఖండాలు ఉన్నాయి. అందుకే దీనికి పంచతంత్రం అనే పేరు వచ్చింది. అవి:–

1. మిత్రభేదం, 2. మిత్రలాభం, 3. కాకోలూకీయం, 4. లబ్ధప్రణాశం, 5. అపరీక్ష కారకం

పూర్వం దక్షిణ భారతదేశంలోని ఒక నగరానికి 'అమరాశక్తి' రాజుగా ఉండేవాడు. అతడికి ముగ్గురు కుమారులు. వారు మూర్ఖశిఖామణులు. వీరికి ఆరు నెలలు నీతిశాస్త్రాన్ని నేర్పే లక్ష్యంతో విష్ణుశర్మను ఉపాధ్యాయునిగా చేస్తారు. విష్ణుశర్మ ఈ పంచతంత్ర కథల్ని చెప్పి, ఆ మూర్ఖుల్ని దారిలోకి తెస్తాడు. అందువల్ల విష్ణుశర్మ పేరు మీదనే పంచతంత్రకథలు చెప్పబడుతున్నాయి.

అయితే ఈ పంచతంత్ర కథలు ప్రాచీన కాలం నుండి పరంపరగా వినిపిస్తున్నాయి. వ్యాసభారతంలోను, పురాణాల్లోను, సోమదేవుని 'కథాసరిత్సాగరం'లోను ఇటువంటి కథలు చాలా ఉన్నాయి. ఈ కథల్లో నక్క, సింహం, పావురం, ఎలుక, మొసలి, కొంగ, గద్ద వంటి పశుపక్షి కీటక పాత్రల ద్వారా నీతికథా నిర్మాణం చేయడం జరిగింది. అందువల్ల ఇవి పాఠకులకు ఆనందంతో పాటు మంచి ఉపదేశాల్ని కూడా చేస్తాయి. తెలుగు భాషలో చిన్నయసూరి గారు మిత్రలాభం, మిత్రభేదం రాసారు. శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు గారు 'విగ్రహతంత్రా'ని ఆంధ్రీకరించారు. ఈ విధంగా మానవేతర ప్రాణుల ద్వారా నీతుల్ని బోధించటం వల్ల అవి మనస్సుని తొందరగా ఆకర్షిస్తాయి. అవి మనస్సులో పరివర్తనకు ఎంతో ఉపయోగపడతాయి.

ఈ విభాగంలో పైన చెప్పిన విధంగా పురాణాలు, ఇతిహాసాలు, ఉపదేశాలు మొదలైనవి ప్రాచీన విద్యార్థులు నేర్చుకున్న విద్యలు. ప్రతి ఆశ్రమంలోను వీటికి ప్రత్యేక శాఖలు ఉండేవి. అధ్యయన, అధ్యాపనలు జరిగేవి. కణ్వాశ్రమం, శౌనకాశ్రమం, గౌతమాశ్రమం నాడు విశ్వవిద్యాలయాలుగా పనిచేసేవి. విద్యార్థి మానసిక స్థితినిబట్టి, అతడి బుద్ధిలో వికాసాన్ని బట్టి గురువులు ప్రబోధాలు చేసేవారు. విష్ణుశర్మ ఇటువంటి ప్రబోధకుల్లో ఒకడు.

3.6.2. ప్రయోగాత్మక మానసిక విద్యలు

సాధన, ప్రదర్శన అనేవి ప్రధాన లక్షణాలుగా కలిగినవి ప్రయోగాత్మక మానసిక విద్యలు. అధ్యయనంతో పాటు, అభ్యాసం కూడా ఈ రకమైన విద్యల్లో అవసరం. సంగీతం, కవిత్వం, శిల్పం, చిత్రలేఖనం మొదలైన విద్యలు ఈ విభాగంలోకి వస్తాయి. వీటినే లలితకళలు అని అంటారు. అభ్యసించేటప్పుడు ఇవి విద్యలు. ప్రయోగం వల్ల కళలు అవుతాయి. ఉదాహరణకు, ఒక విద్యార్థి సుశిక్షుతుడైన గురువు వద్ద సంగీతాన్ని నేర్చుకున్నప్పుడు అది విద్య అవుతుంది. ఆ గాయకుడు తన సాధన ద్వారా అపూర్వమైన ప్రయోగాలు చేసి ఆ రంగంలో ప్రసిద్ధిపొందినపుడు కళాకారుడు అవుతాడు. పింగళి లక్ష్మీకాంతంగారి క్రింది మాటలు పరిశీలించదగినవి. "అర్జునుడు ద్రోణుని యొద్ద ధనుర్వేదమును విద్యగానే నేర్చెను. ఆ జ్ఞానమునే ఆ జగదేకవీరుడు కురుక్షేత్రమున చిత్రవిచిత్రగతుల ప్రయోగించినపుడు అతని అస్త్రకౌశలము కళయయ్యెను. అట్లే ఆయుర్వేదశాస్త్ర మభ్యసించిన వైద్యుడు ఆ శాస్త్రానుసారముగా ఔషధముల నొడగూర్చి, రోగ నిదానము చేసి, ఆర్తులకు చికిత్స చేయునపుడు, ఆ చికిత్స కళయగును. కావున చదివి నేర్చినది విద్య. నేర్పుతో చేసినది కళ"[52]. కాబట్టి కవిత్వం, సంగీతం వంటివి ప్రయోగం వల్ల పరిపూర్ణతను పొందుతాయని చెప్పవచ్చు. సాధన లేకపోతే ఏ విద్య అయినా రాణించదు కదా!

సంగీతం, కవిత్వం మొదలైన కళల ప్రధాన ప్రయోజనం శ్రోతలకు లేదా పాఠకులకు మానసిక ఆనందాన్ని కలిగించటం. సుఖం, దుఃఖం, కరుణ, హాస్యం వంటి భావాల్ని పాఠకుల్లో ప్రేరేపిస్తూ, వారి మనస్సులు మార్దవం కావటానికి ఈ కళలు సహాయపడుతాయి. 'ఉపదేశం' వంటి లక్షణాలు ఉంటే ఉండవచ్చు. అవి కచ్చితంగా ఉండాలన్న నియమం లేదు. కానీ 'ఆనందం' అనేది సంగీతం మొదలైన కళల్లో తప్పనిసరిగా ఉండే లక్షణం. అందువల్ల వీటిని మానసిక విద్యల క్రింద వివరించటం జరుగుతున్నది.

గాయకుడు అయినా, కవి అయినా శరీరం సహాయంతోనే కదా సాధన చేస్తాడు. మరి వీటిని శారీరక విద్యలు అనవచ్చు కదా? అనే ప్రశ్న రావచ్చు. అయితే ఇక్కడ ఆయా విద్యల ప్రధాన ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని విభాగం చేయటం జరిగింది. కత్తియుద్ధం, ధనుర్విద్య వంటివి ప్రధానంగా శరీరరక్షణకు సంబంధించినవి. అందువల్ల అవి శారీరక/భౌతిక విద్యలు అయ్యాయి. కవిత్వం మొదలైన వాటిల్లో ప్రధాన ప్రయోజనం మానసిక ఆనందం. అందువల్ల ఇవి మానసిక విద్యలు అవుతాయి.

ప్రాచీన కాలంలో ముసుల ఆశ్రమాల్లో విద్యార్థులకు కవిత్వం, సంగీతం, చిత్రలేఖనం మొదలైన విద్యల్ని నేర్పేవారు. వీటిని బోధించటానికి ప్రత్యేక అధ్యయన శాఖలు, ఆచార్యులు ఉండేవారు. నలంద, తక్షశిల వంటి విశ్వవిద్యాలయాల్లో అన్నిరకాల విద్యల్ని విద్యార్థులకు నేర్పించేవారు.

3.6.2.1. కవిత్వ విద్య :-

భారతీయ ఆలంకారికులు కావ్యపరంగా నిర్వచనాలు చెప్పారు. కానీ పాశ్చాత్యులు కవిత్వానికి, కావ్యానికి కలిపి ఒకే రకమైన నిర్వచనాలు ఇచ్చారు. కావ్యంలో కవిత్వం ఉంటుంది. కానీ కవిత్వం, కావ్యం అంతటా ఉండకపోవచ్చు. కొన్ని ఘట్టాలు కవిత్వంతో నిండి రసవంతంగా ఉండవచ్చు. మరికొన్ని ఘట్టాలు కేవలం కథాకథన లక్షణాన్ని కలిగివుండవచ్చు. అందువల్ల ఈ రెండింటిని పూర్తిగా విడదీసి చెప్పలేము. ఇవి ఒకదాన్ని అపేక్షించి మరొకటి ఉంటాయి. అందువల్ల పాశ్చాత్యులు రెండింటిని కలిపి చెప్పారు.

వైదిక మంత్రాల్లో 'కవిర్మనీషీ పరిభూః స్వయంభూః' అని 'కవి' శబ్దం 'పరమాత్మ' అన్న అర్థంలో కనిపిస్తుంది. తర్వాత 'ఋషి' పరంగా వాడుతూ వచ్చారు. 'కవయః క్రాంత దర్శనః', 'నానృషిః కురుతే కావ్యమ్' అనే లోకోక్తులు కవిని పరమాత్మగా, ఋషిగా, అపరబ్రహ్మగా కీర్తిస్తున్నాయి. 'లోకోత్తర వర్ణనానిపుణ కవి కర్మ కావ్యమ్' అని మమ్మటుడు 'కావ్యప్రకాశకం'లో అంటాడు. గొప్పదైన దర్శనం, లోకోత్తర వర్ణన అనే నైపుణ్యాలు కలిగిన కవి చేసిన నూతనసృష్టి కావ్యం. విద్యాధరుడు అనే సంస్కృత ఆలంకారికుడు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తూ, 'కవయతీతికవిః తస్యకర్మకావ్యం' అంటాడు.

భారతీయ ఆలంకారికులు, ఫ్రాయిడ్ చెప్పినట్లుగా కవిని నాడీ రుగ్మతలు గల వ్యక్తిగానో, కవిత్వాన్ని మనోచాంచల్య దశలో జరిపే ప్రేలాపనగానో కాకుండా, అతడిని అపరబ్రహ్మగా కీర్తించారు. కవిని పరమాత్మ స్వరూపుడిగా భావించారు.

"అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః
యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే"[53]

అని ఆనందవర్ధనుడు కవిని ప్రజాపతిగా, అపారమైన కావ్యసృష్టికి అతడిని సృష్టికర్తగా భావించాడు. అతడు తన ఇచ్ఛానుసారంగానే లోకాన్ని దర్శించి, వర్ణిస్తాడు. కవి శృంగారి అయితే, అతనికి లోకమంతా శృంగారమయంగానూ, అతడు విరాగి అయితే లోకమంతా నీరసంగానూ కనిపిస్తుంది.

కావ్యనిర్వచనాలు:–

ప్రస్తుత సిద్ధాంత వ్యాసంలో కవిత్వం లేదా కావ్యం ఏవిధంగా మానసిక విద్య అవుతుంది? అది మనస్సుకు అందించే ప్రయోజనాలేమిటి? అనేవి చర్చించబడతాయి. అందువల్ల కావ్యనిర్వచనాలు, హేతువులు, రసం, కావ్యప్రయోజన సిద్ధాంతాలు మొదలైనవి ఈ సిద్ధాంతవ్యాస పరిధిలోకి రావు. విషయ అవగాహన కొరకు ప్రధానమైన మూడు కావ్య నిర్వచనాల్ని ఇక్కడ చర్చించడం జరుగుతున్నది.

కావ్య శరీరాన్ని గురించి చర్చించిన ఆలంకారికుల్లో దండి, మమ్మటుడు, విశ్వనాథుడు, జగన్నాథుడు ముఖ్యమైనవారు. వామనుడు, ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు మొదలైనవారు కావ్యాత్మను గురించి చర్చించారు. 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ కావ్యం' అని దండి నిర్వచనం. ఇటువంటి కావ్యానికి శోభను కలిగించేవి గుణాలు. అందువల్ల కావ్యంలో గుణాలే ప్రధానమైనవని దండి అభిప్రాయం. మమ్మటుడు, 'తదదోషౌ శబ్దార్థౌ, సగుణావలంకృతే పునఃక్వాపి' అన్నాడు. దోషరహితాలు, గుణ సహితాలు అయిన శబ్దార్థాలే కావ్యం అని ఇతని అభిప్రాయం. ఈ భూమి మీద తప్పులు చేయని మనిషి లేనట్లే, దోషాలు లేని కావ్యం ఒక్కటి కూడా ఉండదు. అంతేగాక మమ్మటుడు చెప్పిన గుణాలు, రసధర్మాలు అవుతాయే కాని కావ్యశరీర ధర్మాలు కావు. కొన్నిసార్లు దోషాల వల్లే కావ్యానికి మంచి కీర్తి రావచ్చు.

'వాక్యం రసాత్మకం కావ్యమ్' అన్నది విశ్వనాథుడి నిర్వచనం. రస స్వరూపం గల మహావాక్యమే కావ్యమని దీని అర్థం. మమ్మటుడి సిద్ధాంతాన్ని పూర్వపక్షం చేస్తూ చెప్పిన సిద్ధాంతమిది. దోషరహితాలైన కావ్యాలు లోకంలో లేవు. మహాకావ్యాల్లో కూడా కొన్ని పొరపాట్లు కనిపిస్తున్నాయి. రసం చేతనే కావ్యం జీవిస్తుంది. కాబట్టి రసాత్మకమైన వాక్యసమూహమే కావ్యం అవుతుందని ఇతని సిద్ధాంతం.

'రసగంగాధరం' రాసిన జగన్నాథ పండితరాయలు చెప్పిన కావ్య నిర్వచనం ఎక్కువ మంది పండితుల సమ్మతాన్ని పొందింది. 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్' అని ఇతని నిర్వచనం. ఈ

సిద్ధాంతం ఇంచుమించు దండి సిద్ధాంతానికి దగ్గరగా ఉంది. రమణీయమైన అర్థాలను ప్రతిపాదించే శబ్దాల సముదాయమే కావ్యం అని దీని అర్థం. దండి శబ్దార్థాలు రెండింటిని కావ్య శరీరంగా పేర్కొన్నాడు. కానీ జగన్నాథుడు రమణీయమైన అర్థాలను తెలిపే 'శబ్దం' ఒక్కదాన్నే కావ్య శరీరంగా చెప్పాడు. 'దోషాలు లేకపోవడం' అనే మమ్మటుడు చెప్పిన నియమాన్ని కూడా జగన్నాథుడు చెప్పలేదు. 'రమణీయ' శబ్దం వల్ల, దోషాలు లేకపోవటం, సుగుణాలు కలిగిఉండటం అనే రెండు అర్థాలు స్ఫురిస్తున్నాయి. అందువల్ల జగన్నాథుడి నిర్వచనం చాలామంది పండితుల సమ్మతిని పొందింది.

కవిత్వం–మనస్సు:–

ప్రకృతిని చూసినప్పుడు కవి హృదయంలో కొన్ని అనుభూతులు కలుగుతాయి. వాటిని బయటకు వ్యక్తం చేయటం అతని ధర్మం. ఈవిధంగా చూస్తే ప్రతిఒక్కరూ కవి అవుతారు. ప్రతి ఒక్కరికి ఎంతోకొంత అనుభూతి ఉంటుంది కదా? అనే ప్రశ్న వస్తుంది. దీనికి ఆచార్య సి.నారాయణరెడ్డిగారు క్రింది విధంగా సమాధానమిచ్చారు.

"ఇట్టివారి (సాధారణజనులు) అనుభూతులకన్న కవి అనుభూతులు నిశితమైనవి, లోతైనవి, విశాలమైనవి. వానిని సముచిత పదజాలమున వ్యక్తము చేసి సహృదయుని మనస్సులోనికి పూసలలో దారము నిమిడించినట్లెక్కించు శక్తి కవికి మాత్రమే యుండును"[54]. ఇవి చాలా విలువైన మాటలు. ప్రతి మనిషి చుట్టూ ఉన్న పరిసరాల్ని చూస్తాడు. కానీ కొందరు మాత్రమే ఆ భావాల్ని వర్ణించగలరు. ఈవిధంగా దర్శనం, వర్ణనం చేసినవాడే కవి అవుతాడు. అతని చేత సృష్టించబడిందే కావ్యం. ఈ కావ్యాన్ని చదవటం వల్ల పాఠకుడు కూడా కవితో సమానమైన మానసికానందాన్ని పొందగలడు. కరుణ, సుఖం, దుఃఖం, కోపం, వీరం వంటి భావాల్ని కవి ఏవిధంగా అనుభవిస్తాడో, అతని కావ్యపఠనం వల్ల పాఠకుడు కూడా అవే భావాల్ని అనుభవించగలడు.

ఈ లోకంలోని ప్రజలు చాలా సందర్భాల్లో పక్షుల వేటను చూసి ఉండవచ్చు. పక్షుల విరహవేదనను పరిశీలించి ఉండవచ్చు. కానీ వారికందరికీ కలగని దుఃఖం కవియైన వాల్మీకి మహర్షికి మాత్రమే కలిగింది. ఆ సన్నివేశం అతని హృదయాన్ని కలవరపెట్టింది. అతడు దుఃఖంలో మునిగిపోయాడు. ఈ శోకం నుండే

'మా నిషాద ప్రతిష్ఠా త్వ' అనే శ్లోకం ఉద్భవించింది. సాధారణ ప్రజలకు ఇంతటి ఉద్వేగకరమైన భావాలు కలగకపోవచ్చు. కవికి మాత్రమే ఇది సాధ్యమౌతుంది. అందుకే అతడు దార్శనికుడు అయ్యాడు.

కవి దృష్టికి, సామాన్యుని దృష్టికి గల తారతమ్యాన్ని ఆచార్య సి. నారాయణరెడ్డిగారు తమ సిద్ధాంతగ్రంథంలో ఇలా తెలియజేశారు. "సామాన్యుడు పలుసార్లు సెలయేటి గలగలలను వినుచునేయుండును. ఇంద్రధనుస్సౌందర్యమును చూచుచునే యుండును. కాని ఆ వినికిడి, ఆ చూపు, ఆ అనుభవము విలక్షణమైనవి కావు. అతి సాధారణమైనవి. ఆ వస్తువులలోనున్న సృష్టివైచిత్ర్యము సామాన్యుని కనుభూతము కాదు. కవి వీనినే విని, చూచి, అనుభవించి ఆనందపరవశుడగును. అతని హృదయము బిగించిన వీణాతంతివలె జుమ్మని లయబద్ధమైన గీతములను వెలార్చును"[55]. దీన్నిబట్టి కవిదృష్టి చాలా సూక్ష్మమైందని గుర్తించవచ్చు. అతడి హృదయం ఎంతటి వికాసాన్ని కలిగివుంటుందో అర్థం చేసుకోవచ్చు. మనిషి హృదయాన్ని మార్దవం చేసి, అతడిని మనీషిగా తీర్చిదిద్దటమే కవిత్వ ప్రయోజనం. ఉదాహరణకు, ప్రకృతి సౌందర్యాన్ని చూసి గడ్డి పూల మీద కవిత్వం చెప్పాడు వర్డ్స్ వర్త్. అలాగే మలయపుగాలి మీద మరువాని పద్యం చెప్పాడు శ్రీకృష్ణదేవరాయలు.

"మలయపుగాలి రేలు వనమాలి విమానపతాక ఘుల్లుమం
చులియఁబసిండి మువ్వగమి నొక్కొకమాటు గదల్ప, నుల్కి మి
న్నలము తదీయ హేమ వరణాంచలచంపకశాఖలందుఁ బ
క్షులు రొద సేయ, వేగె నని కూడుదు రల్కలు తీఱిఁ దంపతుల్."[56]

ఈ పద్యంలో ఒక వైపు రాత్రుల్లో వీచే మలయమారుతాన్ని వర్ణిస్తూ, మరోవైపు అది కలిగించే ప్రయోజనాన్ని కూడా తెలిపాడు. అది – ఆలుమగల మధ్య ఉన్న అలకను పోగొట్టి వారిని ఒక్కటి చేసిందట. ఆ గాలి చప్పుళ్ళకు గుడి ధ్వజస్తంభంలోని చిరుగంటలు మ్రోగటం, పక్షులు రొదచేయటం, అది విని భార్యాభర్తలు అలకను వీడటం ఇందులోని అంశాలు. ఈ పద్యాన్ని చదవటం వల్ల పాఠకుడు కూడా ఆ అనుభూతిని పొందగలడు. ప్రతి వ్యక్తి ప్రకృతిని చూస్తాడు. కానీ కవి మాత్రమే ఇంత నిశితంగా పరిశీలించగలడు. ప్రకృతి దృశ్యాన్ని చూసిన కవి హృదయం ఆనందంతో ఉప్పొంగి, కమ్మని భావాల్ని వ్యక్తం

చేస్తుంది. శ్రీకృష్ణదేవరాయలు చక్రవర్తి అయినా, ప్రజల జీవితాల్ని ప్రత్యక్షంగా చూసాడు. వారిలో ఒకడిగా జీవించాడు.. అందుకే ఇంతమంది పద్యం చెప్పగలిగాడు.

'Poetry we will call musical thought' అని పాశ్చాత్యుల అభిప్రాయం. లయాత్మకమైన భావనే కవిత్వం అని దీనికి అర్థం. ఇటువంటి లయాత్మకత వల్ల కవిత్వం పాఠకుడి మనస్సుని ఆకర్షిస్తుంది. అతడిని ఆనందంలో ఓలలాడిస్తుంది. నాచనసోమన 'ఉత్తరహరివంశం'లోని క్రింది పద్యం లయాత్మకమైన భావనకు మంచి ఉదాహరణ.

"లలన లతావిలానముల లత్తుక రేకుల చాయ చల్లు చే
తుల సెలగొమ్ము లందికొనఁ దోరపు నవ్వులు పిక్కటిల్ల నె
చ్చెలులు చెలంగి మావిరులు చెందొవలయ్యె ననం దడంబడం
దలిరులు గోయు రాచిలుకదాఁటులఁ దేఁటులు నాసచేయఁగన్" [57]

ఇందులో ఒక నాయిక, ఒక వస్తువును చూసి దానితో సమానమైన మరొక వస్తుని భావించింది. నాయిక, ఎర్రని కాంతిని వెదజల్లే తన చేతులతో చిగురుకొమ్మల్ని అందుకోగా, అవి చిగురుటాకులు కాదు మామిడి పువ్వులని చెలికత్తెలు అన్నారు. అప్పుడు ఆమె తడబాటుతో చిగురుటాకులే కోసింది. చిగురుటాకుల కోసం వచ్చిన చిలుకలు వెళ్ళిపోగా, తుమ్మెదలు ఆ పువ్వులనే ఆశించాయి.

పై పద్యంలో కవి తన భావనను లయాత్మకంగా వ్యక్తపరిచాడు. 'ల'కార, 'ర'కారాల వల్ల చక్కని అనుప్రాసతో కూడిన నడక పాఠకుడిని ఆకర్షిస్తుంది. ఇందులో సుకుమారమైన అభివ్యక్తిని, సుకుమారమైన పదాలతోనే వ్యక్తం చేసాడు కవి. పువ్వులు, చిగుళ్ళు, లతలు వర్ణించటానికి కవి చంపకమాల వృత్తాన్ని ఎంచుకోవటం ఈ పద్యానికి అదనపు అందం తెచ్చింది.

ఈ విధంగా ప్రబోధాల ద్వారా మనస్సుకు శాంతిని కలిగించవచ్చు, ఆవేదన పోగొట్టి, వారికి నూతన చైతన్యం ఇవ్వవచ్చు. పురాణం, ఇతిహాసం, ఉపాఖ్యానాలు, ఉపదేశాలు అన్నీ ఇటువంటి పనినే చేస్తున్నాయి. అంతేగాక బేతాళకథలు, కాశీమజిలీకథలు, దశకుమారచరిత్ర వంటి కథాకావ్యాల్లో కూడా ప్రబోధాలు కనిపిస్తాయి. బేతాళుడు, విక్రమార్కుడిని అడిగిన కథల్లో సామాజిక అంశాలతో పాటు, మంచి నీతులు, ఉపదేశాలు ఉన్నాయి. ఈ కథాకావ్యాలు దాదాపు పురాణాల్లాగా కథల సమాహారంగా ఉంటాయి.

జానపదసాహిత్యంలో కూడా ఇటుంటి ప్రబోధాత్మక కథలు, గేయాలు చాలా ఉన్నాయి. ఇవన్నీ పాఠకుల మనస్సును వికసింపజేసి, వారికి జ్ఞానాన్ని బోధిస్తాయి.

3.6.2.2. సంగీత విద్య:–

ఓంకారము నుండి సంగీతం పుట్టిందని భారతీయుల నమ్మకం. ఈ ఓంకారంలోని ఆకార, ఉకార, మకారాలు సంగీత సృష్టికి కారణం అని, ఈ మూడక్షరాలు త్రిమూర్తుల స్వరూపాన్ని వ్యక్తం చేస్తాయని ప్రాచీనులు అభిప్రాయం. ఈ సంగీతంలో స్వరం, రాగం, తాళం అనేవి ప్రధానం. ఈ మూడింటి కలయికనే సంగీతం అంటారు. సంగీతంలో మార్గ అని, దేశి అని రెండు భేదాలున్నాయి. ఈశ్వరుడిచే సృష్టించబడి, భరతమహర్షి వల్ల లోకంలో ప్రచారం పొందింది మార్గ సంగీతం. ఆయా దేశపు జనులకు సంబంధించినది దేశీయ సంగీతం. జానపదుల పాటలు దేశీయ సంగీతంలో చేరుతాయి.

సంగీతం వల్ల కలిగే ప్రయోజనం క్రిందివిధంగా చెప్పబడింది.

"త్రివర్గ ఫలదా స్సర్వే దాన యజ్ఞ జపాదయః !
ఏకం సంగీత విజ్ఞానం చతుర్వర్గ ఫలప్రదమ్!!"[58]

దానయజ్ఞజపాదుల వల్ల ధర్మార్థకామాలనే మూడు పురుషార్థాలు మాత్రమే మనకు కలుగుతాయి. కానీ సంగీతం వల్ల 'మోక్షం'తో కలిపి నాలుగు పురుషార్థాలను మానవుడు పొందవచ్చు. భగవంతుడిని చేరటానికి, మనిషి మోక్షగామి కావటానికి సంగీతం ఉత్తమసాధనమని అనాదిగా భారతీయులు నమ్ముతున్నారు.

ప్రస్తుతం లభిస్తున్న గ్రంథాల్లో భరతముని 'నాట్యశాస్త్రం' అతి ప్రాచీనమైంది. ఇందులో భరతుడు షాడ్జి, ఆరభి మొదలైన ఏడు శుద్ధజాతులకు సంబంధించిన రాగాలతోపాటు, వాటి పరస్పర సంకరం వల్ల ఏర్పడే పదకొండు 'వికృతజాతి' (దేశీయ) రాగాలను కూడా పేర్కొన్నాడు. దీన్నిబట్టి క్రీ.శ. ఒకటవ శతాబ్దం నాటికే సంగీతం, నాట్యం అభివృద్ధి దశలో ఉన్న కళలని తెలుస్తుంది. వీటిని నేర్పటానికి భరతముని వంటి ఆచార్యులు ఆనాడు ప్రత్యేకంగా ఉండేవారని మనం తెలుసుకోవచ్చు.

"భరతుడి కాలం నాటికే ఆంధ్రదేశంలో కూడా సంగీతవిద్యను సాధన చేసేవారని తెలుస్తుంది. 'నాట్యశాస్త్రం'లో 'ఆంధ్రి' గురించి భరతుడు పేర్కొన్నాడు. ఇది గాంధారి, షాడ్జి జాతుల కలయిక వల్ల ఏర్పడిన దేశీయరాగమని భరతుడు చెప్పగా, ఆర్షభి–గాంధారి జాతుల వల్ల ఏర్పడిందని మతంగుడు పేర్కొన్నాడు"[59]. క్రీ.శ.11వ శతాబ్దానికి పూర్వం ఆంధ్రదేశంలో సంగీత విద్య వ్యాప్తిలో ఉండేదని తెలుసుకోవటానికి అమరావతి, నాగార్జునకొండ మొదలైన చారిత్రక కట్టడాల్లో ఆధారాలు కనిపిస్తున్నాయి. ఇక్కడి స్థూపాల మీద రకరకాల వీణలు, వేణువు, మృదంగం మొదలైన వాద్యపరికరాలు కనిపిస్తున్నాయి. "హాలుడి 'గాథాసప్తశతి'లో, ఆంధ్రసామ్రాజ్యంలో గాననాదులకు అసాధారణ గౌరవం ఉన్నట్లు తెలుస్తుంది"[60].

క్రీ.శ.పదమూడవ శతాబ్దానికి చెందిన నిశ్శంక శార్ఙ్గదేవుడు 'సంగీతరత్నాకరము' అనే గ్రంథాన్ని రాసాడు. ఇందులో ప్రాచీన సంగీత విద్వాంసుల్ని గురించి పేర్కొన్నాడు. "పార్వతీపరమేశ్వరులతో ప్రారంభించి ముప్పయి తొమ్మిది మందిని చెప్పి 'అన్యే చ బహవః పూర్వే' అని చెప్పాడు"[61]. క్రీ.శ.1250 ప్రాంతంలో, కాకతి గణపతిదేవుని బావమరిది జాయపసేనాని 'నృత్తరత్నావళి', 'గీతరత్నావళి' అనే రెండు గ్రంథాలు రాసాడు. ఈ కాలంలో సంగీతం, నృత్యం విశేష ఆదరణ పొందాయని పై లక్షణగ్రంథాల వల్ల తెలుస్తుంది.

క్రీ.శ.14వ శతాబ్దానికి చెందిన శ్రీవిద్యారణ్యస్వామి 'సంగీతసారము'ను రాసాడని, దాని ఆధారంగా తాను రాగ లక్షణాల్ని వివరిస్తున్నానని గోవిందదీక్షితులు తెలియజేశాడు[62]. రాచకొండ సర్వజ్ఞ సింగభూపాలుడు 'సంగీతసుధాకరము' అనే గ్రంథాన్ని రాసాడు. ఇది సంగీతరత్నాకరానికి వ్యాఖ్య. క్రీ.శ.15వ శతాబ్ది మధ్యభాగానికి చెందిన కుంభకర్ణ మహారాజు 'సంగీతరాజము' అనే గ్రంథాన్ని రాసాడు.

శ్రీనాథుడికి ఆశ్రయమిచ్చిన పెదకోమటి వేమారెడ్డి 'సంగీత చింతామణి' అనే లక్షణగ్రంథాన్ని రాసాడు. కుమారగిరి రెడ్డి 'వసంతరాజీయము' అనే నాట్యశాస్త్ర గ్రంథాన్ని రాసాడు. ఇందులో సంగీతానికి సంబంధించిన అంశాలు కూడా ఉన్నాయి.

'సంకీర్తన లక్షణము' అనే లక్షణ గ్రంథాన్ని తాళ్ళపాక అన్నమాచార్య సంస్కృతంలో రాసినట్లు తెలుస్తున్నది. ఇది ప్రస్తుతం అలభ్యం. ఇమ్మడి ప్రౌఢదేవరాయల సామంతుడైన సాళువగోపేంద్రతిప్ప

భూపాలుడు 'తాళదీపిక' అనే గ్రంథాన్ని రాసాడు. క్రీ.శ.16వ శతాబ్దానికి చెందిన శ్రీకృష్ణదేవరాయల అంతఃపురంలో బండారు లక్ష్మీనారాయణ సంగీతాచార్యుడిగా పనిచేశాడు. ఈయన 'సంగీత సూర్యోదయము' అనే గ్రంథాన్ని రాసాడు.

పైన పేర్కొన్న ఆధారాల్ని బట్టి తెలుగు ప్రాంతంలో సంగీతవిద్య విశేషప్రాచుర్యం పొందిందని తెలుస్తున్నది. ఈ విద్యను నేర్పటానికి ప్రత్యేకమైన గురువులు ఉండేవారు. తెలుగు కవులు, రాజోద్యోగులు సంగీతం పట్ల అభిరుచి కలిగివుండేవారు. నాట్యం, సంగీతం రెండూ మధ్యయుగ భారతదేశంలో ఉన్నతస్థితికి చేరినట్లు పై ఆధారాల వల్ల మనం తెలుసుకోవచ్చు.

ద్రౌపది వివాహవర్ణనలో వాద్యగానగోష్ఠి ప్రస్తావన ఉంది.

"భూరి భూసురేంద్ర పుణ్యాహరవమును / మంగళప్రగీత మధురరవము
వివిధతూర్య వేణు వీణారవంబును / విస్తరిల్లె విపుల విభవయుక్తి"[63]

విరాటపర్వంలో, అర్జునుడు విరాటరాజుకు తన గీతనాట్యకౌశలం గురించి ఈ క్రింది విధంగా తెలియజేస్తాడు.

"విశ్రుత వాద్యంబులు మం / జుశ్రుతి సంభావ్యగీత సుగతులు సద్భా
వాశ్రయములుఁ దజ్జన్యర / సాశ్రయములు నైనయభినంబు లెఱుఁగుదున్"[64]

వివిధ రకాల వాద్యాలను వాయించటం, రసస్ఫోరకాలైన గీతాలు పాడటం బృహన్నల (అర్జునుడు) నేర్చుకున్నట్లు చెప్పబడింది. స్త్రీల అలంకరణకు సంబంధించిన నేపథ్యవిద్య కూడా బృహన్నల నేర్చుకున్నాడు. ఇవన్నీ ఉత్తరకు నేర్పుతానన్నాడు. రాజుల అంతఃపురాల్లో నపుంసకులు నాట్యాచార్యులుగా పనిచేసినట్లు బృహన్నల పాత్ర వల్ల తెలుస్తుంది. పర పురుషులకు అంతఃపురాల్లో ప్రవేశం ఉండేది కాదు. అందువల్లనే విరాటరాజు, బృహన్నలకు నాట్యాచార్య పదవిని ఇచ్చాడు.

నన్నెచోడుడి 'కుమారసంభవం'లో 'ఆందోలి' అనే దేశీయ రాగం గురించి ప్రస్తావన ఉంది. పాల్కురికి సోమనాథుని 'పండితారాధ్యచరిత్ర'లో రాగాల పట్టికలో 'ఆందోళి' అనే పేరు ఉంది. ఇవి రెండూ భరతుడు చెప్పిన 'ఆంధ్రి' రాగానికి రూపాంతరాలు అయివుండవచ్చు. ఎర్రనకు ఆశ్రయమిచ్చిన ప్రోలయ వేమారెడ్డి నృత్తగీతకళాప్రియుడు.

శ్రీనాథుడు, 'శృంగారనైషధము'లో నలదమయంతులు ఏవిధంగా గీతవాద్యకళలతో ఆనందించారో ఈ విధంగా వర్ణించాడు.

"ఆ రామా రమణుల్ రమాసతియు దైత్యారాతియుం బోలె శృం
గార క్రీడలఁ బ్రొద్దు పుచ్చిరి రహిన్ గంధర్వకన్యా కళా
కీ రాలాప కలాప కోకిల కుహూ కేళీమయూ రాంగనా
చారీ మండల తాండ వారభటికా సంరంభ సంభావనన్"[65]

నలదమయంతులు ఇద్దరూ లక్ష్మీనారాయణుల లాగా ఆనందంలో గంధర్వకన్యల యొక్క సంగీతవిద్య, వారి చిలుక పలుకుల పరంపర వింటూ, వారి నాట్యాన్ని చూసి ఆనందించారని దీని తాత్పర్యం. ఈ గంధర్వ కన్యలు దమయంతికి శిష్యురాండ్రు. వాళ్ళతో కలిసి దమయంతి సంగీత, వాద్య సాధనలు చేసేది.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో సంగీత సాహిత్యాలకు మంచి ఆదరణ లభించింది. కృష్ణరాయలు స్వయంగా కవి, వీణావాయిద్యంలో ప్రావీణ్యం కలవాడు. రాయల 'ఆముక్తమాల్యద'లో వీణావాదన ప్రస్తావన ఉంది. నాయిక చిక్కుముడి విప్పుకొనే సందర్భాన్ని కృష్ణదేవరాయలు క్రింది విధంగా వర్ణించాడు.

"వేవిన మేడఁబై వలభి వేణికఁ జంట వహించి విప్పగాఁ
బూవులు గోట మీటు తఱిఁ బోయెడు తేఁటుల మ్రోఁత కామి శం
కావహ మౌఁగృతాభ్యసన లౌటను దంతపు మెట్ల వెంబడిం
జేవడి వీణ మీటుటయుఁ జిక్కెడలించుటయు న్సరింబడన్"[66]

నాయిక జడను వీణగా పోల్చాడు కవి. ఆమె చిక్కుముడి విప్పటాన్ని, వీణ వాయిస్తున్నట్లుగా వర్ణించాడు. రాయలకు వీణావాదనలో ఆసక్తి ఉందని దీనివల్ల తెలుస్తుంది. ఈయన కాలంలో వచ్చిన చాలా ప్రబంధాల్లో వీణ వర్ణన ఉండటం గమనించదగిన విషయం.

'వసుచరిత్ర'ను రాసిన రామరాజభూషణుడు సంగీతసాహిత్యాల్లో సమాన ప్రతిభ కలవాడు. ఈయన వసుచరిత్రలోని ప్రతి పద్యాన్ని వీణ మీద వాయించటం జరిగింది. రాగయుక్తంగా పద్యాల్ని కూర్చటం ఈయన శైలిలోని ప్రత్యేకత. ఉదాహరణకు

"సకలామోదక తాళవృత్తగతులన్ సంగీత సాహిత్య నా

మక విద్యాయుగళంబు పల్కుఁజెలికిం ----"[67]

ఈ పద్యంలో తిరుమల రాయల సంగీతసాహిత్య అభిలాషను వర్ణించటం జరిగింది. తిరుమల రాయలు, అళియ రామరాయల సోదరుడు. మంచి సంగీతప్రియుడు. రామరాజభూషణుడి సంగీత పాండిత్యానికి క్రింది పద్యం నిలువెత్తు నిదర్శనం.

"లలనాజనాపాంగ వలనావసదనంగ / తులనాభికాభంగదోఃప్రసంగ
మలయానిల విలోలదళ సాసవరసాల / ఫలసాదర శుకాలపన విశాల
మలినీగరుదనీక మలినీకృతధునీక / మలినీసుఖిత కోక కులవధూక
మతి కాంత సలతాంతలతికాంతర నితాంత / రతికాంతరణ తాంతసుతనుకాంత,
మకృత కామోదకురవకావికలవకుల
ముకుల సకలవనాంత బ్రమోదచలిత
కలిత కలకంఠకుల కంఠకాకలీ వి
భాసురము, వొల్చు మధుమాసవాసరంబు"[68]

ఈ పద్యాన్ని వీణ వాయిస్తూ రాగయుక్తంగా ఆలపించవచ్చు. ఇందులోని పదాల విరుపువల్ల, శ్లేష వల్ల నాదమాధుర్యం ఏర్పడింది. సంగీత ప్రియులకు ఆనందాన్ని, సాహిత్యప్రియులకు పారవశ్యాన్ని కలిగిస్తుంది ఈ పద్యం. వసుచరిత్రలోని చాలా పద్యాలు సంగీతానికి అనుకూలంగా ఉంటాయని పండితలోకం భావిస్తుంది.

పింగళిసూరన రాసిన 'కళాపూర్ణోదయం'లో వీణావదనం గురించి ఉంది. నారదతుంబురులకు సంగీతవిద్య విషయంలో ఏర్పడిన స్పర్ధ ఇందులో వర్ణించబడింది. నారదుడి కంటే తుంబురుడు వీణ వాయించటంలో పరిణతిని పొంది, శ్రీమహావిష్ణువు కొలువులో అందరి మెప్పును పొందుతాడు. దానికి అసూయ చెందిన నారదుడు, తుంబురుడిని సంగీతంలో ఎలాగైనా జయించాలనే పట్టుదలకు వస్తాడు. శ్రీమహావిష్ణువు గురించి తపస్సు చేసి, ద్వాపర యుగంలో శ్రీకృష్ణుని వద్ద సంగీత సాధన చేస్తాడు. రుక్మిణి, జాంబవతి, సత్యభామ మొదలైన వారు నారదుడికి సంగీతంలోని మెళకువలను నేర్పిస్తారు. రాయల కాలంలో వీణను వాయించటంలో ఉన్న ఆసక్తి, సంగీతం పట్ల ప్రజలకున్న ఆదరణ సూరన వర్ణనల వల్ల తెలుస్తుంది. నారదుడి సంగీతవిషయాసక్తిని సూరన ఇలా వర్ణించాడు.

"ఏనునుఁ, దుంబురుండెచటి కేఁగె? గృహంబున నున్న వాఁడె? యం
చానికటంబునన్ మెలఁగునట్టి జనంబులఁ బల్కి, 'వీణె యి
చ్చోనిడి, లోని కేఁగె'నను సుద్ది వినంబడ 'నీ విపంచి యె
వ్వానిదొ యంచు నుండి, తమి వానిదె చూత' మటంచు నల్లనన్"[69]

నారదుడు, తుంబురుడి ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ సమయంలో అతడు అక్కడ లేడు. నారదుడు ఆ ఇంట్లో అరుగు మీద ఉన్న వీణను మీటి చూసాడు. అపూర్వమైన స్వరాలను పలికింది వీణ. తుంబురుడి గొప్పదనానికి కారణం వీణమీటడంలో అతడు ప్రదర్శిస్తున్న కళాకౌశలం అని నారదుడు గుర్తించాడు. తాను కూడా అంతకంటే గొప్పగా సంగీతపాండిత్యాన్ని పొందటానికి నిశ్చయించుకున్నాడు. పట్టుదల గల విద్యార్థి ఈ నారదుడు. కఠోర పరిశ్రమ చేసి చివరకు నారదుడు సంగీతవిద్యలో తుంబురుడిని జయించాడు.

తెలుగు సాహిత్యంలోని పదాలు, సంకీర్తనలు, కృతులు కూడా సంగీతశాఖకు సంబంధించినవే. వీటిల్లో సాహిత్యంతోపాటు, సంగీతానికి కూడా సమాన ప్రాధాన్యం కనిపిస్తుంది. కృష్ణమాచార్యుడి 'సింహగిరి వచనాలు' సంగీతబద్ధమైనవి. ఇవి పాడుకోవటానికి అనుకూలంగా ఉండే వచనాలు. ఉదాహరణకు,

"దేవా! విష్ణుభక్తిలేని విద్వాంసుని కంటె
హరి కీర్తనము సేయునతడె కులజుండు
శ్వపచుండైన నేమి – ఏ వర్ణంబైననేమి
ద్విజునికంటె నతడె కులజుండు ద్రిష్టించి చూడంగ
విద్వజ్జన వైభవ దివ్యభూషణము
సింహగిరి నరహరిం దలంచిన యతడె కులజుండు
చతుర్వేద షట్ శాస్త్రముల్ సదివిననేమి
శతక్రతువు లాచరించిననేమి
సకల ధర్మంబులు సేసిననేమి
మా సింహగిరి నరహరి దాసులకు దాసులైనంగాని లేదుగతి
స్వామీ సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ!"[70]

'నృసింహపురాణము'లో ఎఱ్ఱాప్రెగడ, హిరణ్యకశిపుని తపస్సును భంగం చేయడానికి దేవేంద్రుడు పంపిన అప్సరసల్లో ఒకరి గాన మహిమను క్రింది విధంగా వర్ణించాడు.

"అమృతంపు సోన పైనడరినట్లే పాట
చెన్నున మోరళ్లఁ జివుళులొత్తె
మారుతాహతి పేర మ్రాఁకులు దలయూఁపఁ
దొడఁగె మరంద మాధుర్యమునకు
నింపుల గనియైన యీ రాగరసము దీఁ
గలకుఁ గోరక పులకముల నొసఁగె
సెలయేఱులకు నశ్రుజలములు దొరఁగించె
గిరులును మంజులగీతిఁ గరఁగె
ననిననఁబోలుఁబొసఁగు నగుఁదగు ననఁగస
చేతినంబులెల్లఁ జిత్రరూపు
లట్లు సోలినిలువ నంగన యొక్కతి
పాడఁగలమనోజ్ఞభంగు లలర"[71]

అమృతపు జడివాన తమపైన కురిసినట్లు ఆ గాన సౌందర్యంతో మోడులకు చిగుళ్ళు వచ్చాయి. గాలి తాకిడికి చెట్లు తలలు ఊపడం మొదలుపెట్టాయి. మకరందంలోని తీయందనానికి అందమైన నిధి ఆమె పాడుతున్న సంగీత ప్రవాహం. అది లతలకు మొగ్గల రూపంలో పులకాంకురాలను కలిగించింది. సెలయేరులకు ఆనందబాష్పధారలను అదనంగా కురిపించింది. పర్వతాలు సైతం ఆమె అందమైన పాటకు కరిగిపోయాయి అని ఎఱ్ఱన అప్సరస యొక్క గానమాధుర్యాన్ని వర్ణించాడు. 'శిశుర్వేత్తి పశుర్వేత్తి గానరసం ఫణిః' అను సూక్తి ఇక్కడ వ్యక్తమవుతుంది. సంగీత మాధుర్యానికి ప్రకృతిలోని ప్రతి అణువు చలిస్తుందని పై వర్ణన తెలియజేస్తుంది.

పార్వతీపరమేశ్వరుల కళ్యాణానికి బ్రహ్మసభలో జరిగిన గానగోష్ఠిని నన్నెచోడుడు క్రింది విధంగా వర్ణించాడు.

"తేనియ ముసురో యమృతపు
వానయొ పుండ్రేక్షురసము వఱ్ఱోడిన పె
ల్లో నాఁదుంబురు నారద
గానరసం బభవు నోలగంబునఁ బర్వెన్"[72]

ముసురుపట్టి కురుస్తున్న తేనెల వానలాగా, అమృత వర్షం లాగా, తియ్యని చెరుకురసం లాగా ధారాపాతంగా ఆ నారద తుంబురులు బ్రహ్మసభలో గానరసం కురిపించారు.

అల్లసాని పెద్దన గారి 'మనుచరిత్రము'లో వీణావాద్యము గురించి వర్ణించబడింది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో వీణావాదన చాలా ప్రసిద్ధమైంది. ఈ కాలపు ప్రబంధాలు అన్నిటిలో ఈ విద్య ప్రస్తావన ఉంటుంది. వరూధిని ఇంపుగా వీణ వాయిస్తున్న దృశ్యాన్ని పెద్దన ఇలా వర్ణించాడు.

"తత నితంబాభోగ ధవళాంశుకములోని
యంగదట్టపుఁ గావి రంగు వలన
శశికాంతమణిపీఠి జాజువాఱఁగఁ గాయ
లుత్తుంగ కుచపాళి నత్తమిల్లఁ
దరుణాంగుళీధూత తంత్రీస్వనంబుతో
జిలిబిలి పాట ముద్దులు నటింప
నాలాపగతిఁ జొక్కి యరమోడ్పుఁ గనుదోయి
రతిపారవశ్యవిభ్రమముఁ దెలుపఁ
బ్రౌఢిఁ బలికించు గీతప్రబంధములకుఁ
గ్రమకరపంకరుహ రత్నకటక ఝణఝ
ణధ్వనిస్ఫూర్తి తాళమానములు గొలుప
నింపు దళుకొత్త వీణ వాయింపుచుండి"[73]

వీణాతంత్రుల్ని కుడిచేత మీటుతూ ఎడమచేతిని వీణ మెట్లమీద కదిలిస్తూ నేర్పుగా వరూధిని గీతప్రబంధాలు పలుకుతోంది. అందమైన ఆమె చేతులకు ధరించిన రవ్వల గాజులు ఝణఝణమని ధ్వని చేస్తున్నాయి. ఇవి పాటకు అవసరమైన తాళాన్ని సమకూరుస్తున్నాయి అని పెద్దన వర్ణించాడు.

"వలుద గుబ్బలు ప్రసేవకవృత్తిఁ దగు గుబ్బ
కాయల కపరంజిచాయ లొసఁగ
లలితాంగుళీదళంబులు సమేళములైన
సారెలపై రాగసంపద లిడఁ
బాణికంకణరుతుల్ ప్రాణానుబంధంబు
గల తాళగతి కనుగ్రహము లీన

నాలాపభంగి యత్యక్త సంవాది స
మస్వరంబులకు గ్రామంబు లనుపఁ
బ్రచురతానామృతముల మూర్ఛనలచే న
చేతనంబులు చేతనరీతిఁ దనరఁ
జేతనంబు లచేతనభాతి నొనర
వీణ వాయించు నొకయలివేణిఁ గంటి"[74]

రాగానుగుణంగా వీణాతంత్రుల్ని శ్రుతిచేసి, గిరికాదేవి తన మృదువైన చేతివ్రేళ్ళు అనే పూలరేకులు సమేతంగా ఉన్న వీణ మెట్లమీద కదలాడుతూ, ఆ దంతపు మెట్లకు ఎర్రదనాన్ని కలిగించాయట. ఆయా సంగీత రాగాలను అందంగా ఆమె పలికిస్తుందని అర్థం. పై విధంగా తెలుగు ప్రబంధాల్లో వీణావాదన చాలా విరివిగా వర్ణించబడింది.

తెలుగు సాహిత్యంలో సంగీత సాహిత్యాలకు తాళ్ళపాక కవులు చేసిన సేవ విలువకట్టలేనిది. సంకీర్తనాచార్యుడు, పదకవితాపితామహుడు అయిన అన్నమయ్య శ్రీవేంకటేశ్వరస్వామిపై 32,000 సంకీర్తనలు రాసాడు. పెదతిరుమలాచార్యులు, తాళ్ళపాక చిన్నన్న ఎన్నో చాలా సంగీతబద్ధ రచనలు చేశారు. తాళ్ళపాక తిమ్మక్క ద్విపదలో 'సుభద్రాకళ్యాణాన్ని' రాసింది.

తాళ్ళపాక అన్నమాచార్యులు సంకీర్తనల్ని రాయడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. వీటిని గురించి డా.పొన్నాలీలావతమ్మ గారు 'అన్నమయ్య సంకీర్తనల్లో జానపద గేయ ఫణితులు' అనే సిద్ధాంతవ్యాసంలో క్రింది విధంగా తెలియజేశారు. "అన్నమయ్య సంకీర్తనల్ని వ్రాయడానికి ప్రధానంగా నాలుగు కారణాలు కనిపిస్తాయి. మొదటిది అతని కాలం నాటికి కృష్ణమాచార్యుల వచన సంకీర్తనలు ప్రసిద్ధిలో ఉండడం. రెండవది కవులకు పదకవిత పట్ల ఆదరణ కలగడం. మూడవది కన్నడ వాగ్గేయకారులు జానపదగేయరీతుల్ని తమ కవితా వాహికగా వాడుకోవడం. నాల్గవది నాలాయిర దివ్య ప్రబంధాలకు ధీటుగా వ్రాయాలనే సంకల్పం"[75]. అన్నమయ్య కీర్తనల్లో ఇవి ఏవిధంగా ప్రతిఫలించాయో మనం క్రింది సంకీర్తల్లో గుర్తించవచ్చు. ఈయన సంకీర్తనల్లో మేలుకొలుపు పాటలు విశేష ప్రచారాన్ని పొందాయి.

"విన్నపాలు వినవలె వింతవింతలు
పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా"
"మేలుకో శృంగార రాయ మేటి మదన గోపాల

మేలుకో నాపాల ముంచిన నిధానమా''

''పొలయలుక నిద్దరులు భోగించ దొరకొంటి

అలరవడి మేల్కొనవె అఖిలేశ్వర''[76]

తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలను శృంగార సంకీర్తనలు, వైరాగ్య సంకీర్తనలు అనే రెండు విభాగాలు చేయవచ్చు. నాటి ప్రబంధకవుల వర్ణనల్ని అన్నమయ్య పాటల్లోనూ మనం చూడవచ్చు.

''ఏమొకో చిగురుటధరమున ఎడనెడ గస్తూరి నిండెనో''

''శోభనమే శోభనమే వైభవముల పావనమూర్తికి''

''పిలువక వచ్చితిమి పేరటాండ్లము

సొలసి సొలసి మీపైన సోబానఁబాడేము''[77]

శృంగార కీర్తనల్లో ఎంతటి ప్రబంధపోకడలు కనిపిస్తాయో, అన్నమయ్య వైరాగ్య కీర్తనల్లో అంతటి వైరాగ్యభావాలు కనిపిస్తాయి. ఇతడు కులమతాలు నిరసించాడు. అంటరానితనం అమానుషమన్నాడు.

''నానాటి బ్రతుకు నాటకమూ

కానక కన్నది కైవల్యమూ''

''పరమాత్మ నిన్ను గొల్చి బ్రతికేము

విరసపు జాలి జిక్కి వెతఁబడునోపము''

''ఏమి సేయవచ్చుఁ గర్మమిచ్చినంత కానిలేదు

తాము చేసినంత వట్టు తమకుఁబోరాదు''[78]

ఇలా ఎన్నో మధురమైన సంకీర్తనల్ని రాసి అన్నమయ్య సంగీతసాహిత్యాలకు విశేషమైన కృషిచేశాడు. పల్లవి, అనుపల్లవి వంటి నియమాల్ని ఈయన పాటించాడు. ఇవి జానపద సంగీతంలో కనిపించే లక్షణాలు. అన్నమయ్య రచనల్లో మార్గ, దేశి సంగీతభేదాలు ఒక్కటైపోయాయి.

పైన చెప్పిన కవులతో పాటు ఇంకా ఎందరో మహనీయులు సంగీతబద్ధమైన రచనలు చేశారు. క్షేత్రయ్య 'మువ్వగోపాలపదాలు' చాలా ప్రసిద్ధమైనవి. యాగంటివారి పదాలు వైరాగ్యభావాలతో నిండి ఉంటాయి. ఉదాహరణకు,

''ఓపితే పుణ్యముసేయు మోపకుంటే ఊరకుండుము

పాపము సేయకుమింతే పదివేలు జీవుడా''

"పొరలి సంసారమ్ము బొరయకుండెడి
యరసి కోర్కెలయందు నంటబోడు"[79]

శ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారు కాలజ్ఞానతత్వాలను గానం చేశారు. భవిష్యత్తులో జరగబోయే ఎన్నో విశేషాలను వారు పాటలుగా పాడారు.

"చెప్పలేదంటనకపొయ్యేరు నా మాటవినక
తప్పుదారిన నడచిపొయ్యేరు"
"చిలకమ్మ పలుకవే పలుకు"[80]

శ్రీ త్యాగరాజ స్వామి, శ్రీరాముడిపై భక్తితో పాటలు అల్లాడు. వీటికి 'త్యాగరాజకృతులు' అని పేరు. కర్ణాటక సంగీత సంప్రదాయంలో త్యాగరాజకృతులకు విశేషమైన గౌరవం ఉంది.

"నగుమోము గనలేని నాజాలి తెలిసీ"
"ఎందరో మహానుభావులు అందరికీ వందనములు"[81]

ఈవిధంగా ఎందరో మహనీయులు సంగీతాన్ని లోకంలో ప్రచారం చేశారు. అధ్యయన, అధ్యాపనలు చేశారు. సంగీతాన్ని వృత్తిగా చేసుకొని కొందరు కళాకారులు జీవించారు. ఇది ఆనందాన్ని, మోక్షాన్నీ ఇచ్చే విద్య.

3.6.2.3. నాట్య విద్య:–

నృత్తగీతవాద్యాత్మకమైన లాస్యము నాట్యం. ఇది సంగీతంతో పాటు కలిసివుండే కళ. నాట్యం సమాహార కళ. దీనికి సంగీతసాహిత్యాలతో సంబంధం ఉంటుంది. స్వతంత్ర ప్రతిపత్తి ఉండదు. అందువల్ల నాట్యాన్ని సమాహార కళ అంటారు. పింగళి లక్ష్మీకాంతం గారి క్రింది అభిప్రాయం పరిశీలించదగింది. "మూకాభినయము సయితము పాత్రారోపితమైన ఒక కవితా భావము ననుసరించియు, గీతిగతమైన ఒక తాళము నాశ్రయించియు నృత్తనృత్యయుతముగా జరుగును గావున, పరోక్షముగా కవిత్వ సంగీతముల అంశలను ఆశ్రయించియే యది ప్రవర్తితమగును. కాబట్టి నాట్యమునకును, తదంతర్భూతమైన అభినయమునకును, దాని రూపాంతరమైన మూకాభినయమునకును స్వతంత్రస్థితి లేదు"[82]. అందువల్లనే నాట్యాన్ని కూడా సంగీతంతోపాటు ప్రాచీన లాక్షణికులు ప్రస్తావించారు. ప్రాచీనకాలపు విద్యల్లో నాట్యం ప్రసిద్ధమైంది.

పరమేశ్వరుడు, బ్రహ్మ, భరతముని – ఈ ముగ్గురూ నాట్యశాస్త్ర కర్తలని, ఇందులో బ్రహ్మమతాన్ని ప్రతిపాదింపదలచి భరతముని నాట్యశాస్త్రాన్ని నిర్మించాడని నాట్యశాస్త్ర వ్యాఖ్యాత అయిన అభినవగుప్తపాదాచార్యులు పేర్కొన్నాడు[83]. భరతుని నాట్యశాస్త్రంలో దాదాపు 6వేల శ్లోకాలు ఉన్నాయి. ఇందులో భరతుడు ప్రధానంగా పదకొండు విషయాల గురించి తెలియజేశాడు. అవి:– 1. రసము, 2. భావము, 3. అభినయము, 4. ధర్మి, 5. వృత్తి, 6. ప్రవృత్తి, 7. సిద్ధి, 8. స్వరము, 9. ఆతోద్యము (వాద్యము), 10. గానము, 11. రంగము.

నాట్యం లేదా నృత్యం నేర్చుకునేటప్పుడు విద్య. నృత్యకాళాకారుడు తన సాధన వల్ల ఆ విద్యలో విశేషమైన ప్రయోగాలు చేసినపుడు అది కళ అవుతుంది. కళ మానవుడికి ఆనందాన్ని అందిస్తుంది. అతడి హృదయాన్ని ఆకర్షించి, అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తుంది. ఆనుషంగికంగా జ్ఞానబోధ కూడా ఉండవచ్చు. అయితే నృత్యకళలో ఉపదేశం తప్పనిసరిగా ఉండాలన్న నియమం లేదు. అందువల్ల ఈ నృత్యం లేదా నాట్యకళను ప్రయోగాత్మక మానసికవిద్య అనడం జరిగింది. ప్రయోగం వల్లనే ఈ కళకు పరిపూర్ణత వస్తుంది. ప్రదర్శన వల్లనే నాట్యం నలుగురికీ ఆనందాన్ని పంచగలుగుతుంది.

ప్రాచీన కాలపు విద్యార్థులు నేర్చుకున్న లలితకళల్లో నాట్యం ఒకటి. ఈ విద్యను నేర్పటానికి రాజుల అంతఃపురాల్లో ప్రత్యేకంగా ఆచార్యులు ఉండేవారు. బృహన్నల పేరుతో అర్జునుడు విరాటరాజు కుమార్తెకు నాట్యవిద్యను నేర్పించాడు. భరతముని లోకంలో నాట్యవిద్యను విశేషంగా ప్రచారం చేశాడు. దానికి శాస్త్రరూపాన్ని కల్పించాడు. నాటి నుండి నాట్యకళ లోకంలో విశేష ప్రాచుర్యాన్ని పొందింది.

ప్రాచీన కాలంలో, ఆంధ్రదేశంలో కూడా నాట్యకళ అభివృద్ధి దశలో ఉండేదని అమరావతి, నాగార్జున కొండల్లో కనిపిస్తున్న శిల్పచిత్రలేఖనాల వల్ల తెలుస్తున్నది. బ్రిటిష్ మ్యూజియంలో భద్రపరచబడిన అమరావతి శిల్పాల్లో ఒక నృత్యదృశ్యం ఉంది. ఒక స్త్రీ వీణ వాయిస్తుండగా, ఇంకొక స్త్రీ వేణుగానం చేస్తుండగా, మరొక స్త్రీ వీటికి అనుగుణంగా నృత్యం చేస్తున్నది. ఇది బృందనృత్యాన్ని పోలివున్నది.

రాజుల అంతఃపురాల్లో నాట్యవిద్యను అభ్యసించటానికి, ప్రదర్శనలు చేయటానికి అనుకూలంగా నర్తనశాల ఉండేది. ఇది అందంగా తీర్చిదిద్దబడి ఉండేది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఆంధ్రదేశాన్ని సందర్శించిన పేయస్, రాయల అంతఃపురంలోని నర్తనశాల నిర్మాణాన్ని ఈ విధంగా వర్ణించాడు.

"నర్తనశాల సుదీర్ఘమయినది, కాని అంత వెడల్పుగలది కాదు. దాని యందుగోడ నుండి సరిగా రెండు మూరల దూరమున శిల్పరమణీయములగు శిలాస్తంభములు గలవు. ఆ స్తంభ ఫలకములపై నాట్యాంతమున నుండవలసిన సరియైన తీరులతో నొప్పు నాట్యకత్తెల రూపములు చెక్కబడియున్నవి. నృత్యము నభ్యసించువారు, నృత్యాంతమున తాముండవలసిన వైఖరిని మరిచిపోయిన యెడల, అట్టివారు ఈ శిల్పచిత్రములను చూచి తాముండవలసిన తీరును జ్ఞాపకము తెచ్చుకొందురు. ఆ నర్తనశాల తుదకు ఎడమవైపున చిత్రలేఖనములు గల యొక యేకాంత స్థలము యేకాంత స్థలము 'కలదు. అచట నాట్యకత్తెలు తమ శరీరములను, కాళ్లను చక్కగా జాపి' సడలజేసికొనుటకై వ్రేలాడుదురు. వారి నృత్యము సుందర తరముగ నుండునట్లు చేయుటకుగాను శరీరము తేలికగా వంగునట్లు చేయుట కచ్చట నేర్చుకొందురు"[84]. దీన్నిబట్టి రాయల కాలానికి నృత్యకళ ఎంతటి అభివృద్ధి దశలో ఉందో తెలుస్తుంది. శాస్త్రీయమైన రీతిలో నర్తనశాల నిర్మాణం, 'నాట్యకత్తెల తెలివితేటలు ఇక్కడ మనం గుర్తించదగిన విశేషాలు' నాట్యకళ పట్ల నాటి ప్రజలకు విశేష ఆదరాభిమానాలు ఉండేవని పై నిదర్శనం తెలుపుతుంది.

గుంటూరు జిల్లాలోని గోలిశిల్పాల్లో ఒక స్త్రీ వీణను మీటుతున్నట్లు, మరో ముగ్గురు స్త్రీలు దానికి అనుగుణంగా బృందంగా నాట్యం చేస్తున్నట్లు ఉంది. డా. రాయప్రోలు సుబ్రహ్మణ్యంగారి ఆధ్వర్యంలో నాగార్జునకొండ వద్ద జరిపిన త్రవ్వకాల్లో ఒక నాట్యశాల కూడా బయటపడింది. ఆ నాట్యశాలకు అధ్యక్షణి అయిన 'సరసిక' అనే స్త్రీ యొక్క ముద్రిక లభించింది. దీన్నిబట్టి భరతుడికి పూర్వం ఆంధ్రదేశంలో దేశీయమైన నృత్యవిద్యలను నేర్చుకునేవారిని, ప్రదర్శించేవారని తెలుస్తుంది. స్త్రీలు నాట్యశాలకు అధ్యక్షులుగా ఉన్నట్లు దీనివల్ల గుర్తించవచ్చు.

బెజవాడలోని అక్కన్నమాదన్న గుహలకు కొద్దిదూరంలో ఉన్న జమ్మిదొడ్డిలోని మండపస్తంభం మీద, దూలాల మీద క్రీ.శ.8,9 శతాబ్దాల నాటి తూర్పుచాళుక్య శిల్ప సంప్రదాయానికి చెందిన నాట్య చిత్రాలు ఉన్నాయి. కాకతీయుల కాలంనాటి, రేచెరువుల నామిరెడ్డి వేయించిన పిల్లలమర్రి శాసనంలో దేవాలయ కైంకర్యం చేసే గాయకులకు, నర్తకీ జనానికి గృహదానం చేసినట్లు ఉంది. 'జలజకరండం' అనే అపూర్వమైన వాద్యపరికరం గురించిన ప్రస్తావన ధర్మసాగరశాసనంలో ఉంది. ఇందులోనే, కొన్ని నివర్తనాల భూమిని గాయకులకు, పదిమంది నాట్యకత్తెలకు దానం చేసినట్లు ఉంది. ఈ ఆధారాలను బట్టి

ప్రాచీన కాలంలో నాట్యవిద్యకు, నర్తకులకు గౌరవాదరాలు ఉండేవని తెలుస్తున్నది. భరతుని నాట్యశాస్త్రంలో లేని కొన్ని నాట్య విశేషాలు, వాద్యవిశేషాలు పై ఆధారాల వల్ల తెలుస్తున్నాయి.

కాకతీయ చక్రవర్తి గణపతిదేవుని ఆస్థానంలో గజసేనాధ్యక్షుడుగా ఉన్న జాయపసేనాని 'నృత్తరత్నావళి' అనే గ్రంథాన్ని రాసాడు. తెలుగులో రాయబడిన నాట్యశాస్త్ర గ్రంథాల్లో ఇది ఉత్తమమైంది. ఇతడు క్రీ.శ.1253–54 లో ఈ గ్రంథాన్ని రాసినట్లు చెప్పుకున్నాడు. భరతుని నాట్యశాస్త్రానికి ఇది సంగ్రహ రచన. జాయపసేనాని ఈ గ్రంథంలో దేశీయమైన నృత్యాలను కూడా వివరించాడు. ఎనిమిది అధ్యాయాలు గల ఈ గ్రంథంలో, చివరి అధ్యాయంలో దేశినృత్య సంప్రదాయాలను గురించి వివరించాడు. భరతుని నాట్యశాస్త్రంలో జాయపసేనానికి గల పాండిత్యాన్ని ఇతని నృత్తరత్నావళి వల్ల తెలుసుకోవచ్చు. జాయప – పేరణి, ప్రేఖ్ఖణము, రాసకము, చర్చరి, నాట్యరాసకము, దండరాసకము, శివప్రియము, చిందు, భాండికము మొదలైన దేశినృత్యాలను వివరించాడు. ఇవి ఆంధ్రదేశంలో సాగిన నాట్యవిద్య సాధనకు, ప్రదర్శనకు మంచి నిదర్శనాలు. భరతునికి పూర్వమే తెలుగు ప్రాంతంలో దేశీయమైన నృత్యప్రదర్శనలు జరిగేవని దీనివల్ల తెలుస్తున్నది.

తెలుగు సాహిత్యంలో చాలా చోట్ల నృత్యకళకు సంబంధించిన విశేషాలు కనిపిస్తున్నాయి. ఈ కవులు నాటి దేశీయ నృత్యవిశేషాలను కూడా సందర్భోచితంగా వర్ణించారు. నన్నయ ఆదిపర్వంలో రైవతకాద్రి ఉత్సవంలో జరిగిన నృత్యాన్ని ఈవిధంగా వర్ణించాడు.

"పొలుపుగఁ బూసి కట్టి తొడి భూరివిభూతి ప్రకాశితంబు గాఁ
గలయఁగఁ దత్పురీజనులు కాంస్యమృదంగ ముకుందవేణు కా
హళపటహధ్వనుల్ సెలఁగ నాటలుఁబాటలు నొప్ప నెల్లవా
రలుఁజని చేసి రర్చనలు రైవతకాద్రికి నుత్సవంబుతోన్"[85]

ఇక్కడ జానపదుల కొండపూజను, వారి బృందనృత్యాన్ని కవి తెలియజేశాడు. వారు మదిరామదంతో పరవశులై ఇంపుగా పాడుతూ, తాళాలు వేస్తూ ఆడినట్లు ఈ సందర్భంలోనే నన్నయ వర్ణించాడు.

నన్నెచోడుడు 'కుమారసంభవము'లో లాస్యనృత్యాన్ని క్రిందివిధంగా వర్ణించాడు.

"గళనాదంబులు మంజుగానములుగాఁ గాంచీలసత్కింకిణీ
కలనాదంబులు హృద్యవాద్యములుగాఁ గాంతోరు పీఠోన్నత
స్థల రంగమ్ములఁ గాముఁడన్నటకుఁ డోజంగూడ నాడింపఁగా
లలనాపాత్రము లాడి రొప్పు రతిలీలాలాస్య లోలాస్యలై"[86]

కంఠధ్వనులు మనోహరమైన గానాలను, మొలనూలి మువ్వల అవ్యక్త మధురమైన ధ్వనులు వాద్యాలుగా, స్త్రీల ఊరు పీఠాలనెడి ఉన్నత రంగస్థలం మీద మన్మథుడు అనే నటుడు నేర్పుతో ఆడింపగా స్త్రీలు అనే నటులు రతిక్రీడ అనే నాట్యం చేత చలించిన ముఖాలు కలవారు అయ్యారట. ఇక్కడ సూత్రధారుడు, నటుల ప్రస్తావనను మనం గుర్తించవచ్చు. ఒక రంగస్థలం మీద ప్రదర్శన ఎలా జరిగేదో కవి వర్ణన వల్ల తెలుస్తున్నది.

పాల్కురికి సోమనాథుడు రాసిన 'పండితారాధ్యచరిత్ర'లోని పర్వతప్రకరణంలో నృత్యకళకు సంబంధించిన పదజాలమే కాక, నృత్తరత్నావళిలో చెప్పబడిన దేశీయ నృత్యాల వర్ణన కూడా ఉంది.

"భ్రమరులు జాశెముల్ బయనముల్ మెరసి
రమణ పంచాంగ పేరణి యాడువారు
ప్రమథ పురాతన పటు చరిత్రములు
క్రమమొంద బహు నాటకములాడువారు
లలితాంగరస కళాలంకార రేఖల నడ
బహురూప మాడెడువారు
అమరాంగనలు దివినాడెడు మాడ్కి
నమరంగ గడలపై నాడెడువారు
అవియద్గతి యక్షులాడెడునట్టి
భారన మ్రోకులపై నాడువారు
భారతాది కతల చీరమరగు
నారంగ బొమ్మల నాడించువారు
కడు నద్భుతంబుగ గంథసూత్రంబు
లడరంగ బొమ్మల నాడించువారు
నారట గంధర్వ యక్ష విద్యాధ
రాదులై పాత్రల నాడించువారు"[87]

శ్రీశైలంలో శివరాత్రి మహోత్సవంలో ఆడిన దేశినృత్యాల గురించి పాల్కురికి సోమన పండితారాధ్యచరిత్రలో తెలియజేశాడు. అవి:–

1. వెడయాట (వికట నర్తనము)
2. చిందు
3. కోడం(ణం)గి ఆట
4. పేరిణి (పంచాంశి)
5. బహురూపులు, బహునాటకాలు
6. వెడ్డంగం
7. గడాటలు, దొమ్మరాట
8. బొమ్మలాటలు
9. పక్షుల ఆటలు
10. అమర గంధర్వాంగల నృత్యానుకరణాలు
11. పగటివేషాలు

పేరిణి నృత్యాన్ని ఇందులో పాల్కురికిసోమన 'పంచాంశి' అని చెప్పాడు. నాట్యశాస్త్రంలో నృత్తము, కైవారము (కవిచరము), ఘర్ఘరము, వికటము, గీతము అనే పంచాంగాలు ఉంటాయి. వీటిని సోమన పై పద్యభాగంలో 'పంచాంశి' అనే పదంలో సూచించాడు.

ఈ సందర్భంలోనే పాల్కురికి సోమన దేశిలాస్యాంగాల్ని, అంగాల యొక్క అభినయాల పట్టికను ఇలా తెలియజేశాడు. ముఖం–నాలుగు, కనుబొమ్మలు–ఏడు, కన్నులు–ఇరవైఆరు, ముక్కు–ఆరు, చెవులు–పది, కుత్తుక–తొమ్మిది, రొమ్ములు–మూడు, పాదాలు–ఐదు, తొడలు–ఇరవైరెండు, చూపులు – ముప్పయి నాలుగు, చేతులు – అరవైనాలుగు, చారులు–ముప్పయి రెండు, భ్రమరులు–ఏడు, కరణములు–నూట ఎనిమిది, అలంకారాలు–నూరు, శిరోభినయాలు–పదమూడు, దండనములు–ముప్పయిరెండు. దీన్నిబట్టి సోమనకు దేశినృత్యరీతుల పట్ల మంచి అభిరుచి, అవగాహన ఉన్నట్లు తెలుస్తుంది. ఆంధ్రదేశంలో నాట్యకళ ఎంతగా అభివృద్ధి చెందిందో పై పట్టిక వల్ల అర్థమవుతున్నది. భరతుని నాట్యశాస్త్ర సంప్రదాయానికి భిన్నమైన అభినయాలును పై పట్టికలో చాలా ఉన్నాయి.

పాల్కురికి సోమన 'బసవపురాణం'లో, బసవని వివాహఘట్టంలో కోలాటం, పేరిణి, గొండ్లి మొదలైన నృత్యాలను వర్ణించాడు.

"కోలాటమునుఁ, బాత్ర, గొండ్లి, పేరణము
గేళిక జాకములీల నటింప
బాయకబాగు బళా యనుశబ్ద
మాయతి నాక సంబంధి ఘూర్ణిల్ల
నలిరేగి వేణువీణా వాద్య వితతు
లురియుచు లీలతో నొక్కలు మ్రోయు
––––––––––––––––––––
జతిగీతములు మీద జప్పులు విడుచు
నతిశయ శివభక్తి యాడెడువారు
నీది పురాతన పాదితస్తుతులు
వేదార్థములు గాగ వివరించువారు
నేణిశివ మరులున గురులేనిపొడ
నఱిముఱి పిన్నంది యాడెడివారు"[88] (బసవపురాణము; 1ఆ; పు.50)

ఈ సందర్భంలోనే సోమన పూర్వాంగ సంగీతం, తెరతీయటం. ముఖరసం, సౌష్ఠవం, లలి, భావము, ధూకళి, ఝంకళి, రేవ, విభ్రమము, రేఖ అనే వాటిని కూడా ప్రస్తావించారు. వీటి తర్వాత జతిగీతాలను వర్ణించాడు. జాయపసేనాని 'నృత్తరత్నావళి'లోని ఎన్నో విశేషాలను పాల్కురికిసోమన ఇక్కడ సూచించాడు.

తిక్కన 'విరాటపర్వం'లో, విరాటరాజు కొలువులోకి వచ్చిన అర్జునుడు ఆ రాజుతో తన నాట్యవిద్యాకౌశలాన్ని గురించి క్రింది విధంగా తెలియజేస్తాడు.

"ఒండు పనులకు నెలవు లేకునికిఁ జేసి
యభ్యసించితి శైశవమాదిగాఁగ
దండలాసక విధమును గుండలియును
బ్రెక్కణంబు తెఱంగునుఁ బేరణంబు"[89]

"విశ్రుత వాద్యంబులు మం
జుశ్రుతి సంభావ్యగీత సుగతులు సద్భా
వాశ్రయములుఁ దజ్జన్య ర
సాశ్రయములు నైన యభినయంబు లెఱుఁగుదున్"[90]

తిక్కన ఇక్కడ దండలాసకం, మండలి, ఫ్రేంఖణం, పేరిణి వంటి నృత్యవిశేషాల్ని సూచించాడు. బృహన్నల నపుంసకుడు కాబట్టి, ఇతర పనులకు పనికిరాడు కాబట్టి శైశవం నుండి నృత్తవిద్య అభ్యసించానని చెప్పాడు. వివిధ వాద్యాలను వాయించటం, సందర్భానికి తగిన గీతాలను ఆలపించటం, రసాశ్రయాలైన అభినయాలను చేయటం తాను నేర్చుకున్నట్లు విరాటరాజుతో బృహన్నల తెలియజేశాడు.

నాట్యప్రదర్శన సమయంలో, రంగస్థలం మీద కట్టినతెరను రెండు వైపులకు లాగే విషయాన్ని ఎఱ్ఱాప్రెగడ 'నృసింహపురాణము'లో ఇలా వర్ణించాడు.

"సురుచిర తారకాకుసుమ శోభినభోంగణ భూమిఁ గాలమ
న్గరువపు సూత్రధారి జతనంబున దిక్పతికోటి ముందటన్
సరసముగా నటింపఁగ నిశాసతి కెత్తిన క్రొత్త తోఁపుఁ బెం
దెరయన నొప్పె సాంధ్యనవ దీధితి పశ్చిమదిక్తటంబునన్"[91]

నక్షత్రాలనే పుష్పాల చేత అలంకరించబడిన ఆకాశమనే రంగస్థలం మీద కాలమనే సూత్రధారి, దిక్పాలకుల ముందర సరసంగా నటించటానికి రాత్రి అనే నాట్యకత్తెను సిద్ధం చేసాడు. ఎత్తినటువంటి రంగుతెర అన్నట్లుగా సంధ్యాకాలంలోని అరుణద్యుతి పశ్చిమదిశలో మనోహరంగా కనిపించింది. ఇక్కడ సంధ్యాకాల వర్ణనతోపాటు, రంగస్థల వర్ణన చేయటం గమనించదిగింది. రెడ్డిరాజుల కాలంనాటికి నాట్యప్రదర్శనలు జరిగేవని ఈ ఉదాహరణ తెలియజేస్తుంది.

కొండవీటి రెడ్డి రాజుల్లో కొందరు నాట్యశాస్త్ర రచయితలు కూడా ఉన్నారు. కుమారగిరిరెడ్డి (క్రీ.శ.1386–1402) 'వసంతరాజీయము' అనే నాట్యశాస్త్ర గ్రంథాన్ని రాసాడు. కానీ ఇది అలభ్యం. అయితే కాటయ వేమారెడ్డి, మల్లినాథుడు, కుమారస్వామి, నాదెండ్ల గోపన మొదలైనవారు వసంతరాజీయములోని కొన్ని భాగాలను తమ రచనల్లో పేర్కొన్నారు. కుమారగిరిరెడ్డి తర్వాత రాజ్యానికి వచ్చిన వీరనారాయణుడు అనే నామాంతరం గల పెదకోమటి వేమారెడ్డి 'సంగీతచింతామణి' అనే గ్రంథాన్ని

రచించాడు. ఇందులో నాట్యశాస్త్ర విశేషాలు కూడా ఉన్నాయి. ఇతని ఆస్థానంలోనే ఆంధ్రకవిసార్వభౌముడిగా పేరుగాంచిన శ్రీనాథుడు విద్యాధికారిగా పనిచేశాడు.

రెడ్డిరాజులు ఈశ్వరునికి పూజ చేసే సమయంలో నృత్యాలు జరిగేవని శ్రీనాథుడు 'కాశీఖండం'లో ఇలా వర్ణించాడు.

"వల్లకిచక్కి కాహళము వంశము డక్క హుడక్క ఝర్ఝరల్
ఝల్లరి యాదిగాఁగలుగు శబ్ద పరంపర తాళబద్ధమై
యుల్లసిత ప్రబంధముల కొప్పుగ నాడుదురగ్ర వేదిపైఁ
బల్లవపాణు లీశ్వరునిఁ బంట మహీశులు పూజసేయగన్"[92]

వీణ, చక్కి, తప్పెట, పిల్లనగ్రోవి, డక్కి, హుడక్క, ఝర్ఝరి, ఝల్లరి మొదలైన వాద్యవిశేషాలు తాళబద్ధంగా మ్రోగుతుండగా స్త్రీలు రంగస్థలం మీద నృత్యం చేసారట. పైన చెప్పినవి దేశీయమైన వాద్యపరికరాలు. శ్రీనాథుడు 'పల్నాటివీరచరిత్ర'లో దేశీయ నృత్యాలను సుదీర్ఘంగా వర్ణించాడు.

"నాట్య మేళములవారు నవవిలాసముల
వచ్చినమ్రత మొక్కి ప్రక్కగా నిల్వ
ఘన వైభవంబున కామభూవిభుడు
నవ్వుచు సెలవిచ్చె నాట్యంబుచేయ
వీర మృదంగము లెస్స వాయించుమేటి
కుడి భాగమునయందు కుదురుగా నిలిచె
తాళమానజ్ఞులు దాపటి దిశను
నిలిచిరుత్సాహంబు నేరుపుమీర
ముఖవీణ వాయించు ముఖ్యుడొకండు
రాగమాలపించు రమణులిద్దరు

ప్రేరణి దేశిని ఫ్రేంఖణ శుద్ధ
దండికాకుండలి తగు బహుచారి
సప్తతాండవములు సల్పె చిత్రముగ
సభ వారలాశ్చర్య సంయుక్తులైరి

తరువాత నిరుమేలదగు చెలులమర
సంయుతా సంయుత చలన సంకుచిత
నానార్థకరములు నాట్యహస్తములు----"[93]

విజయనగర రాజుల కాలంలో సంగీతనాట్య కళలు తారాస్థాయిని పొందాయి. విద్యానగరరాజ్య ప్రతిష్ఠాపకుడుగా పేరుపొందిన విద్యారణ్యస్వామి 'సంగీతసారము' అనే గ్రంథాన్ని రాసినట్లు 'సంగీతసుధ' అనే గ్రంథంలో చెప్పబడింది. కానీ సంగీతసారము అలభ్యం. ఇందులో నాట్యవిశేషాలు కూడా ఉన్నాయని రఘునాథనాయకుడు 'సంగీతసుధ'లో తెలియజేశాడు.

రెండవ దేవరాయల కాలంలో అబ్దుల్ రజాక్ అనే పార్శీయాత్రికుడు విజయనగరాన్ని సందర్శించాడు. అతడు నాటి నాట్య ప్రదర్శనల గురించి తెలిపాడు. విజయనగర రాజ భవనంలో దసరా దినాల్లో, మహానవమిమహోత్సవం అత్యంత వైభవముతో జరిగేదని, అక్కడ నాట్యప్రదర్శనలు జరిగేవని తెలియజేశాడు. ఇమ్మడి ప్రౌఢదేవరాయల కాలంలో కల్లినాథుడు సంగీతరత్నాకరానికి 'కళానిధి' పేరుతో వ్యాఖ్యానం రాసాడు. ఇందులోని చివరి అధ్యాయంలో నాట్యశాస్త్ర విషయాలను కల్లినాథుడు చాలా వివరంగా వ్యాఖ్యానించాడు. ఇది అతని నాట్యకళా పాండిత్యానికి నిదర్శనం.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో నాట్యవిద్య ఎంతగానో ఆదరించబడింది. శ్రీకృష్ణదేవరాయలు 'చిన్నాదేవి' అనే నాట్యకత్తెను వివాహం చేసుకున్నట్లు తెలుస్తున్నది. రాయల ఆస్థానంలోని బండారు లక్ష్మీనారాయణ పండితుడు అంతఃపుర స్త్రీలకు సంగీతనాట్యాలను నేర్పించాడు. ఇతడు 'సంగీతసూర్యోదయము' అనే గ్రంథాన్ని రచించాడు. ఇందులో శార్ఙ్గ దేవుడు, కోహలుడు మొదలైనవారి నాట్యశాస్త్రగ్రంథాలను చాలా సార్లు ఉదాహరించాడు. దీన్నిబట్టి క్రీ.శ.16వ శతాబ్దం నాటికి నాట్యకళ అత్యున్నత దశను పొందినట్లు గుర్తించవచ్చు. సంగీతంతోపాటు నాట్యం కూడా సమాన గౌరవాన్ని పొందినట్లు పై రచనల వల్ల తెలుస్తున్నది.

జక్కన, తన 'విక్రమార్క చరిత్రము'లో ఊర్వశి దేవేంద్రుడి సభలో రంభతో పోటీపడి చేసిన నృత్యాన్ని ఈ విధంగా వర్ణించాడు.

"శృంగార మేపార నంగవల్లికయందు
గీతసామగ్రి యంగీకరించి

కరతలామలకంబుగాఁ గరాంబుజముల
నర్థ మాద్యంతంబు నభినయించి
భావింప నరుదైన భావమర్మంబులు
మెఱుఁగుఁ జూపులలోన మేళవించి
తాళమానములతోఁ దాళనిర్ణయలీలఁ
జరణపల్లవముల సంగ్రహించి
యఖిలమును మెచ్చఁ బ్రత్యక్షమైనయట్టి
నాట్య విద్యాధిదేవతనాఁ దనర్చి
భరతశాస్త్ర మర్మజ్ఞతాప్రౌఢి మెఱసె
నూర్వశీకాంత వేల్పు పేరోలగమున"[94]

నేపథ్యంలో ఒకరు పాడుతుండగా, ఒకరు తాళం వేస్తుంటే రంగస్థలం మీద నర్తకీమణి నాట్యాభినయం చేస్తుంది. ఈ సన్నివేశాన్ని కవి ఇక్కడ వర్ణించాడు. రంభా-ఊర్వశులలో ఎవరు గొప్ప నర్తకీమణి? అని తేల్చటానికి దేవేంద్రుడు ఏర్పాటు చేసిన సభలలో ఊర్వశి చేసిన అద్భుతమైన నృత్యాన్ని జక్కన ఇక్కడ వర్ణించాడు. గీతికలోని అర్థాన్ని తన హస్తముద్రలతో ప్రేక్షకులను ఆకర్షించేవిధంగా ఊర్వశి అభినయించింది. భావనకే అందనటువంటి అరుదైన భావసూక్ష్మాలను చురుకైన తన చూపులలో మేళవించి ప్రదర్శించింది. ఇలా నాట్య సర్వస్వాన్ని ప్రేక్షకులు మెచ్చుకునేటట్టుగా సాక్షాత్తు నాట్యసరస్వతి ప్రత్యక్షమయింది అన్నట్టుగా అభినయించింది. భరతశాస్త్రంలోని మర్మాలన్నీ తెలిసిన నేర్పుతో ప్రౌఢితో ఊర్వశి రంగస్థలం మీద నృత్యం చేసిందని కవి వర్ణన. ఇది సమకాలీన భారతీయ నృత్యకళకు ప్రతిబింబం. జక్కన వర్ణించిన తీరు ఆయన నాట్యశాస్త్ర పాండిత్యానికి నిదర్శనం.

తంజావూరు నాయకరాజుల కాలంలో సంగీతనాట్య కళలు మంచి ఉన్నతిని పొందాయి. ముఖ్యంగా రఘునాథ నాయకుడు, విజయరాఘవ నాయకుడు, రంగాజమ్మ వంటి కవులు సంగీతసాహిత్యాలకు పెద్దపీట వేశారు. రఘునాథ నాయకుడు రాసిన 'వాల్మీకి చరిత్రము'లో నాట్యశాస్త్ర విశేషాలు చాలా ప్రస్తావించబడ్డాయి.

"సంయుతాసంయుత సంజ్ఞక హస్తముల్
పదుమూడునొక యిరువదియునాల్గు
త్రింశద్గతులఁబొల్చు నృత్తహస్తంబులు

నైదు వృక్షంబులు నైదుకటులు
స్కంధంబు లాఱును గంధరల్ తొమ్మిది
జానువులేడు పార్శ్వంబులైదు
నుత్తమాంగంబు లేకోనవింశతి దశ
బాహుల్ త్రికుక్షులుఁ బదములాఱు
స్థాయిదృష్టు లెనిమిది సంచారిభావ
దృష్టు లిరువది రసదృష్టు లెనిమిదియును
బొంకముగఁజూపి వింతకోపులు సెలంగ
నాడఁ గలిగినఁ గలహించఁబాడి నీకు"[95]

వాల్మీకి చేస్తున్న తపస్సును భగ్నం చేయటానికి ఇంద్రుడు రంభనూ, ఊర్వశినీ పురికొల్పాడు. అప్పుడు ఆ ఇద్దరు అప్సరసలు పరస్పరం వాదులాడుకున్నారు. నేను వెళతానంటే నేనని ఇద్దరూ సిద్ధపడ్డారు. అప్పుడు రంభనుద్దేశించి ఊర్వశి పై విధంగా పలుకుతుంది. నువ్వు నాతో పోటీపడాలి అంటే పైన చెప్పినవన్నీ అభినయిస్తూ నాట్యమాడగలిగితే అప్పుడు నువ్వు నాతో కలహించడానికి తగినదానివి అవుతావు అని సవాలు విసురుతుంది. ఇక్కడ లోకంలో ప్రసిద్ధమైన భరతుని నాట్యశాస్త్రరీతుల్ని రఘునాథ నాయకుడు వర్ణించాడు.

అయ్యలరాజు నారాయణామాత్యుడు రాసిన 'హంసవింశతి'లో కూడా ఆనాటి రాగాల పేర్లు, నృత్యాల పేర్లు ప్రస్తావించబడ్డాయి. 'రతిసేన' అనే నాట్యకత్తె నాట్యవిద్యాకౌశలాన్ని ఈ కవి ఇలా వర్ణించాడు.

"భారుడంబును శుద్ధపద్ధతిబహురూప
లక్షణంబులు దండలాస్యములును
బెక్కణ పద్ధతి పేరణా పద్ధతి
కుండలీ నృత్తంబు భాండికంబు
రాసకాఖ్యము నాట రాసకంబును జిత్ర
పద్ధతియును దేశ్యపద్ధతియును
జర్చరీ కందుక చానరి కోలాట
ములు నాఁగఁదగుపేళ్లఁగలుగునట్టి
షోడశంబగు నృత్తంబు చొఱవ లెఱిఁగి
సరవిఁ జంచుపుటంబును జాంపుటమును

ధృవము మధ్యము రూపక త్రిపుట జంపె
యేకతాళాటతాళాదు లెల్ల నెఱిఁగి"[96]

భారుండం, శుద్ధపద్ధతి, బహురూపలక్షణం, దండలాస్యం, బెక్కణం, పేరిణీ వంటి నృత్యాల పేర్లు ఇక్కడ ప్రస్తావించబడ్డాయి. అలాగే చంచుపుటం, జాంపుటం, ధృవం, మధ్యమం, రూపకం, త్రిపుటం లాంటి తాళభేదాల్ని నారాయణామాత్యుడు ఇక్కడ తెలియజేశాడు.

ఈవిధంగా భరతుని మొదలు నేటి వరకు నాట్యవిద్య ప్రజాదరణను కలిగివున్నది. అధ్యయన అధ్యాపనాల్లో ఈ విద్య అనాది నుండి స్థానం పొందివున్నది. శాసనాల్లోను, చారిత్రక కట్టడాల్లోను, సాహిత్యంలోను విరివిగా నాట్యవిద్య గురించిన విశేషాలు కనిపిస్తున్నాయి.

3.6.2.4. శిల్ప విద్య:-

శిల్పం అనే పదానికి 'మృద్దారు శిలాదులచే నిర్మింపబడిన మూర్తిమందిరాదికము'[97] అని అర్థం. మట్టి, చెక్క, శిలలు మొదలైన వాటితో తయారుచేసిన మూర్తి లేదా ఆకృతి శిల్పం. ఇది లలితకళల్లో ఒకటి. ప్రాచీన కాలపు విద్యార్థులు నేర్చుకున్న అష్టాదశ విద్యల్లో శిల్పవిద్య కూడా ఒకటి. ఇది నేర్చుకునేటప్పుడు విద్య అవుతుంది. శిల్పి తన సాధన, ప్రయోగాల వల్ల ఈ విద్యలో నైపుణ్యాన్ని సంపాదించి, అపురూపమైన శిల్పాలను మలిచినప్పుడు అది కళ అవుతుంది. కళ ప్రధానంగా ఆనందాన్ని కలిగిస్తుంది. నీతిబోధన కూడా ఆనుషంగికంగా ఉండవచ్చు. శిల్పకళ చూసేవారికి ఆనందాన్ని కలిగిస్తుంది. శిల్పి తన చాతుర్యంతో కఠినమైన శిలను కూడా అందమైన యువతిగా తీర్చిదిద్దగలడు. నిర్జీవంగా పడివున్న కొయ్యను కూడా సజీవమైన లతగా మలచగలడు. అందువల్ల శిల్పవిద్య సృష్టికి ప్రతిసృష్టి వంటిది. శిల్పి ఆ నూతనసృష్టికి కర్త. దీన్ని చూసి, ఆనందించేది కళాతృష్ణ కలిగిన సహృదయుడు. అందువల్ల శిల్పవిద్యను ప్రయోగాత్మక మానసికవిద్య అనడం జరిగింది.

భారతీయ శిల్పపరిణామంలో మూడు దశలున్నాయి. మొదటిది – వైదిక, పౌరాణిక సంబంధి శిల్పసృష్టి. ఈ దశలో త్రిమూర్తులు, ముగ్గురమ్మలు, దేవగణాలు మొదలైనవి శిల్పికి వస్తువులు. విశ్వకర్మ దేవశిల్పిగా ప్రసిద్ధిగాంచాడు. బౌద్ధయుగంలో లౌకికజీవితానికి చెందిన శిల్పసృష్టి మొదలైనది. ఇది

రెండవదశ. బుద్ధ, మైత్రేయ, బోధిసత్త్వ విగ్రహాలను ఈదశలో సృష్టించటం జరిగింది. ఈదశలో కూడా ఆధ్యాత్మిక చింతనే శిల్పవిద్యకు ప్రయోజనంగా కనిపిస్తుంది.

ఢిల్లీ సుల్తానులు, మొగలాయి యుగాల్లో శిల్పకళలో సామాజికదృష్టి కనిపిస్తుంది. ఇది మూడవదశ. శిల్పకళ దేవాలయాన్ని వదలి ఈ దశలోనే రాజప్రాసాదాల్ని చేరింది. అప్పటి వరకు దేవాలయ వాస్తువుకు అంగం లాగా ఉన్న శిల్పకళ తర్వాత కాలంలో విడిపోవడం కనిపిస్తుంది.

భారతదేశంలో చాలా రకాల శిల్పసంప్రదాయాలు కనిపిస్తాయి. తక్షశిల, మధుర, సారనాథ్, అమరావతి, మామల్లపురం, భువనేశ్వర్, తంజావూరు, విజయనగరం, హంపి, హళెవీడు మొదలైన క్షేత్రాల్లో వైవిధ్యంతో కూడిన శిల్పకళ దర్శనమిస్తుంది. వీటిల్లో అమరావతి, విజయనగరం, ఓరుగల్లు వంటివి తెలుగువారి శిల్పకళా ప్రాభవానికి నిదర్శనంగా నిలిచివున్నాయి. తెలుగు శిల్పి గొప్పదనం గురించి చెప్పిన ఈ మాటలు గుర్తించదగినవి. "ఆంధ్రశిల్పమునకు సమరసత ప్రాణము. ఆంధ్రశిల్పి ఎంత పనివాడో అంత రసజ్ఞుడు. ఈ శిల్పి కృషిలో శాస్త్రమునకును, ప్రకృతికిని సరియైన పాళ్లలో మేలు కలయిక చేకూరినది. మనస్స్వాతంత్ర్యము కలవాడగుట చేత నితడు నియమములకు చిక్కి ఛాందసుడు కాలేదు. పైగా విశాల హృదయము కలవాడగుట చేత దేశీయ, విదేశీయ రీతులలోని సద్గుణములను ధారాళముగా స్వీకరింపగలిగెను"[98]. దీనికి నిదర్శనంగా శ్రీశైలం, అమరావతి, నాగార్జునకొండ, విజయనగరం వంటి శిల్పరీతుల్ని చెప్పవచ్చు. ఇక్కడి శిల్పాల్లో శాస్త్రీయత ఉంటుంది. సహజత్వము కూడా ఉంటుంది. ఏ దేశ శైలినైనా తనలో ఇముడ్చుకొని ముందుకు వెళ్ళగలిగిన సామర్థ్యం, సహృదయత భారతీయశిల్పకళకు ఉంది. అటువంటి లక్షణమే ఆంధ్రుల శిల్పకళలో కూడా కనిపిస్తుంది.

అమరావతి, నాగార్జునకొండ వంటి చారిత్రక ప్రదేశాల్లో శిల్పవిద్య ఉన్నత స్థితిలో ఉండేది. క్రీ.శ.6వ శతాబ్దం వరకు ఆంధ్రదేశంలో బౌద్ధ శిల్ప సంప్రదాయం కనిపిస్తుంది. క్రీ.శ.7వ శతాబ్దంలో ఆంధ్రదేశానికి కొత్తదనాన్ని తీసుకువచ్చింది వేంగీశైలి. విజయవాడ శిల్పాల్లో విష్ణుకుండినుల కాలంలో కూడా ప్రతిఫలించిన గతకాలపు శైలీ లక్షణాలు వేంగీశైలిలో నామమాత్రంగానే కొనసాగాయి. ఇక్కడి నుండి తెలుగుప్రాంతంలో వైదికశైలీశిల్పం కనిపిస్తుంది. దీన్నిబట్టి ఆయా రాజవంశాల ప్రభావం ఆంధ్రదేశ శిల్పకళ మీద ఉందని చెప్పవచ్చు. రాజులు శిల్పాచార్యులకు ఆదరణ కల్పించారు. వారి వద్ద విద్యార్థులకు శిక్షణను

ఇప్పించేవారు. అందువల్ల ఆంధ్రదేశంలో కనిపించే ప్రతి ఆలయం, ప్రతి కట్టడం శిల్పకళతో అలంకరించబడింది. చిన్న గోడ మీద కూడా అద్భుతమైన శిల్పాలు దర్శనమిస్తాయి. ఇది మన ప్రాచీన భారతీయుల శిల్పకళాభిమానాన్ని తెలియజేస్తుంది.

చెన్నై ప్రభుత్వ పురావస్తు ప్రదర్శనశాలలో భద్రపరచిన విజయవాడ ద్వారపాల విగ్రహాలు ఏడవ శతాబ్ది నాటి శిల్పశైలికి చక్కని ఉదాహరణ. మడతలున్న కటివస్త్రం, దీని మధ్యలో కుచ్చులు, శిరస్సు పైభాగంలో ముడివేసిన తలగుడ్డ ఎంతో సహజంగా ఈ విగ్రహాల్లో కనిపిస్తున్నాయి. "ఇక్కడున్న ఒక ద్వారపాల విగ్రహం దిగువభాగంలో గుండయ అన్న శిల్పి పేరు చెక్కి ఉంది. శరీరాకృతికి అనుగుణంగా కాళ్లూ, చేతులూ నిర్దుష్టంగా అమరి ఉన్నాయి"[99]. ఈ కాలంలో గుండయ అనే వ్యక్తి పేరుగాంచిన శిల్పి అన్న విషయం పై మాటల వల్ల తెలుస్తుంది. ఎడమవైపు కింది చేతుల్లో ఒకటి విస్మయముద్రలో ఉండడం ఈ ద్వారపాల విగ్రహాల్లో కనిపించే ప్రత్యేకత.

క్రీ.శ.8వ శతాబ్దం నాటికి ఆంధ్రదేశంలో భిన్నరూపాలైన శిల్పకళా సంప్రదాయాలు విస్తరించాయి. జల్పేశ్వరాలయం నాసికల్లో మానవ శిరస్సులతో, త్రిమూర్తి ఆకృతులతో ఉన్న శిల్పాలు కనిపిస్తాయి. తేరాలలోని 'రూపలమ్మ' ఆలయంలోని విద్యాధరప్రతిమలు, అస్పష్టమైన మహిషాసురమర్దిని విగ్రహం ప్రసన్నమైన ముఖ కవళికలతో సన్నగా, కోమలంగా ఉన్నాయి. ఈ కాలంలో వైదిక శిల్పంతో పాటు, జైనశిల్ప సంప్రదాయం కూడా ఆంధ్రదేశంలో కనిపిస్తుందని క్రింది మాటలు నిరూపిస్తున్నాయి. "నిటారుగా నిల్చున్న పార్శ్వనాథ, తీర్థంకర ప్రతిమలకు శిలలోనే చిన్న వస్త్రం ఆచ్ఛాదనగా చెక్కి ఉండటం యాపనీయశాఖను సూచిస్తుంది. పార్శ్వనాథుని సమీపంలో త్రిశూలధారిణి అయిన అంబికావిగ్రహంతో పాటు ఈ ప్రతిమలు అన్నీ అపరిణతంగా చూడటానికి ఆ పరిణతంగా ఉన్నాయి. అయితే కేసనపల్లిలోని ఎనిమిదవ శతాబ్దినాటి జైన విగ్రహం శరీరం పొడవుగానూ, ఆకారం చిన్నదిగానూ, ముఖంలో జైనదార్శనికత్వంతోనూ దర్శనమిస్తుంది. నిటారుగా ఉండడం పొందుగుల, తేరాల శైలులకు కొనసాగింపు"[100]. దీన్నిబట్టి ఆంధ్రదేశంలో శిల్పవిద్య ఎంతటి అభివృద్ధి దశలో ఉండేదో అర్థమవుతుంది. నాటి శిల్పాచార్యులకు ఈ విద్యలో ఎంతటి నైపుణ్యం, శ్రద్ధ ఉండేవో పై ఆధారాలు తెలియజేస్తున్నాయి. ఇవి నేటికి కూడా చూపరులకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. తెలుగువారి సంస్కృతిలో శిల్పకళ కూడా ప్రధానపాత్ర పోషిస్తుంది.

క్రీ.శ.9వ శతాబ్దంలో శిల్పకళ మరింత విస్తృతిని పొందింది. విజయవాడలోని జమ్మిదొడ్డిలోని గుడిలో క్రీ.శ.తొమ్మిదవ శతాబ్దానికి చెందిన శిల్పఫలకాలున్నాయి. మృదంగతాళ వాదకుల ఉత్సాహంతో కూడిన కదలికలు, నిశితమైన రేఖలు ఇక్కడ వ్యక్తమవుతున్నాయి. నర్తకులను అందమైన వంపులతో చిత్రించారు. తలలు కొంచెం పక్కకు వాలి ఉండడం, నాజూకైన శరీరాలు నర్తకుల సౌందర్యాన్ని ఇనుమడింప చేశాయి.

బిక్కవోలులోని నక్కలగుడి, కంచరగుడి కుడ్యకోష్ఠాల్లోని వీరభద్ర విగ్రహాలు క్రీ.శ.పదవ శతాబ్దానికి చెందినవి. ద్రాక్షారామం, సామర్లకోట, చేబ్రోలు, ధర్మవరం మొదలైన చోట్ల పదవ శతాబ్ది శిల్పకళ దర్శనమిస్తుంది. నాటి శిల్పుల శిల్పవిద్యా నైపుణ్యాన్ని ఇవి వ్యక్తం చేస్తాయి. ఇక్కడి గణేశ విగ్రహాలు, బిక్కవోలులోని గణేశ విగ్రహాన్ని పోలివున్నాయి. 10వ శతాబ్దం తర్వాత ఆంధ్రదేశంలో చెక్కిన నంది విగ్రహాలు భారీగానూ, అధికమైన అలంకారాలతో కనిపిస్తాయి. ఈ కాలానికి శిల్పవిద్యలో మరింత అభివృద్ధి జరిగింది అనడానికి ఇవి సాక్ష్యాలు. సామర్లకోటలోని వ్యాఖ్యాన వీణాధరుడు, దక్షిణామూర్తి, వీరభద్రుడు, చండేశ్వర, బ్రహ్మ, సూర్య, కార్తికేయ, సప్తమాతృకా విగ్రహాలు అందంగా, పుష్టిగా మలచబడ్డాయి. ఇక్కడే ఉన్న మాండవ్యనారాయణ ఆలయంలో శ్రీరామ, లక్ష్మణ, హనుమ, రావణ, లక్ష్మీనారాయణ మొదలైన శిల్పాలున్నాయి. ఈ ప్రతిమలు కొన్నింటిలో జానపదలక్షణాలు కనిపిస్తాయి.

భారతీయ శిల్పకళా చరిత్రలో కళింగ సంప్రదాయం ఒకటి. ముఖలింగ ఆలయాలు ఈ సంప్రదాయానికి మంచి ఉదాహరణలు. ఎనిమిదవ శతాబ్దం ఉత్తరార్ధానికి చెందిన మధూకేశ్వరాలయంలో సున్నితమైన శిల్పకళ కనిపిస్తుంది. ఇక్కడి శిల్పకళ వైశిష్ట్యాన్ని క్రింది మాటల్లో మనం తెలుసుకోవచ్చు. "వర్తులాకారంలో చెక్కిన విగ్రహాలు సూక్ష్మసూక్ష్మంగా చెక్కిన శిల్పవిశేషాల మధ్యమధ్య వస్తూంటాయి. శివ, అజ, ఏకపాదశివ, ఉమామహేశ్వర, నటరాజ, అంధకాసుర, కళ్యాణ సుందరమూర్తి, లకులీశ, గణేశ, కార్తికేయ, హరిహర, ---- భక్తుల మూర్తులు అద్భుతమైన హావభావాలతో విస్మయాన్ని కలిగిస్తాయి"[101]. ఇక్కడి విగ్రహాల్లో బంతికొప్పు, శిరోవస్త్రం, ముంగురులు, పూసల అలంకరణ, ముడులు వేసిన కుచ్చులు వంటి సున్నితమైన అలంకరణలన్ని కూడా ఎంతో అందంగా చెక్కడం గమనించవచ్చు. శిల్పికి తన విద్యలో ఎంతో నైపుణ్యం ఉంటేనే ఇంతటి గొప్ప కళాఖండాల్ని సృష్టించగలడు.

ఉత్తర తెలంగాణ ప్రాంతంలో ఒక కొత్త శిల్ప సంప్రదాయం కనిపిస్తుంది. ఇక్కడి వేములవాడ భీమేశ్వర ఆలయంలో అల్పోల్బణ శిల్పాలు, చెక్కడాలు ఉన్నాయి. ఇక్కడి మహిషాసురమర్దిని విగ్రహం ప్రసిద్ధమైంది. శరీరంలోని వంపు, తలవాల్పు, హస్తాలభంగిమ, కదలికల్లోని ఉత్సాహం మహిషాసురమర్దిని శిల్పంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. బొమ్మల గుట్ట మీద లభించిన తీర్థంకర శిల్పాలు, తీర్థంకర పాదముద్రలు, చక్రేశ్వరివిగ్రహం వంటివి పేర్కొనదగినవి. ఈ తీర్థంకర విగ్రహాలు కోమలమైనవి. యౌవనోత్సాహం, ప్రశాంతత ఈ శిల్పాల్లో కనిపిస్తాయి. చక్రేశ్వరి విగ్రహానికి రెండువైపులా దిగంబర జైనవిగ్రహాలు, మధ్యభాగంలో పరిచారిక విగ్రహాలు ఆకర్షణీయంగా చెక్కబడ్డాయి. సన్ననిశిల్పం, సుందరమైన అలంకరణ తెలంగాణ ప్రాంతపు ఆలయాల్లో కనిపిస్తాయి. రామప్ప, వేయిస్తంభాలగుడి మొదలైన చారిత్రక ప్రదేశాల్లో సున్నితమైన శిల్పకళ దర్శనమిస్తుంది. కాకతీయతోరణం నాటి శిల్పకళ సాధించిన అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనం.

విజయనగర రాజుల కాలంలో శిల్పకళ ఉన్నతదశను పొందింది. శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన విరూపాక్షాలయ స్తంభాలపై చాలా విస్తృతమైన ఉల్బణ శిల్పాలున్నాయి. ఆలయ ప్రదేశంలో మెట్లపై అందమైన శిల్పాలున్నాయి. ఇక్కడి మండపద్వారం సిద్ధేశ్వరాలయంలోని ద్వారం వంటిదేకాని, లోపలి శాఖలో పీఠంలో పూర్ణకుంభం ఉంది. ఇక్కడి స్తంభాల మీద వృషభాంతకమూర్తి, కంకాళమూర్తి, లింగోద్భవమూర్తి, భిక్షాటనమూర్తి, మహిషాసురమర్దిని, రామాయణమహాభారత దృశ్యాలు చెక్కబడివున్నాయి. ఇక్కడి శిల్పాలు చిన్నగా ఉండటం విశేషం.

శ్రీకాళహస్తి సమీపంలో ఉన్న తొండమనాడులో చోళుల శిల్పసంప్రదాయం కనిపిస్తుంది. ప్రథమ ఆదిత్యచోళుని దండయాత్రలో తొండమనాడు చోళుల ఆధీనంలోకి వచ్చింది. మొదటి పరాంతకుడు (క్రీ.శ.907–955) తన తండ్రి అయిన ఆదిత్యచోళుని గౌరవార్థం 'పల్లిప్పడియ' నిర్మించాడు. దక్షిణ దిశలో గణపతి, దక్షిణామూర్తి, పశ్చిమంలో విష్ణువు, ఉత్తరదిశలో దుర్గ, బ్రహ్మ, కోష్ఠ దేవతా శిల్పాలు ఉన్నాయి. గుండ్రటి ముఖాలు, పొట్టి చుబుకం, తేరిపారచూసే శూన్యనేత్రాలు వంటి లక్షణాలు ఈ శిల్పకళలో ప్రత్యేకమైనవి. అమరావతిలో బుద్ధుని జీవితగాథలను, జాతక కథలను వర్ణించే శిల్పాలు ఉన్నాయి. క్షేమేంద్రుడు రాసిన 'అవధాన కల్పలత' వంటి గ్రంథాల్లో కనిపించే కథలు కూడా ఇక్కడ శిల్పాలుగా

చెక్కబడ్డాయి. ఉదయనుడు, అజాతశత్రువు మొదలైన బుద్ధుని సమకాలికుల చరిత్రలు కూడా ఇక్కడ దర్శనమిస్తాయి.

ఈ విధంగా చారిత్రక కట్టడాల్లో భారతీయ శిల్పవిద్య ఎంతటి అభివృద్ధి సాధించిందో గుర్తించవచ్చు. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ శిల్ప సంప్రదాయంలో ఉండే విశేషం. సాధన, కఠోరమైన శ్రమ, దీక్ష నాటి శిల్పశాస్త్ర సాధకుల్లో గుర్తించదగిన విశేషాలు.

ప్రాచీన తెలుగు సాహిత్యంలో ఈ శిల్పవిద్యకు సంబంధించిన విశేషాలు చాలా కనిపిస్తున్నాయి. కావ్యారంభంలో సాధారణంగా నగర వర్ణన, ప్రాకార వర్ణన, మందిర వర్ణన, ఆలయ వర్ణనలు ఉంటాయి. వీటిల్లో కొన్ని అతిశయోక్తులతో కూడిన వర్ణనలు ఉన్నా, వాస్తవానికి దగ్గరగా ఉన్నటువంటి వర్ణనలు కూడా కనిపిస్తాయి. ఇవి మన ప్రాచీన శిల్పవిద్యకు నిదర్శనాలుగా నిలిచి ఉన్నాయి.

దేవశిల్పి అయిన విశ్వకర్మ రాసినట్టు చెప్పబడుతున్న 'అర్థవేదము' అనే గ్రంథంలో పది రకాలైన శిల్పవిద్యావిశేషాలు కనిపిస్తాయి. అవి :–

1. కృషిశాస్త్రము – వ్యవసాయానికి ఉపయోగించే నాగలి మొదలైనవాటి నిర్మాణం
2. జలశాస్త్రము – భూగర్భజల వినియోగ పద్ధతులు
3. ఖనిజశాస్త్రము – భూగర్భశాస్త్రము
4. నౌకాశాస్త్రము – నౌకానిర్మాణ పద్ధతులు
5. రథశాస్త్రము – రథాల నిర్మాణానికి సంబంధించిన పద్ధతులు
6. విమానశాస్త్రము – అంతరిక్షయాన నిర్మాణపద్ధతులు
7. వాస్తుశాస్త్రము – గృహ–భవన నిర్మాణ పద్ధతులు, ప్రాసాదాలు–తటాకాల నిర్మాణం
8. ప్రాకారశాస్త్రము – నగర రక్షణ కోసం చేసిన కోట ప్రాకార నిర్మాణరీతులు
9. నగర రచనాశాస్త్రము – నగరంలోని నివాసప్రదేశాల నిర్మాణం, వీథులు, అంగళ్లు, మొదలైన నగర రచనా ప్రణాళిక
10. యంత్రశాస్త్రము – వివిధ యంత్రాల నిర్మాణ పద్ధతులు

పైన చెప్పిన అంశాలకు సంబంధించిన విశేషాలు తెలుగు సాహిత్యంలో ఎలా ప్రతిఫలించాయో ఇక్కడ వివరించడం జరుగుతున్నది. మట్టితో, కలపతో, శిలలతో తయారుచేసిన విగ్రహాలు, ఆలయాలు, కోట ప్రాకారాలు మొదలైన వాటిని ఇక్కడ అనుశీలించడం జరుగుతున్నది.

నగర నిర్మాణశిల్పం:–

నగరానికి రక్షణ పఠిష్టంగా ఉండాలంటే, దేశంలో శాంతిభద్రతలు ఉండాలంటే దానికి తగిన నిర్మాణపద్ధతుల్ని అనుసరించాల్సి ఉంటుంది. వీధుల నిర్మాణం, కోట నిర్మాణం, ప్రాకారాల నిర్మాణాల్లో చూపే నైపుణ్యం ఆయా నగరాలకు మంచి భద్రతను కల్పిస్తుంది.

మహాభారతంలో 'గిరివ్రజం' అన నగర నిర్మాణం గురించి వర్ణించబడింది. గిరివ్రజం అనేది మగధదేశ రాజధాని. దీన్ని జరాసంధుడు పరిపాలిస్తున్నాడు. గోరథం, ఋషభం, వైహారం, ఋషిగిరి, చైత్యకం అనే అయిదు గిరులకు (పర్వతాలకు) మధ్యభాగంలో నిర్మించబడి ఉండటం వల్ల ఈ నగరానికి గిరివ్రజం అనే పేరు వచ్చింది. జరాసంధుడిని వధించడానికి వెళ్ళిన శ్రీకృష్ణభీమార్జునులకు ఆ నగరం క్రింది విధంగా కనిపించింది.

"ఉరుతర హర్మ్యమాలికల నొప్పు గిరివ్రజమన్ పురంబుఁగాం
చిరి నవ సౌరభప్రసవ చిత్ర వనావళి గల్గుదాని నె
వ్వరికి దురాసదంబులగు వజ్రమయోన్నత వప్రచారుగో
పురములదాని నయ్యలకఁ బోలెడుదాని మహార్థ సంపదన్"[102]

గిరివ్రజం అనే నగరంలో చిత్రవిచిత్రాలైన ఉద్యానవనాలు ఉన్నాయి. అవి కొత్తకొత్త సువాసనలు వెదజల్లుతున్నాయి. ఆ నగరంలోని ఎంతటి బలవంతుడైనా సరే పరాయివాడైతే లోపలికి ప్రవేశించలేడు. కారణాలు ఏమిటంటే ఎత్తైన ప్రాకారాలు ఉండటం, వాటి మీద చుట్టూ గోపురాలు నిర్మించడం. ఆ గోపురాల్లో సైనికులు నిరంతరం కాపలా కాస్తుంటారు. అందువల్ల వారు దూరం నుంచే శత్రువుల్ని పసికట్టేవారు. ఈ విధమైన నగర రచనాశిల్పం వల్ల ఆ నగరం శత్రుదుర్భేద్యంగా ఉంది.

రాజధాని నిర్మాణం ఎలా ఉండాలో చెప్పమని ధర్మరాజు భీష్ముడిని అడుగుతాడు. ఆ సందర్భంలో భీష్ముడు ఇలా తెలియజేస్తాడు.

"పరపు లోఁతును గల పరిఖతోఁబొడువును ఘనమును నగు కోటగలిగి తగిన
వాకిళ్లు బలుపుఁ గావలి నొప్ప రమ్యగృహవ్రాతములు గొమరారు వీథు
లందంబులగు మేటి యంగళ్ల నెల్ల వస్తువులును శోభిల్ల సుజన బహుళ
మై ధాన్యములును ఘృతాది రసద్రవ్యములును నానా యంత్రములును బహు వి
ధాయుధములు బిరుదులగు యోధులును బండితులు విలాసినులును దూతముఖ్య
పరిజనములు నెఱయఁబరమోత్సవంబులు మెఱయఁబురము చెలువు మిగుల వలయు"[103]

రాజుగారి కోట నగరంలోని భవనాలన్నింటి కంటే ఎత్తుగా, పెద్దదిగా ఉండాలి. దాని చుట్టూ లోతైన, వెడల్పు కలిగిన అగడ్త ఉండాలి. దాని నిండా నీళ్ళు నింపి మొసళ్ళు, పాములు పెంచాలి. దీనివల్ల శత్రువులు కోటలోకి ప్రవేశించడం వీలుకాదు. కోటకి తగిన ద్వారాలు ఉండాలి. అవి పరిష్టంగా ఉండాలి.

రాజధాని నగరంలోని వీథులు ఒక క్రమంలో అమరి ఉండాలి. అడ్డదిడ్డంగా కట్టకుండా సూత్రపట్టినట్టుగా ఒక వరసలో భవనాలను నిర్మించాలి. ఆ వీథుల్లో పౌరుల అవసరాలకు కావలసిన అంగళ్లు ఒకే చోట ఉండాలి. వీటినే విపణివీథులు అంటారు. రాజధానిలో దొరకని వస్తువంటూ ఉండకూడదు.

రాజధానిలో సజ్జనులకు మాత్రమే నివాసయోగ్యత కల్పించాలి. దుష్టులు ఎక్కువైతే ప్రమాదమని భీష్ముని హెచ్చరిక. రాజధానిలో అన్నిరకాల యంత్రాలు అందుబాటులో ఉండాలి. రాజధానిలో అన్ని వృత్తుల వారు ఉండాలి. వారికి ప్రత్యేకమైన నివాస ప్రదేశాలు ఉండాలి. ఈ విధంగా నిర్మించడం వల్ల రాజధానికి భద్రత ఏర్పడుతుంది. అన్నిరంగాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని భీష్ముడు చెప్పాడు.

భీష్ముడు ఎంతటి రాజనీతి కలవాడో పై వర్ణనవల్ల తెలుస్తుంది. విశ్వకర్మ చెప్పిన శిల్పవిద్యల్లో నగరరచనా నిర్మాణం ప్రధానమైంది. నగర రచనా నిర్మాణం సమగ్రంగా ఉన్నప్పుడే మిగిలిన అన్ని రంగాలు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. అందువల్లనే ప్రాచీన కావ్యాల్లో పురవర్ణన (నగర) ఎక్కువగా కనిపిస్తుంది.

మయబ్రహ్మ అపూర్వశిల్పిగా పురాణప్రసిద్ధుడు. మహాభారతంలోని సభాపర్వంలో మయసభాభవనం, ద్యూతక్రీడ, పాండవుల ఓటమి మొదలైన అంశాలు ఉన్నాయి. ఇక్కడ చెప్పిన మయసభను నిర్మించింది దేవశిల్పి అయిన మయబ్రహ్మ. ఇతడు శ్రీకృష్ణుడికి కూడా ఒక నగరాన్ని

నిర్మించియిచ్చాడు. అది సముద్రగర్భంలో నిర్మించబడిన ద్వారకానగరం. మయుడు ఈ నగరాన్ని ఎంత గొప్పగా నిర్మించాడో క్రింది వర్ణనలో చెప్పబడింది.

"కనకంపుఁ బెనుఁగోట వినువీథి గడవంగ మణిగోపురములు సమగ్రముగ
బంధుర ప్రాసాద పంక్తులు నుత్తుంగ హర్మ్యరేఖలు మనోహరత నలర
రాజమార్గం బభిరామంబుగాఁ బణ్యపదము లుజ్జ్వల శిల్పభంగి నమర
నమర సద్మములుఁ జైత్యంబులు సభలునుఁ బ్రపలు నపూర్వంపు రచన మెఱయఁ

దోరణాట్టాలకంబులు దోరములుగఁ గూపదీర్ఘికా సరసులు గొమరు మిగులఁ
గృతక పర్వతోద్యానంబు లతులములుగఁ బరగు పురము నిర్మించె నచ్చెరువు గాఁగ"[104]

మయుడు బంగారంతో పెద్ద కోటను సముద్రం మధ్యలో నిర్మించాడు. ఆ కోటమీద మణులు పొదిగిన శిఖరాలు బాగా కొనదేలి ఉన్నాయి. కోట లోపలి భవనాలు వరుసలు దీరి కట్టుదిట్టంగా ఉన్నాయి. అక్కడ ఎత్తైన భవనశ్రేణులు ఉన్నాయి. ద్వారకలోని రాజమార్గం విశాలంగా, సుందరంగా నిర్మించబడింది. వీథుల్లో అంగళ్లు ఒక గొప్ప శిల్పపద్ధతిలో అమరి ఉన్నాయి. గొప్ప శిల్పాలతో చెక్కబడిన భవనాలు, అంగళ్లు అక్కడ ఉన్నాయి.

దేవలయాలు, చైత్యాలు, సభామండపాలు, చలివేంద్రాలు గొప్ప నిర్మాణశిల్పంతో మెరిసిపోతున్నాయి. ఆ కోటలో నూతులు, దిగుడుబావులు, సరస్సులు, కృత్రిమంగా తయారుచేసిన పర్వతాలు, ఉద్యానవనాలు గొప్పపద్ధతిలో అమరి ఉన్నాయి. ఈ విధంగా మయబ్రహ్మ అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించే విధంగా ద్వారకానగరాన్ని నిర్మించాడు. కోట నిర్మాణం ఎలా ఉండాలో, లోపల ఎటువంటి సౌకర్యాలు ఉండాలో పై వర్ణన వల్ల తెలుస్తుంది. ప్రాచీన కాలంలో కోటలను మట్టితో, రాతితో, కలపతో నిర్మించేవారు. యుద్ధకాలంలో ప్రజలకు కోటలో రక్షణ కల్పించేవారు. అందువల్లనే కోట నిర్మాణంలో మన పూర్వీకులు ఇంతటి నిర్మాణశిల్పాన్ని పాటించవలసి వచ్చింది.

ప్రాకార నిర్మాణ శిల్పం:–

ప్రాచీనకాలపు నగర వీథులు, ప్రాకారాలకు చెక్కిన వివిధ రకాల శిల్పాలు ఎంత రమణీయంగా ఉండేవో శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్తమాల్యద'లో క్రింది విధంగా వర్ణించాడు.

"పాథోధి జలయుక్తిఁ బ్రాచి పట్టిన దిశాకరులు నాఁదగు మరకతపు గరులు
కరుల తొండము సిక్క గబళించి మ్రింగిన, హరులునాఁ దొండమొప్పగుఁ దదశ్మ
హరులు దాపిన తాపలమర నేనుఁగు దోయి, నీరార్చు నపరంజి నీటిప్రాఁత
శ్రీలు తత్పార్శ్వ చిత్రిత శంఖచక్రముల్ రతనంపుఁదిన్నెలఁ బ్రతిఫలింపఁ

బెఱ పురాళి గృహశ్రీలఁ బెండ్లి యాడ భవన రాజులు గట్టిన బాసికమనఁ
దనరు మణితోరణములతో ద్వార వితతి పరగు వీథులు పురిసూత్ర పట్టినట్లు"[105]

మధురానగరంలోని వీథుల్లో మరకతమణులతో చేసిన ఏనుగులు చెక్కబడి ఉన్నాయి. ఇవి బాగా నాని పాచిపట్టిన దిగ్గజాలా అన్నట్లు ఉన్నాయి. ఆ వీథి ప్రాకారాలకి పచ్చఱాతి సింహాలు చెక్కబడ్డాయి. సింహాల నోళ్ళ నుంచి ఏనుగు తొండం మాత్రమే బయటకి కనబడేలా ఆ శిల్పాలు చెక్కబడ్డాయి. అవి చూడటానికి ఎలా ఉన్నాయంటే? సింహాలు, ఏనుగుల శరీరం మొత్తాన్ని వెనుక నుంచి మ్రింగి తొండాలను మాత్రమే మిగిల్చినట్లు ఉన్నాయి. ఆ సింహాలకు పైన, లక్ష్మీదేవికి అభిషేకం చేస్తున్నట్లు అపరంజి నీటితో చిత్రించిన లక్ష్మీదేవి విగ్రహం, ఏనుగుల విగ్రహాలు ఉన్నాయి. ఈ ప్రతిమలకు రెండువైపులా శంఖచక్రాలు ఉన్నాయి. ఈ విధంగా అందమైన శిల్పాలతో, విశాలమైన వీథులతో సూత్రపట్టినట్టు మధురానగరం నిర్మించబడింది. హంపి, విజయనగరం వంటి నగరాల్లో పైన చెప్పిన నిర్మాణరీతుల్ని మనం గమనించవచ్చు.

సాధారణంగా కోట చుట్టూ ప్రాకారాలు ఉంటాయి. ఈ ప్రాకారాల మీద గోపురాలు, వాటి మీద రకరకాల శిల్పాలు చెక్కబడి ఉంటాయి. ఇవి నాటి ప్రజలకు శిల్పకళ పట్ల ఉండే అభిమానాన్ని, సౌందర్యదృష్టిని వ్యక్తం చేస్తున్నాయి. రామరాజభూషణుడు రాసిన 'వసుచరిత్రము'లో అధిష్ఠానపురంలోని కోట, గోపురాల వర్ణన క్రింది విధంగా ఉంది.

"ఒనరుఁ బురాధి రాజమున నుజ్జ్వల వజ్రకలాప గోపురా
గ్రనిహిత హేమ కుంభములు గాంగ హిరణ్మయ కంజమంజిమం
దనరఁగ నిక్కి దిక్కరుల తండము తుండము సాఁచునంచు నుం
చిన వెఱబొమ్మలో యనఁగ జిత్రిత సాంద్ర మృగేంద్ర రూపముల్"[106]

కోట బురుజులపై ప్రకాశించే వజ్రసమూహాలతో చేసిన బంగారు కలశాలు ఉన్నాయి. అవి ఆకాశ గంగలో ఉండే పద్మాల్లాగా అందంగా ఒప్పుతున్నాయి. వీటిని చూసి అష్టదిగ్గజాల సమూహం ముందరి కాళ్ళు ఎత్తి లేచి – తొండం చాచి అందుకుని వాటిని పాడుచేస్తున్నట్లుగా శిల్పాలు ఉన్నాయి. దీన్ని నివారించటానికి అన్నట్లుగా ఆ ఏనుగుల్ని భయపెట్టే సింహాల బొమ్మలు ఆ కోటలోని గోపురాల మీద మలచబడి ఉన్నాయి. రాయల కాలంనాటి కోట నిర్మాణం, ప్రాకారాల అలంకరణ ఎంతటి కళామయాలో పై వర్ణనల వల్ల తెలుస్తున్నది.

శేషము వేంకటపతి రాసిన 'తారాశశాంక విజయము'లో కోట, ప్రాకార నిర్మాణశిల్పాలు చక్కగా వర్ణించబడ్డాయి. కోట నిర్మాణంలోని నాలుగు రకాల నిర్మాణవిశేషాలను నాలుగు ఉపమానాలతో కవి ఇలా వర్ణించాడు.

"వసుమతీ వలయాధిపత్య రాజద్రాజ పరితో విజృంభిత పరిధి యనఁగ
విక్రమత్రయ భృశోపక్ర మాధోక్షజ చరణ విస్రస్త హంసకమనంగ
నఖిల భూభరణ సమగ్ర యాచ్ఞాయాత మండలీకృత మహాకుండలియన
భువనత్రయాద్భుత పురరమాకటిలగ్న ధగధగన్మణికాంచిదామ మనఁగ

నెసఁగు బహు జీవన ప్రదాతృత్వ విష్ణుపద సమాశ్రయతాభోగ భాసురత్వ
పురుష రత్నాభిరామత్వ పూర్ణమహిమ, విమల హేమకవాట మవ్వీటికోట"[107]

కోట ప్రాకారం చాలా విశాలంగా ఉంది. పూర్ణమహిమతో అలరారుతోంది. అంటే అధికంగా ప్రజలకు జీవనభృతి అందించే శక్తి ఆ రాజుకీ, ఈ కోటకి ఉందని అర్థం. ఈ కోటలో అన్ని రకాల ఓషధులు అందుబాటులో ఉన్నాయి. వామనావతారం ఎత్తినప్పుడు శ్రీమహావిష్ణువు ఒక పాదాన్ని ఆకాశంపై ఉంచాడు. అలా ఉంచినప్పుడు అతని పాదం నుండి జారిపడిన అందెలా ఉందట కోట. అంటే ఆకాశం అంత ఎత్తులో నిర్మించబడిందని అర్థం.

సమస్త భూభారాన్ని భరించాలనే కోరిక ఆదిశేషుడికి ఉంది. ఆ వరాన్ని స్వయంగా యాచించి పొందడానికి వచ్చి గుండ్రంగా చుట్టుకొన్న ఆదిశేషుడిలాగా ఉందట కోట చుట్టూ ఉన్న ప్రాకారం. సకల భోగాలతో ప్రకాశిస్తోందని అంతరార్థం. ఇటువంటి పురలక్ష్మి, రాజు అనే విష్ణుమూర్తి మనస్సును హరిస్తోందట. గతంలో కోట నిర్మాణం, ప్రాకారనిర్మాణం ఎంతో అందంగా, సకల సదుపాయాలతో నిర్మించబడేవని పై వర్ణన వల్ల తెలుస్తున్నది.

గృహనిర్మాణశిల్పం :-

ప్రాచీన తెలుగు కావ్యాల్లో కనిపించే అష్టాదశవర్ణనల్లో గృహవర్ణన కూడా ఉంటుంది. ఆనాడు భవనాల నిర్మాణం ఎలా జరిగిందో? అందులోని మెళకువలు ఏమిటో? ఈ వర్ణనల వల్ల మనం కొంత గుర్తించకోవచ్చు. ప్రాచీన భవననిర్మాణాలు రక్షణతోపాటు, మానసికమైన ఆనందాన్ని కూడా కలిగించేవి. కారణం అవి క్రింది విధంగా కళామయంగా నిర్మించబడటమే.

"శశికాంత మణిగణ స్థగిత భూములతోడ నీలపు ఱాల తిన్నియలతోడ
నిలువుటద్దములు పన్నిన కుడ్యములతోడఁ బటికపు గుండ్రకంబములతోడ

వన్నెలీనెడు జాళువా దూలములతోడఁ గల ధౌతమయ విటంకములతోడఁ
దీరైన కెంపుల చూరు మొగ్గలతోడ మరకతంబుల గుజ్జు పఱుపుతోడఁ

దగడు మెఱుఁగుల ద్వారబంధములతోడఁ బచ్చి పగడపుదలుపుల బారుతోడఁ
గళలలరు వ్రాఁతపనుల మేల్కట్లతోడఁ జూడఁదగు నంతరంబుల మేడలోన"[108]

పాటలీపుత్రంలోని వత్సరాజు నివాసభవనాన్ని వక్కలంక వీరభద్రకవి పై విధంగా వర్ణించాడు. ఆ మేడలో చాలా అంతస్తులు ఉన్నాయి. ఆ భవనపుశిఖరాలు, ప్రాంగణంలోని అరుగులు ఇంద్రనీల మణులతో చేసినవి.

భవనంలోని గోడలకు నిలువుటద్దాలు అమర్చారు. మధ్యలో ఉండే స్తంభాలు నాలుగు పలకలు కలవి, గుండ్రంగా చెక్కబడినవి. వీటికి స్ఫటిక శిలాఫలకాలు పొదిగారు. ఆ స్తంభాల మీద వేసిన దూలాలు బంగారంతో చేసినవి.

గోడలకు కిటికీలు ఏర్పాటుచేశారు. గోడలకు లోపలగానీ, బయటగానీ ఏర్పాటుచేసే గూడుల్ని 'విటంకాలు' అంటారు. బయటవి పెంపుడు పిట్టలకు, లోపలవి ప్రమిద దీపాలకు ఉద్దేశించి ఏర్పాటు చేస్తారు. ఇక్కడ వర్ణించిన గూడులు అన్నీ వెండితో చూసినవి. ఇవి ఎంతో అందంగా అమరి ఉన్నాయి.

ఈ భవనంలోని చూరులకి మేలుజాతి పద్మరాగాలు పొదిగిన మొగ్గలు చెక్కి ఉన్నాయట. నిలువుదూలము, అడ్డదూలము కలిసినచోట లోపలగాని, బయటగాని ఒక కలశంలాగానో, శంఖం లాగానో, తామరమొగ్గలాగానో ఏదో ఒక శిల్పం చెక్కేవారు. ఇటువంటి చూరు మొగ్గల శిల్పాలు ఈ భవనంలో ఉన్నాయి. ఈ విధంగా ఎంతో మనోహరంగా, హృదయానికి ఆనందాన్ని కలిగించే విధంగా ఆ సౌధ నిర్మాణం ఉందని కవి వర్ణన. మణులను తాపడం చెయ్యటం; బంగారు రేకుల్ని ద్వారబంధాలకు ఏర్పాటుచేయటం ప్రాచీనుల శిల్పనైపుణ్యాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

భవనాల పై భాగంలో సహజమైన శైలిలో చెక్కిన పావురాల శిల్పాలను 'రసికజనమనోరంజనము'లో ఇలా వర్ణించటం జరిగింది.

"చొక్కపుఁబైడి మేడలను సొంపగు పచ్చల చూరుపట్టెలన్
జెక్కిన కప్పుఱాల పని చిత్తరు వ్రాఁతల పారువంబులన్"[109]

ఆ మేడలు, ప్రాకారాలు బంగారంతో తాపడం చేశారు. ప్రాకారాలకి చూరుగుళ్ళు ఉన్నాయి. అవి గరుడపచ్చల రాళ్ళు పొదిగినవి. వాటిలో పావురాల బొమ్మలు చెక్కారు. నీలమణులతో వాటికి తాపడం

చేశారు. ముక్కు-మెడ-బోర-గోళ్ళు ఇలా పావురాలకు సహజసిద్ధమైన రీతిలో నగిషీలు దిద్దారు. ఇవి నిజంగా పావురాలే అనుకొని వాటిని తినటానికి డేగలు వచ్చాయట. కానీ అవి ఎత్తులో ఉండటం వల్ల డేగలు తిరిగిపోయాయట. ఇలాగ ఆ మేడలు ఎంతో ఆకర్షణీయమైన నిర్మాణం కలిగి చూసేవారికి మానసిక ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి.

దేవాలయ నిర్మాణశిల్పం:-

ప్రాచీన భారతీయ శిల్పకళకు నిలయాలు దేవాలయాలు. ఈ ఆలయాల్లో ప్రతి అణువూ శిల్పాలతోనో, చిత్రాలతోనో అలంకరించేవారు. గ్రామాల్లోని దేవాలయాలు విద్యాపీఠాలుగా, సభాస్థలాలుగా, నాట్యసంగీత కళలకు నిలయాలుగా ఉండేవి. అందువల్ల వీటిని కళామయంగా నిర్మించేవారు. జక్కన 'అమరశిల్పి'గా పేరుగాంచాడు. చెన్నకేశవస్వామి శిల్పాలను జక్కన మలచిన తీరు అత్యంత రమణీయం. 'హంసవింశతి' కథాకావ్యంలో, బ్రాహ్మణ వటువు తల్లిదండ్రులు కట్టించిన దేవాలయ నిర్మాణకౌశలాన్ని కవి ఇలా వర్ణించాడు.

"డంబైన గర్భగృహం బంతరాళికంబును ముఖమంటపంబునుఁజెలంగ
గాలి మంటపము ప్రాకారంబు లోవలు బోదెలు చుట్టలు పొందుపడఁగఁ
గప్పట చట్టముల్ఘన గోపురమ్ములు జగతియుఁ జప్పర ల్సాగసు గులుక
గచ్చుగోడలు ఱాతి కంబముల్పాల సున్నము సువర్ణము ద్వారసమితి వెలయ
దృష్టి పాత్రపు బొమ్మలు తేజరిల్ల
నుఱుకు సింగంబు లఱగూళ్లు మెఱుఁగుఁదోర
ణములు చిత్తర్వు క్రొంబనుల్ రమణకెక్క
దేవళము మించె నత్యంతదివ్య మగుచు"[110]

దేవాలయ గర్భగృహం ఎంతో గొప్పగా నిర్మించబడింది. దీనికి ముందు భాగంలో అంతరాళం ఉంది. ఇందులోకి అర్చకులకు, ప్రముఖులకు ప్రవేశం ఉంటుంది. దీనికి ఆనుకుని ముఖమంటపం ఉంది. దాన్ని దాటి ముందుకు వస్తే గాలిమంటపం కనిపిస్తుంది. దీనిలోకి నాలుగు వైపుల నుండి రాకపోకలు జరపవచ్చు. దీన్నే నటమండపం, గోష్ఠీమండపం అంటారు. దీని తర్వాత గుడిచుట్టూ ఒక ప్రాకారం, దాని చుట్టూ మహాప్రాకారం ఉన్నాయి. ఈ ప్రాకారాలు రక్షణ వలయాలుగా మలచబడి ఉన్నాయి.

ఈ ప్రాకారానికి రాతిటోపీల బోదెలు చెక్కి ఉన్నారు. వాననీరు గోడలోకి దిగగుండా, గోడమీదుగా క్రిందికి కారకుండా రాతిని టోపీలాగా తొలచి, అంచులు పైకి మడిచి గోడ అంతటా కప్పుతారు. ఇది గోడకి రక్షణనిస్తుంది. ప్రాకారానికి నాలుగు వైపుల ద్వారాలు ఉంటాయి. వీటిలో "సాధారణంగా తూర్పుదిక్కులో సింహద్వారం ఉంటుంది. దీనిపైన నలుచదరంగా ఉండే రాతిదూలాలు వేసి, వాటి మీద రాతిపలకలు పరుస్తారు. వీటినే 'కప్పటచట్టములు' అంటారు. ఈ చట్టాల మీద గొప్ప గోపురాలు నిర్మిస్తారట"[111]. ఇలా ఎంతో నైపుణ్యంతో ఆ దేవాలయం నిర్మించబడింది.

గుడి లోపల గచ్చుగోడలు, రాతిస్తంభాలు, వాటికి వేసిన తెల్లటి పాలసున్నం, బంగారు వాకిళ్ళు, దిష్టిబొమ్మ, ముందరికాళ్ళు ఎత్తి లంఘిస్తున్నట్లు చెక్కిన సింహం విగ్రహాలు, ప్రమిద దీపాల కోసం అమర్చిన అరగూళ్లు, రాతితోరణాలు, చిత్రలేఖనపనితనాలు మొదలైనవన్నీ అమరి ఉన్నాయి. ఇవి చూపరుల మనస్సుకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. అపూర్వమైన కళాఖండాలు ప్రాచీన దేవాలయ నిర్మాణాల్లో పైవిధంగా ప్రతిఫలిస్తున్నాయి. దేవాలయ శిల్పనిర్మాణంలో సహజత్వం కనిపిస్తుంది. 'ఒడయనంబివిలాసము'లోని క్రింది వర్ణన అందుకు నిదర్శనం.

"తప్తకాంచన నిర్మిత స్ఫుటాంచితరత్న దీపితోన్నత భవ్యగోపురములు
శాతకుంభస్తంభ సకల భేద వినోద మణిచిత్ర పుత్రికా మంటపములు"[112]

ఇక్కడ ఉన్న 'సకల' అనే పదానికి ధ్వని లేక స్వరం అనే అర్థం ఉందని తెలుస్తున్నది[113]. మండపంలోని స్తంభాలపై చెక్కిన స్త్రీమూర్తులు ఒక్కొక్కటి ఒక్కొక్క మధురమైన స్వరాన్ని వినిపిస్తున్నాయట. హంపీలోని వేయిస్తంభాల గుడిలో కూడా ఇటువంటి విశేషాలన్నీ నేటికీ మనం చూడవచ్చు.

రథనిర్మాణ శిల్పం:-

రథాలను సాధారణంగా కలపతో (దారువు) నిర్మిస్తారు. సూర్యరాయాంధ్ర నిఘంటువులో, 'మృద్దారు శిలలతో చేసిన మూర్తిమందిరాకము శిల్పం'[114] అని చెప్పబడింది. ముందు పుటల్లో దీన్ని వివరించడం జరిగింది. దారువుతో చేసిన నిర్మాణాలు కూడా శిల్పవిద్యలో భాగం కాబట్టి, ప్రాచీనకాలపు రథాల నిర్మాణంలో శిల్పులు చూపిన ప్రతిభాపాటవాలను ఇక్కడ వివరించడం జరుగుతున్నది. విశ్వకర్మ

చెప్పిన పదిరకాలైన శిల్పవిద్యల్లో రథశాస్త్రము కూడా ఒకటి. దీని విశేషాలు ప్రాచీన తెలుగు కావ్యాల్లో ఎలా ప్రతిఫలించాయో ఇక్కడ అనుశీలన చేయడం జరుగుతున్నది.

విశ్వకర్మ దేవశిల్పి. దేవతలకు కావలసిన నగరాలు, రథాలు, హర్మ్యాలు, ఆయుధాలు ఇతడు తయారుచేస్తాడు. విశ్వకర్మ చేసిన సూర్యునిరథం, కుబేరుడి పుష్పకవిమానం లోక ప్రసిద్ధాలు. 'హరిశ్చంద్రోపాఖ్యానము'లోని క్రింది వర్ణన విశ్వకర్మ నిర్మాణనైపుణ్యాన్ని సూచిస్తుంది.

"తత్పుర స్యందనముల యందములు హృదయ
వీథి నిడుకొని మఱి సుమీ విశ్వకర్మ
కమల వన బాంధవుని శతాంగము గుబేరు
పుష్పకంబును సృజియించె బొలుపుదొలక"[115]

"విశ్వకర్మ సూర్యుడి రథాన్ని, పుష్పకవిమానాన్ని తయారు చేయాలనుకొన్నాడు. ముందుగా అయోధ్యానగరంలోని రథాల అందాలను హృదయంలో నిలుపుకున్నాడు. వాటిని నమూనాగా తీసుకుని పని మొదలుపెట్టాడు. అందువల్లనే అయోధ్యలోని రథాల అందం అచ్చం అలాగే ప్రతిఫలించేలాగ దేవశిల్పి రథాన్ని, విమానాన్ని నిర్మించాడు. 'శతాంగం' అంటే అవయవాలు కలది – రథం అని అర్థం"[116].

రథానికి శతాంగం, విమానం, స్యందనం అనే మూడు పేర్లు వ్యవహారంలో ఉన్నట్లు 'వర్ణనరత్నాకరము–పాఠకమిత్రవ్యాఖ్య'[117] వల్ల తెలుస్తున్నది. ఈ మూడు పేర్లు రథాల విషయంలో ఎలా సార్థకం అవుతాయో కాణాదం పెద్దన సోమయాజి 'ముకుందవిలాసము'లో క్రిందివిధంగా వర్ణించాడు.

"దారున రత్న కుట్టిమ శతంబులఁదోప శతాంగరీతులన్
హారి మణీ శిరోగృహము లందు ఫలింప విమాన లీలలన్
హీర పురాల జాఱి చన నిచ్చఁ దనంతట స్యందన స్థితిన్
దీరులు మీఱ నూరఁదగు తేరులు పేరులు సార్థకంబుగన్"[118]

శతాంగం అంటే నూరు అవయవాలు కలది. మధురానగరంలో రత్నాలు పరిచి తాపడం చేసిన వీథులు అసంఖ్యాకంగా ఉన్నాయి. ఈ వీథుల్లో రథం శీఘ్రంగా నడుస్తోంది. అప్పుడు ఆ రత్నాల కుట్టిమాల్లో శతరూపాలతో కనిపిస్తూ ప్రకాశిస్తోంది. అందువల్ల రథానికి శతాంగం అనే పేరు సార్థకమయింది.

ఇంటి పై భాగంలో మణులతో చేసిన రథాల విగ్రహాలు ఉన్నాయి. ఇవి చూడటానికి విమానాల్లా ఉన్నాయి. గమనంలో పక్షితో సాదృశ్యం కలది విమానం. అందువల్ల వేగంగా తిరిగే రథాలకు 'విమానం' అనే పేరు సార్థకం.

మధురానగరంలోని రథాలు రత్నాలతో పొదిగిన భవనాల మధ్య వెళుతున్నాయి. నున్నటి రహదారులపై తమకు తామే వెళ్ళాలనే కోరికతో వెళుతున్నట్లుగా వేగంగా పోతున్నాయి. ఇలా వేగంగా పరిగెడుతూ 'స్యందన'మనే పేరును రథాలు సార్థకం చేసుకొంటున్నాయి. పై మూడు లక్షణాలు రథాలనిర్మాణంలో గుర్తించదగినవి.

'కవిచకోర చంద్రోదయము'లో, భూమి మీద తిరుగాడే రథాలు మేరుపర్వతాన్ని చూసి నవ్వినట్లు కవి వర్ణన. దానికి కారణాలను కవి క్రింది విధంగా తెలియజేశాడు.

"శివధర్మోన్నతి మించి భూరి రుచులం జెల్వొంది భూభృత్కులా
ధివర స్తుత్యతఁ గాంచి సద్గతి మహా తేజంబు దీపించినన్
భువిలో దమ్ము బహూలజ్జ్వలత్పుర హరుల్–పూనంగ దివ్యోద్ధతిన్
వివరం బేర్పడ నవ్వు మేరుగిరి నవ్వీటన్ రథవ్రాతముల్"[119]

శివుడు త్రిపురాసురసంహారం చేసే సమయంలో మేరు పర్వతం ఆయనకు ధనువు అయింది. అది ఆ పర్వతానికి ఉన్న శివధర్మోన్నతి. అలాగే భూమి మీద ఉన్న రథాలకు శుభంకరమైన ధర్మమనే ఉన్నతి ఉందట. మేరువుకు బంగారు కాంతులు ఉన్నాయి. రథాలకూ గొప్ప కాంతులున్నాయి. చెలువొందడం రెండింటికీ సమానం.

పర్వతసమూహానికి మేరువు నాయకుడిగా పురాణప్రసిద్ధం. రథాలు కూడా రాజవంశాల్లోని రథికుల చేత స్తుతిని పొందాయి. మేరువు చుట్టూ నక్షతవీథి ఉంటుంది. 'సత్' అంటే 'నక్షత్రం' అనే అర్థం ఉందని 'వర్ణనరత్నాకరము–పాఠకమిత్రవ్యాఖ్య'[120] వల్ల తెలుస్తున్నది. సద్గతి అంటే – నక్షత్రవీథి. రథాలవి గొప్పవైన నడకలు. గొప్ప తేజస్సు, ప్రతాపం, కీర్తితో నగరంలోని రథాలు మేరువుతో సమానతను పొందుతున్నాయి. అయితే రథాలకు మరొక సుగుణం ఉందట. సింధు, యవన దేశాల మేరువు కంటే తామే అధికమని రథాలు

నవ్వుతున్నాయని కవి వర్ణన. త్రిపురాసుర సంహారంలో భూమి రథంగా మారింది. అంటే శివుడు మట్టిరథాన్ని అధిరోహించాడు. వేదాలు రథాశ్వాలు అయ్యాయి.

ఈ విధంగా ప్రాచీన తెలుగు కావ్యాల్లో శిల్పకళకు సంబంధించిన విశేషాలు కనిపిస్తున్నాయి. ప్రాకారాలు, కోటగోడలు, భవనాలు, దేవాలయాలు, గృహాలయాలు మొదలైనవి అప్పటి శిల్పకళకు నిలయంగా కనిపిస్తున్నాయి. అలాగే కాకతీయ, విజయనగర రాజుల కాలంలో వెలువడిన సాహిత్యం వల్ల ఈ శిల్పవిద్యకు సంబంధించిన విశేషాలు మనకు తెలుస్తున్నాయి.

3.6.2.5. చిత్రలేఖన విద్య:–

ప్రాచీనకాలపు విద్యార్థులు నేర్చుకున్న అరవైనాలుగు కళల్లో చిత్రలేఖనం కూడా ఒకటి. దీన్నే చిత్రకళ అని కూడా వ్యవహరిస్తారు. నేర్చుకునేటప్పుడు ఇది విద్య అవుతుంది. చిత్రకారుడు తన సాధన ద్వారా విశేష ప్రయోగాలు చేసి, అద్భుతమైన చిత్రాలను గీసినప్పుడు కళాకారుడు అవుతున్నాడు. అతను నేర్చుకున్నది చిత్రకళ అవుతుంది. అందువల్ల చిత్రలేఖనాన్ని ప్రయోగాత్మక మానసికవిద్య అనడం జరిగింది. ఈ చిత్రలేఖన విద్య యొక్క ప్రధానప్రయోజనం చూపరులకు మానసిక ఆనందాన్ని కలిగించడం. వారికి ఉల్లాసంతో పాటు ఉపదేశం కూడా ఈ కళ వల్ల అందుతుంది. ప్రాచీన కాలంలో రాజుల బిడ్డలు ఈ విద్యను తప్పనిసరిగా నేర్చుకునేవారు. ప్రతి రాజుగారి ఆస్థానంలో ఒక చిత్రకారుడు ఖచ్చితంగా ఉండేవాడు. రాకుమార్తెలు అతని వద్ద చిత్రలేఖనాన్ని అభ్యసించేవారు. దమయంతి, ఉష, పార్వతి వంటి స్త్రీలు చిత్రలేఖనవిద్యలో మంచి నైపుణ్యాన్ని సంపాదించినట్లు ప్రాచీన తెలుగు కావ్యాల వల్ల తెలుస్తున్నది.

వేదయుగంలోనే చిత్రలేఖనవిద్య ప్రాచుర్యంతో ఉన్నట్లు ఋగ్వేదంలోని క్రింది ఋక్కు తెలియజేస్తుంది.

"ఇయం యానీ చ్యర్కణీ రూపా రోహిణ్యకృతా
చిత్రైవ ప్రత్యదర్శ్యాయు త్యన్తరశాను బహుష"[121]

ఎరుపు రంగులోని కాంతికిరణాలను వెదజల్లుతూ తలను వంచుకుని దశ బాహువులతో ఒక చిత్రం లాగా ఉషస్సు ఎట్టయెదుట కనిపిస్తున్నది అని అర్థం. ఇక్కడ ఉషస్సుని ఒక చిత్రంతో పోల్చటం జరిగింది. ఉషస్సును చూసి చిత్రం రచిస్తాడు చిత్రకారుడు. అటువంటి చిత్రంతో ఉషస్సును పోల్చారంటే అప్పటి

చిత్రకారులెంతటి ప్రతిభావంతులో మనకు అర్థమవుతుంది. చిత్రలేఖన విద్య యొక్క ప్రాచీనతకు ఇది గొప్ప సాక్ష్యం.

వాత్సాయన కామసూత్రాలకు యశోధరుడు 'జయమంగళ' అనే పేరుతో వ్యాఖ్యను రాసాడు. ఇందులో చిత్రలేఖన విద్య గురించి, ఆ విద్య యొక్క షడంగాల గురించి వివరించాడు.

"రూప భేదాః ప్రమాణాని భావలావణ్య యోజనే
సాదృశ్యం వర్ణికాభంగం ఇతిచిత్రం షడంగకమ్"[122]

రూపభేదం, ప్రమాణం, భావం, లావణ్యయోజనం, సాదృశ్యం, వర్ణికాభంగం మొదలైన ఆరింటిని చిత్రలేఖనవిద్యకు సంబంధించిన షడంగాలుగా, పైన చెప్పడం జరిగింది. వీటి గురించి కాశీభట్లవిశ్వనాథం గారు 'చిత్రకళ' అనే గ్రంథంలో క్రింది విధంగా వివరించారు.

1.**రూపభేదం**:– మనుషులు, జంతువులు, పక్షులు వంటివే కాకుండా అచేతనాలైన కొండలూకోనలూ, మబ్బులు, వృక్షాలు మొదలైన వాటిని కూడా కనువిందైన రూపాల్లో చిత్రించడం. సంకీర్ణ రూపాలైన నరసింహ, గజకేసరి, మృగకిన్నెర వంటి రూపాలు స్పష్టంగా కనిపించేలా చిత్రించే నైపుణ్యం కలిగివుండటం.

2. **ప్రమాణం**:– ఒక రూపంలోని వివిధ భాగాలకి, వాటి పరిమాణానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని కలిగివుండటమే ప్రమాణం. ప్రాచీన శిల్పశాస్త్రంలో ఈ ప్రమాణాలను 'తాలమానం' అన్నారు. తాలము అంటే ఒక యూనిట్ అని అర్థం. తెరచిన అరచేతిలోని చిటికెన వ్రేలు చివరి కొన నుండి నడిమివ్రేలు చివర వరకు గల దూరాన్ని ఒక తాలము అంటారు. "వివిధ మూర్తులకు అష్టతాలమని, నవతాలమనీ, దశతాలమనీ ప్రమాణాలు చెప్పారు. దేవతామూర్తులకు దశతాలము, సామాన్య పురుషులకు నవతాలము, స్త్రీ మూర్తులకు అష్టతాలమనీ వివరించారు"[123]. పైవిధంగా ప్రమాణాల్ని పాటించడం వల్ల చిత్రాలు సజీవత్వాన్ని పొందడానికి అవకాశం ఉంటుంది.

3. **భావం**:– చిత్రకారుడు చిత్రించిన ఏ చిత్రమైన భావస్ఫోరకంగా ఉండాలి. కళారూపం అందించే ఆనందానుభూతి అందులో నిక్షిప్తమైన భావ ఔన్నత్యం మీద కొంత ఆధారపడి ఉంటుంది. అందువల్ల చిత్రకారుడు భావవ్యక్తీకరణ మీద దృష్టి పెట్టి చిత్రాలను గీయవలసి ఉంటుంది.

4. **లావణ్యయోజనం**:– సౌందర్యాంశ, రేఖాగతి, వర్ణవైచిత్రి, రూపసంపద మొదలైనవాటివల్ల చిత్రానికి లావణ్యం సమకూరుతుంది. పై అంశాల సమరసత వల్ల చిత్రానికి అందం పెరుగుతుంది. ఆ సమరసత లోపించినప్పుడు అది ఆకర్షణీయతను కోల్పోతుంది.

5. **సాదృశ్యం**:– ఊహాజనితమైన రూపానికి చిత్రించబడ్డ రూపం ప్రతిబింబం కావాలి. చిత్రించిన రూపం వాస్తవ రూపానికి సరిపోవాలి. దీన్నే సాదృశ్యం అంటారు. దీనిపైనే చిత్రకారుడి నైపుణ్యం ఆధారపడి ఉంటుంది. వాస్తవానికి దూరంగా, అసహజంగా ఉన్న రూపాలు చూపరుల అభిమానాన్ని పొందలేకపోవచ్చు. అందువల్ల చిత్రకారుడు సాదృశ్యంపై శ్రద్ధ పెట్టాలి.

6. **వర్ణికాభంగం**:– చిత్రలేఖన ప్రక్రియలో ప్రధానమైనది వర్ణలేపనం. ఏయే రూపాలకు ఎటువంటి రంగుల్ని వాడాలి అన్న జ్ఞానం చిత్రకారుడు కలిగివుండాలి. పూర్వం దీపపు మసిని అన్నంలో కలిపి నూరి బలపాల లాగ చేసి, ఎండిన తర్వాత కోసతీర్చి చెక్క ఫలకాలపై రేఖలను గీసేవారు. అవసరమనుకున్న రేఖలను గాని, తప్పుగా వచ్చిన రేఖలను గాని సన్నని కత్తిమొనతో తడిచివేయడం జరిగేది. రేఖల స్పష్టత కోసం రంగుతో వాటిని సరిదిద్దటాన్ని 'ద్వికకర్మ' అంటారు రంగులను కలపటాన్ని కర్షకర్మ అంటారు. ఈవిధంగా వివిధ రకాలుగా చిత్రాలను తీర్చిదిద్దటం జరిగేది. ఈ షడంగాలను చిత్రకారుడు ప్రారంభదశలో గురువుల వద్ద నేర్చుకునేవాడు. స్వశక్తితో సాధన చేసి, విభిన్నమైన ప్రయోగాల ద్వారా అద్భుతమైన చిత్రరచనలు చేసేవాడు.

ఆంధ్రదేశంలోను దాదాపు పైన వివరించిన లక్షణాలే చిత్రరచనలో కనిపిస్తాయి. ఈ చిత్రలేఖనకళ గురించి భోజుడు క్రింది విధంగా తెలియజేశాడు.

"న వేత్తి శాస్త్ర విత్కర్మ
న శాస్త్ర మపి కర్మవిత్
యో వేత్తి ద్వయ మప్యేతత్
సహిచిత్ర కరో వరః"[124]

శాస్త్రం తెలిసినవాడికి కర్మజ్ఞానం అరుదు. కర్మజ్ఞానం గలవాడికి శాస్త్రజ్ఞానం అరుదు. కర్మశాస్త్రాలు రెండింటిలోనూ సమాన ప్రజ్ఞ గలవాడే ఉత్తమ చిత్రకారుడు అవుతాడని భోజుని అభిప్రాయం. 'ప్రాచీన సాహిత్యంలో చిత్రకళా ప్రస్తావన' అనే వ్యాసంలో దేవులపల్లి ప్రభాకరరావు గారు ఆనాటి

చిత్రకళావిశేషాలను చాలా వివరంగా తెలియజేశారు[125]. ఆ వ్యాసంలోని కొన్ని విశేషాలను క్రింద వివరించడం జరిగింది. ఈ వ్యాసంతో దేవులపల్లి వారి పరిశోధన కృషి ఎంత విలువైందో మనకు తెలుస్తుంది.

సంస్కృత సాహిత్యంలోని అభిలషితార్థ చింతామణి, విష్ణుధర్మోత్తరపురాణం వంటి గ్రంథాల్లో చిత్రలేఖన ప్రస్తావన ఉంది. స్టెల్లాక్రామరిష్ అనే రష్యన్ మహిళ విష్ణుధర్మోత్తరపురాణాన్ని ఆంగ్లభాష లోకి అనువదించింది. అభిలషితార్థ చింతామణిని భూలోకమల్ల సోమేశ్వరుడు రచించాడు. ఇతడు కళ్యాణి చాళుక్య వంశీయుడు. అభిలషితార్థ చింతామణిలోని 'ఆలేఖ్యకర్మ' అనే అధ్యాయంలో ఈ చిత్రకళను గురించి వివరించడం జరిగింది. వర్తికను (తూలిక, కుంచె) ఏ విధంగా సిద్ధం చేసుకోవాలి, వర్ణాలను ఎలా సిద్ధం చేసుకోవాలి. దేవతలు, మానవులు, జంతువులు మొదలైన రూపాలు ఏయే ప్రమాణాల్లో ఉండాలి? అనే విషయాలను సోమేశ్వరుడు ఈ గ్రంథంలో చాలా శాస్త్రీయంగా వివరించాడు.

ప్రాచీన తెలుగు సాహిత్యంలో చిత్రలేఖనకళ గురించి సమగ్రంగా వర్ణించకపోయినా, అక్కడక్కడా దీని ప్రస్తావన కనిపిస్తుంది. ప్రణయఘట్టాల్లో, స్వయంవర నిర్ణయ సందర్భాల్లో, కావ్య నాయికానాయకుల విరహఘట్టాల్లో, స్వప్న సన్నివేశాల్లో, వారకాంతల నివాసగదుల వర్ణనల్లో చిత్రలేఖనకళ గురించి వర్ణించడం జరిగింది.

నన్నెచోడుడు రాసిన 'కుమారసంభవము'లో పార్వతీదేవి విరహావస్థను వర్ణించే సందర్భంలో చిత్రలేఖన శాస్త్ర విషయాలు చాలా చెప్పబడ్డాయి[126]. పార్వతీదేవి తన శరీర తాపాన్ని పోగొట్టుకోలేక ఈశ్వరుడి రూపాన్ని చిత్రించి చూసుకోవటానికి, చిత్రరచనకు ఉపకరణాలను క్రింది విధంగా సిద్ధం చేసుకున్నది. చిత్రఫలకాన్ని స్థిరంగా ఉండేటట్లు చేసింది. దానికి మెఱుగుపెట్టి, మూడు సమభాగాలుగా చేసింది. స్థూలాకారం వ్రాసి, ఋజ్వాగతమనే రేఖామార్గన రేఖను సరిచేసింది. పత్రకము, బిందుకము, నిమ్నోన్నతము, అపాంగము, మానము, ఉన్మానము అనే లేఖన మార్గాలను సరిచేసి, లక్షణానికి సరిపోయే విధంగా లిఖించి, వర్ణాలు వేసింది.

పైన చెప్పిన 'ఋజ్వాగతము' అనే పదం చిత్రలేఖన శాస్త్రంలో రేఖలు వ్రాసే పంచమార్గాల్లో ఒకటి. మిగిలినవి:–అర్ధఋజువు, సాచి, ద్వ్యర్థాక్షి, పార్శ్వాగతము. చిత్రపట రూపాలను మనం చూసే దృష్టి భేదం

వల్లనే పై అయిదు ఏర్పడ్డాయి. "పత్రక, బిందుక, నిమ్నోన్నత, మాన, నీలక, ధూమ్రావర్తక, ఉద్వర్తన, చిత్రప్రవర్తన అనే ఎనిమిదింటిని, క్రమంగా సకల, స్వస్తిక, సర్వతోభద్ర, కళిక, కంటక, త్రిభంగ, శిశునిరీక్షణ, వర్ధమానం అనే ఎనిమిది విధాలైన చిత్రరూపాలకు లేఖన మార్గాలుగా చెప్పవచ్చు".

పార్వతీదేవి చిత్రించిన శివుని చిత్రం గొప్పదనాన్ని నన్నెచోడుడు క్రిందివిధంగా వర్ణించాడు.

"కలకల నవ్వునట్లు, తమకంబునఁగన్గవ విచ్చి భ్రూలతల్
వొలయఁగఁజూచునట్లు, తనివోవఁగఁదెల్చియుఁ గౌఁగిలింపఁజే
తులు పచరించున, ట్లదటుతో రతికేళికి నప్పళించున
ట్లెలమి నటించుచుండె సతి కీశ్వరురూ పెదురం బ్రసన్నమై"[128]

ఈశ్వరుని రూపం పార్వతీదేవి ఎదుట ప్రసన్నమైనట్లు ఉందట ఆ చిత్రం. కలకల నవ్వుతున్నట్లు, తహతహతో కన్నులు రెండు విప్పి తీగలవంటి కనుబొమలు పొసగేవిధంగా, తృప్తితీరు విధంగా కౌగిలించుకొనుటకు చేతులు చాచినట్లు, ఉద్రేకంతో రతిక్రీడకు ఉత్సాహపడుతున్నట్లు ఎంతో సహజంగా ఉందట పార్వతి చిత్రించిన పరమేశ్వరుని చిత్రం. ఈ వర్ణన వల్ల క్రీ.శ.12వ శతాబ్దం నాటికి ఆంధ్రదేశంలో చిత్రలేఖనవిద్య బాగా వ్యాప్తిలో ఉన్నట్లు, ఆ విద్య శాస్త్రనిర్మాణాన్ని పొందినట్లు తెలుస్తున్నది.

కాకతీయుల కాలంలో చిత్రకళ ప్రజాబాహుళ్యంలోకి వ్యాపించింది. చెంబుల మీద, పాత్రలమీద, గోడలమీద చిత్రాలను వేయించటం ఆనాడు సర్వసాధారణ విషయం. బట్టలమీద కూడా అద్దకపు బొమ్మలను చిత్రించేవారు. ఇండ్ల ముంగిళ్ళలో ముగ్గుల రూపంలో ఎన్నో చిత్రాలను గీసేవారు. ప్రతాపరుద్రుని ఉంపుడుగత్తె మాచల్దేవి తన ఇంటిని ఏవిధంగా అలంకరించిందో శ్రీనాథుడు 'క్రీడాభిరామం'లో క్రిందివిధంగా వర్ణించాడు.

"చందనంబునఁ గలయంపి చల్లినారు
మ్రుగ్గులిడినారు కాశ్మీరమున ముదమున
వ్రాసినారిందు రజమున రంగవల్లి
కంజములఁ దోరణంబులు గట్టినారు"[129]

మాచల్దేవికి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మందిరంలో ఎన్నో చిత్రాలు అమర్చబడి ఉండేవట. అందువల్లనే శ్రీనాథుడు 'చిత్రశాలా ప్రవేశంబు చేయుచున్న యది' అని మాచల్దేవిని వర్ణించాడు.

'క్రీడాభిరామం'లో మాచల్దేవి చిత్రశాల వైభవం క్రింది విధంగా వర్ణించబడింది.

"అదె దారు వనభూమి! యసమనేత్రుఁడు వాఁడె!
సంయమీంద్రుల పుణ్య సతులు వారె!
యదె కన్యకా రత్న! మబ్జాసనుఁడు వాఁడె!
యదె రతిక్రీడా విహార శయ్య!
వాఁడె వైకుంఠుండు! వారె గోపస్త్రీలు!
యమునా నదీ సైకతాంత మదియె!
యదె యహల్యాదేవి! యమరాధిపుఁడు వాఁడె!
యదె పర్ణశాలి కాభ్యంతరంబు!
చందురుఁడు వాఁడె! యదె బృహస్పతి పురంధ్రి!
జాలరిది యదె! శ్రీపరాశరుఁడు వాడె!
కుశికజుఁడు వాఁడె! యదె యింద్రు కొలువు లేమ!
చిత్తజుని శౌర్య మెఱిఁగించెఁ జిత్రశాల"[130]

మాచల్దేవి ఇంటిలో దారుకావనపు శివుడు, గోపికాకృష్ణులు, అహల్యాసంక్రందనులు, తారాచంద్రులు, మేనకావిశ్వామిత్రులు మొదలైనవారి చిత్రాలు ఉన్నాయని పై పద్యంలో వర్ణించబడింది. ఆ చిత్రాలను రాసిన చిత్రాకారుడి పనితనాన్ని మంచన క్రిందివిధంగా మెచ్చినాడు.

"తియ్యనివింటి జోదు, రతి దేవి చనుంగవ నొత్తిగిల్లి, యొ
య్యొయ్యన వంక చక్కఁబడ నొత్తెడుఁజూచితె పుష్పబాణముల్?
మయ్యెర వ్రాసెఁ జిత్తరుపు మాఁగిలి మాఁగిలి చిత్రకారుఁడా!
దయ్యము గాక! యీవి పస దానము టిట్టిభ! వీని కీఁదగున్"[131]

మాచల్దేవి చిత్రశాలలోని చిత్రాలను గీసిన వాడి పనితనం మంచనకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. అతనిలో మన్మథభావాలు కలిగిస్తున్నట్లు, పుష్పబాణాలు అతని హృదయంలో నాటుతున్నట్లు ఉన్నాయట చిత్రాలు. ఆ చిత్రాలను గీసిన వాడు చిత్రకారుడా? లేక దయ్యమా? అని ఆశ్చర్యపోయాడు మంచన.

క్రీడాభిరామంలోనే, పల్నాటి వీరుల చరిత్రను వర్ణించే సందర్భంలో చిత్రలేఖనకళ గురించి ప్రస్తావన ఉన్నది.

"కోల దాపునఁ ద్రిక్కటిఁ గూడియున్న,
గచ్చు చేసిన చిత్రంపు గద్దె పలక
వ్రాసినా రదె చూడరా వైశ్యరాజ!
శీల బ్రహ్మాది వీర నాసీర చరిత"[132]

కాకతీయుల కాలంలో చిత్రాలను 'మయ్యెర'తో వ్రాసేవారు. మయ్యెర గురించి సురవరం ప్రతాపరెడ్డిగారు క్రింది వివరణ ఇచ్చారు. "మయ్యెర అనగా వెంట్రుకలతో చేసిన బ్రష్షు అయియుండును.– మైర్ అన అరవములో వెంట్రుక అని యర్థము"[133]. దీన్నిబట్టి క్రీ.శ.13వ శతాబ్దానికి ముందే చిత్రలేఖనవిద్యలో బాగా పరిశ్రమ జరిగిందని, ఈ కళకు శాస్త్రీయపద్ధతి ఏర్పాటు చేయబడిందని తెలుస్తున్నది. ఓరుగల్లులో 'చిత్తరువులు వ్రాసే యిండ్లు 1500' ఉండేవని ఏకామ్రనాథుడు తన 'ప్రతాపచరిత్ర'లో తెలియజేశాడు. కర్ణమద్రవము, మషీరసము, హరిదళము, ధాతురాగము మొదలైన వర్ణాలతో ఆనాడు చిత్రాలను వ్రాయడం జరిగింది. శ్రీనాథుడు 'కాశీఖండం'లో వర్ణించిన క్రిందిపద్యం ఇందుకు మంచి ఉదాహరణ.

"తరిపి వెన్నెలలోని ధావళ్యమొక కొంత
నవసుధా కర్దమద్రవముగాగ
చిన్నారి పొన్నారి చిఱుత చీకటి ఛాయ
మసలు కొల్పిన మషీరసముగాగ
నిద్రమేల్కాంచిన నెత్తమ్మి వెలుగడల
పరువంపు బుప్పొళ్ళు హరిదళముగాగ
దొగరు వన్నియ లేత తొలి సంజకెంజాయ
కమనీయ ధాతు రాగంబు గాగ
వర్ణములుగూడి యామినీ వ్యపగమమున
జగము చిత్రింప దూలిక చందమైన
కులుకు బ్రాయంపు నూనూగు గొదమ యెండ
ప్రాచి కభినవ మాణిక్య పదకమయ్యె"[134]

పై పద్యంలో చిత్రాలను వ్రాయటానికి ఉపయోగించే వర్ణద్రవ్యాలు, వాటి గొప్పదనం వర్ణించబడ్డాయి. ఆయా వర్ణద్రవ్యాలయొక్క రంగులను కవి ఇందులో ఉపమానాల ద్వారా వ్యక్తపరిచాడు.

ధవళరంగులోని కర్దమద్రవము, నల్లనిరంగు కలిగిన మషీరసము, నీలిరంగు గల హరిదళము, లేత ఎరుపు రంగు కలిగిన ధాతురాగము మొదలైన వర్ణద్రవ్యాలు ఇక్కడ వర్ణించబడ్డాయి. తూలికలతో ఎంతో అందంగా చిత్రాలను గీసేవారు.

శ్రీనాథుడి 'పల్నాటివీరచరిత్ర'లో, ఒక కొలువు ఏ విధంగా అలంకరించబడిందో వర్ణించబడింది. ఇందులో చిత్రకళకు సంబంధించిన విశేషాలను శ్రీనాథుడు ఇలా వర్ణించాడు.

"వినయమ్ము తోడుత వేవేగ వెడలి
ప్రత్యేకముగ తీర్చి రాజవీథులను
మొత్తమ్ముగా నట మొగసాల నెల్ల
చిత్తరువులు వ్రాసి చెలువంబు మిగుల"[135]

నలగాముడు కొలువుకూటంలో జరిగే నాట్యప్రదర్శన చూసి ఆనందించే సందర్భంలో చిత్రలేఖనకళకు సంబంధించిన విశేషాలు వర్ణించబడ్డాయి.

"గురుజాల కేతెంచి కువలయేశ్వరుని
తావుకు ముందర తగ చెప్పి పంపె
విని కామభూపతి విభవంబుమెరయ
కొలువు శృంగారింప కూర్చినవారి
పంపించ వారలు పరిచారకులను
రప్పించి తీర్చిరి రమణీయముగను;
కస్తూరి చేతను కలయంగ నలికి
ముత్యాలతోడత ముగ్గులుబెట్టి
కప్పురముదకమ్ము కలపియంతటను
జల్లిరి కలయంపి సత్వరమ్ముగను
శ్రీరామకథలును శ్రీకృష్ణకథలు
పన్నుగా వ్రాసిన పటములు తెచ్చి
కట్టిరి గోడలు కనుపడకుండ
మౌక్తిక మంజరీ మంజుపుంజంబు
వ్రేలాడు చుండెడి వివిధ వర్ణముల

ఘనవితానంబులు కట్టిరిమీద
నిలువుటద్దమ్ములు నిలిపిరి దిశల
తంతుపటంబులు తగ క్రిందపరచి
వన్నెల పటములు వరుసతో మీద ------[136]

ముత్యాలతో ముంగిళ్ళలో ముగ్గులు పెట్టడం ఇక్కడ వర్ణించబడింది. శ్రీరామ, శ్రీకృష్ణ కథలను చిత్రాలుగా వ్రాసి గోడలు కట్టారట. ఆ చిత్రపటాల వల్ల గోడలు కూడా కనిపించకుండా పోయాయట. ఈ వర్ణన వల్ల అప్పటి ప్రజలకు చిత్రలేఖనం పట్ల ఉన్న అభిమానం వ్యక్తమవుతున్నది.

నూతన వధూవరులైన నలదమయంతుల కేళీవిలాసాల కోసం ఒక విహారసౌధం నిర్మించబడింది. శిల్పులు దాన్ని ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ఆ భవనం లోపలి గోడల మీద చిత్రించిన చిత్రాలు ఎంత శృంగారభరితంగా ఉన్నాయో శ్రీనాథుడి వర్ణనవల్ల తెలుస్తున్నది.

"కోరగించిన కడకంటి కొలికిఁ జూచి
వాఁడి వాలిక పూఁదూపు వంకదీర్చు
చొరగి రతిదేవిపాలిండ్ల నొత్తగిలిన
యించువిలుకాని వ్రాసినారిడుపునందు"[137]

ముకుళింపబడిన కడకంటి కోణంతో పుష్పబాణాన్ని సరిచేస్తూ, చెఱుకును విల్లుగా కలిగినటువంటి, రతీదేవి సౌందర్యాన్ని చూసి పరవశుడు అవుతున్న మన్మథుడి చిత్రాన్ని ఆ భవనంలోని గోడమీద చిత్రించి ఉన్నారట. అగ్నికి ఆజ్యంపోసినట్లు నలదమంయతుల ప్రణయతాపాన్ని ఈ శృంగారచిత్రాలు మరింత ఎక్కువ చేస్తున్నాయట. ఆ చిత్రాలు నలదమయంతులను ఏవిధంగా కవ్వించాయో క్రింది వర్ణనలో శ్రీనాథుడు తెలియజేశాడు.

"అమరవల్లభుఁడు గౌతము కూర్మి యిల్లాలిఁ
జీఁకటి తప్పు సేసిన విధంబు,
సితభానుఁడాచార్యు చిగురాకుఁబోఁడిపైఁ
గన్ను వైచిన కన్నె కలుపు మరులు,
నట్టేట దాశ కన్యకకు నువ్విళులూరి
జాలిఁ పొందిన పరాశరు విరాళి,
గారాపుఁ గూఁతుపైఁ గాఁగాని పనిఁబూను

వనజసంభవుని నెమ్మనము వెలితి,
దారువన వీథి శీతాంశుధరుని రంతు,
శౌరి గోపాల కామినీ చౌర్యకేళి,
కామ రస భావములు మించి కానఁబడఁగ,
దీర్చి యిడుపులయందుఁ చిత్రించినారు"[138]

అహల్యను ఇంద్రుడు కూడిన చిత్రాలు, సూర్యుడు కుంతీదేవిని చేపట్టిన చిత్రాలు, దాశకన్యకు పుత్రుడిని ప్రసాదించిన పరాశరుని శృంగార చిత్రాలు, భారతీదేవిని మోహించిన బ్రహ్మ చిత్రాలు, పార్వతీపరమేశ్వరుల చిత్రాలు, గోపకాంతలతో కూడి ఉన్న శ్రీకృష్ణుని లీలావినోద చిత్రాలు ఆ భవనంలోని గోడల మీద అందంగా చిత్రించబడి ఉన్నాయట.

మునుల తపస్సును భగ్నం చేయటానికి అప్సరసలను పంపించడం ఇంద్రుడికి ఆనవాయితి. సంసార సాగరాన్ని తరింటడానికి మునులు తపస్సు అనే ఓడలలో ప్రయాణిస్తుండగా, అప్సరసల స్తనద్వయాలనే కొండలు తగలడం వల్ల ఆ ఓడ (తపస్సు) పగిలిపోయిందట. ఆ సమయంలో వికలమైన మనస్సును కలిగివున్నటువంటి మునుల చిత్రాలను ఎంతో సహజంగా చిత్రించి ఆ భవనంలోని గోడలకు అమర్చారు అని శ్రీనాథుడు వర్ణించాడు.

"భవ జలరాశి దాఁటునెడ, భావజ వాయువు వీచినం, దపః
ప్రవహణముల్ సమున్నత సుపర్వ వధూ కుచ పర్వతాహతిం
బవిలిన దీనతా వికలభావము నొందిన మౌని నావిక
ప్రవరుల భావ చిత్రములు వ్రాసినవారు కపోతపాలికన్"[139]

పై పద్యాలను పరిశీలిస్తే క్రీ.శ.15వ శతాబ్దం నాటికి ఆంధ్రదేశంలో చిత్రలేఖనకళ ఉన్నతస్థితిలో ఉందని తెలుస్తున్నది. పోతన భాగవతములోని 'ఉషాపరిణయఘట్టం'లో కూడా చిత్రలేఖనవిద్య ప్రస్తావన ఉన్నది. బాణాసురుడి కుమార్తె ఉష. ఒకరోజు రాత్రి ఆమెకు కలలో శ్రీకృష్ణుడి మనుమడు, ప్రద్యుమ్నుడి కుమారుడు అయిన అనిరుద్ధుడు కనిపించాడు. ఆమెను ఆలింగనం చేసుకున్నాడు. ఆమెతో మృదువుగా సంభాషించి అంతలోనే మాయమయ్యాడు. దీనితో ఉషాదేవి విరహావస్థలో పడింది. చిత్రరేఖ అనే చెలికత్తె ఉషను ఊరడిస్తూ ఇలా అంటుంది.

"సరసిజనేత్ర! యేటికి విచారము? నా కుశలత్వమేర్పడన్
నర సుర యక్షకింపురుష నాగ నభశ్చర సిద్ధ సాధ్య కి
న్నర వర ముఖ్యులం బటమునన్ లిఖియించినఁ జూచి నీ మనో
హరుఁగని 'వీడె పొ'మ్మనిన నప్పుడె వానిని నీకుఁ దెచ్చెదన్"[140]

ఓ పద్మాక్షీ! ఎందుకు నువ్వు బాధపడుతున్నావు. నా నేర్పరితనంతో దేవమానవాది పురుషుల చిత్రపటాలను వ్రాసి నీకు చూపిస్తాను. అందులో నీకు నచ్చినవాడు ఎవరో గుర్తించు అంటుంది. తర్వాత చిత్రరేఖ తెల్లగా, మంచులాగా ఉన్నటువంటి ఒక పటాన్ని తెచ్చింది. అయిదు రంగులను బంగారు, వెండి పాత్రల్లో నింపుకున్నది. కుంచెను చేతిలో పట్టుకొని ఏకాంత ప్రదేశానికి వెళ్ళి ముల్లోకాల్లో ప్రసిద్ధిగాంచిన సౌందర్యవంతుల చిత్రాలను వారివారి గోత్ర నామాలతోపాటు సిద్ధం చేసింది. ఆ పటాల్ని ఉషాదేవికి చూపిస్తూ, ఈ చిత్రపటాల్లో లేనివాడు ఈ లోకంలోనే లేడు అంటుంది. దీన్నిబట్టి పోతన కాలానికి చిత్రలేఖన విద్య లోకప్రసిద్ధమైనట్లు తెలుస్తున్నది. చిత్రరచనకు ఏకాగ్రత, ఏకాంతస్థలం అవసరం అని పై వర్ణన వల్ల తెలుస్తున్నది.

విజయనగర రాజుల కాలంలో కూడా చిత్రలేఖనకళ మంచి ఆదరణను పొందింది. ఆనాటి అంతఃపుర స్త్రీలు చిత్రకళను తప్పనిసరిగా నేర్చుకునేవారు. శ్రీకృష్ణదేవరాయల కుమార్తె అయిన మోహనాంగి సంగీతసాహిత్యాలతో పాటు చిత్రలేఖనంలో కూడా మంచి ప్రావీణ్యం సంపాదించింది. తండ్రి అయిన రాయలు, తన సంగీతాన్ని వింటాడని, కవిత్వాన్ని విని ఆస్వాదిస్తాడని, తాను రచించిన చిత్తరువులను మెచ్చుకుంటాడని మోహనాంగి 'మారీచీపరిణయం'లో క్రింది విధంగా తెలియజేసింది.

"చతురంగ బలయుత సైన్యముల్ నడిపెడు
నతడు నాతో జతురంగమాడు,
గంగార్భటిని నాశుకవిత చెప్పునతండు
నా సమస్యా పూర్తి కాసజెందు
దిక్కుడ్యములను సత్కీర్తి జిత్రించు నా
తండు నావ్రాయు చిత్రములు మెచ్చు
రాగ సంభరితాంతరంగుడౌ నతడు నే
రాగమాలాపింప రక్తిగాంచు ------"[141]

శ్రీకృష్ణదేవరాయలు కళాప్రియుడు. తాను స్వయంగా కవి అయినా కూడా తన కూతురు కవితకు మురిసిపోయాడు, ఆమె వ్రాసిన చిత్రాలను మెచ్చుకున్నాడు. ఇది రాయల సహృదయతను వ్యక్తం చేస్తున్న వర్ణన.

శ్రీకృష్ణదేవరాయలు రాసిన 'ఆముక్తమాల్యద' ప్రబంధంలో గోదాదేవి నాయిక. శ్రీహరి పట్ల గోదాదేవి పడుతున్న విరహవేదనను వర్ణించే సందర్భంలో చిత్రలేఖనవిద్య ప్రస్తావన ఉన్నది.

"పూజాదంభమున న్బరాకుమెయి ము న్నూఁబోఁడి నేర్పూఁది చే
తోజాతానల మార్ప శాస్త్రసరణిన్ దూలి న్హరి న్వ్రాసిల
జ్జాజాడ్యాకుల దృష్టిఁ బ్రత్యవయవేక్షం జేయుచోవెండి వ
క్షోజాగ్రద్రమఁ గాంచి తల్లడిలు నీసు న్దాపమున్ మీఱఁగన్"[142]

గోదాదేవి విరహవేదనను భరించలేక శ్రీహరి చిత్రపటాన్ని పూజ నెపంతో వ్రాసుకున్నది. లేకపోతే చెలికత్తెలు ఆమె విరహాన్ని చూసి ఆటపట్టిస్తారు. ఆమె శాస్త్రపద్ధతిలో తూలికతో శ్రీహరి చిత్రాన్ని వ్రాసింది. ఆ చిత్రంలోని ప్రతి అంగాన్ని చూస్తూంటే విరహవేదన ఆమెను మరింత బాధించసాగిందని కవి వర్ణించాడు. ఇక్కడ రాయల కాలంలో చిత్రకళ పొందిన ఉన్నతస్థితిని మనం గమనించవచ్చు.

రాయల కాలంలో ధనికులు చక్కని చిత్రాలు, శిల్పాలు ఉన్న ఉయ్యెల మంచాలను వాడేవారని పింగళి సూరన రచించిన 'కళాపూర్ణోదయం'లోని క్రింది పద్యం వల్ల తెలుస్తున్నది. నారదుడు సంగీతవిద్యను నేర్చుకోవటానికి ద్వారకకు వచ్చినప్పుడు, శ్రీకృష్ణుడు ఆయనకు చేసే ఉపచారాలను వర్ణిస్తూ పింగళిసూరన క్రింది వర్ణన చేశాడు.

"బంగారు గొలుసులుఁ, బవడంపుఁదఱిమెన
కోళ్ళును, వింత బాగుల బొగడలు,
రత్నంపుఁ జిలుకలు, రాయంచ ప్రతిమలుఁ
బసిఁడి పువ్వుల వ్రాఁతపనుల సొబగు,
వివిధంబులగు చిత్ర విరచనలును, దసి
లీ నూలిపట్టె యల్లిక బెడంగుఁ,
బలు దెఱంగుల పట్టు తలగడ బిళ్లలు,
మన్వంపుఁ గుంకుమపువ్వు పఱపుఁ,

గలిగి మఱుఁగులు దిక్కులఁ గడలుకొనఁగ,
మించు దంతపుటుయ్యెల మంచమునను
బొలుపుమీఱుచుఁ, దన యంతిపురము సతుల
యూడిగంబులు గైకొంచు నున్న శౌరి"[143]

పై పద్యంలో 'పసిఁడి పువ్వుల సొబగు' అని వర్ణించబడింది. దీన్నిబట్టి రాయల కాలానికి చిత్రలేఖనం గొప్ప ఆదరణ పొందిందని చెప్పవచ్చు. బంగారు పువ్వులను మరిపించే వ్రాతపనులు ఇక్కడి విశేషం. చాలా రకాలైన చిత్రరచనలు ఆ భవనంలో ఉన్నాయట. మంచాలకు కూడా చిత్రాలను గీయించడం, వాటిని బంగారంతో అలంకరించడం రాయల కాలంలోని గొప్పదనం. ఇది నాటి ధనికుల ఇండ్లలోని వస్తు సముదాయానికి చెందిన వర్ణన. అందువల్లనే బంగారుపూలతో చిత్రాల్ని చిత్రించడం జరిగింది.

చింతలపూడి ఎల్లనార్యుడి 'రాధామాధవం'లో ఆనాటి ప్రజల జీవన సరళి, వారి చిత్రలేఖనకళాభిలాష స్పష్టమవుతున్నాయి. 'గోమతీనగరపు' భవనాలు ఏవిధంగా మనోహరమైన చిత్రాలతో అలంకరింపబడి ఉన్నాయో కవి క్రిందిపద్యంలో వర్ణించాడు.

"ఆదినారాయణుఁ డమృతాబ్ధి మథియించి
యబ్జవాసినిఁబెండ్లియైన కథలు
చంద్రశేఖరుఁడు పుష్పశరాసుగెల్చి హి
మా చలతనయఁ బెండ్లైన కథలు
శ్రీరామ చంద్రుడు శివధనుర్భంజన
మడరించి సీతఁబెండ్లైన కథలు
నలచక్రవర్తి వేల్పులు సిగ్గువడఁగ భీ
మాధీశకన్యఁ బెండ్లైన కథలు
చిత్తభవకేళిబంధ విచిత్ర గతులు
హంసకలరవకీర రథాంగ గతులు
వ్రాసి రలవడఁ దత్స్వయంవర మహీస్థ
లాంతిక స్వర్ణసౌధకుడ్యములనెల్ల"[144]

లక్ష్మీనారాయణుల పెండ్లి కథలు, పార్వతీపరమేశ్వరుల పెండ్లికథలు, సీతారాముల పెండ్లి కథలు, నలదమయంతుల స్వయంవర వివాహ కథలు మొదలైనవి చిత్రాలుగా గీయబడి స్వయంవర మండపం లోని

గోడలకి అమర్చబడి ఉన్నాయి. ఈ వర్ణన చూస్తే తెలుగువారికి చిత్రలేఖన కళపై ఎంతటి అభిరుచి ఉందో అర్థమవుతున్నది. శిల్పచిత్రలేఖనాలు జంటకళలు. రాజుల భవనాలు ఈ శిల్పచిత్రకళలకు నిలయాలు.

ధూర్జటి రాసిన 'శ్రీకాళహస్తి మాహాత్మ్యము'లో నాల్గవ ఆశ్వాసంలో, మాణిక్యవల్లి అనే వారవనిత శివభక్తిపారవశ్యులైన ఇద్దరు కుమార్తెలకు జన్మిచ్చింది. వారికి అన్ని విద్యల్ని నేర్పించింది. ఈ సందర్భంలోనే చిత్రలేఖనవిద్య ప్రస్తావన ఉంది. భవనంలోని గోడల మీద చిత్తరువుల్ని రచించి, తమ ఇంటిని అలంకరించుకున్న వారవనితలను కవి క్రింది విధంగా వర్ణించాడు.

"రతివధూ మదనులు, రంభా కుబేరపు
త్రకు, లూర్వశీ పురూరవులు, మేన
కా కౌశికులు, గోపికా ముకుందులు, ధాన్య
మాలినీ రావణుల్, మత్స్యలో చ
నర్శ్యశృంగులు, దాశనలినేక్షణా పరా
శరులు, తారానిశాచరులు, గౌత
మాంగనా దేవేంద్రు, లమర వేశ్యా జయం
తులు, ద్రౌపదీ పాండవులు, పృథాబ్జ
హితులు, నడిచిన గతులాత్మసుతులఁబెంచు
నింటిగోడల వ్రాయించు నిందువదన,
వనితలకు సరసత కల్మి వావివరుస
లేమియును లేమి వారల కెఱుక పఱుప".[145]

"వనిత చతుర్జాతివయో
వనజాక్షుల బంధవైభవము, భద్రుని ద
త్తుని గూచిమారుఁ బాంచా
లుని వ్రాయించెన్ గృహంబులోపలిగోడన్"[146]

శృంగారభరితమైన చిత్రాలను వేశ్యమాత వ్రాయించి ఇల్లంతా అలంకరించింది. తన కుమార్తెలను వారవనితలుగా తీర్చిదిద్దడమే ఈ అలంకరణలోని ఆంతర్యం. రతీమన్మథులు, గోపికాకృష్ణులు, దాశరాజుసత్యవతీ, తారాచంద్రులు, ద్రౌపదీపాండవులు మొదలైవారి ప్రణయ ఘట్టాలను చిత్రాలుగా

వ్రాయించి ఇల్లంతా గోడలమీద అలంకరించింది వేశ్యమాత. రాయల కాలంలో చిత్రలేఖనకళకు ఎంతటి ప్రాచుర్యం ఉన్నదో పై వర్ణనల వల్ల తెలుస్తున్నది. నాటి ప్రజలకు మానసికమైన ఆనందాన్ని ఇచ్చిన విద్యల్లో చిత్రలేఖనం కూడా ఒకటి.

పింగళి సూరన రాసిన 'ప్రభావతీ ప్రద్యుమ్నము'లో నాయికా నాయకులను ఒక్కటి చేసినది చిత్రలేఖనమే. వారి మధ్య ప్రణయభావాల్ని ఉద్దీపింపజేసింది ఈ చిత్రలేఖనవిద్యయే. నాయకుడైన ప్రద్యుమ్నుడు తన గురించి ఇలా అనుకుంటాడు.

"అన్నియు నేకవాక్యముగ నారయ నాసలు పెంచుపక్షమే
యున్నది కొంత మించి, యిది యోజన సేయఁగ నాదురూపె యా
కన్నియచేతి చిత్రఫలకంబున నున్నది, యెవ్వరట్టిచో
నన్ను నెఱింగి వ్రాయ నని నన్ శివ వ్రాయుట వింటిఁ జొప్పడన్"[147]

హంసి (ఆడహంస) తనంతట తానుగావచ్చి, ప్రభావతి అందాన్ని గురించి ప్రద్యుమ్నుడికి వివరిస్తుంది. ఆ హంసి పులుకులు విన్న ప్రద్యుమ్నుడికి కొత్త కోరికలు కలిగాయి. అవి ఎటువంటి వంటే ఆ ప్రభావతి చేతిలో ఉన్న చిత్రఫలకంలో ఉన్నది తనరూపమే, ఆ చిత్రాన్ని వ్రాసింది పార్వతీదేవియే, కాబట్టి మా కలయిక తప్పకుండా అనుకూలిస్తుందని ప్రద్యుమ్నుడు అనుకుంటాడు.

ప్రభావతి కూడా ప్రద్యుమ్నుడి చిత్రపటాన్ని వ్రాయించింది. అతడి అందాన్ని చూసి ఆమె మురిసిపోయింది. ఉద్యానవనంలో విహరించడం కన్నా, తన ప్రియుడి చిత్రపటాన్ని చూడటమే మంచిదని చెలికత్తెలతో ఇలా పలుకుతుంది.

"అకటా! యిట్టిది ప్రొద్దుపుచ్చుట కుపాయంబే విరోధంబ కా
కకడుం, జాలు వనాంతఖేలన మిఁకం గన్నార మత్ప్రాణ నా
యకు రూపంబును జూచుచుండుటయె మే లామీఁద భావ్యర్థ మం
బిక యొక్కర్తె యెఱుంగుఁ దత్ఫలకమున్ బింబోష్ఠి తేవేవెసన్"[148]

చెలికత్తెలు తెచ్చిన చిత్రపటంలోని ప్రద్యుమ్నుడి రూపాన్ని చూసేసరికి ఆమెకి విరహతాపం మరింత ఎక్కువైంది. ఆ రూపాన్ని చూస్తూ ఆనందపారవశ్యంలో మునిగిపోయింది. ఆ సందర్భంలో ప్రభావతి పడిన విరహవేదనను పింగళి సూరన క్రింది విధంగా వర్ణించాడు.

"అనయముఁ దృష్టిఁ గావలయు నంచు నజస్రము నెంత చూచినన్
గనుఁగవ కంతకంతకును గాటముగా నొక వింతవింత యిం
పు నెరపుచున్ ననుం దరలి పోవఁగనీ దిఁక నోర్వఁజాల నే'
ననుచు రసోద్ధతిం గదియ నక్కునఁ జేర్చె నిజేశురూపమున్"[149]

"చేర్చి యొక్కింత తడవు నిశ్చేష్ట యగుచుఁ
జొక్కి కనుఁగవ యరమోడ్చి శోభనాంగి
యంతఁ జిత్రరూపత మదియందుఁదోఁపఁ
గ్రమ్మఱఁగఁ బుచ్చి కనుఁగొంచుఁ గాంక్ష లడర"[150]

ఆ ప్రద్యుమ్నుడి చిత్రాన్ని ఎంతసేపు చూసినా ప్రభావతికి తృప్తి కలుగలేదు. అందువల్లనే ప్రేమాతిశయంతో ఆమె ఆ చిత్రఫలకాన్ని గుండెలకు గట్టిగా హత్తుకొన్నది. కొంత సేపు ఆమె నిశ్చేష్టురాలైంది. ఈ విధంగా ప్రభావతీప్రద్యుమ్నుల మధ్య కలయిక ఏర్పడటానికి చిత్రలేఖనవిద్య ఉపయోగపడింది. రాయల కాలంలో వచ్చిన ప్రబంధాల్లో ఇటువంటి వర్ణనలు చాలా చోట్ల కనిపిస్తాయి.

ప్రభావతీ ప్రద్యుమ్నములో వర్ణించినట్లు నాయికా నాయకులు పరస్పరం చిత్రాలను చూసుకోవటం, విరహంతో బాధపడటం వంటివి 'కవికర్ణరసాయనము' అనే ప్రబంధంలో కూడా కనిపిస్తాయి. దీన్ని సంకుసాలనృసింహకవి రాసాడు. నాయకుడు మాంధాత. నాయిక విమలాంగి. ఆ విమలాంగి సౌందర్యాన్ని వర్ణిస్తూ చిత్రకారులు మాంధాతతో ఈ విధంగా అంటారు.

"ఆ సతిమేని చెల్వుఁ గలయంత వచింపఁగ నేరమన్నచో
వ్రాసితిమన్న రాదె యపరాధము? పోలికమాత్ర చిత్ర వి
న్యాసము చేసినార మిదెయంచుఁ దదాకృతి లేఖనక్రమో
ద్భాసి పటంబువిప్పి నరపాలుని సన్నిధిఁబెట్టి చూపినన్"[151]

విమలాంగి చిత్రాన్ని చూసిన తర్వాత మాంధాత తనను తాను నిగ్రహించుకోలోకపోయాడు. ఆయన యౌవన జ్వాలను ఆ సుందరి చిత్తరువు ఇంధనం లాగా రగుల్కొల్పుతున్నట్లు ఉందట. ఆ చిత్రంలోని చిన్నది అన్నివైపుల నుండి మాంధాతను చేతల సంకెళ్ళలోకి ఆహ్వానించిందట. అప్పుడు మాంధాత పడిన అవస్థను కవి క్రిందివిధంగా వర్ణించాడు.

"చిత్రకళావంతులచేఁ
జిత్రపటము చిన్నదైనఁ జిత్రము, హరిణీ
నేత్రం జిత్రించిన త
చ్చిత్రపటంబయ్యె విభుని చిత్తంబంతన్"[152]

"చిత్రకారుల రాకఁ జర్చింపనొక్క
దేవతామాయగాదె యీత్రిజగదేక
సుందరాకృతిఁ జిత్రించి చూపుటెట్లు?
చూచునంతన మఱి తగు లేచుటెట్లు?"[153]

ఇక్కడ చాలా సందర్భాల్లో చిత్రకారుల ప్రతిభ ప్రశంసించబడింది. ఆ కాలంలో చిత్రరచనకు ఎంత విశిష్టస్థానం ఉండేదో పై వర్ణనల వల్ల తెలుస్తున్నది. ముఖ్యంగా విజయనగర రాజుల కాలంలో చిత్రలేఖన విద్యను రాజకుమారులు, రాకుమార్తెలు తప్పనిసరిగా నేర్చుకునేవారని మనం గ్రహించవచ్చు.

ధీరోదాత్తుడైన మాంధాత పరిస్థితే ఇలా ఉంటే? ఇంక విమలాంగి పరిస్థితి ఎంత దుఃఖభరితంగా ఉందో? కవి క్రిందివిధంగా వర్ణిస్తున్నాడు. ఇక్కడ కూడా విమలాంగి, ప్రియుడి చిత్రపటాన్ని చూస్తూ విరహంతో బాధపడుతుంది.

"చెలుల మొఱంగి యేకతమ చెన్నుగ హస్తములందు దూలికా
ఫలకములన్ వహించి దనభావములోఁ బతిరూపు వ్రాయఁగాఁ
దలఁచి లతాంగి చిత్రముగఁ దా నవిచేష్టతఁ జిత్రరూపమై
నిలిచెఁ దదాకృతిస్మరణ నిర్వృతిచే వివశాంతరంగయై"[154]

పై విధంగా మాంధాత రూపాన్ని చూసి వివశత్వాన్ని పొందిన విమలాంగికి ఎన్నో కోరికలు కలిగాయి. తన మనస్సులోని ప్రణయ భావాల్ని దాచుకోలేక ఆ విరహిణి క్రింది విధంగా ప్రవర్తించసాగింది.

"వదనము వ్రాసి తోన గరువంబునఁ జుంబునకేళి సల్పుచున్,
హృదయము వ్రాసి తోన నిలువేది కవుంగిటఁ జిక్కఁజేర్చుచున్,
బదములు వ్రాసి తోన కరపద్మములం బ్రియమార నొత్తుచున్
సుదతిపతిన్ లిఖించు మఱి చూడ నెఱుంగదు కోర్కి పెక్కువన్"[155]

చిత్రపటంలోని మాంధాతను చూసి విమలాంగి వివశురాలైంది. ఆ చిత్రానికి ముద్దులు పెట్టింది. గట్టిగా కౌగిట్లోకి చేర్చుకున్నది. ఎంతో ప్రేమతో ఆ చిత్రపటాన్ని తన చేతుల్లోకి తీసుకొంటున్నది. ఈ విధంగా విమలాంగిమాంధాతల కలయిక చిత్రపటాలను చూడటం వల్ల జరిగింది. ఈ కావ్యంలో, ఆనాటి చిత్రకారుల ప్రతిభ, వారికి గల కళానైపుణ్యం వ్యక్తమవుతున్నాయి.

చేమకూర వేంకటకవి రాసిన 'విజయవిలాసము'లో కూడా చిత్రలేఖనవిద్య ప్రస్తావన ఉన్నది. అయితే మిగిలిన కవుల వర్ణన కంటే చేమకూర కవి వర్ణన ప్రత్యేకమైంది. కావ్య నాయికా నాయకులు ఇంటిలోని చిత్రపటాలను చూసి పరస్పరం అనురాగాన్ని పొందటం పైన చెప్పిన కవులందరు చేసిన వర్ణన. కానీ చేమకూర కవి ప్రతిపద్యంలోనూ ఏదో ఒక చమత్కారం ఉంటుంది. క్రిందిపద్యం అందుకు చక్కని ఉదాహరణ.

"మకరకేతనుఁ గూర్చి మకరికా లతలు నీ
చెక్కుల వ్రాయంగ మ్రొక్కుకొంటిఁ
గుసుమాకరునిఁ గూర్చి కుసుమ మాలికలు నీ
వేనలిఁ దుఱుమంగ వేఁడుకొంటి,
గంధవాహనుఁ గూర్చి గంధసారంబు నీ
గుబ్బలఁ బూయంగఁ గోరుకొంటి,
మృగలాంఛనునిఁ గూర్చి మృగమదంబున నీకుఁ
దిలకంబు దిద్దఁ బ్రార్థించుకొంటి,
నిన్ను వరియించు నప్పుడే యిన్ని చేయు
వాఁడనని మున్ను శృంగార వనములోన;

వల పెఱిఁగి యేలుకోఁగదే కలికి!' యనుచుఁ
గేళి కెలయించె నమ్ముద్దరాలి నపుడు"[156]

ఉద్యానవనంలో ఉన్నప్పుడు వియోగం భరించలేకపోయాడు అర్జునుడు. అందువల్ల మన్మథ, వసంత, మలయమారుత, చంద్రులను అర్జునుడు పైవిధంగా వేడుకున్నాడు. మొదటిపాదంలో, ఓ ప్రేయసీ! నీ చెక్కిళ్ళ మీద మొసలిని పోలిన రేఖాచిత్రాలను చిత్రించడానికి నేను శపథము చేశాను అని అర్జునుడు అంటాడు. చెక్కిళ్ళపై భుజాలపై రేఖాచిత్రాలను గీయించుకోవడం ప్రసిద్ధమైనట్లు దీనివల్ల తెలుస్తున్నది.

చేమకూర వేంకటకవి రాసిన 'సారంగధర చరిత్రము'లో కూడా చిత్రకళకు సంబంధించిన అంశాలు కనిపిస్తున్నాయి. సారంగధరుని పావురం తప్పిపోయి చిత్రాంగి మందిరంలో చిక్కుకుంటుంది. సారంగధరుడు ఆ పావురాన్ని వెదుకుతూ అంతఃపురంలోకి వెళతాడు. చిత్రాంగి తన మందిరంలోని చిత్రపటాన్ని చూపిస్తూ సారంగధరుడికి శృంగార భావాల్ని కలిగించటానికి ప్రయత్నిస్తుది. ఈ సందర్భంలో ఆ భవనంలో అమర్చిన చిత్రాల అందం వివరించబడింది.

"ఏకడఁ జూచినన్ రతుల యేఁకట తీరఁగ వ్రాసినట్టి కొ
క్కొక కళారహస్యములు, గోప్యము లౌచవునీతి బంధముల్,
నాకపురీ విలాసకలనా గణికామణికాముకాది నా
నాకృతులున్, విచిత్రగతు, లచ్చట నచ్చపలాక్షి చూపుచున్."[157]

వివిధ శృంగార భావాల్ని గోప్యంగా సూచించే చిత్రాలు ఆ చిత్రాంగి మేడలో అమర్చబడి ఉన్నాయి. ఆ చిత్రాలను సారంగధరుడికి చూపిస్తూ నర్మగర్భంగా చిత్రాంగి తన కోరికను వ్యక్తపరుస్తుంది.

పై విధంగా ప్రాచీన తెలుగు కావ్యాల్లో కవిత్వం, సంగీతం, నాట్యం, శిల్పం, చిత్రలేఖనం మొదలైన ప్రయోగాత్మక మానసిక విద్యలు ప్రతిఫలిస్తున్నాయి. సాధన, ప్రయోగం వీటి ప్రధాన లక్షణాలు. మానసిక ఆనందాన్ని కలిగించడం, అన్యాపదేశంగా నీతిని బోధించటం ఈ కళల పరమ ప్రయోజనం. ప్రబోధాత్మక మానసిక విద్యల్లో సిద్ధాంతజ్ఞానం ప్రధానం. ప్రయోగాత్మక మానసిక విద్యల్లో ప్రయోగజ్ఞానం ప్రధానం. ఇవన్నీ మనిషిలో అంతరంగ పరివర్తనకు, హృదయవికాసానికి దోహదపడే విద్యలు.

పాదసూచికలు

1. పర్యాయపద నిఘంటువు, పు.64.

2. సూర్యరాయాంధ్ర, పు.387.

3. తెలుగు–తెలుగు నిఘంటువు, పు.89

4. పర్యాయపద నిఘంటువు, పు.89

5. పైదే, పు. 64.

6. బ్రౌణ్య తెలుగు–ఇంగ్లీషు నిఘంటువు, పు.578.

7. శబ్దరత్నాకరము, పు.678.

8. తెలుగు–తెలుగు నిఘంటువు, పు.768.

9. సూర్యరాయాంధ్ర, పు.153.

10. బ్రౌణ్య తెలుగు – ఇంగ్లీషు నిఘంటువు, పు. 543.

11. ఋగ్వేదం, 6–9–6 శ్లో.

12. ఋగ్వేదం, 2–16–2 శ్లో.

13. శ్రీమదాంధ్ర వచన ఋగ్వంద సంహిత, పు.305.

14. ఋగ్వేదం, 10–16–శ్లో.

15. అథర్వణవేదం, 19–56–5శ్లో.

16. తైత్తిరీయోపనిషత్తు–II, 1–5శ్లో

17. భగవద్గీత–సాంఖ్యయోగం, 54శ్లో

18. భగవద్గీత, సాంఖ్య, 55 శ్లో.

19. పైదే, 56 శ్లో

20. పైదే, 60శ్లో.

21. పైదే, 61శ్లో.

22. విజ్ఞాన సర్వస్వము, 10సం, పు.81.

23. పైదే

24. విజ్ఞానసర్వస్వము, 10సం, పు.110–112.

25. పైదే, 4సం, పు.114.

26. పైదే, అదే.

27. పైదే, అదే.

28. పైదే, పు. 115.

29. పైదే, 10 సం, పు.83.

30. పైదే, అదే.

31. పైదే, అదే.

32. విజ్ఞాన సర్వస్వము, 4సం, పు. 141

33. పైదే, అదే.

34. పైదే, పు. 142.

35. పైదే, పు.146.

36. పైదే, అదే.

37. సూర్యరాయాంధ్ర, పు. 1185

38. తెలుగు సాహిత్య సమీక్ష, 1 సం, పు.59.

39. సాహిత్య శిల్ప సమీక్ష, పు. 16.

40. దేవీభాగవతము, 1–3–13.

41. వ్యాసపీఠిక, పు.55.

42. ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2 సం, పు. 36.

43. సూర్యరాయాంధ్ర, పు. 489.

44. అనుశీలన, వ్యాస సంపుటి, పు.11

45. అమరకోశం, పు.25.

46. శబ్దకల్పద్రుమం, పు.17.

47. అనుశీలన, వ్యాససంపుటి, పు.18.

48. కావ్యమీమాంస, పు.48.

49. ఆంధ్రమహాభారతం పీఠిక (తి.తి.దే), పు.ix

50. సూర్యరాయాంధ్ర, పు. 608.

51. శాంతి, 1ఆ, 49ప.

52. సాహిత్యశిల్ప సమీక్ష, పు.5.

53. ధ్వన్యాలోకం, పు.65.

54. ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు–ప్రయోగములు, పు.47.

55. పైదే, పు.46.

56. ఆముక్త, 1ఆ, 74 ప.

57. ఉత్తరహరివంశం, 5ఆ, 55ప.

58. తెలుగు సంస్కృతి, పు. 835.

59. పైదే, అదే

60. పైదే, పు.836.

61. సంగీతరత్నాకరము, 1–1శ్లో, 15–20 శ్లో.

62. తెలుగు సంస్కృతి, పు.840.

63. ఆది, 7ఆ, 282 ప.

64. విరాట, 1ఆ, 241 ప.

65. శృంగార, 8ఆ, 150ప.

66. ఆముక్త, 1ఆ, 62 ప.

67. వసుచరిత్ర, 1ఆ, 3ప.

68. పైదే, 126 ప.

69. కళాపూర్ణోదయం, 2ఆ, 90ప.

70. సింహగిరి వచనాలు, పు.15.

71. నృసింహపురాణము, 2ఆ, 83ప.

72. కుమారసంభవము, 9ఆ, 36ప.

73. మనుచరిత్రము, 2ఆ, 27ప.

74. వసుచరిత్రము, 2ఆ, 30ప.

75. అన్నమయ్య సంకీర్తనల్లో జానపద గేయ ఫణితులు, పు.5.

76. అన్నమాచార్య సంకీర్తన

77. అన్నమాచార్య సంకీర్తన

78. అన్నమాచార్య సంకీర్తన

79. మువ్వగోపాలపదాలు

80. పోతులూరి వీరబ్రహ్మంగారి కాలజ్ఞానతత్త్వాలు

81. త్యాగరాజకృతులు

82. సాహిత్య శిల్ప సమీక్ష, పు.7.

83. నాట్యశాస్త్రము – విశ్లేషణాత్మక అధ్యయనం, పు.4.

84. తెలగు సంస్కృతి, పు.851.

85. ఆది, 8ఆ, 174 ప.

86. కుమార సంభవము, 8ఆ, 180ప

87. పండితారాధ్యచరిత్ర, పర్వతప్రకరణం

88. బసవపురాణము, 1ఆ, పు.50.

89. విరాట, 1ఆ, 240ప.

90. పైదే, 241 ప.

91. నృసింహ పురాణము, 3ఆ, 78ప.

92. కాశీఖండం, 1ఆ, 56 ప.

93. పల్నాటి వీరచరిత్ర, పు.18, 19

94. విక్రమార్క చరిత్రము, 2ఆ, 58ప.

95. వాల్మీకి చరిత్రము, 3ఆ, 58ప.

96. హంసవింశతి, 5ఆ, 122 ప.

97. సూర్యరాయాంధ్ర, పు. 630.

98. తెలుగు సంస్కృతి, పు.813.

99. ఆంధ్రప్రదేశ్ సమగ్రచరిత్ర సంస్కృతి, 3 సం, పు. 245

100. పైదే, అదే.

101. పైదే, పు.249.

102. అరణ్య, 1ఆ, 172ప.

103. శాంతిపర్వం, 2ఆ, 383ప.

104. హరివంశము, 2ఆ, 16ప.

105. ఆముక్త, 1ఆ, 53ప.

106. వసుచరిత్రము, 1ఆ, 106 ప.

107. తారాశశాంకవిజయము, 2ఆ, 9ప

108. వాసవదత్తా పరిణయము, 1ఆ, 179ప.

109. రసికజనమనోరంజనము, 1ఆ, 13ప.

110. హంసవింశతి, 1ఆ, 180ప.

111. వర్ణనరత్నాకరము – పాఠకమిత్రవ్యాఖ్య, 6సం; పు.13.

112. ఒడయనంబివిలాసము, 5ఆ, 104ప.

113. వర్ణనరత్నాకరము – పాఠకమిత్రవ్యాఖ్య, 6సం, పు.11.

114. సూర్యరాయాంధ్ర; పు.517.

115. హరిశ్చంద్రోపాఖ్యానము, 1ఆ, 95ప.

116. వర్ణనరత్నాకరము – పాఠకమిత్రవ్యాఖ్య, 1 సం, పు. 226

117. పైదే, పు. 228.

118. ముకుందనిలయము, 1ఆ, 121ప.

119. కవిచకోరచంద్రోదయము, 1ప.

120. వర్ణనరత్నాకరము; పైదే, పు. 234

121. ఋగ్వేదం, 1–5–215

122. వాత్సాయన కామసూత్రాలు– జయమంగళ వ్యాఖ్య

123. చిత్రకళ, పు.25.

124. వసంతరాజీయము, పు.14.

125. కళ, పు. 158–166

126. కుమారసంభవము, 5ఆ, 118 వచనం

127. కూమారసంభవము – సంజీవనీ వ్యాఖ్య, పు.527

128. కుమార సంభవము, 5ఆ, 119 ప.

129. క్రీడాభిరామం, 178ప.

130. పైదే, 191ప.

131. పైదే, 192 ప.

132. పైదే, 125 ప.

133. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, పు.38.

134. కాశీఖండము, 1ఆ, 123 ప.

135. పల్నాటి వీరచరిత్ర, పు.7.

136. పైదే, పు.267.

137 శృంగారనైషధము, 7ఆ, 150ప.

138. పైదే, 7ఆ, 151ప.

139. పైదే, 152 ప.

140. పోతన భాగవతము, 10 సం, 345 ప.

141. మారీచీపరిణయము.

142. ఆముక్త, 5ఆ, 15ప.

143. రాధామాధవము, 4ఆ, 148ప.

144. రాధామాధవము, 4ఆ, 148ప.

145. శ్రీకాళహస్తి మాహాత్మ్యము, 4ఆ, 14ప.

146. పైదే,క 15ప.

147. ప్రభావతీప్రద్యుమ్నము, 3ఆ, 9ప.

148. పైదే, 37ప.

149. పైదే, 39ప.

150. పైదే, 40ప.

151. కవికర్ణరసాయనము, 3ఆ, 40ప.

152. పైదే, 41ప.

153. పైదే, 44 ప.

154. పైదే, 78 ప.

155. పైదే, 79 ప.

156. విజయవిలాసము, 2ఆ, 32ప.

157. సారంగధరచరిత్రము, 45ప.

నాల్గవ అధ్యాయం

ఆధ్యాత్మిక విద్యలు – కావ్యానుశీలన

4. ఆధ్యాత్మిక విద్యలు – కావ్యానుశీలన

'ఆధ్యాత్మికము' అనే పదానికి శబ్దరత్నాకరం (పు.65), సి.పి.బ్రౌన్ గారి 'తెలుగు–ఇంగ్లీషు నిఘంటువు'[1], శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు మొదలైన వాటిలో 'ఆత్మ వల్ల కలిగినది, ఆత్మ విషయకమైనది' అనే అర్థాలున్నాయి. మనశ్శరీరాదుల కంటే భిన్నమైనది 'ఆత్మ' అని చెప్పవచ్చు. ఈ ఆత్మకు చావుపుట్టుకలు లేవు. నాశనము లేదు. ఈ ఆత్మ, పరమాత్మలో లీనం కావటమే ముక్తి. దీన్ని పొందాలంటే మానవుడు ఆధ్యాత్మిక చింతన కలిగివుండాలి. అంతరంగ సత్యాన్ని తెలుసుకొని ధర్మమార్గంలో నడుచుకోవాలి. ఇటువంటి ఆత్మ తత్త్వాన్ని గురించి ప్రాచీన కాలంలో దార్శనికులైన మహర్షులు, మతాచార్యులు, యోగులు మొదలైనవారు తెలియజేశారు. వీరి అభిప్రాయాల్లో తేడాలుండవచ్చు. వారు ఎన్నుకొనే తత్త్వమార్గం భిన్నంగా ఉండవచ్చు. అయితే దార్శనికులైనా, మతాచార్యులైనా అంతిమంగా చర్చించేది ఆత్మ తత్త్వాన్ని గురించే. ఈ ఆత్మతత్త్వ పరిశీలన తెలుగు కావ్యాల్లో ఏవిధంగా ప్రతిఫలించిందో, విద్యార్థులకు గురువులు ఆధ్యాత్మిక విద్యను బోధించిన విధానాలు ఏమిటో ఈ అధ్యాయంలో పరిశీలించడం జరిగుతుంది.

శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించిన విజ్ఞానసర్వస్వములలో 'దర్శనములు–మతములు' అనే ఐదవ సంపుటం ఆధారంగా కొన్ని అంశాలను ఇక్కడ గ్రహించడం జరిగింది. దర్శనాలు, వాటి స్వరూప స్వభావాలు, మత సంప్రదాయాలు పై గ్రంథంలో చాలా విపులంగా చర్చించబడ్డాయి. అవసరమైన సందర్భాల్లో పై గ్రంథంలోని విషయాలను ఇక్కడ ఉదాహరించడం జరుగుతుంది.

4.1. దర్శన సంప్రదాయం – ఆధ్యాత్మికవిద్య:–

'దృశ్యతే అనేన ఇతి దర్శనమ్' అని 'దర్శనమ్' శబ్దానికి వ్యుత్పత్తి. దేనిచేత చూడబడునో అది దర్శనము అని అర్థం. మనుషుల, వస్తువుల, క్రియల, శాస్త్రవిజ్ఞానముల, కళల, విశ్వంలోని సమస్త పదార్థముల్లోని నిజస్వరూపాన్ని, యదార్థ స్వభావాన్ని, తత్త్వాన్ని చర్చించేదే దర్శనం. "మనన పూర్వకంగా, సవిమర్శకంగా ప్రతిదానిని అవలోకనం, పర్యాలోకనం చేసేది కాబట్టి ఇది 'ఆన్వీక్షకి' అనే విద్య. ఉన్నదాన్ని,

భూతవస్తువులను, తత్వమును, శంసనము (ప్రకటన, వర్ణన) చేసేది కాబట్టి ఇది తత్వశాస్త్రం. అన్నిటి కంటే గొప్పది, అన్నిటికి మూలకారణం, పరమ సత్యము, సత్త, పరమార్థం అయిన దాన్నిబ్రహ్మము అనవచ్చు. కాబట్టి బ్రహ్మవిద్య దర్శనంలో అంతర్భూతం"[2]. మనుషుల్లో, వస్తువుల్లో నిజంగా ఉండేది ఏది? అనే ప్రశ్న వస్తుంది. దీనికి ఆత్మ అని సమాధానం. ఆత్మను విషయంగా చేసుకొని ప్రవర్తిల్లేది ఆధ్యాత్మికవిద్య. ఇది కూడా దర్శనంలో భాగమే. ధర్మశాస్త్రం, సత్యాసత్యాలను నిర్ణయించటం కూడా దర్శనంలో చేరును. అందువల్ల దర్శనం అన్నివిద్యలకు నిలయం.

సారాంశంగా చెప్పాల్సివస్తే ఏదైనా ఒక పదార్థం గురించి లేదా భావన గురించి చేసే తాత్వికమైన ఆలోచనను దర్శనం అనవచ్చు. ఆత్మ గురించి చేసే తార్కికమైన ఆలోచనలే ఆధ్యాత్మికవిద్య. ఆత్మ యొక్క మౌలిక భావనలను ఆవిష్కరించేదే ఆధ్యాత్మికవిద్య.

భారతీయ దర్శనాలు – ఆధ్యాత్మిక విద్య:-

వేదాలు, ఉపనిషత్తులు, లోకాయతులు, జైనులు, బౌద్ధులు, భగవద్గీత ఆత్మతత్వాన్ని ఏవిధంగా ఆవిష్కరించడం జరిగిందో ఈ విభాగంలో చర్చించడం జరుగుతుంది.

4.1.1. వేదాలు:-

ఋగ్వేదంలోని 'నారదీయసూక్తం'లో, విశ్వం యొక్క మూలమేది?, సృష్టి ఏవిధంగా జరిగింది? వంటి ప్రశ్నలకు సమాధానాలు కనిపిస్తాయి. మొదట్లో సత్తు లేదు, అసత్తు లేదు. అంతరిక్షం, దాని తర్వాత వ్యోమం లేవు. ఎవరు అంతటా ఆవరించెను? ఎక్కడ, ఎవనివల్ల రక్షింపబడివుండెను? అప్పుడు అక్కడ నీళ్ళు ఉండెనా? వంటి చర్చలు కనిపిస్తాయి. ఈ సూక్తంలోనే మృత్యువు గురించి చర్చ ఉంది. సృష్టి ప్రారంభంలో మృత్యువు లేదు. అమృతము కూడా లేదు. అహోరాత్రుల భేదం లేదు. ఆ ఒక్కటే వాయురహితంగా, స్వశక్తిచేత శ్వసించెను. దానికి వేరైనది లేదా పరమైనది మరొకటి లేదు. ఋషులు తమ హృదయాలలో వెదకుతూ అసత్తునందు సత్తు యొక్క యోజక సంబంధాన్ని కనుగొన్నారు. "ఏ మూలము నుండి విశ్వోత్పత్తి అయినదో, అది కృతమా, అకృతమా యనునది సర్వోచ్చద్యులోకము నుండి శాసనము చేయు ఆ

సమదర్శియగు ప్రభువే ఎరుగును. లేదా ఎరుగడు. ఇట్లు ఏకమగు సత్తే విశ్వకారణమని, అదే నానావిధముల ఊహింపబడి పిలువబడునని, జగన్నియమనము చేయునని ఋగ్వేదంలోని సూక్తాల్లో కనిపిస్తుంది"[3].

దీన్నిబట్టి ఋగ్వేదకాలంనాటికే ఆత్మతత్త్వ వివేచన జరిగిందని, ఋషులు అంతరంగంలోని సత్యాన్ని పరిశీలించే దశలోనే వేదముల పుట్టుక జరిగిందని తెలుస్తున్నది.

వేదాలను విభజించినందువల్ల కృష్ణద్వైపాయనుడు వేదవ్యాసుడుగా కీర్తింపబడ్డాడు. వ్యాసుడు తన నలుగురు శిష్యుల చేత నాలుగు వేదాలను అధ్యయనం చేయించాడు. పైలునికి ఋగ్వేదాన్ని, జైమినికి సామవేదాన్ని, వైశంపాయనునికి యజుర్వేదాన్ని, సుమంతునికి అథర్వవేదాన్ని వ్యాసుడు బోధించాడు. వారు తమ శిష్యులకు – ఇట్లా శిష్యప్రశిష్య పరంపరగా వేదాలు ప్రచారం పొందాయి.

ఋగ్వేదంలోని పదవ మండలంలోని పురుషసూక్తం దార్శికార్థానికి ప్రసిద్ధమైంది. పరమాత్మ స్వరూపుడైన పురుషుని ఆధ్యాత్మిక కల్పన దీనిలో చాలా గొప్పగా వర్ణించబడింది. చాలా దేవతల స్తుతులు కలిగిన వైదికమతంలో ఋగ్వేదకాలంలోనే ఏకేశ్వర రూపమైన పరమాత్మ కల్పన చేయబడింది. "పురుష ఏవేదం సర్వం యద్ భూతం యచ్చ భవ్యమ్" – 'పురుషుడే సమస్త విశ్వం, ప్రాచీన కాలంలో ప్రభవించినాడు, భవిష్యత్తులోను ప్రభవించగలడు' అన్న పై సూక్తంలో ఏకేశ్వరవాదం, ప్రతీకవాదం కనిపిస్తున్నాయి[4].

అథర్వణవేదంలో సృష్టిప్రారంభం గురించి, బ్రహ్మవిద్య గురించి చెప్పబడింది. సృష్టి ఉత్పత్తి కోసం బ్రహ్మ తపస్సు చేశాడని, తపఃపూతమైన బ్రహ్మ శరీరం నుండి అథర్వక, అంగిరసుడు జన్మించారని చెప్పబడింది. ఆ ఇరువురు వంశజుల చేత అథర్వవేదం దర్శించబడిందని, అందువల్ల దానికి అథర్వణవేదమనే పేరు వచ్చిందని గోపథబ్రాహ్మణంలో చెప్పబడింది.

విషయ దృష్టితో అథర్వవేదం అథర్వక, అంగీరస భాగాలుగా విభజింపబడుతున్నది. అథర్వక భాగంలో మంత్ర తంత్ర ఔషధాలను గురించి చెప్పే మంత్రాలు ఉన్నాయి. మరణ, ఉచ్చాటన విషయాలు గల మంత్రాలు అంగిరస భాగంలో ఉన్నాయి. బ్రహ్మవిద్యకు సంబంధించిన విషయాలు కూడా అథర్వవేదంలో ఉన్నాయి. అందువల్ల అథర్వవేదానికి 'బ్రహ్మవేదం' అనే పేరు కూడా ఉంది.

'సంస్కృత సాహిత్య చరిత్ర' గ్రంథంలో అథర్వవేదం గురించి క్రింది విషయాలు చర్చించబడ్డాయి. "ప్రాచీన మానవ సమాజానికి చెందిన విశ్వాసాలు, క్రియా కలాపాలు కూర్చబడినవి. మొత్తం మీద అథర్వవేద విషయాన్ని ఆధ్యాత్మ, ఆధిభూత, ఆధిదైవత అని మూడు విధాలుగా విభజించవచ్చు. ఆధ్యాత్మ ప్రకరణల్లో బ్రహ్మపరమాత్మ జ్ఞానం, ఆశ్రమ ధర్మాలను గూర్చి చెప్పబడింది. ఆధిభూత ప్రకరణాల్లో రాజులు, రాజశాసనాలు, యుద్ధాలు, శత్రుపరాజయ ఉపాయాదులు చెప్పబడినవి. అధిదైవత ప్రకరణాల్లో వివిధ దేవతల స్తుతి, యజ్ఞవిధులు చెప్పబడినవి"[5]. ఈవిధంగా అథర్వవేదంలో బ్రహ్మవిద్య, ఆత్మజ్ఞానం గురించిన విషయాలు కనిపిస్తున్నాయి. యజుర్వేదంలో, సామవేదంలో ఇటువంటి విషయాలే సందర్భాన్ని బట్టి కనిపిస్తాయి. మొత్తం మీద వేదకాలంలో ఆధ్యాత్మికత గురించి పరిశీలన జరిగిందని, ఋషుల దర్శనాలు ఆత్మతత్త్వాన్ని ఆవిష్కరించాయని తెలుస్తున్నది. దీనికే 'బ్రహ్మవిద్య' అనే పేరు ఉన్నదని గుర్తించవచ్చు.

4.1.2. ఉపనిషత్తులు:

ఉపనిషత్తులు వేద అంతిమ భాగాలు. వేదాల సారమే ఉపనిషత్తుల్లో ఉంటుంది. దాదాపు అన్ని భారతీయ దర్శనాలకు ఉపనిషత్తులు మూలస్రోతములు. గురువు, అధికారి అయిన శిష్యుని దగ్గర కూర్చుండబెట్టుకొని ఉపదేశించే రహస్యము ఉపనిషత్తు అవుతుంది. అవిద్యను నాశనం చేసేది, బ్రహ్మమును పొందించునది, దుఃఖాన్ని శిథిలం చేసేది ఉపనిషత్తు. 'బ్రహ్మవిద్య' అనే పేరు ఉపనిషత్తుకు ఉంది. ముఖ్యమైన ఉపనిషత్తులు:– ఈశ, ఛాందోగ్య, తైత్తిరీయ, బృహదారణ్యక, ఐతరేయ, ప్రశ్న, కేన, కఠ, ముండక, మాండూక్య, కౌషీతకి, మైత్రి, శ్వేతాశ్వతర ఉపనిషత్తులు. ఈ ఉపనిషత్తుల్లో ఆత్మతత్త్వ వివేచన విస్తృతంగా కనిపిస్తుంది. గురుశిష్యుల సంవాదాల్లో ఆధ్యాత్మికవిద్య బోధించబడేది.

4.1.2.1. ఈశోపనిషత్తు:–

ఈశ్వరుని సర్వవ్యాపకత్వం, కర్మ యొక్క అనివార్యత, అవిద్య, విద్యల సమాన ప్రాధాన్యాలను గురించి ఇది ప్రస్తావిస్తుంది. జగత్తులో ఉన్నదంతా ఈశ్వరునిచేత కల్పించబడింది. కాబట్టి త్యాగంతో జీవితాన్ని అనుభవించాలి. ఇతరుల ధనాన్ని ఆశించకూడదు. కర్మలు చేస్తూనే నూరేండ్లు గడపాలి. అయితే ఆ కర్మలు నరునికి అంటవు అని ఈ ఉపనిషత్తు చెపుతుంది.

4.1.2.2. ఛాందోగ్యోపనిషత్తు:–

ఇందులో ఉద్దాలక ఆరుణి ప్రధాన చింతకుడు. ఆత్మతత్త్వ పరిశీలన చేసేవాడు. రైభ్య, సత్యకామ, జాబాల ప్రసంగాలు, జాబాల శిష్యుడైన ఉపకోసలుని కథ ఇందులోనే కలవు. జైవలి, అశ్వపతి, కైకేయుల బోధలు కూడా ఈ ఉపనిషత్తులోనే ఉన్నాయి. ఇందులోని ఆరవ అధ్యాయంలో ఆరుణి ఋషి ఉపదేశం, ఏడవ అధ్యాయంలో సనత్కుమారుడు నారదునికి చేసిన బోధనలు, ఎనిమిదవ అధ్యాయంలో ఇంద్రప్రజాపతి సంవాదం, ఆత్మసాక్షాత్కారాన్ని గూర్చిన యుక్తి ఉన్నాయి. "జ్ఞానికి కమల పత్రమునకు నీరు అంటనట్లు పాపకర్మము అంటదు. జ్ఞానము ముక్తికి ఆవశ్యకము. జ్ఞానమునకు ఆచార్యుడు కావలెను. గాంధార దేశము నుండి కళ్ళు కట్టబడి చాలామంది ఉన్న స్థానమందు వదలబడినవాడు నలుదిక్కులకు వినపడునట్లు గోలగ అరచిన విని, ఎవరైన అతని కండ్లకట్టు విప్పి, గాంధారం ఏ దిక్కున ఉన్నదో చూపినచో, వాడు తెలివి కలవాడు, బుద్ధిమంతుడు అయినచో ఊరూరున అడుగుచు తిరిగి గాంధారము చేరుకొనగలడు. అట్లే ఆచార్యుడు కలవాడు బ్రహ్మము నెరుగును. విమోక్షము కలుగునంతవరకే అతని కాలస్యము. వెంటనే బ్రహ్మమును పొందును"[6] అని ఛాందోగ్యోపనిషత్తు తెలుపుతుంది. ఆత్మ అన్నివైపుల ఉందని చూసేవాడు, మననం చేసేవాడు, ఆత్మానందుడు, స్వరాట్టు అవుతాడు. వారిదే స్వరాజ్యము. ఇతరులది కాదు అని ఈ ఉపనిషత్తు తెలియజేస్తుంది.

4.1.2.3. బృహదారణ్యకోపనిషత్తు:–

ఇందులో యాజ్ఞవల్క్యుని బోధనలు ఉన్నాయి. అజాతశత్రుగార్గ్య సంవాదం, దధ్యఙ్ఞఅధర్వణుని ఉపదేశాలు, జనక ప్రవాహణజైవలి ప్రసంగాలు ఈ ఉపనిషత్తులోనే ఉన్నాయి.

"విత్తము వలన అమృతత్వము లభింపదు. ఏ వస్తువు ప్రియమైనను అది తన ఆత్మకామన (భోగము) కొరకే ప్రియమగును. ఆయా పుత్రకళత్రా విత్తాదుల కొరకు కాదు. ఆత్మే ద్రష్టవ్యము, శ్రోతవ్యము, మంతవ్యము, నిదిధ్యాసితవ్యము. ఆత్మ దృష్టము, శ్రుతము, మతము (మననము చేయబడినది). ఆత్మకు వేరుగా బ్రహ్మను ఎరుగు వానిని బ్రహ్మము నిరాకరించును"[7] అని ఈ ఉపనిషత్తు తెలియజేస్తుంది. నీళ్ళన్నింటికి సముద్రం ఆశ్రయం అయినట్లే, ఆత్మ ఒక్కటే సృష్టికి మూలం. సముద్రపు నీరు ఎక్కడైనా ఉప్పగానే ఉంటాయి. అలాగే ఆత్మ లోపల, బయట అన్నింటా ఒక్కటే. ఆత్మ అవినాశి. అది ఉచ్ఛిన్నం కాదు.

'ద్వైతం ఉన్నప్పుడు చూడటం, ఎరుగుట ఉంటాయి. అంతా ఆత్మయే అయినప్పుడు ఎవరిని చూస్తారు? ఎవరిని తెలుసుకొంటారు? అగృహ్యము, అసంగము. సమస్తమూ తెలుకొనే దాన్ని ఎలాగ తెలుసుకొనగలము? ఇదే అనుశాసనము, ఇదే అమృతత్వము' అని బృహదారణ్యకోపనిషత్తు తెలియజేస్తుంది. ఆత్మజ్ఞానాన్ని ఈ ఉపనిషత్తు ఉదాహరణపూర్వకంగా వివరిస్తుంది.

4.1.2.4. ఐతరేయోపనిషత్తు:–

ఇందులో కూడా ఆత్మ ఒక్కటే మొదట ఉండేదని, అది లోకాల్ని సృష్టించాలని ఈక్షణము చేసి, నీటిని పుట్టించిందని చెప్పబడింది. నీటి నుండి పురుషుడిని సృష్టించి అతడిని కంపితుడిని చేసింది. అందులో నుండి క్రమంగా ఇతరాలు సృష్టించబడినట్లు, సృష్టి పుట్టుకను ఈ ఉపనిషత్తు తెలియజేస్తుంది.

4.1.2.5. తైత్తిరీయోపనిషత్తు:–

ఇది కూడా బ్రహ్మము, సత్తు అని చెప్పింది. బ్రహ్మము అసత్తని భావించేవాడు స్వయంగా అసత్తు అవుతాడని చెప్పింది. బ్రహ్మమును ఏవిధంగా ఉపాసిస్తే ఆవిధంగానే సిద్ధి కలుగుతుంది. శరీరం, ప్రాణం వంటి వాటికి భిన్నమైంది ఆత్మ. ఇది ఆనందమయమైంది. "దేని నుండి భూతములు జన్మించి, దేనిచే జీవించుచున్నవో, దేనివద్దకు పోవునో, ఎందు సంవేశించునో (లయమొందునో) అదే బ్రహ్మము. దానిని తెలుసుకోవాలి. అది ఆనందము. అన్న మనఃప్రాణ విజ్ఞానాదులను బ్రహ్మమని తలచుట క్రిందిస్థాయిలో జరుగును. బ్రహ్మమే అంతటనూ – ఆదిత్యునియందు, పురుషునియందు, బ్రహ్మాండపిండములందు కలదు. మనోవాక్కులు దానిని చేరలేక తిరిగివచ్చును"[8]. సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మము యొక్క లక్షణాలు. ఈ విధంగా తైత్తిరీయోపనిషత్తు ఆత్మ గురించి వివరిస్తుంది.

4.1.2.6. ప్రశ్నోపనిషత్తు:–

ఇందులో కూడ సృష్టి పుట్టుక గురించి ఉంది. ప్రజాపతి తపస్సు చేసి ఒక మిథునాన్ని సృష్టించి, వారిని సంతానం పొంది సృష్టిచేయాలని నియోగించాడు. రయి (ధనం, భూతములు), ప్రాణము – ఆ మిథునం. అంటే రయి, ప్రాణం రెండింటి కలయిక వల్ల సృష్టి ఏర్పడింది. ప్రపంచంలోని ప్రతిది ఈ

రెండింటిలో ఒకటి అవుతుంది. ఉదా:– సూర్యుడు–ప్రాణం, చంద్రుడు –రయి. వీటిలో ప్రాణం సర్వశ్రేష్ఠ. అదే ప్రజలను ధరించేది, ప్రకాశింపజేసేది.

ప్రశ్నోపనిషత్తు ముక్తిని గురించి కూడా తెలియజేస్తుంది. నదులు సముద్రంలో చేరి వాటి నామరూపాలను కోల్పోయినట్లు, బ్రహ్మను పొందినవారి నామరూపాలు అదేవిధంగా పోతాయి. అటువంటి స్థితినే జీవన్ముక్తి, అమృతత్వం అంటారు.

అనృతం పలికేవాడు సమూలంగా ఎండిపోతాడు. కాబట్టి సత్యమే పలకాలని ప్రశ్నోపనిషత్తు బోధిస్తుంది.

4.1.2.7. కేనోపనిషత్తు:–

ఈ ఉపనిషత్తులో బ్రహ్మవిద్య గురించి చెప్పబడింది. శరీరానికి భిన్నమైన ఇంద్రియాలను ప్రేరేపణ చేసే తత్వం ఆత్మ. అదే చరమ సత్యం. పూజనీయం. అదే అన్ని ప్రక్రియలకు, వస్తువులకు అంతస్తత్వం. దాన్ని తెలుసుకున్న వారు ముక్తులై అమృతులవుతారు.

బ్రహ్మం అవిషయం, చెప్పరానిది. జగత్తుకు వెనుక గల అపరిమేయశక్తి బ్రహ్మం అని ఈ ఉపనిషత్తు తెలియజేస్తుంది.

4.1.2.8. కఠోపనిషత్తు:–

దీనిలో యమ–నచికేత సంవాదం ఉంది. మరణించిన తర్వాత ఏమి జరుగుతుంది అనే విషయాన్ని చర్చిస్తుంది. మరణించిన తర్వాత, 'వారున్నారు', 'లేరు' అని విరుద్ధంగా చెప్పటం లోకంలో కనిపిస్తుంది. ఇందులో ఏది నిజం? పరలోకం ఉందా? లేదా? అనే ప్రశ్నలకు సమాధానాలను అన్వేషించడం, ఆత్మ తత్వాన్ని శోధించడం ఈ సంవాదంలోని ప్రధాన విషయం.

ఆత్మతత్వాన్ని గురించి కఠోపనిషత్తు క్రిందివిధంగా తెలియజేస్తుంది. ఆత్మ శరీర భిన్నము, అజరామరము, శాశ్వతము, అకర్త. శరీరం అనే రథానికి ఆత్మ రథి వంటిది. బుద్ధి సారథి, ఇంద్రియాలు గుర్రాలు, మనస్సు కళ్ళెము.

మానవుడు అజ్ఞానం నుండి లేచి, మేల్కొని, వరాలను పొంది బ్రహ్మను తెలుసుకోవాలి. క్షురధార లాగ దాటటానికి దుర్గమం అయింది బ్రహ్మపథం. కారణం – ప్రవచనాల చేత గాని, మేధా సంపద వల్ల గాని, బహుశ్రుతము వల్ల గాని అది లభించదు. సూక్ష్మ విషయం అయిన ఆత్మవిజ్ఞానాన్ని ఆచార్యుడు బోధించడం వల్ల తెలుసుకోవచ్చు. ఊహ వల్ల ఆత్మను గురించిన జ్ఞానం లభించదు. ఎవరిని అది వరించునో వారికే అది లభ్యమవుతుంది. వానికే తనను తాను తెలియపరుచుకొంటుంది.

ఇంద్రియాలనే రంధ్రాల ద్వారా బయటకు చూడటం మానవుడికి అలవాటు. అంతర్ముఖిత్వం లేదు. ఇంద్రియాలను అరికట్టి ముక్తి మీద అపేక్షతో లోపల ఉన్న ఆత్మను చూసేవారే ధీరులు. అలాంటి వారు కొద్దిమంది మాత్రమే. ఇంద్రియాల వల్ల, వాక్కు వల్ల, తపఃకర్మల వల్ల, దేవతోపాసన వల్ల బ్రహ్మజ్ఞానం లభించదు. "శుద్ధ జ్ఞానముచే పూతమనస్కుడైన వానికి ధ్యానము చేయుచుండ నిష్కల బ్రహ్మ దర్శనమగును. సర్వభూతములందును గూఢముగనున్న ఈ ఆత్మ బయటికి ప్రకాశింపదు"[9]. సూక్ష్మ దృష్టి కలిగినవారు మాత్రమే ఆత్మను దర్శించగలరు. అంతరంగ సత్యాన్ని చూసి, అంగీకరించి, అనుభవించిన వారికే ఆత్మ తత్త్వం తెలుస్తుంది. ఆత్మజ్ఞానాన్ని పొందినవాడే జీవన్ముక్తుడు అవుతాడు.

4.1.2.9. ముండకోపనిషత్తు:–

ఈ ఉపనిషత్తు యజ్ఞాది కర్మల్ని అదృఢమైన ప్లవములు అని అంటుంది. కర్మకాండ పరాయణులు జరామృత్యువులను పొంది, పుణ్యలోకాలకు పోయి పుణ్యము క్షీణింపగా తిరిగి మర్త్యలోకానికి వస్తారు. వీరు అవిద్యలోనే ఉంటారు. కానీ తపశ్శక్తితో, భిక్షాటన చేస్తూ ప్రశాంతమైన జీవనం గడిపే విద్వాంసులు సూర్యమార్గంలో ప్రయాణించి అమృతము, అక్షయము అయిన పరమాత్మ సన్నిధానాన్ని చేరుకుంటారు.

వేదాలలో, శిక్ష, కల్పం, వ్యాకరణం మొదలైన వాటిలో ఉండేది అపరవిద్య. అక్షరం (ఆత్మ) దేనివల్ల తెలియబడుతుందో అది పరవిద్య. పరవిద్య వల్ల బ్రహ్మమును తెలుసుకోవచ్చు.

ముండకోపనిషత్తు ముక్తిమార్గాన్ని గురించి క్రింది విషయాలను తెలియజేస్తుంది. యజ్ఞం, దానం, వేదాధ్యయనం ముక్తికి మార్గాలు కావు. సత్యం, జ్ఞానం, తపస్సు, బ్రహ్మచర్యం వల్ల బ్రహ్మమును తెలుసుకోవచ్చు. యతులు దోషాలను క్షీణింపచేసుకొని శరీరంలో దాగివున్న ఆత్మను దర్శిస్తారు. 'సత్యమేవ

జయతే' (సత్యమే జయిస్తుంది) అని చెబుతుంది ముండకోపనిషత్తు. ఇక్కడ చెప్పబడినది లౌకిక సత్యం కాదు. అంతరంగ సత్యం అనే విషయాన్ని మనం గమనించాలి. అనృతము జయించదు. అంతరంగ సత్యం వల్లనే ఋషులు సత్యానికి పరమనిధానమైన పరమాత్మను పొందుతారు. విషయాసక్తి (ప్రమాదం) వల్ల గాని, లింగ (సన్న్యాస)హీనమైన తపస్సు వల్ల కాని అది దొరకదు. సరియైన ఉపాయాల ద్వారా ప్రయత్నించిన జ్ఞాని యొక్క ఆత్మ పరమాత్మను చేరుకొంటుంది.

ఈ ముండకోపనిషత్తు క్రింది ఉదాహరణ ద్వారా ఆత్మ పరమాత్మల స్వభావాలను వివరిస్తుంది. 'జీవాత్మపరమాత్మలు ఒక వృక్షముపై ఎప్పుడూ కలిసివుండే రెండు పక్షుల వంటివి. అందులో ఒకటి ఫలాన్ని తింటుంది. మరొకటి తినకుండా చూస్తూ ఉంటుంది. ఇక్కడ జీవుడు కర్మఫలాన్ని అనుభవిస్తున్నాడు. పరమాత్మ దానికి సాక్షీభూతుడుగా నిలబడివున్నాడు. జీవాత్మ కర్మబంధంలో చిక్కుకొని దుఃఖిస్తున్నాడు. తనతో కలిసివున్న ఈశ్వరుని, అతని మహిమను ఎప్పుడైతే మానవుడు చూస్తాడో అప్పుడు దుఃఖం నుండి విముక్తిని పొందుతాడు. కర్మఫలాన్ని తింటూ, సంసారంలో పడి, దీనుడై, అనాథుడైవున్న జీవుడు పరమాత్మను తన స్నేహితుడిగా, సేవ్యమానుడిగా చూసినప్పుడు దుఃఖవిమోచనం పొందుతాడు. జీవన్ముక్తుడు అవుతాడు. ఈవిధంగా ముండకోపనిషత్తు ఆత్మతత్త్వాన్ని, దుఃఖవిమోచన మార్గాన్ని ఎంతో చక్కగా తెలియజేసింది.

4.1.2.10. మాండూక్యోపనిషత్తు:-

ఓంకారమే బ్రహ్మముగా చెపుతుంది ఈ ఉపనిషత్తు. భూత భవిష్యద్వర్తమానములు, దానికి పరమందున్నది కూడా ఓంకారమే అని ఈ ఉపనిషత్తు చెపుతున్నది.

మాండూక్యోపనిషత్తు ఆత్మకు గల నాలుగు పాదాల గురించి క్రింది విధంగా వివరిస్తుంది: 1. జాగ్రదవస్థలో బాహ్యజ్ఞానం కలదియై ఇంద్రియాలను కూడి ఉంటుంది. దీని పేరు వైశ్వానరము. ఇది స్థూలభోగి. 2. స్వప్నావస్థలో అంతరంగజ్ఞానం కలిగి వుండి ఇంద్రియాలను కూడి ఉంటుంది. దీని పేరు తైజసము. ఇది ఏకాంతభోగి. 3. ఆత్మ సుషుప్త్యవస్థలో ప్రజ్ఞానఘనము. ఏ భోగాన్ని కోరదు. ఏ స్వప్నాన్ని చూడదు. దీని పేరు ఆనందమయం. దీని భోజనం ఆనందం. ఇదే సర్వేశ్వరుడు. ఇది సర్వజ్ఞము, అంతర్యామి, సర్వసృష్టికి యోని, భూతాల ఉత్పత్తి వినాశనానికి మూలము. 4. బాహ్య ప్రజ్ఞకాని, అంతరంగ

ప్రజ్ఞకాని లేనటువంటిది, అదృష్టం, అవ్యవహారం, అగ్రాహ్యం, అలక్షణం, అచింత్యం, శాంతం, శివము, అద్వైతము కేవలం ఆత్మజ్ఞాన సారము – ఇది నాల్గవ పాదం. ఆత్మ నిజ రూపము ఇదే. దీన్ని మానవుడు తెలుసుకోవాలి. అందుకు సాధనం అంతరంగ సత్యాన్ని తెలుసుకోవడం అని మాండూక్యోపనిషత్తు బోధిస్తుంది.

4.1.2.11. కౌషీతకి ఉపనిషత్తు:–

ఇందులో పితృయానదేవయానాలను గురించి 'ఇంద్రప్రతర్దన సంవాదం', 'గార్గ్యవాలాకి–అజాతశత్రువుల సంవాదం' మొదలైనవి ఉన్నాయి. ఈ ఉపనిషత్తు ఆత్మతత్వాన్ని గురించి క్రింది విధంగా తెలియజేసింది. ఆయువే ప్రాణము. ప్రాణమే ఆయువు. ఏది ప్రజ్ఞయో అదే ప్రాణము. ఈ రెండూ కలిసి శరీరంలో ఉంటాయి. రెండూ కలిసే మరణసమయంలో బయటకు వస్తాయి. ఈ ప్రాణమే ప్రజ్ఞాత్మ, ఆనందం, అమరం. ఇది కర్మ వల్ల మార్పును పొందదు. కత్తి ఒరలో ఉన్నట్లు, పక్షి గూటిలో ఉన్నట్లు ఆత్మ శరీరంలోని కొనగోటి రోమాల వరకు నిండి ఉంటుంది.

4.1.2.12. మైత్రీ ఉపనిషత్తు:–

ఈ ఉపనిషత్తులో శాక్యాయన బృహద్రథుల సంవాదం, షడంగ యోగవిధి, చార్వాకుడైన బృహస్పతి దర్శనం, జ్యోతిషం – వీటి ప్రస్తావన ఉంటుంది. 'మైత్రి' శాక్యాయనుడికి గురువు. ఆత్మతత్వాన్ని గురించి ఈ ఉపనిషత్తు క్రిందివిధంగా తెలియజేస్తుంది. శరీరం అంతటా నిండి, స్వమహిమ చేత ప్రకాశిస్తూ, కుమ్మరి చక్రం లాగా శరీరాన్ని సంచలింపచేసే శుద్ధాత్మ ఒకటి ఉంటుంది. ఇది కాకుండా 'అవాగ్గమనం' (చేసిన కర్మను అనుసరించి ఉత్కృష్ట నికృష్ట యోనులను పొందుట) చేసే భూతాత్మ ఒకటి ఉంటుంది. ఇది కర్మప్రభావానికి లోబడుతుంది.

శకటం లాగా అచేతనమైన శరీరాన్ని ప్రేరేపించే శుద్ధము, నిత్యము, శాంతము, స్వతంత్రం అయిన ఆత్మ ఒకటి ఉంటుంది. అణువు కంటే అణువు అయినది ఆత్మ. దాని ధ్యానం వల్ల పరమపదం లభిస్తుంది. ఈవిధంగా ఆత్మస్వరూపాన్ని మైత్రీ ఉపనిషత్తు తెలియజేస్తుంది.

4.1.2.13. శ్వేతాశ్వతర ఉపనిషత్తు:-

రుద్రుని మహిమ, యోగవిధి, ప్రకృతిపురుషుల చర్చ, కపిలఋషి మహిమ, జీవబ్రహ్మల విచారము, సృష్టివివరణ, బ్రహ్మజ్ఞానం గురించిన వివరణ ఈ ఉపనిషత్తులో ఉన్నాయి.

ఈ ఉపనిషత్తు ఆత్మతత్వాన్ని క్రింది విధంగా తెలియజేసింది. బ్రహ్మచక్రంలో హంస (జీవుడు) తిరుగుతుంటాడు. జీవాత్మ పరమాత్మలో ఐక్యతను పొంది అమృతత్వాన్ని పొందుతుంది.

అజ్ఞుడు (జీవుడు), జ్ఞుడు (ఈశ్వరుడు) రెండూ కూడా చావుపుట్టుకలు లేనివి. ఇందులో పరమాత్మ (ఈశ్వరుడు) స్వతంత్రం. రెండవది అస్వతంత్రం (జీవాత్మ). ఆత్మ అనంతం, అకర్త. ప్రకృతి నశించేది లేదా ప్రధానం. అక్షరము అమృతం. రుద్రుడు క్షరముపైన, ఆత్మపైన దేవుడై శాసిస్తున్నాడు. ఎల్లప్పుడూ ఆత్మయందున్న ఈవిషయం తెలియదగింది. భోక్తృభోగ్యలు (జీవప్రకృతులు), ప్రేరకుడు (ఈశ్వరుడు) – ఇదే త్రివిధ బ్రహ్మము. బ్రహ్మత్రయము.

పైవిధంగా ఉపనిషత్తులు ఆత్మతత్వాన్ని తెలియజేస్తున్నాయి. ముక్తిని పొందగోరిన మానవుడికి అంతరంగసత్యం దర్శించడం ఒక్కటే దారి. అదే పరమ సత్యము.

4.1.3. లోకాయత దర్శనం:-

"లోకేషు ఆయతః లోకాయతః" అని వ్యుత్పత్తి. లోకులతో (ప్రజలలో) ప్రచారమందు గల ఇటువంటి దృష్టియే లోకాయతం. లోకం మాత్రమే విషయంగా గల శాస్త్రం లోకాయతం.

బ్రతికినంత కాలం సుఖంగా జీవించాలి అని చెపుతుంది లోకాయతం. మృత్యువు పొందనివాడు లేడు. తగులబడిన దేహం తిరిగి ఎలాగ వస్తుంది? అని వీరు ప్రశ్నిస్తారు. చచ్చిన తర్వాత తిరిగి రాలేము కాబట్టి బ్రతికినన్నాళ్ళు సుఖంగా జీవించాలి. అదృష్ట పారలౌకిక వాంఛతోనో, పుణ్యపాపాలనే భ్రమచేతనో శరీరాన్ని శుష్కింపజేయడం, ధనవ్యయం చేయడం అనవసరం. పరలోక సుఖం పేరుతో లేనిదాన్ని కోరుకోవడం, ఉన్న లౌకిక సంతోషాన్ని విడిచిపెట్టడం మూర్ఖత్వం అన్నది లోకాయతుల వాదన.

4.1.4. జైన దర్శనం:-

అన్నిటిలోను అన్ని లక్షణాలు ఉండవచ్చును అని జైనులు ఊహించారు. ప్రతి వస్తువు అనంతములైన ధర్మాలను కలిగివుంటుంది. ఇందులో కొన్ని వస్తువుకు ఉండే సత్తాత్మక ధర్మాలు. ఇవి స్వపర్యాయములు అని పిలువబడుతున్నాయి. మరికొన్ని వస్తువుకు లేనటువంటి నిషేధాత్మక ధర్మాలు. ఇవి పరపర్యాయములు. వీటిని బట్టి ఒక వస్తువు ఇంకొక వస్తువు నుండి వేరవుతున్నది. ఈ లక్షణాలు అనంతాలు. వీటన్నింటి కలయిక వస్తువు అని జైనదార్శనికుల అభిప్రాయం.

'సత్తు' నిత్యమూ కాదు, అనిత్యమూ కాదు. ఉత్పత్తి జరుగుతూ, నాశనం పొందుతూ, మరలా మరొక రూపాన్ని పొందుతూ ధ్రువంగా నిలిచివుండేదే సత్తు. అదే పరమాత్మ.

ఉదాహరణకు – మట్టిముద్ద నశించి కుండగా మారుతుంది. అది కూడా నశిస్తుంది. కానీ ఈ మూడు అవస్థల్లో మట్టి అనే ద్రవ్యం మాత్రం ఉంటుంది. ద్రవ్యం ఒకేసారి పరివర్తన శీలం, అపరివర్తన శీలం కూడా కలిగివుంటున్నది.

స్వజాతిని విడిచిపెట్టకుండా ఉండటమే నిత్యత్వమని జైనులు అంటారు. కుండగా ఉన్నా, మూకుడుగా ఉన్నా, మట్టిగా ఉన్నా, మట్టితనం మాత్రం పోవడం లేదు. అదే దాని నిత్యత్వం. ఆకారాల్లో మార్పుల వల్ల అది అనిత్యం.

జైనులు ఆత్మతత్వాన్ని క్రింది విధంగా దర్శించారు. జీవం అంటే ఆత్మ జ్ఞానం నుండి భిన్నం కాదు, అభిన్నం కాదు. "జీవము భూతముల పరిణామం కాదు. శరీరం దాని అధికరణం. జీవములు అనేకాలు. జీవము (ఆత్మ) సర్వవ్యాప్తియు కాదు, అణువును కాదు. అది మధ్యమ పరిణామము కలది. అనగా, శరీరమెంత యుండిన జీవము అంత ఉండును. చీమలోని ఆత్మ (జీవము) చీమ శరీరమంత ఉండును. ఏనుగులోని ఆత్మ ఏనుగు శరీరమంత ఉండును"[10]. ఎలాగంటే, దీపపు వెలుగు గది అంతటా వ్యాపించినట్లు ఆత్మ శరీరం అంతటా వ్యాపిస్తుంది. ఆత్మ, తాను ఆశ్రయించిన శరీరాన్ని బట్టి పెరుగుతుంది లేదా తగ్గుతుంది.

ఉదాహరణకు, వృక్షానికి స్పర్శేంద్రియం మాత్రమే ఉంటుంది. చీమలో స్పర్శ, రస, గంధములు మూడు ఉంటాయి. మనిషిలో స్పర్శ, రసం, గంధం, దృష్టి, శబ్దం అనే ఐదు ఇంద్రియాలు ఉంటాయి. మనస్సు ఆరవ లక్షణంగా ఉంటుంది. అందువల్ల శరీరాన్ని బట్టి ఆత్మ లక్షణాలు మారుతుంటాయి అని జైనుల అభిప్రాయం. సమ్యక్ దర్శనం, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ చారిత్రం ఈ మూడు మోక్షమార్గాలు. జైన తీర్థంకరులు చెప్పిన ఆత్మతత్త్వమందు శ్రద్ధ సమ్యక్ దర్శనం. జైన శాస్త్రాలచే చెప్పబడిన తత్త్వాల నిశ్చయంగా నెరవేర్చడం సమ్యక్ జ్ఞానం. సదాచారం లేదా శీలం సమ్యక్ చారిత్రం. అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం అనే పంచమహావ్రతాల అనుష్ఠానమే చారిత్రము. ఇవి మోక్షానికి సాధనాలు అని జైనుల అభిప్రాయం.

4.1.5. బౌద్ధ దర్శనం:–

ఆత్మతత్త్వం విషయంలో గౌతమబుద్ధుడు మధ్యేమార్గాన్ని అనుసరించాడు. ఆత్మతత్వం అంటే స్థిరమైన తన తనము. ఇది ఎందులోనూ లేదు. కారణం శాశ్వతమైన సత్త (ఆత్మ) ఏదీ లేదు. దీన్నిబట్టి బుద్ధునిది అనాత్మవాదం అని చెప్పవచ్చు. దీన్నే 'పుద్గల ప్రతిషేధవాదం' అని కూడా అంటారు. శరీరంలో ఏదో ఉంది అనుకోవడం సత్కాయదృష్టి. ఈ దృష్టి బంధహేతువని, అది నశించకుండా జ్ఞానప్రాప్తి కలగదని బుద్ధుని అభిప్రాయం. సంసారతృష్ణయే సత్కాయదృష్టికి కారణం అని బుద్ధుడు తెలియజేశాడు.

"అనుభవ కర్త, అనుభవ విషయము అగు ఆత్మ ఉన్నదని అది నిత్యముగ, అపరివర్తన శీలముగ, అనంతముగ ఉండును అని నమ్ముట కేవలము పరిపూర్ణమగు బాల ధర్మము"[11] అని బుద్ధుడు చెప్పాడు. 'ఆత్మ శరీరానికి భిన్నమైంది. అది నిత్యం, పూర్ణం' అనే వారికి బ్రహ్మచర్యం మొదలైనవి అవసరం లేదు. నిత్యాత్మకు సంశుద్ధి ఎందుకు? అలాగే 'కర్మ ఫలము లేదు, పునర్జన్మ లేదు' అనే వారికి శుభకర్మల అవసరం లేదు. ఈ విధంగా పై రెండు వాదాలను బుద్ధుడు నిషేధించాడు.

ఉన్నవి అన్నీ హేతుప్రత్యయ జనితమైన ధర్మాలు మాత్రమే. అవే స్కంధములు. జీవుడు అసలు లేడని చెపితే కొందరు మిథ్యాదృష్టిలో పడిపోయి శుభకర్మలు చేయరు. జీవుడు ఉన్నాడనని చెపితే, 'ఉన్నవి ధర్మములే, ఆత్మలేదు' అనే సిద్ధాంతాన్ని బాధించును. ఈ దృష్టి వల్ల కొందరు చెడుమార్గంలో నడుస్తారు. అందువల్ల ఆత్మకలదా? లేదా? అనే ప్రశ్న వచ్చినప్పుడు బౌద్ధులు కచ్చితంగా జవాబు చెప్పరు. బుద్ధుడు

ఆత్మశాశ్వతవాదాన్ని, ఆత్మవిచ్ఛిన్నవాదాన్ని రెండింటినీ పరిహరించి మధ్యమ ప్రతిపత్తితో ధర్మోపదేశం చేశాడని రత్నకూట సూత్రంలో చెప్పబడింది[12]. బుద్ధుడు, అష్టాంగమార్గం ద్వారా పరమపదాన్ని చేరవచ్చునని బోధించాడు. గృహస్థులు 'పంచశీల' సూత్రాన్ని పాటించాలని తెలియజేశాడు. అహింస, పరుల ఆస్తిని ఆశించకపోవడం, కామాన్ని విడిచిపెట్టడం, అసత్యం పలుకకుండా ఉండటం, మద్యం సేవించకపోవడం అనేవి బుద్ధుడు చెప్పిన పంచశీలసూత్రాలు.

4.2. వేదాంత ప్రస్థానాలు – ఆధ్యాత్మిక విద్య:-

అద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతం వంటి వేదాంతప్రస్థానాలు ఆత్మతత్త్వాన్ని వివరించటానికి ప్రయత్నించాయి. శంకరాచార్యుడు అద్వైతాన్ని, రామానుజాచార్యులు విశిష్టాద్వైతాన్ని, మధ్వాచార్యులు ద్వైతాన్ని ప్రచారం చేశారు. వీరినే త్రిమతాచార్యులు అంటారు. సృష్టి పుట్టుక, వినాశనం, ఆత్మపరమాత్మల తత్త్వం వంటివి ఈ మతాచార్యులు బోధించిన దార్శనిక తత్త్వాలు. గురుశిష్య పరంపరలో వీరి బోధనలు లోకంలో ప్రచారాన్ని పొందాయి.

4.2.1. అద్వైతం–శంకరుడు:-

ప్రపంచ మేధావుల్లో ఒకడని చెప్పదగిన వ్యక్తి శంకరాచార్యులు. ఈయన తండ్రి శివగురువు. తల్లి సతి. శంకరాచార్యులకు ఉపనయనం కాకముందే, ఐదవయేట తండ్రి మరణించాడు. శంకరాచార్యులకు మలయాళం మాతృభాష. వీరిది కాలడి గ్రామం, కేరళ రాష్ట్రం. ఎనిమిదవ యేట తల్లిని ఒప్పించి సన్న్యసించాడు. నర్మదానదీ తీరంలో గోవింద భగవత్పాదుల వద్ద దాదాపు మూడు సంవత్సరాలు వేదాంతాధ్యయనం, అద్వైత సాధన చేశాడు. కాశీవెళ్ళి, అక్కడ కొంతకాలం వేదాంతాన్ని బోధించాడు. తర్వాత బదరికాశ్రమానికి వెళ్ళాడు. తర్వాత కేరళ నుండి కాశ్మీరం వరకు తిరుగుతూ బౌద్ధులను, మీమాంసకులను, కాపాలికులను వాదంలో ఓడించాడు. 32వ యేట పరమపదాన్ని పొందాడు. ఈయన పదహారవ యేట శంకరభాష్యాన్ని రాశాడు. అద్వైత సిద్ధాంతములోనే ఆత్మతత్త్వ వివేచన కూడా కనిపిస్తుంది.

అద్వైతం–ఆత్మతత్త్వం:–

శ్రీ ఆదిశంకరాచార్యులు ఆత్మబోధ, ఆత్మబోధవివరణము అనే గ్రంథాలను రాసారు. వీటిల్లో ఆత్మతత్త్వాన్ని గురించి శంకరాచార్యులు విలువైన ప్రతిపాదనలు చేశారు.

అద్వైత మతం అనేది శంకరాచార్యులు క్రొత్తగా కనిపెట్టింది కాదు. అది అత్యంత ప్రాచీన కాలం నుండి ఈ నేల మీద ఉన్నదే. ఉపనిషత్తులన్నీ అద్వైత పరమైన అర్థాన్నే చెపుతున్నాయి. అద్వైత మతానికి మూలమంత్రం క్రింది శ్లోకం –

"బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవోబ్రహ్మైవ నా పరః"[13]

పై శ్లోకపాదంలో నాలుగు ప్రధానాంశాలు ఉన్నాయి. 1. బ్రహ్మసత్యం, 2. జగత్తు అనేది మిథ్య, 3. జీవుడే బ్రహ్మ, 4. జీవుడు బ్రహ్మకంటె ఏవిధంగానూ భిన్నుడు కాడు. 'పరమార్థసత్త' అయిన బ్రహ్మ ఒక్కడే అని, అనేకాత్మకంగా కనిపించే ఈ జగత్తు 'మాయ' అనే విషయం అద్వైత వేదాంతానికి మూలమంత్రం అని చెప్పవచ్చు. ఈ సత్యాన్ని హృదయగతం చేసుకోవాలంటే కొన్ని మూల సిద్ధాంతాల్ని తెలుసుకోవలసి ఉంటుంది. వీటిని గురించి నోరి శ్రీనాథ వేంకటసోమయాజులు గారు 'ఆత్మబోధ'కు రాసిన వ్యాఖ్యానంలో క్రిందివిధంగా తెలియజేశారు. "ఈ అద్వైత సిద్ధాంతానికి ఒక ప్రధాన తత్త్వం – 'ఆత్మ ప్రత్యయమనేది స్వయంసిద్ధమైనది' అనేది ఒకటి. జగత్తు అనేది అనుభూతి మీద ఆధారపడి ఉంది. అనుభవం ఆధారంగానే ఈ జగత్తులోని సమస్త వ్యవహారాలూ నడుస్తున్నాయి. ఈ అనుభూతి యొక్క మూలంలో ఆత్మయొక్క సత్త స్వతఃసిద్ధంగా ఉంటుంది. ఈ విషయాన్ని జగద్గురువులు చక్కగా విశదీకరించారు. ఆత్మ అనేది ప్రమాణం మొదలైన సమస్త వ్యవహారాలకు ఆశ్రయం. కాబట్టి, ఈ వ్యవహారాలన్నింటికి ముందే ఆత్మ అనేది ఉంది. ఆత్మను మనం నిరాకరించలేము లేదని, కాదని అనలేము. నిరాకరణ అనేది ఎప్పుడూ బయటి నుండి వచ్చిన వస్తువుల విషయంలో జరుగుతుంది. అంతేగాని స్వభావాన్ని నిరాకరించలేరు. అగ్ని, ఉష్ణత్వాన్ని నిరాకరించదు – వేడి అనేది అగ్ని యొక్క స్వభావం కాబట్టి. ఉష్ణత్వం అగ్నిచేత ఎన్నడూ నిరాకరింపబడదు. తెలుసుకోదగిన దానిలో (జ్ఞాతవ్య వస్తువులో) మార్పు అనేది ఉండవచ్చు గాని, జ్ఞాతలో (తెలుసుకొనేవానిలో) అన్యథాభావం (మార్పు) ఉండదు"[14] (ఆత్మబోధ–వ్యాఖ్యానం; పు.8).

ప్రతి అనుభవంలోను మనకు రెండు విషయాలు కనిపిస్తున్నాయి. 1. అనుభవించే ఆత్మ, 2. అనుభవానికి విషయం అయిన బాహ్యవస్తువు. అంటే జీవుడు – జగత్తు అని అర్థం. అయితే జీవుడు, జగత్తు అనేవి రెండూ వేరు వేరు స్వతంత్ర సత్తలుగా, అస్తిత్వాలుగా కనిపిస్తాయి. కానీ సూక్ష్మదృష్టితో చూస్తే ఆత్మసత్త ఒక్కటే ఉంటుందని తెలుస్తుంది. ఇది అద్వైతం యొక్క ప్రధాన సిద్ధాంతం.

అద్వైతం ఆత్మ తత్త్వాన్ని క్రిందివిధంగా వివరిస్తుంది. "జ్ఞానమనేది ఆత్మయొక్క స్వరూపం. అది నిత్యమైనది. చక్షురాది ఇంద్రియ మార్గాల ద్వారా పరిణతి చెందే బుద్ధియే రూపం, రసం మొదలైన వాటిని గ్రహిస్తోంది. ఈ రూపం, రసం మొదలైన ప్రతీతులన్నీ ఆత్మవిజ్ఞానానికి విషయాలుగా పుడుతున్నాయి. కాబట్టి ఆత్మజ్ఞానం ద్వారా వ్యాప్తిచెంది, ఉత్పన్నం కాని వస్తువంటూ ఏదీ ఈ సృష్టిలో లేదు. ఈ జగత్తులో ఉన్న పదార్థాలన్నీ నామరూపాలతో కూడినవే. అవి వాటిలో ఉండే కారణ శక్తితో పాటే మార్పు చెందుతూ ఉంటాయి"[15]. నామ రూపాల్లో మార్పులు జరిగినప్పటికీ ఆ మార్పులు ఆత్మశక్తిని విడిచి ఉండలేవు. కారణం కార్యశక్తుల్లో కారణశక్తి ఎల్లప్పుడూ ఉండటమే. ఉదాహరణకు, 'కుండ' అనే రూపం 'కార్యం'. ఆ కార్యానికి మూలం 'మట్టి'. ఇది 'కారణం' అవుతుంది. మట్టి లేకుండా ఎప్పటికీ కుండ ఉండదు. అలాగే 'ఆత్మ'ను విడిచిపెట్టి జగత్తు ఉండలేదు. ఇక్కడ ఆత్మ అంటే జగత్తు అంతటిలోనూ విస్తరించి ఉండే పరమాత్మ (సత్త) అని గ్రహించాలి. అలాగే వస్త్రం కార్యం. నూలు (దారం) వస్త్రానికి కారణం. నూలు లేకుండా వస్త్రం ఎప్పటికీ ఉండదు. కాబట్టి ఈ జగత్తులోని పదార్థాలన్నీ కార్యాలు. వాటికి అన్నింటికి ఏకైక కారణం బ్రహ్మ (ఆత్మ). ఈ జీవాత్మ పరమాత్మలు వేరు కాదు, ఒక్కటే.

'సత్త' అనే పదాన్ని వేదాంతంలో వాడుతూ ఉంటారు. వేదాంతంలో మూడు రకాలైన 'సత్త'ను అంగీకరిస్తారు. అవి 1. ప్రాతిభాసిక సత్త, 2. వ్యావహారిక సత్త, 3. పారమార్థిక సత్త.

1. ప్రాతిభాసిక సత్త:–

మనకు కంటికి కనిపించే సమయంలో సత్యంగా అనిపిస్తుంది, తర్వాత అది సత్యం కాదు అని తేలిపోతుంది. దీన్నే ప్రాతిభాసిక సత్త అంటారు.

ఉదాహరణకు మసక చీకట్లో త్రాడును చూసి, పాము అని భావిస్తాం. తర్వాత వాస్తవాన్ని తెలుసుకుంటాం. అంటే మనకు కనిపించినపుడు మాత్రమే అది సత్యమనిపిస్తుంది తర్వాత అసత్యమని తేలిపోతుంది.

2. వ్యావహారిక సత్త:–

ఈ జగత్తులో కనిపించే అన్ని పదార్థాలలో వ్యావహారిక సత్త అనేది ఉంటుంది. పదార్థాలకు వ్యావహారిక సత్త అనేది ఉంటుంది. పదార్థాలకు సాధారణంగా ఐదు ధర్మాలు ఉంటాయి. 1. అస్తి (అవి ప్రపంచంలో ఉండటం), 2. భాతి (ప్రకాశిస్తాయి), 3. ప్రియం (ఆనందాన్ని కలిగిస్తాయి), 4. రూపం (ఆకారాన్ని కలిగివుండటం), 5. నామం (పేరును కలిగివుండటం).

వీటిలో మొదటి మూడూ (అస్తి, భాతి, ప్రియం) బ్రహ్మస్వరూపాలు, చివరి రెండూ (నామం, రూపం) జగత్తు యొక్క స్వరూపాలు. దీన్నిబట్టి పరబ్రహ్మం ఈ జగత్తులోని పదార్థాలన్నింటిలో కలిసిపోయి ఉన్నట్లు చెప్పవచ్చు. ఆత్మసాక్షాత్కారం కలుగగానే నామరూప జ్ఞానం పోతుంది. ఆనందస్వరూపుడైన పరమాత్మ సాక్షాత్కారం లభిస్తుంది.

3. పారమార్థిక సత్త:–

పైన చెప్పిన వ్యావహారిక వస్తువులన్నిటికి భిన్నమైంది, మూడు కాలాల్లోనూ అవిచ్ఛిన్నంగా ఉండే సత్యమే పారమార్థిక సత్త. దీన్నే 'బ్రహ్మము' అంటారు.

శ్రీ నోరి శ్రీనాథ వేంకట సోమయాజులు గారు 'ఆత్మబోధ' వ్యాఖ్యానంలో బ్రహ్మ, జీవుడు అనే వాటిని గురించి తెలియజేశారు. అందులోని కొన్ని అంశాలు ఇక్కడ చెప్పబడుతున్నాయి.

బ్రహ్మ:– "నిర్వికల్పక, నిరుపాధిక, నిర్వికార సత్తను బ్రహ్మమంటారు. ఉపనిషత్తుల్లో ఇటువంటి నిర్గుణబ్రహ్మ మాత్రమే ప్రతిపాద్య విషయమని శ్రీశంకరుల అభిప్రాయం. ఎందుచేతా? నిర్గుణబ్రహ్మ మాత్రమే పారమార్థిక సత్త కాబట్టి, సగుణబ్రహ్మము అనేది జగత్తులాగానే మాయతో కూడినది"[16]. బ్రహ్మకు, 1. స్వరూప లక్షణం, 2. తటస్థ లక్షణం అనే రెండు లక్షణాలు ఉంటాయని శంకరాచార్యులు తెలియజేశారు.

స్వరూప లక్షణం అనేది సత్యము, తాత్త్వికము అయిన రూపాన్ని చెపుతుంది. తటస్థ లక్షణం అనేది ఒకానొక కాలంలో ఉండే, వచ్చిపోయే తాత్కాలిక లక్షణాల్ని చెపుతుంది.

జీవుడు:- శరీరంమీద, ఇంద్రియాల మీద శాసనం చేసేటువంటి, కర్మఫలాన్ని అనుభవించేటటువంటి ఆత్మనే జీవుడు అని శ్రీశంకరాచార్యులు తెలియజేశారు. అనిత్యమైనది పుడుతుంది. కానీ ఆత్మకు నాశనం లేదు.

మొత్తం మీద అద్వైత వేదాంతాన్ని అనుసరించి పరమాత్మకు, ఆత్మకు భేదం లేదు. ఇవి రెండూ ఒక్కటే. పరబ్రహ్మమే ఉపాధి (శరీర) సంపర్కం వల్ల జీవభావాన్ని పొందుతున్నాడు. అన్ని ప్రాణుల్లోను ఉండేటువంటి ఆత్మ పరమాత్మలో భాగమే. ముక్తిని పొందిన మానవుడు అన్ని పదార్థాల్లోనూ ఉన్నది ఒకటే బ్రహ్మం అని గుర్తించగలడు. నామ రూప భేదాలు వదులుకొని పరమాత్మలో ఆత్మ లీనమవుతుంది.

4.2.2. విశిష్టాద్వైతం – రామానుజాచార్యులు:-

విశిష్టాద్వైతం కూడా ప్రాచీనమైన వేదాంత ప్రస్థానమే. దీన్ని నాథముని, యామునాచార్యులు, శ్రీరామానుజాచార్యులు వ్యాప్తిలోకి తీసుకువచ్చారు. నాథముని శఠకోపయతి శిష్యపరంపరలోని వాడు. ఇతడు 'న్యాయ తత్త్వం' అనే గ్రంథాన్ని రాసాడు. ద్రవిడవేదం ఉద్ధరించినవాడు ఇతడే. నాథముని మనుమడు యామునాచార్యుడు. ఇతడు గొప్ప వైష్ణవ గురువు. శ్రీకృష్ణదేవరాయలు రాసిన 'ఆముక్తమాల్యద' ప్రబంధంలో యామునాచార్య వృత్తాంతం, విశిష్టాద్వైత మతస్థాపన, ఇతర మతాచార్యులతో వాదప్రతివాదాలు వర్ణించబడ్డాయి. శ్రీరామానుజాచార్యులకు పరమగురువు యామునాచార్యులు. రామానుజులు మహాపూర్ణులకు ప్రత్యక్ష శిష్యుడు. గోష్ఠిపూర్ణులు కూడా రామానుజులకు ఆధ్యాత్మిక గురువు. ఈ ముగ్గురు కూడా విశిష్టాద్వైతాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి కృషి చేశారు. ఆత్మ పరమాత్మల గురించి వీరు ఎన్నో దార్శనిక విషయాలు వెల్లడించారు.

ఈ విశిష్టాద్వైతంలో, పన్నెండు మంది 'ఆళ్వారులు' వైష్ణవమతాన్ని ప్రచారం చేసినట్లు చెపుతారు. 'ఆళ్వారు' అనే పదానికి 'జ్ఞాన సముద్రంలో మునిగి లేచినవాడు, లోతు తెలిసినవాడు' అనే అర్థాలు ఉన్నాయి.

ఈ ఆళ్వారులు క్రీ.శ.7–9 శతాబ్దాల మధ్యలో ఉన్నట్లు కనిపిస్తున్నది. వీరిలో నమ్మాళ్వారు, తిరుమంగై ఆళ్వారులు రాసిన కృతులన్నిటిని కలిపి 'నాలాయిర ప్రబంధం' అనే పేరుతో సంగ్రహించడం జరిగింది.

విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని వ్యాప్తిలోకి తెచ్చినవారిలో శ్రీరామానుజాచార్యులు ప్రముఖుడు. ఈయన చెప్పిన ప్రధాన సిద్ధాంతం. జగత్తు సత్యము. శుక్తి రజిత భ్రాంతి వంటిది కాదు. ఈ జగత్తుకు అధిపతి, లక్ష్మీపతి అయిన శ్రీమన్నారాయణుడు. అతడే పరబ్రహ్మ. ఈ సర్వజగత్తు అతని శరీరమే. శ్రీహరి కంటె జీవులు భిన్నలు. భక్తి వల్లనే మోక్షం లభిస్తుంది. బ్రహ్మానుభవం అనేది ఆ పరమపురుషప్రాప్తి. ఆత్మపరమాత్మలు ఒక్కటే అని చెప్పిన అద్వైత మతానికి ఇది భిన్నమైనది. ఆత్మ వేరు, పరమాత్మ వేరు అని విశిష్టాద్వైతం చెపుతుంది.

శ్రీరామానుజాచార్యుల 'శ్రీభాష్యసారము' గ్రంథానికి రాసిన వ్యాఖ్యానంలో కె.ఎస్. రామానుజాచార్యులు విశిష్టాద్వైతం యొక్క లక్షణాల్ని క్రింది విధంగా వివరించారు. "జీవుడు, ప్రకృతి, ఈశ్వరుడు అను మూడు తత్త్వములను వీరు అంగీకరింతురు. జీవుడు అణుపరిమాణుడు, జ్ఞానస్వరూపుడు, జ్ఞానమునే గుణముగా గలవాడు, కర్త. కాని పరమాత్మాధీనుడు. స్వతంత్రుడు కాడు. ప్రకృతి ఇరువది నాల్గు తత్త్వములుగ పరిణమించుచున్నది. ఇది జడము. అనగా జ్ఞానశూన్యము. ఇది శుద్ధసత్త్వమయము, మిశ్రసత్త్వమయము అని రెండు విధములు. శుద్ధసత్త్వమయ ప్రకృతి వైకుంఠమున నుండును. మిశ్రసత్త్వమయప్రకృతి ఈ జగద్రూపమున పరిణమించునది"[17]. అంటే ఈశ్వరుడు అధిపతి. జీవుడు ఆయన ఆజ్ఞకు లోబడి నడుచుకొనేవాడు. జీవుడు అస్వతంత్రుడు. నారాయణుడు స్వతంత్రుడు అని విశిష్టాద్వైతంలో ప్రధానంగా చెప్పబడింది.

ఈశ్వరుడు సర్వ జీవులకు నియంత. అతడు అన్ని జీవుల్లో అంతర్యామిగా ఉంటూ, వాటిని తనకు శరీరం చేసుకుంటున్నాడు. కాబట్టి జీవులకు, పరమాత్మకు గల సంబంధం – శరీర శరీరిభావం వంటిది అని విశిష్టాద్వైతం ప్రబోధిస్తుంది.

శ్రీకృష్ణదేవరాయలు రాసిన 'ఆముక్తమాల్యద'లో యమునాచార్యులు క్రిందివిధంగా వైష్ణవసిద్ధాంతాన్ని స్థాపించాడు.

“ఆది నారాయణుం డాయె నొక్కఁడ; బ్రహ్మ
లేఁడు, మహేశుండు లేఁడు చంద్రుడు,
రోదసి, లేఁడు సూర్యుఁడు, లేఁడు చంద్రుడు,
లేవు నక్షత్రము, ల్లేవు నీళ్ళు,
లేదగ్ని; యట్లుండ ‘లీల నేకాకిత
చనదు; పెక్కయ్యెద ననుచు నయ్యెఁ
జిదచిద్వ్యయంబు సొచ్చి’ యని ఛాందోగ్యంబు
దెలిపెడు; నంతరాదిత్యవిద్య
నర్కులోఁ బుండరీకాక్షుఁడతఁడు యగుట
కక్షిణీ యని యష్టదృక్త్యక్ష దశశ
తాక్ష విధి రుద్ర శక్రాదులందు నొకఁడు
కామి కాశ్రుతియే విలక్షణతఁ దెలిపె.”[18]

మొట్టమొదట నారాయణుడు ఒక్కడే ఉన్నాడు. బ్రహ్మగాని, శివుడుగాని, ఆకాశం కాని లేవు. విలాసం చేత ఒంటరిగా ఉండకూడదు కాబట్టి చేతనాలైన జీవులను, అచేతనాలైన జడపదార్థాలను శ్రీమన్నారాయణుడు సృష్టించాడు.

జీవులు, జములు మొదలైన తెగలలో ప్రవేశించి శ్రీహరియే అనేక రూపాల్లో కనిపిస్తున్నాడు అని ఛాందోగ్యోపనిషత్తు చెపుతుంది. ఆంతరాదిత్యవిద్యలో సూర్యునిలో ఉండేది నారాయణుడే అని చెప్పటానికి ‘రెండు కన్నులు కలవాడు’ అనడం జరిగింది. ముక్కంటి (శివుడు), వేగంటి (ఇంద్రుడు), చతుర్ముఖుడు అని వర్ణించలేదు. దీన్నిబట్టి నారాయణుడే (రెండు కన్నులు కలవాడే) సృష్టికి మూలం అని యామునాచార్యులు సభలో వైష్ణవాన్ని ప్రతిపాదించాడు.

సకల జీవులకు నారాయణుడే సృష్టికర్త. చివరకు అన్ని పదార్థాలు శ్రీమన్నారాయణునిలోనే లీనమవుతాయి అని యామునాచార్యులు ప్రతిపాదించాడు.

"తుల లేకుండు స్వరూప రూపగుణ భూతుల్దోఁచు నేతచ్ఛ్రుతిన్;
దలమై లో వెలిఁదానె యున్కిఁదెలిపె న్నారాయణం; బారుణం
బుల సామాన్య విశేషరీతి నిఖిలంబు న్మబ్దజాలంబు ని
ర్మల నారాయణ శబ్దమందునె తుదన్బర్యాప్తమయ్యెన్మృతిన్."[19]

ఈ ఛాందోగ్యోపనిషత్తులోనే సాటిలేనటువంటి స్వరూపం, గుణాలు, ఐశ్వర్యాలు కనిపిస్తున్నాయి. సకలచరాచర జీవుల యొక్క లోపల, వెలుపల నిండి ఉండేది నారాయణుడే అని 'నారాయణశ్రుతి' బోధిస్తుంది. వేదాల్లో 'ఆరుణములు' అనే భాగాల్లో శబ్దసమూహం అంతా సామాన్యవిశేషన్యాయం చేత, కేవల నారాయణ శబ్దమందే చివరకు పర్యవసాయం పొందుతుంది అని యామునాచార్యులు సభలో ప్రబోధించాడు. సభలోని ప్రతివాదుల్ని జయించాడు.

కపిల మహర్షి, దేవహూతికి భక్తియోగాన్ని గురించి తెలియజేశాడు. ఈ సందర్భంలోనే విశిష్టాద్వైత సిద్ధాంతాలు కూడా ప్రబోధించాడు. వైష్ణవుడైన భక్తుడు చేయవలసిన రోజువారీ పనుల గురించి కపిల మహర్షి తల్లికి క్రిందివిధంగా బోధించాడు.

"నిత్యనైమిత్తిక నిజధర్మమున గురుశ్రద్ధా గరిష్ఠతఁ జతుర పాంచ
రాత్రోక్త హరి సమారాధన క్రియలను నిష్కామనంబున నెఱిమదీయ
విగ్రహ దర్శన వినుతి పూజా వందన ధ్యాన సంశ్రవణములఁగర్మ
సంగి గాకుండుట, సజ్జన ప్రకరాభిమానంబు నొందుట, హీనులందుఁ

జాల ననుకంపఁ జేయుట, సముల యందు, మైత్రి నెఱపుట యమనియమ క్రియా
యైన యోగంబు చేత నాధ్యాత్మికాధి, భౌతికాదులఁదెలియుట పలుకుటయును"[20]

వైష్ణవుడైన వాడు స్నానసంధ్యాది నిత్యకర్మలందు, జగత్కళ్యాణార్థం చేసే యజ్ఞ యాగాది నైమిత్తిక కర్మలందు అత్యంత శ్రద్ధ కలిగి ఉండాలి. గురువులను, పెద్దలను గౌరవించాలి. 'పాంచరాత్ర' ఆగమంలో చెప్పిన ప్రకారం శ్రీహరిని నిష్కామబుద్ధితో ఆరాధించాలి. ఇవేకాక, ఉత్సాహంతో నా రూపాన్ని దర్శించడం, కీర్తించడం, పూజించడం, నమస్కరించడం, స్మరించడం, హరి చరిత్రలు వినడం, కర్మల్లో చిక్కుకోకుండా ఉండటం, తనకంటె గొప్పవాడైన ఆదరగౌరవాలు, తనకంటె తక్కువవారిపైన దయాదాక్షిణ్యాలు, తనతో

సమానమైన వారిమీద స్నేహానురాగాలు కలిగివుండాలి. యమనియమాలను పాటించడం మొదలైన సుగుణాలను అలవరుచుకోవాలి. యోగాభ్యాసం చెయ్యాలి. ఆధ్యాత్మిక, ఆదిభౌతిక, ఆధిదైవికాలను తెలుసుకొని ఇతరులకు చెప్పాలి.

పైన చెప్పిన విధంగా శ్రీహరిని ఆరాధించినవాడు మోక్షాన్ని పొందగలడు అని కపిల మహర్షి తల్లికి తెలియజేశాడు. పోతన రాసిన భాగవతంలో అంతటా వైష్ణవ సిద్ధాంతాలు నిండి ఉన్నాయి. పోతన రాసిన ప్రతిపద్యంలో శ్రీహరి కీర్తన, వర్ణన ఉంటాయి. శుకయోగి, పరీక్షిత్తుకు ముక్తి మార్గాన్ని ఉపదేశిస్తూ శ్రీమన్నారాయణుని యొక్క తత్వాన్ని క్రిందివిధంగా వర్ణించాడు.

"కలలోన జీవుండు కౌతూహలంబునఁ బెక్కు దేహంబులఁ బేరు వడసి
యింద్రియంబుల వెంట నెల్లవృత్తంబులు నీక్షించి మఱి తన్ను నెఱుఁగు కరణి
నఖిలాంతరాత్మకుఁడగు పరమేశ్వరుఁడఖిల జీవుల హృదయముల నుండి
బుద్ధి వృత్తుల నెల్ల బోధ్దమై వీక్షించు బద్ధుండు గాఁడు ప్రాభవము వలన

సత్యుఁడానంద బహుళ విజ్ఞానమూర్తి, యతని సేవింప నగుఁగాక, యన్యసేవఁ
గలుగనేరవు కైవల్య గౌరవములు, పాయదెన్నఁడు సంసారబంధ మధిప!"[21]

ఓ పరీక్షిన్మహారాజా! కలలో జీవుడు ఉబలాటంతో చాలా శరీరాలు ధరిస్తాడు. చాలా పేర్లతో వ్యవహరించబడతాడు. ఇంద్రియాల ద్వారా విశేషాలన్నీ గమనిస్తాడు. ఆ తర్వాత తనను తాను తెలుసుకొంటాడు. అలాగే అంతటికీ అంతరాత్మగా ఉన్న పరమేశ్వరుడు అన్ని ప్రాణుల హృదయాల్లో ఉండి, ప్రజ్ఞావంతుడై బుద్ధివ్యాపారాలు అన్నిటినీ పరిశీలిస్తుంటాడు. తానే అన్నిటికీ ప్రభువు కాబట్టి దేనికీ బద్ధుడు కాడు. ఆ పరమాత్మ సత్యస్వరూపుడు. ఆనందంతో నిండిన విజ్ఞానమూర్తి. ఆయన సేవ వల్లే మోక్షం కలుగుతుంది. ఇతరులను కొలిస్తే మోక్షం లభించదు. ఈ సంసార బంధం వదలదు అని శుకమహర్షి, పరీక్షిత్తుకు బోధించాడు. ఇందులో విశిష్టాద్వైత సిద్ధాంతం అంతర్లీనంగా ఉంది. శ్రీహరి ఒక్కడే దేవుడు అని చెప్పడం ఈ సిద్ధాంతంలో ప్రధానం.

శ్రీరామానుజాచార్యుల అభిప్రాయంలో ఈశ్వరుడు (పరమాత్మ) పర, వ్యూహ, విభవ, అర్చా, అంతర్యామి రూపాల్లో ఐదువిధాలుగా ఉంటాడు. అతడు లీల కొరకు జగత్సృష్టి గావిస్తాడు. జీవులు వర్ణాశ్రమ పద్ధతిలో కర్మలను ఆచరిస్తూ, తత్త్వహితమైన పురుషార్థాలను చక్కగా తెలుసుకొని, భక్తితో భగవంతుని ఆరాధించినప్పుడు, అతని అనుగ్రహాన్ని పొంది ముక్తులవుతారు. ముక్తి అంటే వైకుంఠలోకప్రాప్తి. శ్రీమన్నారాయణుడు వీరికి పరమప్రాప్యుడు. ప్రపత్తి లేదా శరణాగతి దీనికి పరమసాధనం. భక్తి ప్రపత్తులు – వివేక, విమోక, అభ్యాసక్రియా, కళ్యాణ, అనవసాద, అనుద్ధర్షణల వల్ల కలుగుతాయి.

1. వివేకం:– పరిశుద్ధాన్న భోజనాల వల్ల కలుగు కాయసిద్ధి. 2. విమోకము:– కామాది దోషరహితత్వము, 3. అభ్యాసం:– ప్రతిరోజు భగవంతుని ధ్యానించటం, 4. క్రియ:– ఫలాపేక్ష లేకుండా శ్రౌతస్మార్త కర్మలను ఆచరించటం, 5. కళ్యాణం:– సత్య–ఆర్జన–దయ, దానాది గుణాలు, 6. అనవసాదం:– బాధలు కలిగినప్పుడు అతిగా క్రుంగిపోకుండా ఉండటం, 7. అనుద్ధర్షము:– అనుకూల పరిస్థితుల్లో అతిగా ఆనందించకుండా ఉండటం. వీటివల్ల భక్తిప్రపత్తులు కలుగుతాయి. నిరంతరం వేదపఠనం, శ్రీవైఖానస పాంచరాత్రాగమాలు, ఆళ్వారుల ప్రబంధాలు విశిష్టాద్వైతులకు ప్రమాణగ్రంథాలు. పై విధంగా శ్రీరామానుజాచార్యులు విశిష్టాద్వైతాన్ని ప్రచారం చేశారు. భక్తిమార్గం ద్వారా ముక్తిని పొందవచ్చునని తెలియజేశారు. నారాయణుడే పరమాత్మ అని ప్రబోధించారు.

4.2.3. ద్వైతం – మాధ్వదర్శనం:–

ఋగ్వేదం, అధర్వవేదం, ముండకోపనిషత్తుల్లో గల "ద్వా సుపర్ణా సయుజాసఖాయౌ" అనే మంత్రం 'జీవుడు కర్మఫల భోక్త అని, ఈశ్వరుడు కాడని తెలియజేస్తున్నది. కఠోపనిషత్తులోని "ఋతం పిబంతౌ సుకృతస్య లోకే" అనే మంత్రం, జీవేశ్వరులు ఛాయాతపముల (నీడ–ఎండ) లాగా భిన్నులని చెపుతున్నది. "విశ్వతః పరమాం నిత్యం" అనే శ్రుతులు, ఈశ్వరుడు విశ్వానికి పరుడు అని, ఇతర శ్రుతులు ఆయన నివాసం పరమపదం అని చెపుతున్నాయి. సర్వభూతాలకు, కూటస్థమగు అక్షరమునకు అన్యుడు, అతీతుడు అయిన ఉత్తమపురుషుడు పరమాత్మ అని భగవద్గీత చెపుతుంది. జీవేశ్వరుల ఈ ద్వైతాన్ని లేదా భేదాన్ని

పరమార్థంగాను, శాశ్వతంగాను చెప్పే వాదమే ద్వైతవాదం. ఈ వాదాన్ని ప్రచారం చేసినవారిలో మధ్వాచార్యులు ముఖ్యులు.

మధ్వాచార్యులు ప్రతిపాదించిన ద్వైతసిద్ధాంతాన్ని సంగ్రహంగా వివరించడం జరుగుతున్నది. ధర్మాధర్మాలను అంగీకరించనివాడు సమయికాడు. కారణం వాడికి సమయ ప్రయోజనం ఉండదు కాబట్టి. ధర్మాధర్మాల సిద్ధి అపౌరుషేయ వేదవాక్యాల వల్లనే కలుగుతుంది. అవి స్వతఃప్రమాణాలు. అన్ని వేదాలకు శ్రీమహావిష్ణువే సర్వోత్తమత్వము. పరానందమైన మోక్షం ఆయన అనుగ్రహం వల్లనే కలుగుతుంది.

వేదాంత వాక్యాల్లో జీవుడికి, బ్రహ్మకు భేదం కాని, ప్రపంచం మిథ్య అని కాని ప్రతిపాదించబడలేదు. ఒకవేళ అటువంటి అభేదశ్రుతి ఉన్నప్పటికి ఉపజీవకమైన ప్రత్యక్షప్రమాణంతో విరోధించటమే అప్రమాణం అవుతుంది. ప్రపంచోపలబ్ధి, అందులో భిన్నత్వం, జీవుని అసర్వ కర్తృత్వం అన్నీ అనుభవసిద్ధమైనవి. అంతేకాకుండా ఇది చాలా ప్రమాణాలతో కూడిన సంవాదం కావటం వల్ల దృఢం. ఆత్మ, పరమాత్మల అభేద ప్రతిపాదన అన్ని ప్రమాణాలకు విరుద్ధం కావటం వల్ల అది అసత్యం. జీవుడికి, పరమాత్మకు భేదమే శ్రుతి తాత్పర్యం అని శ్రీమధ్వాచార్యుల సిద్ధాంతం.

ద్వైతవాదాన్ని గురించి 'దర్శనములు–మతములు' అనే గ్రంథంలో క్రింది విషయాలు చెప్పబడ్డాయి. "జీవేశ్వర భేదము ప్రత్యక్షానుమాన సిద్ధము కాదు, ఈశ్వరాస్తిత్వము శ్రుతిచే మాత్రమే తెలుసుకోబడవలసింది కాబట్టి. అందుకే జీవేశ్వర భేదమును చెప్పు వాక్యములు అనువాదములు కావు. సర్వప్రమాణ విరుద్ధవచనములే శ్రుతి తాత్పర్యమనుట తగదు. కాక, నానాత్వము, వస్తువులలో కల భేదము ప్రత్యక్ష సిద్ధము అయియు, శ్రుతిచే కూడ చెప్పబడిన ప్రమాణ బహుత్వముచే దానికి దార్ఢ్యమే కలుగును కాని, అప్రమాణత్వము కలుగదు. కనుకనే బహువాక్యసంవాదము, అభ్యాసము ప్రామాణ్య హేతువులని, తాత్పర్యలింగములని ఎంచబడినవి"[22]. దీన్నిబట్టి మధ్వాచార్యులు శ్రుతివాక్యాలను ప్రమాణాలుగా చూపించారు. ఇది అద్వైతానికి పూర్తిగా విరుద్ధమైన సిద్ధాంతం.

'బ్రహ్మతర్కము', 'బ్రహ్మసారము' అనే గ్రంథాలపై మధ్వాచార్యుల భాష్యాలు ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. అయితే ఆ గ్రంథాలు ప్రస్తుతం లభ్యం కావటం లదు. అనుశ్రుతంగా మాత్రమే ఈ గ్రంథాల్లోని విషయాలు కొన్ని ప్రచారంలో ఉన్నాయి.

జీవేశ్వరుల ఐక్యము ప్రత్యక్షానుమాన విరుద్ధం అని మధ్వాచార్యుల అభిప్రాయం. కారణం ఎవరికైనా 'నేను సర్వజ్ఞుడను, సర్వేశ్వరుడను, దుఃఖ దోషాలు లేనివాడను అనే అనుభవం లేదు. స్వప్నం అని తెలిసిన తర్వాత కూడా ఎవరైనా స్వప్నపుత్రుడికి ఆస్తిని ఇవ్వటానికి ప్రయత్నించడు కదా! అందువల్ల సర్వేశ్వరుని చేత సృష్టించబడి, రక్షించబడే ఈ ప్రపంచం మిథ్యకాదు. ఈశ్వరునికి భ్రాంతి లేదు కాబట్టి అందువల్ల అద్వైతం ఆమెదయోగ్యం కాదు అని మధ్వాచార్యుల వాదం. ఈవిధంగా జీవాత్మ, పరమాత్మలకు ఐక్యత అనేది ఎప్పటికీ ఉండదు. ఈశ్వరుడే సృష్టికర్త. ఈ ప్రపంచం మిథ్యకాదు. కారణం పరమాత్మ మిథ్య కాదు కాబట్టి అని ద్వైతసిద్ధాంతం తెలియజేస్తుంది.

4.2.4. భగవద్గీత – ఆధ్యాత్మికవిద్య:-

ఉపనిషత్తుల సారమే భగవద్గీత. ఇది భారతీయులకు పరమ పవిత్ర గ్రంథం. కురుక్షేత్ర సంగ్రామంలో, అర్జునుడు తనవారిని చంపటానికి కలతపడి దుఃఖించాడు. ఆ దుఃఖాన్ని పోగొట్టి అర్జునుడికి జ్ఞానోపదేశాన్ని చేయటానికి శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతను వినిపించాడు. అర్జునుడిలో ఉన్న మోహాన్ని తొలిగించటానికి శ్రీకృష్ణుడు విశ్వరూపాన్ని చూపించాడు.

మూల భారతం శాస్త్రేతిహాసం. తెలుగు భారతం కావ్యేతిహాసం. అందువల్ల మూలంలో విస్తృతంగా ఉన్న భగవద్గీతను ఔచిత్యవంతంగా సంక్షేపించి తిక్కనగారు కావ్యేతిహాసాన్ని రాసారు. అయితే మూల భగవద్గీతలోని సారం, తెలుగు భారతం అంతటా విస్తరించి ఉంది. అశ్వమేధ, ఆనుశాసనిక, స్త్రీపర్వాల్లో మూల భగవద్గీతలోని శ్లోకాలకు అనుసరణీయమైన పద్యాలు కనిపిస్తాయి.

యుద్ధరంగాన్ని చూసి, బంధుజనాన్ని చంపిన తర్వాత నేను పొందే సుఖాలు ఎందుకు? అని దుఃఖితుడైన అర్జునుడు శ్రీకృష్ణునితో ఈ క్రింది విధంగా అంటాడు.

"సరసిజనాభ! బంధుజన సంతతిఁ గయ్యపునేలఁ జూడగా
విరవిరఁబోయి మేను నిడువెండ్రుక వెట్టుచుఁ గంప మొందెఁ, జే
నిరతము గాదు గాండివము, నిల్వఁగ నోర్వవు గాళ్లు, నేను ని
ష్మరతకుఁ జాల నొల్ల, నొకఁడున్ మహియేలుట యేటి సౌఖ్యముల్?"[23]

ఓ కృష్ణా! యుద్ధరంగంలో పోరాడటానికి చేరిన చుట్టాలను అందరినీ చూశాక నాకు దుఃఖం కలుగుతోంది. శరీరం విడిపోయినట్లు అయి, గగుర్పాటు కలిగింది. వెంట్రుకలు నిట్టనిలువుగా లేచి నిక్కబోడుచుకున్నాయి. గాండీవం చేతిలో నుండి జారిపోతున్నది. కాళ్ళు నిలవటం లేదు. ఈ హింసకి నేను ఒడిగట్టలేను. ఇంతమంది చచ్చిపోయిన తర్వాత ఒంటరిగా ఈ భూమిని పరిపాలిస్తే కలిగే సౌఖ్యాలు ఏపాటివి? అని అర్జునుడు దుఃఖిస్తాడు. ఆ రణరంగంలో ఉన్న బంధువులందరినీ పేరుపేరున తలచుకొని విలపిస్తాడు.

"తాతల, మామలన్, సుతులఁ, దండ్రులఁ,దమ్ముల, నన్నలన్, గురు
వ్రాతము, శిష్టకోటి, సఖివర్గముఁ, దుచ్ఛజనామరూప దు
ర్నీతి వధించి యేఁబడయు నెత్తుటఁ దోఁగిన రాజ్యభోగముల్
ప్రీతి యొనర్చునే? యశము పెల్లాడఁగూర్చునె? పెంపొనర్చునే?"[24]

తాతలను, మామలను, కొడుకులను, తండ్రులను, సహోదరులను, గురుసముదాయాన్ని, మిత్రబృందాన్ని నీచమైన స్వార్థ ప్రవృత్తితో చంపి నేను పొందే రాజ్యసౌఖ్యాలు నెత్తుటికూడులాంటివి. అవి నాకు సంతోషం కలిగించలేవు. అవి కీర్తిని తీసుకురాలేవు అని అర్జునుడు దుఃఖిస్తాడు.

మూలంలోని భగవద్గీతలో శ్రీకృష్ణార్జునులు గురుశిష్యులగా చెప్పబడ్డారు. దుఃఖంలో కూరుకుపోయిన అర్జునుడు, తనకు జ్ఞానాన్ని ప్రసాదించి గురువుగా శిక్షించమని శ్రీకృష్ణుడిని క్రిందివిధంగా వేడుకొంటాడు.

"కార్పణ్యదోషోపహత స్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢ చేతాః
య చ్ఛ్రేయ స్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్"[25]

ఓ అర్జునా! నేను ఇది వరకు లేనివాడను కాను. నీవు కూడా ఇదివరకు లేనివాడవు కావు. అలాగే ఈ రాజులందరూ ఇది వరకు ఉన్నవారే. కాబట్టి చావే లేనివారిని గురించి దుఃఖించడం ఎందుకు?

సర్వేశ్వరుడను అయిన నేను ఏవిధంగా శాశ్వతుడనో, అదేవిధంగా జీవులు కూడా శాశ్వతమే. ఆత్మ ఒక్కటే అయినా శరీరభేదాల వల్ల బహుత్వాన్ని పొందుతున్నది అని శ్రీకృష్ణుడు అంటాడు.

ఇక్కడ అద్వైతమత సిద్ధాంతం కనిపిస్తుంది. అన్ని జీవుల్లో ఉన్న ఆత్మ ఒక్కటే. జీవాత్మలు పరమాత్మలో భాగమే. జీవాత్మ పరమాత్మలో ఐక్యతను పొందడమే ముక్తి అని చెపుతుంది అద్వైతదర్శనం. ఇక్కడ శ్రీకృష్ణుడు కూడా అర్జునుడికి అదే విషయాన్ని బోధిస్తున్నాడు. ఓ అర్జునా! ఇది నా దుఃఖం, ఇది నా భయం అని నీలో నీవే కుమిలిపోతున్నావు. కానీ ఇది సత్యం కాదు. ఈ మానవజాతి అంతా ఒక్కటే శరీరం. శరీరంలో అణువులు ఏవిధంగా అమరి ఉన్నాయో, అదే విధంగా ప్రపంచంలో జీవులు అమరి ఉన్నాయి. శరీరంలో అంతటా ఆత్మ వ్యాపించి ఉన్నట్లే, ప్రపంచంలోని ప్రతి అణువులోను పరమాత్మ అంతర్లీనంగా వ్యాపించి ఉంటాడు. మానవజాతి అంతటిలోను ప్రవహించే 'దుఃఖం' అనే భావమే నీ లోపల కూడా ప్రవహిస్తుంది. మానవజాతి అంతటిలో ప్రవహించే భయం, సంతోషం, కామక్రోధాది భావాలే నీలోపల కూడా ప్రవహిస్తున్నాయి. దీన్ని నీవు తెలుసుకో. శాశ్వతమైన పరమాత్మకు మరణం లేనట్లే, పరమాత్మ నుండి ఏర్పడిన జీవాత్మలకు కూడా మరణం లేదు.

"దేహినోఒస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా,

తథా దేహాంతరప్రాప్తి ర్ధీర స్తత్ర న ముహ్యతి"[26]

అర్జునా! జీవుడికి ఈ దేహంలో బాల్యం, యౌవనం, ముసలితనం ఎలాగ కలుగుతున్నాయో, అలాగే జీవుడు ఒక దేహాన్ని విడిచి మరొక దేహాన్ని పొందుతున్నాడు. కాబట్టి నీవు ఆ విషయంలో దుఃఖించవలసిన అవసరం లేదు. అర్జునా! సుఖదుఃఖాలను సమానంగా భావించేవాడు వివేకి అవుతాడు. అతడు సదా మోక్షాన్ని పొందుతాడు అని శ్రీకృష్ణుడు అర్జునుడికి జ్ఞానోదపదేశం చేసాడు.

శంకరాచార్యులు బోధించిన అద్వైతాన్ని, శ్రీకృష్ణుడు కూడా అర్జునుడికి బోధించాడు. ఆత్మ పరమాత్మలు వేరు కాదు అని, వాటికి నాశనం లేదని శ్రీకృష్ణుడు క్రిందివిధంగా ఉపదేశిస్తున్నాడు.

"నాసతో విద్యతే భావో నా భావో విద్యతే సతః,

ఉభయో రపి దృష్టోఒంత స్త్వనయో స్తత్త్వదర్శిభిః"[27]

"అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతం,

వినాశ మవ్యయ స్యాస్య న కశ్చిత్కర్తు మర్హతి"[28]

అసత్తు అయిన శరీరానికి సత్త (ఉండుట) లేదు. అలాగే సత్త అయిన ఆత్మకు అభావం లేదు. పండితులు ఈ విషయంలో నిశ్చయాన్ని తెలుసుకుంటారు. దేని చేత ఈ సమస్త ప్రపంచం వ్యాపించబడివుందో అట్టి ఆత్మకు నాశనం లేదు. అన్ని జీవుల్లో ఉన్నది పరమాత్మ స్వరూపమే. అందువల్ల మరణం లేని వారికోసం దుఃఖించటం సరియైనది కాదు. కాబట్టి యుద్ధం చేయుము.

వ్యాస భారతంలో శ్రీకృష్ణుడు చెప్పిన పై భావాలు అన్నిటిని తిక్కన క్రిందిపద్యంలో పొదిగించాడు.

"వగవఁగ నేమియుం దగనివారికినై హృదయంబు గుందఁగా

వగచెదు; బుద్ధి మాటలును వావిరి నాడెదు నీవు, పండితుల్

వగతురె యున్నవారికి నవశ్యవిధేయతఁ జన్నారికిం;

దెగు వగలెల్లఁ జిత్తము ప్రదీప్త వివేకమయత్వ మొందినన్"[29]

దుఃఖించ తగనివారి కోసం గుండె పగిలేటట్లు దుఃఖిస్తున్నావు. తెలివితేటలు ప్రస్ఫుటం అయ్యేటట్లు అధికంగా వాదిస్తున్నావు. మనస్సు వివేకంతో వెలుగొందితే, జ్ఞానం కలవారు బ్రతికిన వారికోసం గాని, చచ్చిపోయిన వారికోసం గాని దుఃఖించరు అని శ్రీకృష్ణుడు అర్జునుడికి జ్ఞానోపదేశం చేశాడు. అజ్ఞానంలో కూరుకుపోయిన శిష్యుడైన అర్జునుడికి పరమగురువైన శ్రీకృష్ణపరమాత్మ ఆత్మ స్వరూపాన్ని క్రిందివిధంగా తెలియజేశాడు.

వ్యాసుడి భగవద్గీతలోని క్రింది శ్లోకాలు ఆత్మతత్వాన్ని చక్కగా వివరిస్తాయి. ఇవి గీతలోని సారాంశాన్ని తెలియజేస్తాయి.

"వాసాంసి జీర్ణాని యథా విహాయ

నవాని గృహ్ణాతి నరోఽపరాణి,

తథా శరీరాణి విహాయ జీర్ణా

న్యన్యాని సంయాతి నవాని దేహీ"[30]

మనిషి ఏవిధంగా చినిగిన వస్త్రాలను వదలి కొత్త వస్త్రాలను ధరిస్తాడో అదేవిధంగా ఆత్మ జీర్ణములైన శరీరాన్ని వదిలి కొత్త శరీరాన్ని పొందుతుంది. ఆత్మకు నాశనం లేదు.

"నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః
నచైవం క్లేదయం త్యాపో న శోషయతి మారుతః"[31]

ఈ ఆత్మను ఆయుధాలు నరకలేవు. అగ్ని దహించలేదు. నీళ్ళు తడపలేవు. వాయువు వల్ల ఎండవు. ఆత్మ వీటికి అన్నిటికి అతీతమైనది.

"జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ,
తస్మా దపరిహార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి"[32]

పుట్టిన వారికి మరణం తప్పదు. మరణించిన వారికి పుట్టుక తప్పదు. కాబట్టి అనివార్యమైన ఈ విషయంలో నీవు దుఃఖించటం వల్ల ఉపయోగం లేదు.

"కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫలహేతు ర్భూర్మాతే సంగోఽస్త్వకర్మణి"[33]

ఓ అర్జునా! నీకు కర్మ చేయటంలోనే అధికారం ఉంది కానీ, జ్ఞాన నిర్ణయంలో అధికారంలేదు. ధర్మాధర్మాలతో నీకు పనిలేదు. కర్మఫలాన్ని నీవు కోరరాదు. కర్మఫలానికి నీవు కారణం కాదు. అలాగని కర్మలను చేయకుండా ఉండకూడదు. కర్మఫలాన్ని మాత్రం నీవు కోరరాదు. ఆ కర్మఫలాన్ని కోరినప్పుడే మానవుడు తిరిగి జన్మను పొందుతున్నాడు. అన్ని కర్మఫలాలను నాకే అర్పించి కర్మను ఆచరించేవాడు ముక్తిని పొందుతాడు అని శ్రీకృష్ణుడు బోధించాడు.

పై విషయాన్ని తిక్కన క్రింది పద్యంలో చక్కగా వివరించాడు. వ్యాస భగవద్గీతలోని సారాంశాన్ని చాలా తక్కువ పద్యాల్లోనే తిక్కన తెనిగించాడు.

"ఫలముల యెడ బ్రహ్మార్పణ! కలనపరుండగుచుఁగార్యకర్మము నడపన్
వలయుం దత్త్వజ్ఞానము! తలకొనినం గర్మశమము దానై కలుగున్."[34]

ఫలితాల పట్ల మమకారం విడిచిపెట్టి కర్తవ్యాలను మానవుడు నిర్వహించాలి. జయాపజయాలను భగవదర్పితం చేయాలి. తత్త్వజ్ఞానం తెలిస్తే ఇక కర్మనాశనం తానంతట అదే కలుగుతుంది అని శ్రీకృష్ణుడు అంటాడు. ఓ అర్జునా! క్షత్రియులకు ముఖ్య కర్తవ్యం యుద్ధం. అది నీవు చేయవలసిన కర్మ. దాని జయాపజయాలతో, పుణ్యపాపాలతో నీకు సంబంధం లేదు. అవన్నీ నాకు సంబంధించినవి. నీవు నిమిత్త మాత్రుడవు. కాబట్టి దుఃఖాన్ని విడిచి యుద్ధం చేయుము అని శ్రీకృష్ణుడు అర్జునుడికి జ్ఞానోపదేశం చేశాడు.

ఈ కురుక్షేత్ర సంగ్రామం ప్రతీకాత్మకం. కురుక్షేత్రం మనిషి అంతరంగానికి ప్రతీక. అందులో పద్దెనిమిది అక్షౌహిణీలతో సమానమైన భావాలు ఉన్నాయి. ఆ భావాల మధ్య సంఘర్షణ ఉంటుంది. ఈ సంఘర్షణ వల్ల మానవుడు దుఃఖాన్ని పొందుతున్నాడు. ఆ భావాలను సంహరించలేక మోహంతో నరుడు అజ్ఞానంలో పడి దుఃఖిస్తున్నాడు. ఈ సందిగ్ధావస్థలో ఉన్న నరుడికి జ్ఞానోదయాన్ని కలిగించి, మనస్సులోని భావాల్ని సంహరించి ఆనందాన్ని కలిగించటమే పరమాత్మ సంకల్పం.

మనిషికి కనిపిస్తున్న బాహ్యప్రపంచం అతని అంతరగం ప్రపంచానికి ప్రతిబింబం. అతని అంతరంగంలో ఏ భావాలైతే ఉంటాయో, వాటినే అతడు బాహ్యప్రపంచంలో కూడా దర్శిస్తాడు. ఉదా:– 'ఆ రాజును స్త్రీలు మన్మథుని గాను, యాచకులు కల్పతరువు గాను, శత్రువులు యమునిగాను తలచిరి'. ఇది ఉల్లేఖాలంకారం.

అయితే ఇక్కడ వైవిధ్యం రాజులో లేదు. అతడిని చూస్తున్న వ్యక్తుల అంతరంగ చిత్తవృత్తిలోనే వైవిధ్యం ఉంది. శృంగార భావాలు కలిగిన స్త్రీలకు అతడు మన్మథుడిగా కనిపిస్తే, భయంతో కూడిన శత్రువులకు అతడు యముడిలాగా కనిపిస్తున్నాడు. అందువల్ల మనిషి అంతరంగంలోని భావాలే, అతనికి బాహ్యప్రపంచంలో కూడా కనిపిస్తాయని చెప్పవచ్చు. అలజడితో నిండిన అంతరంగం కలిగిన వ్యక్తికి ప్రపంచమంతా నిండివున్నట్లు కనిపిస్తుంది. ఇదే విషయాన్ని శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించాడు.

ఓ అర్జునా! ఈ కురుక్షేత్ర యుద్ధానికి నీవు గాని, ధర్మరాజు గానీ కారణం కాదు. మానవజాతి అంతరంగాల్లోని యుద్ధవాతావరణానికి సామూహికమైన ప్రతిబింబమే ఈ కురుక్షేత్ర సంగ్రామం. మనిషి ఏవిధంగా తన అంతరంగంలోని సంఘర్షణ నుండి బయటకు రాలేకపోతున్నాడో, అలాగే మానవుల సమూహం అయిన ఈ సమాజం కూడా, దాని సామూహిక అంతరంగంలోని సంఘర్షణల నుండి బయటకు

రాలేకపోతుంది. మనిషి తన అంతరంగం నుండి విముక్తిని పొందటమే జీవన్ముక్తి. మనస్సు జయించటమే మోక్షం. మోక్షం వల్ల ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది అని భగవద్గీతలో ప్రబోధించాడు శ్రీకృష్ణభగవానుడు.

4.3. షడ్దర్శనాలు – ఆధ్యాత్మికవిద్య:–

ఆత్మతత్త్వాన్ని విచారించే న్యాయం, వైశేషికం, సాంఖ్యం. యోగం, మీమాంస, వేదాంతం అనే ఆరింటిని షడ్దర్శనాలుగా ప్రాచీనులు చెప్పటం జరిగింది. వీటిని వరుసగా కణాదుడు, అక్షపాదుడు, వ్యాసుడు, కపిలుడు, పతంజలి, జైమిని అనే వారు అభివృద్ధిలోకి తీసుకువచ్చారు. క్రీ.శ.10వ శతాబ్దానికి చెందిన జయంతుడు మీమాంస, న్యాయం, సాంఖ్యం, జైనం, బౌద్ధం, చార్వాకం అనే ఆరింటిని 'షట్ తర్కీ' అనే పేరుతో పిలిచాడు. క్రీ.శ.9వ శతాబ్దంలోని హరిభద్రుడు కూడా 'షట్ తర్కీ'ని అంగీకరించాడు. అయితే వైదికులు మాత్రం జైనబౌద్ధాలను దర్శనాలుగా అంగీకరించలేదు. వాటిని తొలగించి, యోగవేదాంతాలు రెండింటిని షడ్దర్శనాల్లో చేర్చారు. ఇవి ఆరు ఆత్మతత్త్వాన్ని భిన్నకోణాల్లో ఆవిష్కరిస్తున్నాయి. భగవద్గీతలోను షడ్దర్శనాలు చెప్పబడ్డాయి. భారతభాగవతాల్లోని ఉపాఖ్యానాల్లో ఈ దర్శన సిద్ధాంతాలు కనిపిస్తాయి. సంక్షిప్తంగా వాటిని ప్రస్తుతం వివరించడం జరుగుతున్నది.

4.3.1. న్యాయదర్శనం:–

ప్రమాణాలచేత అర్థపరీక్షణం చేయటమే న్యాయం. తార్కిక సూత్రాలు, ప్రమాణాలు ఆధారంగా చేసే విచారమే న్యాయశాస్త్రం. సత్యాన్ని తెలుసుకోవటానికి 'వాదాన్ని' మార్గంగా ఉపనిషత్తులు అంగీకరిస్తున్నాయి.

మిథిలాది రాజసభల్లో, విద్వత్పరిషత్తుల్లో ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా సమస్యలకు పరిష్కారాలను గుర్తించటం జరిగేది. ఈవిధంగా వివిధ పక్షముల వారి తర్కపటుత్వాన్ని పరిశీలించటానికి చేయబడిన ప్రయత్నాల నుండి న్యాయశాస్త్రం ఆవిర్భవించింది.

ఈ న్యాయశాస్త్రం గురించి మొదటి గ్రంథాన్ని రాసినవాడు అక్షపాద గౌతముడు. వాద సూత్రాల్ని, ప్రమాణ ప్రమేయాల సంఖ్యను, హేత్వాభాసాలను, కుతర్క వితండవాదాలను గురించి గౌతముడు ఇందులో

వివరించాడు. వాత్సాయనుడు దీనిపై భాష్యం రాసాడు. దిఙ్నాగుడు, గౌతమ వాత్సాయనులను తన గ్రంథంలో ఖండించాడు. అయితే క్రీ.శ.550 కాలానికి చెందిన ఉద్యోతనుడు తన వార్తికలో బౌద్ధవిమర్శలను ఖండించి, గౌతమ వాత్సాయనులను ఉద్ధరించాడు.

న్యాయం–సిద్ధాంతం:–

ఆత్మ ఉందా? లేదా? ఉంటే అది ఎటువంటిది? ఏది మంచి? ఏది చెడ్డది ఇటువంటి విషయాలకు తర్క సహితంగా సమాధానాలను వివరించటం ఇందులో ప్రధాన విషయం. ఆత్మను గురించిన మిథ్యాజ్ఞానం వల్ల రాగద్వేషాలు కలుగుతున్నాయి.

న్యాయదర్శనం క్రింది విషయాలను ప్రధానంగా తెలియజేస్తుంది. ఈశ్వరుడు, ఆత్మ లేవు అనే భావన మానవులు కలిగివుంటారు. మంచి పని చేసినా, చెడ్డపని చేసినా మనిషి కర్మ చేస్తూనే ఉంటాడు. ఈ ప్రవృత్తి ధర్మానికో, అధర్మానికో దారితీస్తుంది.

అతని పునర్జన్మకు ఈ ప్రవృత్తి కారణం అవుతుంది. వీటన్నిటికి కారణమైన మిథ్యాజ్ఞానం నశించి, తత్త్వజ్ఞానం కలిగితే ముక్తి లభిస్తుంది. దోషత్యాగం తర్వాత చేసినటువంటి కర్మలు పునర్జన్మ హేతువులు కావు. కారణం మానవుడి తృష్ణ అతని పునర్జన్మకు కారణం అవుతున్నది. ఈవిధంగా న్యాయదర్శనం ఆత్మను గురించిన మిథ్యాజ్ఞానాన్ని విడిచిపెట్టమని బోధిస్తుంది. తత్త్వజ్ఞానం పొందటానికి విద్య, ప్రతిభ, యోగం, సత్సంగం సాధనాలు అని న్యాయదర్శనం తెలియజేస్తుంది.

శ్రీకృష్ణదేవరాయలు రాసిన 'ఆముక్తమాల్యద'లో న్యాయదర్శనం ఇమిడి ఉన్నది. 'ఖాండిక్యకేశిధ్వజోపాఖ్యానం'లోని క్రింది పద్యాలు అందుకు నిదర్శనం.

"జనిసాహస్ర బహుప్రయాణమగు సంసారంపుఁ ద్రోవన్సదా
చనుచుండు న్నన మోహభేద మలమ న్సంసారి పాంథుడు, వా
సన లన్ ధూళి ముసుంగు గాఁగ; నెపుడేన్ జ్ఞానంపుటుష్ణోదకం
బునఁ దత్ఖాళన సేయు, వాని కపు డమ్మోహశ్రమంబు న్జనున్"[35]

సంసారి అయిన జీవుడు వేలకొలది జన్మలను ధరిస్తూ సంసారమార్గంలో ప్రయాణిస్తున్నాడు. అనాది కర్మలు ధూళిలో చిక్కుకొని అవిద్య అనే భ్రాంతివల్ల శ్రమలో మునిగి సర్వదా ప్రయాణం చేస్తున్నాడు. ఎప్పుడైతే 'విద్య' అనే వేడినీళ్ళ (స్నానం)చేత ఆ కర్మవాసనా ధూళిని కడుక్కొంటాడో అప్పుడు అవిద్యవల్ల కలిగిన అలసట తీరిపోతుంది. జీవుడు అనాది కర్మవాసన వల్ల మిథ్యాజ్ఞానంతో సంచరిస్తున్నాడు. అతడు విద్యవల్ల ఆ వాసనను జయించి ఆనందం పొందగలడు.

కేశిధ్వజుడు, ఖాండిక్యుడికి క్రింది విధంగా ఆధ్యాత్మికతను తెలియజేశాడు.

"ఆత్మకాని మేన నాత్మ బుద్ధియును న
స్వంబునందు మిగుల స్వత్వమతియు,
నవనివర, యవిద్య యను మహాతరువు ను
త్పత్తి కీద్వయంబు విత్తు మొదలు"[36]

ఓ రాజా! తాను కానటువంటి దేహం పట్ల తాను అనే భావాన్ని, బంధుమిత్ర కళత్ర పుత్రాదులు తనవారు అనే తలంపును, ఈ రెండూ అజ్ఞాన మహావృక్షానికి ఆదిబీజము. కేశిధ్వజుడు, ఆత్మతత్త్వాన్ని క్రిందివిధంగా వివరించాడు. వాదప్రతివాద రూపంలో, తర్కసహితంగా ఆత్మతత్త్వాన్ని ప్రతిపాదిస్తున్నాడు కేశిధ్వజుడు.

"వపు రుపభోగ్యముల్ నృప గృహక్షేత్రాదు;
లవి బొంది వొఁగాక యాత్మవగునె?
యట్లన పుత్రపౌత్రానీకములు నాత్మ
కాని మైఁబుట్టుటఁగావు తనవి;
గాన మృత్యువుఁగను కాయంబున జనించు
పుత్త్రాదులెడ స్వత్వబుద్ధి దగదు;
ఎపుడేని యాత్మ వేఱే యనునప్పుడె
యడరు భోగంబు లీయాత్మ కంట;
వట్లుగా కీయెడలె యాత్మ యన్న నంటు;

మృద్గృహము నిల్చు నెట్లుక్క మృజ్జలాది
నట్లు భౌతికభోగాశనాది భౌతి
కాంగములు నిల్చు; భోగ మిందాత్మకెద్ది?"[37]

ఓ రాజా! ఇండ్లు, కళత్రాలు మొదలైనవి దేహానికి సంబంధించిన భోగ్యాలు. కాబట్టి అవి దేహానికే చెందుతాయి గాని ఆత్మకు చెందవు. అలాగే దేహం వల్ల పుట్టిన పుత్రపౌత్రులు దేహానికి చెందినవారే కాని ఆత్మకు కాదు. కాబట్టి నాశనం పొందే దేహానికి చెందిన పుత్రాదుల పట్ల తనవారు అనే మోహం పనికిరాదు. మట్టియిల్లు మట్టితో అలికినప్పుడే నిలుస్తుంది. అలాగే పంచభూతాలతో తయారైన శరీరం పాంచభౌతిక భోగానుభవాల వల్లనే నిలుస్తుంది. భౌతికం కానటువంటి ఆత్మకు, భౌతికాలైన ఈ భోగాలు అంటవు.

భారత భాగవతాల్లోనూ న్యాయదర్శనానికి సంబంధించిన విషయాలు కనిపిస్తాయి. ఆత్మ పరమాత్మల స్వరూపాల్ని తర్కసహితంగా, వాదప్రతివాదరూపంలో చర్చించడం జరిగింది. మహాభారతంలోని శాంతిపర్వంలో, పంచశిఖుడు అనే బ్రాహ్మణుడు జనక మహారాజుకు ఈవిధంగా ఆత్మజ్ఞానాన్ని బోధించాడు.

"వినుము సత్త్వాది గుణముల ననఘ! యాత్మ
తత్త్వమున లీనములఁజేయఁదన్మయత్వ
దర్శనము దాన నవి మహోదధి నడంగు
నేఱు లట్టుల రూపఱు వేఱులేక"[38]

ఓ జనకమహారాజా! వినుము. సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణాలు మూడింటినీ ఆత్మతత్త్వంలో – జీవుడి నిజస్వభావంలో లీనం చేయాలి. అప్పుడు అవి ఆత్మలో కలిసిపోయి, విడిగా ఉండకుండా సముద్రంలో కలిసిపోయే ఏరుల లాగా నిరాకారంగా సాంతమైన ఉనికి లేకుండా అయిపోతాయి. అంతేకాదు,

"నరుఁడు సుఖదుఃఖములవెంటఁ బొరయ నీక
మలచి యాత్మునిఁ జేర్చిన మానసంబు
లీనమగు నంద జలములలోన నిడిన

లవణకణము చందమ్మున నవనినాథ!"[39]

ఓ రాజా! నరుడు తన మనస్సును లౌకికాలైన సుఖదుఃఖాల వెంటబడిపోకుండా అంతర్ముఖంగా త్రిప్పివేసి, ఆత్మలో చేర్చగలగాలి. ఆవిధంగా ఆత్మలో చేర్చబడ్డ మనస్సు ఆ ఆత్మలోనే, నీళ్ళలో చేర్చిన ఉప్పుగల్లు లాగా కలిసిపోయి తన ఆకారాన్ని కోల్పోతుంది. ఓ జనకరాజా! కుబుసం విడిచిన పాము విలాసంగా ప్రకాశిస్తుంది. అలాగే కర్మ సంపర్కం వదలిన ఆత్మ, నిరాధారమై స్వతఃప్రకాశవంతమైన ఆత్మజ్ఞానంతో ప్రజ్వలిస్తుంది. అదే ముక్తిస్థితి. పై విధంగా ఆత్మజ్ఞానం పొందిన జనకమహారాజు, మిథిలానగరం తగలబడిపోతున్నా, అది తన ఆత్మకు అంటదని నిర్లిప్తంగా ఉండిపోయాడు.

పోతనగారు భాగవతంలో ఆత్మపరమాత్మల తత్త్వాన్ని సోదాహరణంగా వివరించాడు. తార్కికపద్ధతిలో, కార్యకారణ సమన్వయంతో, వాదనాపటిమతో పోతనగారు ఆత్మతత్త్వాన్ని ఆవిష్కరించారు. భాగవతంలో ఇటుంటి సందర్భాలు చాలా ఉన్నాయి. వాటి సారాంశాన్ని ఇక్కడ గ్రహించడం జరిగింది.

"లలిత విలోల నిర్మల జలప్రతిబింబిత పూర్ణచంద్ర మం
డలము దదంబుచాలన విడంబన హేతువు నొందియున్ వియ
త్తలమునఁ గంప మొందని విధంబున సర్వశరీర ధర్మముల్
గలగి రమించు నీశునకుఁ గల్గఁగ నేరవు కర్మబంధముల్"[40]

భగవంతుడికి జీవుడు పడే చిక్కులూ, బాధలూ బంధనాలూ ఏవీ అంటవు. అది ఎలాగంటే, అందంగా అటూ ఇటూ కదులుతున్న స్వచ్ఛమైన కోనేటి నీటిలో ప్రతిబింబించే సంపూర్ణ పూర్ణిమా చంద్రబింబం ఆ నీటి కదలిక వల్ల కదులుతున్నట్లు కనిపిస్తుంది. జలం కదలిక వల్ల ప్రతిబింబం కదిలినా ఆకాశంలో ఉన్న చంద్రబింబం ఏమాత్రం చలించదు. అదేవిధంగా అన్నిజీవుల్లో శరీర ధర్మాలను కలిగి క్రీడించే ఈశ్వరుడికి కర్మబంధాలు ఏ మాత్రము అంటవు అని విదురునికి మైత్రేయుడు బోధించాడు.

మైత్రేయుడు విదురునికి క్రిందివిధంగా మోక్షమార్గాన్ని ఉపదేశించాడు.

"నరునకు నాత్మ దేహజగుణంబులఁ బాపఁగ నోపుఁబంకజో
దర చరణారవింద మహితస్ఫుట భక్తియ; యింద్రియంబు లీ

శ్వర విషయంబులైన మది సంచితనాశ్చల తత్త్వమైనచో

సరసిజనేత్రు కీర్తనమె చాలు విపద్దశలన్ జయింపఁగన్"[41]

మానవుడికి, తన శరీరం నుండి పుట్టిన గుణాలను పోగొట్టడానికి నారాయణుని పాదసరోజాల మీద విశేషించి భక్తి ఒక్కటే చాలు. అలాగే ఆపదలను తొలగించుకోవడానికి పంచేంద్రియాలను భగవంతుని ఆధీనం చేసి మనస్సును చలించని ఉన్నతమైన ఏకాగ్రభావంతో నింపి ఆ శ్రీహరిని సంకీర్తనం చేస్తే చాలు. సర్వకర్మలు తొలిగిపోయి మోక్షం సిద్ధిస్తుంది.

పై విధంగా న్యాయదర్శనం ఆత్మతత్త్వాన్ని వివరిస్తుంది. కర్మబంధాలనుండి విముక్తి పొందటానికి ఆత్మజ్ఞానం పొందడం ఒక్కటే మార్గమని, అది పునర్జన్మ లేకుండా చేస్తుందని చెపుతుంది. తార్కికమైన వాదనతో ఆత్మతత్త్వాన్ని ఆవిష్కరిస్తుంది ఈ న్యాయదర్శనం.

4.3.2. వైశేషిక దర్శనం:–

దీన్ని పూర్వం కణాదుడు అభివృద్ధి చేశాడు. అణువాదాన్ని గ్రహించి, దాన్ని వైదిక ధర్మానికి అనుకూలమైన రీతిలో కణాదుడు అభివృద్ధి చేశాడు. బౌద్ధుల అనాత్మ వాదానికి, నిస్సత్త్వ సిద్ధాంతానికి, వేదనిందకు తావులేనిది అణువాదం. కణాదుడు రాసిన 'వైశేషిక సూత్రము' ఈ దర్శనానికి మొదటి ముఖ్య గ్రంథం. దీన్ని ఆధారంగా చేసుకొని ప్రశస్తపాదుడు 'పదార్థధర్మ సంగ్రహము'ను రాసాడు. ఇతడు వైశేషికదర్శనాన్ని ఎంతో విస్తరింపజేశాడు. 15వ శతాబ్దంలోని శంకరమిశ్రుడు, కణాదసూత్రాలపై 'ఉపస్కారము' అనే గ్రంథాన్ని రాసాడు.

వైశేషికం–సిద్ధాంతం:–

"అభ్యుదయ, నిశ్రేయస్సులను కలిగించునది ధర్మము. అభ్యుదయ మనగా లౌకిక సుఖము, నిశ్రేయస మనగా మోక్షము అని కొందరి వ్యాఖ్య. 'అభ్యుదయ మనగా తత్త్వజ్ఞానము, నిశ్రేయస మనగా మోక్షము' అని ఉదయనుడు. ధర్మమును చెప్పునది వేదము. దానికే ఆ విషయమున ప్రామాణ్యము. ధర్మ విశేషముచే తత్త్వజ్ఞానమును, దానిచే నిశ్రేయస్సును కలుగును"[42]. ఇది వైశేషిక దర్శనం.

వర్ణాశ్రమ ధర్మానికి అనుకూలమైన కర్మలను ఆచరించటం వల్ల ఒక పురుషగుణము ఉత్పన్నమవుతుంది. అదే ధర్మం. అయితే ఆ కర్మలను ప్రయోజనాపేక్ష లేకుండా నిష్కామంగా ఆచరించాలి. దానివల్ల భావం (చిత్తం), ప్రసాదగుణాన్ని (శుద్ధి) పొంది ఒక ధర్మ విశేషం ఉత్పన్నమవుతుంది. అది తత్త్వజ్ఞానాన్ని కలిగిస్తుంది. యమనియమాది 'ఆత్మకర్మలు' కూడా మోక్షాన్ని కలిగించలేవు.

తత్త్వజ్ఞానం కలగటం వల్ల, ఆత్మకర్మల వల్ల కలిగే దోషాలు నశిస్తాయి. మోక్షం సిద్ధిస్తుంది. వైదిక కర్మల వల్లనే ధర్మప్రాప్తి కలుగుతుంది. మనస్సు, ఆత్మలో స్థితమైనప్పుడు అది కర్మ రహితమవుతుంది. అప్పుడు శరీరానికి దుఃఖం నుండి విముక్తి లభిస్తుంది. అదే జీవన్ముక్తి. పైవిధంగా వైశేషిక దర్శనం వైదిక కర్మల ఆచరణను ప్రాధాన్యతను వివరిస్తుంది. నిష్కామంగా చేసే కర్మల వల్ల పునర్జన్మ నుండి విముక్తి లభిస్తుంది, అదే ఆత్మసాక్షాత్కారాన్ని కలిగిస్తుంది అని ఈ దర్శనం తెలియజేస్తుంది.

ఆంధ్ర మహాభారతంలోని చాలా ఉపాఖ్యానాల్లో వర్ణాశ్రమధర్మాల గురించి, వాటి నిర్వహణ వల్ల కలిగే ఇహలోక, పరలోక సుఖాల గురించి వివరించబడింది. ధర్మాచరణం వల్ల కలిగే 'విశేషం'. ఇది తత్త్వజ్ఞానాన్ని, మోక్షాన్ని ఇస్తుంది. శాంతిపర్వంలో భృగుమహాముని, భరద్వాజమహర్షికి క్రింది విధంగా ఆచారాలను తెలియజేశాడు.

“గురునకు భక్తుడై పరమాదరమున వే
దాభ్యాస మెప్పుడు నాచరించు
చును, శౌచశీలత వినయంబు త్రిషవణ
స్నానంబు భాస్కరానలసపర్య
పాటించుచుండుట బ్రహ్మచారికి వృత్తి
ధనధాన్యములు గర్హితములు గాని
తెరువునఁబడసి యతిథిపూజ మున్నుగా
నన్నపానాది భోగానుభవముఁ
బొందువాఁడు గృహస్థుండు; గందమూల
శాక ఫలము లాహారంబు శయ్యభూమి

వననివాసికి నిస్సంగవర్తనమున

భిక్ష బ్రదుకుగ యతి శాంతిఁ చేర్చియుండు"[43]

బ్రహ్మచర్యం నాలుగు ఆశ్రమాల్లో మొదటిది. బ్రహ్మచారి గురుభక్తి కలిగి, నిరంతరం వేదాభ్యాసం చేస్తూ ఉండాలి. శుభ్రతను పాటించాలి. మూడు పూటలా అణకువతో హోమాలు చేయాలి. ప్రతిరోజు సూర్యుడిని, అగ్నిని క్రమం తప్పకుండా ఆరాధిస్తూ ఉండాలి. ఇది బ్రాహ్మణధర్మం. ఇక గృహస్థుడు ధర్మమార్గంలో ధనధాన్యాలను పొందాలి. అతిథి సత్కారం చేస్తూ ఆ తర్వాత భోజనపానీయాలను స్వీకరించాలి. అన్ని ఆశ్రమాల వారికి గృహస్థాశ్రమం మూలాధారం. వానప్రస్థ ఆశ్రమానికి ఆహారం – కందమూలాలు, కూరలు, పండ్లు మాత్రమే. అతడి పడక నేలమీద. ఇక సన్యాసి అనాసక్త ప్రవృత్తిలో బిచ్చమే జీవనంగా శాంతితో మెలుగుతూ ఉండాలి అని భృగుమహర్షి తెలియజేశాడు. ఈ ధర్మాచారణ నియమంతో, ఫలాపేక్ష లేకుండా ఆచరిస్తే ముక్తిపదం లభిస్తుంది అని భృగుమహర్షి, భరద్వాజునికి బోధించాడు.

భృగువు ఇంకా కొన్ని ధర్మాలను బోధించాడు.

"ఈ లోకం కర్మభూమి. ఇక్కడ నరులు కర్మలు చేస్తారు. కేవలం కర్మాచరణకే ఉద్దిష్టమైంది ఈ లోకం. పరలోకం కర్మల ఫలితాల అనుభవాలకు నిలయమైంది. కాబట్టి దాన్ని భోగమభూమి అనవచ్చు. అయితే ఈ భోగభూమిలో ప్రవేశం పొందాలంటే ధర్మాచరణ ఒక్కటే మార్గం. సత్యవ్రతపాలన, శుభ్రతను పాటించడం, మంచితనంతో వ్యవహరించటం, దయకలిగి ఉండటం మొదలైన మంచి లక్షణాలు లేనివారు ఆ పరలోకాన్ని పొందలేరు" అని భరద్వాజుడికి బోధించాడు[44].

మహాభారతంలోని ఆనుశాసనికపర్వంలో, శివుడు పార్వతీదేవికి వర్ణాశ్రమధర్మాలను, వాటివల్ల కలిగే ప్రయోజనాలను బోధించాడు. గృహస్థుడు వర్ణాశ్రమధర్మాల్ని పాటించడం వల్ల ప్రవృత్తి, నివృత్తి ధర్మాలను ఏవిధంగా సాధించవచ్చో శివుడు పార్వతికి క్రింది విధంగా బోధించాడు.

"అంబుజసూతి యేర్పడ గృహస్థ సమర్థముగాఁ బ్రవృత్తి ధ

ర్మంబు నొనర్చె; నార్యజన మాన్యము దాని తెఱంగు చాల సూ

క్ష్మం; బతి కాంక్షలేక తగుకాలమునన్ సమచిత్తవృత్తి ని

త్యంబును ధర్మముఖ్యముగ నర్థముఁ గామముఁ జల్పు టొప్పగున్"[45]

ఓ పార్వతీ! బ్రహ్మదేవుడు గృహస్థుడికి తగినట్లు ప్రవృత్తి ధర్మాన్ని కల్పించాడు. అది పెద్దలందరి చేత ఆదరించబడింది. ఆ ప్రవృత్తి ధర్మం మిక్కిలి సూక్ష్మమైంది. గృహస్థుడు ధర్మమే ప్రధానంగా భావించి ద్రవ్యాన్ని ఆర్జించాలి. ఆర్జించిన ధనంతో ధర్మానికి హాని కలుగకుండా భోగాలను అనుభవించాలి. ఈవిధంగా ధర్మమార్గంలో గృహస్థుడు అర్థకామపురుషార్థాలను పొందటం మంచిది అని శివుడు తెలిపాడు.

శివుడు నివృత్తి మార్గం గురించి క్రింది విధంగా పార్వతిదేవికి తెలియజేశాడు.

"అతడు నివృత్తి ధర్మము ప్రయత్నమునన్ వివరించె మోక్షణో
ద్యత మది తత్ప్రకారములు దాంతియు భూతచయంబుపై దయా
రతియును సత్యదృష్టియు విరాగత యింద్రియకోటికిన్ దృఢ
స్థితముగఁజేసి యోగనిరతిం బరిశాంతి యొనర్చికొంటయున్"[46]

ఓ పార్వతీ! బ్రహ్మదేవుడు నివృత్తి ధర్మాన్ని పూనికతో వివరించారు. ఈ నివృత్తి ధర్మం వల్ల ముక్తిని సాధించవచ్చు. వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ అనే ఐదు కర్మేంద్రియాలను యోగ్యకర్మల్లో ప్రవర్తింపజేయటం వల్ల, జీవులపై దయగలిగి ఉండడం వల్ల ముక్తిని పొందవచ్చు. సత్యంపై దృష్టి ఉంచటం, ఆత్మ కంటె ఇతరమైన వాటి పట్ల విరక్తి, యోగసాధన, గట్టి నిలకడ వల్ల సంపూర్ణమైన శాంతి కలుగుతుంది. ఈవిధంగా నివృత్తి ధర్మంలో ఇంద్రియాలను అణచివేసి, మనస్సును ఆత్మలో లయంచేసి ముక్తిని పొందటం జరుగుతుంది అని శివుడు, పార్వతికి బోధించాడు. ధర్మవిశేషం వల్లనే తత్త్వజ్ఞానం, మోక్షం కలుగుతాయని శివుని బోధనలోని సారాంశం. పోతన భాగవతంలోనూ ఇటువంటి వర్ణాశ్రమ ధర్మాలే చెప్పబడ్డాయి. నారదుడు, ధర్మరాజుకు క్రిందివిధంగా వర్ణధర్మాల్ని బోధించాడు.

ఓ ధర్మరాజా! "అన్ని వర్ణాల ప్రజలకు సత్యం, సంతోషం, సమదృష్టి, సదసద్వివేకం, శౌచం, క్షమ, దయ, దానం, మార్దవం, మనోనిగ్రహం, మహాజనసేవ, మితభాషిత్వం, ఇంద్రియజయం, బ్రహ్మచర్యం, ప్రాణుల్లో పరమాత్మ దర్శనం, అభేదబుద్ధితో ప్రవర్తించటం, ఉపవాసం, ఉచితజపం, అహింస, ఆత్మావలోకనం, అన్నోదకాలు పంచియివ్వటం, అసభ్య వాంఛలూ, అనర్థకమైన క్రియలూ విడిచిపెట్టడం, శ్రీమన్నారాయణుని స్మరణం, కథాశ్రవణం, నామ సంకీర్తనం, సేవాభావం, ఆరాధనం, నమస్కృతి, దాస్యం,

సఖ్యం, ఆత్మ సమర్పణం– అనే ముప్పయి లక్షణాలు ఉండాలి"[47]. పై లక్షణాల వల్ల ధర్మ విశేషం కలుగుతుంది. అది తత్త్వజ్ఞానాన్ని, మోక్షాన్ని కలిగిస్తుందని నారదుడు, ధర్మరాజుకు బోధించాడు.

ప్రహ్లాదుడు తత్త్వజ్ఞానాన్ని తనతోటి బాలురకు క్రిందివిధంగా బోధించాడు. "బాలకులారా! గురువులకు సేవ చేయటం, సమస్త ఫలితాన్ని భగవంతునికి సమర్పించటం, సజ్జనులతో స్నేహం చేయటం, దేవుని విగ్రహాన్ని ఆరాధించటం, శ్రీహరి కథాశ్రవణం, వాసుదేవ మననం, నారాయణ సంకీర్తనం, విష్ణుపాద ధ్యానం, విరాట్ స్వరూప దర్శనం, పూజనం మొదలైనవి జ్ఞాన వైరాగ్యాలను కలిగిస్తాయి. ఇవి భాగవత ధర్మాలు. ఈ ధర్మాలపై ఆసక్తి కలిగి ఉండాలి. ఈశ్వరుడైన భగవంతుడే ఆత్మ స్వరూపంతో సర్వప్రాణికోటిలోనూ ఉన్నాడని తెలుసుకొని మనం వాటిని ఆదరించాలి. కామక్రోధాది అరిషడ్వర్గాలను జయించి ఇంద్రియాలను అరికట్టాలి. ఈవిధంగా భక్తితో భజిస్తే భగవంతుడైన శ్రీహరి సాన్నిధ్యం తప్పకుండా లభిస్తుంది" అని ప్రహ్లాదుడు రాక్షస బాలకులకు బోధించాడు[48].

పై విధంగా వైశేషిక దర్శనం ధర్మాచరణకు ప్రాధాన్యతను ఇస్తుంది. వైదిక సంప్రదాయంలోని వర్ణాశ్రమ ధర్మాలను ఆచరించటం వల్ల ధర్మ విశేషం ఏర్పడుతుంది. అది ఆత్మజ్ఞానాన్ని, మోక్షాన్ని ఇస్తుందని ఈ దర్శనం ప్రబోధిస్తుంది.

4.3.3. సాంఖ్యదర్శనం:–

'సాంఖ్యం' అనగా సమ్యక్ ఖ్యాతి, సరియైన జ్ఞానం, ప్రకృతిపురుషుల వివేకం అనే అర్థాలున్నాయి. ఇది 'సంఖ్య'కు ప్రాధాన్యమిచ్చే శాస్త్రం. ఇందులో గుణాలకు, ప్రకృతి పరిణామాలకు సంబంధించిన లెక్క (సంఖ్యానం) ఉంటుంది. అందువల్ల దీన్ని సాంఖ్యదర్శనం అంటారు. దీన్ని బుద్ధుడికి పూర్వుడు అయినటువంటి 'కపిలుడు' ఒక దర్శనంగా అభివృద్ధి చేశాడు. కపిలుడు రాసిన గ్రంథాలు ప్రస్తుతం లభించడం లేదు. ప్రస్తుతం కపిలమహర్షి పేరుతో ప్రచారంలో ఉన్న 'సాంఖ్యప్రవచనసూత్రం' తర్వాతి వారు రాసినది మాత్రమే. ఈ సంప్రదాయంలో కపిలుడి తర్వాత ఆసురి, పంచశిఖుడు ప్రసిద్ధిగాంచారు.

మరణానంతరం చైతన్యం నశిస్తుందని పంచశిఖుడు నమ్మినట్లు మహాభారతం వల్ల తెలుస్తున్నది. ప్రకృతిపురుష విభాగంతో కూడిన 'వ్యుత్పన్నసాంఖ్యము' – మైత్రాయణీ ఉపనిషత్తులో కనిపిస్తుంది. భాగవత

పురాణంలో కూడా కపిలుడు ఈశ్వరవాది అని, శ్రీహరి అవతారమని చెప్పబడింది. భగవద్గీతలో సాంఖ్యవేదాంతులను, సమన్వయించే ప్రయత్నం కనిపిస్తుంది. ప్రస్తుతం లభిస్తున్న సాంఖ్యశాస్త్ర గ్రంథాల్లో ప్రాచీనమైనది ఈశ్వరకృష్ణని 'సాంఖ్యకారిక' (3వశ.). దీన్ని క్రీ.శ. 6వ శతాబ్దంలో 'పరమార్థుడు' చైనా భాషలోకి అనువదించాడు. ఈవిధంగా సాంఖ్యదర్శనం లోకంలో ప్రచారం పొందింది. ప్రకృతి పురుషుల గురించిన చర్చ, సంఖ్యకు ప్రాధాన్యతను ఇవ్వటం ఈ దర్శనంలోని ప్రధాన అంశాలు.

సాంఖ్యం–సిద్ధాంతం:–

సమస్త విశ్వానికి మూలం ఒక్కటే పదార్థం. అది ప్రకృతి. 'ప్రకరోతీతి ఇతి ప్రకృతి' అని వ్యుత్పత్తి. 'బాగా కార్యసాధన చేసేది' ప్రకృతి అని అర్థం. సాంఖ్యదర్శనం ప్రకారం, కార్యం ఎప్పుడూ కారణాన్ని బట్టి ఉంటుంది. 'కార్యకారణ సంబంధం అంటే పరిణామమే' అనే వాదం – సత్కార్యవాదం. దీన్నిబట్టి, 'విశ్వకారణం తనలో, సూక్ష్మరూపంలో విశ్వాన్ని కలిగి ఉండాలి. దాని క్రమపరిణామం వల్లనే యావత్ విశ్వం ఆవిర్భవించి ఉండాలి' అనేది వీరివాదం.

'ప్రకృతి'కాక, 'పురుషుడు' అనే మరో పరమతత్త్వం ఉంటుంది. పురుషుడు అకర్త, గుణరహితుడు. సాంఖ్యులు 'పురుషుడి' తత్త్వాన్ని క్రిందివిధంగా భావిస్తారు. "1. వస్తువు లన్నియు సంఘాతములు (సముదాయములు). అచేతన సంఘటిత వస్తువులన్నియు ఎవరో ఒకరి కొరకై యుండును. అవి పురుషుల కొరకైయున్నవి. 2. ప్రకృతి వికృతులు త్రిగుణాత్మకములు. వీటికి విపరీతమైనది, వీటి ననుభవింప గలిగినది ఏదో ఉండవలెను. అదియు త్రిగుణాత్మకమైన ప్రకృతి వలెనే ఇతరుల కొరకే అగును. కాన పురుషులు త్రిగుణ రహితులు. 3. చేతనాధిష్ఠానము లేనిదే జడపదార్థములలో ప్రవృత్తియుండదు. ప్రకృతి ప్రవృత్తికి అధిష్టానమగు చేతన వస్తువు ఉండవలెను. 4. వస్తువు లన్నియు భోగ్యములుగా కానవచ్చుచున్నవి. వీటికి భోక్తలుండవలెను. 5. కైవల్యము కొరకు కనీసము కొందరిలోనైనను ప్రవృత్తి కనబడుచున్నది. త్రిగుణాత్మక పదార్థమేదియు ఇట్లు ముక్తికి యోగ్యము కాదు"[49]. పైవిధంగా ప్రకృతిపురుషుల తత్త్వాలను వివరిస్తారు.

భగవద్గీతలో 'సాంఖ్యయోగం' చెప్పబడింది. విషాదంతో యుద్ధం చేయనని అర్జునుడు శ్రీకృష్ణుడితో అంటాడు. అప్పుడు శ్రీకృష్ణుడు సాంఖ్యపద్ధతిలో ఆత్మతత్త్వాన్ని తెలియజేస్తాడు. పరిశుద్ధమైన ఆత్మతత్త్వజ్ఞానమే సాంఖ్యం. శ్రీకృష్ణుడు అర్జునుడితో క్రిందివిధంగా పలుకుతున్నాడు.

"ఏషా తేభిహితా సాంఖ్యే బుద్ధి ర్యోగే త్వి మాం శృణు
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహస్యసి"[50]

ఓ అర్జునా! సాంఖ్య బుద్ధి అనగా ఆత్మతత్త్వ జ్ఞానం. దాన్నే పరమార్థ జ్ఞానం అంటారు. అదే సంసారానికి కారణాలైన దుఃఖం, అజ్ఞానం అనే వాటిని ప్రత్యక్షంగా నివారిస్తుంది. యోగమంటే జ్ఞానాన్ని కలుగజేసే కర్మయోగం. నిష్కామకర్మ యోగంతో కర్మలను ఆచరిస్తే జ్ఞానం కలుగుతుంది. పుణ్యపాపాల బంధం నుండి విముక్తి లభిస్తుంది అని శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించాడు. ఇక్కడ సాంఖ్యదర్శనం యొక్క లక్షణాన్ని మనం గుర్తించవచ్చు. సాంఖ్యమంటే బుద్ధిచే తెలుసుకోదగిన ఆత్మతత్త్వం.

"నేహాభిక్రమనాశోస్తి ప్రత్యవాయో న విద్యతే,
స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్"[51]

ఓ అర్జునా! ఫలాపేక్ష లేకుండా ఈశ్వరార్పణంగా చేసే ఈ కర్మయోగాన్ని ఆరంభించటం ఎప్పటికీ వృథాకాదు. ఒక వ్యాధికి చికిత్స చేసేటప్పుడు ఆ వ్యాధి ఎక్కువై మరణం సంభవించవచ్చు. కానీ ఈ కర్మయోగంలో అటువంటి సమస్యలు లేవు. ఈ ధర్మాన్ని కొంచెం ఆచరిస్తే చాలా గొప్పదైన సంసారభయం నుండి విముక్తి లభిస్తుంది అని శ్రీకృష్ణుడు ప్రబోధించాడు.

శ్రీకృష్ణుడు పరిశుద్ధమైన ఆత్మతత్త్వాన్ని అర్జునుడికి క్రిందివిధంగా తెలియజేశాడు.

"వ్యవసాయాత్మి కా బుద్ధి రే కేహ కురునందన,
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోవ్యవసాయినామ్"[52]

ఓ అర్జునా! సాంఖ్యయోగ జ్ఞానం కాని, కర్మయోగ జ్ఞానం కాని నిశ్చయరూపమైన జ్ఞానం ఒక్కటే అవుతున్నది. నిశ్చయం లేనివారికి కలిగే జ్ఞానాలు మాత్రమే చాలా రకాలుగా, అనంతాలుగా ఉంటాయి. 'వ్యవసాయాత్మిక బుద్ధి' అంటే మంచి ప్రమాణం వల్ల పుట్టినటువంటి నిశ్చయ స్వభావం కలిగి శ్రేయోదాయకమైన సాంఖ్యబుద్ధి, యోగబుద్ధి. ఇవి కానటువంటి విపరీతబుద్ధులు అవ్యవసాయాత్మక బుద్ధులు. వీళ్ళు ప్రమాణం వల్ల పుట్టిన వివేకజ్ఞానం లేనివారు. కాబట్టి అర్జునా జ్ఞానం ఒక్కటే అని గుర్తించు. ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవడమే ఉత్తమజ్ఞానం.

శ్రీకృష్ణుడు, ప్రకృతి పురుషుల తత్త్వాల్ని అర్జునుడికి క్రిందివిధంగా బోధించాడు.

"ప్రకృతే ర్గుణసమ్మూఢా స్సజ్జంతే గుణకర్మసు,

తా నకృత్స్నవిదో మందాన్ కృత్స్నవి న్నవిచాలయేత్"[53]

ఓ అర్జునా! ఎవరైతే ప్రకృతిగుణము వల్ల మోహం పొందుతారో, ఫలం కొరకు ఆ గుణాల యొక్క కర్మల్లో ఆసక్తి కలిగివుంటారో, అటువంటి అనాత్మజ్ఞులైన మందబుద్ధులకు ఆత్మవేత్త అయినవాడు. ఆత్మతత్త్వాన్ని వారికి తెలియజేసి కర్మయోగం మార్గంలో నడిపించాలి. ఆత్మావలోకనమే కర్మయోగము, ఇతరాపేక్ష లేకుండా సాధన చేసి ఆత్మసాక్షాత్కారాన్ని పొందేటట్లు చేయాలి.

పురుషుడు ఆచరించవలసిన ధర్మాన్ని శ్రీకృష్ణుడు క్రిందివిధంగా బోధిస్తున్నాడు.

"ఇంద్రియ స్యేంద్రియ స్యార్థే రాగద్వేషా వ్యవస్థితౌ

తయో ర్నవశ మాగచ్ఛేత్తౌ హ్యస్య పరిపంథినౌ"[54]

అర్జునా! పురుషుడి యొక్క ఇంద్రియాలన్నింటిలో రాగద్వేషాలు ఇమిడివుంటాయి. పురుషుడికి అవే శత్రువులు. కాబట్టి అతడు వాటి వశంలో పడకూడదు. శాస్త్రం చెప్పిన విధంగా ప్రవర్తించేవాడు మునుపటి లాగా రాగద్వేషాలకు అధీనుడు కాకూడదు. పురుషుడి యొక్క ప్రకృతి రాగద్వేషాలతో కూడుకొని ఉంటుంది. అది పురుషుల్లో ప్రవర్తించినప్పుడు తనధర్మాన్ని వదలటం, ఇతర ధర్మాలను స్వీకరించి ఆచరింపచేయటం కలుగుతుంది. పురుషుడు ఎప్పుడైతే రాగద్వేషాలను అణచుకుంటాడో అప్పుడు శాస్త్రదృష్టి కలవాడు అవుతాడు. ప్రకృతివశుడు కాడు. కాబట్టి శాస్త్రం ఎప్పటికీ నిష్ప్రయోజనం కాదు.

ఈవిధంగా సాంఖ్యయోగం–కర్మయోగం ప్రకృతిపురుషుల తత్త్వాలను తెలియజేస్తుంది. పరిశుద్ధమైన ఆత్మతత్త్వాన్ని పొందటమే సాంఖ్యదర్శనంలోని సారాంశం.

కపిలుడు తల్లి అయిన దేవహూతికి సాంఖ్యపద్ధతిలో పిండోత్పత్తి క్రమాన్ని తెలియజేశాడు. పోతనగారు ఈ విషయాన్ని చక్కగా ఆంధ్రీకరించారు. 'ఈశ్వరుడు శాశ్వతంగా ప్రకాశించేవాడు, సర్వమూ సంఘటిత పరిచేవాడు. కాపబట్టి జీవుడు తన పూర్వకర్మలను అనుసరించి మళ్ళీ దేహాన్ని పొందగోరుతాడు. జీవుడు పురుషుని వీర్యబిందు సంబంధంతో స్త్రీగర్భంలో ప్రవేశిస్తాడు. ఒక్క రాత్రికి కలిలమై (శుక్రశోణితాల ద్రవమై), తర్వాత ఐదురాత్రులకు బుద్బుదమై, ఆతర్వాత పదవ దినానికి రేగుపండంత అవుతాడు. మాంసపిండంగా మారి గ్రుడ్డు ఆకారాన్ని పొందుతాడు. ఒక్క నెలకు శిరస్సు ఏర్పడుతుంది. రెండు నెలలకు

కాళ్ళుచేతులు వస్తాయి. మూడు నెలలకు గోళ్ళు, వెంట్రుకలు, ఎముకలు, చర్మం, నవరంధ్రాలు ఏర్పడతాయి.

నాల్గవ నెలకు సప్తధాతువులు అయిన శుక్లం, శోణితం, మాంసం, చీము, మెదడు, ఎముక, చర్మం కలుగుతాయి. ఐదవ నెలకు ఆకలిదప్పులు సంభవిస్తాయి. ఆరవ నెలలో మావిచేత కప్పబడి, తల్లి కడుపులో కుడివైపున తిరుగుతూ ఉంటాడు. తల్లి తిన్న అన్నంతో, త్రాగిన నీటితో తృప్తి పొందుతాడు. ధాతువులు (వాత, పిత్త, శ్లేష్మాలు) అభివృద్ధి చెందుతూ ఉంటాయి. మల మూత్రాల గుంటల్లో పొర్లుతూ, అందులోని క్రిములు శరీరమంతా ప్రాకి బాధపెట్టగా మూర్ఛపోతూ ఉంటాడు.

తల్లి తిన్నటువంటి కారం, చేదు, ఉప్పు, పులుపు మొదలైన తీవ్రరసాలు ఆ పిండం యొక్క అవయవాలను తపింపచేస్తాయి. మావిచేత కప్పబడి, బయట ప్రేగుల చేత కట్టివేయబడి, తల్లిపొట్టలో తలదూర్చి, వంగి ముడుచుకొని పడుకొని ఉంటాడు. తన అవయవాలను కదిలించటానికి శక్తిలేక పంజరంలో చిక్కిన పక్షిలాగా బంధితుడై ఉంటాడు. దైవదత్తమైన తెలివితో, వెనుకటి జన్మలలోని పాపాలను తలచుకొంటూ, నిట్టూర్పులు విడుస్తాడు. కొంచెం కూడా సుఖాన్ని పొందలేడు.

ఏడవ నెలలో జ్ఞానం కలుగుతుంది. కదలికలు కలుగుతాయి. మలంలోని క్రిములతో కలిసి మెలసి ఒకచోట ఉండలేక కడుపులో అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. గర్భవాయువులకు కంపించిపోతూ దేహాత్మ దర్శనం కలిగి, విమోచనాన్ని కోరుతూ, మళ్ళీ గర్భవాసం కలిగించినందుకు భయపడుతూ ఉంటాడు. బంధన రూపాలైన సప్తధాతువులతో బంధితుడై చేతులు జోడించి దీనముఖుడైన జీవుడు, ఏ దేవుడు తనకు ఈ గర్భవాసం కలిగించాడో ఆ సర్వేశ్వరుని స్తుతిస్తుంటాడు'[55] అని కపిలుడు తల్లికి పిండోత్పత్తిని సాంఖ్యపద్ధతిలో బోధించాడు.

ఆంధ్రమహాభారతంలోని అనుశాసనికపర్వంలో, సనత్కుమారుడు, శివుడికి సాంఖ్యయోగం గురించి క్రిందివిధంగా తెలియజేశాడు.

"ఇంద్రియములకంటె నీశాన!, మన మహం /కారతత్త్వ మంతకంటె, దాని
కంటె బుద్ధి, బుద్ధికంటెఁ బ్రకృతి యెక్కు / డిన్నిటికిని బురుషుఁడెక్కుడరయ"[56]

ఓ ఈశ్వరా! ఇంద్రియాల కంటె మనస్సు, దాని కంటె అహంకారతత్త్వం, దాని కంటె బుద్ధి, దాని కంటె ప్రకృతి ఎక్కువ. వీటన్నిటి కంటె పురుషుడు గొప్పవాడు.

ఓ ఈశ్వరా! ఆకాశం మొదలైన భూతాలు ఐదు. వాటి గుణాలైన శబ్దం మొదలైనవి ఐదు. రెండు విధాల ఇంద్రియాలు కలిసి పది, మనస్సు, అహంకారం, బుద్ధి అనే మూడూ, ప్రకృతి అనే ఒక తత్త్వం కలిసి మొత్తం ఇరవైనాలుగు తత్త్వాలు అవుతాయి[57].

"చేతనుఁడగు పురుషుని ని / శ్చేతనయగు ప్రకృతివొంది చేతనతాప్ర
స్ఫీత యగుం బెఱతత్త్వము / లా తత్త్వం మహోద్ధియందలి తరఁగల్"[58]

చైతన్యం గల 'పురుషుడు' అనే తత్త్వాన్ని ఆశ్రయించి, చైతన్యం లేని ప్రకృతి చైతన్యం పుష్టిగా కలది అవుతుంది. తక్కిన తత్త్వాలు ఆ తత్త్వం అనే మహాసముద్రంలోని తరంగాల వంటివి. ఓ పరమేశ్వరా! పురుషుడికి ఏ గుణాలూ లేవు. ప్రకృతే గుణాలకు ఏవైనా గుణాలను ఇస్తుంది . అందువల్ల మిగిలిన తత్త్వాలు గుణాలు కలిగే స్థితిని ఏర్పరుస్తాయి. ఈ అన్నిటిని పరమాత్మకు వేరైనివిగా తెలుసుకొంటూ, ప్రకృతిని పట్టించుకోకుండా తనకు తానే కానీ మరొకటి లేదని గుర్తించినపుడు సాధకుడైన పురుషుడు పొగలేని నిప్పులాగా ప్రకాశిస్తాడు అని సనత్కుమారుడు, శివుడికి బోధించాడు.

సనత్కుమారుడు ఆత్మతత్త్వాన్ని ఇంకా క్రిందివిధంగా తెలియజేశాడు. ఓ ఈశ్వరా! ధైర్యంతో పూనుకోకపోతే జీవుడు ప్రకృతికి లొంగిపోతూ, తమోగుణంతో కూడుకున్న సుఖస్థితిలోనే ఉండిపోతాడు.

"నేరిమి దాని నుపేక్షం / జేరుప షడ్వింశభావసిద్ధిఁ బొరయు గౌ
రీరమణ! పంచవింశుఁడు / సారామల నిపుణమతిఁ బ్రసన్నాత్మకుఁడై"[59]

ఓ పార్వతీపతీ! ఇరవై అయిదవ తత్త్వపువాడైన జీవుడు సారమైనదీ, మలినం లేనిదీ, నేర్పు గలదీ అయిన బుద్ధితో ప్రసన్నమైన ఆత్మకలవాడై, నేర్పుతో ప్రకృతిలో పట్టించుకోకుండా ఉంటే ఇరవై ఆరవ తత్త్వపు సిద్ధిని పొందుతాడు.

"సత్త్వాశ్రయమునఁ బురుషుఁడు / దత్త్వాశ్రయమునను సత్త్వములవివే
కిత్వాలేపత్వములన / విత్త్వముఁ జిత్త్వంబు నొందు విశ్వాధారా!"[60]

ఓ విశ్వాధారా! , ఈశ్వరా! పురుషుడు సత్త్వాన్ని ఆశ్రయించి, తత్త్వాన్ని ఆశ్రయించి, ఈ రెండింటిని చక్కగా తెలుసుకోవటం, వాటి అంటులేకుండా చూసుకోవడం అనే పనుల వల్ల తెలిసినవాడు (జ్ఞాని), చైతన్యవంతుడూ అవుతాడు. సనత్కుమారుడు సాంఖ్యపద్ధతిలో విద్య,అవిద్య తత్త్వాల్ని శివుడికి క్రింది విధంగా తెలియజేశాడు.

"నానా త్రైకత్వముల / జ్ఞానజ్ఞానజము లనపజయ! కంద్రు బుధుల్
వాని నవిద్యయు విద్యయుఁ / గా నివి విను పంచవింశకస్థావస్థల్"[61]

ఓ మహేశా! చాలా రకాలుగా ఆత్మ కనిపిస్తూ ఉంటుంది. ఇది అజ్ఞానం వల్ల కలిగిన స్థితి. ఒక్కటి కావటం జ్ఞానం వల్ల కలిగే స్థితి. పండితులు దీనినే అవిద్య, విద్య అంటారు. ఈ రెండూ ఇరవై అయిదవ తత్త్వం వాడైన జీవుడి దశలు.

"విద్యామయ షడ్వింశుఁడు / విద్యావిద్యావిభేద విరహితుఁడజరుం
డాద్యుఁ డనంతుం డచ్యుతఁ / డద్యతనుఁ డనాది కేవలాత్మకుఁడరయన్"[62]

ఓ శివా! పరిశీలించి చూడగా 'విద్య' స్వరూపంగా గల ఇరవై ఆరవతత్త్వం వాడు అవిద్య, విద్య అనే దశలు లేనివాడు. ఆది–అంతం లేనివాడు, యౌవనం–ముసలితనం లేనివాడు. తనకు తానే అయినవాడు. అతడే పరమాత్ముడు.

ఈ సాంఖ్యయోగం అభ్యాసం చేసేవారు ఎటువంటి కీడుల నుండి బయటపడాలో సనత్కుమారుడు శివుడికి క్రిందివిధంగా బోధిస్తున్నాడు

ఓ పరమేశ్వరా! పూర్వం పరాశరమహర్షి, తన శిష్యులకు సాంఖ్యదర్శనంలోని కీడుల గురించి బోధించాడు. నేను కపిల మహర్షి వల్ల ఈ జ్ఞానాన్ని పొందగలిగాను. ఆయన ఎంతోమంది శిష్యులకు ఆత్మజ్ఞానాన్ని బోధించారు. వాటిలోని ముఖ్యమైన విషయాలను తెలియజేస్తాను. పరమేశ్వరా! ఆలకించు.

"జలమున మీను మదుంబర / ఫలమున మశకములుఁ బోలెఁ బ్రకృతిం దా ని
మ్ముల నునికి తెలిసి వేర్పా / టలవఱిచిన పురుషుఁ డవ్యయత్వము పొందున్"[63]

ఓ శివా! నీటిలో చేప ఉంటుంది. కానీ నీరే చేప కాదు. మేడిపండులో పురుగులు ఉంటాయి. కానీ పండే పురుగులు కాదు. తనను ఆవరించివున్న నీరు, పండు వంటి ప్రకృతిధర్మాలు తనకంటె వేరైనవి అని గుర్తించటం, తన నిజస్థితి ఏమిటో తెలుసుకోవటం సాధకుడు చేయవలసిన పనులు. సాధన ఫలిస్తే కలిగేది అవ్యయత్వం. అవ్యయుడు – ఇప్పటివరకు చెప్పినటువంటి ఇరవై ఆరవ తత్త్వానికి చెందినవాడు. అతడే పరమాత్మ. ఈ అవ్యయత్వమే కైవల్యం లేదా మోక్షం. జీవుడు ఈవిధంగా ప్రకృతిని వదిలివేసి పరమాత్మతనాన్ని పొందటమే ఆత్మసాక్షాత్కారం. ఈ స్థితినే ముక్తి అంటారు.

మహాభారతంలోని ఆనుశాసనికపర్వంలో, పంచమాశ్వాసంలో శివుడు, పార్వతికి సాంఖ్యశాస్త్రం గురించి క్రిందివిధంగా బోధించాడు. ముందు సనత్కుమారుడి వల్ల శివుడు ఈ జ్ఞానాన్ని పొందాడు. ఇప్పుడు దాన్ని అర్ధాంగి అయిన పార్వతీదేవికి బోధిస్తున్నాడు.

"జ్ఞానమున విముక్తి సాంఖ్యులు పడయుదు / రరసిచూడఁగా నిరర్థకంబు
ఘోరతరము నంద్రు శారీరమైన త / పంబుఁబంచ వింశ భజనమూఁది"[64]

సాంఖ్యమతాన్ని అవలంబించేవారు జ్ఞానం వల్ల మోక్షాన్ని పొందుతారు. ఆత్మను సేవించటం మాని శారీరకమైన తపస్సు చేయటం వల్ల ప్రయోజనం ఉండదు. అది ప్రయాసకూడాను. ఓ పార్వతీ! ప్రకృతికి అవ్యక్తమనే పేరు కూడా ఉంది. దానినుండి మహత్తూ, అహంకారం, శబ్దాదులైదు మనస్సు, జ్ఞానేంద్రియాలు అయిదు, కర్మేంద్రియాలు అయిదు, పంచభూతాలు జన్మించగా మొత్తం ఇరవై నాలుగు తత్త్వాలైనాయి. ఇరవై అయిదవ తత్త్వం ఆత్మ. ఇటువంటి ఆత్మకు స్థానమై ప్రకృతి నిజగుణాలైన సత్త్వరజస్తమస్సులను సాధనాలుగా చేసుకొని లోకాలను సృష్టిస్తుంది. అవ్యక్తం అనేది పరమాణువు. అదే శాశ్వతం. ఏకం, కార్యరూపం కాదు, కారణరహితమైనది. అది ఇంద్రియాలకు కనిపించదు.

శివుడు త్రిగుణాలను గురించి, వాటి పట్ల పురుషుడు మెలగవలసిన విధానం గురించి పార్వతీదేవికి ఈవిధంగా వివరించాడు. సాంఖ్యదర్శనం త్రిగుణాలను గురించి తెలియజేస్తుంది.

"ఒక్కఁడొక్కనిచేత నెక్కుచుఁ దఱుగుచుఁ
త్రిగుణంబులును బ్రవర్తించు; వీన

జనితంబులగు ప్రీతి సంతానప మోహాదు

లొదవినఁదత్తద్గుణోదయములఁ

గని యుపేక్షించుచు మనము నూనఁగ నీమి

కార్యంబు ధర్మార్థకామములకు

నమర మనుష్య తిర్యగ్జననములకు

మూలముల్ సత్త్వాదు లోలినెఱుఁగు

బుద్ధి యనఁగ మహత్తత్వమునకు నామ;

మది వివేక విజ్ఞాన చిహ్నంబు; భూత

జని యహంకారమునకు లక్షణ; మహంక

రణము దొఱఁగుట మోక్షకారణము దేవి!"[65]

సత్త్వరజస్తమోగుణాలలో ఒక్కొక్కగుణం ఒక్కొక్కసారి ఉద్రేకించి మిగిలిన రెండు గుణాలను అణచివేస్తుంది. ఈ విధంగా మూడు గూణాలూ వృద్ధిక్షయాలు పొందుతూ ఉంటాయి. సత్త్వగుణం విజృంభించినపుడు, ఆ గుణ కార్యమైన సంతోషం కలుగుతుంది. రజోగుణం విజృంభిస్తే దుఃఖం, తమోగుణం వృద్ధిపొందితే మోహం కలుగుతాయి. వీటితో నిమిత్తం లేదని భావించి, నరుడు ఆ గుణకార్యాల పట్ల ఉదాసీనుడై ఉండాలి.

మనస్సు ఈ సుఖదుఃఖాల పట్ల నిమగ్నం కాకుండా ఉండేటట్లు జాగ్రత్త పడటమే మానవుడి కర్తవ్యం. ఈ గుణత్రయమే దర్మార్థకామ సంగ్రహణానికి, దేవమనుష్య పశుపక్ష్యాది జాతుల్లో జన్మించడానికీ కారణమవుతున్నది. బుద్ధి అనేది మహత్తత్వానికి మరొక పేరు. అది విజ్ఞానానికి గుర్తు. అహంకారం జీవుల ఉత్పత్తికి మూలం. అహంకార పరిత్యాగం వల్లనే ముక్తి లభిస్తుంది. పై విధంగా భారతభాగవతాల్లో సాంఖ్యదర్శనం ప్రస్తావించబడింది. బుద్ధి ద్వారా తెలుసుకోదగిన ఆత్మతత్వమే సాంఖ్యం. పరిశుద్ధమైన ఆత్మజ్ఞానమే మోక్షాన్నిస్తుంది. సర్వకార్యాలను పరమాత్మ లీలలుగా భావించి, ప్రకృతి నుండి తాను వేరు అనే ఎరుకతో జీవించటమే మానవుడి సాధన. ఈ సాధనే సాంఖ్యుడికి జ్ఞానాన్ని, తద్వారా ముక్తిని కలుగజేస్తుంది.

4.3.4. యోగదర్శనం:–

'యోగం' అనే పదానికి ఉపాయం, ప్రయత్నం, ధ్యానం, శక్తి అనే అర్థాలు పతంజలి మహాభాష్యంలో చెప్పబడ్డాయి. శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువులో 'యోగము' అనే పదానికి క్రింది అర్థాలు కనిపిస్తున్నాయి. "1. కలయిక, కూటమి, యుక్తి, కూర్చుట, 2. ఉపాయము, 3. కవచము, 4. ధ్యానము, చిత్తవృత్తి నిరోధము, 5. ఇంద్రియ నిగ్రహము, 6. ఐక్యానుసంధానము, జీవాత్మను పరమాత్మ యందైక్యము చేయుట"[66]. ఈ అర్థాలను బట్టి, జీవాత్మను యోగము అని చెప్పవచ్చు.

'యోగ' అనే శబ్దం 'యుజ్' అనే సంస్కృత ధాతువు నుండి వచ్చింది. దీనికి కలయుట, ఐక్యం అని అర్థం. జీవాత్మను పరమాత్మలో ఐక్యం చేయటమే యోగం. ప్రాచీనమైన విద్యల్లో యోగవిద్య ప్రశస్తమైంది.

ఈ యోగవిద్యలో హఠయోగం, మంత్రయోగం, తంత్రయోగం, జపయోగం, లయయోగం, కర్మయోగం, భక్తియోగం, క్రియాయోగం, సన్న్యాసయోగం, కర్మసన్న్యాసయోగం, జ్ఞానయోగం అని చాలా విభజనలు ఉన్నాయి. వీటిలో ఏ మార్గాన్ని అయినా అనుసరించవచ్చు. భగవద్గీతలో, యోగవిద్యలోని పై మార్గాలు చాలా విపులంగా వివరించబడ్డాయి.

యోగవిద్యలో అష్టాంగాలు ఉంటాయి. అవి:– యమం, నియమం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధ్యానం, ధారణ, మననం, సమాధి. వీటి సహాయంతో సాధకుడు యోగవిద్యను అభ్యసించాలి.

యోగవిద్య వల్ల కలిగే ఫలితాలు, యోగప్రాధాన్యత వంటి విషయాలను గురించి ఆచార్య సి.యస్. రాయుడు గారు 'యోగసాధన–హిమాలయ యోగదర్శనము' అనే గ్రంథంలో విపులంగా చర్చించారు. వీటిలో కొన్నింటిని ఇక్కడ తెలియజేయడం జరుగుతున్నది[67].

I. యోగ విశిష్టత:–

1. యోగాభ్యాసం పరమ పురుషార్థమైన మోక్షం పొందుటకు సాధన.
2. వివేకవంతులు, జిజ్ఞాసువులు తమ బుద్ధిని నిర్మలం చేసుకొని యోగంవైపు దృష్టిని కేంద్రీకరిస్తారు.
3. పరమేశ్వరుని ముఖం నుండి ఉద్భవించినదే పవిత్రయోగసాధన
4. యోగం సర్వశాస్త్ర సాధన పరిపూర్ణమైనది. కాబట్టి యోగమును అభ్యసించాలి.

5. అత్యంత మేధా సంపన్నులకు, సర్వశాస్త్ర విశారదులకు, ఆధ్యాత్మవిద్యాకోవిదులకు, పండితులకు, వీరులకు యోగమే శరణ్యం.

6. శాస్త్రాల్లో యోగశాస్త్రం, జ్ఞానంలో యోగజ్ఞానం ఒక్కటే గొప్పది.

7. యోగి ఆనందమయుడు. శ్మశానంలో కూడా అతడు ఆనందంగా నివసిస్తాడు.

8. యోగవిద్య దుఃఖవిమోచనం చేస్తుంది. పరమపదాన్ని ప్రసాదిస్తుంది.

యోగదర్శనం–సిద్ధాంతం:–

వివేకి అయిన వాడికి అంతా ఆనందమయంగానే కనిపిస్తుంది. కాని వాడికి అంతా దుఃఖమయమే. భూతకాలిక దుఃఖం నశించింది. వర్తమాన దుఃఖం రానే వచ్చింది. ఇక రాబోయే (భవిష్యత్) దుఃఖాన్ని పురుషుడు విద్య ద్వారా నశింపజేయాలి.

పురుషుడు వేరు, సత్త్వం (బుద్ధ్యాదులు) వేరు అనే భావం లేనటువంటి వివేకం యోగం. అటువంటి వివేకం ఉన్నవాడికి ప్రజ్ఞ కలుగుతుంది. అటువంటి వాడికి తెలుసుకోవలసింది కాని, చేయదగినది కాని, పొందవలసినది కాని ఉండదు. అటువంటివాడు కుశలుడు (ఆనందమయుడు), ముక్తుడు, గుణాతీతుడు. యోగాంగాలను అనుష్ఠించడం వల్ల అజ్ఞానం తొలగిపోయి, క్రమక్రమంగా జ్ఞానం కలుగుతుంది.

పురుషుడికి చిత్తంతో ఉన్న సంబంధం విచ్ఛిన్నం కానిదే ముక్తి లభించదు. "పురుషుని దుఃఖానుభవం అతనికి బుద్ధితో సంబంధమున్నందున దాని అభావమునకును, బుద్ధి నాశము చిత్తలయమునకు కారణము కావలెను. చిత్త నిరోధము కలిగినప్పుడెల్ల ఒక విధముగ కైవల్యప్రాప్తియే! అందుకే యోగులు సమాధిని కాంక్షించుట. అయితే సతతసమాధి జీవితమున సాధ్యపడదు. కాని అవిద్యాదులు నశించి చిత్తనిరోధము సాధించిన వాని చిత్తము మరణముతో లయమొందును. దానికిక శాశ్వతకైవల్యమే. అంతవరకు వివేకం కలిగినవాడు జీవన్ముక్తుడు"[68]. దీన్నిబట్టి మనస్సు నుండి విముక్తిని పొందటమే ముక్తి అని తెలుస్తుంది. దీనికోసం చేసే ప్రయత్నమే యోగం.

శ్రీకృష్ణభగవానుడు 'భగవద్గీత'లో సాంఖ్యయోగం, కర్మయోగం, కర్మసన్న్యాసయోగం, భక్తియోగం మొదలైనవాటిని అర్జునుడికి బోధించాడు. అర్జునుడు విషాదయోగంలో ఉన్నాడు. యుద్ధం చేయనని,

బంధువినాశనం చేయటం పాపమని అంటాడు. అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునుడి ఆత్మతత్వాన్ని తెలియజేస్తాడు. ఈవిధంగా అర్జునుడిని కార్యోన్ముఖుడిని చేసే ప్రయత్నమే (యోగమే) భగవద్గీత.

యోగి అయినవాడు పొందే పరిశుద్ధమైన ఆత్మజ్ఞానం గురించి శ్రీకృష్ణుడు క్రిందివిధంగా అర్జునుడికి బోధించాడు.

"తస్మాదసక్త స్సతతం కార్యం కర్మ సమాచర,

అసక్తో హ్యాచరన్ కర్మ పర మాప్నోతి పూరుషః"[68]

జ్ఞాని అయినవాడు కర్మ (పని) చేయవలసిందే. అయితే అర్జునా! నీవు ఫలాపేక్ష లేకుండా అప్పగించబడిన కర్మను ఎల్లప్పుడూ చేస్తూవుండాలి. ఈవిధంగా చేసేటువంటి పురుషుడు క్రమంగా మోక్షాన్ని పొందుతాడు.

"కర్మణైవ హి సంసిద్ధి మా స్థితా జనకాదయః

లోకసంగ్రహ మే వాపి సంపశఅయన్ కర్తు మర్హసి"[69]

అర్జునా! జనకమహారాజు మొదలైనవారు కర్మ చేతనే సత్త్వశుద్ధి వల్ల మోక్షాన్ని పొందారు. నీవు లోకాలను సన్మార్గంలో నడపవలసి ఉన్నందువలన, నీవు కూడా కర్మ (పని) చేయవలసిందే. జనకుడు మొదలైనవారు జ్ఞానులు అయినా కర్మను విడిచిపెట్టలేదు. అలాగే నీవు కూడా కర్మమార్గంలో సత్త్వశుద్ధిని పొంది మోక్షాన్ని సాధించు. కారణం ఏమిటంటే,

"యద్య దాచరతి శ్రేష్ఠ స్తుత్తదే వేతరో జనః

స యత్ప్రమాణం కురుతే లోకస్త దనువర్తతే"[70]

ఓ అర్జునా! ఉత్తముడైన వాడు దేన్ని ఆచరిస్తాడో దాన్నే ఇతర జనులు కూడా ఆచరిస్తారు. అతడు దేన్ని ప్రమాణంగా అంగీకరిస్తాడో, లోకమంతా కూడా దాన్నే అనుసరిస్తుంది. కాబట్టి నీవు ఫలాపేక్ష లేకుండా కర్మను ఆచరించు. అందువల్ల నీవు పుణ్యపాపాల సంసారబంధం నుండి విముక్తిని పొందుతావు.

ఓ అర్జునా! కొందరు కర్మయోగం కంటె సన్న్యాసయోగం గొప్పదంటారు. కానీ ఇవి అజ్ఞానులు చెప్పే మాటలు. జ్ఞానయోగం, కర్మయోగం రెండూ సమానమైన ఫలితాల్నే ఇస్తాయి.

"యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం త ద్యోగై రపి గమ్యతే,

ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి"[71]

జ్ఞాననిష్ఠ అయిన సన్న్యాసం వల్ల పొందే ఫలితాన్ని, ఈశ్వరార్చితమైన, ఫలితాన్ని కోరకుండా చేసే కర్మ వల్ల కూడా పొందవచ్చు. ఎవడు సన్న్యాసాన్ని, కర్మను ఒకటిగా చూస్తాడో అతడే జ్ఞాని.

"సన్న్యాసస్తు మహాబాహో దుఃఖ మాప్తుమయోగతః

యోగయుక్తో మునిర్బ్రహ్మ న చిరే ణాధిగచ్ఛతి"[72]

ఓ అర్జునా! కర్మలేని సన్న్యాసాన్ని పొందటం కష్టం. ఈశ్వరార్పితం, ఫలాపేక్ష లేనిది అయినటువంటి కర్మానుష్ఠానం వల్ల జ్ఞాని తక్కువ వ్యవధిలోనే బ్రహ్మమును పొందుతాడు. అందువల్లనే కర్మయోగం గొప్పదని నా చేత చెప్పబడుతున్నది. కాబట్టి ఫలాపేక్ష లేకుండా నీ బాధ్యతను (యుద్ధాన్ని) నిర్వర్తించు.

పై విధంగా శ్రీకృష్ణుడు భగవద్గీతలో సాంఖ్య, కర్మ, కర్మసన్న్యాసాది యోగాలను గురించి వివరించాడు. యోగం అంటే ప్రయత్నం. ఆత్మసాక్షాత్కారం కోసం చేసే ప్రయత్నమే యోగం. దీనికి అంతిమ ఫలితం జీవన్ముక్తిని పొందటం.

ఆంధ్రమహాభారతములోని శాంతిపర్వం, పంచమాశ్వాసంలో భీష్ముడు ధర్మరాజుకు యోగవిద్య గురించి క్రింది విధంగా బోధించాడు. యోగవిద్య గొప్పదనం, దాని లక్షణాలు, నియమాలు భీష్ముడి ఉపదేశంలోని ప్రధానమైన అంశాలు.

"యోగులకు యోగబలమున / రాగము మోహంబునుం జిరస్నేహముఁగా

మాగమముఁ గ్రోధము గుణా / యోగము వరుసఁబెడఁబాప నున్నతి యొలయు"[73]

ఓ ధర్మరాజా! ఆలకించు. రాగం, మోహం, దీర్ఘకాలికమైన స్నేహం, కామం, క్రోధం అనే దుర్గుణాలు ఆత్మోన్నతిని నిరోధించేవి. యోగబలంతో పై దోషాలను, వానికి విరుద్ధమైన సద్గుణాలతో తొలగిస్తే యోగులకు ఆత్మోన్నతి లభిస్తుంది అని భీష్ముడు అంటాడు.

మానవుడు యోగవిద్య చేత మాయ నుండి ఎలాగ బయటకువచ్చి ముక్తుడవుతాడో భీష్ముడు క్రింది దృష్టాంతాల ద్వారా ధర్మరాజుకు బోధించాడు.

"ఘనరుషమున్ సముద్ధతమృగంబును జాలము వ్రచ్చి వాగురా
వినిహతిఁజేసి యిష్టపదవిం జను చాడ్పున యోగతంత్రరో
ధనమగు లోభ జాత దురితవ్రజంముం బెడఁబాచి సత్పథం
బునఁ జరియించు యోగి సుఖమూర్తిత సుస్థితగా వహించుచున్"[74]

పెద్దచేప వలను చించుకొని, బలిష్ఠమైన మృగం ఉరిని ఛేదించుకొని ఇష్టం వచ్చిన దారిలో వెళ్ళిపోతాయి. అలాగే యోగాభ్యాసం వల్ల మానవుడు పాపాలనుండి విముక్తిని పొందగలడు.

"యోగబలము లేని యొగభంగి బల్ / ద్రోపు లేని మీను నేపు లేని
మృగము వలయు నురియుఁ దెగిపోవ నుఱుకంగ / లేనియట్ల భవనములోన నడఁగు"[75]

బాలాధిక్యంతో విజృంభించి ముందుకు దూసుకుపోలేని చేప వలను ఛేదించలేదు. అలాగే శక్తి చాలని మృగం ఉరిని త్రెంచివేయలేదు. అదేవిధంగా యోగబలం చాలని యోగి పాపాలను ఛేదించలేక సంసారచక్రంలో చిక్కుకొంటున్నాడు. ఓ ధర్మరాజా! కొద్దిపాటి నిప్పును కట్టెల మీద వేస్తే, ఆ నిప్పు ఆరిపోతుంది. అలాగే బలహీనమైన యోగవిద్య వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు.

"ఇద్ధమైన యగ్ని ఇంధన సంపద / నతిశయిల్లు నట్టు లధికబలస
మగ్రసారయోగ మహిమయు నంతంత / కగ్గలించు వ్రతము లగ్గలింప"[76]

ధర్మరాజా! బాగా జ్వలించిన అగ్ని, ఎక్కువగా వంటచెరకు అందిస్తే ఇంకా ఎక్కువగా మండుతుంది. అలాగే శక్తివంతమైన యోగబలం వల్ల, నియమ సాధనాల వల్ల అంతకంతకు ఆ విద్య రాణిస్తుంది. అలాగే బలంగా ముందుకు సాగిపోయే ప్రవాహవేగం బలహీనుడిని లాగివేస్తుంది. అలాగే మనోబలంతో కూడిన యోగశక్తి లేనివాడికి అరిషడ్వర్గాలు తమవైపుకు లాగివేస్తాయి. కాబట్టి మనస్సు నుండి విముక్తిని పొందేవరకు సాధకుడు జాగరూకుడై ఉండాలి.

యోగాభ్యాసపరుడికి సుఖదుఃఖాలు అనే వ్యత్యాసం ఉండదు. అతడు రెండింటిని సమానంగా స్వీకరిస్తాడు. రెండింటినీ అనుభవిస్తాడు. కానీ దేనిపట్ల సముఖతను ప్రదర్శించడు.

"భోగంబుఁదపముఁ బొరిఁ బొరి / రాగ విరాగతల హృదయరంగమునకుఁ గే
ళీగతులఁ దెచ్చి యార్చుచు / యోగి యనుభవించుఁ దగిలియుండండెందున్"[77]

యోగాభ్యాసపరుడైన మానవుడు మాటిమాటికీ తన హృదయమనే రంగస్థలం మీదికి విషయసుఖానుభవాన్నీ, తపస్సునూ, రాగాన్నీ, విరాగాన్నీ విలాసంగా తీసుకొనివచ్చి ఆడిస్తూ ఉంటాడు. అయితే ఎందులోనూ తగులుకోకుండా ఆ క్రీడారసాన్ని మాత్రం అనుభవిస్తాడు.

భీష్ముడు యోగవిద్యలోని సూక్ష్మమైన విషయాలను ధర్మరాజుకు క్రిందివిధంగా తెలియజేశాడు. ఓ ధర్మరాజా! విలుకాడు ఏవిధంగా తదేకచిత్తుడై లక్ష్యాన్ని చక్కగా ఛేదిస్తాడో, అలాగే యోగనిపుణుడు యోగలక్ష్యాన్ని కూడా సాధిస్తాడు.

"నేతికుండ మోచి యే తెఱఁగున సోబ / నాలువ్రాఁకు నైపుణ్యంబు గలుగు
పురుషుఁడట్ల యోగపరిణతుండును నాత్మ / నేమఱక విముక్తి కెక్కవలయు"[78]

నేర్పు కలిగినటువంటి పురుషుడు తలమీద నేతికుండ మోసుకొని ఎట్లా మెట్లు ఎక్కిపోతాడో, అలాగే యోగనిపుణత కలవాడు కూడా ఆత్మను మరువకుండా మోక్షసౌధాన్ని అధిష్టించాలి.

ఓ ధర్మరాజా! రథం ఎక్కి పోయేవాడిని సారథి లాగా, పడవ ఎక్కి ప్రయాణం చేసే వాడిని చుక్కాని పట్టేవాడి లాగా యోగధారణలో నిశ్చలమైన స్థితిని పొందిన ధీరచిత్తుడు తన ఆత్మను మంచి మార్గంలోనే నడిపించాలి.

"శిరమును నాభియు హృదయము
నురమును గర్ణములుఁ బార్శ్వయుగళము నాత్మా
దరణీయస్థానము ల
య్యిరవులఁగనుయోగి యాత్మ నిభపురనాథా!"[79]

హస్తినాపుర ప్రభువైన ధర్మరాజా! తల, బొడ్డు, హృదయం, వక్షం, చెవులు, ఇరుప్రక్కలు – ఆత్మకు ఆదరించదగిన స్థానాలై ఉంటాయి. యోగి అయినవాడు ఆయా స్థానాల్లో తన ఆత్మను సందర్శిస్తాడు. ధర్మరాజా! యోగాభ్యాసం చేసే వ్యక్తి నూనెగల చిక్కనైన ఆహారపదార్థాలు తీసుకోకూడదు. రసవత్తరాలు కాని పదార్థాలతో, నీటితో ఆకలి తీర్చుకోవాలి. అవి కూడా పొట్టనిండేటట్లు ఎక్కువగా తీసుకోకూడదు. కామాన్నీ, క్రోధాన్నీ, నిద్రనూ, ఆశనూ, భయాన్నీ విడిచిపెట్టాలి. యోగధారణలో నిశ్చలత కలిగి, తనలో తనను చూసుకొంటూ అంతర్ముఖ ప్రయాణం చేసే యోగి, నిత్యసుఖానికి నెలవైన పరమపదాన్ని

చేరుకొంటాడు. యోగాభ్యాసపరుడికి పుట్టుకతో సంయోగం, మరణంతో దీనత్వం ఉండవు. భోగం వల్ల సుఖించటం, భోగం లేకపోతే దుఃఖించటం అనేవి అతడికి ఉండవు అని భీష్ముడు ధర్మరాజుకు యోగవిద్యావిశేషాలను బోధించాడు.

యోగసాధన ఎలా చేయాలో కూడా భీష్ముడు ధర్మరాజుకు బోధించాడు.

"తెలివొంది మనసు నిశ్చలవృత్తి నేకాగ్ర / మై యున్కి గోరి నిష్ఠాతిశయము
కలిమి కృత్యంబు మేఘుంబున మెఱుఁగును / నలిన పత్రంబున సలిలకణముఁ
బోలె మంతవ్యంబు పొంతఁజరించు మ / నంబు దానికిఁబవనంబు గతియ
గతిగాన హితము మారుత ధారణము పవ / మానంబు గ్రమమునఁ గాని నిలువ
దలయ విసువఁగాదు తలకొని యమనియ / మాదు లెనిమిదియును నభ్యసింపఁ
గా విచార మొలయుఁగలుగు వితర్కంబు / మఱి వివేక మనిలు నెఱికిఁదెచ్చు"[80]

ధర్మరాజా! మనస్సు చలించకుండా, ఏకాగ్రత కలిగి ఉండాలి. అంటే గట్టి నిశ్చయం ఉండాలి. మబ్బులో మెరుపు లాగా, తామరాకు మీద నీటి బిందువు లాగా మనస్సులో ఆలోచనలు సహజంగా ఉండాలి. మనస్సు ప్రసరించే తీరు, గాలి వీచే పద్ధతీ ఒకే విధంగా ఉంటాయి. గాలి కారణంగానే మనస్సు చలిస్తుంది. కాబట్టి ఆ వాయువును నివారించాలి. దీని వల్ల మనోనిగ్రహం కలుగుతుంది. అయితే వాయువును నిగ్రహించటం అంత సులభం కాదు. అది క్రమక్రమంగా సాగాలి. యమనియదులైన ఎనిమిది సాధనాలతో వాయునిరోధం కోసం ప్రయత్నించాలి. ఆయాసపడటం, విసుగుచెందటం చేయకూడదు. ఈ ప్రయత్నంలో ముందుగా ఆలోచనలు కరిగిపోతాయి. తర్వాత సందేహం కలుగుతుంది. ఆ తర్వాత జ్ఞానం వాయువును క్రమబద్ధం చేయగలుగుతుంది.

కొఱవిగోపరాజు రాసిన 'సింహాసనద్వాత్రింశిక'లో పదవబొమ్మ చెప్పిన కథలో యోగశాస్త్ర విశేషాలు చాలా ఉన్నాయి. ఒక అవధూతకుడు రాజుగారి దగ్గరకు వచ్చి ఆయనతో మాట్లాడటం మొదలుపెట్టాడు. అతని మాటల్లో సకలశాస్త్ర మర్మాలు ఉన్నాయి. విక్రమార్కుడు దీన్ని గమనించాడు. కుదుటపడేటట్లు రాజుగారికి ఆత్మవిద్యా రహస్యాల్ని క్రిందివిధంగా తెలియజేశాడు. యోగసాధనలో ఉత్కృష్టమైనది 'కుండలినీవిద్య'. దీని గురించి ఆ సిద్ధుడు ఇలా అన్నాడు.

"క్షోణిపానీయ తేజోవాయు గగనాఖ్య / పంచభూతాంశు సంబంధమైన
మేనిలోఁ గర్ణనాసానేత్ర జిహ్వాత్మ / గాహ్వయ పంచేంద్రియముల గోష్ఠి
శబ్దగంధాంగరసస్పర్శ సంజ్ఞిక / పంచ విషయములఁ బాలుపఱుచు
ప్రాణప్రభృతి పంచపవన ప్రసారంబు / హృదయాది వివేచకంబుఁ
జిత్తకమల చక్రజీవాత్మ పరమాత్మ / యోగసాధనముల నొనరఁజెప్పి"[81]

భూమి, వాయువు మొదలైన పంచభూతాలకు సంబంధించిన శరీరంలో చెవి, ముక్కు, కన్ను వంటి పంచేంద్రియాలను ఒక్కటి చేసేది, శబ్దం, గంధం మొదలైన పంచవిషయాలను ఒక్కటి చేసి, ప్రాణం, అపానం వంటి హృదయాది ఏడు స్థానాల్లో నిలిచివుండే బుద్ధిని ఏకం చేసేది యోగవిద్య. కుంభక, రేచక వంటి గతులతో నిలిచివుండేది, చిత్తంలో ధ్యానం ఉంచి జీవాత్మను పరమాత్మలో ఏకం చేసేది యోగసాధనవిద్య.

ఈ యోగవిద్య – "కల్మషబంధ వియోగము, పంచేంద్రియాభియోగము, పుణ్యోద్యోగము, ముక్తివధూసంయోగము, పరతత్త్వపదనియోగము"[82]. ఇంతటి గొప్పది ఈ యోగసాధన విద్య. విద్యలన్నింటిలోకి ఇది ఉత్తమమైనది. కష్టమైనప్పటికీ, అభ్యాసం చేసేకొద్ది యోగసిద్ధి పెంపు వహిస్తుంది. ముక్తికి ఇది ఒక్కటే అనుకూలమైన మార్గం. సిద్ధుడు, రాజుకు కుండలినీవిద్య గొప్పదనాన్ని ఇలా తెలిపాడు.

"హఠయోగ మంత్ర యోగాష్టాంగయోగ సా
ధన యోగలయ యోగధర్మములకు
యమ నియమాసన ధ్యాన ధారణశక్తిఁ
బవన నిరోధంబుఁ బట్టుకొలిపి
నాభి చక్రోపరినలిన మధ్యంబున
నీవారశూక సన్నిభ విభాతి
వెలిఁగెడు తేజంబు వెలుఁగునఁ గరఁగిన
యమృతంబు మదిలోన ననువు వార
నందుఁగలుగుట సచ్చిదానందమయ్యె

నచటి తేజస్వరూపంబె యచ్యుతుండు

పంచవింశతి తత్త్వ ప్రపంచమునకు

నతఁడె కారణమాది నారాయణుండు"[83]

హఠయోగం, మంత్రయోగం, యమం, నియమం, నిధిధ్యాసనం, ధారణ, వాయునిరోధం వంటి దశలు ఇందులో ఉంటాయి. మూలాధార చక్రం నుండి సహస్రార వరకు మొత్తం ఏడు చక్రాలు అమరివుంటాయి. వాయుప్రసరణం మీద గమనం ఉంచి, కుండలినీ శక్తిని ఆరోపణ చేయాలి. ఒక్కొక్క చక్రాన్ని కుంభక, రేచక క్రియల ద్వారా ఉత్తేజితం చేయాలి. ఈవిధంగా కుండలినీ శక్తి సహస్రార చక్రాన్ని చేరినప్పుడు అచటి తేజోవంతమైన, సచ్చిదానంద స్వరూపుడైన పరమాత్మను దర్శించవచ్చు. అతడే ఈ ప్రపంచానికి మూలకారకుడైన నారాయణుడు.

ఈ విధంగా కరణం, ఆసనం వంటి భేదాలు తెలుసుకొని, ఆయా యోగశాస్త్ర పద్ధతుల్ని పాటిస్తూ సాధన చేస్తే ముక్తి సొంతమవుతుంది. దీనికి సుశిక్షితుడైన గురువు ఉండాలి. ఆసక్తి, ఇంద్రియనిగ్రహం, ధ్యానం, ధారణ కలిగిన విద్యార్థి ఉండాలి. అప్పుడే యోగసాధన సాధ్యమవుతుంది. ఈవిధంగా యోగవిద్య, ప్రాచీనవిద్యల్లో కెల్లా ఉత్తమమైనదిగా కనిపిస్తుంది. ఇది జన్మరాహిత్యాన్ని ప్రసాదిస్తుంది.

'యోగాభ్యాసదర్పణము' అనే గ్రంథంలో అష్టాంగయోగాలు, వాటి విశేషాలు చెప్పబడ్డాయి. అష్టాంగాలు – యమం, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి. వీటిని పాటించడం వల్ల కలిగే ఫలితాలు క్రిందివిధంగా చెప్పబడ్డాయి[84].

1. యమం – దుస్సంగ త్యాగం, సత్సంగ గ్రహణం కలుగుతాయి.

2. నియమం – సన్మార్గ ప్రవృత్తి, దుర్మార్గ నివృత్తి కలుగుతాయి

3. ఆసనం – శరీర స్వాధీనం, తద్వారా ఆరోగ్యం లభిస్తాయి

4. ప్రాణాయామం – వాయువు స్వాధీనమవుతుంది

5. ప్రత్యాహారం – వాయువును స్వభావ సిద్ధమైన మార్గం నుండి మళ్ళించి వేరొక మార్గంలో ప్రవేశపెట్టడం జరుగుతుంది

6. ధారణ – ఇష్టమైన స్థానంలో ప్రాణచిత్తాలను నిలుపవచ్చు

7. ధ్యానం – మనస్సు ఏకాగ్రతను పొందుతుంది.

8. సమాధి – మనోలయమై, అపరోక్షానుభవం కలుగుతుంది

యోగాభ్యాసం ఎన్నో నియమాలతో కూడినది. దీన్ని అభ్యసించే వ్యక్తికి ఓర్పు, దీక్ష అవసరం. ఇది ఒక్క రోజులో ఫలితాన్ని ఇచ్చే విద్యకాదు. క్రమక్రమంగా ఇది మనిషికి సచ్చిదానంద స్థితిని కలిగిస్తుంది. యోగవిద్యాభ్యాసం చేసే వ్యక్తి ఏయే నియమాలు పాటించాలో 'యోగాభ్యాసదర్పణము' లో చాలా వివరంగా చెప్పబడి ఉంది[85].

యోగవిద్యపట్ల విశ్వాసం లేని దూరదేశంలోగాని, రక్షణ సరిగా లేని ప్రదేశంలోగాని, జనసమ్మర్దం గల ఇండ్లలో గాని యోగాభ్యాసం చేయకూడదు. గ్రామానికి వెలుపలగాని, పుణ్యనదీ తీరాన గాని, ఏకాంత స్థలం చూసుకొని సాధన ప్రారంభించాలి. ఒక బావి గాని, కోనేరు గాని నిర్మించి, మెత్తని, సమతలమైన ప్రదేశంలో ఒక సుందరమైన మఠాన్ని కట్టించాలి. అందులోకి చీమలు, దోమలు మొదలైన కీటకాలు ప్రవేశించకుండా చూసుకోవాలి. ఆ గదికి ఒకే ఒక్క చిన్నరంధ్రాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఆ గదిని గోమయం చేత ఆలకించి పరిశుభ్రం చేయాలి. ఆ మఠంలోని గోడలకి వైరాగ్యజనకాలైన చిత్రాలను ఏర్పాటు చేసుకోవాలి.

తర్వాత ఆ మఠం ద్వారానికి ఎదురుగా కాకుండా, ప్రక్కన ఒక ఆసనాన్ని ఏర్పాటు చేసుకోవాలి. దాని మీద దర్భలను పరచాలి. దాని పైన పులి చర్మాన్ని గాని, జింక చర్మాన్ని గాని వేసి శుభ్రంగా ఉంచుకోవాలి. యోగాభ్యాసం అయిన తర్వాత 15 నిమిషాల పాటు ఆ శయ్యమీద శవాసనంలో ఉండాలి. సాధన అయిన తర్వాత మఠంలో అగరవత్తులు వెలిగించి చెడు వాయువులను శుద్ధిచేసి తర్వాత బయటి ప్రదేశంలోకి రావాలి. లేకపోతే అతని శరీరంలోకి వెంటనే బాహ్యవాయువు ప్రవేశించి రోగాలు కలుగుతాయి.

యోగాభ్యాసం చేస్తున్న వ్యక్తి ఎటువంటి ఆహార నియమాలు పాటించాలో భీష్ముడు ధర్మరాజుకు తెలియజేశాడు. ముందు పుటల్లో ఆ విషయాలు చెప్పబడ్డాయి. 'యోగాభ్యాసదర్పణం'లో కూడా మరికొన్ని ఆహారనియమాలు చెప్పబడ్డాయి[86]. వసంతఋతువు వచ్చేటటువంటి చైత్ర–వైశాఖ మాసాల్లో,

శరదృతువగు ఆశ్వయుజ–కార్తీక మాసాల్లో యోగాభ్యాసం ప్రారంభిస్తే శరీరానికి ఎటువంటి రోగాలు కలుగకుండా సాధన పూర్తి అవుతుంది.

యోగాభ్యాసం చేస్తున్న వ్యక్తి మధురమైన, పరిశుద్ధమైన, బాగా వేడిగా ఉన్నటువంటి పదార్థాలను తింటూ, రసాస్వాదన చేయాలి. సగం కడుపు నిండు వరకు తినాలి, మిగిలిన సగభాగాన్ని నీటితో నింపుకోవాలి. కొంత వాయుసంచారం కోసం ఖాళీగా ఉంచుకోవాలి.

పథ్యపదార్థాలు:–

వరిబియ్యపు అన్నం, గోధుమరొట్టె, జొన్నరొట్టె, పొట్టు తీసిన పెసరపప్పు, మినపప్పు, పచ్చి అరటికాయ, అరటి ఊచ, అరటిదుంప, వంకాయ, కందమూలాదులు, మధురఫలాలు, ఏలకులు, జాపత్రి, లవంగాలు.

అపథ్య పదార్థాలు:–

చేఁదు, పులుపు, ఉప్పు, కారం కలిగిన పదార్థాలను పెరుగు, బరువైన శాకా పదార్థాలు, సారాయి, పనస, వెలగ, గుమ్మడి, ఉల్లి, ఇంగువ, వెన్న, గడ్డ కట్టిన పాలు, చక్కెర, బెల్లం, అరటిపండ్లు, కొబ్బరి, మామిడిపండ్లు, ఉష్ణపదార్థాలు, యామములు గడిచి పాసిపోయిన పదార్థాలు మొదలైనవి తినకూడనివి.

రాత్రిపూట గ్రామసంచారం, ప్రాతఃకాలంలో స్నానం చేయటం, ఉపవాసం, శరీరకాష్టం, ఏకభుక్తం, నిరాహారం, పగటి పూట నిద్ర, అతి సంభాషణ, స్త్రీసంగమం, అగ్ని సన్నిధానం, తైలం రాసుకొని స్నానం చేయటం మొదలైనవి మానుకోవాలి.

ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటలకు ప్రవహిస్తున్న నీటిలోగాని, గోరువెచ్చని నీటితో గానీ స్నానం చేయాలి. మధ్యాహ్నం, రాత్రి రెండు వేళల్లో భోజనం చేస్తూ, భస్మధారణ, శుచియైన వస్త్రధారణ చేయాలి. ఇవి యోగసాధకుడు ఆచరించవలసిన నియమాలు. వీటివల్ల అతని శరీరం ఆరోగ్యంగా ఉండి, సాధనకు సహాయపడుతుంది. యోగాభ్యాసం చేస్తున్న వ్యక్తి ఉచ్ఛ్వాసనిశ్వాసాల ద్వారా దృష్టిని మనస్సునందు నిలపాలి.

యోగాభ్యాసం చేస్తున్న వ్యక్తి క్రింది ముద్రల్లో కొన్నింటినైనా పాటిస్తూ వాయుప్రసారాన్ని సాగించాలి.

ముద్రలు:–

మహాముద్ర – నభోముద్ర – ఉడ్డియాణబంధముద్ర – జాలంధరబంధ ముద్ర – మూలబంధముద్ర – మహాబంధముద్ర – మహావేధ ముద్ర – ఖేచరి ముద్ర – విపరీతకరణిముద్ర – యోనిముద్ర – వజ్రోలిముద్ర – శక్తి చాలన ముద్ర – తటాక ముద్ర – మాండలిక ముద్ర – శాంభవి ముద్ర – అశ్వినిముద్ర – పాశినీముద్ర – కాకిముద్ర – మాతంగముద్ర – భుజంగముద్ర – అని ఇరవై రకాలైన ముద్రలు ఉన్నాయని 'యోగాభ్యాసదర్పణం'[87] వల్ల తెలుస్తుంది.

ఆసనాలు :–

వజ్రాసనం, గుప్తాసనం, ముక్తాసనం, పద్మాసనం, దృఢాసనం, వీరాసనం, పవనముక్తాసనం, వామపాదపవనముక్తాసనం, ధీరాసనం, దక్షిణపాదపవనముక్తాసనం, శ్వాసగమనాసనం, పశ్చిమతానాసనం, వాతాయనాసనం, మయూరాసనం, మత్స్యేంద్రియాసనం, కుక్కుటాసనం, గోరక్షాసనం, భద్రాసనం, ఊర్ధ్వపద్మాసనం, అర్ధపాదాసనం, పూర్ణపాదాసనం, శవాసనం మొదలైన 86 రకాల ఆసనాలు ఉన్నాయి. ఈ నియమాలన్నీ పాటిస్తూ యెగసాధన చేసిన వ్యక్తి సచ్చిదానంద స్వరూపుడైన పరమాత్మను దర్శించగలడు.

నన్నెచోడుడు 'కుమారసంభవము'లో యోగవిద్య విశేషాల్ని ప్రస్తావించాడు.

"సుజ్ఞాన యోగతత్త్వ వి
ధిజ్ఞుల్ భవబంధనములఁ ద్రెంచుచు భువిలో
నజ్ఞాన పదముఁ బొందక
ప్రాజ్ఞుల్ శివుఁగొల్తురచలభావన దవులన్"[88]

సుజ్ఞానం, యోగం, తత్త్వం అనేవాటి విధులు తెలిసిన ప్రాజ్ఞులు సంసారబంధాలను త్రెంచుతూ, భువిలో అజ్ఞానపదాన్ని పొందక స్థిరబుద్ధితో శివుడిని సేవిస్తారు అని కవి వర్ణించాడు. సంసార

బంధాలనుండి విముక్తి లభించాలంటే జ్ఞానం, యోగం, తత్త్వం సాధనాలు. ఇవి మనిషిని జ్ఞానపథంలో నడిపిస్తాయి.

యోగసాధన వల్ల అంతరంగ ప్రయాణం సాధ్యపడుతుంది. ఇంద్రియాలను అదుపుచేసి, మనస్సుని నియంత్రించి ఆ పరమశివుడిని పొందటానికి యోగసాధనమే మార్గం. నన్నెచోడుడు క్రింది పద్యంలో ఈ విషయాన్నే వర్ణించాడు.

"బుద్ధీంద్రియంబుల పొలుఁతులు నాఁజాలు
కర్మేంద్రియంబుల గర్వముఱిచి
విషయాలి నడపాడు వీథిక లనఁజాలు
బుద్ధీంద్రియంబుల పొంకమడఁచి
యంతఃకరణ తతి కాటపట్టనఁజాలు
విషయ సమూహంబు వీకు దఱిచి
యాజవంజవమున కనుచారియై పర్వు
నంతఃకరణతతి యలవు మడఁచి
సురుచిర స్థూలముల్ బాహ్యకరణ సమితి
సూక్ష్మ మంతఃకరణతతిఁ జొచ్చి కూడ
నాత్మ నాత్మైకదృష్టి సర్వాత్ముఁబరమ
పరుని శివుఁగాంచు టది పరపదవి సుమ్ము"[89]

బుద్ధీంద్రియాలు స్త్రీలు అనదగిన కర్మేంద్రియాల గర్వాన్ని అణచివేయాలి. ఇంద్రియాలు తిరిగేటటువంటి వీథులనదగు బుద్ధీంద్రియాల గర్వాన్ని క్రమంగా అణచివేయాలి. అంతఃకరణ సమూహానికి నిలయం అనదగిన విషయసమూహం యొక్క సామర్థ్యాన్ని తగ్గించాలి. సంసారచక్రానికి కారణాలైన అంతఃకరణాల సమూహాన్ని అణచి, స్థూలమైన బాహ్యకర్మల్ని కూడా నియంత్రించాలి. అప్పుడు ఆత్మయందు ఆత్మప్రధానమైన దృష్టితో సర్వాత్ముడు, పరాత్పరుడు అయిన శివుడిని దర్శించవచ్చు.

'ఆముక్తమాల్యద' ప్రబంధంలో కూడా యోగసాధన, యోగి లక్షణాలు ప్రస్తావించబడ్డాయి.

"విజ్ఞానమునఁ జేసి విషయాది వలన నె

మ్మన మాహరించి బ్రహ్మముఁ బరేశుఁ

జింతింపవలయు నిశ్రేయసంబున; కట్లు

చింతింప నతఁడు తచ్చింతకునకు

నాత్మభావం బిచ్చు, నా కర్షకము వికా

ర్యశ్మసారముఁ దార్చునట్లు; యోగ

మన, యమాది విషయమైనది యాత్మ ప్ర

యత్నంబున కధీనమైన సాత్త్వి

కపుమనోగతి యెయ్యేది గలదు దాని

బ్రహ్మసంబంధినిఁగఁ జేయు ప్రౌఢిసూవె;

యిట్టి వైశిష్ట్యధర్మ మెందేని గలుగు

నట్టి యోగంబు గలిగిన యతఁడె యోగి"[90]

మోక్షం పొందగోరిన సాధకుడు శబ్దస్పర్శాది విషయభోగాల నుండి మనస్సును వెనుకకు మళ్ళించాలి. పరమాత్మను నిరంతరం ధ్యానించాలి. అప్పుడు, ఇనుమును అయస్కాంతం ఏవిధంగా ఆకర్షిస్తుందో అలాగ పరమాత్మ సాధకుడికి తన స్వరూపాన్ని వ్యక్తం చేస్తాడు. యమనియమాదుల చేత నిర్మలీకృతమైన సాత్త్వికచిత్తవృత్తిని 'బ్రహ్మము' మీదికి నడిపించటం యోగం అనబడుతుంది. ఇటువంటి బ్రహ్మధ్యానం ఏ యోగం వల్ల కలుగుతుందో, ఆ యోగం కలవాడే యోగి. అది సాంఖ్యం కావచ్చు, భక్తి యోగం కావచ్చు, కర్మయోగం కావచ్చు. ఇవి వేరుగా కనిపిస్తున్నా, అన్ని మార్గాలకు లక్ష్యం 'బ్రహ్మము'.

శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్తమాల్యద'లో భక్తియోగాన్ని గురించి తెలియజేశాడు. సాధకుడు, శ్రీమహావిష్ణువు విరాట్ స్వరూపాన్ని ఏవిధంగా ధ్యానం చేయాలో క్రింది పద్యంలో రాయలు వర్ణించాడు.

"శ్రీవిష్ణు నీగతిఁ జింతింప వలయుఁద

న్మయుఁడయి యోగి క్రమంబుతోడ;

నొక్కయంగమె మున్ను చిక్కలో భావించి,

యది దృఢంబగుటయు నవలియంగ
కము మఱి చింతిపఁగాఁదగు; నట్టి య
భ్యాసంబు వలన నయ్యవయవి మఱి
నడచిన నున్న మానక యెద్దియేనియుఁ
జేయుచున్నను మదిఁబాయఁడేని,
యతనిసామ్యంబు గని ముక్తుఁడగు; సురాది
భేదసంజనకాజ్ఞన మేదఁ బిదప
నలము కళ్యాణగుణముల హరికిఁదనకు
లేని భేదమెవ్వాఁడు కల్పింపఁగలడు?"[91]

భక్తియోగంలో, సాధకుడు శ్రీమహావిష్ణువు యొక్క స్వరూపాన్ని ఒక వరుసతో ధ్యానం చేయాలి. ముందుగా భగవంతుడి అవయవం ఒక దాన్ని ధ్యానాభ్యాస పాటవం చేత మనస్సులో స్థిరీకరించుకోవాలి. తర్వాత దాని వెంబడి ఇంకొక అంగంపై దృష్టిని కేంద్రీకరించాలి. ఈవిధంగా క్రమంగా సంపూర్ణ మూర్తిని మనస్సులో నాటుకోవాలి. నడుస్తున్నప్పుడు, విరామం దొరికినప్పుడు, ఏదైనా పనిచేస్తున్నా పరమాత్మడి అవయవాలను మనస్సులో నిలుపుకొని ఉండాలి. యోగికి, తాను అమరుడు, నరుడు అనే భేదాలను కలిగించే అవిద్య నశించిన తర్వాత, శ్రీమన్నారాయణుని సామ్యం కలిగి ముక్తిని పొందుతాడు. దీన్నే సారూప్యముక్తి అంటారు. అప్పుడు అతడికి, భగవంతుడికి భేదం ఉండదు. విశ్వంలోని అన్ని పదార్థాల్లో ఆ వ్యక్తి తనను తాను చూసుకొంటాడు. విశ్వమంతా నిండివున్న 'ఆత్మ'ను దర్శిస్తాడు. అదే ఆత్మసాక్షాత్కారం. ఇదే కైవల్యాన్ని ఇచ్చేటటువంటి భక్తియోగం.

'కళాపూర్ణోదయం'లోని పంచమాశ్వాసంలో యోగశాస్త్ర విశేషాలు వివరించబడ్డాయి. అలఘువ్రతుడికి శిశువు (సముఖాసత్తి) క్రిందివిధంగా యోగశాస్త్ర విశేషాలు తెలియజేసింది.

"యమముల్, సత్య దయా క్షమా ధృతి మితాహా రార్జవ బ్రహ్మ చ
ర్యము లస్తేయ మహింస శౌచ మననొప్పరున్ ధరిత్రీసురో
త్తమ! యందున్ దశభంగులై, పరుల బాధం బెట్ట కింపారు బొం

కమి, సత్యంబు, పరార్తి కోర్వమి దయాఖ్యం బెంపుమీఱుం గడున్"[92]

'యమం' అంటే సత్యం, దయ, క్షమ, ధృతి మొదలైనవి ఇవి మొత్తం పదిరకాలు. ఇతరులను బాధపెట్టకపోవడం, సత్యం, ఇతరుల కష్టాల్ని చూసి ఓర్చుకోలేకపోవడం (కరుణ), దయ అనేవి యమం వల్ల సిద్ధిస్తాయి.

"విను నియమంబులు పది; తప
మును సంతోషాస్తికత్వములు దా నే శా
ర్చన సిద్ధాంత శ్రవణము
లును హ్రీయును మతి జపంబులును వ్రతము ననన్"[93]

నియమాలు పది రకాలు. తపస్సు, సంతోషం, ఆస్తికత్వం, ఈశ్వరుని ఆరాధన, వేదాంత శ్రవణం మొదలైనవి యోగసాధకుడు పాటించవలసిన నియమాలు.

యోగసాధకుడు ఏయే ఆసనాలు వేయాలో, ఎటువంటి ముద్రలు పాటించాలో పింగళిసూరన క్రిందివిధంగా తెలియజేశాడు.

"దక్షిణ పాదం బుదక్షిణాంకమున, న / దక్షిణ పాదంబు దక్షిణాంక
మున నిడి, యిరు గేలు వెనుకఁగా వీడ్వడ / నిగిడించి, బొటవ్రేళ్ళు దగులఁబట్టి,
యురముపైఁ జిబుకాగ్ర మొనరంగ హత్తించి / దృష్టి నాసాగ్ర సంస్థితము సేసి
యునికి, పద్మాసన మన నొప్పు, నిందుఁగొం / దఱు చిబుక వ్యవస్థా నియమము
చెప్పు, రొకకొంద ఱూరు సుస్థితిగ, నడుగు
దోయి యత్తానముగ నిడఁ, దొడల నడుమ
నట్ల పాణులు నిలిపి, నాసాగ్ర దృష్టి
యగుచు నునికి, పద్మాసనం బంద్రు బుధులు"[94]

దక్షిణపాదాన్ని వామాంకం మీద, వామపాదాన్ని దక్షిణాంకం మీద ఉంచుకోవాలి. రెండు చేతులు వెనక్కు లాగి, బ్రొటనవేళ్ళు చూపుడు వ్రేళ్ళకు తాకించాలి. హృదయం పైన ఏకాగ్రత వహించాలి. దృష్టి

నాసాగ్రం మీద ఉంచాలి. ఈవిధంగా పద్మాసనం వేసుకొని, వాయుప్రస్థాన్ని నియంత్రణ చేస్తూ, శరీరంలోని కీలక స్థానాల్లో దృష్టిని నిలుపుతూ సాధన చేయాలి. దీన్నే పండితులు పద్మాసనం అంటారు.

యోగసాధకుడు పాటించవలసిన ప్రత్యాహార విధానాల్ని పింగళిసూరన క్రిందివిధంగా తెలియజేశాడు.

"ఇంద్రియార్థములందు నింద్రియంబులఁ బ్రవ / ర్తిలనీక కుదియించి త్రిప్పుటొకటి
యవి యెందుఁ జరియించె నది సమస్తంబు నా / త్మయ కాఁగ మనసులోఁ దలుఁచు టొకటి
నిత్య కర్మంబు లన్నియు నాత్మయంద సం / తతము చిత్తముచే నొనర్చు టొకటి
తనువునఁగల పదునెనిమిది మర్మ సీ / మలఁ గ్రమంబున గాడ్పు నిలుపు టొకటి
యోగశాస్త్ర శీల యుతుల ప్రత్యహార
భేద రీతులనుచు నాదరమున
సాంప్రదాయికముగఁ జలుపుచు నుండుదు
రో వసుంధరా సురావతంస!"[95]

ఇక్కడ నాలుగు రకాల ప్రత్యాహార విధానాలు చెప్పబడ్డాయి. శబ్ద, స్పర్శాది ఇంద్రియార్థాలను ఇంద్రియాలయందు కలుగకుండా కుదించి త్రిప్పేది ఒకటి. మనస్సులో వాటిని అనుభవింప చేసేది మరొకటి. నిత్యకర్మలను ఆత్మయందు కలిగేటట్లు చేసేది ఇంకొకటి. శరీరంలో గల పద్దెనిమిది మర్మసీమల్లో క్రమంగా వాయువును నిలిపేది ఒకటి. ఈవిధంగా ప్రత్యాహార విధుల్ని సాంప్రదాయికంగా యోగశాస్త్ర సాధకులు అనుసరిస్తున్నారు.

వెలగపూడి కృష్ణయామాత్యుడు రాసిన 'భానుమద్విజయము'లో యోగశాస్త్ర విశేషాలు వర్ణించబడ్డాయి. రాజయోగం గురించి కవి క్రిందివిధంగా వర్ణించాడు.

"వర షడాధారాబ్జ భావనా సంసిద్ధి
యజపా స్వరూపంబు నందఁజేయుఁ
గేవల కుంభక శ్రీవిలాసంబును
హఠము స్వరూపంబు నందఁజేయు

షణ్ముఖీకరణ సజ్జనితా రవంబుల

యంబు స్వరూపంబు నందఁజేయు

మండల త్రయ మధ్యమార్గమౌ తారక

మట్ల స్వరూపంబు నందఁజేయు

వితత కాల త్రయోపాధి బిందు నాద

ఘన కళాతీత రాజయోగంబు వడిగ

నాత్మ బోధస్వరూపంబు నందఁజేయు

సకల కవి భోజరాజ రాజాధిరాజ!"[96]

షట్చక్రాలను భావన చేయటం వల్ల భగవంతుడితో సారూప్యతను పొందవచ్చు. కుంభక మొదలైన వాయునిరోధ మార్గాల వల్ల హఠయోగ స్వరూపం కలుగుతుంది. మండల త్రయ సాధన వల్ల నక్షత్రం వంటి స్వరూపం లభిస్తుంది. అదేవిధంగా రాజయోగం ఆత్మబోధ స్వరూపాన్ని అందజేస్తుంది. మిగిలిన మార్గాల కంటె రాజయోగం వల్లనే తొందరగా ఆత్మసాక్షాత్కారాన్ని పొందవచ్చు. ఈ యోగమార్గాలు వేరైనా, ఫలితం మాత్రం ఒక్కటే. అదే జీవన్ముక్తి.

'భానుమద్విజయము'లో, యోగసాధనలో ముఖ్యమైనది, ఆత్మసాక్షాత్కారాన్ని కలిగించేది అయిన 'కుండలినీ విద్య' గురించి వర్ణించబడింది.

"మూలాధారము నుండి బ్రహ్మసుషిరంబుం దాఁకఁగా వంటి వ

జ్రాలం బోలు సుషుమ్నఁ జొచ్చి నడుమన్ రాజత్తటి త్కోటి భా

జాలంబై బిసతంతువైఖరిని హెచ్చంగాంచు శ్రీమూర్తి నే

వేళన్ భవనఁజేయు టెన్నఁగను లో వీక్షించు లక్ష్యంబగున్"[97]

మూలాధార చక్రం మొదలుకొని, సహస్రార చక్రం వరకు ఉన్న, వజ్రాల లాంటి ఏడు చక్రాలను దర్శించాలి. వాటి మధ్య ఉన్నటువంటి, ప్రకాశంతో కూడినటువంటి శ్రీమూర్తి (పరమాత్మను)ని ఎప్పుడూ

భావన చేస్తూ ఉండాలి. అంతరంగ ప్రయాణం వల్ల నిరంతరం ఆత్మపై దృష్టిని నిలపటం వల్ల సంసారబంధాల నుండి విముక్తిని పొందవచ్చు.

యోగసాధనలో వాయుప్రసారాన్ని నిరోధించటం ముఖ్యమైన పని. కుంభక, రేచక సాధనాల ద్వారా దీన్ని సాధించవచ్చు. భానుమద్విజయములో ప్రాణాపాన వాయువుల్ని నిరోధించటం గురించి క్రింది విధంగా వర్ణించబడింది.

"ప్రాణాపానము లన్నిరోధము మీఱంజేసి యుచ్ఛ్వాస ని
స్త్రాణత్వంబున సొక్కుఁబూనుట జగద్భ్రాంతిన్ విసర్జించుటే
ప్రాణాయామ మనంగ నాది మును లొప్పం జెప్పుచుండ్రెప్పుడున్
వీణాగాన వినోద వాంఛిత మతీ! వీరాధి వీరాకృతీ!"[98]

ప్రాణాపానాది వాయువుల్ని నిరోధించాలి. ఉచ్ఛ్వాసనిశ్వాసాల్ని నియంత్రించాలి. దీనివల్ల మనస్సు లౌకిక విషయాల నుండి బయటపడుతుంది. వాయు ప్రసారం వల్ల మనస్సు చలిస్తుంది. వాయుప్రసారాన్ని నిరోధిస్తే, మనస్సులోని చంచలత్వం కూడా తగ్గుతుంది.

కనుపర్తి అబ్బయామాత్యుడు రాసిన 'అనిరుద్ధచరిత్రము'లో యోగవిద్య ప్రస్తావన ఉంది. ఉషాదేవి చెలికత్తె అయిన చిత్రరేఖ యోగవిద్యను అభ్యసించింది. అణిమాది అష్టసిద్ధుల్ని పొందింది. అణిమాది అష్టసిద్ధుల్లో 'లఘిమ' ఒకటి. దీని సహాయంతో భారీ శరీరాన్ని, సూక్ష్మ శరీరంగా మార్చవచ్చు. ఈ విద్యసహాయంతోనే చిత్రరేఖ అనిరుద్ధుడిని సూక్ష్మరూపంలోకి మార్చి, ఉషాదేవి అంతఃపురానికి తీసుకువచ్చి, వారిద్దరినీ ఒక్కటి చేస్తుంది. దీన్ని అబ్బయామాత్యుడు ఈవిధంగా వర్ణించాడు.

"శోణ పురీశుండు బాణాసురుం డనా
హత శౌర్యశాలి సహస్ర బాహుఁ
డతని కూఁతురు రూపయౌవన భాగ్యల
క్షణ, కళావతి, యుషాకన్య యెసఁగు
నాయింతి కలలోన ననిరుద్ధుఁ బొడగాంచి

మోహించి సంతాపమునఁ గృశింపఁ

జెలికత్తెయై తగు చిత్ర రేఖాంగన

యాత్మీయ యోగ విద్యానిరూఢి

నింగి నేతెంచి శయ్యపై నిదురపోవు

వానిఁ గొనిపోయి యా చంద్ర వదనఁగూర్చె

నతఁడుఁద త్కిలికించిత రతి సుఖాబ్ధి

మగ్నుఁడైయుండె నితరంబు మఱచి యందు"[99]

అనిరుద్ధుడు, ఉషాకన్యకు కలలో కనిపించాడు. చిత్రరేఖ అతడి చిత్రపటాన్ని గీసి ఉషకు చూపిస్తుంది. యోగసిద్ధం వల్ల అనిరుద్ధుడిని రహస్యంగా తీసుకువచ్చి, ఉషానిరుద్ధులను ఒక్కటి చేసింది.

దగ్గుపల్లి దుగ్గన రాసిన 'నాసికేతోపాఖ్యానం'లో కూడా యోగవిద్య ప్రస్తావన ఉంది. తృణబిందుడు అనే రాజర్షి, నాచికేతుడి తల్లి గతాన్ని యోగదృష్టి ద్వారా తెలుసుకుంటాడు. ఈ సందర్భాన్ని దుగ్గన క్రింది విధంగా వర్ణించాడు.

"మహిత దివ్యజ్ఞాన మహనీయ చారిత్రుఁ

డనఁగమించిన యమ్మహానుభావుఁ

డాత్మగతంబున నత్తెఱఁగెఱుఁగంగఁ

దలపోసి కన్నుఁదమ్ములు మొగిడ్చి

సమధికధ్యానాను సంధానవాసనా

భావితంబగు యోగబలమునందు

నక్కాంతవృత్తాంత మాద్యంతమంతయుఁ

గరతలా మలకంబుగా నెఱింగి

వినయసంభ్రమానంద పవిత్రవృత్తు

లాత్మలో నంతకంతకు నగ్గలింప

ఘనదయామృతపూర్ణ వీక్షణములలర

నెలమినమ్మానవతి తోడ నిట్టులనియె"[100]

నాచికేతుడి తల్లి, వివాహం కాకుండానే గర్భవతి అవుతుంది. ఒకరోజు చెలికత్తెలతో కలిసి ఆమె నదీస్నానానికి వెళుతుంది. అక్కడ ఒక తామర పువ్వును చూసి, దాన్ని ముక్కు దగ్గరకు తీసుకొని వాసన చూస్తుంది. ఆ పువ్వులో ఒక ముని వీర్యాన్ని విడిచి ఉన్నాడు. దాన్ని ఆమె గమనించకుండా వాసన చూస్తుంది. వీర్యం ఆమె శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఆమె గర్భవతి అవుతుంది. తల్లిదండ్రులు ఆమెను ఇంటినుండి వెళ్ళగొడతారు. ఈ కథనంతా రాజర్షి యోగదృష్టి వల్ల తెలుసుకోగలిగాడు.

4.3.5. మీమాంసాదర్శనం:-

'మీమాంస' అనే పదానికి 'లోతుగా తెలుసుకోవటం, పరిశీలన, పరిశోధన'[101] అనే అర్థాలున్నాయి. వైదిక ధర్మం ఏమని చెపుతుంది?, వైదిక కర్మల విషయంలో దేన్ని చేయవచ్చు?, దేన్ని చేయకూడదు? అనే విషయాల గురించి లోతుగా పరిశీలించటమే మీమాంస. ఆత్మఏది? బ్రహ్మఏది? ఆనంద స్వరూపం అంటే ఏమిటి? వంటి విషయాల పట్ల జిజ్ఞాస, విచారం కలిగివుండటమే మీమాంస. ఇందులో తార్కికమైన ఆలోచన, కార్యకారణ పరిశీలన ప్రధానంగా ఉంటాయి.

మీమాంస అంటే ధర్మజిజ్ఞాస. ధర్మం వేదోక్తం. వేదార్థాన్ని నిశ్చయం చేయటానికి ఉపయోగించే సూత్రాలు, పద్ధతులు కూడా మీమాంసలో అంతర్భాగమే. వైదిక కర్మలను, వేద వాక్యాలను వివేచించటం, నిశ్చయించటం, వ్యవస్థీకరించటం చేసేదే మీమాంసాశాస్త్రం.

ప్రాచీనకాలంలో ఆత్రేయ, ఆశ్వరథ్య, కార్ష్ణజిని, బాదరి, ఐతిశాయన, కాముకాయన, బాబుకాయన, ఆలేఖన, కాళకృత్స్న అనే తొమ్మిది మంది మీమాంసాశాస్త్రాన్ని అభివృద్ధి చేసారు. వీరిలో మొదటి ఎనిమిది మంది 'మీమాంసాసూత్రము'లో, చివరివాడైన 'కాళకృత్స్న', పతంజలి 'మహాభాష్యం'లో చెప్పబడ్డారు. వీరి గ్రంథాలు ప్రస్తుతం లభించటం లేదు. 'మీమాంసాసూత్రాన్ని' జైమిని రాసాడు. ప్రాచీన మీమాంసాశాస్త్ర గ్రంథాల్లో ఇది ప్రామాణికమైంది.

మీమాంసాదర్శనం-సిద్ధాంతం:- ఆత్మ కర్త, భోక్త. ఆత్మలు అనేకాలు. ఆత్మ చైతన్య విశిష్టం. కొన్ని పరిస్థితుల్లోనే అది చైతన్యం కలది. జ్ఞానిసుఖాది గుణాలు దానికి కలుగుతుంటాయి. శరీరంలోని ఇంద్రియ

విషయాలతో ఆత్మ బద్ధమై ఉంటుంది. దీనివల్లనే ఆత్మకు కూడా సుఖదుఃఖ రూపమైన అనుభవం కలుగుతున్నది. ఈ త్రివిధబంధం నుండి బయటకు రావటమే మోక్షం.

ఆత్మబద్ధత అనేది ధర్మాధర్మాల వల్ల కలుగుతుంది. అవి నిశ్శేషం కావాలి. అప్పుడు ఆత్మ పరిశుద్ధం అవుతుంది. వేదాల ద్వారా ప్రతిపాదించబడింది ధర్మం. దానికి విరుద్ధమైంది అధర్మం. అనుభవం వల్ల ధర్మాధర్మ ఫలం నశిస్తుంది. ఫలాపేక్ష లేకుండా చేసే కర్మల వల్ల ఆత్మ లౌకిక బంధాల నుండి విముక్తిని పొందుతుంది. అప్పుడే మానవుడు ముక్తిని పొందగలడు.

మహాభారతంలోని ఆనుశాసనిక, శాంతి పర్వాల్లో ధర్మరాజు భీష్ముడిని చాలా ప్రశ్నలు అడిగి, సమాధానాలు తెలుసుకొంటాడు. ధర్మరాజు వేసే ప్రశ్నల్లో ధర్మాధర్మమీమాంస ప్రధానంగా కనిపిస్తుంది. ఏ పని చేయాలి? ఏది చేయకూడదు? రాజుకు ఏది ఆనందాన్ని కలిగిస్తుంది? వంటి ప్రశ్నలు ఇక్కడ కనిపిస్తాయి.

సర్వోత్తమమైన ధర్మం ఏది? అని ధర్మరాజు అడిగిన ప్రశ్నకు భీష్ముడు క్రిందివిధంగా సమాధానమిచ్చాడు.

"విను మనేక విధంబుల విస్తరిల్లు / ధర్మములయం దొకండును దలఁప నిష్ప
లంబు లే; దాత్మ మోక్షావలంబి యైన / ధర్మ ముత్తమ మంద్రు తత్త్వజ్ఞు లధిప!"[102]

ఓ ధర్మరాజా! ధర్మం చాలా విధాలుగా విస్తరిల్లి ఉంది. దానిలో ఎంతగా వైవిధ్యం ఉన్నా, మరెంతగా విస్తృతి ఉన్నా, మొత్తం మీద సర్వమూ ఆచరణయోగ్యమే. అయితే ధర్మతత్త్వం తెలిసినవారు మాత్రం తమకు ముక్తిని ప్రసాదించగలదే ఉత్తమమైన ధర్మమని పలుకుతారు.

"ప్రియములు నప్రియములును హృ / దయమునఁ బొరయమియ మోక్షదంబగు ధర్మం
బయమహితా! తద్బోధవి / షయ మగు నితి హాసముం బ్రసన్నాకృతిగన్"[103]

ఓ రాజా! ఇష్టానిష్టాలను హృదయంలో కలుగకుండా చూడగలగటమే మోక్షప్రదమైన ధర్మం. ప్రియాప్రియాలు మనస్సులో కలుగకుండా జీవించటమే ఉత్తమమైన సాధన. దీన్ని తెలియజేసేదే సేనజిత్తు అనే రాజు కథ.

జ్ఞానయోగం గొప్పదా! కర్మయోగం గొప్పదా! ఏది ముక్తి పొందటానికి సరియైన మార్గం అని ధర్మరాజు అడిగిన ప్రశ్నకు భీష్ముడు 'మను బృహస్పతి సంవాదాన్ని' వినిపించాడు. మనువు తన గురువైన బృహస్పతికి నమస్కరించి, తనకు ముక్తి మార్గాన్ని తెలుపమని క్రిందివిధంగా వేడుకొన్నాడు.

"జ్ఞానయోగము కృపాసంపన్న బుద్ధి నా / కెఱిఁగింపవే!' యన్ననెలమి నాతఁ
డతని కిట్లను 'ననఘ! సత్కర్మ యో / గ శ్రద్ధ దానికిఁ గారణం బ
నిష్టంబు ద్రోవను నిష్టంబు దేరను / నరుఁడు కర్మాచరణం బొనర్చు
నెయ్యవి సుఖము లొక్కింత కాలమునకు / నవియు దుఃఖంబులై యావహిల్లు;
నింత యెఱింగి ఫలమునెడ నిరపేక్షఁడౌ / నతఁడు సౌఖ్యదుఃఖయమముఁద్రోచి
కామముఖ్య విపదకంపిత జ్ఞాన వి / శేషబుద్ధిఁ బరమసిద్ధిఁబొందు"[104]

ఓ పాపరహితుడవైన మనూ! జ్ఞానయోగానికి మూలం మంచి కర్మయోగమే అనిష్టాన్ని తొలగించుకోవటానికి, ఇష్టాన్ని పొందటానికి మానవుడు కర్మ చేస్తాడు. ఏవి సుఖాలుగా అందుతాయో, అవే తర్వాత కాలంలో దుఃఖాలుగా పరిణమిస్తాయి. కాబట్టి నిష్కామకర్మయోగం వల్ల జ్ఞానయోగం, తద్వారా మోక్షప్రాప్తి కలుగుతాయి.

పోతన భాగవతంలో కూడా ధర్మశాస్త్ర మీమాంస, ఆత్మతత్త్వ వివేచన కనిపిస్తాయి. కొద్ది రోజుల్లోనే చనిపోవటానికి సిద్ధంగా ఉన్న పరీక్షిత్తు, శుకమహర్షిని ముక్తి మార్గం తెలుపమని వేడుకున్నాడు. అన్ని యోగాల్లోకి ఏది ఉత్తమమైంది? దేని వల్ల సంసారబంధాల నుండి విముక్తి లభిస్తుంది? అని పరీక్షిత్తు అడిగిన ప్రశ్నలకు శుకయోగి క్రింది విధంగా సమాధానం చెప్పాడు.

"హరి నెఱుంగక యింటిలో బహుహాయనంబులు మత్తుఁడై
పొరలుచుండెడి వెఱ్ఱి ముక్తికిఁ బోవ నేర్చునె? వాఁడు సం
సరణ ముం బెడఁబాయఁడెన్నఁడు; సత్య మా హరినామ సం
స్మరణమొక్క ముహూర్తమాత్రము చాలు ముక్తిదమౌ నృపా!"[105]

ఓ రాజా! విష్ణుదేవుడిని తెలుసుకోకుండా మత్తెక్కి సంవత్సరాల తరబడి సంసారంలో పొరలాడుతూ సతమతమయ్యే అవివేకికి ముక్తి ఎలా కలుగుతుంది. అటువంటి వాడు ఎన్నటికీ సంసారబంధం నుండి బయటకు రాలేడు. ఇది నిజం. ఒక్క క్షణమైనా హరినామం స్మరిస్తే చాలు. అది ముక్తిని ప్రసాదిస్తుంది.

శుకమహర్షి శ్రీహరి యొక్క తత్వాన్ని క్రింది విధంగా పరీక్షిత్తుకు తెలియజేశాడు.

"కలలోన జీవుఁడు కౌతూహలంబునఁ బెక్కు దేహంబులఁబేరు వడసి
యింద్రియంబుల వెంట నెల్లవృత్తంబులు నీక్షించి మఱి తన్ను నెఱుఁగుకరణి
నఖిలాంతరాత్మకుఁడగు పరమేశ్వరుఁడఖిల జీవుల హృదయముల నుండి
బుద్ధి వృత్తుల నెల్ల బోధ్దయై వీక్షించు బద్ధుండు గాఁడు ప్రాభవము వలన
సత్యుఁడానందబహుళ విజ్ఞానమూర్తి, యతని సేవింపనగుఁగాక, యన్యసేవఁ
గలుగనేరవు కైవల్యగౌరవములు, పాయ దెన్నఁడు సంసారబంధ మధిప"[106]

సంసారబంధం నుండి బయటపడే మార్గం ఏమిటి? అని అడిగిన పరీక్షిత్తుకు శుకయోగి పై విధంగా సమాధానం చెప్పాడు. ఓ రాజా! జీవుడు కలలో చాలా శరీరాలు ధరిస్తాడు. చాలా పేర్లతో వ్యవహరించబడతాడు. ఇంద్రియాల ద్వారా విశేషాలన్నీ గమనిస్తాడు. తర్వాత తనను తాను తెలుసుకుంటాడు. అలాగే అంతటిలోనూ అంతర్యామిగా ఉన్న పరమేశ్వరుడు అన్ని ప్రాణుల హృదయాల్లో ఉండి, ప్రజ్ఞావంతుడై బుద్ధివ్యాపారాలు అన్నింటినీ పరిశీలిస్తుంటాడు. తానే అన్నిటికీ ప్రభువు కాబట్టి దేనికీ బద్ధుడు కాడు. ఆయన సేవ వల్లే మోక్షం సిద్ధిస్తుంది. లేకపోతే ఈ సంసారబంధం తొలగిపోదు.

'ఆముక్తమాల్యద' లోని ఖాండిక్యకేశిధ్వజోపాఖ్యానంలో కూడా ధర్మతత్త్వం, ఆత్మతత్త్వం వివేచించబడ్డాయి. ఖాండిక్యుడు, కేశిధ్వజుడికి క్రిందివిధంగా ఆత్మతత్వాన్ని తెలియజేశాడు.

"ఆత్మకాని మేన నాత్మబుద్ధియును న
స్వంబునందు మిగుల స్వత్వమతియు,
నవనివర, యవిద్య యను మహాతరువు ను
త్పత్తి కీద్వయంబు విత్తు మొదలు"[107]

ఓ రాజా! తాను కానటువంటి దేహం పట్ల తాను అనే భావన, బంధుమిత్రాదులు తనవి అనే తలంపు, ఈ రెండూ అజ్ఞాన మహావృక్షానికి బీజం వంటివి.

"నరనాథ, పాంచభౌతిక
శరీరమున దేహి మహ సాంద్రతమతమః
పరివృతుఁడై, 'యే, నిది నా
పరికర' మని యవధి లేనిభ్రమఁబడి తిరుగున్"[108]

ఓ రాజా! పంచభూతాలతో నిర్మించబడిన శరీరంలో జీవాత్మ అవిద్య వల్ల దట్టమైన చీకట్లతో ఆవరించబడుతున్నది. అహంకార మమకారాలు అనే భ్రాంతిలోపడి తిరుగుతున్నది. ఖాండిక్యుడు పరమపదాన్ని పొందే మార్గాన్ని కూడా కేశిధ్వజుడికి తెలియజేశాడు.

"జనిసాహస్ర బహుప్రయాణ మగు సంసారంపుఁ ద్రోవ న్సదా
చనుచుండు న్ఘన మోహఖేద మలమ న్సంసారి పాంథుండు, వా
సన లన్ ధూళి ముసుంగు గాఁగ; నెపుడేన్ జ్ఞానంపుటుష్ణోదకం
బునఁ దత్ఖాళన సేయు, వాని కపు డమ్మోహశ్రమంబు న్జనున్"[109]

సంసారి అయిన జీవుడు వేలకొలది జన్మలనే ప్రయాణాలు చేస్తూ, సంసార మార్గంలో అనాది కర్మవాసనలు అనే ధూళిలో చిక్కుకొని, అవిద్య అనే సొలపు వల్ల శ్రమలో మునిగిపోయి ప్రయాణం చేస్తూంటాడు. ఎప్పుడైతే విద్య అనే వేడినీళ్ళు తగులుతాయో, అప్పుడు ఆ కర్మవాసనధూళి పోతుంది. అవిద్య వల్ల కలిగిన శ్రమ కూడా తొలగిపోతుంది. కాబట్టి జీవుడు 'విద్య' వల్ల కర్మవాసనను జయించి శాశ్వతమైన మోక్షాన్ని పొందగలడు. ఇక్కడ విద్య అంటే, కర్మలకు తాను కర్తను, భోక్తను కాదనే ఎఱుకను కలిగివుండటం.

'ప్రబోధ చంద్రోదయము'లో ఆత్మవిద్య గురించిన మీమాంస కనిపిస్తుంది. శాంతి, నిరహంకార జ్ఞానదేవులు పరమపురుషుని విషయంలో చేసిన సంవాదంలో మీమాంస, తర్కం కనిపిస్తాయి.

"అప్పుడు మీమాంస యాత్మ శిష్యులవద
నాంభోజములు గదియంగఁజూచి

యీ కాంతమాటలు లోకోత్తర ఫలంబు
లనుభవింపఁగఁజేయు నాత్మయట్లు
గానఁ గర్మోపయోగమున నిచ్చటనుండ
నిండన నొకశిష్యుఁ డిచ్చగించె
నంతఁ గుమారిలుం డను హితశిష్యుండు
మీమాంసఁ జూచి యీకోమలాంగి
పొగడ దుపయుక్త కర్మునిఁ బురుష నెందుఁ
దానకర్తయు భోక్తయౌ వానిఁగాని
యనిన మఱియొక ప్రియ శిష్యుడనియె నొక్క
పురుషుఁడేకాక వేఱెయీశ్వరుడు గలఁడె"[110]

పై పద్యంలో కర్మకు కర్త, భోక్త అయినటువంటి ఈశ్వరుడి గురించిన మీమాంస కనిపిస్తుంది. ఉపనిషత్ వనితామణి అయిన శాంతి, కుమారుడు అయిన 'పురుషుని'కి ప్రకృతి పురుషుల తత్త్వాన్ని క్రిందివిధంగా తెలియజేసింది. 'ప్రబోధ చంద్రోదయం' వేదాంతవిషయాలతో కూడిన నాటకం. అందువల్ల ఇందులోని పద్యాలు చాలా నిగూఢమైన విషయాలను సూచిస్తుంటాయి.

"అంత మీమాంస చే ననిపించుకొని తర్క
విద్యలఁ బొడగంటి వివిధమతుల
నందు నొక్కత నిగ్రహచ్చలజాతిమ
న్యాయాలి చెవిదండ ననును జల్ప
మునఁదాను బహువాదములు చేయునొక్కతె
విశ్వవిశేషంబు విస్తరించు
నొకతె పురుషుఁడును ప్రకృతియు మేఱను
క్రమమున మహదహంకార ముఖ్య
తత్త్వగణనా పరాయణత్వంబుదాల్చి
నట్టివారల డాయంగ నరిగి చోటు

వేడ నీకర్మమేనని విద్యలిడిగె

నంటి మీమాంసతోడ నన్నట్ల నేను"[111]

ఉపనిషత్సతి తన గురించి పురుషుడికి పైవిధంగా చెప్పింది. తర్కవిద్యలను నేర్చుకున్నాను. వాటిలో ఒకటి రకరకాలుగా వాదనలు వినిపిస్తూ విశ్వవిశేషాల్ని తెలియజేస్తుంది. మరొక విద్య, ప్రకృతి వేరు, పురుషుడు వేరు అని వాదిస్తుంది. ఈ విధంగా ప్రబోధచంద్రోదయంలో మీమాంస, తర్కవిద్యల ప్రస్తావన ఉంది.

4.3.6. వేదాంత దర్శనం :–

'బ్రహ్మము' నుండే సృష్టి పుట్టడం, లయం కావడం జరుగుతుంది. బ్రహ్మము నుండే ఈ వైవిధ్యమంతా వస్తుంది. ఒకే భూమి నుండి రాళ్ళు, మణులు పుట్టినట్లు, ఒకే 'బ్రహ్మము' నుండి సృష్టి ప్రారంభం వినాశనం జరుగుతున్నాయి. బ్రహ్మములో అన్నిధర్మాల ఉపపత్తి ఉంటుంది. అది, దాని నుండి పుట్టిన అన్ని పదార్థాల్లోనూ ఉంటుంది. అదే పురుషునిలో ఉన్నటువంటి జ్యోతి. ఈ బ్రహ్మము అంతరంగంలో వడ్లగింజకొన వలె ఉంటుంది. బ్రహ్మనిష్ఠ ద్వారా ఆ జ్యోతిని దర్శించవచ్చు. అప్పుడే మానవుడు మోక్షాన్ని పొందుతాడు అని వేదాంత దర్శనం చెబుతుంది.

ఈ వేదాంత దర్శనాన్ని ప్రతిపాదించినది బాదరాయణుడు. ఈయన రాసిన గ్రంథం 'బ్రహ్మసూత్రము'. దీనికే వేదాంతసూత్రం, శారీరక మీమాంసాసూత్రం, ఉత్తర మీమాంసాసూత్రం అనే పేర్లు ఉన్నాయి. ఉపనిషద్వాక్యాలు అన్నింటిని సమన్వయం చేసి, అవి బ్రహ్మప్రతిపాదకాలనీ, వాటి ఆధారంగా నిర్మింపదగిన దర్శనం చాలా సులభమైనది అని, మిగిలిన దర్శనాల్లో లాగా ఇందులో దోషాలు ఉండటానికి వీలులేదని బాదరాయణుడి అభిప్రాయం. 'బాదరాయణుడు' అనే పేరుతో వ్యాసుడే ఈ దర్శనాన్ని ప్రతిపాదించాడని నానుడి. పాణిని చెప్పిన 'పారాశర్యభిక్షుసూత్రము', బాదరాయణుని 'బ్రహ్మసూత్రం' ఒక్కటే అనే అభిప్రాయం కూడా ఉంది.

"ఆకాశాది సమస్త భూతములు బ్రహ్మముచే సృష్టించబడినవే. చుట్టబడిన గుడ్డయే పరువబడినట్లు బ్రహ్మకు, జగత్తునకు అనన్యత్వము కలదు. ప్రాణమును (ఊపిరిని) బిగపట్టిన, అది ఏ ఇతర కార్యమును చేయలేక కేవలము జీవము నొసగు కార్యమును మాత్రమే చేయును. లేనిచో అవయవములు చావుట,

ముడుచుట మొదలగు అన్ని పనులు చేయును. నిరోధింపబడినప్పుడు, లోనికి బయటికి వచ్చుచున్నప్పుడును కూడా ప్రాణము ప్రాణమే. అట్లే జగత్తుగా నున్నప్పుడు, సృష్టికి పూర్వము కూడా బ్రహ్మము బ్రహ్మమే"[112]. ఇక్కడ బ్రహ్మం యొక్క గుణాలు వివరించబడ్డాయి. మిగిలిన దర్శనాల్లో ఆత్మ, పరమాత్మ, ఈశ్వరుడు అనే పదాలను భగవంతుడికి వాడటం కనిపిస్తుంది. ఈ దర్శనంలో బ్రహ్మము అన్నిటికి మూలం అని చెప్పబడింది.

మిగిలిన దర్శనాల్లో లాగా ఇక్కడ ప్రకృతి పురుషుల చర్చ కనబడదు. ఆత్మవేరు, పరమాత్మ వేరు అనే తారతమ్యం లేదు. బ్రహ్మం నుండే అన్ని జీవులు, పదార్థాలు ఆవిర్భవిస్తున్నాయని వేదాంతుల అభిప్రాయం. బ్రహ్మము రూపరహితం, నామరహితం. బ్రహ్మానికి లింగభేదం లేదు. కాబట్టి మిగిలిన దర్శనాల్లో ఉన్న స్వల్పమైన దోషాలు కూడా ఇందులో ఉండవని వేదాంతుల అభిప్రాయం. ఈ నిర్గుణమైన పరబ్రహ్మ సాక్షాత్కారమే ముక్తికి మార్గం అని వేదాంతదర్శనం ప్రతిపాదిస్తుంది.

మహాభారతంలోని శాంతిపర్వంలో, వ్యాసుడు శుకయోగికి పరబ్రహ్మ ప్రాప్తి సాధన గురించి చెప్పే ఘట్టం ఉంది. ఇది బ్రహ్మవిద్య గొప్పదనాన్ని తెలియజేస్తుంది. వేదాంతదర్శనంలో చెప్పబడిన బ్రహ్మమును చేరుకొనే సాధనే బ్రహ్మవిద్య.

ఓ మునీశ్వరా! యజ్ఞక్రియల ద్వారానా? లేక జ్ఞానం వల్లనా? యోగాన్ని పాటించడం వల్లనా? ఏవిధంగా పరబ్రహ్మను చేరవచ్చు అని శుకయోగి వ్యాసుడిని ప్రశ్నిస్తాడు. అప్పుడు వ్యాసుడు క్రింది విధంగా బ్రహ్మవిద్య గురించి బోధిస్తాడు.

"అనుటయు నమ్మునిప్రవరుఁడాతని కిట్లను 'నీవు పేరు గ్రు
చ్చినయవి యెల్ల మేల; సవిశేషతపంబును, నింద్రియప్రవ
ర్తనముల నిగ్రహంచుటయు, రాగము లోభముఁద్రోవఁజాలు నే
ర్పును దృఢవిద్యయుం గలుగు పుణ్యుఁడు వొందఁగనోపు బ్రహ్మమున్"[113]

ఓ శుకయోగీ! నువ్వు ఇప్పుడు చెప్పిన యజ్ఞాదులన్నీ బ్రహ్మపదప్రాప్తికి ఉపకరించే సాధనాలే. అంతేకాకుండా తపస్సు, ఇంద్రియ నిగ్రహం, రాగలోభ నివారణ, దృఢమైన విద్య కలిగిన పుణ్యాత్ముడు

తప్పకుండా బ్రహ్మపదప్రాప్తిని పొందుతాడు. శ్రోత్రం మొదలైన ఐదు జ్ఞానేంద్రియాలు పరబ్రహ్మ దర్శనానికి ఆటంకాలుగా ఉన్నాయి. వాటిని నిరోధిస్తే బ్రహ్మప్రాప్తికి అవసరమైన మనోనైపుణ్యం లభిస్తుంది.

వ్యాసుడు, పరబ్రహ్మప్రాప్తి పొందిన తర్వాత కలిగే ఫలితాలను క్రిందివిధంగా శుకయోగికి తెలియజేశాడు.

"వినయము విద్యయుం గలుగు విప్రునియందును, గోవునందు, నొ
ప్పు నెఱయు హస్తియందు నొకపోఁకకుఁబోవని కుక్కయందు, దా
ని నడఁచి తెచ్చివండి తిను నీచమాలనియందుఁ దుల్యద
ర్శనులు దదంతరాత్ముని నిరంజనునిం గనునట్టి పండితుల్"[114]

పుత్రా! ఏ విధంగా బ్రాహ్మణాదుల్లో పరిశుద్ధమైన పరమాత్మను పండితులు చూస్తారో, బ్రహ్మప్రాప్తి తర్వాత వారు గోవులోను, ఏనుగులోను, కుక్కలోను, కుక్క మాంసం తినే చండాలుడి లోనూ అదే పరమాత్మను దర్శించగలరు. బ్రహ్మప్రాప్తి తర్వాత 'అనేకం' అనే భావన నశించి, 'ఏకం' అనే భావన కలుగుతుంది. అప్పుడు మానవుడు సృష్టిలోని అన్ని పదార్థాల్లో ఉన్న పరమాత్మ ఒక్కడే అని దర్శించగలడు.

వ్యాసుడు, జీవాత్మ ఏవిధంగా పరమాత్మను చేరుకోగలదో క్రిందివిధంగా వివరించాడు.

"క్షరము నక్షరమును ననం గలవురెండు
మూర్తు; లాత్మ కఖిల భూతములను బూర్వ
మొలయు మృత మన దివమున నుండు నమృత
మనఁగ నపరంబు రెంటిని గను బుధుండు"[115]

ఆత్మకు క్షరమనీ, అక్షరమనీ రెండు మూర్తులున్నాయి. క్షరం అంటే నశించిపోయే స్వభావం. అక్షరం అంటే నాశనం లేని స్వభావం. 'క్షరం' అన్ని ప్రాణుల్లో మృత్యువు అనే పేరుతో ఉంటుంది. 'అక్షరం' అనేది 'అమృతం' అనే పేరుతో పిలువబడుతుంది. ఇది స్వర్గలోకంలో ఉంటుంది. పండితుడైనవాడు ఈ రెండింటికి ఉన్నటువంటి తేడాని గుర్తించగలడు. అవిద్యను తొలగించుకొన్నప్పుడు జీవాత్ముడే పరమాత్ముడు అవుతాడు అని వ్యాసుడు శుకమహర్షికి బ్రహ్మపదప్రాప్తిని తెలియజేశాడు.

ప్రహ్లాదుడు శ్రీహరిభక్తి వల్ల అతి చిన్న వయస్సులో ఆత్మసాక్షాత్కారాన్ని పొందాడు. బ్రహ్మమును దర్శించాడు. తాను ఏ పని చేస్తున్నా, మనస్సు నిరంతరం శ్రీహరి మీదనే లగ్నం చేసేవాడు. రోజురోజుకీ ఈ హరిభక్తి అతిశయించింది. చివరకు ఆ ప్రహ్లాదుడు పరమానందస్థితికి చేరుకున్నాడు. ప్రహ్లాదుడు అనుభవించిన పరమానందస్థితిని పోతన క్రింది విధంగా వర్ణించాడు.

"తనయందు నఖిలభూతములందు నొకభంగి సమహితత్వంబున జరగువాఁడు!
పెద్దలఁ బొడగన్న భృత్యుని కైవడిఁ జేరి నమస్కృతుల్ సేయువాఁడు!
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన మాతృభావము సేసి మరలువాఁడు!
తల్లి దండ్రులభంగి ధర్మవత్సలతను దీనులఁగావఁజింతించువాఁడు

సఖులయెడ సోదరస్థితి జరుపువాఁడు
దైవతములంచు గురువులఁ దలఁచువాఁడు
లీలలందును బొంకులు లేనివాఁడు
లలిత మర్యాదుఁడైన ప్రహ్లాదుఁడధిప!"[116]

నారదమహర్షి, ధర్మరాజుకు ప్రహ్లాదుడు పొందిన ఆనందమయ స్థితిని పై పద్యంలో చెప్పాడు. ప్రహ్లాదుడు, అన్ని ప్రాణులను తనలాగా భావించే సమదర్శి. పెద్దలు ఎదురైనప్పుడు గౌరవంతో నమస్కరించే వినయశీలి. ఇతర స్త్రీలు కనిపిస్తే తల్లిలాగా భావించి ప్రక్కకు తొలిగిపోయే గుణవంతుడు. దీనులకు తల్లీ, తండ్రీ తానే అయి ఆదరించే ఆర్ద్రహృదయుడు. స్నేహితులను సోదరుల లాగా చూచుకొనే సహృదయుడు. గురువులను దైవంగా కొలిచే ఆదర్శ విద్యార్థి. హాస్యానికైనా అబద్ధం చెప్పనటువంటి సత్యవంతుడు. ఈవిధంగా అతడు సాటి వారిని తనతో సమానంగా చూసుకొనేవాడు.

ప్రహ్లాదుడు అనుభవిస్తున్న బ్రహ్మసాక్షాత్కార స్థితిని పోతన ఈవిధంగా వర్ణించాడు.

"శ్రీవల్లభుఁడు దన్నుఁజేరిన యట్లైనఁ జెలికాండ్ర నెవ్వరిఁజేర మఱచు,
నసురారి దనమ్రోల నాడియట్లైన నసుర బాలుర తోడ నాడ మఱచు,
భక్తవత్సలుఁడు సంభాషించి నట్లైన బరభాషలకు మఱుపలుక మఱచు,
సురవంద్యుఁ దనలోనఁ జూచిన యట్లైనఁజొక్కి సమస్తంబుఁజూడ మఱచు,

హరిపదాంభోజయుగ చింతనామృతమున

నంతరంగంబు నిండినట్లైన నతఁడు

నిత్య పరిపూర్ణుఁడగుచు నన్నియును మఱచి

జడత లేకయు నుండును జడుని భంగి"[117]

ప్రహ్లాదుడికి, ఒక్కొక్కసారి శ్రీహరి తన దగ్గరకు వచ్చినట్లు అనిపించేది. అలాంటి సమయంలో ప్రహ్లాదుడు తన స్నేహితుల దగ్గరకు వెళ్ళటం మరిచిపోయేవాడు. మరొకసారి శ్రీహరి తనతో ఆడుతున్నట్లు అనిపించేది. అప్పుడు ప్రహ్లాదుడు తోటి బాలకులతో ఆడలాడటం మరచిపోయేవాడు. ఒక్కొక్కసారి మాధవుడు తనతో మాట్లాడుతున్నట్లు అనిపించేది. ఆ సమయంలో ఎవరైనా పలకరిస్తే మాటకు బదలుపలకడం కూడా మరిచిపోయేవాడు. ఇంకొకసారి, శ్రీమహావిష్ణువు తనను చూస్తున్నట్లు అనిపించేది. అప్పుడు ప్రహ్లాదుడు తన్మయత్వంతో ప్రపంచాన్నే మరచిపోయేవాడు. నిత్యం శ్రీహరి పాదపద్మాలను తలచుకొంటూ ఉండటం వల్ల, ఆ భక్తి సుధలతో ప్రహ్లాదుడి మనస్సంతా నిండిపోయింది. దివ్యమైన ఆనందంతో అన్నీ మరచిపోయేవాడు. ఈవిధంగా అతి చిన్న వయస్సులోనే ప్రహ్లాదుడు పరబ్రహ్మ సాక్షాత్కారాన్ని పొంది, ఆనందమయ స్థితిని అనుభవించగలిగాడు.

4.4. జీవన్ముక్తి:–

దర్శనసంప్రదాయంలో, మతసంప్రదాయంలో ఆత్మపరమాత్మల గురించి వివేచన వస్తుంది. ఆధ్యాత్మిక సాధనకు అంతిమలక్ష్యం జీవన్ముక్తి. జీవన్ముక్తి గురించి సంక్షిప్తంగా ఇక్కడ చర్చించడం జరుగుతున్నది.

'ముక్తి' అనేది ఒక మానసిక ప్రశాంతస్థితి. కారణం లేని ప్రేమ, అవధిలేని ఆనందం అన్న రెండు స్థితుల్ని పొందటమే జీవన్ముక్తి.

సాధారణంగా మానవుడి మనస్సులో సంకల్పం, వికల్పం అనే స్థితులు ఉంటాయి. ఇవి రెండూ కలిసినటువంటి ఒకానొక సందిగ్ధ స్థితి కూడా కొన్ని సందర్భాల్లో ఏర్పడుతుంది. 'సంకల్పం' అనుకూల ప్రేరణ తో నిండివుంటుంది. ఇటువంటి సందర్భంలో ఆ మనిషికి అనుకూల చింతనలు వస్తుంటాయి.

ఉదా:– ప్రహ్లాదుడి మనస్సు మంచి ఆలోచనలతో నిండి వుంటుంది. అందువల్ల అతనికి అన్ని సందర్భాల్లో ప్రపంచం ఆనందమయంగా కనిపిస్తూంటుంది.

'వికల్పం' అనేది ప్రతికూల ప్రేరణలు తో నిండివుంటుంది. ఇటువంటి మనిషికి ప్రతికూల చింతనలు వస్తూంటాయి. ఉదా:– హిరణ్యకశిపుడు. ఇతడికి నిరంతరం దుఃఖం, క్రోధం కలుగుతుంటాయి. ప్రశాంతత అనేది ఇతనికి లభించలేదు.

కొన్ని సందర్భాల్లో సంకల్ప వికల్పాలు రెండూ కలిసిన స్థితి ఉండవచ్చు. ఒక పని చేయాలా? వద్దా? అని తేల్చుకోలేని సందిగ్ధ స్థితి. దీన్నే 'సవికల్పం' అనవచ్చు.

ఉదా:– గజేంద్రుడు నీటి మడుగులో మొసలినోట చిక్కుకున్నాడు. ఈ సందర్భంలో అతడికి ఏ దేవుడిని ధ్యానించాలి? అసలు దేవుడు ఉన్నాడా? లేడా? అనే సందేహం కలిగింది. తర్వాత ఆ 'సవికల్పస్థితి' నుండి బయటకు వచ్చి, అన్ని ప్రాణులను రక్షించేది శ్రీహరి అనే జ్ఞానాన్ని పొందుతాడు. అప్పుడు శ్రీమహావిష్ణువును ధ్యానిస్తాడు.

గజేంద్రుడు, మొసలి, నీటి మడుగు ఇవన్నీ ప్రతీకాత్మకాలు. నీటి మడుగు – సంసార చక్రానికీ, గజేంద్రుడు – జీవాత్మకు, మొసలి – అరిషడ్వర్గాలకు ప్రతీకలు. జీవుడు సంసారసాగరంలో చిక్కుకొని ఎన్నో వేల సంవత్సరాల పాటు అరిషడ్వర్గాలు అనే (మొసలితో) జలచరంచేత బంధించబడి ఉన్నాడు. ఇటువంటి దీనస్థితలో ఉన్న జీవుడిని కాపాడి, రక్షణ కల్పించేది పరమాత్మడైన శ్రీహరి ఒక్కడే అని 'గజేంద్రమోక్షం' కథ వల్ల తెలుస్తుంది.

సారాంశంగా, మనస్సుకి సంకల్పం, వికల్పం, సవికల్పం అనే స్థితులు ఉంటాయని తెలుస్తున్నది. ఈ స్థితుల నుండి విముక్తిని పొందటమే జీవన్ముక్తి. క్రింది చిత్రపటాల ద్వారా దీన్ని వివరించవచ్చు.

వికల్పం సంకల్పం సవికల్పం



ఇక్కడ చూపిన చిత్రపటాల్లో, వికల్పం – ప్రతికూల చింతనలు కలిగివుంది. సంకల్పం – అనుకూల చింతనలు కలిగివుంది. సంవికల్పం – రెండింటితో కలిసి సందిగ్ధ స్థితిలో ఉంది. ఈ ఆలోచనలను నియంత్రించి, మనస్సును జయించటమే ముక్తి.

1.తక్కువ వికల్పం 2. సమత్వం 3. ఎక్కువ వికల్పం



సవికల్పం అనేది చాలా రకాలుగా ఉండవచ్చు. కొన్ని సందర్భాల్లో అనుకూల చింతనలు ఎక్కువగా ఉండవచ్చు. కొన్ని సమయాల్లో ప్రతికూల చింతనలు ఎక్కువగా రావచ్చు. దీన్ని ఆధారంగా చేసుకొని 'ముక్తి' అనే మానసిక స్థితిని 100 స్థాయిలుగా విభజించవచ్చు. దీన్ని క్రింది పటాలతో వివరించడం జరుగుతున్నది.

మొదటి స్థానంలో ఉన్నా మానవుడు జీవన్ముక్తుడే చివరిస్థానంలో ఉన్నా జీవన్ముక్తుడే. అయితే స్థాయి పెరిగే కొద్ది ఆ మానవుడి మనస్సు క్రమపరిణామం చెందుతుంది. దీన్ని క్రింది రేఖా చిత్రం ద్వారా వివరించవచ్చు.



పై రేఖాచిత్రంలో ముక్తిస్థితి క్రమపరిణామం చెందడం సూచించడం జరిగింది. ముందు పుటల్లో చెప్పినట్లు, ఒకటవ స్థానంలో ఉన్నా ముక్తుడే, వందవ స్థానంలో ఉన్నా ముక్తుడే. అయితే ముక్తి స్థితి పెరిగే కొద్ది, అతని ఆలోచనల స్థాయి తగ్గిపోతుంది. ఎప్పుడైతే ఆలోచనలు, పూర్తిగా ఆగిపోతాయో, అప్పుడు ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. అదే శాశ్వతకైవల్యం.

ఆత్మ సాక్షాత్కారం పొందటానికి ఏకైక మార్గం అంతరంగ ప్రయాణం. ఈ ప్రయాణంలో రెండు దశలు ఉన్నాయి. 1. సంవాదాన్ని పరిశీలించటం (డైలాగ్ వాచింగ్), 2. ఆలోచనలను గమనించటం (థాట్ వాచింగ్).

1. సంవాదాన్ని పరిశీలించడం:–

మానవుడి మనస్సు సంకల్పవికల్పాలతో కూడుకొని ఉంటుందని ముందుపుటల్లో చెప్పబడింది. దీనివల్ల మనిషి అంతరంగంలో, నిత్యం ఏదో ఒక విషయంలో సంవాదం జరుగుతూనే ఉంటుంది.

ఉదా:– మొదటిరోజు యుద్ధం ముగిసిన తర్వాత ఇంటికి వెళ్ళిన రావణుని అంతరంగంలో జరిగిన సంవాదాన్ని (సంకల్ప వికల్పాలను) క్రిందివిధంగా వివరించవచ్చు.

సంకల్పం	వికల్పం
1. రావణా, నువ్వు చాలా మంచివాడివి	1. రావణా, నువ్వు చెడ్డవాడివి
2. సీతాపహరణం నేరం	2. సీతాపహరణం నేరంకాదు
3. రాముడు దేవుడు	3. రాముడు మామూలు మానవుడు
4. నువ్వు రాముడిని జయించలేవు	4. రాముడు నీముందు నిలువలేడు
5. సీతను రాముడికి అప్పగించు	5. ఎందరు చనిపోయినా, సీతను విడిచిపెట్టవద్దు

పై విధంగా రావణుని అంతరంగంలో ఆలోచనల మధ్య సంవాదం జరిగింది. ఇలాగే ప్రతి మానవుడి అంతరంగంలోనూ ఏదో ఒక విషయం గురించి సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. మానవుడు మొదటగా ఈ ఆలోచనల సంవాదాన్ని గమనించాలి.

2. ఆలోచనలు గమనించడం:–

మనిషి డైలాగ్ వాచింగ్ కొంతకాలం చేసినప్పుడు, ఆ సంవాదం ఆగిపోతుంది. ఆ సంఘర్షణ ఆగిపోయే స్థితినే జీవన్ముక్తి అనవచ్చు.

దాని తర్వాత మానవుడు ఆలోచనలను గమనించాలి. అయితే ఆ ఆలోచనల పట్ల నిర్ణయం తీసుకోకూడదు.

ఉదా:– నేను మంచివాడిని, నేను చెడ్డవాడిని.

నేను నీతిపరుడిని, నేను అవినీతిపరుడిని.

మనిషి, తన మనస్సులో వెళుతున్న ఆలోచనలను పరిశీలించాలి. వాటి గురించి న్యాయనిర్ణయం చేయకూడదు. ఈ విధంగా చేయటం వల్ల కొంతకాలానికి, ఆలోచనలు పూర్తిగా నిలిచిపోతాయి. ఆలోచనల సమూహమే మనస్సు. మనస్సు ఎప్పుడైతే ఆగుతుందో, అప్పుడే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. మనస్సు నుండి విముక్తిని పొందటమే ముక్తి. ఆలోచనల నుండి విముక్తిని పొందటమే జీవన్ముక్తి.

మనకు కనిపిస్తున్న ఈ బాహ్యప్రపంచం, మన అంతరంగప్రపంచానికి ప్రతిబింబం. అంతరంగంలో ఉన్న ప్రతి భావం బాహ్యప్రపంచంలోనూ కనిపిస్తుంది. ఈ బాహ్య ప్రపంచంలో మార్పు రావాలంటే ముందు అంతరంగ ప్రపంచంలో మార్పు రావాలి. దీనికి ఏకైక సాధన అంతరంగ ప్రయాణం. దీనికి యోగసాధన మంచి ఉపకరణం. ఆధ్యాత్మికవిద్య సారమంతా ఈ యోగసాధనలోనే ఇమిడివుంది.

పాదసూచికలు

1. బ్రౌన్ తెలుగు – ఇంగ్లీషు నిఘంటువు, పు.69.

2. విజ్ఞానసర్వస్వము, దర్శనములు– మతములు, పు.5.

3. పైదే, పు.33.

4. పైదే, పు.39.

5. సంస్కృత సాహిత్యచరిత్ర, పు.14.

6. విజ్ఞాన, పైదే, పు.35.

7. పైదే, పు.39.

8. పైదే, అదే

9. పైదే, పు.40.

10. విజ్ఞాన, పైదే, పు.65.

11. మజ్జమ నికాయము, 1 సం, 1,2

12. పైదే, పు.72.

13. పైదే, పు.72.

14. ఆత్మబోధ – వ్యాఖ్యానం, పు.8.

15. పైదే, పు.11.

16. ఆత్మబోధ – వ్యాఖ్యానం; పు.13.

17. శ్రీభాష్యసారము–వ్యాఖ్యానం; పు.xii

18. ఆముక్త, 3ఆ, 10ప.

19. పైదే, 11ప.

20. పోతన భాగవతము, 3స్కం, 959ప.

21. పైదే, 2స్కం, 18ప.

22. విజ్ఞాన, దర్శనములు – మతములు, పు.125.

23. భీష్మ, 1ఆ, 181ప.

24. పైదే, 183ప.

25. భగవద్గీత, సాంఖ్యయోగం, 7శ్లో.

26. పైదే, 13 శ్లో.

27. పైదే, 16శ్లో.

28. పైదే, 17శ్లో.

29. భీష్మ, 1ఆ, 195ప.

30. భగవద్గీత, సాంఖ్య, 22శ్లో.

31. పైదే, 23శ్లో.

32. పైదే, 27శ్లో.

33. పైదే, 47శ్లో.

34. భీష్మ, 1ఆ, 202ప.

35. ఆముక్త, 3ఆ, 70ప.

36. పైదే, 66ప.

37. పైదే, 69ప.

38. శాంతి, 4ఆ, 356.

39. పైదే, 357.

40 పోతన భాగవతము, 3స్కం, 240ప.

41. పైదే, 242ప.

42. విజ్ఞాన, దర్శనములు–మతములు, పు.91.

43. శాంతి, 4ఆ, 107ప.

44. పైదే, 110ప.

45. ఆనుశాసనిక, 5ఆ, 30ప.

46. పైదే, 31 ప.

47. పోతన భాగవతం, 7 స్కం, 409ప.

48. పైదే, 239ప.

49. విజ్ఞాన, దర్శనములు – మతములు, పు.95.

50. భగవద్గీత, సాంఖ్య, 39శ్లో.

51. పైదే, 40శ్లో.

52. పైదే, 41శ్లో.

53. పైదే, కర్మయోగం, 29శ్లో.

54. పైదే, 34శ్లో.

55. పోతన భాగవతము, 3స్కం, 991–992.

56.ఆనుశాసనిక, 4ఆ, 219ప.

57. పైదే, 220ప.

58. పైదే, 221ప.

59. పైదే, 226ప.

60. పైదే, 227ప.

61. పైదే, 228ప.

62. పైదే, 229ప.

63. పైదే, 232ప.

64. పైదే, 244 ప.

65. పైదే, 250ప.

66. సూర్యరాయాంధ్ర, పు.619.

67. యోగసాధన–హిమాలయ యోగదర్శనము, పు.27–33.

68. విజ్ఞాన, 4స్కం, పు.97–99

69. భగవద్గీత, కర్మ, 19శ్లో.

70. పైదే, 20శ్లో.

71. పైదే, 21 శ్లో.

72. పైదే, 5శ్లో.

73. పైదే, 6శ్లో.

74. శాంతి, 5ఆ, 576 ప.

75 పైదే, 577ప.

76. పైదే, 578ప.

77. పైదే, 580 ప.

78. పైదే, 586ప.

79. పైదే, 587ప.

80. పైదే, 589ప.

81. శాంతి, 4ఆ, 127ప.

82. సింహాసన, 5ఆ, 13ప.

83. పైదే, 14ప.

84. పైదే, 5ఆ, 16ప.

85. యోగాభ్యాసదర్పణము, పు.1.

86. పైదే, పుట. 5-6

87.పైదే, పు.6.

88. పైదే, పు.15.

89. కుమారసంభవము, 12ఆ, 217ప.

90. పైదే, 221ప.

91. ఆముక్త, 3ఆ, 74ప.

92. పైదే, 86ప.

93. కళాపూర్ణోదయం, 5ఆ, 144ప.

94. పైదే, 150ప.

95. పైదే, 160ప.

96. పైదే, 174ప.

97. భానుమద్విజయము, 5ఆ, 47ప.

98. పైదే, 57ప.

99. పైదే, 73ప.

100. అనిరుద్ధచరిత్రము, 4ఆ, 19ప

101. నాసికేతోపాఖ్యానము, 1ఆ, 219ప.

102. సూర్యరాయాంధ్ర, పు.292.

103. శాంతి, 4ఆ, 5ప.

104. పైదే, 6ప.

105. పద్మై,కే 172ప.

106. పోతన భాగవతము, 2స్కం, 8ప.

107. పైదే, 18ప.

108. ఆముక్త, 3ఆ, 66ప.

109. పైదే, 67ప.

110. ఆముక్త, 3ఆ, 70ప.

111. ప్రబోధచంద్రోదయము, 5ఆ, 88ప.

112. పైదే, 94ప.

113. విజ్ఞాన, దర్శనములు – మతములు, పు. 108–109.

114. శాంతి, 5ఆ, 105ప.

115. పైదే, 109ప.

116. పైదే, 111ప.

117. పోతన భాగవతము, 7స్కం, 115ప.

ఐదవ అధ్యాయం

ప్రాచీన విద్యలు – బోధన పద్ధతులు

5. ప్రాచీన విద్యలు – బోధన పద్ధతులు

'బోధన' అనే పదానికి, 'తెలుపు, ఉపదేశించు, నిద్ర నుండి లేపు, మేల్కొలుపు, అగ్నిని రాజబెట్టు, బోధపఱచు' వంటి అర్థాలున్నాయి[1]. ఏదైనా ఒక విషయం గురించి ఒక వ్యక్తి మరొక వ్యక్తికి తెలియజేయడమే బోధన. ఈ బోధన వల్ల విషయం పట్ల అవగాహన పెరుగుతుంది. తార్కికమైన ఆలోచనకు, హేతుబద్ధమైన సిద్ధాంతాలను స్థాపించటానికి వీలుకలుగుతుంది. అందువల్ల విద్యార్థులను చిన్నప్పుడే గురుకులాలకు పంపేవారు. వారికి గురువులు వివిధ బోధన పద్ధతుల ద్వారా విజ్ఞానాన్ని అందించేవారు. విద్యార్థుల్లో వాసనారూపంలో ఉన్న ప్రతిభను గురువు తన బోధన ద్వారా వెలికితీసి, అభివృద్ధిలోకి తీసుకువస్తాడు.

ప్రాచీనకాలంలో గురువులు క్రింది బోధనా పద్ధతుల ద్వారా విద్యాబోధన చేసేవారు. అవి:–

1. ఉపాఖ్యాన పద్ధతి
2. చర్చా / గోష్ఠి పద్ధతి
3. సంవాద పద్ధతి
4. ప్రశ్నోత్తర పద్ధతి
5. ఉపన్యాస / ప్రవచన పద్ధతి
6. ఆలంకారిక పద్ధతి
7. ఉదాహరణ–ప్రత్యుదాహరణ పద్ధతి
8. అన్యాపదేశ పద్ధతి
9. ప్రవృత్తి పద్ధతి
10. ఆనుపూర్వి పద్ధతి
11. విశ్లేషణ పద్ధతి
12. ప్రయోగ పద్ధతి
13. ప్రదర్శన పద్ధతి

వీటిని గురించి క్రిందివిధంగా వివరించవచ్చు.

5.1. ఉపాఖ్యాన పద్ధతి:–

కథల ద్వారా విద్యార్థులకు విషయాన్ని బోధించటాన్ని ఉపాఖ్యానపద్ధతి అంటారు. ఈ పద్ధతి వల్ల విద్యార్థులకు జ్ఞానం, వినోదం రెండూ కలుగుతాయి. ఉపనిషత్తుల కాలం నుండి దక్షిణాంధ్ర యుగం వరకు పైన చెప్పిన బోధన పద్ధతులనే గురువులు విద్యాబోధనలో ఉపయోగించినట్లు కావ్యాంతర్గత విషయాలనుబట్టి తెలుస్తున్నది.

కఠోపనిషత్తులో నచికేతుని కథ, ఛాందోగ్య ఉపనిషత్తులో ఉషస్తి కథ, జానశ్రుతికథ, గాంధారవాసి పురుష దృష్టాంత కథ, ఇంద్రవిరోచనుల కథ మొదలైన ఉపాఖ్యానాలు ఉన్నాయి. ఒక్కొక్క ఉపాఖ్యానం ఒక్కో రకమైన జ్ఞానాన్ని బోధిస్తుంది. వీటిని గురించి ఆర్. మల్లేశుడు గారు "మహాభారతంలో విద్యావిధానం" అనే సిద్ధాంతగ్రంథంలో కొంత వివరించారు. 'ఐహిక సుఖాలపై ఆశ వదలిన త్యాగపరుడైన మానవుడికే పరమాత్మతత్త్వం గోచరిస్తుందనే నీతి నచికేతుని కథలో ఉంది.

ఆపత్కాలంలో ఉచ్ఛిష్టం గ్రహించడం దోషం కాదని చాటుతుంది ఉషస్తి కథ. మానవుడు వాయువు లాగా అన్నింటిని లోబరుచుకోవాలనే నీతిని జానశ్రుతి కథ అందిస్తుంది. శ్రద్ధాసక్తుడైన శిష్యుని విపరీత గ్రహణాన్ని పోగొట్టడం ఆచార్యుని కర్తవ్యమని బోధిస్తుంది ఇంద్రవిరోచనుల కథ'[2] (పు.26).

ఛాందోగ్యోపనిషత్తులో చెప్పబడిన 'గాంధారవాసి పురుషదృష్టాంత కథ'లో అంతరార్థం గమనించదగింది. గాంధార దేశీయుని కళ్ళకు గుడ్డకట్టి కొందరు వ్యక్తులు అతడిని తీసుకువచ్చి ఒక నిర్మానుష్యమైన అడవిలో విడిచివెళ్ళిపోతారు. అతడు కేకలు వేస్తాడు. అప్పుడు ఒక మహాపురుషుడు అతని దగ్గరకు వచ్చి బంధాలను తొలగిస్తాడు. అతడు చేరవలసిన స్థానం వైపు దారిచూపిస్తాడు. అతడు ఆ దిక్కును అనుసరించి వెళ్ళి స్వస్థానాన్ని చేరుకొంటాడు. ఇది ఈ కథలో ఉండే వాచ్యార్థం. ఇందులోని అంతరార్థాన్ని మనం క్రింది విధంగా గమనించవచ్చు.

మానవుడు 'సత్' నుండి రావడం, సంసారమనే అరణ్యంలో చిక్కుకోవడం, మోహం అనే వస్త్రం అతని కళ్ళకు కప్పివుండటం, భార్యాబిడ్డలు అనే బంధాల్లో చిక్కుకొని ఉండటం, పుణ్యపాపాలనే దొంగలు

అతనిని ఈ లోకానికి తీసుకొనిరావటం, గురువు చూపిన గురుతును పట్టుకొని అతడు స్వస్థలాన్ని చేరుకోవడం మొదలైనవి ఈ ఉపాఖ్యానంలోని అంతరార్థాలు.

'సావిత్ర్యుపాఖ్యానం' కూడా నిగూఢమైన జ్ఞానాన్ని మనకు అందిస్తుంది. ఈ కథలోని 'సావిత్రి' జ్ఞానానికి ప్రతీక. 'సవిత' అంటే 'ఒక్కజ్ఞానకిరణం' అని అర్థం. 'సత్యవంతుడు' సత్యవ్రతానికి ప్రతీక. యముడు మృత్యువుకు, అవిద్యకు ప్రతీక. సత్యం అనబడే సత్యవంతుడిని, అవిద్య అనబడే మృత్యువు కబళించినపుడు, సావిత్రి అనబడే ఒక్క జ్ఞానకిరణం ఆ మృత్యువును (అవిద్యను) జయించి, సత్యాన్ని పునరుజ్జీవింపజేస్తుంది. ఇది ఈ ఉపాఖ్యానంలో ఉన్న అంతరార్థం.

మహాభారతంలోని ద్రౌపదీపాండవులు కూడా ప్రతీకాత్మక పాత్రలే. పంచపాండవులు, పంచ ఇంద్రియాలకు ప్రతీకలు. ద్రౌపది మనస్సుకు ప్రతీక. మనస్సు ఇంద్రియాలను తన ఆధీనంలో ఉంచుకొని మనిషిని ముందుకు నడిపిస్తుంది. అలాగే ద్రౌపది, పాండవులను తన మంచిమాటలతో స్వాధీనపరుచుకుంటుంది. తన సేవలతో భర్తల ఆదరాభిమానాలు పొందింది. ద్రౌపది ప్రేరణ వల్లనే భీముడు ఎన్నో విజయాలు సాధించాడు. అర్జునుడు యుద్ధం చేశాడు. శ్రీకృష్ణుడు రాయబారం నడిపాడు. కథానాయిక ద్రౌపది లేని భారతం నిర్జీవం.

మహాభారతంలోని కురుక్షేత్రయుద్ధం కూడా ప్రతీకాత్మకమైంది. మానవజాతి యొక్క సామూహిక చైతన్యమే ఈ యుద్ధానికి కారణం. ఆనాడు భరతఖండంలోని ప్రతి వీరుడు 'యుద్ధం' అనే ఉత్సాహంతో నిరంతరం పొంగిపోతుంటాడు. మానవుల అంతరంగాల్లోని యుద్ధ వాతావరణానికి సామూహికమైన ప్రతిబింబమే కురుక్షేత్రం. ఈ యుద్ధరంగం మనస్సుకు ప్రతీక. మనస్సు అంటే ఆలోచనల అక్షౌహిణీలతో సమానమైన ఆలోచనలు ఉన్నాయి. ఆ ఆలోచనలను సంహరించి ముక్తుడివి కావాలని శ్రీకృష్ణపరమాత్ముడు నరుడికి ప్రబోధించాడు. భగవత్ సాక్షాత్కారాన్ని పొందిన తర్వాత నరుడు ఆత్మతత్త్వాన్ని తెలుసుకోగలిగాడు. మనస్సులోని ఆలోచనలను సంహరించాడు. ఈవిధంగా 'కురుక్షేత్రయుద్ధం' ప్రతీకాత్మకమైనది.

ఉపాఖ్యానపద్ధతిలో విద్యాబోధన చేయటం వల్ల పైవిధంగా జ్ఞానం, వినోదం రెండూ లభిస్తాయి. కథలు విద్యార్థిని ఆకర్షించి ఆనందాన్నిస్తాయి. కథలో దాగివున్న అర్థాలు అతడికి విజ్ఞానాన్ని అందిస్తాయి. జీవితాన్ని సరియైన దారిలో నడపటానికి ఈ ఉపాఖ్యానాలు దిక్సూచిగా పనిచేస్తాయి.

5.2. చర్చాపద్ధతి / గోష్ఠీ పద్ధతి:-

"చర్చ్యతే అనేయేతి చర్చా" అని వ్యుత్పత్తి. పలువురు మేధావులు కలిసి తమ భావాలను తార్కిక పద్ధతిలో వ్యక్తం చేయటమే చర్చ. ఈ పద్ధతి వల్ల విద్యార్థుల ఆలోచనలకు, ప్రతిస్పందనలకు అవకాశం కల్పించి, వాటిని క్రోడీకరించే వీలు కలుగుతుంది.

ఛాందోగ్యోపనిషత్తులో ఆత్మ, పరమాత్మ తత్త్వాన్ని నిర్ణయించడానికి చర్చ జరిగింది. ఈ చర్చలో ప్రాచీనశాలుడూ, సత్యయజ్ఞుడూ, ఇంద్రద్యుమ్నుడు, జనుడు, బుడిలుడు అనే మహాశ్రోత్రియులు పాల్గొన్నారు.

శ్వేతాశ్వరోపనిషత్తులో కూడా జగత్తు ఆవిర్భావం గురించి చర్చ జరిగింది. జగత్తు యొక్క సృష్టికి కారణం కాలమా? స్వభావమా? నియతియా? యాదృచ్ఛయా? పంచభూతాలా? పురుషుడా? అనే అంశాల గురించి వారు చర్చించారు.

ఆనాడు చర్చలో మేటి అనిపించుకొన్న వ్యక్తికి బహుమతిని ఇవ్వడం జరిగేది. జనకమహారాజు ఒకయాగం చేస్తూ, అక్కడికి వచ్చిన వేదవేత్తల్లో ఎవరు గొప్పవారో తెలుసుకోవటానికి ఒక ఉపాయం పన్నాడు. వేయి ఆవులకు, ఒక్కొక్క ఆవు కొమ్ములకు ఎనిమిది తులాల బంగారాన్ని కట్టి, వాటిని కొట్టంలో ఉంచాడు. వేదవేత్తలను చూసి, మీలో మేటి అయినవారు ఆ గోవులను తోలుకుపోవచ్చునని అంటాడు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు ముందుకు వచ్చి, తన శిష్యుడితో గోవులను తోలుకుపొమ్మని చెపుతాడు. సభలోని పండితులు యాజ్ఞవల్క్యుని పాండిత్యాన్ని పరిశీలించడానికి ఎన్నో ప్రశ్నలు వేసారు. యాజ్ఞవల్క్యుడు వారందరినీ జయించి, మేటి వేదవేత్త అనిపించుకొన్నాడు.

అజ్ఞాతవాసం ముగిసిన తర్వాత, పాండవులు ఉపప్లావ్యం చేరుతారు. అక్కడకు శ్రీకృష్ణుడు, విరాటుడు, ద్రుపదుడు మొదలైన పాండవహితులు వస్తారు. భవిష్యత్తులో ఏవిధంగా నడుచుకోవాలి?

యుద్ధం చేయాలా? లేదా కౌరవులతో సంధి చేసుకోవాలా? అనే విషయం గురించి చర్చ జరుగుతుంది. మానవయత్నంగా మొదట సంధి చేయటమే మంచిదని ఆ సభలోని పెద్దలు తీర్మానిస్తాడు. శ్రీకృష్ణుడు రాయబారిగా హస్తినాపురానికి వెళ్ళటానికి సిద్ధపడతాడు.

ఆముక్తమాల్యదలో, పాండ్యరాజు కొలువులో మతవిషయమైన చర్చలు జరుగుతాయి. విష్ణుచిత్తుడు రాజు కొలువుకు వెళ్ళి, తన వాదపటిమతో ఇతర మతాచార్యులను జయిస్తాడు. విశిష్టాద్వైతమతాన్ని స్థాపిస్తాడు.

చర్చాపద్ధతి, గోష్ఠీ పద్ధతి అనే రెండూ సమానార్థకాలుగా వాడబడుతున్నాయి. "ష్ఠాగతి నివృత్తౌ గావో నానావిధా వాచస్తుష్ఠన్త్య త్రేతి గోష్ఠీ" అని అమరం. 'నానా విధాలైన వాక్కులు దేనియందు ఉంటాయో అది గోష్ఠి' అని అర్థం. భరద్వాజుని కుమారుడైన సుకేశుడు, శిబి కుమారుడైన సత్యకాముడు, భృగుగోత్రీకుడైన వైదర్భీ, కాత్యాయనుడైన కంబంధీ: ఈ ఆరుగురు తపస్వులు బ్రహ్మ జిజ్ఞాసాపరులై సమిధులు పట్టుకొని పిప్పలాదుని దర్శించారు. ఆయన ఆశ్రమంలో, ఆ విద్యార్థులకు, పిప్పలాదమునికీ మధ్య ప్రజాసృష్టి, ప్రాణమాహాత్మ్యం, అనందానుభూతి, ఓంకారోపాసన అనే విషయాలపై గోష్ఠి జరుగుతుంది.

5.3. సంవాద పద్ధతి:–

ఇది చాలా ప్రాచీనమైన బోధనపద్ధతి. సంవాదంలో కనీసం ఇద్దరు వ్యక్తులు పాల్గొనలవసి ఉంటుంది. (జీవ) ఆత్మను ఎదుటి వ్యక్తిగా భావించి ఉపనిషత్తుల్లో సంవాదం జరిపిన సందర్భాలు ఉన్నాయి. తండ్రీకొడుకులు, స్నేహితులు, భార్యాభర్తలు, గురుశిష్యులు ఈ సంవాదంలో కనిపిస్తారు.

కేనోపనిషత్తులో 'కేనేషితం పతతి ప్రేషితం మనః?' అనేది మొదటి ప్రశ్న. దేనికి సమాధానం అన్నట్లుగా కేనోపనిషత్తు సంవాదరూపంలో నడుస్తుంది. ఛాందోగ్యోపనిషత్తులో శిష్యుడు గురువును, సూక్ష్మమైన 'సత్తు' నుండి మహత్తైన ప్రపంచం ఎట్లా పుట్టిందని? ప్రశ్నిస్తాడు. అప్పుడు ఆ గురుశిష్యుల మధ్య క్రింది విధంగా సంవాదం జరుగుతుంది.

గురువు : (శిష్యుని చూసి) ఒక మర్రిపండును తీసుకొనిరా!

శిష్యుడు : ఇదిగో తెచ్చాను

గురువు : దాన్ని త్రుంచు

శిష్యుడు : త్రుంచాను

గురువు : దానిలో ఏముంది?

శిష్యుడు : చాలా సూక్ష్మాలైన విత్తనాలు ఉన్నాయి.

గురువు : వాటిలో ఒక విత్తనాన్ని చీల్చిచూడు

శిష్యుడు : చీల్చాను.

గురువు : దానిలో ఏముంది?

శిష్యుడు : ఏమీ లేదు.

పైవిధంగా సంభాషణం జరిగిన తర్వాత గురువు శిష్యునితో ఈవిధంగా అంటాడు. 'సూక్ష్మం నుండి పెద్ద మర్రిచెట్టు ఏవిధంగా వచ్చిందో, అదేవిధంగా సూక్ష్మమైన 'సత్తు' నుండి జగత్తు ఏర్పడింది. ఈ జగత్తులో ఆత్మ నిండి ఉంటుంది, అది సత్యమైంది, అది నీవే' అని ఉపదేశిస్తాడు.

యాజ్ఞవల్క్యుడు సన్న్యాసాన్ని స్వీకరిస్తూ కాత్యాయని, మైత్రేయి అనే తన ఇద్దరు భార్యల్లో, మైత్రేయికి సంవాద పద్ధతిలో బ్రహ్మవిద్యారహస్యాలను ఉపదేశించాడు. ఉపనిషత్తుల్లోని నారదసనత్కుమార సంవాదం, ఆరుణిశ్వేతకేతు సంవాదం మొదలైనవి ఆత్మతత్త్వాన్ని సంవాదరూపంలో ఆవిష్కరిస్తున్నాయి.

మహాభారతంలోని శాంతిపర్వంలో, ఆనుశాసనికపర్వంలో ఎన్నో సంవాదాలు ఉన్నాయి. ఇంద్రప్రహ్లాద సంవాదం, ఇంద్ర బలిచక్రవర్తి సంవాదం, ఇంద్రనముచి సంవాదం శాంతిపర్వంలో ఉన్నాయి.

శాంతిపర్వంలో 'కపిల గోసంవాదం' విశిష్టమైంది. ఇందులో గృహస్థాశ్రమ ధర్మాల గురించి కపిలుడికి, గోవులో ప్రవేశించిన 'స్యూమరశ్మి'కి మధ్య సంవాదం జరుగుతుంది. కపిలుడు, స్యూమరశ్మితో ఈవిధంగా అంటాడు. 'ఆత్మ సుఖాన్ని మాత్రమే కోరేవాడు ఇతర సుఖాలను కోరడు. అతడు శోకరహితుడు, కామరహితుడు, సంగరహితుడు, అట్లాంటి వాడికి ఈ పరలోక సుఖాలతో పని ఏమిటి? అతడు సుఖప్రదమైన స్వర్గాది లోకాలను అభిలాషించడు. కాబట్టి శాశ్వతమైన మోక్షం పొంది గృహస్థధర్మాలను వర్జిస్తాడు'[3].

'ఇంద్రాంబరీషసంవాదం'లో, సుదేవుడు యజ్ఞయాగాలు చేయకపోయినా అతనికి స్వర్గప్రాప్తి ఎలా కలిగిందని అంబరీషుడు ఇంద్రుడిని ప్రశ్నించాడు. సుదేవుడు తపస్సు చేసి, అతని తలను శివునికి అర్పణచేయటానికి పూనుకొన్నాడు. శివుడు అతని భక్తికిమెచ్చి యుద్ధంలో విజయం సాధించటానికి వరాలు ఇచ్చాడు. చివరకు అతడు యుద్ధరంగంలో వీరమరణం పొంది, నీ కంటె ముందుగానే స్వర్గానికి వచ్చాడు అని ఇంద్రుడు సమాధానమిస్తాడు. ఈ సంవాదంలో, యజ్ఞయాగాదుల కన్నా, దైవభక్తి, స్వామిభక్తి గొప్పవని చెప్పటం జరిగింది.

ఆనుశాసనిక పర్వంలో, వాసుదేవ నాదర సంవాదం, వాసుదేవ పృథివీ సంవాదం, గోశ్రీసంవాదం అనేవి ప్రసిద్ధసంవాదాలు. 'గౌతమీ లుబ్ధకసర్ప మృత్యుకాల సంవాదం'లో మనిషి దేనికీ కర్త కాడు? అనే విషయం చర్చించబడింది. గౌతమి అనే స్త్రీ కొడుకును పాము కరుస్తుంది. ఒక అడవిజాతి వాడు ఆ పామును పట్టి తెచ్చి అమ్మా! ఈ పామును కొట్టి చంపివేస్తాను అంటాడు. అప్పుడు గౌతమి ఈ విధంగా అంటుంది. 'అన్నా! ఆపదలు మన పూర్వజన్మ కర్మానుసారంగా వస్తాయి. కనుక అధములైన వారు తల్లడిల్లిపోతూ సంసార సముద్రంలో బంధించబడతారు. ఉత్తములు మాత్రం అట్లా కాక, శాంతిని పొంది సంసార సాగరాన్ని దాటిపోతారు' అంటుంది. మనిషి విధికి కర్త కాడు అనే సందేశం ఈ సంవాదంలో ఉన్నది.

5.4. ప్రశ్నోత్తర పద్ధతి:–

మొదట ప్రశ్న, సమాధానం, ఆ సమాధానంపై తిరిగి ప్రశ్న – ఇలా సాగేటటువంటి బోధనకే ప్రశ్నోత్తర పద్ధతి అని పేరు. పాశ్చాత్యుల్లో 'సోక్రటీస్' మొదటిసారి ఈ పద్ధతిని ఉపయోగించి విద్యను బోధించాడు. సందేహనివృత్తికి, ఆలోచనల తేనెతుట్టెలను కదిలించటానికి ఈ పద్ధతి ఎంతో ఉపయోగపడుతుంది.

ప్రశ్నోత్తరపద్ధతి వల్ల, విద్యార్థులకు కొత్త విషయాల పట్ల ఆసక్తి కలుగుతుంది. జ్ఞానపరిధి విస్తరించటానికి ఈ పద్ధతి చాలా సహాయపడుతుంది.

మహాభారతంలోని అనుశాసనిక, శాంతిపర్వాల్లో ఈ ప్రశ్నోత్తర పద్ధతి కనిపిస్తుంది. భీష్ముడు, ధర్మరాజుకు ప్రశ్నోత్తర పద్ధతిలో అన్ని నీతులను, ఆచారాలను, ధర్మాలను బోధించాడు. ధర్మరాజు జిజ్ఞాస కలిగిన ఉత్తమ విద్యార్థి. భీష్ముడు సకలవిద్యల మర్మాలను తెలుసుకొన్న ఉత్తమ ఆచార్యుడు.

భీష్మధర్మరాజుల మధ్య క్రిందివిధంగా ప్రశ్నోత్తరాలు జరిగాయి.

ధర్మరాజు : పితామహా! దాన విశేషాలను తెలపండి?

భీష్ముడు : కన్య, గృహం, భూమి, నీరు, వస్త్రం ఇట్లాంటి వాటికంటె గోదానం గొప్పది. గోవుకు ఎన్ని రోమాలుంటాయో అన్ని దివ్యసంత్సరాలు గోదానం వల్ల స్వర్గంలో ఉంటారు.

ధర్మరాజు : అన్నింటికంటె గొప్పదానమేది?

భీష్ముడు : యాచకుడు కోరిన దాన్ని ప్రేమతో ఇవ్వటం అన్నిటికంటె గొప్పదానం. వీరశయనం అన్నిటికంటె గొప్పదానం. మిగిలినవి అసలు దానాలే కావు.

ధర్మరాజు : అడిగిననాడికి దానం చేయటం మంచిదా? అడగని వాడికి దానం చేయటం మంచిదా?

భీష్ముడు : అడిగినవాడి కంటె అడగనివాడికి ఇవ్వటమే శ్రేష్ఠం.

ఈవిధంగా భీష్ముడు, ధర్మరాజుకు ప్రశ్నోత్తరపద్ధతిలో ఎన్నో ధర్మాలను బోధించాడు.

పోతన భాగవతంలో కూడా పరీక్షిన్మహారాజు, శుకయోగి మధ్య ప్రశ్నోత్తర పద్ధతిలో ఆధ్యాత్మికవిద్య బోధించబడింది. ఏడు రోజుల్లో మరణించబోవటానికి సిద్ధంగా ఉన్న పరీక్షిత్తు, శుకయోగిని వివిధ రకాల ప్రశ్నల ద్వారా శ్రీహరి తత్త్వాన్ని, మోక్షమార్గాన్ని గురించి అడిగి తెలుసుకొంటాడు.

5.5. ఉపన్యాస / ప్రవచన పద్ధతి:–

బోధనాంశాన్ని ఉపాధ్యాయుడు మౌఖికంగా, అనుస్యూత (continuous) రూపంలో చెప్పడాన్ని ఉపన్యాస పద్ధతి అంటారు. విషయ వివరణకు ఈ పద్ధతి చాలా ఉపయోగకరమైనది. ఇందులో విషయ

ప్రస్తావన, భావానుక్రమం, విషయక్రోడీకరణ ప్రధాన ఘట్టాలు. ఈ పద్ధతి ప్రాథమిక, మాధ్యమిక స్థాయిల్లో అంతగా ఉపయోగపడకపోయినా, విశ్వవిద్యాలయ స్థాయిలో మంచి ఫలితాల్ని ఇస్తుంది.

ప్రాచీన కాలం నుండి పురాణాలను, ఇతిహాసాలను ప్రవచన రూపంలో గురువులు విద్యార్థులకు బోధించారు. సూతుడు ప్రాచీనకాలంలో మంచి ఉపన్యాసకుడు. ఈయనకు తెలియని పురాణం లేదు, చెప్పని ఇతిహాసం లేదు. అందుకే యజ్ఞయాగాల సమయంలో శౌనకాది మహర్షులు, సూతమహర్షిని పురాణప్రవచనం చేయమని కోరేవారు. సందర్భాన్ని బట్టి, స్థలకాలాలను బట్టి సూతమహర్షి తగిన పురాణాలను ప్రవచనం చేసేవాడు. అలాగే నారదమహర్షి, మార్కండేయ మహర్షి, సనత్కుమారుడు, శుకయోగి, వ్యాసుడు మంచి ఉపన్యాసకులుగా, ప్రవచన కర్తలుగా ప్రసిద్ధిగాంచారు.

5.6. ఆలంకారిక పద్ధతి:–

ఆచార్యుడు, శిష్యునికి విషయాన్ని బోధించటానికి కొన్ని అభ్యసన నియమాలను పాటించాలి. అభ్యసన నియమాల్లోని రకాలను డా. ఆర్. మల్లేశుడు గారు 'మహాభారతంలో విద్యావిధానం' అనే సిద్ధాంతగ్రంథంలో పేర్కొన్నాడు[4]. అవి:–

1. సాదృశ్యపద్ధతి (method of comparison)
2. భేద పద్ధతి (method of contrast)
3. సామీప్యపద్ధతి (method of contiguity)

ఉపనిషత్తుల్లో రూపకాలంకారం ఆధారంగా విషయ వివరణ చేయటం జరిగింది.

'ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు!
బుద్ధింతు సారధిం విద్ధి, మనః ప్రగ్రహ మేవచ!!'

శరీరమే రథం, ఆత్మరథి, బుద్ధియే సారధి, మనస్సు పగ్గము అని తెలుసుకో! ఈ శ్లోకంలో రూపకాలంకారం సహాయంతో మానవ తత్వాలను వివరించడం జరిగింది.

ఉపమాలంకారం ఆధారంగా కూడా బోధన జరిగినట్లు ఉపనిషత్తుల వల్ల తెలుస్తున్నది.

“అరా ఇవ రథనాభౌ సంహతా యత్రనాడ్యః!

స ఏషోంత శ్చరతే బహుధా జాయమానః!!”

బండి కుండలో చక్రం, ఆకులు ఇమిడివున్నట్లు, మానవుడి హృదయంలో నాడులన్నీ చేరివున్నాయి. అటువంటి హృదయంలోనే యోగులు పరమేశ్వరుని గుర్తిస్తారు.

“యధానద్య స్స్యందమానా సముద్రే అస్తమ్ గచ్ఛన్తి”

“తథా విద్యాన్నామరూపా ద్విముక్తః

పరాత్పరం పురుషముపైతి దివ్యమ్”

ప్రవహించే నదులు నామరూపాలను వదలి సముద్రంలో కలిసిపోయినట్లు, ముక్తుడైన జీవుడు అవిద్య వల్ల కలిగే నామరూపాలను త్యజించి దివ్యపురుషుని పొందుతాడని పై శ్లోకానికి అర్థం. ఇందులో కూడా ఉపమాలంకారం ఆధారంగా విషయాన్ని బోధించడం జరిగింది. దీన్నే సాదృశ్యపద్ధతి అంటారు.

వ్యాసుడు శుకయోగికి ఆలంకారిక పద్ధతిలో అహింస గొప్పదనాన్ని వివరించాడు.

“జంతుపదము లెల్ల దంతి పదంబులో / నడఁగు క్రియ నహింసయందు సకల

ధర్ములు నడంగుఁగర్మ సంత్యాగికి / నైన భూతదయ సమర్హగుణము”[5]

లోకంలోని జంతువుల అడుగులన్నీ ఏనుగు అడుగులో లీనమైపోతాయి. అలాగే అన్ని ధర్మాలు 'అహింస' అనే ధర్మంలో లీనమైపోతాయి. కాబట్టి కర్మపరిత్యాగం చేసిన వారికి కూడా భూతదయ చాలా ఉత్తమమైన గుణంగా కనిపిస్తుంది అని వ్యాసుడు తన కొడుకైన శుకమహర్షికి బోధించాడు.

వ్యాసుడు శుకయోగికి ఆత్మ తత్త్వాన్ని గురించి ఆలంకారిక పద్ధతిలో క్రిందివిధంగా బోధించాడు.

“జలములందు నిలిచి జలపక్షి మునుఁగదు

మేడిపండు మశకమీడఁ బొరయ

దట్ల విషయ సమితి యందుఁ దానది దన

యందు నుండి వికృతి నొంద దాత్మ”[6]

నీటిపక్షి నీటిలో ఉన్నా మునిగిపోదు. అత్తిపండులో ఎన్ని పురుగులున్నా వాటి వలన ఆ పండు బాధింపబడదు. అలాగే ఆత్మ విషయాలలో ఉన్నా, ఆత్మలో విషయాలున్నా – ఆత్మకు వికారం కలుగదు. ఇక్కడ ఉపమాలంకార పద్ధతిలో ఆత్మ స్వరూపాన్ని వ్యాసుడు శుకమహర్షికి తెలియజేశాడు.

శివుడు కుమారస్వామికి జ్ఞానోపదేశం చేసే సందర్భంలో, ఉపమాలంకారం ఆధారంగా 'సరసాహారం' రాగహేతువు కాదని వివరిస్తాడు.

"సరసాహారము రాగహేతు వను టజ్ఞానంబు; పారావతో
త్కరముల్ చిక్కని రాలు మ్రింగియు సదా కామార్తులైనయుండుఁ; గే
సరి సాంద్రామిష భుక్తియైనను సకృత్సంభోగమందున్; మనో
హర విజ్ఞానమ కాక రాగరసమం దాహార నిర్వృత్తియే?"[7]

కుమారా! రసవంతమైన ఆహారం రాగమునకు కారణం అనటం తెలివితక్కువతనం. పావురాల సమూహాలు చిక్కని ఱాలు (చెట్లలోని చిగుళ్ళు) మ్రింగినా, ఎల్లప్పుడూ అవి కామవాంఛ కలిగివుంటాయి. సింహం సాంద్రమైన మాంసభోజనం చేస్తుంది. కానీ అరుదుగా సంభోగిస్తుంది. కాబట్టి రాగరసం పొందటానికి మనోహర విజ్ఞానం కాక, ఆహారసిద్ధి కారణం కాదు అని శివుడు అంటాడు. ఇక్కడ ఆలంకారిక పద్ధతిలో శివుడు కుమారస్వామికి జ్ఞానోపదేశం చేసాడు.

ప్రహ్లాదుడు, తండ్రి అయిన హిరణ్యకశిపుడికి రూపకాలంకార పద్ధతిలో శ్రీహరి మాహాత్మ్యాన్ని వివరిస్తాడు.

"శోధింపం బడె సర్వశాస్త్రములు రక్షోనాథ! వే యేటికిన్
గాథల్ మాధవశేముషీతరణి సాంగత్యంబునం గాక దు
ర్మేధం దాఁటఁగ వచ్చునే సుతవధూమీనోగ్ర వాంఛా మద
క్రోధోల్లోల విశాల సంసృతి మహా ఘోరామితాంభోనిధిన్"[8]

ఓ తండ్రీ! నేను శాస్త్రాలు చదివాను. ఈ సంసారం భయంకరమైన సముద్రం. ఈ సంసార సాగరంలో భార్యా బిడ్డలు తిమింగలాలు. కామక్రోధాది అరిషడ్వర్గాలు ఎగసిపడే కెరటాలు. ఇటువంటి సంసారసాగరాన్ని దాటడానికి హరిభక్తి అనే పడవ ఒక్కటే సహాయపడగలదు. ఇతరాలైన కథలు, గాథలు

ఎందుకూ పనికిరావు. ఇక్కడ ప్రహ్లాదుడు రూపకాలంకార పద్ధతిలో హరిభక్తి విశిష్టతను తండ్రికి తెలియజేశాడు.

5.7. ఉదాహరణ–ప్రత్యుదాహరణ పద్ధతి:–

ఒక విషయాన్ని బోధించటానికి, ఉదాహరణలు, ప్రత్యుదాహరణలు చూపించటం ఈ పద్ధతిలో జరుగుతుంది. ఉదాహరణకు, ఆదర్శదంపతులు ఎలా ఉంటారో చెప్పమంటే నలదమయంతులు, సావిత్రీ సత్యవంతులు, ద్రౌపదీపాండవులు, సీతారాములు అని చెప్పడం జరుగుతుంది.

భార్యాభర్తలు ఎలా ఉండకూడదో చెప్పటానికి శకుంతలాదుష్యంతులు, దేవహూతికర్దములు, దేవయానియయాతులు అని చెపుతాం. ఈవిధంగా ఒక విషయాన్ని ఉదాహరణలు–ప్రత్యుదాహరణల ద్వారా బోధించటం ప్రాచీన కాలం నుండి అనుసరించబడుతున్నది.

అన్నదమ్ములు ఎలా ఉండాలో చెప్పటానికి శ్రీరామ లక్ష్మణులను ఉదాహరణగా చెపుతాం. ఎలా ఉండకూడదో చెప్పటానికి కౌరవపాండవుల కథ వినిపిస్తాం. తండ్రి మాటకోసం శ్రీరాముడు రాజ్యత్యాగం చేసాడు. అన్నకోసం లక్ష్మణుడు అడవికి వచ్చాడు. భరతుడు అన్నపాదాలకే పట్టాభిషేకం చేసి, తాను నామమాత్రుడిగా నిలిచాడు. తండ్రి రాజ్యం కోసం వీరు తగవులాడుకోలేదు. ధర్మతత్పరత ఈ అన్నదమ్ముల వ్యక్తిత్వాల్లో కనిపిస్తుంది.

పాండవకౌరవులు సోదరులు అయిప్పటికీ ఆస్తి కోసం మహాసంగ్రామం చేసారు. తన బంధువులతో పాటు మిగిలిన ప్రజలను కూడా కోల్పోయారు. అన్నదమ్ములు ఇలా ఉండకూడదు అని వీరి కథ వల్ల తెలుస్తుంది.

5.8. అన్యాపదేశ పద్ధతి:–

వేరొక దాన్ని నెపంగా పెట్టుకొని చెప్పటమే అన్యాపదేశం. ప్రస్తుతం ఒక విషయం గురించి చెపుతూ, వేరొక విషయాన్ని సూచన చేయటం ఈ పద్ధతిలో కనిపిస్తుంది. గురువు శిష్యుడికి, ఒక ప్రత్యేక ధర్మాన్నో, నీతినో నెపంగా పెట్టుకొని బోధనచేయటమే అన్యాపదేశ పద్ధతి.

పాండవులు అరణ్యవాసంలో ఉన్నప్పుడు, వాళ్లను చూడటానికి శ్రీకృష్ణుడు సత్యభామను వెంటబెట్టుకొని వస్తాడు. ద్రౌపది గుణవంతురాలైన, అణకువ కలగిన ఇల్లాలు. ఆమె ద్వారా అహంభావం మూర్తీభవించిన సత్యభామకు గృహిణీధర్మాలను చెప్పించే నెపంతో ద్రౌపదీసత్యభామలకు ఏకాంతాన్ని కలిగించాడు శ్రీకృష్ణుడు. ఆ ఏకాంత సమయంలో సత్యభామ ద్రౌపదిని ఇలాగ అడుగుతుంది. 'వదినా! నీవు ఐదుగురు భర్తలతో ఎలాగ కాపురం చేయగలుగుతున్నావు. వారిని ఏవిధంగా వశపరుచుకోగలుగుతున్నావు. మందులూమాకులూ పెట్టావా? అని ప్రశ్నిస్తుంది. అందుకు ద్రౌపది ఘాటుగా సమాధానమిస్తుంది. మందులూమాకుల వల్ల భర్త ఆరోగ్యం పాడవుతుంది. భర్త మనస్సును కనిపెట్టి నడుచుకోవడం వల్లనే భార్య కుటుంబాన్ని మంచి ఉన్నతికి తీసుకొనివెళ్ళగలదు అని సత్యభామకు ద్రౌపది గృహిణీధర్మాలను ప్రబోధిస్తుంది. శ్రీకృష్ణుడు నేరుగా సత్యభామకు సతీధర్మాలను చెప్పలేదు. పాండవులను చూడటానికి వచ్చే నెపంతో, ద్రౌపది చేత సత్యభామకు పై నీతిని బోధింపజేశాడు.

విఘ్నాధిపత్యం విషయంలో గణేశుడికి, కుమారస్వామికి మధ్య విభేదాలు వచ్చాయి. మాలో ఎవరు శక్తిమంతులో వారికి విఘ్నాధిపత్యం ఇవ్వమని కుమారస్వామి శివపార్వతులను కోరుతాడు. అతనికి జ్ఞానోదయం కలిగించే నెపంతో శివపార్వతులు, కుమారులు ఇద్దరికీ విశ్వభ్రమణపోటీని పెట్టారు. కుమారస్వామి మయూర వాహనం సహాయంతో, శరీర లాఘవం వల్ల విశ్వభ్రమణం చేయటానికి సిద్ధమయ్యాడు. కానీ విఘ్నేశ్వరుడు దీర్ఘకాయుడు. ఆయన వాహనం మూషికం. మరి ఎలాగ విశ్వభ్రమణం చేయటం? అనే సందేహం విఘ్నేశ్వరుడికి కలిగింది. అప్పుడు ఆయన వేదసమ్మతమైన రీతిలో మాతాపితలకు మూడు ప్రదక్షిణలు చేస్తాడు. దానివల్ల మూడుసార్లు విశ్వభ్రమణం చేసిన ఫలితం, కుమారస్వామి కన్నా ముందుగానే పోటీలో నెగ్గడం విఘ్నేశ్వరుడికి లభించాయి. ఈ కథ ద్వారా విశ్వభ్రమణం కన్నా, మాతాపితల సేవ గొప్పది అనే విషయం చెప్పబడింది. ఈ జ్ఞానాన్ని కుమారస్వామికి బోధించే నెపంతో శివపార్వతులు ఈ పోటీని ఏర్పాటుచేశారు.

శ్రీకృష్ణదేవరాయల అంతఃపుర కలహాన్ని తొలగించే నెపంతో, నందితిమ్మన 'పారిజాతాపహరణం' అనే ప్రబంధాన్ని రాసాడు. శ్రీకృష్ణుడికి – శ్రీకృష్ణదేవరాయలకు, సత్యభామకు – తిరుమలదేవికి అభేదాన్ని సూచిస్తూ నందితిమ్మన ఈ ప్రబంధ రచన చేశారు. కావ్యాన్ని విన్న తర్వాత శ్రీకృష్ణదేవరాయలు దానిలోని

అంతరార్థాన్ని గ్రహించి, తిరుమలదేవిని ఆదరిస్తాడు. ఈవిధంగా రాయల దంపతులను ఒక్కటి చేసే నెపంతో నందితిమ్మన పారిజాతాపహరణం రాసాడు.

5.9. ప్రవృత్తి పద్ధతి:–

ఐహిక కర్మల్లో ఏవిధంగా నడుచుకోవాలో బోధించే పద్ధతి 'ప్రవృత్తి పద్ధతి'. లౌకిక జీవితంలో మానవుడు ఏవిధంగా నడుచుకోవాలో విద్యార్థి దశలోనే గురువులు బోధించటం జరిగేది. ధర్మార్థ కామ పురుషార్థాలను మానవుడు ఎలాగ పొందాలి, ముక్తి పొందటం కోసం ఎటువంటి జీవనవిధానాల్ని అనుసరించాలి అనే విషయాల్ని బోధించటమే ప్రవృత్తి పద్ధతి.

రామాయణ భారత భాగవతాల నిండా ఇటువంటి విషయాలు ఎక్కువగా కనిపిస్తాయి. రాముడు వనవాసానికి బయలుదేరుతాడు. దానికి కారణం కైకేయి అని తెలుసుకున్న సుమంత్రుడు. ఆమెకు ప్రవృత్తి పద్ధతిలో నీతిని బోధించాడు.

"తనయు లొకకోటి గల్గిన ధరణిలోన
నంబుజాక్షికి భర్తృమనోనుసరణ
మరయ నిఖిలార్థ సాధనమై చెలంగుఁ
గానఁ బతినింక నేఁచక గావు మబల"[9]

ఓ కైకేయి! పుత్రులు ఎంతమంది ఉన్నప్పటికీ, భర్త మనస్సును అనుసరించి నడుచుకోవటమే సతికి ఉత్తమ ధర్మం. అది అఖిలార్థసాధనం. కాబట్టి నీవు నీభర్త మనస్సును అనుసరించి ప్రవర్తించు అని సుమంత్రుడు కైకేయికి లోకప్రవృత్తిని బోధించాడు.

భీష్ముడు ధర్మరాజుకు ప్రవృత్తిపద్ధతిలో ఎన్నో లోకాచారాలను బోధించాడు. పురుషార్థాలు, రాజధర్మాలు, న్యాయాలు ఇలా ఎన్నో విషయాలను భీష్ముడు ధర్మరాజుకు బోధించాడు.

భీష్ముడు, ధర్మరాజుకు తటాకనిర్మాణం వల్ల కలిగే ఫలితాల్ని క్రిందివిధంగా తెలియజేశాడు.

"దేవ తిర్యఙ్నర స్థావరాశ్రయము త / టాకంబు వినుమట్లుఁగాక యందు

గోకులంబులు నీరు గొని దాని కర్తకు / లము నెల్లఁ బుణ్యలోకమున కనుచు
నీ లోకమున శ్రీయు నెక్కుడు కీర్తియు / నతనికిఁ జేయు వర్షాగమమున
సీతున వేసవిఁ జెఱువులో నీరున్న / నగ్నిహోత్రాదిమజ్ఞ వాజి

పేయఫలములోని నాయన కగుఁగట్ట
దగిన తరువు లిడిన సుగతి గలుగు
నిహిసుఖంబుఁబొందు విహగాది బహుభూత
వాససౌఖ్య మతఁడు సేసెఁగాన"[10]

ధర్మరాజా! చెరువు దేవతలకు, పశువులకు, పక్షులకు రాయి రప్పలవంటి స్థావరాలకు నెలవైనది. అందులోని నీటిని త్రాగి పశువులు దాన్ని నిర్మించిన వాడి కులాన్నంతటినీ పుణ్యలోకాలకు పంపుతాయి. ఈ లోకంలో గొప్పసంపదను, చెడని కీర్తిని కలిగిస్తాయి. వానాకాలంలో, చలికాలంలో, ఎండాకాలంలో చెరువులో నీళ్ళుండటం వల్ల మహాయజ్ఞాలు చేసిన ఫలం ఆ కర్తకు లభిస్తుంది. కట్ట మీద. తగిన చెట్లు నాటితే పక్షులు మొదలైన ప్రాణకోటికి నిలువనీడనిచ్చి సుఖం కూర్చినవాడు అవుతాడు. కాబట్టి అతడికి ఇహపర సుఖాలు కలుగుతాయి అని భీష్ముడు ప్రవృత్తిపద్ధతిలో ధర్మరాజుకు సత్కర్మమార్గాన్ని బోధించాడు.

శుకయోగి పరీక్షిత్తుకు సదాచారాలను ప్రవృత్తిపద్ధతిలో బోధించాడు. అధర్మాచరణ వల్ల కలిగే నరక బాధలను శుకయోగి క్రింది విధంగా వివరించాడు.

"తన కలిమి నెవ్వఁడేనియుఁ / దన బాంధవ వరులఁగూడి తగఁగుడునక తా
నును వాయసంబు భక్షిం / చిన మాడ్కిరి దిన్నవాడు శీఘ్రమె యచటన్"[11]

"క్రిమి భోజన మనియెడి నర / కమునం బడి క్రిములె కూడుగాఁగుడుచుచుఁదాఁ
గ్రిమి యగుచు లక్షపరిమా/ణము గలక్రిమికుండ మందు నాటుక యుండున్"[12]

ఓ రాజా! తాను కూడబెట్టినటువంటి సంపదలో కొంచెం కూడా తనవారికి పెట్టకుండా, తానొక్కడే కాకిలాగా భక్షించేవాడిని 'క్రిమిభోజనం' అనే నరకంలో యమభటులు తోస్తారు. అక్కడవాడు పురుగు లాగా సుమారు లక్షయోజనాల విస్తీర్ణం కలిగిన పురుగుల గుంటలో కూరుకుపోయి పురుగులనే ఆహారంగా

తింటూ ఉంటాడు. 'తన ఇంటికి అతిథి వస్తే అతడిని ఆదరించకుండా కోపోద్రేకంతో చూసిన దుర్మార్గుల కళ్ళను వజ్రాల కోరలు గల రాబందులు, గద్దలు పొడుచుకొని తింటాయి'[13] అని శుకయోగి అధర్మాచరణ వల్ల కలిగే యమలోక బాధల్ని పరీక్షిత్తుకు ప్రవృత్తిపద్ధతిలో బోధించాడు.

5.10. ఆనుపూర్వి పద్ధతి:-

ఏదైనా ఒక విషయం గురించి, మొదటి నుండి వచ్చు క్రమ పరిణామాన్ని వివరించటమే ఆనుపూర్విపద్ధతి. సృష్టి ఎలా మొదలైంది? సూర్యవంశం, చంద్రవంశం ఎలా క్రమపరిణామాన్ని ప్రసిద్ధి పొందాయి? ఆయా వంశాల్లో చక్రవర్తులు ఎవరు? భూతసృష్టి ఎలా జరిగింది? ఇటువంటి విషయాల గురించి బోధించే పద్ధతినే ఆనుపూర్విపద్ధతి అంటారు.

భారతభాగవతాల్లో, అష్టాదశపురాణాల్లో ఇటువంటి పద్ధతి ఎక్కువగా కనిపిస్తుంది. గత చరిత్రను, సృష్టి నిర్మాణక్రమాలను , సమాజంలో జరుగుతున్న పరిణామాలను తెలుసుకోవటానికి ఈ బోధన పద్ధతి ఉపయోగపడుతుంది.

ఆంధ్రమహాభారతంలో, శాంతిపర్వంలో భీష్ముడు ధర్మరాజుకు భూమి మొదలైన భూతోత్పత్తి క్రమపరిణామాన్ని వివరించాడు. "ఆ బ్రహ్మదేవుడి సంకల్పం వల్ల ఆకాశం, ఆకాశం నుండి నీరు, నీటి నుండి నిప్పు, గాలి జన్మించాయి. ఆ తర్వాత నిప్పు-గాలి కలయిక వల్ల భూమి పుట్టింది"[14]. 'బ్రహ్మ ఎల్లభూతాలు అంటే భూమి మొదలైనవి, ఇతరాలు కూడా తన శరీరంగా ధరించి ఉంటాడు. బ్రహ్మ శరీరానికి సృష్టిలోని పర్వతాలు-ఎముకలు, భూమి-కొవ్వు, మాసం, సముద్రాలు – నెత్తురు, ఆకాశం – పొట, గాలి – ఊర్పు, నిప్పు – వెలుతురు, నదులు – రక్తవాహికాలైన నరాలు – ఈ విధంగా సూర్యచంద్రులు – కళ్ళు, పైలోకం – తల, పాతాళం – కాళ్ళ అడుగులు, దిక్కులు – చేతులు – ఇలా అంతంలేని శరీరం గలిగినవాడు పరబ్రహ్మ'[15]. ఈవిధంగా భీష్ముడు సృష్టి ఆవిర్భావాన్ని, పరమాత్మ తత్వాన్ని వివరించాడు.

భృగుమహర్షి, భరద్వాజుడికి వర్ణాశ్రమాచారాల గురించి ఆనుపూర్విపద్ధతిలో బోధిస్తాడు. 'ఓ భరద్వాజా! బ్రహ్మదేవుడు మొదటగా వేదాలకు, సత్యధర్మ ఆచారాలకు, తపస్సులకు నెలవుగా ఉంటారని

బ్రాహ్మణులను సృష్టించాడు. తర్వాత క్షత్రియ వైశ్య శూద్రులను సృష్టించాడు. బ్రాహ్మణులు మొదలు శూద్రుల వరకు గల నాలుగు వర్ణాల వారి శరీరపు రంగులు క్రమంగా తెలుపు, ఎరుపు, పసుపు, నలుపు అంటారు పెద్దలు. తమ వృత్తులు వదలి అన్యుల వృత్తుల్ని స్వీకరిస్తే వారికి ఆ వృత్తి ఏర్పడుతుంది. అయితే అటువంటి ప్రవర్తన వల్ల లోకంలో అవినీతి పెరుగుతుంది'[16]. ఈవిధంగా చాతుర్వర్ణాల సృష్టి, వారి స్వరూపస్వభావాల గురించి భృగుమహర్షి భరద్వాజుడికి తెలియజేశాడు.

కపిలుడు, దేవహూతికి పిండోత్పత్తిక్రమాన్ని ఆనుపూర్విపద్ధతిలో బోధించాడు. 'జీవుడు పురుషుని వీర్యబిందు సంబంధంలో స్త్రీ గర్భంలో ప్రవేశిస్తాడు. ఒక రాత్రికి కలిలమై, తర్వాత ఐదురాత్రులకు బుద్బుదమై, ఆ పైన పదవదినానికి రేగుపండంతయై అనంతరం మాంసపిండమై గ్రుడ్డు ఆకారం పొందుతాడు. ఒక్క నెలకు శిరస్సు ఏర్పడుతుంది. రెండు నెలలకు కాళ్ళుచేతులు వస్తాయి. మూడు నెలలకు గోళ్ళు, వెంట్రుకలు, ఎముకలు, చర్మం, నవరంధ్రాలు ఏర్పడతాయి. ---"[17]. ఈవిధంగా పిండోత్పత్తి క్రమాన్ని కపిలుడు, తన తల్లి అయిన దేవహూతికి ఆనుపూర్వి పద్ధతిలో తెలియజేశాడు.

ప్రాచీన తెలుగు కావ్యాలు చాలా వాటిలో శ్రీమహావిష్ణువు దశావతారాలను ఆనుపూర్వి పద్ధతిలో వివరించటం జరుగుతుంది. భాగవతపురాణంలో బ్రహ్మదేవుడు, నారదమహర్షికి శ్రీమహావిష్ణువు లీలావతారాలను క్రమపద్ధతిలో వర్ణించి చెప్పాడు. ప్రజాపతుల సృష్టి, మనువుల పట్టుక మొదలైనవి ఆనుపూర్వి పద్ధతిలోనే వివరించబడ్డాయి. శుకయోగి పరీక్షిత్తుకు భూగోళ నిర్ణయాన్ని ఆనుపూర్వి పద్ధతిలో బోధించాడు. "భూమి పద్మాకారంగా ఉంది, ఆ పద్మాకారమైన భూమిలో జంబూద్వీపం తామరరేకు లాగా గుండ్రంగా కనిపిస్తుంది. అది లక్షయోజనాల పొడవు, లక్షయోజనాల వెడల్పు కలిగి ఉంటుంది. దానిలో గుండ్రటి ఆకారాలతో తొమ్మిది వేల యోజనాల విస్తీర్ణం గల తొమ్మిది వర్షాలు ఉన్నాయి. వాటిని విభజించే సరిహద్దులుగా ఎనిమిది పర్వతాలున్నాయి"[18]. ఈవిధంగా భూగోళ ఆకృతిని క్రమపద్ధతిలో, పరిణామక్రమంలో శుకయోగి పరీక్షిత్తుకు తెలియజేశాడు. రామాయణంలో సూర్యవంశ రాజుల చరిత్ర, మహాభారతం ఆదిపర్వంలో చంద్రవంశపు రాజుల చరిత్ర ఆనుపూర్వి పద్ధతిలో వివరించబడ్డాయి.

5.11. విశ్లేషణ పద్ధతి :-

ఈ పద్ధతిలో గురువు భోదనాంశాలను వివిధ కోణాల్లో వివరించవలసి ఉంటుంది. ఈ పద్ధతి వల్ల విద్యార్థులో తార్కికశక్తి, లోతైన ఆలోచనాశక్తి పెరుగుతాయి. Analysis and synthesis అనే రెండు ప్రధాన భావాల సమాహార రూపమే విశ్లేషణ పద్ధతి.

వ్యాసుడు, శుకయోగికి 'అంతర్యాగం' గురించి విశ్లేషణాత్మకంగా వివరించాడు. "అంతర్యాగం చేసే వాడు తన హృదయం అనే యజ్ఞవేదికపై ధగధగ ప్రకాశించే తేజస్సులో ప్రాణాలను వేలుస్తాడు. అలాగ అంతరంగంలో చేసే యాగం వల్ల అతడు విగతపాపుడై ప్రకాశిస్తాడు. ఆధ్యాత్మిక తత్త్వవేత్తలైన పెద్దలు తమను ఆశ్రయించిన వారితో 'ఆత్మ' అనే తీర్థాన్ని ఎట్లా సేవించాలో తెలిసిన వారికి ఇతర ప్రదేశాల్లో తీర్థాటనం చేయవలసిన పనిలేదని చెపుతారు ఆత్మ అనే ఒక చిన్మయమైన పక్షి ఉంది. అది భూమిని స్పృశించదు. ఆకాశంలో ఏ ప్రమాణానికీ గోచరం కాదు. అది పిండమనే గ్రుడ్డు మధ్యలో ప్రకాశించే కాలమనే రెక్కలతో ప్రకాశిస్తూ ఉంటుంది. యోగశక్తి కలవాడు మాత్రమే దాన్ని గ్రహించగలడు"[19]. పై విధంగా అంతరంగంలో చేయవలసిన యాగం గురించి విశ్లేషణాత్మక పద్ధతిలో వ్యాసుడు శుకుడికి బోధించాడు.

భాగవతంలో, ప్రహ్లాదుడు తన తండ్రి అయిన హిరణ్యకశిపుడికి విశ్లేషణాత్మక పద్ధతిలో శ్రీహరిమహాత్మ్యాన్ని వివరిస్తాడు.

"కలఁడంబోధిఁ, గలండు గాలిఁ, గలఁడాకాశంబునం, గుంభినిం
గలఁ, డగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలం
గల, డోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలింగవ్యక్తులం దంతటం
గలఁ, డీశుండు గలండు, తండ్రి! వెదకంగా నేల నీ యా యెడన్"[20]

తండ్రీ! భగవంతుడైన విష్ణువు లేనిచోటు విశ్వంలో లేదు. సముద్రంలో ఉన్నాడు. సమీపంలో ఉన్నాడు. ఆకాశంలో ఉన్నాడు. భూమి మీద ఉన్నాడు. అగ్నిలో, అన్నిదిశల్లో ఉన్నాడు. రాత్రిలోను, పగటిలోను ఉన్నాడు అని ప్రహ్లాదుడు శ్రీహరి విరాట్ స్వరూపాన్ని గురించి విశ్లేషిస్తాడు. భగవంతుడు

ఒకచోట ఉన్నాడనీ, మరొక చోట లేడని సందేహించవద్దు. అతడు అన్ని ప్రదేశాల్లోనూ ఉంటాడు. అన్ని పదార్థాల్లోనూ ఉంటాడు. ఎక్కడ వెదికితే అక్కడ కనిపిస్తాడు అని భగవంతుడి తత్త్వాన్ని తార్కికమైన పద్ధతిలో వివరించాడు.

శివుడు పార్వతీదేవికి యోగశాస్త్ర విశేషాలను విశ్లేషణాత్మక పద్ధతిలో వివరించాడు. ఆనుశాసనిక పర్వంలో పంచమాశ్వాసంలో ఇవి వర్ణించబడ్డాయి. యోగసాధన గురించి శివుడు ఈవిధంగా తెలియజేశాడు. "మనస్సులో ఇంద్రియాలను, మనస్సును ఆత్మలో లీనం చేయగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు రెండూ యోగం సిద్ధించటానికి ఆధీనాలై ఉంటాయి. మనుజుడు ఏకాగ్రచిత్తుడై ముందు చెప్పినట్లు అపానవాయువుతో కూడిన ప్రాణవాయువు యొక్క గమనానికి శిరస్సు నిలయమౌతుంది. నిలయమైన అతడే జీవుడని, పరమాత్మ అని చెప్పబడుతూ ఉంటాడు. ప్రాణాన్ని అపానంలో, అపానాన్ని ప్రాణంలో స్థాపించి ముక్తిని వాంఛించి మనస్సును గట్టిగా నిరోధించగా ఆ యోగమార్గంలో నిరతుడైన యోగికి ప్రాణనిరోధ సంపన్నత్వం కలుగుతుంది. శరీరంలోని ఊష్మాన్ని పైకి ఎగజిమ్మగా ఆ ప్రాణాపాన దేహాగ్నులు మూడూ చేరి ఏమాత్రం జారుపాటు లేకుండా మూర్ధస్థానాన్ని భేదించుకొని పోయే అభిలాష కలిగివుంటాయి"[21]. ఈవిధంగా విశ్లేషణాత్మక పద్ధతిలో పరమేశ్వరుడు పార్వతీదేవికి యోగశాస్త్ర విశేషాల్ని బోధించాడు.

5.12. ప్రయోగపద్ధతి:–

ఈ పద్ధతిని గురించి డా. ఆర్. మల్లేశుడు గారు ఈవిధంగా తెలియజేశారు. "ఒక విషయాన్ని ఇతరులకు బోధించటానికి ముందు తానాచరించి ఇతరుల ముందు ప్రకాశింపజేయడాన్ని ప్రయోగం అంటారు. ఈ పద్ధతి వల్ల విద్యార్థులకు విషయం సులభంగా బోధపడుతుంది. కేవల సిద్ధాంతజ్ఞానం (Theoretical knowledge) వల్ల విద్యార్థికి పరిపూర్ణమైన జ్ఞానం కలుగదు. విద్యార్థి తాను గ్రహించిన విషయాన్ని ప్రయోగ పద్ధతి వల్ల అనుభవానికి తెచ్చుకొంటాడు"[22]. ఈ పద్ధతి వల్ల ఎంతకష్టమైన విషయాన్ని అయినా ఆసక్తి గా నేర్చుకోవటానికి వీలుకలుగుతుంది. ఉపనిషత్తుల్లోనూ, రామాయణ భారతాది కావ్యాల్లోనూ ప్రయోగ పద్ధతిలో జ్ఞానాన్ని బోధించిన సందర్భాలు ఉన్నాయి. ఆత్మ విశ్వమంతా వ్యాపించి ఉంటుందని గురువు చెపుతాడు. అది ఎందుకు కనిపించటం లేదని శిష్యుడు అడుగుతాడు. శిష్యుని

సందేహాన్ని తీర్చటానికి, గురువు అతనిని ఒక ఉప్పు గడ్డను తీసుకురమ్మంటాడు. శిష్యుడు తెచ్చిన ఉప్పుగడ్డను, గురువు నీళ్ళతో కలపమని చెపుతాడు. రేపు ప్రొద్దున్నే రమ్మంటాడు.

మరుసటి రోజు ఉదయాన్నే వచ్చిన శిష్యుడిని, రాత్రి నీళ్ళలో కలిపిన ఉప్పు గడ్డను తీసుకురమ్మని గురువు అంటాడు. శిష్యుడు ఎంత వెదికినా అతడికి ఉప్పుగడ్డ దొరకలేదు. అదే విషయాన్ని గురువుకు చెపుతాడు. అప్పుడు గురువు, శిష్యునితో ఈవిధంగా అంటాడు. 'నీటియందు ఉప్పు కలిసిపోయింది. దాన్ని నీవు కంటితో చూడలేవు, చేతితో తాకలేవు. నాలుకతో మాత్రమే తెలుసుకోగలవు. అలాగే శరీరంలోనే ఉన్న ఆత్మను నీవు ఇంద్రియాలతో తెలుసుకోలేవు. మరొక విధంగా తెలుసుకోవచ్చు' అని గురువు శిష్యుడికి పరతత్వాన్ని గురించి బోధించాడు. ఇది ప్రయోగపద్ధతి వల్ల కలిగే ఫలితం.

'పాండురంగమాహాత్మ్యం'లో నిగమశర్మ అక్క ప్రయోగపద్ధతిలోనే తమ్ముడికి గృహనీతిని బోధిస్తుంది. ఒకరోజు నిగమశర్మ చద్దన్నం తినటానికి ఇంటికి వస్తాడు. నిగమశర్మఅక్క తమ్ముడికి స్నానం చేయించి, తలలో ఉన్న చిక్కుతీస్తూ, 'ఇడుగోరా! నీ మేనల్లుడు. కాసేపు ఆడించు' అంటుంది. ఈ మాట వెనుక ఎంతో అంతరార్థం ఉంది. 'ఒరేయ్! నీకు పెళ్ళి జరిగి చాలా కాలం అయింది. కానీ నువ్వు ఎప్పుడూ భార్య ముఖం చూడలేదు. ఆమె తన బాధను పైకి చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతోంది. ఆ కట్టుకున్న భార్యను ఆదరించు. ఇదిగో! ఇటువంటి బిడ్డకు జన్మనిచ్చి, మన తండ్రి వంశాన్ని ఉద్ధరించు' అని ఒక ప్రయోగం లాగా చేసి తమ్ముడికి గృహనీతిని బోధించింది నిగమశర్మఅక్క. వాస్తవానికి బిడ్డను ఆడించటానికి ఇంట్లో ఎంతోమంది ఉన్నారు. కానీ తమ్ముడిలో మార్పు తొసుకొని రావటానికి నిగమశర్మఅక్క ఇలా ప్రయోగం చేసి అతడికి గృహనీతిని బోధించింది.

5.13. ప్రదర్శన పద్ధతి:–

ఇది విద్యార్థుల ప్రతిభను గుర్తించటానికి గురువులు అనుసరించిన పద్ధతి. ద్రోణుడు చెట్టుమీద ఒక కొమ్మును పెట్టి, దాన్ని గురి చూసి కొట్టమని కౌరవ బాలురికి చెప్పాడు. తర్వాత ఒక కృత్రిమ పక్షిని చెట్టుమీద పెట్టి, దాని కన్ను మాత్రమే నేలకూలేటట్లు చేయమని విద్యార్థులను ఆదేశిస్తాడు. ఈ పోటీలో అర్జునుడు

మాత్రమే విజయం సాధిస్తాడు. ఏకాగ్రచిత్తం, లక్ష్యంపై దృష్టి అతడి విజయానికి కారణం. ఇక్కడ ప్రతిభను పరిశీలించటం జరిగింది.

భగవంతుడు ఎక్కడ ఉంటాడు చూపించు అని ప్రహ్లాదుడిని హిరణ్యకశిపుడు ప్రశ్నిస్తాడు. పరమాత్మ అన్ని సందర్భాల్లో ఉంటాడని ప్రహ్లాదుడు తెలియజేస్తాడు. మరి స్తంభంలో నీ శ్రీహరిని చూపించగలవా? అని హిరణ్యకశిపుడు ప్రశ్నిస్తాడు. ప్రహ్లాదుడు శ్రీహరిని ప్రార్థిస్తాడు. హిరణ్యకశిపుడు గదతో స్తంభాన్ని బద్దలు చేస్తాడు. అప్పుడే శ్రీహరి నరహరిగా దర్శనమిస్తాడు. ప్రహ్లాదుడు చెప్పినట్లు జంతువుల్లోను, స్తంభంలోను ఇలా అన్నింటా నేను ఉంటాను అని నిరూపించటానికి శ్రీహరి నరసింహమూర్తి తన విరాట్ స్వరూపాన్ని ప్రదర్శించాడు. అవిద్యలో కూరుకుపోయిన అసురుడికి తన స్వరూపప్రదర్శనం ద్వారా జ్ఞానాన్ని ప్రసాదించాడు.

కుమారాస్త్ర విద్యాప్రదర్శన ఘట్టంలో, కౌరవ పాండవ వీరులు తమ విద్యాకౌశలాన్ని ప్రదర్శిస్తారు. ఇది పోటీ పద్ధతి అయినా, ప్రదర్శన ద్వారా ఇతరులకు ఆ విద్యను పరిచయం చేయటం జరుగుతుంది. అందువల్లనే అర్జునుడిని మించిన ధానుశ్కుడు ప్రపంచంలో మరోవ్యక్తి లేడని ద్రోణాచార్యుడు ప్రతిపాదిస్తాడు. అందుకు ఉపబలకంగా అతడి చేత అస్త్రవిద్యను నిండుసభలో ప్రదర్శింపజేస్తాడు.

పై విధంగా ప్రాచీనకాలంలో గురువులు వివిధ బోధన పద్ధతుల ద్వారా విద్యావిషయాలను తమ శిష్యులకు బోధించేవారు. విద్యార్థిలో అంతర్నిగూఢంగా దాగివున్న ప్రతిభను వెలికితీయటమే విద్యాబోధనలోని ప్రధాన ఉద్దేశం.

పాదసూచికలు

1. సూర్యరాయాంధ్ర, 5సం, పు.234.

2. మహాభారతంలో విద్యావిధానం, పు.26.

3. శాంతి, 5ఆ, 310ప.

4. మహాభారతంలో విద్యావిధానం, పు.29

5. శాంతి, 5ఆ, 145ప.

6. పైదే, 172ప.

7. కుమారసంభవ ము, 12ఆ, 220ప.

8. పోతన భాగవతము, 7స్కం, 183ప.

9. గోపీనాథరామాయణము, బాలకాండ, 767ప.

10. ఆనుశాసనిక, 3ఆ, 330ప.

11. పోతన భాగవతము, 5స్కం, 2ఆ, 146ప.

12. పైదే, 147ప.

13. పైదే, 160ప.

14. శాంతి, 4ఆ, 82ప.

15. పైదే, 83ప.

16. శాంతి, 4ఆ, 97ప.

17. పోతన భాగవతము, 4స్కం, 156ప.

18. పైదే, 5స్కం, 2ఆ, 17ప.

19. శాంతి, 5ఆ, 149–151.

20. పోతన భాగవతము, 7స్కం, 274ప.

21. ఆనుశాసనిక, 5ఆ, 257–260.

22. పైదే, పు.31.

ఆరవ అధ్యాయం

గురుశిష్య సంబంధాలు – కావ్యానుశీలన

6. గురుశిష్య సంబంధాలు – కావ్యానుశీలన

బండికి ఉన్న రెండు చక్రాల లాగా, గుండెకు ఉండే రెండు కవాటాల లాగా సమప్రాధాన్యం కలగినవారు గురుశిష్యులు. ఈ ఇద్దరి మధ్య బంధాన్ని ఏర్పరిచేది విద్యాబోధన. సత్ప్రవర్తన ఇద్దరికీ ఉండవలసిన ముఖ్యలక్షణం. ఆచార్యుడు, అంతేవాసి, ప్రవచనం, ప్రవర్తన ఈ నాలుగూ విద్యాసౌధానికి ఉన్న నాలుగు స్తంభాలు. ప్రస్తుత అధ్యాయంలో ఈ గురుశిష్య సంబంధాలు ప్రాచీన తెలుగు కావ్యాల్లో ఎలా ప్రతిఫలించాయో వివరించబడుతుంది.

'గురువు' అనే పదానికి 'విద్యార్థిలో అంతర్గతంగా దాగివున్న ప్రతిభను గుర్తించి దాన్ని వెలికితీసేవాడని' అర్థం. ఈ ప్రతిభ విద్యార్థిలో వాసనారూపంలో ఉంటుంది. గురుశుశ్రూష, ఆశ్రమజీవం, బోధన, సత్ప్రవర్తన, నిరాడంబరజీవనం వల్ల ఈ ప్రతిభ వికసిస్తుంది. ఇనుమును బంగారంగా మార్చినట్లు గురువు తన బోధనల ద్వారా అజ్ఞానిని జ్ఞానిగా మార్చగలడు.

ప్రాచీనకాలంలో క్రిందివారిని గురువులుగా సంబోధించేవారు. 'తండ్రి, ఉపాధ్యాయుడు, తాత (తండ్రి తండ్రి; తల్లి తండ్రి), పినతండ్రి, పెద్దతండ్రి, అన్న, మేనమామ, భార్యతండ్రి, భర్తతండ్రి, కులపెద్ద, మంత్రోపదేశం చేసిన ఆచార్యుడు, బృహస్పతి, రాజు, రక్షకుడు' మొదలైనవారిని గురువులుగా భావించారు. దీన్నిబట్టి జన్మనిచ్చినవారు, పునర్జన్మనిచ్చి ఉపనయనం చేసిన గురువు, ఇతర గురువులు ఆపదలో ఉన్నప్పుడు కర్తవ్యోపదేశం చేసివారు అందరూ గురువులుగానే భావించబడ్డారు. కానీ ప్రస్తుత సిద్ధాంతవ్యాసం విద్యావిధానానికి సంబంధించినది. కాబట్టి విషయ పరిమితిని దృష్టిలో పెట్టుకొని గురుశిష్యులు, విద్యాబోధన, గురుదక్షిణలు అన్న విషయాలను ప్రధానంగా ఇందులో విశ్లేషించుదలుచుకున్నాను. తండ్రి, తాత, సూతుడు మొదలైనవారి ఉపదేశాలను సందర్భాన్నిబట్టి క్లుప్తంగా వివరిస్తున్నాను.

'గురువు' అనే పదానికి ఆచార్యుడు, ఉపాధ్యాయుడు, అధ్యాపకుడు, ఒజ్జ, ఉపదేశికుడు, విద్యాదాత వంటి పేర్లు పర్యాయపదాలుగా ఉన్నాయి. ఒక్కో సందర్భంలో ఒక్కో పదం ప్రయోగించబడింది. ఇవన్నీ పర్యాయ పదాలు అయినప్పటికీ, ప్రతి పదానికి ప్రత్యేకమైన అర్థాలున్నాయి.

6.1. గురువు – శిష్యుడు:-

ప్రాచీన కాలంలో గురుశిష్యులు ఎటువంటి నియమాలు పాటించారు, వాటి వెనుక ఉన్న ప్రయోజనాలు ఏమిటి అనేవి ఇక్కడ విశ్లేషించడం జరుగుతున్నది.

6.1.1. ఆచార్యుడు – పదవ్యుత్పత్తి:-

మనుస్మృతిలో 'ఆచార్య' పదానికి క్రింది వివరణ కనిపిస్తుంది.

"ఉపనీయతు యః శిష్యం వేదమధ్యాపయేద్ద్విజః
సంకల్పం సరహస్యం చ తమాచార్యమ్ ప్రచక్షతే"[1]

ఏ ద్విజుడైతే శిష్యుడికి ఉపనయనం చేసి, కల్పరహస్య సహితంగా వేదంలో ఒక శాఖను బోధిస్తాడో అతడు ఆచార్యుడు. ఆచార్యుడు పదవాక్య ప్రమాణజ్ఞుడు. వ్యాకరణము, వేదాంతము తర్కము బాగా తెలిసినవాడు. అందువల్ల అతనికి సంఘంలో ప్రత్యేకమైన స్థానం ఆనాడు ఉండేది. వేదంలో పూర్వభాగమైన యజ్ఞవిద్యను గురించి, ఉత్తరభాగమైన ఉపనిషత్తును గురించి చెప్పడం ఆచార్యుని విధి.

6.1.2. ఉపాధ్యాయుడు – పదవ్యుత్పత్తి:-

'ఉపాధ్యాయుడు' అన్న పదానికి క్రింది వివరణ కలదు.

"ఏక దేశం తు వేదస్య వేదాంగాన్యపి వా పునః
యోఽధ్యాపయతి వృత్త్యర్థముపాధ్యాయస్స ఉచ్యతే"[2]

వేదంలో కొంతభాగం కాని, వేదాంగాలను గాని జీవికకోసం తీసుకొని బోధించువాడు ఉపాధ్యాయుడు. ఆచార్యుడు వేదంలోని ఒకశాఖను పూర్తిగా బోధిస్తే, ఉపాధ్యాయుడు వేదాంగాలను బోధిస్తాడు. ఆచార్యుడు శుల్కం తీసుకోకుండా విద్యాదానం చేస్తాడు. ఉపాధ్యాయుడు శుల్కం తీసుకొని విద్యను బోధిస్తాడు.

ఉపాధ్యాయుడు ప్రాథమికస్థాయిలో విద్యను బోధిస్తాడు. ఆచార్యుడు ఉన్నతవిద్యను బోధిస్తాడు. కానీ బౌద్ధ విద్యావిధానంలో ఇది విరుద్ధంగా కనిపిస్తుంది. ఆచార్యుడంటే క్రింది స్థాయిలో చదువుచెప్పేవాడు.

తెలుగు కావ్యాల్లో దాదాపు వైదిక సంప్రదాయాన్ని పాటించారు కాబట్టి ఇక్కడ ఉపాధ్యాయుడంటే క్రిందిస్థాయి విద్యాబోధకుడనే గ్రహించబడుతున్నది.

ఉపాధ్యాయిని :–

ప్రాచీనకాలంలో స్త్రీలు కూడా విద్యనభ్యసించేవారు. స్త్రీలు ఉపాధ్యాయులుగా ఉండేవారు. ఉపాధ్యాయీ, ఉపాధ్యాయా, ఆచార్యా అనే పేర్లు ఉండేవి. ఇవి గురువుల భార్యలను సూచించే పదాలు కావు. నాటి స్త్రీగురువుకు వాడే పేర్లు ఇవి. పాణిని, ఆనాడు వేదశాఖలను అధ్యయనం చేసే స్త్రీ విద్యార్థినులను పేర్కొన్నాడు. సైనిక శిక్షణలో కూడా స్త్రీలకు ప్రవేశముండేది. 'శాక్తికీ' అంటే బల్లెం ప్రయోగించే స్త్రీ అని అర్థం. దీన్నిబట్టి ప్రాచీన విద్యాభ్యాసంలో స్త్రీపురుషులు ఇరువురూ ఉపాధ్యాయత్వం చేసినట్లు తెలుస్తున్నది.

6.1.3. అధ్యాపకుడు – లక్షణాలు:–

అధ్యాపకునికి ఏయే లక్షణాలు ఉండాలో మహాభారతంలో క్రిందివిధంగా తెలుపబడింది.

"శాంతుడు, సువ్రతశీలుడు, దాంతుండధ్యాపకుండు దయగలవాడ, త్యంత
ప్రబోధ స్ప, ద్వంతుడు పావనులు భూపవర పంక్తులకున్"[3]

శాంతగుణం కలిగినవాడు, సచ్ఛీలుడు, దయగలవాడు, గొప్పబోధనాశక్తి కలవాడు అధ్యాపకుడు అని పిలువబడతాడు. బోధన చేసే వ్యక్తి పాండిత్యంతో పాటు, అసాధారణ వాక్ప్రవాహం, దయాగుణం అవసరం. ఇవి లేకపోతే అతని పాండిత్యం ఎందుకూ పనికిరాదు.

6.1.4. పండితుడు – లక్షణాలు :–

పండితుడి లక్షణాలను గూర్చి ఆర్. మల్లేశుడు గారు తమ సిద్ధాంతగ్రంథంలో క్రిందివిధంగా తెలియజేశారు. 'పండ అంటే ఉన్నది ఉన్నట్లు తెలుసుకొనే బుద్ధి. పండగలవాడు పండితుడు. శ్రద్ధ, విషయపరిజ్ఞానం, నిరంతరప్రయత్నం, సహనం, చిరకాలశ్రవణం, ఇంద్రియనిగ్రహం, అడ్డులేని వాక్ప్రవాహం, చిత్రకథాకుశలత్వం, హాస్యపరత్వం, సమయస్ఫూర్తి, కర్తవ్యపాలనం పండితునికి ఉండవలసిన గుణాలు'[4]. దీన్నిబట్టి పండితుడు నిరంతరాధ్యయనం కలిగివుండాలని తెలుస్తుంది.

స్వాధ్యాయం, సత్యదర్శనం పాండిత్యాన్ని ఇనుమడింపజేస్తాయి. సాధారణ వ్యవహారంలో 'వాడు తలపండినవాడు' అంటారు. తలపండడం అంటే వృద్ధుడయ్యాడని కాదు, అన్ని విషయాలు సమగ్రంగా తెలిసినవాడు అని అర్థం. కాబట్టి పండితుడికి ఆయా విద్యలకు సంబంధించిన పూర్తి అవగాహన ఉండాలి. దీనికి తోడవ్వాలి. అప్పుడే అతడు సమగ్రమైన పండితుడు అవుతాడు.

6.1.5. గురువు – లక్షణాలు :-

గురువు అనేవాడు తల్లిదండ్రుల తర్వాత గౌరవించదగిన, పూజించదగిన మహనీయుడు. అందుకనే భారతీయ సంప్రదాయంలో మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదోవోభవ అనే ఆచరణ కనిపిస్తుంది. ఇంతటి గొప్పస్థానం గల గురువు మనువు క్రిందివిధంగా తెలిపాడు.

"నిషేకాదీని కర్మాణి యః కరోతి యథావిధి
సంభావయతి చాన్నేన స విప్రో గురురుచ్యతే"[5]

ఏ ద్విజుడు అయితే గర్భాధానము మొదలైన కర్మలను చేయించునో, ఎవడు అన్నము పెట్టి పోషించునో, వాడు 'గురువు' అనబడును.

మహాభారతంలోని ఆదిపర్వంలో ఎవరెవరు గురువులో క్రిందివిధంగా చెప్పబడింది.

"తనర జనకుండు నన్నప్రదాతయును భయత్రాత
యును ననగ నింతులకు మువ్వురొగిన గురువులు; వీర
లనఘ! యుపనేత మఱియు నిరంతరాధ్యాపకుండు
ననగ బురుషున కియ్యేపురనయంబును గురువులు"[6]

స్త్రీలకు కన్నవారు, అన్నం పెట్టినవారు, భయం నుండి రక్షించినవారు గురువులు. పురుషులకు ఈ ముగ్గురే కాక ఉపనయనం చేసినవాడినీ, వేదాలు చెప్పినవాడినీ గురువులుగా పరిగణిస్తారు. పైన చెప్పిన కన్నతండ్రి, అన్నదాత, భయాన్ని పోగొట్టేవాడు, విద్యను నేర్పే గురువు, ఉపనయనం చేసినవాడు – ఈ అయిదుగురూ తండ్రులేనని చెప్పబడింది. వీరిని సేవించడమంటే నూరు యజ్ఞాలు చేసి పొందే ఫలాన్ని మించిన పుణ్యమని మనుధర్మశాస్త్రం చెపుతుంది.

గురువు యొక్క గొప్పదనాన్ని మహాభారతంలో చాలా సందర్భాల్లో చెప్పడం జరిగింది. గురువును పూజించడం శిష్యుని విధి. అయితే అర్థం తెలియకుండా విషయాన్ని ఒప్పచెప్పే వాతరేచకులను శిష్యుడు ఆశ్రయించకూడదు. కానీ గర్వపరుడై కార్యాకార్యాలను మరచి దుర్మార్గుడుగా ప్రవర్తించేవాడు గురువైనా వదిలిపెట్టడం శిష్యునివిధి. గురువును 'నీవు' అని సంబోధించడం తగదు. గురువును ఆరాధించిన శిష్యునికి స్వర్గం ప్రాప్తిస్తుంది. గురువును అవమానించిన విద్యార్థికి నరకం లభిస్తుంది. వ్యాసభారతంలో గురువు లేదా ఆచార్యుడి గొప్పదనం క్రిందివిధంగా వర్ణించబడింది.

"శరీరమేవ సృజతః పితౌ మాతా చ భారత
ఆచార్య శిష్టా యాజాతిః సా దివ్యాసాఒజరామరా"[7]

కేవలం భౌతికమైన జన్మను ప్రసాదించే తల్లిదండ్రుల కంటే అజరమూ, అమరమూ అయిన జ్ఞాన జన్మను ప్రసాదించే గురువు గొప్పవాడని చెప్పబడింది. ఇదే విషయాన్ని మనువు కూడా తెలిపాడు.

"ఆచార్యస్త్వస్య యాం జాతిం విధివద్వేదపారగః
ఉత్పాదయతి సావిత్ర్యా సా సత్యా సాఒజరామరా"[8]

వేదాలను చదువుకున్న ఆచార్యుడు ఉపనయనాది శాస్త్రవిదుల ద్వారా ఏ జన్మను ప్రసాదిస్తున్నాడో, అదే బ్రహ్మప్రాప్తికి కారణము. కాబట్టి శాశ్వతమైన, ముదిమిచావులు లేని జన్మను ప్రసాదించే గురువే గొప్పవాడు అని అర్థం.

ఇక్కడ మనువు జ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకొని గురువు తల్లిదండ్రుల కంటే గొప్పవాడని చెప్పాడు. కానీ గౌరవంలో మాత్రం తల్లిదండ్రులే మొదటివారని మనువు క్రిందివిధంగా చెప్పాడు.

"ఉపాధ్యాయాన్ దశాచార్య ఆచార్యాణాం శతం పితా,
సహస్రం తు పిత్రూన్మాతా గౌరవేణాతిరిచ్యతే"[9]

నూఱుగురు ఉపాధ్యాయుల కంటె ఒక ఆచార్యుడు, నూఱుగురు ఆచార్యుల కంటె ఒక తండ్రి, నూఱుగురు తండ్రుల కంటె ఒక తల్లి గౌరవంలో గొప్పవారు అని అర్థం.

పైవిధంగా గౌరవం విషయంలో తల్లిదండ్రులు, జ్ఞానం విషయంలో గురువు గొప్పవారు. వీరిని సేవించడం అంటే పరమాత్మను సేవించినట్లే. గురుముఖంగా నేర్చిన విద్యవల్ల శిష్యుడు శక్తి

సంపన్నుడౌతాడు. మహాభారతంలో రైభ్యుడనే ముని గురుముఖంగా విద్యనభ్యసించినందు వల్ల అతనికి దివ్యమైన శక్తి సంక్రమించి వృత్తాంతాన్ని నన్నయ ఇట్లా వర్ణించాడు.

"గురుశుశ్రూష యొనర్చుచు బరమ క్లేశముజేసి పడసిన విద్యల్
స్ఫరించుగాక గురుముఖ వరహితముగ బడసినవియు వెలయునె యెందున్"[10]

గురుముఖంగా అధ్యయనం సాగించిన శిష్యుడు కొంతకాలానికి గురువుగా మారడం, అతడు తన శిష్యులకు జ్ఞానాన్ని ప్రసాదించడం జరుగుతూ ఉంటుంద. కాబట్టి గురువు సన్నిధిలో విద్యను నేర్చుకున్న విద్యార్థి శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా సంపూర్ణమైన వికాసాన్ని పొందగలడు. అతడు భవిష్యత్తులో మంచి గురువు కాగలడు.

ఈ విధంగా గురువు ప్రాచీన భారతీయ విద్యా సంప్రదాయంలో విశిష్ట స్థానాన్ని కలిగివున్నాడు. విద్యార్థికి పునర్జన్మను ప్రసాదించి అనిపించుకొంటున్నాడు. జ్ఞానమార్గాన్ని చూపించి ఆచార్యుడు ఆదర్శప్రాయుడు అవుతున్నాడు.

6.1.6. శిష్యుడు – పదవ్యుత్పత్తి:-

శిష్యుడు అంటే విద్యను నేర్చుకొనేవాడు అని అర్థం. ఇతడినే అనూచానుడు, ఛాత్రుడు, సమావృత్తుడు, అంతేవాసి, విద్యార్థి, బ్రహ్మచారి అనే పర్యాయపదాలతో పిలుస్తారు. ఈ పదాల వ్యుత్పత్తుల్ని డా. ఆర్. మల్లేశుడు గారు తమ సిద్ధాంత గ్రంథంలో ఇలా విశ్లేషించారు.

'శిక్షింపదగినవాడు శిష్యుడు. గురువు దగ్గర షడంగయుక్తమైన వేదాన్ని అధ్యయనం చేసినవాడు అనూచానుడు. గురువు యొక్క దోషాన్ని కప్పిపుచ్చువాడు ఛాత్రుడు. గురువు దగ్గర కొంతకాలం విద్యను అభ్యసించిన తర్వాత గృహస్థాశ్రమాన్ని స్వీకరించినవాడు సమావృత్తుడు. గురువు యొక్క సమీపమున ఉండేవాడు అంతేవాసి. వేదాధ్యయన వ్రతమును ఆచరించేవాడు బ్రహ్మచారి. క్రొత్తగా వేదాధ్యయనం చేసేవాడు శైక్షుడు. ఒకే గురువు దగ్గర విద్యావిధానం చేసేవారిని సతీర్థులని పేర్కొన్నారు'[11]. అతే వీటిలో శిష్యుడు, విద్యార్థి అన్న పదాలు ఎక్కువగా ప్రచారంలో ఉన్నాయి. 'విద్యార్థి' అంటే విద్యను అర్థించేవాడు అని అర్థం. పైన చెప్పిన లక్షణాల్లో ఏ ఒక్కటి లేకపోయినా అతడు విద్యార్థి అనిపించుకోలేడు. పదాలు వేరుగా ఉన్నా, ఆ పదాల లక్షణాలన్నీ కలిస్తేనే విద్యార్థి సమగ్రమైన రూపం మనకు దర్శనమిస్తుంది. ఒక్కొక్క

సందర్భంలో విద్యార్థి ఒక్కొక్క విధిని నిర్వర్తించాలి. అతడు చేసే పనినిబట్టి పేర్లు మారుతూంటాయి. గురుసన్నిధిలో ఉన్నప్పుడు అంతేవాసి అని పిలువబడుతాడు.

శిష్యుడు – లక్షణాలు:–

శిష్యులు మూడు రకాలుగా ఉండారు. శిష్యప్రథముడు, శిష్యమధ్యముడు, శిష్యాధముడు. అవసరాన్ని గుర్తించి లేకుండానే అన్ని పనులను చక్కపెట్టేవాడు శిష్యప్రథముడు. ఆజ్ఞ అయిన తర్వాత కార్యాన్ని ఆచరించేవాడు శిష్యమధ్యముడు. ఆజ్ఞాపించినా చేయకపోవడంవల్ల కోపించినప్పటికీ పనిని చేయడంలో ఆసక్తి చూపనివాడు శిష్యాధముడు.

6.1.7. భిక్షాటనం:–

ఉపనయనం తర్వాత వటుడు గురువును ఆశ్రయిస్తాడు. విద్యను అర్థించి విద్యార్థి అవుతాడు. ఈ వటుడు చేయవలసిన పనుల్లో ముఖ్యమైనది భిక్షాటనం. "ఉపవీతుడైన బ్రాహ్మణుడు 'భవతి భిక్షాం దేహి' అని భవచ్ఛబ్దము మొదట చెప్పుచూ భిక్షాటనం చేయాలి. క్షత్రియుడు 'భవతి భిక్షాం దేహి' అని భవచ్ఛబ్దము మధ్యలో చేర్చి పలకాలి. వైశ్యబ్రహ్మచారి 'భిక్షాం దేహి భవతి' అని భవచ్ఛబ్దాన్ని చివర చేర్చి పలకాలి"[12]. ఈ విధంగా తెచ్చిన అన్నాన్ని విద్యార్థి ఒక్కడే భుజించకూడదు. మొదట గురువుకు పెట్టి, తన తోటి విద్యార్థులకు కొంతపెట్టి తర్వాత తినాలి. దీనివల్ల విద్యార్థిలో స్నేహభావం, సమానత్వభావం, సేవాభావం, అసూయలేకపోవడం, నిస్వార్థం అనే గుణాలు కలుగుతాయి. క్షత్రియ విద్యార్థి ఎంతటి ధనవంతుడైనా గురువు గారి వద్దకు వచ్చినప్పుడు తప్పకుండా భిక్షాటన చేయాలి. ఇది విద్యార్థికి ఉన్నతమైన మానవీయ విలువల్ని నేర్పుతుంది. కష్టసుఖాలు ఆ విద్యార్థి అనుభవానికి వస్తాయి. భవిష్యత్తులో తన కాళ్ళ మీద తాను ఎలా నిలబడాలో నేర్చుకోగలడు.

బ్రహ్మచారి (విద్యార్థి) ప్రతిరోజూ భోజనాన్ని మొదట గురువుకు నివేదించి, తర్వాత ఆచమనం చేసి, తూర్పుముఖంగా కూర్చుండి, వేరే ఆలోచన లేకుండా భోజనం చేయాలి. భోజనం అయిన తర్వాత చేతులు, కాళ్ళు కడుక్కొని ఆచమనం చేసి నీటితో అన్ని ఇంద్రియాలను స్పృశించాలి. ఎల్లప్పుడూ అన్నాన్ని నిందించకుండా పూజ్యభావంతో భుజించాలి. అటువంటి విద్యార్థికి బలవీర్యాలు రెండూ లభిస్తాయి.

6.1.8. గురుసన్నిధిలో – అంతేవాసి:-

గురుసన్నిధిలో ఉన్న బ్రహ్మచారి ఏవిధంగా నడుచుకోవాలో మనువు ఇలా చెప్పాడు. గురువు శిష్యునికి ఉపనయనం జరిగించి, మొదట శౌచమును, ఆచారమును, సాయంప్రాతః కాలాల్లో అగ్నిహోత్రాన్ని, సంధ్యోపాసనను నేర్పించాలి. వేదాధ్యయన ప్రారంభంలో, చివరలో విద్యార్థి, గురువు పాదాలను పట్టుకొని నమస్కరించాలి. చేతులు కట్టుకొని వేదాధ్యయనం చేయాలి. ఈవిధంగా చేతులు కట్టుకోవడాన్ని బ్రహ్మాంజలి అంటారు.

వేదాధ్యయనం ప్రారంభించేటప్పుడు ఓంకారం పలకాలి. లేకపోతే చదివినది కొంచెం మరిచిపోతాము. ముగింపులో కూడా ఓంకారం తప్పనిసరిగా పలకాలి. లేకపోతే చదివినది మనస్సులో నిలువదు. తూర్పుకొసలు గల దర్భలపై కూర్చొని, రెండు చేతుల్లో దర్భలు ఉంచుకోవడం వల్ల పరిశుద్ధుడై, మూడుసార్లు ప్రాణాయామం ఆచరించి, తర్వాత వేదాధ్యయనం ప్రారంభించేముందు ఓంకారం ఉచ్చరించాలి.

బ్రహ్మచారిగా ఉన్న విద్యార్థిని ఇంద్రియాలను నిగ్రహించాలి. మనస్సును అదుపులో ఉంచాలి. ప్రాతఃకాలంలోనూ, సాయంసమయంలోనూ వటుడు తప్పనిసరిగా గాయత్రీమంత్రాన్ని జపించాలి. ఉదయానికి పూర్వం వటుడు నిలబడి సూర్యోదయం అయ్యేవరకు గాయత్రిని జపించాలి. సాయంకాలం నక్షత్రాలు కనిపించేవరకు కూర్చుండి గాయత్రిని జపించాలి. దీనివల్ల అతని పాపాలన్నీ తెలుపబడ్డాయి.

మహాభారతంలో చాలా సందర్భాల్లో విద్యార్థి చేయవలసిన పనులు తెలుపబడ్డాయి.

"గురునకు భక్తుడై పరమాదరమున వే!దాభ్యాస మెప్పుడు నాచరించు
చును, శౌచీలత వినయంబు త్రిషవణ! స్నానంబు భాస్కరానల సపర్య"[13]

బ్రహ్మచారి గురుభక్తి కలిగి, వేదాభ్యాసం నిరంతరం చేస్తూ ఉండాలి. శుభ్రత పాటించే గుణంతో అణికువతో మూడు (ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం) హోమాలు చేసే సమయంలో స్నానం చేస్తూ సూర్యుడిని, అగ్నిని క్రమంతప్పకుండా ఆరాధిస్తూ ఉండాలి. బ్రహ్మచారి తన ఆయుష్షులో మొదటి నాల్గవ భాగమైన ఇరవైఅయిదు సంవత్సరాల కాలం గురువు వద్ద భృత్యుడి లాగా సదా ప్రియంగా కర్మలు చేస్తూ

ఉండాలి. గురువు భుజించిన తర్వాత భుజించాలి. గురువు పడుకొన్న తర్వాత ఆయన రెండు పాదాలను తన రెండు చేతులతో ఒత్తాలి. ఆయన నిద్రించిన తర్వాతనే శిష్యుడు నిద్రించాలి.

విద్యార్థి బ్రహ్మవిద్య నియమాన్ని విడిచిపెట్టినప్పటికీ శక్తికొలది ప్రతిరోజూ వేదాభ్యాసం చేసినట్లయితే, అథడు తన నుండి గోళ్ళు కొనలవరకు గొప్ప తపస్సును చేసినవాడు అవుతాడు. మనుస్మృతిలో బ్రహ్మచారి అయిన విద్యార్థి పాటించవలసిన నియమాలు క్రిందివిధంగా వివరించబడ్డాయి.

6.1.9. బ్రహ్మచారి (వటుడు) – నియమాలు:-

ద్విజుడి తల్లిగర్భం నుండి మొదటి జననం, ఉపనయనం వల్ల రెండవ జననం, యజ్ఞం వల్ల మూడవ జననం సిద్ధిస్తాయి. ఈ మూడింటిలో వేదగ్రహణార్థమైన జన్మను మౌంజీబంధనం గుర్తు, అందులో ఈ ద్విజునకు సావిత్రియే తల్లి. ఆచార్యుడే తండ్రి అనబడును.

బ్రహ్మచారికి ఉపనయన కాలంలో వర్ణమును అనుసరించి ఏ చర్మం, ఏ యజ్ఞోపవీతం, ఏ మొలత్రాడు, ఏ దండం, ఏ వస్త్రం విధింపబడిందో, దాన్నే గోదానాదివ్రత కాలంలో కూడా ధరించుకోవాలి. బ్రహ్మచారి గురుకులంలో నివసిస్తూ, ఇంద్రియాలను బంధించి, ఆయుష్మికదృష్టితో ఈ నియమాలను అనుసరించాలి.

బ్రహ్మచారి ప్రతిరోజూ స్నానం చేసి, పరిశుద్ధుడై, దేవర్షి పితృతర్పణం దైవారాధన, సమిధాదానం చేయాలి. బ్రహ్మచారి తేనె, మాంసం భక్షించరాదు. కర్పూరం, చందనం, కస్తూరి వంటి సువాసన ద్రవ్యాలను పూసుకోరాదు. వీటితో చేసిన పదార్థాలను తినరాదు. పువ్వులు ధరించరాదు. స్త్రీలతో కూడరాదు. స్వభావంలో మధురమైనవాటిని, పులియబెట్టిన వాటిని అన్నిటిని తినరాదు. ప్రాణిహింస చేయరాదు. బ్రహ్మచారి తలంటుకోవడం, కళ్ళకు కాటుక పెట్టుకోవడం, పాదరక్షలు ధరించడం, గొడుగు పట్టుకోవడం, స్త్రీల పట్ల ఆసక్తి మొదలైనవి విడిచిపెట్టాలి. క్రోధం, లోభం విద్యార్థికి పనికిరావు. నాట్యం చేయడం, పాటలు పాడడం, వాద్యం వాయించడం చేయకూడని పనులు. జూదమాడటం, పరులతో వృథాకాలక్షేపం, కలహం, ఇతరుల్ని నిందించటం, అబద్ధం చెప్పడం, స్త్రీలను సంభోగేచ్ఛతో చూడటం, ఇతరులకు అపకారం చేయడం మొదలైన వాటిని బ్రహ్మచారి అయిన శిష్యుడు వదిలిపెట్టాలి.

బ్రహ్మచారి ఎక్కడైనా ఒంటరిగానే శయనించాలి. కోరికతో రేతస్సును విడువరాదు. కామంతో రేతస్సును విడుచువాడు బ్రహ్మచర్యవ్రతాన్ని పోగొట్టుకొంటాడు. అట్లా వ్రతం కోల్పోయినవాడు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. స్వప్నంలో కామం లేకపోయినా రేతస్ఖలనం అయితే మరుసటి రోజు ఉదయాన్నే స్నానం చేసి, సూర్యుడిని ఉపాసించి "పునర్మా మైత్వింద్రియం = ఇంద్రియము నన్ను మరల పొందును గాక" అనే ఋక్కును మూడు సార్లు జపించాలి.

బ్రహ్మచారి ప్రతిరోజు ఉదయాన్నే నీటికుండను, దేవపూజకోసం పుష్పాలను, గోమయాన్ని, మట్టిని, దర్భలను గురువుకు తెచ్చియివ్వాలి. ప్రతిరోజు భిక్షాటనం చేయాలి. వేదాధ్యయనం, పంచయజ్ఞాలు విడువక ఆచరించేవారు, స్వకర్మలందు నేర్పరులైన గృహస్థుల ఇళ్ళనుండి బ్రహ్మచారి భిక్షను అర్థించాలి. గురుకులంలో, గురువుల దాయాదుల ఇళ్ళలో, మేనమామ మొదలైన చుట్టాల ఇళ్ళలో భిక్షాటన చేయకూడదు. ఇతరుల ఇళ్ళు దొరకనప్పుడు గురుకులంలోనే భిక్షాటన చేయాలి.

ఆరోగ్యం సరిగాలేనప్పుడు తప్ప, మిగిలిన రోజుల్లో భిక్షాన్నం తినకుండా, సాయంప్రాతఃకాలాల్లో సమిధాదానం చేయకుండా ఏడురాత్రులు ఉన్నవాడు 'అవకీర్ణి' అనే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. బ్రహ్మచారి ప్రతిరోజూ చాలామంది ఇళ్ళ నండి తెచ్చిన అన్నాన్ని తినాలి కాని ఒకరి ఇంటి అన్నాని మాత్రమే తినకూడదు. ఈవిధంగా భిక్షాన్నం చేత బ్రహ్మచారి జీవించడాని 'ఉపవాసతుల్యము' అని మునులన్నారు. అయితే ఇందులో కొంత వెసులుబాటు ఉన్నదని మనువు తెలిపాడు.

"బ్రాహ్మణస్యైన కర్మైతదుపదిష్టం మనీషిభిః
రాజన్యవైశ్య యోస్త్వేయం నైతత్కర్మ విధీయతే"[14]

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య బ్రహ్మచారులలో బ్రాహ్మణుడైన వాడికే ఏకగృహాన్న భోజనం నిషేధించబడింది. క్షత్రియవైశ్యబ్రహ్మచారులకు కాదు. శిష్యుడు శరీరాన్ని, బుద్ధిని, ఇంద్రియాలను, మనస్సును బంధించి, దోసిలి కట్టుకొని గురువు వేళకు ఏ పని చెప్పునో అని ఆయన ముఖాన్ని చూస్తూ నిలబడి ఉండాలి. కూర్చొని ఉండరాదు. పరధ్యానం విద్యార్థికి పనికిరాదు.

శిష్యుడు ఎల్లప్పుడు ఉత్తరీయానికి వెలుపల తన కుడిభుజాన్ని ఉంచుకోవాలి. మంచి ఆచారం కలవాడై, వస్త్రంతో దేహాన్ని కప్పుకొని, గురువు 'కుర్చుండుము' అన్నప్పుడు ఎదురుగా కూర్చోవాలి. శిష్యుడు,

గురుసన్నిధిలో ఆయన కంటే తక్కువదైన ఆహారాన్ని, బట్టలను, ఆసనాన్ని కలిగఉండాలి. గురువు కంటె ముందు నిద్ర లేవాలి. అతని కంటె వెనుక నిద్రపోవాలి. అంతేకాదు

"ప్రితశ్రవణసంభాషే శయానో న సమాచరేత్
నాసీనో న చ భుంజానో న తిష్ఠన్న పరాఙ్ముఖః"[15]

శిష్యుడు పడుకొని గాని, కూర్చొని గాని, అన్నం తింటూ కాని, పెడముఖంతో ఉండి కాని గురువు మాటకు బదులు మాట్లాడరాదు. విద్యార్థి ఎల్లవేళలా గురువు పట్ల విధేయత కలిగివుండాలి. ఆయన ఆజ్ఞ కోసం ఎలా వేచివుండాలో క్రిందివిధంగా చెప్పబడింది.

"ఆసీనస్య స్థితః కుర్యాదభిగచ్ఛంస్తు తిష్ఠతః
ప్రత్యుద్గమ్య త్వావ్రజతః పశ్చాద్ధావంస్తు ధావతః"[16]

గురువు ఆసనం మీద కూర్చొని ఆజ్ఞ ఇస్తే, శిష్యుడు నిలబడి వినాలి. గురువు నిలబడి చెపితే విద్యార్థి ఎదురేగి వినాలి. గురువు వస్తూ చెపితే, విద్యార్థి ఎదుర్కొని ఆసక్తిగా ఆలకించాలి. గురువు పరిగెడుతూ చెపితే, విద్యార్థి కూడా పరిగిడుతూ ఆయన పలుకులు వినాలి. శిష్యుడు గురుసన్నిధిలో తనకు తగిన ఆసనం మీదనే కూర్చోవాలి. గురువు కనబడుతున్నప్పుడు కాళ్ళు చాచుకొని కూర్చోకూడదు.

మా గురువులవారు, మా ఉపాధ్యాయులవారు అని చెప్పాలేకాని, గురువు మరుగున గురువు పేరు చెప్పకూడదు. గురువు వలె నడవడం, మాట్లాడటం, అనుకరించడం శిష్యుడు చేయరాదు.

శిష్యుడు గురునింద వినకూడదు. ఒకవేళ ఎవరైనా నిందిస్తున్నప్పుడు శిష్యుడు అక్కడి నుండి వేరొక చోటికి వెళ్ళిపోవాలి. ఎడ్లబండి, గుఱ్ఱపుబండి, ఒంటెలబండి, మేడ, బండ, చాప, రాయి, పలక నావ వీని మీద మాత్రం గురువుతో సమానంగా కూర్చోవచ్చు.

గురువుకు గురువు అయినవారు వచ్చినపుడు ప్రశిష్యుడుగా వారికి కూడా అభివాదనం చేయాలి. వారిని సేవించాలి. గురువు ఇంట ఉన్నప్పుడు తన తల్లిదండ్రులు వస్తే, శిష్యుడు గురువు ఆజ్ఞ తీసుకొని మాత్రమే మాట్లాడాలి. ఆచార్యుడు కాని, ఇతర ఉపాధ్యాయులు కాని, తన బంధువులైన పినతండ్రి, పెదతండ్రి మొదలైన వారిపట్ల గురుభావాన్ని కలిగివుండాలి.

శిష్యుడు గురుపత్నిని, గురు పుత్రుడిని కూడా సేవించాలి. కానీ గురుపుత్రుని అంగాలకు నలుగుపెట్టుట, స్నానం చేయించడం, అతని ఎంగిలి తినడం, పాదాలు కడగడం శిష్యుడు చేయకూడదు. ఈ పనులను గురుపత్ని విషయంలో కూడా శిష్యుడు ఆచరించకూడదు. గురుపత్ని యౌవనంలో ఉన్నప్పుడు, ఇరవై సంవత్సరాలు పైబడిన, గుణదోషాలు తెలుసుకోగలిగిన శిష్యుడు ఆమెకాళ్ళుపట్టుకొని నమస్కారం చేయకూడదు. దూరంగా నిలబడి నమస్కరించాలి. ఈ గురుశుశ్రూష వల్ల శిష్యుడు ప్రయోజనాన్ని పొందుతాడని మనువు ఇలా తెలిపాడు.

"యథా ఖనన్ ఖనిత్రేణా నరో వార్యధిగచ్ఛతి,
తథా గురుగతాం విద్యాం శుశ్రూషరధిగచ్ఛతి"[17]

గడ్డపారతో బావిని త్రవ్విన మానవుడు నీటిని పొందినట్లు, గురుశుశ్రూష ఒనర్చువాడు గురువు వద్ద సకలవిద్యలను నేర్చుకోగలడు. బావిని త్రవ్వడ కష్టమే అయినా ఫలితం గొప్పది. గురుశుశ్రూష ఎంతో శ్రమతో కూడుకున్నది. అయినప్పటికీ దానివల్ల శిష్యుడు గొప్ప జ్ఞానాన్ని పొందగలడు.

విద్యార్థికి తల్లిదండ్రులు, గురువు, అన్న వీరు దైవంతో సమానం. శిష్యుడు వీరిని తిరస్కరించరాదు. ఒకవేళ వారు శిష్యుడిని బాధపెట్టినా అతడు వారిని విడిచిపెట్టరాదు.

"ఆచార్య బ్రాహ్మణో మూర్తిః పితా మూర్తిః ప్రజాపతేః
మాతా పృథివ్యా మూర్తిస్తు భ్రాతా స్వో మూర్తిరాత్మనః"[18]

ఆచార్యుడు పరమాత్మ స్వరూపుడు, తండ్రి హిరణ్యగర్భ స్వరూపుడు, తల్లి భూదేవి స్వరూపురాలు, అన్న ఆత్మస్వరూపుడు. వీరు దేవతారూపులు కాబట్టి వీరిని తిరస్కరించరాదు. శిష్యుడు ఎల్లప్పుడూ వీరికి ప్రీతి కలిగించాలి. వారు ముగ్గురూ సంతృప్తి పడితేనే విద్యార్థి తపస్సు ఫలించినట్లు. ఇదే ఉత్తమమైన తపస్సు. శిష్యుడికి ఈ విధమైన గురుశుశ్రూష చేయడమే ముఖ్యధర్మం. మిగిలిన యజ్ఞాదికర్మలు అన్నీ అముఖ్యమైనవి.

ఈవిధంగా మనుస్మృతిలో శిష్యుడు ప్రవర్తించవలసిన విధివిధానాలు చెప్పబడ్డాయి. ఇవి తెలుగుకావ్యాల్లో ఏవిధంగా ప్రతిఫలించాయో ముందు వివరించబడుతుంది. ప్రాచీన భారతీయ

విద్యావిధానం పైన చెప్పిన లక్షణాలను కలిగివుంది. ఇది గురుశిష్యులిద్దరికీ శ్రేయోదాయకంగా కనిపిస్తుంది. గురుశుశ్రూష శిష్యుడిని ఉత్తమమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది.

6.2. గురుశిష్యులు – ఆశ్రమజీవనం – కావ్యానుశీలన:-

గురుశిష్యులిద్దరినీ ఒక దగ్గరకు చేర్చే ప్రదేశం ఆశ్రమం. శిష్యుడు ఎంతటి ధనవంతుడైనా, నిరాడంబరంగా గురువుగారి ఆశ్రమానికి వచ్చి విద్యనేర్చుకోవలసిందే. 'శ్రమ' అనే ధాతువుకు తపస్సు, భేదం అనే అర్థాలున్నాయి. 'ఆశ్రామ్తి అస్మిన్ ఇతి ఆశ్రమః' అని అమరకోశం తెలుపుతుంది[19]. దీన్నిబట్టి ఆశ్రమ జీవనవిధానం కష్టతరమైనది అనిపిస్తుంది. కానీ ఇది విద్యార్థికి మంచి నడవడిని నేర్పిస్తుంది. భవిష్యత్తులో ఎదురవ్వబోయే సమస్యలను ఏవిధంగా పరిష్కరించుకోవాలో నేర్పిస్తుంది. సాధారణంగా ఆశ్రమాలు అరణ్యాల్లో ఉంటాయి. 'అరణ్యం' అనే పదానికి 'రణం' లేనిది, ప్రశాంతమైన ప్రదేశం అని అర్థాలున్నాయి. అలాగే 'అడవి' అనే మాటకు కూడా 'ప్రశాంతతనిచ్చే చోటు' అని అర్థం ఉంది. శ్రీమద్భాగవతంలో, ప్రహ్లాదుడు హిరణ్యకశిపుడితో ఇలా అంటాడు.

"ఎల్ల శరీధారులకునిల్లను ---------- 'తారడవి' నుండుటమేలు నిశాచరాగ్రణి"[20]

ఇక్కడ 'అడవి' లో ఉండడమంటే, అడవికి వెళ్ళమని అర్థం కాదు. అన్నీ శ్రీహరి యందు వదిలిపెట్టి 'ప్రశాంతం' గా ఉండండి అని ప్రహ్లాదుడు తండ్రికి బోధిస్తున్నాడు. దీన్నిబట్టి అరణ్యం అంటే ప్రశాంతత లభించే ప్రదేశమని, విద్యార్జనకు అనుకూలమైన వాతావరణమని తెలుస్తున్నది. ఇక్కడ నివసించే మునులు నిరంతర తపోధనులు. శిష్యులు గురుశుశ్రూషా పరాయణులు.

విద్యాబోధన అరణ్యాల్లో, ఆశ్రమాల్లో చేయడానికి ప్రత్యేకమైన కారణం ఉంది. అక్కడి ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థి మానసికంగా ప్రశాంతతను పొందుతాడు. అతని హృదయం మార్దవాన్ని పొందుతుంది. విద్యార్థి ప్రకృతితో మమేకమవుతాడు. అతనిలోని రాగద్వేషాలు, అసూయాగర్వాలు తగ్గిపోతాయి. ఆ బాలుడిలో ప్రశాంతకరమైన సత్త్వగుణం రూపుదిద్దుకొంటుంది. ఉదాహరణకు ప్రహ్లాదుడు పుట్టుకతో అసురుడు. దానవ చక్రవర్తి హిరణ్యకశిపుడి కుమారుడు. కానీ తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండి ఐదారేండ్ల వరకు నారదముని ఆశ్రమంలోనే జీవించాడు. దీనివల్ల అతనిలోని తామసగుణాలు తగ్గిపోయి,

సత్త్వగుణాలు అధికమయ్యాయి. దీనికి కారణం నారదముని ఆశ్రమవాతావరణం. అక్కడ నివసించే జంతువులు, పక్షులు, కల్లాకపటం లేని మనుషులు, నారదుని హరిభక్తి, ఇవన్నీ ప్రహ్లాదుడిలో మూర్తీభవించాయి. ఆ ప్రశాంతవంతమైన ప్రకృతిలో ప్రశాంతమూర్తిగా రూపొందాడు ప్రహ్లాదుడు. అందుకే ప్రాచీన విద్యాబోధనలో ఆశ్రమజీవనం ప్రాధాన్యాన్ని పొందివున్నది. ఇది గురుశిష్యులిద్దరికీ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని, జ్ఞానాన్ని అందిస్తుంది.

సుబల, మార్కండేయాది ఆశ్రమాలు మహాభారతంలో ప్రస్తావించబడ్డాయి. కానీ కణ్వాశ్రమం, శౌనకాశ్రమం మొదలైనవి ఆనాటి ప్రముఖ విద్యాసంస్థలుగా కనిపిస్తున్నాయి. ఆశ్రమాలకు ముసుల పేర్లు పెట్టడం, రాజకుమారులు కూడా నిరాడంబరంగా ఆశ్రమాలకు రావడం ఆనాటి ఆశ్రమజీవనంలోని ప్రత్యేకతలు. ఆశ్రమాలకు కావలసిన పాత్రలూ, భోజనసామగ్రి మొదలైనవాటిని రాజులే పంపేవారని క్రింది శ్లోకం వల్ల తెలుస్తున్నది.

"ఆశ్రమేషు యథాకాలం చైలభాజన భోజనమ్
సదైవోపహరేద్ రాజా సత్కృత్యాభ్యర్చ్య మాన్యచ"[21]

గురుకులాలు పట్టణాలకు దూరంగా ఉన్నా, రాజుల ఆదరాన్ని పొందివుండేవి. నాటి ఆశ్రమాలు నిబద్ధ విద్యాకేంద్రాలుగా ఉండేవి. ఇవి విశ్వవిద్యాలయాలుగా కూడా పనిచేసి. ఒకే ఆశ్రమంలో అగ్ని, బ్రహ్మ, విష్ణు, మహేంద్ర, వివస్వత, సోమ, గరుడ, కార్తికేయ స్థానాలుండేవి. ఒక్కొక్క చోట ఒక్కొక్క విద్య నేర్పేవారు. "నైమిశారణ్యంలో దాదాపు 10,000 మంది శిష్యులు ఉండేవారు. కణ్వాశ్రమం కూడా ఇటువంటిదే. వేదవేదాంగాలు, దర్శనాల బోధన ఇక్కడ జరిగేది"[22]. ఈ శిష్యుల పోషణ భారాన్ని విశ్వవిద్యాలయ కులపతి భరించేవాడు. అర్హులైన వారికే నాటి విశ్వవిద్యాలయాల్లో చదువుకొనే అవకాశం కల్పించేవారు.

సుబల, మార్కండేయాది ముసులు ఆయా ఆశ్రమాల నుండి ధర్మరాజు సభకు వచ్చిన వృత్తాంతాన్ని నన్నయ ఇట్లా వర్ణించాడు.

"సుబల మార్కండేయ శౌనక మౌంజాయన మాండవ్య శాండిల్యమందపాల
బక దాల్భ్యరైభ్యక భాలుకి జతుకర్ణ గౌతమ కౌశిక కణ్వకుత్స
సావర్ణి పర్ణాద సత్యగోపతి గోపవేష మైత్రేయ పవిత్రపాణి
ఘటజానుకాత్రేయ కఠకలాప సుమిత్ర హరీతి తిత్తిరి యాజ్ఞవల్క్య

వాయుభక్ష భార్గవ వ్యాసజైమిని శుకసుమంతు పైలసుప్రతాదు
లయిన మునులు ------- రమ్యమైన ధర్మరాజు సభకు"[23]

పైన చెప్పిన మునులంతా భరతఖండం నలుమూలలా వ్యాపించి ఉన్న వివిధ ఆశ్రమాలకు కులపతులు, ఆచార్యులు. వేలమంది విద్యార్థులకు ఆశ్రయం కల్పిస్తున్నవారు. రాజసూయయాగం సందర్భంలో వీరు ధర్మరాజును కలిసి, ఆయనను దీవించి బహుమతులు స్వీకరించారు. ఆ పండిత పరిషత్తుతో ధర్మరాజు కీర్తి మరింత పెరిగింది.

భారతాన్ని సూతుడు శౌనకాది మునులకు వినిపించాడు. ఈ శౌనకాశ్రమం నైమిశారణ్యంలో ఉంది. ఈ ఆశ్రమానికి కులపతి శౌనకుడు. జ్ఞానాన్నీ, సదాచారాన్నీ గురించి చర్చించడానికి శౌనకుడు సమావేశాన్ని ఏర్పాటుచేశాడు. అక్కడ సకల పురాణ విజ్ఞాననిరతుడూ, శీల సంపన్నుడూ అయిన సూతుడు ఆశ్రమంలోని మునులకు భారత కథను వినిపించాడు. దీన్నిబట్టి ఆశ్రమాలు ఆనాడు సాహిత్య పరిషత్తులుగా కూడా పనిచేసేవని తెలుస్తున్నది.

మహాభారతంలో ప్రస్తావించిన విశ్వవిద్యాలయాల్లో కణ్వాశ్రమం కూడా ఒకటి. ఇది మాలినీ నదీ తీరంలో ఉంది. దీనికి కులపతి కణ్వుడు. విద్యార్జనకు అనుకలమైన వాతావరణం ఉంది. దాన్ని నన్నయ ఇలా వర్ణించాడు. "చెవుల పండువుగా చిలుకలు సామవేదాన్ని సుస్వరంగా పాడుతున్నాయి. ఏనుగుల తొండాల చల్లని నీడలలో వాటి నీటి తుంపరల చల్లని గాలికి ఆశపడి సింహాలు ఏనుగుల చెంత చేరివున్నాయి. బ్రాహ్మణశ్రేష్ఠులు భూతబలులు తెచ్చి వివిధ ప్రదేశాల్లో నీవార ధాన్యపు అన్నపిండాలను ఉంచగా ఎలుకలు, పిల్లులు వాటిని తినాలని వేగిరపడుతూ ఒకచోట కలిసిమెలిసి తిరుగుతున్నాయి. అవి తమ మధ్య సహజంగా ఉన్న వైరం లేకుండా కలిసిజీవిస్తున్నాయి. దీన్ని చూసి దుష్యంతుడు ఆశ్చర్యపడ్డాడు"[24]. అంతేకాదు ఆ అరణ్యంలో, హవిస్సులైన నేతుల వాసనలు గల పొగలతో చూరిన తీగలతో అల్లుకొని ఉన్న చెట్లకొమ్మల మీద పూవులు లేకున్నప్పటికీ విడిచివెళ్ళకుండా ఉన్న తుమ్మెదల గుంపులను చూసి దుష్యంతుడు ఆశ్చర్యానికి లోనయ్యాడు[25]. ఈవిధంగా నాటి ఆశ్రమాలు విద్యార్జనకు అనుకూలంగా ఉండేవి. మానసిక ప్రశాంతత, శ్రద్ధ, ఆసక్తి కలగడానికి విద్యార్థులకు ఈ వాతావరణం అనుకూలించింది.

ఈ కణ్వాశ్రమంలో అన్నిరకాల విద్యలు బోధింపబడేవి. ఒక్కొక్క విద్యను బోధించడానికి ప్రత్యేకమైన గురువులు ఉండేవారు. అక్కడ కొందరు హోతలు ఋక్కులను పదక్రమాది పద్ధతుల్లో పఠిస్తున్నారు. యజుర్వేద పారంగతులు, సామవేద పారంగతులు, అథర్వవేద నిష్ణాతులు ఈ ఆశ్రమంలో ఉన్నారు. బ్రాహ్మణ వటువులు స్థానకరణ ప్రయత్నాలను పాటిస్తూ వేదమంత్రాలను పలుకుతూవుంటే ఆ ఆశ్రమం రెండవ బ్రహ్మలోకంలాగా ఉంది. ఈ ఆశ్రమంలో క్రమశిక్షణ బోధించేవారు, న్యాయశాస్త్రజ్ఞులు, ఆత్మజ్ఞాన సంపన్నులు, వేదవాక్యాలను సమన్వయం చేయలిగినవారు, ఉపనిషత్తులను బోధించేవారు, ఉపాసనాది విశేషకర్మల్ని తెలిపేవారు, మోక్షజ్ఞానాన్ని బోధించేవారు, వ్యాకరణాది షడంగాలు తెలిసినవారు, పదార్థజ్ఞానం కలిగినవారు, జ్యోతిషం తెలిసినవారు, మృగపక్షి భాషలు తెలిసినవారు, కార్యకారణ జ్ఞానం కలిగినవారు ఆ కణ్వముని ఆశ్రమంలో ఉన్నారు. వీరు నిరంతరం అధ్యయన అధ్యాపనాలతో జీవిస్తుంటారు. ఇటువంటి గొప్ప వాతావరణంలో పెరగబట్టే శకుంతల, భరతుడు జ్ఞానవంతులు కాగలిగారు.

దుష్యంతుడు లోకావాదభీతితో అసత్యం పలికాడు. భార్యాబిడ్డల్ని నిరాకరించాడు. కానీ శకుంతల తన వాదనా పఠిమతో, సమయస్ఫూర్తితో, సత్ప్రవర్తనతో సభను మెప్పించిది. ఆకాశవాణి చేత సత్యాన్ని చెప్పించింది. దానికి కారణం ఆమెలో మూర్తీభవించిన కణ్వాశ్రమ సంస్కృతి. భరతుడిని భావి సామ్రాట్టుగా మార్చింది కూడా ఆశ్రమజీవనంలో అతడు సంపాదించిన ఆత్మజ్ఞానము, విజ్ఞానము మాత్రమే.

6.2.1. గురుకులవాసం – ఉదంకుడు:-

మహాభారతంలోని ఆదిపర్వంలో ఉదంకుడి కథ ఉంది. అలాగే అశ్వమేధపర్వంలో మళ్ళీ ఉదంకుడి కథ ఉంది. ఈ రెంటికీ కొన్ని పోలికలు, కొన్నితేడాలు ఉన్నాయి ఆదిపర్వంలో నన్నయ చిత్రించిన ఉదంకుడు సచ్ఛీలుడు, గురుశుశ్రూషాభిలాషి, వేదాధ్యయన సంపన్నుడు, అణిమాది అష్టసిద్ధుల్ని పొందినవాడు, తపస్సంపన్నుడు. ఉదంకుడి గురుకులజీవితాన్ని నన్నయ క్రింది పద్యంలో తెలియజేశాడు.

"గురుకులమునందు గురులకు,
బరిచర్య లొనర్చి తా నపరమితనిష్ఠా
పరుడై జ్ఞానము వడసెను,
గురుదయ నణిమాది కాష్ట గుణములతోడన్"[26]

దీన్నిబట్టి గురుకులంలో శిష్యుడికి లక్షణాలు అపరిమిత నిష్ఠ, గురుశుశ్రూష, వినయం అని తెలుస్తున్నది. దీనివల్ల ఆ విద్యార్థి గురువు నుండి విద్యను సంపూర్ణంగా పొందగలడు.

ఉదంకుడు విద్యాభ్యాసం ముగిసిన తర్వాత గురువుకు దక్షిణ చెల్లించడానికి వెళతాడు. పైలుడి భార్య శిష్యుడిని పౌష్యమహాదేవి కమండలాలను తీసుకురమ్మని ఆదేశిస్తుంది. ఉదంకుడు దీక్షాపరుడై బయలుదేరుతాడు. మార్గమధ్యంలో ఒక దివ్యపురుషుడు ఎద్దుమీద కూర్చొని వస్తాడు. ఉదంకుడిని గోమయం తినమంటాడు. గురుకార్యం నెరవేర్చడం కోసం ఉదంకుడు ఆ ఎద్దుపేడను తినడానికి కూడా వెనుకాడలేదు. ఇది ఆ విద్యార్థిలోని గురుభక్తికి, కార్తవ్యదీక్షకు, గర్వంలేని వ్యక్తిత్వానికి చిహ్నం. అనుకున్నది సాధించిడానికి ఎటువంటి పనినైనా చేయడానికి వెనుకాడని సాహసవంతుడు ఉదుంకుడు. అతడు పౌష్యనగం చేరి, మహారాణి కుండలాల్ని తీసుకొని బయలుదేరాడు. మార్గమధ్యంలో తక్షకుడు ఆ కుండలాల్ని అపహరించి పాతాళానికి పారిపోయాడు.

అప్పుడు ఉదంకుడు సూక్ష్మరూపం ధరించి పాతాళానికి చేరి, నాగదేవతల్ని స్తుతిస్తాడు. గుర్రం మీద కూర్చొని ఉన్న దివ్య పురుషుడి ఆదేశం మేరకు ఆ గుర్రం యొక్క చెవిలో ఊదుతాడు. దానితో పాతాళలోకమంతటా మంటలు వ్యాపించాయి. తక్షకుడు భయపడి కుండలాల్ని తెచ్చియిచ్చాడు. ఉదంకుడు ఆ కుండలాల్ని గురుపత్నికి సమర్పించి, గురువుగారి ప్రేమకు పాత్రుడయ్యాడు. ఈవిధంగా ఉదంకుడు కష్టాలకు ఎదుర్కొని నిలువగలిగిన మనోబలాన్ని ఆశ్రమజీవనంలో సంపాదించాడు. జనమేజయుడి చేత సర్పయాగం చేయించి, తక్షకుడి మీద పగ సాధించాలనుకున్నాడు. పట్టుదల గల వ్యక్తి ఉందుకుడు. గురువుపట్ల అచంచలమైన భక్తిని కనబరచిన ఆదర్శ విద్యార్థి ఇతడు.

6.2.2. కచుడు – గురుకులం:-

రాక్షసుల గురువైన శుక్రాచార్యుడు 'మృతసంజీవ'ని అనే విద్యను సంపాదించాడు. దీనిప్రభావంతో దేవాసుర యుద్ధాల్లో చనిపోయిన రాక్షసవీరుల్ని అతడు బ్రతికించగలిగేవాడు. దేవతలు మాత్రం యమపురికి పోవలసివచ్చింది. దీని నుండి బయటపడటానికి మృతసంజీవని విద్యను నేర్చుకోవాలని దేవతలు సంకల్పించారు. ఆ పనిని బృహస్పతి కుమారుడైన కచుడికి అప్పగించారు. కచుడిని విద్యాభ్యాసానికి పురికొల్పడానికి కారణం అతనిలో క్రింది గుణాలు ఉండటమే.

"బాలుండవు నియమవ్రత, శీలుండవు నిన్ను బ్రీతి జేకొని తద్వి
ద్యాలలనాదనము గరు, ణాలయుడై చేయునమ్మహాముని నీకున్"[27]

బ్రహ్మచారి అయిన బాలుడు, సచ్ఛీలుడు, నియమపరుడు, దీక్షాపరుడు అయినవాడే విద్యను నేర్చుకోగలడు. నాటి గురుకులాల్లో ప్రవేశించే క్రొత్త విద్యార్థుల్లో ఈ లక్షణాల్ని పరిశీలించిన తర్వాతనే వారికి ప్రవేశం కల్పించేవారు.

శుక్రాచార్యుడు సకలశాస్త్రపారంగతుడు, మృతసంజీవనివిద్య తెలిసినవాడు. అతని మనస్సు సంతృప్తిపొందే విధంగా గురుశుశ్రూష చేయమని, గురుపుత్రి అయిన దేవయానికి కూడా తగిన రీతిలో పరిచర్యలు చేసి ఆమె అభిమానాన్ని పొందమని దేవతలు కచుడికి జాగ్రత్తలు చెప్పి పంపించారు. గురువుతో సమానంగా గురుపత్నికి, గురుపుత్రులకు, పుత్రికలకు సేవచేయడం నాటి శిష్యుల విధి. ఈ నియమాలన్నీ కచుడు పాటించగలడు. కారణం అతడు సత్త్వగుణ సంపన్నుడు. ఇంద్రియనిగ్రహం కలవాడు, ధర్మాధర్మాలు తెలిసినవాడు, సచ్ఛీలుడు. అందుకే దేవతలు కచుడిని పురమాయించారు.

కచుడు కూడా దేవతలు చెప్పినవిధంగా గురుశుశ్రూష చేశాడు. కచుడి గురుశుశ్రూషను నన్నయ ఇలా వర్ణించాడు.

సీ. "పనియేమి పంచిన బదపడి చేసెద, ననక తన్ బంచిన యక్షణంబ
చేయుచు నిజగురు చిత్తవృత్తికి గడు, ననుకూలుడై వినయంబుతోడ
మనమున జెయ్యులమాటల భక్తినే, కకారుడై మఱియంతకంటె
దేవయానికి సువిధేయుడై ప్రియహిత భాషణముల బుష్పఫలవిశేష

ఆ దానములను సంప్రతప్రీతి జేయుచు, నివ్విధమున బెక్కు లేండ్లు నిష్ఠ
గురుని గురుతనూజ గొలిచి యయ్యిరవుర, నెమ్మివడిసె దనుదు నేర్పుపేర్మి"[28]

చాలా సంవత్సరాలు పైవిధంగా కచుడు గురువును, గురుపత్నిని సేవించాడు. ఈ గురుశిష్యుల అనుబంధాన్ని చూసి రాక్ష,సులకు అసూయ కలిగింది. అందువల్ల కచుడికి చంపడానికి చాలా ప్రయత్నాలు చేశారు. చంపి చెట్టుకు కట్టివేశారు. శుక్రుడి కరుణవల్ల అతడు తిరిగిబ్రతికాడు. మరోసారి రాక్షసులు కచుడిని చంపి, కాల్చి, బూడిదచేసి, ఆ బూడిదను కల్లులో కలిపి శుక్రాచార్యుడి చేత త్రాగించారు. దేవయాని బలవంతంవల్ల కచుడిని అన్వేషి,స్తూ, శుక్రుడు కచుడి మరణాన్ని గుర్తిస్తాడు. తన కడుపులోనే ఉన్నాడని

తెలుసుకుంటాడు. మృతసంజీవనితో కచుడిని బ్రతికిస్తాడు. అతనికి మృతసంజీవని విద్యను నేర్పి, శిష్యుడి వల్ల తిరిగి బ్రతికించబడ్డాడు. గురుశిష్యుల పరస్పర సహకారానికి ఇది నిదర్శనం. 'సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహైఃు ----' అనే ఉపనిషత్ వాక్యానికి వీరు లక్ష్యంగా కనిపిస్తున్నారు. పరస్పర ప్రాణదానం వీరిమధ్య తండ్రీకొడుకుల బాంధవ్యాన్ని ఏర్పరిచింది. గురువును బ్రతికించిన ఈ శిష్యుడు మృతసంజీవని విద్యను నేర్చుకోవడానికి అర్హుడైన విద్యార్థి అయ్యాడు.

విద్యాభ్యాసం ముగించుకొని దేవలోకానికి వెళ్ళడానికి బయలుదేరాడు కచుడు. అప్పుడు గురుపుత్రి అయిన దేవయాని, తనకు కచుడి పట్ల గల ప్రేమను వ్యక్తం చేసింది. తనను చేపట్టమని అడిగింది. కానీ కచుడు అంగీకరించలేదు. కారణం గురుపుత్రి సోదరితో సమానం. పైగా కచుడు కూడా శుక్రాచార్యుడి గర్భం నుండి పుట్టాడు కాబట్టి అతడు దేవయానికి సోదరుడు అందువల్ల దేవయానిని నిరాకరిస్తాడు. దీనికి ఆగ్రహించిన దేవయాని కచుడు నేర్చుకొన్న విద్య అతనియందు పనిచేయదు అని శపిస్తుంది. దీనికి ప్రతిగా కచుడు, బ్రాహ్మణేతర పురుషుడిని నీవు వివాహం చేసుకుంటావని శపించి వెళ్ళిపోతాడు. ఈ ఘట్టం వల్ల కచుడిలోని ఇంద్రియనిగ్రహం, ధర్మపరాయణత్వం, సత్ప్రవర్తన తెలుస్తున్నాయి. ఇవి ఉత్తమ విద్యార్థికి ఉండవలసిన లక్షణాలు. తనకు పనికిరాకపోయినా, ఇతరులకు మృతసంజీవని బోధించవచ్చును గదా అని ఆశతో కచుడు దేవలోకానికి వెళ్ళాడు. కర్తవ్యదీక్షలో వెనుదిరగని ఆదర్శ విద్యార్థి ఈ కచుడు.

6.2.3. కృపాచార్యుడు – విద్యాభ్యాసం:-

గౌతమ మహర్షికి శరద్వంతుడనే కుమారుడు శరసమూహంతోపాటు జన్మించాడు. ఆయన వేదాలు చదువకుండా ధనుర్వేదాన్ని అభ్యసించడానికి, దాన్ని వేదాలలాగా చదువుకోవడానికి ఘోరతపస్సు చేస్తున్నాడు. దీన్ని చూచి భయపడిన దేవేంద్రుడు 'జలపద' అనే అప్సరసను పంపించాడు. శరద్వంతుడు ఆ అప్సరసను చూచి మదనబాణపీడితుడై రేతస్సును విడుస్తాడు. ఆ రేతస్సు ఒక శరస్తంభంలో రెండుభాగాలుగా విడిపోయి పడిపోతుంది. వాటి నుండి ఒక మగశిశువు, ఒక ఆడశిశువు జన్మించారు. శరద్వంతుడు అక్కడి నుండి వెళ్ళిపోగా, ఒంటరిగా ఆ పిల్లలు శరస్తంభంలోనే ఉండిపోయారు. అదే సమయానికి అడవికి వేటకై వచ్చిన శంతనుడికి ఆ బిడ్డలు కనిపిస్తారు. అతడు వారికి కృపుడు, కృపి అనే పేర్లు పెట్టి పెంచాడు.

కొంతకాలానికి శరద్వంతుడు శంతనుడి దగ్గరకు వచ్చి, ఆ బిడ్డలు తనకు పుట్టిన వారేనని తెలిపి, వారిని తీసుకువెళతాడు. శరద్వంతుడు, తానే గురువుగా మారి పుత్రునకు క్రిందివిధంగా విద్యాబోధన చేశాడు.

"వేదంబుల్ సదివించె భూసురులతో విఖ్యాతి గానాత్మసం
వేదిం జేసె జతుర్విధం బగు ధనుర్వేదంబు నానాస్త్రవి
ద్యాదాక్షిణ్యముతోడ దాన కఱపెం దద్విత్తముల్ సూచి సం
వాదుల్ గా దననందనుం గృపు శరద్వంతుండు దాంతాత్ముడై"[29]

వేదాలు, ఆత్మవిద్య, నాలుగు విధాలైన ధనుర్వేదం మొదలై విద్యల్ని విద్యాదాక్షిణ్యముతో తండ్రి కుమారుడికి బోధించాడు. 'గురువు' అనే మాటకు తండ్రి అనే అర్థం కూడా ఉంది. ఈ కథలో ప్రతిఫలించింది. ధనుర్విద్య వంశపారంపర్యంగా తండ్రి నుండి కుమారుడికి సంక్రమించింది ఈ కథలో.

6.2.4. ద్రోణుడు – విద్యాభ్యాసం:-

భరద్వాజుడు అనే మహర్షి ఒకరోజు అభిషేచనం చేయడానికి నది దగ్గరకు వెళ్ళగా, అక్కడ జలక్రీడలాడుతున్న ఘృతాచి అనే అప్సరసను చూశాడు. మోహాపరవశుడై రేతస్సును జారవిడిచాడు. అతడు ఆ రేతస్సును ఒక ద్రోణంలో ఉంచాడు. ఆ ద్రోణం నుండి పుట్టిన బిడ్డకు 'ద్రోణుడు' అనే పేరు పెట్టి పెంచాడు. అలాగే పృషతుడి కుమారుడైన 'ద్రుపదుడు' కూడా ద్రోణుడికి సఖుడై భరద్వాజుని ఆశ్రమంలో విద్యాభ్యాసం చేయసాగారు. 'ద్రుపదుడు' కూడా ద్రోణునికి సఖుడై భరద్వాజుని ఆశ్రమంలో విద్యాభ్యాసం చేయసాగారు. ద్రోణుడు అగ్నివేషుడనే మహాముని వల్ల ధనుర్విద్యను నేర్చుకున్నాను. ఆగ్నేయాస్త్రం మొదలైన అనేకమైన దివ్యబాణాలను పొందాడు.

ద్రోణుడు ధనాపేక్షతో పరుశురాముడిని ఆశ్రయించాడు. పూర్వం తనకున్న రాజ్యమంతటిని విప్రులకు, కశ్యపమునికి దానం ఇవ్వడం వల్ల తన దగ్గర అస్త్రశస్త్రాలు తప్ప లేవని పరశురాముడు అంటాడు. అప్పుడు ద్రోణుడు ఇలా అంటాడు.

"ధనములలో నత్యుత్తమ, ధనములు శస్త్రాస్త్రములు ముదంబున వీనిం
గొని కృతకృత్యుడ నగుదును, జననుత నాకొసగు మస్త్రశస్త్రచయంబుల్"[30]

అని పలికి, పరుశురాముడి నుండి ప్రయోగోపసంహారాలతో అస్త్రశస్త్రాలను పొందాడు. తర్వాత కాలంలో హస్తినాపురం చేరి కురువీరులకు ఆచార్యుడై ధనుర్విద్య నేర్పించాడు. తాను సంపాదించిన అస్త్రవిద్యాపాండిత్యాన్నంతా అర్జునుడికి నేర్పించాడు. ఇది ప్రాచీన విద్యావిధానపు లక్షణం. అధ్యయనం, అధ్యాపనం, విద్యను ఒకతరం నుండి మరొకతరానికి అందించడం, నిస్వార్థమైన ప్రేమాభిమానాలు ఆనాటి గురుశిష్యుల మధ్య ఉండేవని ద్రోణుని కథ వల్ల తెలుస్తున్నది.

ద్రోణుడు – అస్త్రవిద్యలో శిష్యుల్ని పరీక్షించటం:–

నానాదేశాల నుండి వచ్చిన రాజకుమారులు విలువిద్యను అభ్యసించడానికి పూనికొనినారు. వారందరు ద్రోణుని దగ్గర అస్త్రప్రయోగోపసంహారాది పద్ధతులను అధ్యయనం చేసినారు. అధ్యయన కాలంలో కర్ణునికి అర్జునుడిపై, అశ్వత్థామకు అర్జునుని మీద మాత్సర్యం కలిగింది. తన దగ్గరనున్న శిష్యులలో అర్జునుడు తనంతటివాడు కాగలడని ద్రోణుడు భావించినాడు. అశ్వత్థామ అర్జునునిపై విద్యామాత్సర్యము వహించినందువల్ల అర్జునుడు చీకటిలో అస్త్రాన్ని ప్రయోగించే కౌశలాన్ని పొందకూడదనే ఉద్దేశంతో, చీకటిలో అతనికి అన్నం పెట్టవద్దని అన్నసాధకుని శాసించాడు. వంటవాడు ఆ నియమాన్ని పాటించినాడు. అర్జునుడు అన్నం తింటుంటే ఒకనాటి రాత్రి దీపం గాలికి ఆరిపోయింది. ఐనా అభ్యాసబలం వల్ల ముద్ద నోటిలోనికే పోవడం తెలుసుకొని, అభ్యాసంతో ఏ విద్యనైనా సాధించవచ్చని గ్రహించి, చీకట్లో కూడా బాణాలు వేయడం ప్రారంభించినాడు. అర్జునునికి గల విద్యాశక్తిని ద్రోణుడు మెచ్చుకొనినాడు. అతనికి సకల విద్యారహస్యాలను బోధించడానికి పూనుకొనినాడు. అతన్ని అద్వితీయుడైన విలుకానిగా చేస్తానని మాట ఇచ్చినాడు. ద్రోణుడు ప్రియశిష్యుడైన అర్జునునికి నేర్పిన విద్యలగురించి నన్నయ వర్ణించిన పద్యమిది.

"బహువిధ వ్యూహ భేదనోపాయములను సంప్రయోగ రహస్యాతిశయముగాగ
గఱపె నర్జునుదొంటి భార్గవుడు వింటనిదేయని పొగడంనెల్లజనులు"[31]

6.2.5. ఏకలవ్యుడు – స్వాధ్యాయం :–

ద్రోణుడు హస్తినాపురానికి వచ్చేటప్పుడు దారిలో, కురువంశానికి చెందిన బాలురు, బావిలో పడిన బంతిని తీయటానికి అవస్థ పడుతుండగా ద్రోణుడు గడ్డిపరకలను బాణాలుగా వేసి బంతిని ఆ బాణాల

తాడుతో బయటకు తీస్తాడు. అది వినిన భీష్ముడు సంతోషించి, ద్రోణాచార్యుడిని తన మనుమలకు విలువిద్య నేర్పించవలసిందిగా కోరుతాడు.

కొంతకాలం తర్వాత, ఒకరోజు హిరణ్యధనువ్వడనే ఎఱుకురాజు కుమారుడు ఏకలవ్యుడు ద్రోణుని దగ్గరకు వచ్చి తనకు విలువిద్య నేర్పమంటాడు. కానీ నిషాదుడైనందు వల్ల నీకు విద్యను నేర్పలేనని చెప్పి ఏకలవ్యుడిని పంపివేస్తాడు ద్రోణుడు. ఏకలవ్యుడు నిరాశపడకుండా, దీక్షాపరుడై, మట్టితో ద్రోణుని ప్రతిమను చేసి ఆరాధిస్తాడు. సర్వశస్త్రాస్త్రాలను నేర్చుకున్నాడు. ఒకరోజు పాండవులు, కౌరవబాలురు వేటకు అడవిలోకి వస్తారు. వేటకుక్క ఒకటి తప్పిపోయి, ఏకలవ్యుని దగ్గరకు చేరి మొఱుగుతుంది. అప్పుడు ఏకలవ్యుడు ఏడు బాణాలను దాని ముఖాన వేస్తాడు. ఆ కుక్క అరుస్తూ పాండవుల వద్దకు వెళుతుంది. దాన్ని చూసి కురుకుమార్లు ఆశ్చర్యపడతారు. ఆ బాణాలు వేసిన ఏకలవ్యుడి దగ్గరకు వెళ్ళి అతడి గురించి అడుగుతారు. అతడు, తాను ఏకలవ్యుడనని, ద్రోణుడి శిష్యుడినని చెపుతాడు. అది విన్న అర్జునుడు అసూయ చెందుతాడు. తనకంటే గొప్ప విలుకాడు ఈ భూమి మీదనే లేకుండానే చేస్తానని ద్రోణుడు తనకు మాటయిచ్చిన సంగతిని గురువుకు గుర్తుచేస్తాడు. ఏకలవ్యుడి గురించి తెలిపి బాధపడతాడు. శిష్యుడికి ఇచ్చిన మాటప్రకారం ద్రోణుడు ఏకలవ్యుడి దగ్గరకు వెళతాడు. నీవు నా గురువు, కాబట్టి నీకు గురుదక్షిణ చెల్లిస్తానని ఏకలవ్యుడు ద్రోణుడితో అంటాడు. తాను చేస్తున్న పని తప్పని అంతరాత్మ బోధిస్తున్నా, ద్రోణుడు ఏకలవ్యుడి కుడిచేతి బొటనవ్రేలుని గురుదక్షిణగా కోరుతాడు. ఏకలవ్యుడు వెనుకాడక మనసారా గురుదక్షిణ చెల్లిస్తాడు. దీనితో బాణాన్ని ప్రయోగించగలిగిన సామర్థ్యాన్ని ఏకలవ్యుడు కోల్పోయాడు.

ద్రోణుడు సకలశాస్త్రాలు, వేదవేదాంగాలు, ధనుర్వేదం తెలిసినవాడు. గొప్ప నడవడిక కలవాడు. కానీ శిష్యపక్షపాతం, తనకు సహజం కానటువంటి క్షాత్రధర్మాన్ని అనుసరించి యుద్ధం చేయడం అతనిలో ఉన్న లోపాలు. తనను ఆదరించి రక్షణ కల్పించిన కురువంశానికి ఋణం తీర్చుకోవాలన్న తపనతో గురుధర్మాన్ని మరచిపోయాడు. ఏకలవ్యుడికి తాను స్వయంగా చదువుచెప్పకపోయినా, గురువుగా అర్జునుడి కోరిక మేరకు గురుదక్షిణ అడిగాడు. ఇది అతనిలోని పక్షపాత బుద్ధిని తెలియజేస్తుంది. ఈ లోపం లేకపోయి ఉంటే ద్రోణుడు ఉత్తమ ఆచార్యుడు అయివుండేవాడు.

6.2.6. భీష్ముడు – విద్యాభ్యాసం :-

భీష్ముడి అసలు పేరు దేవవ్రతుడు. అష్టమ వసువు అంశతో గంగాశంతనులకు అష్టమపుత్రుడిగా జన్మించాడు. ఇతడు దృఢవ్రతశీలుడు. కన్నతండ్రికి ఇచ్చిన మాటకోసం ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉండిపోయాడు. రాజ్యాన్ని వదులుకున్నాడు. భీష్ముడు వేదవేదాంగాలు చదివినవాడు, ఆత్మజ్ఞానం కలవాడు. మంచిచెడులను నిర్ధారించగల లోకజ్ఞానం సంపూర్ణంగా కలవాడు. కృపానిలయుడు భీష్ముడు. విల్లుపట్టి ఇతడు రణరంగంలో నిలబడితే హరిహరాదులు కూడా ఎదురునిలబడలేరు. అంతటి శౌర్యపరాక్రమాలు కలవాడు భీష్ముడు.

పురిటిబిడ్డగా ఉన్నప్పుడే గంగాదేవి తీసుకొని వెళ్ళింది. వశిష్ఠుడు, చ్యవనుడు, మార్కండేయుడు మొదలైన గురువుల దగ్గర విద్యాభ్యాసం చేయించింది. యుక్త వయస్కుడైన దేవవ్రతుని తిరిగి శంతనుని వద్దకు తీసుకువచ్చి అప్పగించింది.

భీష్ముడు ధర్మాధర్మ విచక్షణ కలవాడు. తప్పుదారిలో నడుస్తున్నప్పుడు గురువును కూడా ఎదిరించవచ్చునని భీష్ముడు తెలియజేశాడు. అంబ అనే కాశీరాజు కూతురు విషయంలో భీష్ముడికి, అతని గురువైన పరశురాముడికి మధ్య వైరం ఏర్పడింది. ఈ వైరం యుద్ధానికి దారితీసింది. కానీ భీష్ముడు వెనుకాడలేదు. యుద్ధంలో పరశురాముడిని ఓడించి గురువును మించిన శిష్యుడు అనిపించుకున్నాడు.

భీష్ముడు యుద్ధతంత్రం తెలిసినవాడు. కురుక్షేత్ర యుద్ధంలో మొదటి పదకొండు రోజులు కౌరవసైన్యానికి అధ్యక్షుడిగా ఉన్నాడు. అనేకమైన వ్యూహాలు పన్నడం, వీరోచితంగా శత్రువులను ఎదిరించడం, ధర్మబద్ధంగా యుద్ధం చేయడం భీష్ముడిలోని మంచి లక్షణాలు. ఇతడు ఉత్తమ బోధకుడు. శాంతిపర్వంలో అంపశయ్య మీద ఉన్న భీష్ముడు ధర్మరాజుకు ఎన్నో నీతికథల్ని తెలిపాడు. దండనీతి, రాజధర్మాలు, వర్ణాశ్రమ ధర్మాలు బోధించాడు. పాండవులను, కౌరవులను చిన్ననాటి నుండి రక్షిస్తూ, వారిని వీరులుగా తీర్చిదిద్దినాడు. అవసాన కాలంలో ఉత్తరాయణ పుణ్యకాలం రాగానే స్వచ్ఛంద మరణాన్ని పొందాడు. ఈ విధంగా భీష్ముడు విద్యార్థిగా, వీరుడిగా, వ్యక్తిగా, బోధకుడిగా ఉన్నతమైన స్థానాన్ని పొందాడు.

6.2.7. విదురుడు – విద్యార్జన :-

విదురుడు, వ్యాసుడి అనుగ్రహం వల్ల అంబిక దాసికి పుట్టినవాడు. ధృతరాష్ట్రపాండురాజులతో సమానంగా పెరిగాడు. వ్యాసుడు, భీష్ముడు మొదలైనవారు ఇతనికి గురువులు. విదురుడు సకలనీతి కోవిదుడు, ధర్మాధర్మ విచక్షణ, సత్ప్రవర్తన కలవాడు. నిరంతరం అన్న అయిన ధృతరాష్ట్రుడికి తోడుగా ఉంటూ అతనికి కర్తవ్యాన్ని ఉపదేశిస్తూంటాడు.

విదురుడు మేచ్ఛభాష తెలిసినాడు. పాండవులు వారణావతం వెళ్ళేటప్పుడు, అగ్ని మొదలైన వాటి వల్ల ప్రమాదం ఉందని ధర్మరాజుతో మ్లేచ్ఛభాషలో మాట్లాడతాడు. ఇతడు ఆత్మసాక్షాత్కారాన్ని పొందాడు. అవసాన కాలంలో యోగసాధన ద్వారా పరమపదాన్ని పొందాడు.

విదురుడు సమయానికి తగిన నీతులు చెప్పగలిగిన నీతిశాస్త్రకోవిదుడు. 'విదురనీతులు' మహాభారతంలో చాలా ప్రసిద్ధమైనవి. ఇతనికి ఎదుటి వ్యక్తుల మనస్సుల్ని గ్రహించి, కర్తవ్యాన్ని నిర్ణయించగలిగిన శక్తి ఉంది. రాజతంత్రాన్ని నడిపించడం, యుక్తుల్ని పన్నడం, దుర్బేధ్యమైన రహస్యాల్ని ఛేదించడం ఇతనికి తెలుసు. కురువంశానికి రక్షకుడిగా ఉంటూ, దాని అభివృద్ధి కొరకు నిరంతరం పరితపించిన వ్యక్తి విదురుడు. ఒక సందర్భంలో ధృతరాష్ట్రుడు అతడిని బహిష్కరించినా బాధపడలేదు. తిరిగి ఆహ్వానించినా కాదనలేదు. జ్ఞానం, వివేకం, సేవచేయడం ఇవి విదురుడిలోని గుణాలు.

6.2.8. పాండురాజు – విద్యార్జన :-

పాండురాజు, అంబాలికకు వ్యాసుడికి జన్మించిన పుత్రుడు. చిన్నప్పటి నుండి భీష్ముని శిక్షణలో పెరిగాడు. అన్న అయిన ధృతరాష్ట్రుడుకి తోడుగా నిలిచాడు. సమస్త రాజవిద్యల్లో ఆరితేరాడు. ధనుర్విద్యలో ఇతడు ఆరితేరినవాడు. ఇతడు నిస్వార్థపరుడు. తాను సంపాదించిన రాజ్యాన్నంతా అన్నకు సమర్పించాడు. అతని చేత యజ్ఞయాగాలు చేయించాడు. పాండురాజు విద్యాభ్యాసాన్ని నన్నయ క్రిందివిధంగా వర్ణించాడు.

"వేదంబులందుఁ బ్రవీణుడై మఱి సర్వ
శాస్త్రంబులందుఁ గౌశలము మెఱసి
యసికుంత కార్ముకాద్యాయుధ విద్యల
యందు జితశ్రయుడై తురంగ

సింధురారోహణ శిక్షల దక్షుడై
నీతి ప్రయోగముల్ నెఱయనేర్చి"[32]

నాలుగు వేదాలు, ధనుర్విద్య మొదలైన లౌకిక విద్యలు, నీతిశాస్త్రాలు చదివాడు. గృహస్థాశ్రమాన్ని స్వీకరించి కుంతి, మాద్రి అనే ఇద్దరిని భార్యలుగా పొందాడు. చాలా దిగ్విజయ యాత్రలు చేసి అపార ధనరాసులను సంపాదించాడు. ఒకరోజు వేటకు వెళ్ళి మునిశాపానికి గురియై, మాద్రి కారణంగా మరణించాడు. ఇతడి గుణగణాలు పాండవుల్లో మూర్తీభవించాయి. పాండవులు ఇంద్రాది దేవతల వల్ల పుట్టినా, వారిలో పాండురాజు లక్షణాలే ప్రతిఫలించాయి. పాండురాజు కురువంశ కర్తలలో ఒకడయ్యాడు. పరాక్రమం, వినయవిధేతలు, అన్నగారి పట్ల ఆదరణ, సజ్జన సాంగత్యం పాండురాజులోని సుగుణాలు.

6.2.9. ధర్మరాజు – విద్యార్థి :-

ఇతడు పాండురాజు అనుమతితో కుంతీదేవికి, యమధర్మరాజు అనుగ్రహం వల్ల కలిగిన పుత్రుడు. ధర్మరాజు సకలశాస్త్రాలు తెలిసినవాడు. ధర్మపరుడు. ఇతడు ధనుర్ధారణలో, కవచధారణ విద్యలో, ఆరోహణ విద్యల్లో గొప్ప ప్రావీణ్యాన్ని సంపాదించాడు. వ్యాసుడు, అరణ్యపర్వంలో ధర్మరాజుకు 'ప్రతిస్మృతి' అనే విద్యను నేర్పినట్లు క్రింది వచనం వల్ల తెలుస్తున్నది. "ధర్మతనయు నేకాంత ప్రదేశంబునకుందోడ్కొని చని సత్యవతీసుతుండు విధిదృష్టవిధానంబునా బ్రతిస్మృతియను విద్యనుపదేశించి"[33]. కృపాచార్యుడు, వ్యాసుడు, శుకుడు, ద్రోణుడు ధర్మరాజుకు ఆయా సందర్భాల్లో ఎన్నో లోకరీతులను తెలిపారు. ధౌమ్యుడు, నారదుడు మొదలైనవారు ఎన్నో కథలు వినిపించారు. దీనివల్ల ధర్మరాజు నీతికోవిదుడు, ధర్మాధర్మ విచక్షణ కలవాడు, దృఢచిత్తం కలవాడు కాగలిగాడు. జూదగుణం ఇతనిలో ఉన్న లోపం. స్త్రీని జూదంలో ఒడ్డడం, భార్యను అవమానిస్తూంటే చూస్తూ ఉండటం ధర్మరాజు చేసిన తప్పులు.

విరాట మహారాజు కోలువులోకి ప్రవేశించే సందర్భంలో ధర్మరాజు తనకు ఏయే విద్యలలో ప్రావీణ్యం కలదో క్రింది విధంగా వివరించాడు.

"సన్యాసి వేషమున రా
జన్యునిఁ గని యెపుడు గొలిచి సభ్యత్వమునన్
మాన్యుడ నైపుణ్యకథా
విన్యాస మెనర్తు నతని వేడుకకుఁదగన్"[34]

అని తన తమ్ములతో అంటాడు. సమయానికి తగిన కథలు చెపుతానని పలికాడు. అంతేకాదు,

"శ్రౌత స్మార్త నిమిత్త
జ్యోతిర్విద్యలు వహించి యోగ్య సమయ సం
జాత ప్రాగల్భ్యుడనై
చాతుర్యము మెఱసి మానసంబలరింతున్"[35]

ధర్మరాజు జ్యోతిషశాస్త్రంలో, శకునశాస్త్రంలో పండితుడు. రాజనీతి విద్యల్లో, అక్షశిల్పంలో పాండిత్యం కలిగినవాడు. ధర్మరాజుకు మ్లేచ్ఛభాష కూడా తెలుసు. ధృతరాష్ట్రుడు పాండవులను వారణావతానికి పంపినపుడు, విదురుడు ధర్మరాజుకు మ్లేచ్ఛభాషలో కర్తవ్యాన్ని ఉపదేశించాడు. ఇతడు చిల్లకోలను ప్రయోగించడంలో, శతఘ్నిని ప్రయోగించడంలో గొప్ప సామర్థ్యం కలవాడు.

భారతం మొత్తం మీద ధర్మరాజు శాంతగుణానికి ప్రతీకగా కనిపిస్తాడు. ఇతడు మెత్తని పులి. వినయవిధేతలు కలిగిన వ్యక్తి.

6.2.10. భీముడు – విద్యాభ్యాసం :-

పాండురాజు అనుమతితో కుంతీదేవికి వాయుదేవుని అనుగ్రహం వల్ల భీముడు జన్మించాడు. ఇతడు గొప్ప బలశాలి. ధృతి సంపన్నుడు. మల్లయుద్ధంలో ఆరితేరినవాడు. వంట చేయడంలో కూడా గొప్ప పాండిత్యం సంపాదించాడు. భీముడు – హిడింబాసురుడు, బకాసురుడు, కీచకుడు, జరాసంధుడు, దుర్యోధనుడు, దుశ్శాసనుడు వంటి వీరుల్ని సంహరించాడు. గదాయుద్ధంలో ఇతడు గొప్పప్రావీణ్యం సంపాదించాడు. ఇతడు ధుర్యోధనునికి గదాయుద్ధంలో సరియైన జోడి. భీముడు వేదాంత విషయాలు నేర్చుకొన్నాడు. శుకుడు, కృపాచార్యుడు, ద్రోణుడు, శాలిహోత్రుడు, బలరాముడు భీమునికి గురువులు. శ్రీకృష్ణుడు, భీష్ముడు ఇతనికి మంచి ప్రబోధకులు. భీముడు శకునివద్ద, ద్రోణుని వద్ద, బలరాముని వద్ద గదాయుద్ధ విశేషాలను నేర్చుకున్నాడు. కృపాచార్యుని వల్ల ధనుర్వేదాన్ని అభ్యసించాడు.

కుమారాస్త్ర విద్యాప్రదర్శన సందర్భంలో భీమదుర్యోధనుల గదాయుద్ధాన్ని నన్నయ క్రిందివిధంగా వర్ణించాడు.

"అంత ననంత బలపరాక్రములగు భీమ దుర్యోధనులుద్యద్గదాహస్తులయి మహా మత్సరంబుతో నేకశృంగ సముత్తుంగ శైలద్వయంబు ననుకరించుచు వశానిమిత్త క్రుద్ధగంధసింధురంబులుం బోలె నొండొరులందాకి సవ్యాపసవ్య చిత్రమండల మార్గంబుల గదా కౌశలంబు మెఱయు నెడ"[36]. దీన్ని బట్టి భీమదుర్యోధనాదులు గదాయుద్ధంలో గొప్పవీరులని తెలుస్తుంది.

భీముడికి మల్లయుద్ధంలో మంచి ప్రావీణ్యం ఉంది. ప్రమాధము, ఉన్మధనము, క్షేపణము, ముష్టి, అవాఙ్ముఖము, సంప్రహారతలము, ఆకర్షణము, సమ్ముఖీకరణము, భ్రమణము, వికర్షణము మొదలైన మల్లయుద్ధరీతుల్ని భీముడు అభ్యసించాడు. వీటి గురించి ఆర్. మల్లేశుడు గారు ఇలా వివరించాడు. "ప్రత్యర్థిని నేలమీద పడగొట్టి నిలిపివేయడం ప్రమధనమని పేర్కొనడం జరిగింది. శత్రువును పైకెత్తి అతని అవయవాలను పీడించడము ఉన్మధనము. ఎదుటి వ్యక్తిని ఉన్నచోటు నుండి దూరంగా పారవేయడము క్షేపణము. పిడికిళ్ళతో రొమ్ముపై గట్టిగా కొట్టడము ముష్టి. ప్రత్యర్థిని భుజముపై వేసుకొని వరాహములాగా శబ్దము చేస్తుంటే వానిని త్రిప్పడము అవాఙ్ముఖము. చూపుడు వ్రేలికి ఉండే మధ్యభాగాన్ని ప్రసారము చేసి శత్రువును గట్టిగా కొట్టడము సంప్రహారతలమని చెప్పబడింది. ఎదుటివ్యక్తిని వ్రేళ్ళతో పట్టుకొని దగ్గరకు లాగుకోవడము సమ్ముఖీకరణము. ముందు, వెనుక, ప్రక్కకు, వెనుకకు పడేలాగా వేగముగా త్రోయడము వికర్షణము"[37]. మహాభారతంలోని చాలా చోట్ల భీముడు ఈ మల్లయుద్ధ విశేషాలను ప్రయోగించినట్లు తెలుస్తుంది. కత్తి, గొడ్డలి వంటి ఆయుధాలు లేకుండానే కట్టెలను విరవగలడు. చెట్లను కూకటి వేళ్ళతో సహా పెళ్ళగించి వేయగలడు.

భీముడు మంచి భోజనప్రియుడు. కుంతి భోజనంలో సగం భీముడికి, మిగిలిన సగం పాండవులందరికి పంచి పెట్టేది. భీముడు పాకశాస్త్రంలో తనకు గల ప్రావీణ్యాన్ని విరాటపర్వంలో ఇలా తెలిపాడు. విరాటుని కొలువులోకి ప్రవేశించే సందర్భంలో,

"ఆఱు రసంబులున్ జవుల యందలి క్రొత్తలు పుట్టనిచ్చలున్
వేఱొకభంగిఁ బాకములు విన్నను వొప్పగఁ జేసి చేసిన
నీఱఁగ బానసీని నొకనిం బురి గాననియట్లుగాఁగ మేన్
గాఱియవెట్టియైన నొడికంబుగ వండుదు నెల్లగూరలున్"[38]

అని తనకు వంట చేయడంలో గల పాండిత్యాన్ని భీముడు ప్రకటించాడు.

"భీముడు హనమంతునివల్ల చతుర్యుగ ధర్మాలను తెలుసుకున్నాడు. అంతేకాదు భీముడు మంచి బోధకుడు కూడా. మందుడూ, అర్థజ్ఞాన శూన్యుడూ అయిన శ్రోత్రియుని బుద్ధి మంత్రపాఠంచే హతమైనట్లు ధర్మరాజు యొక్క బుద్ధి, తత్త్వాన్ని దర్శించడం లేదని హెచ్చరించాడు"[39]

భీముడు వేదాంతజ్ఞానం తెలిసినవాడని క్రిందిపద్యాన్ని బట్టి తెలుస్తున్నది.

"కడుకొని కడు దుఃఖములై
నెడనుచితయె యాత్మనింద యెయ్యెడల మనం
బడలకు యేకాకృతి నె
ప్పుడునుండుట సూవె పురుషు పురుషార్థమిలన్"[40]

ఆత్మనింద దోషమనీ, ఆపదలు కలిగినప్పుడు మానవుడు వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని భీముని ప్రబోధం. తనకంటె గొప్ప బలవంతుడు లేడని గర్వపడటం ఇతనిలోని దోషం.

ఈ విధంగా భీముడు శారీరక, మానసిక, ఆధ్యాత్మికమైన మూడురంగాల్లో జ్ఞానాన్ని సంపాదించాడు. ఉత్తమ విద్యార్థిగా, వీరుడిగా గుర్తింపుపొందాడు. కుటుంబానికి రక్షకుడిగా నిలిచాడు.

6.2.11. అర్జునుడు – విద్యార్జన :-

పాండురాజు అనుమతితో ఇంద్రుని అనుగ్రహం వల్ల కుంతీదేవికి ఇంద్రుడు జన్మించాడు. అర్జునుడు గొప్ప ధానుష్కుడు. ఆజానుబాహుడు. ఎగుభుజాలు కలవాడు. మోకాళ్ళ దాకా వేలాడే చేతులు కలవాడు. అందుకే ఇతడు ధనుర్విద్యలో సవ్యసాచి అయ్యాడు. అర్జునుడు వినయవిధేతలు కలవాడు. గురువుల పట్ల భక్తిశ్రద్ధలు కలవాడు. విద్య పట్ల ఏకాగ్రత, చిత్తశుద్ధి, లక్ష్యశుద్ధి కలవాడు. ఇతడు ప్రతాపవంతుడు. సకల కళలు నేర్చుకొన్నాడు. విల్లుపట్టి యుద్ధంలో నిలబడితే ఇతడిని ఎదిరించడం హరిహరాదులకు కూడా కష్టసాధ్యమే.

శుకుడు, కృపుడూ, ద్రోణుడు, చిత్రసేనుడు, పరమేశ్వరుడు, ఇంద్రుడు, శ్రీకృష్ణుడూ అర్జునుని గురువులు. బాల్యంలో శుకుడి వద్ద విలువిద్య నేర్చుకొన్నాడు. తర్వాత కృపాచార్యుడు, ద్రోణుడు అర్జునుని విలువిద్యలో గొప్ప యోధుడిగా తయారుచేశారు. అర్జునుడికి పరమేశ్వరుడు పాశుపతాస్త్రాన్ని ప్రసాదించాడు. శ్రీకృష్ణుడు పరమపవిత్రమైన భగవద్గీతను అర్జునుడికి బోధించాడు. ఈ విధంగా అర్జునుడు సకల శాస్త్రాలలో, యుద్ధ విద్యల్లో, నృత్యాది కళల్లో మంచి పాండిత్యాన్ని సంపాదించాడు.

మహాభారతంలో, అర్జునుడి విద్యార్జన గురించి క్రింది విధంగా ప్రస్తావించబడింది.

"నరుడస్త్రశస్త్ర విద్యా
పరిణతి నధికుడఁయి వినయ పరుఁడయి శశ్వ
ద్గురుపూజా యత్నంబునఁ
బరగుచు సంప్రీతుఁజేసె భారద్వాజున్"[41]

దీన్నిబట్టి అఱ్జునుడు అస్త్రవిద్యలో ప్రవీణుడని, వినయపరుడని, గురుశుశ్రూషాపరుడని, ద్రోణునికి ప్రియశిష్యుడని తెలుస్తున్నది. గురుదక్షిణ చెల్లించి అర్జునుడు ఉత్తమ విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. అయితే ఇతరులు విలువిద్యలో అధికులు కావడం చూసి ఓర్వలేకపోవడం, అసూయాపరత్వం ఇతనిలోని లోపాలు. ఏకలవ్యుడు తన కంటె గొప్పవాడౌతాడని భయపడి, ద్రోణుడి చేత గురుదక్షిణగా ఏకలవ్యుడి బొటనవ్రేలుని నరికించాడు.

ఇది అర్జునుడిలోని అసూయాపరత్వాన్ని తెలియజేస్తున్నది.

కుమారాస్త్రవిద్యాప్రదర్శన సందర్భంలో అర్జునుడు ఉత్తమ విద్యార్థిగా నిరూపించబడినాడు. చెట్టు మీద ఉన్న కృత్రిమ పక్షి తలను గురిచూసి కొట్టి, తన లక్ష్యశుద్ధిని నిరూపించుకొన్నాడు. ద్రౌపదీస్వయంవర ఘట్టంలో మత్స్యయంత్రాన్ని ఛేదించి వీరుడనిపించుకొన్నాడు. కురుక్షేత్ర యుద్ధంలో భీష్మద్రోణాది వీరులతో వీరోచితంగా పోరాడి, విజయం సాధించాడు. ఇంద్రుడి నుండి సన్మానంగా కిరీటాన్ని పొంది 'కిరీటి' అయ్యాడు. రంభా, ఊర్వశుల మధ్య వివాదాన్ని పరిష్కరించి తన మేధాశక్తిని నిరూపించుకొన్నాడు.

అర్జునుడి విద్యార్జనను నన్నయ క్రింది విధంగా వర్ణించాడు.

"వజ్రాస్త్ర మాదిగా వరదుడై వివిధ దివ్యాస్త్రముల్ పార్థున కమరనిచ్చి
తత్ప్రయోగంబులుఁ దద్రహస్యంబులుఁ దన్ని వర్తనములుఁ దడయ కపుడు
దయ నుపదేశించి దారుణాహవములం దవిజేయ వీర్యుండ వగుము పేర్మి
నని మహాసాహార్దుడై చిత్రసేనుఁడ నర్గంధర్వపతితోడ గారవమున
వజ్రధరుడు గీతవాద్యనృత్యంబులు
గఱవఁబంచె బార్థుఁగడఁగి యిట్టు

లమరనాథునొద్ద నర్జునుండుండనే
నేడులరిగె నిట మహీతలమున"[42]

దేవలోకంలో చిత్రసేనుడనే గంధర్వుడు అర్జునుడికి వివిధ అస్త్రశస్త్రాలు ప్రయోగోపసంహారాలతో బోధించాడు. గీతం, వాద్యం, నృత్యం మొదలైన కళల్ని నేర్పించాడు. ఇవి భవిష్యత్తులో అర్జునుడికి ఎంతో ఉపయోగపడ్డాయి.

అర్జునుడు విద్యార్థి మాత్రమే కాదు, ఉత్తమ ఆచార్యుడు కూడా. ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు మొదలైన రాజకుమారులు కృష్ణమృగ చర్మధారులై అర్జునుని దగ్గర శిక్షణపొందారు. యాదవ రాజకుమారులు, ఉపపాండవులు, అభిమన్యుడు, ఉత్తర మొదలైన వారు ఇతని శిష్యులు. అర్జునుడు ఉత్తరను గొప్ప కళామయిగా తీర్చిదిద్దాడు. తల్లి గర్భంలో ఉన్నప్పుడే అభిమన్యుడికి పద్మవ్యూహాన్ని గురించి తెలిపాడు. కురుక్షేత్ర యుద్ధానంతరం ధర్మరాజు సింహాసనాన్ని చేపట్టడానికి ఇష్టపడకుండటం చూసి అర్జునుడు అతనికి కర్తవ్యాన్ని, రాజధర్మాల్ని బోధించాడు.

విరటుని కొలువులో ప్రవేశించేటప్పుడు, బృహన్నలగా మారిన అర్జునుడు తనకు గల కళానైపుణ్యాన్ని క్రిందివిధంగా తెలిపాడు.

"ఇన్ని తెఱగుల శ్రమము సేయింతుఁ జతుర
తా విహీనములైన పాత్రములనైన
నట్టు వొజ్జనై మెలగుదు నగళులందు
నిపుణ నైపథ్య విధులకు నేర్తునధిప"[43]

ఈ విధంగా అర్జునుడు సకలవిద్యలను నేర్చుకొన్నాడు. ఉత్తమ విద్యార్థి, ఉత్తమ గురువుగా తన బాధ్యతలను నెరవేర్చాడు. గొప్పయోధుడై కురుక్షేత్ర యుద్ధరంగంలో విజృంభించాడు. జిజ్ఞాస గల విద్యార్థిగా మారి శ్రీకృష్ణనివద్ద గీతాసారాన్ని నేర్చుకొన్నాడు.

6.2.12. నకులుడు – విద్యార్జన :-

నకులుడు, సహదేవుడు అశ్వినీదేవతల వరం వల్ల మాద్రికి జన్మించిన కవలలు. వీరిలో పెద్దవాడు నకులుడు. నకులుడు ఖడ్గ విద్యలో, అశ్వశిక్షణలో ప్రావీణ్యాన్ని సంపాదించాడు. ఇతడు గురుశుశ్రూష,

వినయవిధేతలు కలవాడు. బాల్యంలో శుకుని దగ్గర ఖడ్గ విద్యను నేర్చుకొన్నాడు. తర్వాత కృపాచార్యుడు, ద్రోణాచార్యుడు ఇతన్ని గొప్ప వీరుడిగా తీర్చిదిద్దారు. నకులుడు శాలిహోత్రుని దగ్గర వివిధ శాస్త్రాలను నేర్చుకున్నాడు. భీష్ముడు నకలుడికి ఖడ్గాగమాన్ని వినిపించాడు. "ఖడ్గం విష్ణువు నుండి మరీచికి, అతని నుండి ఇంద్రునికీ, ఇంద్రుని నుండి లోకపాలకులకూ, వారి నుండి మనువులకూ, వారి నుండి క్రమంగా దుష్యంతునికీ, అతని నుండి భరతునికి సంక్రమించిందని, తర్వాత ఒక మునివల్ల ద్రోణునికీ, అతనివల్ల కృపునికి, కృపుడి నుండి పాండవులకు ఖడ్గవిద్య అందిందని భీష్ముడు తెలిపాడు"[44]. ఈ విధంగా ఖడ్గ విద్య కొన్ని తరాల నుండి ప్రపంచంలో విస్తరించింది. ఇది ఒకరి నుండి మరొకరికి వాగ్రూపంలో చేరింది.

నకులుడు, విరాటుని కొలువులో చేరేటప్పుడు తనకు అశ్వశాస్త్రంలో గల ప్రావీణ్యాన్ని ధర్మరాజుకు తెలియజేశాడు. గుర్రాల ఆయుఃప్రమాణం లెక్కించడం, ఆడు గుర్రాలకు తగిన మగ గుర్రాలతో గర్భధారణ చేయించడం, వాటికి సంక్రమించే వ్యాధులకు చికిత్సచేయడం, వాటిని పోషించే విధానం మొదలైనవి నకులుడికి తెలుసు.

6.2.13. సహదేవుడు – విద్యార్జన :-

సహదేవుడు శుకుడి వద్ద యుద్ధవిద్య నేర్చుకొన్నాడు. కృపుడు, ద్రోణుడు ఇతనికి కత్తి, డాలు త్రిప్పడంలో శిక్షణయిచ్చారు. సహదేవుడు పశుపాలన విద్యలో ప్రావీణ్యం కలవాడు. విరాటుని కొలువులో ప్రవేశించే సమయంలో, సహదేవుడు తనకు గల పశుపాలన విద్య గురించి ధర్మరాజుతో ఇలా అంటాడు.

"వంజల నైనను వలనేర్పడఁగ నొకభంగిఁ జేఁపగఁజేసి పాఁడి గొనగ
బడుగులనైనను బాటించి పరికించి గోమున మైఁ గండ క్రొవ్వుదేఱ
దెవులు గొంటులనైనఁదేర్చు సంకటమున కోపిముందటియట్ల రూపుసేయ
నశ్వలనైనను నలువైన వెరవున ముట్టె యంటగఁబట్టి కట్టివిడువ

బిదుకఁ గదుపు సేర్పు బెదరు వాపగ నీరు
మేపు గలుగు నెడకు మెలగ వెలువ
మృగము నరయఁజుచ్చు రే వగలును గొట్ట
నేర్తుఁబసికి జాలఁగూర్తు నేను"[45]

ఒట్టిపోయిన ఆవులు కూడా పాలుయిచ్చేటట్లు చేయడం, జాతుల వారిగా పశువులను వేరుచేసి తగిన పోషణ, రక్షణ కల్పించడం, వాటికి వైద్యం చేయడం తనకు తెలుసునని సహదేవుడు అంటాడు.

ఇతడు వినయసంపన్నుడు. అన్నల పట్ల గౌరవం గురువుల పట్ల వినయవిధేతలు ఇతడికి ఉన్నాయి. ఇతడు గొప్ప పరాక్రమం కలవాడు. తానే గొప్ప వీరుడన్న గర్వం సహదేవుడు పడిపోవడానికి కారణం అయింది.

6.2.14. కర్ణుడు – విద్యార్జన :-

కుంతీదేవి కన్యగా ఉన్నప్పుడు దూర్వాసుని మంత్రప్రభావం వల్ల, సూర్యుడి వరప్రసాదంగా కర్ణుడు జన్మించాడు. ఇతడు పుట్టుకతోనే కవచకుండలాల్ని కలిగివున్నాడు. ఆజానుబాహుడు కర్ణుడు. ఇతడు స్వాభిమానం కలవాడు. కుంతీదేవి కర్ణుడుని నదిలో వదిలివేయగా, సూతుని యింట పెరిగాడు. రాధేయుడు అయ్యాడు. స్వయంకృషితో విలువిద్య నేర్చుకున్నాడు.

కుమారాస్త్ర విద్యాప్రదర్శన సందర్భంలో కర్ణుడు, అర్జునుడితో సమానమైన ప్రతిభ చూపించాడు. కానీ సభలో భీష్మద్రోణాది పెద్దలు అతనిని గౌరవించలేదు. సూతుడికి, క్షత్రియుడితో పోటీ ఏమిటని హేళనచేశారు. ఆ సందర్భంలో దుర్యోధనుడు కల్పించుకొని, విద్యాప్రదర్శనకు కావలసింది ప్రతిభాపాటవాలేగాని కులమతాలు కావని పలుకుతాడు. కర్ణుడిని అంగదేశానికి రాజుగా ప్రకటిస్తాడు. కర్ణుడితో మైత్రిని ఏర్పరుచుకుంటాడు.

కర్ణుడు బ్రహ్మాస్త్రాన్ని సాధించడం కోసం మొదట ద్రోణాచార్యుడిని ఆశ్రయిస్తాడు. సూతుడన్న కారణంగా ఆ విద్యను కర్ణుడికి నేర్పనని ద్రోణుడు అంటాడు. కానీ ఎలాగైనా బ్రహ్మాస్త్రం సంపాదించాలన్న పట్టుదలతో, బ్రాహ్మణ వేషంలో పరశురాముడిని ఆశ్రయిస్తాడు. దివ్యాస్త్రాలను ప్రయోగోపసంహారాలతో సహా చాలా తక్కువకాలంలో నేర్చుకున్నాడు. కానీ విధివశాన ఒకనాడు పరశురాముడి శాపానికి గురైనాడు. క్రిమి అతని తొడను తలిచినా చలించకుండా, నిద్రాభంగం కలగకుండా గురువును తొడమీదే పడుకోబెట్టుకున్నాడు. నిజం తెలుసుకొని పరశురాముడు పశ్చాత్తాపం చెంది అతనికి దివ్యమైన రథాన్ని, గుర్రాలను, అస్త్రాలను కానుకలుగా ఇచ్చాడు.

తనను మోసం చేసి విద్యనేర్చుకున్నందున అవసరమైనప్పుడు ఆ విద్య నీకు గుర్తురాదని పరశురాముడి శాపం. కురుక్షేత్ర యుద్ధంలో, అంతిమ గడియల్లో ఈ శాపం నిజమైంది. కర్ణుడికి దివ్యాస్త్రాలు గుర్తుకురాలేదు.

కర్ణుడు గొప్ప వ్యక్తిత్వం కలవాడు. స్నేహం కోసం తన జీవితాన్నే త్యాగం చేశాడు. శ్రీకృష్ణుడు కర్ణుడికి జన్మరహస్యాన్ని చెప్పి, పాండవులలో చేరమని కోరాడు. కర్ణుడినే మహారాజును చేస్తానని చెప్పాడు. కానీ కర్ణుడు దానికి అంగీకరించలేదు. కష్టకాలంలో తనను గుర్తించి అశ్రయమిచ్చిన దుర్యోధనుడి కోసమే జీవితాంతం శ్రమించాడు.

కర్ణుడు సకల శాస్త్రాలు, నీతులు తెలిసినవాడు. దయామయుడు, దానగుణశీలుడు, అవసాన కాలంలో కూడా దానగుణాన్ని విడిచిపెట్టని దానవీరుడు కర్ణుడు. దేవేంద్రుడు కవచకుండలాలను యాచించగా వాటిని సంతోషంగా దానం చేశాడు. కుంతీదేవికి ఇచ్చిన మాటప్రకారం అర్జునుడిని తప్ప మిగిలిన నలుగురిని యుద్ధంలో చంపలేదు. అవకాశం వచ్చినా క్షమించి వదిలిపెట్టాడు.

అసూయ, ఆత్మన్యూనత ఇతనిలోని లోపాలు. చెడ్డవారితో స్నేహం చేయడం, పెద్దలపట్ల సరియైన గౌరవాదరాలు చూపకపోవడం ఇతనిలోని దోషాలు. ఈవిధంగా కర్ణుడు వివిధ విద్యలను నేర్చి వీరుడిగా పేరు తెచ్చుకున్నాడు.

6.2.15. శ్రీకృష్ణబలరాములు – గురుభక్తి :-

శ్రీకృష్ణుడు, బలరాముడు చిన్నప్పటి నుండి పశుపోషణవిద్యను అభ్యసించారు. తల్లిదండ్రుల వద్ద ఎన్నో నీతుల్ని తెలుసుకున్నారు. బలరాముడు వ్యవసాయ వృత్తిని చేపట్టాడు. తర్వాత శ్రీకృష్ణబలరాములు 'సాందీపని' అనే గురువు దగ్గర చేరినారు. కుచేలుడు వీరి సహాధ్యాయి. ఈ ముగ్గురూ గురుశుశ్రూష చేస్తూ సకల శాస్త్రాలు చదివారు. కృష్ణబలరాములు ఏయే విద్యలు నేర్చుకొన్నారో ఎర్రన హరివంశంలో క్రింది విధంగా వివరించాడు.

"అతిలోక ధీగుణోదాత్తులై యన్నయుఁదమ్ముండు నోలి వేదములు నాల్గు
నగంబు లాఱును నఱువది నాలుగు దినముల జదివిరి; దను ధర్మ
శాస్త్ర తర్కన్యాయ సరణియు గణిత గాంధర్వ లేఖ్యములు గంధర్వదంతి

రథ శిక్షలును వాసరములు పండ్రెంటను నెఱిగిరి సాంగమై వఱలునస్త్ర
నిగమమేబది నాళుల నెఱయఁగఱచి రిట్టి నిత్యప్రకాశ సమిద్ధ మహిమ
సూచి నరరూపధరులైన సూర్యచంద్రులని తలంచె వారలగురుఁడాత్మలోన"[46]

నాలుగు వేదాలు, ఆరు వేదాంగాలు, ధర్మశాస్త్రం, తర్కశాస్త్రం, న్యాయశాస్త్రం, గణితం, గాంధర్వం, రథశిక్ష, వివిధ అస్త్రశస్త్రవిద్యలను శ్రీకృష్ణబలరాములు నేర్చుకున్నారు. శ్రీకృష్ణుడు సుదర్శన చక్రాన్ని ప్రయోగించడంలో నేర్పు కలవాడు. రథం నడపడంలో శ్రీకృష్ణుడు మంచి ప్రావీణ్యం సంపాదించాడు. కురుక్షేత్రయుద్ధంలో అర్జునుడికి రథసారథిగా ఉండి ఆయనకు విజయం కలిగేలా చేశాడు. గురుపుత్రుడు చనిపోగా, యమలోకం వెళ్ళి అతని ఆత్మను తీసుకువచ్చి గురుపుత్రుడిని బ్రతికించాడు. ఎవరూ ఇవ్వనంతటి గొప్ప గురుదక్షిణను చెల్లించారు శ్రీకృష్ణబలరాములు.

6.2.16. దుర్యోధనుని విద్యార్జన :–

గాంధారీధృతరాష్ట్రుల పెద్దకొడుకు దుర్యోధనుడు. ఇతడు గదాయుద్ధంలో గొప్పవీరుడు. కానీ అసూయ, ఆత్మన్యూనత, దురభిమానం ఇతని పతనానికి కారణమయ్యాయి. ఇతడు కృపాచార్యుడు, ద్రోణాచార్యుడు, బలరాముడు మొదలైన వారి వద్ద విద్యాభ్యాసం చేశాడు. వేదవేదాంగాలు, యుద్ధవిద్యలు, వ్యాకరణం, తర్కం మొదలైన వాటిని నేర్చుకున్నాడు. భీమదుర్యోధనులిద్దరూ బలరాముని వద్ద గదాయుద్ధం పదమూడు సంవత్సరాలు నేర్చుకొన్నారు.

గదాయుద్ధంలో భీమదుర్యోధనులు ఇద్దరూ సమానులే అయినప్పటికీ దుర్యోధనుడు గదాయుద్ధంలోని మెళకువలను బాగా తెలుసుకున్నాడు. "భీముడు గదతో శత్రువులను గట్టిగా కొట్టగలడే కాని దుర్యోధనునికి గల గదానైపుణ్యము భీమునికి లేదు. గదాయుద్ధంలో భీమునికంటే ఆభ్యాసదక్షుడైన దుర్యోధనుడే గొప్పవాడని కృష్ణుడు నిర్ణయించినాడు"[47]. దీన్నిబట్టి ఆనాడు రాజకుమారులు యుద్ధవిద్యల్ని ఎక్కువగా నేర్చినట్లు తెలుస్తుంది.

దుర్యోధనుడు జలస్తంభనం, వాయుస్తంభనం వంటి విద్యల్ని కూడా నేర్చుకున్నాడు. కర్ణుడి మరణానంతరం యుద్ధరంగం విడిచిపెట్టి వెళ్ళి చెఱువు మధ్యలో చేరి జలస్తంభనం చేశాడు. తర్వాత పాండవుల దెప్పిపొడుపు మాటలకు సహించలేక బయటకు వచ్చి, భీముడితో గదాయుద్ధం చేసి

మరణించాడు. సకల విద్యలు నేర్చినా, మహావీరుడైనా, గొప్ప పరిపాలకుడైనా ఇతనిలోని అసూయ కారణంగా కురువంశం నాశనమైంది. మొండి పట్టుదల, అహంభావం ఇతని గుణాలు.

6.2.17. నారదుడు – విద్యావివేకాలు :-

మహాభారతం, రామాయణం మొదలైన ఇతిహాసాల్లోనూ, పురాణాల్లోనూ ప్రధానంగా కనిపించే పాత్ర నారదుడు. ఇతడు బ్రహ్మదేవుని మానసపుత్రుడు. బ్రహ్మచారి. నిరంతరం ముల్లోకాలు తిరుగుతూ, కలహాలు పుట్టించి, తద్వారా లోకకళ్యాణకరమైన పనులు చేస్తూంటాడు. అందుకే ఈయనకు 'కలహభోజనుడు' అని పేరు. నారదుడు ముందు జన్మలో వేదవేదుల యింటి దాసి పుత్రుడు. అందువల్ల ఇతనికి కూడా కొంత బ్రహ్మజ్ఞానం అబ్బింది. నారదుడికి వేదాలరహస్యాలు తెలుసు. అష్టాదశ పురాణాలు అతనికి కరతలామలకం. న్యాయశాస్త్రం, ధర్మశాస్త్రం, సర్వకళలు తెలుసు. నారదుడు ఉత్తమ గాయకుడు. హరిభక్తులలో అగ్రగణ్యుడు. నిత్యం హరినామసంకీర్తన చేస్తూ గీతాలాపన చేస్తూంటాడు. నారదుడు మేధావి, ప్రగల్భుడు, మంచి వక్త.

నారదుడు, మహాభారతములోని సభాపర్వంలో ధర్మరాజుకు రాజనీతిని బోధించినట్లు తెలుస్తుంది. ఇతడు సనత్కుమారుని వల్ల ఆత్మజ్ఞానాన్ని పొందాడు. దానిని శుకుడికి ఇలా బోధించినాడు.

"ఆరయఁ గామము క్రోధము
వైరులు ముక్తి కవి రెండు వారించిన సం
సార మనాకారంబగు
నేరిమి యొండేల ముక్తి నెలవుగనుటకున్"[48]

నారదుని బోధనల వల్ల శుకునిలో వైరాగ్యం కలుగుతుంది. అతడు తపస్సు చేయడానికి హిమాలయాలకు వెళుతాడు.

నారదుడు ఉత్తమ విద్యార్థి. తుంబురుడి మీద మాత్సర్యంతో నారదుడు ఏవిధంగా సంగీతశాస్త్రంలో గొప్ప పాండిత్యాన్ని సంపాదించాడో 'కళాపూర్ణోదయం' అనే ప్రబంధంలో వర్ణించబడింది.

ఒకనాడు శ్రీమహావిష్ణువు, శ్రీదేవితో కలిసి నిండు సభలో కొలువుదీరి ఉండగా, ఆ సభకు నారదుడు, తుంబురుడు, విశ్వావసుడు మొదలైన సంగీత విద్వాంసులు వెళ్ళారు. ఆ సభలో దేవతలు, మునులు,

అప్సరసలు మొదలైన వారున్నారు. శ్రీమన్నారాయణుడు ఒక దూతను పంపి, బయట వేచివున్న తుంబురుడిని సభలోకి పిలిపిస్తాడు. అతని సంగీతాన్ని విని సభలోని వారంతా ఆనందించారు. శ్రీహరి తుంబురుని గానకౌశలాన్ని మెచ్చుకొని ఆయనకు చాలా బహుమతులు ఇచ్చి పంపించాడు. అది చూచి దేవతలు తుంబురుని ఎంతగానో ప్రశంసించారు. తుంబురుడితో పోటీలో నిలువగలిగిన వారు లేరని అందరూ పొగిడినారు. అది విని నారదుడికి తుంబురుడి మీద మాత్సర్యం ఏర్పడింది. అయితే నారదుడు దానిని బయటకు వ్యక్త పరచలేదు. తుంబురుడితో మంచిగానే ఉంటూ, అతని ఇంటికి రాకపోకలు సాగిస్తున్నాడు.

ఒకరోజు నారదుడు, తుంబురుని ఇంటికి వెళతాడు. ఆ సమయంలో తుంబురుడు ఇంట్లో ఉండడు. నారదుడు ఇల్లంతా తిరిగిచూస్తూ, అక్కడ ఉన్న తుంబురుడి వీణను చూస్తాడు. ఆ వీణను మీటుతాడు. అది అపూర్వమైన స్వరాలను పలుకుతుంది. తుంబురుడి గానకౌశలానికి కారణం ఆ వీణ అని తెలుసుకొంటాడు. అక్కడి నుండి వెళ్లిపోతాడు.

ఎలాగైనా గానకళాపోటీలో తుంబురుడిని జయించాలని నిశ్చయించుకుంటాడు. శ్రీమహావిష్ణువును గూర్చి తపస్సు చేస్తాడు. శ్రీహరి ప్రత్యక్షమై ఏమి కావాలని? అడుగుతాడు. నేను గానవిద్యలో తుంబురుడిని అధిగమించాలని నారదుడు శ్రీహరిని కోరుతాడు. శ్రీకృష్ణావతారంలో నీ కోరిక నెరవేరుతుందని శ్రీమహావిష్ణువు చెప్పి అంతర్ధానమౌతాడు.

శ్రీకృష్ణావతారం వరకు నారదుడు నిరీక్షిస్తాడు. రుక్మిణి మొదలైనవారిని శ్రీకృష్ణుడు వివాహం చేసుకొన్నాడు. నారదుడు ప్రతిరోజు దేవలోకం నుండి ద్వారకానగరానికి రాకపోకలు సాగించేవాడు. ఒక సంవత్సరం జాంబవతి దగ్గర, మరొక సంవత్సరం రుక్మిణి దగ్గర, ఇంకొక సంవత్సరం సత్యభామ దగ్గర, చివరగా శ్రీకృష్ణుని దగ్గర మరొక సంవత్సరం సంగీతంలో విశేషాలను తెలుసుకొన్నాడు. గానవిద్యలో సంపూర్ణమైన పాండిత్యాన్ని సంపాదించి, తుంబురుడిని గానవిద్యలో ఓడిస్తాడు.

ఈవిధంగా నారదుడు ఎన్నో సంవత్సరాలు కష్టపడి సంగీతవిద్యను నేర్చుకొన్నాడు. తుంబురుడి మీద మత్సరంతో అతడిమీద యుద్ధానికి పోలేదు, శపించలేదు, అతడి వీణను పగులగొట్టలేదు. ఆ వీణలోని జాణతనాన్ని తెలుసుకొన్నాడు. తనను తాను సరిదిద్దుకున్నాడు. "పూను స్పర్ధను విద్యలందు" అన్నట్లు

నారదుడు తుంబురుడితో స్పర్ధవహించేవాడేగాని కలహించలేదు. స్వయంకృషితో సంగీతసాధన చేసిన ఆదర్శ విద్యార్థి నారదుడు.

6.2.18. శ్రీరామలక్ష్మణులు – విశ్వామిత్రుడు :-

రామాయణంలో కనిపించిన ఆదర్శ గురుశిష్యులు శ్రీరామలక్ష్మణవిశ్వామిత్రులు. గురువు అయిన విశ్వామిత్రుడు బ్రహ్మర్షి. మహా తపస్సంపన్నుడు. గొప్ప అస్త్రశస్త్రపాండిత్యం కలిగినవాడు. శ్రీరామలక్ష్మణులు దశరథుని పుత్రులు. బాల్యంలో తమ కుల గురువు వశిష్ఠుని వద్ద సమస్త రాజవిద్యలు నేర్చుకొన్నారు. రాముడు కోదండవిద్యలో గొప్ప ప్రతిభావంతుడు. లక్ష్మణుడు దీక్షాపరుడు, సుగుణ సంపన్నుడు, సేవా తత్పరుడు, వీరుడు.

విశ్వామిత్రుడు చేస్తున్న యాగానికి తాటక కుమారులైన మారీచసుబాహులు విఘ్నం కలిగిస్తూ ఉంటారు. విశ్వామిత్రుడు గొప్ప అస్త్రశస్త్ర సంపన్నుడు అయి కూడా వారిని ఎదిరించలేకపోయాడు. కారణం విశ్వామిత్రుడు యాగదీక్షలో ఉన్నప్పుడు రాక్ష,సులను చంపకూడదు, మిగిలిన రోజుల్లో వాళ్ళు కనిపించరు. అందువల్ల బయట ఉండి వారి రాకను గమనించి చంపగలిగిన వీరులు కావలసి వచ్చింది విశ్వామిత్రుడికి. దశరథుడి దగ్గరకు వెళ్ళి, శ్రీరాముడిని యాగరక్షణ కోసం పంపించమంటాడు. పుత్రవ్యామోహంతో దశరథుడు మొదట ఒప్పుకోలేదు. కానీ విశ్వామిత్రుడి కోపానికి భయపడి, వశిష్ఠుని సలహామేరకు దశరథుడు శ్రీరామునికి లక్ష్మణుని తోడిచ్చి విశ్వామిత్రుని వెంట పంపిస్తాడు.

శ్రీరామలక్ష్మణులకు రాక్షసులను ఎదురించి నిలబడగల శక్తి కలగడం కోసం విశ్వామిత్రుడు వారికి బల, అతిబల అనే దివ్యమంత్రశక్తులను ప్రసాదిస్తాడు.

అంతేగాక విశ్వామిత్రుడు వారికి క్రింది అమోఘమైన అస్త్రాలను కూడా ప్రయోగోపసంహారాలతో ప్రసాదించాడు.

అవి:– దండచక్రం, ధర్మచక్రం, కాలచక్రం, విష్ణుచక్రం, ఇంద్రచక్రం, వజ్రాస్త్రము, శైవాస్త్రము, శూలవత్, బ్రహ్మశీర్షము, ఐషికాస్త్రం, బ్రహ్మాస్త్రము, శిఖరిగదాస్త్రము, ధర్మపాశం, కాలపాశం మొదలైనవి వందకు పైగా అస్త్రాలను ప్రసాదించాడు.

విశ్వామిత్రుడు, శ్రీరామునికి దివ్యమైన అస్త్రాలను ప్రసాదించుటకు అతనికి గల అర్హతలు ఏమిటో క్రింది విధంగా తెలిపాడు.

"అమల గుణపాత్రభూతుండ వగుటఁజేసి
నీకు నొసఁగితి నీయస్త్ర నిచయమెల్ల
సమ్మతిఁ బ్రతి గ్రహింపుము సంతతంబు,
శుభము వీర్యంబు తేజంబు సుఖము గలుగు"[49]

నిర్మలమైన గుణము కలవాడు కాబట్టి శ్రీరామునికి పై అస్త్రాలను ప్రసాదించానని విశ్వామిత్రుడు పలికాడు. భృశాశ్వతనయులనెడు అస్త్రాలను కూడా ఇతడు నేర్పించాడు.

విశ్వామిత్రుడికి శ్రీరాముని మీద ఎంతటి వాత్సల్యం ఉందో క్రింది వచనాన్ని గమనిస్తే తెలుస్తుంది. "విశ్వామిత్ర్తుండు తాటకావధతోషితుండై జగత్పవిత్రుండగు కౌశల్యాపుత్రుని బాహువులం బరిరంభించి శిరంబు మూర్కొని మందమధురాలాపంబుల నిట్లనియె"[50]. శిష్యుల పట్ల వాత్సల్యం, వారిని మహావీరులుగా తీర్చిదిద్దడం గురువుగా విశ్వామిత్రుడు సాధించిన విజయాలు. తాను చేయలేని పని తన శిష్యుల చేత చేయించి కృతకృత్యుడైనాడు.

6.2.19. లవకుశులు – విద్యాభ్యాసం :-

నిందలపాలైన సీత అడవుల పాలైంది. గర్భిణిగా ఉన్న ఆమెను వాల్మీకి ఆదరించి ఆశ్రయం కల్పిస్తాడు. ఆ ముని ఆశ్రమంలోనే సీతమ్మ లవకుశులనే కవలలకు జన్మనిచ్చింది. వాల్మీకి ఎంతో శ్రద్ధతో వారిని పెంచి, ఉపనయనం చేసి విద్యాబుద్ధులు చెప్పిస్తాడు. తాను రచించిన రామాయణ మహాకావ్యాన్ని ఆ బాలకుల చేత గానం చేయిస్తాడు. ఊరూరా తిరుగుతూ వారు రామాయణగానం చేస్తారు. ఒకనాడు శ్రీరాముడు వారిని తన అంతఃపురానికి పిలిపించుకొని వారి పాటల్ని విని మురిసిపోతాడు.

లవకుశులు గొప్ప అస్త్రశస్త్ర విద్యల్ని నేర్చుకున్నారు. శ్రీరాముడితో సమానమైన ప్రతాపశౌర్యులు కలవారు. అశ్వమేధయాగం సందర్భంలో, యాగాశ్వాన్ని లవకుశులు బంధిస్తారు. లక్ష్మణశత్రుఘ్నులను ఎదిరిస్తారు. చివరకు శ్రీరాముడితో కూడా యుద్ధానికి దిగుతారు. ఈ విధంగా లవకుశులు వీరులుగా, గురుశుశ్రూషాపరులైన ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దబడ్డారు.

6.2.20. ఆంజనేయుడు – విద్యాభ్యాసం :-

ఇతడు వాయుదేవుని అనుగ్రహం వల్ల అంజనాదేవి, కేసరి దంపతులకు జన్మించాడు. ఇతడు బ్రహ్మాది దేవతల వల్ల అమోఘమైన వరాల్నిపొందాడు. ఆంజనేయుడు ఉదయిస్తున్న సూర్యుడిని మ్రింగడానికి ప్రయత్నించి, ఇంద్రుని వజ్రాయుధంతో బాధించబడ్డాడు. దానికి ప్రతిఫలంగా దేవతలు అతనికి చిరంజీవిగా బ్రతికే వరాన్నిచ్చారు. హనుమంతుడు సూర్యుడి వద్ద వేదవేదాంగాలు, సకల అస్త్రశస్త్రవిద్యలు నేర్చుకున్నాడు. శ్రీరామునికి సేవకుడై విశ్వాసంతో సేవలు చేశాడు. అవసరమైన సందర్భంలో మహావీరుడిగా మారి ఎందరో రాక్షసుల్ని చంపాడు. సంజీవని పర్వతాన్ని తెచ్చి లక్ష్మణుని బ్రతికించాడు. ఇతడు వీరుడైన వివేకి.

6.2.21. రావణుడు – విద్యలు :-

ఇతడు విశ్వావసుడు, కౌశికి అనే దంపతుల ప్రథమ సంతానం. కుబేరుడు ఇతని సవతి సోదరుడు. విభీషణ, కుంభకర్ణ, శూర్పణఖ ఇతనికి తోడబుట్టినవారు. రావణుడు గొప్పవీరుడు. వేదవేదాంగాలు చదివినవాడు. బ్రహ్మజ్ఞానం కలిగిన బ్రాహ్మణుడు. ఇతడు శివభక్తులలో అగ్రగణ్యుడు. తన భుజబలంతో కైలాస పర్వతాన్నే పెకలించివేసినాడు. ఆత్మలింగాన్ని సాధించి అమ్మకు కానుకగా ఇవ్వాలని గొప్ప తపస్సు చేశాడు. ఇతడు వీణావదనలో గొప్ప పాండిత్యం కలవాడు. శ్రీరాముడు సముద్రం మీద వారధిని నిర్మించడానికి, సుముహూర్తం చూసి యుద్ధం ప్రకటించడానికి తగిన బ్రాహ్మణుడు కావాలని ఆలోచిస్తాడు. ఆ సందర్భంలో శ్రీరాముడు రావణుని ఉత్తమ పురోహితునిగా భావించి, అతని చేతనే ముహూర్తం పెట్టిస్తాడు. రావణుని పాండిత్యం ముందు తన పాండిత్యం ఎందుకూ పనికిరాదని రాముడే స్వయంగా అంగీకరించాడు. మాతృభక్తి, శివభక్తి, వీరత్వం ఇతనిలోని గుణాలు. పరస్త్రీని చెరబట్టడం, హరి భక్తులను, మునులను హింసించడం, గొప్ప వీరుడననే గర్వం ఇతనిలోని లోపాలు. మొత్తం మీద రావణుడు బ్రహ్మజ్ఞానిగా కనిపిస్తాడు. కానీ అసూయాద్వేషాలు అతడి పాండిత్యాన్ని మించి ప్రజలకు కీడు చేశాయి.

6.2.22. శుకయోగి – విద్యార్జన :-

శుకుడు వ్యాసమహర్షి కుమారుడు. సద్యోయౌవనం కలవాడు. మహాజ్ఞాని. ఉత్తమ వ్యక్తిత్వం కలవాడు. సకల శాస్త్రాలు, పురాణేతిహాసాలు చదువుకున్నాడు. స్వయంగా వ్యాసుడే శుకుడికి అన్ని విద్యలు నేర్పించాడు. అయితే నారదుని ప్రేరణతో శుకుడు సూర్యుడి వద్ద యోగవిద్యను అభ్యసించాడు. ఈ సందర్భంలో శుకయోగి, నారదుడితో ఇలా అన్నాడు. "మహర్షీ! నీ వాగమృతంగ్రోలటంతో నా మనస్సుకు స్వస్థత చేకూరింది. చరితార్థుడను అయ్యాను. సూర్యభగవానుడి దయవలన యోగసిద్ధి పొందుతాను. రాగద్వేషాలు, ధర్మాధర్మాలు, సత్యాసత్యాలు మొదలైనవన్నీ పరిత్యజిస్తాను"[51]. ఈ విధంగా పలికి హిమాలయాలకు బయలుదేరుతాడు శుకుడు. 'నాయనా! నా కన్నులకు ఆనందం కలిగిస్తున్నావు. కాసేపు ఆగివెళ్ళమని వ్యాసుడు అడిగాడు. కానీ శుకుడి మనస్సులో ఏ స్నేహమూలేదు, ఏ సంశయమూ లేదు. నిర్మమంగా బయలుదేరి వెళ్ళిపోయాడు'. కఠోరపరిశ్రమ చేసి, దీక్షతో సూర్యుడి వద్ద యోగవిద్యను అభ్యసించాడు. ఇంద్రియనిగ్రహం, దీక్ష, ఏకాగ్రత ఈ విద్యార్థిలోని లక్షణాలు.

శుకుడు యోగసాధనతో పాటు, మోక్ష సాధన కూడా చేశాడు. శుకుడు బాల్యంలో ఉన్నప్పుడు, తోటి మునికుమారుల సహవాసం వల్ల ఆటలలోపడి ధ్యానం చేయలేకపోతున్నాడని వ్యాసుడు అతనికి సాంఖ్యయోగశాస్త్రాలను బోధించి అహంకార మమకారాల నుండి విముక్తుడిని చేశాడు. జ్ఞానోదయమైన శుకుడు విరాగి అయ్యాడు. 'మోక్షాన్ని ఇచ్చేది ఏది?' అనే విషయాన్ని తనకు బోధించమని కోరుతాడు.

తనకుమారుడు మోక్షమార్గాన్ని గురించి తెలుసుకోవాలని ఆశతో ఉన్నాడని వ్యాసుడు గ్రహిస్తాడు. శుకుడుతో ఇట్లా అంటాడు. "నాయనా! విదేహాధిపతి జనకమహారాజు ఉన్నాడు. నీవు వినయంగా! గౌరవంగా ఆయన దగ్గరకు వెళ్ళుము"[52]. విద్యాభ్యాసానికి పంపించేటప్పుడు శుకుడికి వ్యాసుడు క్రింది జాగ్రత్తలు చెప్పాడు. 'నాయనా! ఆకాశమార్గంలో వెళ్ళవద్దు. పాదచారివై ప్రయాణం చేసి, మిథిలానగరం చేరుకో. జనకుడంటే మునులకు కూడా గౌరవింపదగినవాడు. ఆయన నీకు మోక్షధర్మం ఉపదేశిస్తాడు. కుమారా! ఆ జనకమహారాజు పట్ల అహంకారం చూపటం గానీ, మమకారం ప్రదర్శించటం గానీ ఎవ్వరికీ తగదు. అతడు పూజింపదగినవాడు. అందువల్ల వినయం ఒక్కటే కర్తవ్యం సుమా!'[53]. దీన్నిబట్టి విద్యార్థికి వినయం ముఖ్యమని, ఎంతవాడైనా పాదచారిగా గురువును చేరుకోవాలని తెలుస్తున్నది.

తండ్రి చెప్పిన విధంగానే శుకుడు పాదచారియై బయలుదేరాడు. మేరువు మొదలైన పర్వతాలు దాటాడు. నదులు ఈదాడు. ఎన్నో పుణ్యక్షేత్రాలు దర్శించాడు. చివరకి భరతఖండం చేరుకొన్నాడు. దారిలో దేన్ని చూసినా చాడనివాడి లాగా ప్రయాణించి మిథిలానగరాన్ని చేరుకొన్నాడు. ప్రాకారద్వారం దగ్గర కావలివారు అడ్డగించారు. శుకుడు కోపించలేదు. ప్రశాంతంగా నిలిచాడు. ఆ ప్రశాంతతని చూసి, ద్వారపాలకులు కంగారుపడి లోపలికి వర్తమానం పంపి సగౌరవంగా రాజగృహం వైపు పంపించారు. రాజగృహద్వారంలో సేవకులు అడ్డుతగిలారు. అప్పుడూ శుకుడు ప్రశాంతంగా నిలబడ్డాడు. ప్రతిహారులు గబగబా లోపలికి వెళ్ళి రాజుగారికి విషయం చెపుతారు. జనకమహారాజు మంత్రిని పంపించి వచ్చిందెవరో తెలుసుకుంటాడు. వచ్చింది శుకయోగి అని తెలుసుకొని అతనికి మనస్సులో భక్తి, వినయము, సంభ్రమము ముప్పేటగా అలముకొన్నాయి. మంత్రులూ, పండితులూ వెంటరాగా జనకమహారాజు శుకుడికి స్వాగతం పలకడానికి బయలుదేరాడు. ఇది అతనిలోని గొప్పదనాన్ని సూచిస్తున్నది. మహారాజు అయినా, గొప్ప పండితుడు అయినా, సకల ధర్మాలు తెలిసినా నిగర్విగా జనక మహారాజు పాదచారిగా ఎదురువెళతాడు. ఇదీ ఆనాటి ఉత్తమ సంస్కారం.

జనకమహారాజు, శుకుడిని అర్ఘ్యపాద్యాలతో అర్చించాడు. గోవును బహూకరించాడు. వెంటవుండి అతిథి గృహానికి తీసుకువెళ్ళాడు. సముచితాసనం మీద శుకుడిని కూర్చోబెట్టాడు. జనకుడు, అతని మంత్రులు నేలమీద కూర్చున్నారు. సౌందర్యంలోనూ, విలాసాలలలోనూ అప్సరసలను మించిన వేశ్యలు వచ్చి తమ సంగీతంతో, నృత్యప్రదర్శనలతో శుకుడిని అర్చించారు. కానీ ఇంద్రియ వికారాలు ఏమీలేని నిశ్చలస్థితిలో శుకుడు వాటిని ఆలకించాడు, తిలకించాడు.

మరుసటి రోజు ఉదయాన జనకమహారాజు పండిత సమేతంగా శుకుడి దగ్గరకు వస్తాడు. 'ఏమి కార్యం మీద తమరు వచ్చారు?' అని శుకుడిని అడిగాడు. తనకు మోక్షాన్ని గూర్చి తెలుసుకోవాలని ఉందని, అందుకోసం తమరి ఉపదేశం కోసం వచ్చానని చెపుతాడు. జనకమహారాజు ఎంతో వినయంగా శుకమహర్షికి మోక్షమార్గాన్ని గురించి తెలుపుతాడు. శుకుడు, జనకుడి దగ్గర సెలవు తీసుకొని వ్యాసుడి దగ్గరకు తిరుగుప్రయాణం అయ్యాడు. వచ్చేటప్పుడు ఆకాశమార్గంలో వాయువేగ మనోవేగాలతో ప్రయాణించి తండ్రిని చేరుకుంటాడు.

ఎన్నో కష్టాలకు ఓర్చుకొని శుకుడు విద్యార్థిగా కాలినడకన గురువును చేరాడు. వినయవిధేయలతో అతడిని మెప్పించి మోక్షవిద్యను గురించి తెలుసుకున్నాడు. తిరిగి వచ్చేటప్పుడు స్వేచ్ఛగా ఆకాశమార్గంలో ప్రయాణించాడు. ఈవిధంగా శుకుడు ఆదర్శవిద్యార్థి అయ్యాడు. గర్వంలేని పాండిత్యం, సత్ప్రవర్తన, సహనశీలత, దీక్ష ఇతనిలోని మంచి లక్షణాలు.

6.2.23. ఇందీవరాక్షుడు – ఆయుర్వేద విద్య :-

ఇందీవరాక్షుడి పాత్ర మనుచరిత్ర ప్రబంధంలో కనిపిస్తుంది. ఇతడు ఏవిధంగా ఆయుర్వేద విద్యను నేర్చుకున్నది 'భౌతికవిద్యలు' అన్న అధ్యాయంలో చర్చించాను. ప్రస్తుతం ఇందీవరాక్షుడికి, అతని గురువుకు మధ్య ఉన్న సంబంధాన్ని సంక్షిప్తంగా వివరిస్తున్నాను.

ఇందీవరాక్షుడు గంధర్వరాజైన నలనాభుడి కుమారుడు. బ్రహ్మమిత్రుడనే ఆయుర్వేద గురువు వద్దకు ఇందీవరాక్షుడు వెళ్ళి తనకు ఆయుర్వేదాన్ని నేర్పమని అడిగాడు. గంధర్వులకు ఆయుర్వేదం నేర్పించనని, గంధర్వులు ఆయుర్వేదం చదవటానికి అర్హులు కారని క్రింది విధంగా అంటాడు.

"నట విట గాయక గణికా/ కుటిల వచ శ్శీథురసము గ్రోలెడు చెవికిం
గటు వీ శాస్త్రము వల ది/చ్చట నినుఁ జదివింపకున్న జరుగదె మాకున్"?[54]

ఈవిధంగా అవమానకరంగా మాట్లాడేసరికి ఇందీవరాక్షుడికి అతని మీద తీవ్రమైన కోపం వచ్చింది. గురువుతో ఇలా అంటాడు ఇందీవరాక్షుడు. 'జ్ఞానహీనుడవైన ఓ మునీ! నీ దగ్గర చదువును ఆరంభిస్తానని ఎవ్వడైనా తన ఐశ్వర్యాన్ని పోగొట్టుకొని బిచ్చమెత్తుకోకూడదు కదా! మంచి చెడ్డలు ఆలోచించక లేనిపోనివి పలుకుతున్నావు. నీకు చదువు ఎందుకు? నీకు వైద్యమెందుకు? నాకు సరిపడదని సిగ్గుపడుము'[55] అని గురువును నిందిస్తాడు. మహాభారతంలో, ద్రోణాచార్యుడు విద్యార్థియై వచ్చిన ఏకలవ్యుడికి కులం కారణంగా చదువుచెప్పను అంటాడు. ఏకలవ్యుడు మారుమాట్లాడకుండా, అడవికి వెళ్ళి ద్రోణుడి ప్రతిమను చేసి, ఆరాధించి సకల విద్యలు నేర్చుకున్నాడు. చివరకు గురువుకు దక్షిణగా కుడిచేత బొటనవ్రేలును నరికిస్తాడు. నిష్కపటమైన, నిజాయితీ గల విద్యార్థి ఏకలవ్యుడు. కానీ ఇందీవరాక్షుడు, చదువు చెప్పనన్న గురువును నిందించాడు. మారువేషం వేసి, బ్రాహ్మణ రూపంలో గురువు దగ్గర ఆయుర్వేద విద్యనభ్యసించాడు. మోసం, క్రోధం, స్వార్థం ఈ విద్యార్థిలోని లక్షణాలు. ఏకలవ్యుడు గురువును మించిన శిష్యుడు అనిపించుకొంటే,

ఇందీవరాక్షుడు గురువును ముంచిన శిష్యుడయ్యాడు. చివరకు గురువును హేళనచేసి, అతని కోపాగ్నికి గురయ్యాడు. రాక్షసరూపాన్ని పొందాడు.

ఈవిధంగా ఇందీవరాక్షుడు, గురుశిష్యుల సంబంధాన్ని, సనాతన విద్యా సంప్రదాయాన్ని పాటించలేదు. దుష్ప్రవర్తన, దుష్టాలోచన, క్రోధం ఇతని పతనానికి కారణాలయ్యాయి.

6.2.24. అయుతనియుతులు – గురుశిష్యసంబంధాలు :-

పూర్వం అగస్త్య మహర్షికి ఆయుతుడు, నియుతుడు అనే ఇద్దరు శిష్యులు ఉండేవారు. వీరి తండ్రి ప్రయుతుడు. అగస్త్యునికి ఆయుతనియుతులు ప్రియశిష్యులు. అందువల్ల వారిద్దరికీ మంచి కన్యలను తీసుకువచ్చి పెళ్ళి చేయాలని అగస్త్యమహర్షి నిశ్చయించాడు. అగస్త్యునికి, ఆ శిష్యుల మీద అంతటి శిష్యవాత్సల్యం కలగానికి కారణం వారి అకుంఠిత విద్యాభ్యాసం. దీన్ని తెనాలిరామకృష్ణకవి క్రింది విధంగా వర్ణించాడు.

"వాసోనిగ్రహ మెన్న; రాఁకలియు నీర్వట్టున్ గణింపర్; తలల్
మానెంగా యన; రంగముల్ బడలినన్ బాటింప; రట్లుండనీ
యాసాయంబుగ నానిశాత్యయముగా నామ్నాయముల్ క్రోల్చుచో
నాసీన ప్రచలాయితం బయిన లే దాహా! వితర్కింపఁగన్."[56]

ఆ శిష్యులిద్దరూ గుడ్డమాసినది అనుకోరు. ఆకలి దప్పికలు ఎరుగరు. తలలు మాసినవని లేదు. వారికి శ్రమలేదు. ప్రొద్దు క్రుంకు వరకు, తెల్లవారు వరకు అదియే పని ---- చదువుట --- కూర్చొన్న చోటు నుండి కదలరు. ఇవి ఉత్తమ విద్యార్థుల లక్షణాలు. చదువు పట్ల వీరికున్న ఈ శ్రద్ధాభక్తులే అగస్త్యుని సంతోషపరిచాయి. అందుకనే ఆ శిష్యులిద్దరికీ తగిన కన్యలకోసం బ్రహ్మలోకానికి వెళుతాడు. బ్రహ్మదేవునికి గాయత్రి, సావిత్రి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిని ఆయుతనియుతులకిమ్మని అగస్త్యుడు కోరాడు. బ్రహ్మదేవుడు సంతోషంగా ఆ కన్యలిద్దరినీ అగస్త్యుని వెంట పంపించాడు.

కానీ ఆయుతుడు వివాహం చేసుకోవడానికి నిరాకరిస్తాడు. గృహస్థాశ్రమం స్వీకరించడం వల్ల తపస్సు పాడవుతుందని, అందువల్ల ముక్తిని పొందటం సాధ్యం కాదని అతని అభిప్రాయం. అందువల్ల

అగస్త్యుడు ఆ కన్యలిద్దరినీ నియుతుడికిచ్చి వివాహం చేశాడు. అగస్త్యుడు, అయుతుడిని ఆశ్రమం నుండి బహిష్కరించాడు.

అగస్త్యుడి కోపానికి గురియై, అయుతుడు హిమాలయ పర్వతాలను చేరాడు. అక్కడ మోక్షం కోసం ఘోరమైన తపస్సు ప్రారంభించాడు. అతని తపస్సుకు ముల్లోకాలు భయపడ్డాయి. ఇంద్రుడు అతని తపస్సును ఎలాగైనా చెడగొట్టాలని అనుకొంటాడు. కపట బ్రాహ్మణుడిగా అయుతుడి వద్దకు వస్తాడు. అతని కథ అడిగి తెలుసుకుంటాడు. గృహస్థాశ్రమం పట్ల నిరసన పనికిరాదని ఆ ఆశ్రమం యొక్క గొప్పదనాన్ని తెలియజేస్తాడు. కానీ అయుతుడు అంగీకరించలేదు. పైగా గృహస్థాశ్రమం వల్ల చిదానందం కలగదని ఇంద్రునితో ఇలా అంటాడు.

"కందర్పాస్త్రములంచు, నంచిత తటిత్కాండంబులంచున్, సుధా
మందస్యందములంచుఁ, గాంచనలతా మత్తల్లులంచున్, సుధీ
బృందముల్ ధ్వని నిందలన్ దెగడు నీ బింబోష్ఠులందెల్లనా
నందాభాసమె కాక, భాసితచిదానందంబు పెంపొందునే!"[57]

దీనితో ఇంద్రుడికి కోపం వచ్చింది. ఎలాగైనా అయుతుడిని సంసారిని చేయాలని సంకల్పిస్తాడు. తన వెంట తీసుకువచ్చిన ఆవును, దూడను అతని వద్ద విడిచివెళ్ళిపోతాడు. కొంతకాలానికి ఆవు చిక్కి శల్యం అయ్యింది. గోహత్య చుట్టుకొంటుందని భయపడి అయుతుడు దాని పోషణ, రక్షణ చేయడం ప్రారంభించాడు.

అయుతుని గోసేవ వల్ల అతని తపస్సు పాడైంది. ధ్యానం పట్టుదప్పింది. ఏ గృహస్థాశ్రమాన్ని వద్దన్నాడో, అది ఇప్పుడు అతని మెడకే చుట్టుకొన్నది. ఈ సందర్భాన్ని తెనాలిరామకృష్ణకవి ఇలా వర్ణించాడు.

"పడఁబడనెత్త బాల్పడియున్కి నాసనా
భ్యాస నైపుణశక్తి పట్టువదలె;
నులపాంకురములేర్చి యులుపవట్టెడు పూన్కిఁ
గుశవల్ల వాహృతి కుంటువడియె;
సడలంగ మెడరజ్జు గడువడినిడు తమి
నక్షసూత్రావృత్తి యవలఁ జనియెఁ;
బొలయూడ్చితినుటకుఁ బొలయు పుల్గులఁబోవ

నదలిఁచు హుకృతిఁ జెదెర మంత్ర;
మాసలన్నియు మొదలంటఁ గోసియున్న
గోఁచికట్టునటువంటి గొడవ గడవ
రాక మెడఁ జుట్టుకొనియె; నూరక యకార్య
కరుణ శీలుర కెప్పాటఁ గలదె సుఖము!"[58]

ఆవును పోషించడంలో అయుతుడు ఏవిధంగా పతనమైనాడో వర్ణించబడింది. అకార్యాలు చేయడం వల్ల అటు గృహస్థుడూ కాలేక, ఇటు తపస్సూ చేయలేక రెంటికీ చెడ్డ రేవడి లాగా తయారయ్యాడు అయుతుడు. పెద్దలు, గురుపులు చెప్పినట్లు నడుచుకోవడం ఉత్తమ విద్యార్థుల లక్షణం. దానికి భిన్నంగా, లోక విరుద్ధంగా ప్రవర్తిస్తే, దాని ఫలితాలు ఎలా ఉంటాయో ఈ కథలో తెలియజేయబడింది. విద్యార్జన తర్వాత బ్రహ్మచారి, గృహస్థుడు కావాలి. దాని వల్ల సృష్టికార్యం కొనసాగుతుంది. అందరూ సన్యాసులైతే ప్రపంచమే నాశనమౌతుంది. అందుకే అన్ని ఆశ్రమాల్లో కన్నా గృహస్థాశ్రమమే గొప్పదంటారు.

అయుతుడు గోసంరక్షణ వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాడు. అది ప్రక్కన ఉన్న ముసల పొలాల్లో పడి పంటను నాశనం చేయడం ప్రారంభించింది. ముసల ఆశ్రమాల్లో అల్లకల్లోలం సృష్టించేది. ఆవును అదుపులో పెట్టడానికి అయుతుడు దాని మెడకు ఒక దూలం కడతాడు. కాళ్ళకు బంధాలను వేస్తాడు. ఒరకోజు ఆవు ప్రక్కనే ఉన్న వాధూలముని పుట్టను పొడుస్తుంది. ఆ పుట్టలో తపస్సు చేస్తున్నముని బయటకు వచ్చి, ఆయుతుడిని కప్పవు కమ్మని శపించాడు. అయుతుడు ఆ మునిని శరణువేడాడు. పాండురంగని సన్నిధిలో నీకు శాపవిముక్తి అవుతుందని ముని అంటాడు.

అయుతుడు అన్ని క్షేత్రాలు తిరుగుతూ, చివరకు పాండురంగక్షేత్రం చేరుకుంటాడు. అక్కడ బంగారు కప్పగా మారుతాడు. ఒకరోజు కన్యాకుబ్జ నగరాధీశ్వరుని కూతురు, ఆమె చెలికత్తెలు నృసింహస్వామిని చూడటానికి వస్తారు. వాళ్ళు కప్పగా మారిన అయుతుని చూసి, దానితో ఆడుతూ, తీసుకెళ్ళి అక్కడ ఉన్న ఒక ముసలి బ్రాహ్మణుడి మీద వేస్తారు. అతడు ఆ కన్యలందరినీ కప్పలు కమ్మని శపిస్తాడు. అయుతుడికి, ఆ ఆడ కప్పలకి జోడు కుదిరింది. చివరకు పాండురంగక్షేత్రంలోనే అయుతుడు శాపవిమోచనం పొంది, ముక్తిని పొందుతాడు.

గురువు మాటను అనుసరించిన నియుతుడు గృహస్థుడై సర్వసుఖాలు అనుభవించాడు. ఉత్తమ గృహస్థుడై గురుకార్యాన్ని, తన కార్యాన్ని అతడు చేయగలిగాడు. కానీ అయుతుడు లోక విరుద్ధమైన ఆజన్మ బ్రహ్మచర్యానికి పూనుకొన్నాడు. గురువు మాటను అతిక్రమించాడు. దానివల్ల ఎన్నోకష్టాలు పడ్డాడు. చివరకు కప్పగా మారి, గృహస్థుడై మోక్షాన్ని పొందగలిగాడు. ఈ కథ వల్ల గురువు వాక్కు గొప్పదని, గురువు చూపిన దారిలో నడిచిన విద్యార్థి సుఖసంతోషాలను పొందగలడని తెలుస్తున్నది. గురుశిష్యుల సంబంధాలను తెలిపే ఆనాటి కథలలో అయుతనియుతోపాఖ్యానం చాలా విశిష్ఠమైంది.

6.3. ఉపనయనము :–

భారతీయ సంప్రదాయం ప్రకారం విద్యాసంస్కారాలు జరిపిన తర్వాత బాలురు విద్యార్థులుగా లేదా వటులుగా మారేవారు. ఈ విద్యాసంస్కారాల్లో ఉపనయనము ఒకటి. దీని గురించి వెనుకటి పుటలలో కొంత ప్రస్తావించడం జరిగింది. 'ఉప' అంటే 'దగ్గరగా' అని అర్థం. చదువుకోదలచుకున్న బాలుడిని తల్లిదండ్రుల నుండి దూరం చేసి, గురువుకు దగ్గర చేసేదే ఉపనయనము. తల్లిదండ్రులు భౌతిక శరీరాన్ని ప్రసాదించగా, గురువు జ్ఞానశరీరాన్ని ప్రసాదిస్తున్నాడు. తల్లిదండ్రులు, తమబిడ్డను గురువు గారికి అప్పగించే సందర్భంలో చేసే శాస్త్రకర్మనే ఉపనయనం అంటారు. దీని గురించి మనుధర్మశాస్త్రంలో క్రింది విధంగా చెప్పబడింది.

"గర్భాష్టమేఽబ్దే కుర్వీత బ్రాహ్మణస్యోపనాయనమ్,
గర్భాదేకాదశే రాజ్ఞో గర్భాత్తు ద్వాదశే విశః"[59]

బ్రాహ్మణులకు ఎనిమిదవ యేట, క్షత్రియులకు పదవయేట, వైశ్యునికి పదకొండవయేట ఉపనయనము చేయాలి. ఇది ప్రాచీన భారతీయులు పాటించిన సంప్రదాయం. బ్రహ్మవర్చస్సును కోరే విప్రుడికి అయిదవ యేట, చతరంగబలము కోరే క్షత్రియునికి ఆఱవయేట, బహుకృష్యాదులను కోరే వైశ్యునికి ఎనిమిదవయేట ఉపనయనము చేయవలసి ఉంటుంది.

బ్రాహ్మణులకు పదహారవ సంవత్సరం వరకు, క్షత్రియునికి ఇరవై రెండవ సంవత్సరం వరకు, వైశ్యునికి ఇరవై నాల్గవ సంవత్సరం వరకు గాయత్రి నశించదు. ఈ కాలాన్ని అతిక్రమించి ఉపనయనం చేయకపోతే, అటువంటివారిని 'వ్రాత్యు'లనే పేరుతో తమ కులం నుండి బహిష్కరించేవారని మనుధర్మశాస్త్రంలో చెప్పబడింది.

"అత ఊర్ధ్వం త్రయోప్యేతే యథాకాలమసంస్కృతాః,
సావిత్రీపతితా వ్రాత్యా భవంత్యార్యవిగర్హి తాః" [60]

ఉపనయనానికి ముందు, బాలుడు తల్లి దగ్గర చివరిసారిగా భుజించాలి. ఉపనయన సమయంలో, గురువు శిష్యుడికి గాయత్రీమంత్రాన్ని ఉపదేశించేవాడు. వటుడు కౌపీనాన్ని, మేఖలను, యజ్ఞోపవీతాన్ని ధరించాలి. అజినము, దండము ధరించాలి. ఉపనయన సమయంలో గురువు, విద్యార్థి వక్షస్థలాన్ని స్పృశించడం జరిగేది. విద్య హృదయగతం కావాలని, గురుశిష్యుల మధ్య సత్సంబంధం ఏర్పడాలని దీని అంతరార్థం. ఈ సమయంలోనే గురువు, విద్యార్థిని బండమీద నిలబెట్టేవాడు. అంటే అతడు జీవితంలో గొప్పవాడు కావాలని అర్థం. గురువు శిష్యుని చేతిని పట్టుకొనేవాడు. ఇక నుండి శిష్యుని బాధ్యత తనది అని అంతరార్థం.

ఉపనయనం ముగిసిన తర్వాత గురువు, విద్యార్థికి అతను చేయవలసిన విధులను గురించి తెలిపేవాడు. నీటిని స్వీకరించమని, స్వధర్మాన్ని ఆచరించమని, పగటిపూట నిద్రపోకూడదని, మౌనం పాటించాలని, వినయవిధేయతలు కలిగి ఉండాలని, వేదాధ్యయనాన్ని నిర్లక్ష్యం చేయవద్దని, మంచి పనులను చేయమని, చెడు పనులకు దూరంగా ఉండమని, ఉదయం, సాయంత్రం భిక్షకు వెళ్ళాలని, బ్రహ్మచర్యాన్ని పాటించమని చెప్పేవాడు. దీనితో ఉపనయన కార్యక్రమం ముగుస్తుంది.

6.4. సమావర్తనం:-

గురుకులం నుండి గురువు, శిష్యునికి వీడ్కోలు పలికే సందర్భాన్నే సమావర్తనం అంటారు. చదువు పూర్తి అయిన తర్వాత గురువు శిష్యుడితో క్రింది విధంగా పలికేవాడు. "సత్యంవద, ధర్మంచర, స్వాధ్యాయాన్ మా ప్రమదః, ఆచార్యాయ ప్రియంధన మాహృత్య ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః సత్యాన్న ప్రమదితవ్యమ్, ధర్మాన్న ప్రమదితవ్యమ్ మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ యాన్యనవద్యాని కర్మాణి తానిసేవితవ్యాని యాన్యస్మాకం సుచరితాని తాని త్వయోపాస్యాని"[61].

సత్యమునే పలుకవలెను, వేదవిహిత కర్మలను పాటించాలి, ధర్మాన్ని తప్పకుండా నడుచుకోవాలి, స్వాధ్యాయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టవద్దు, గురువుకు ప్రియమైన దక్షిణ సమర్పించి గృహస్థాశ్రమాన్ని స్వీకరించు. సంతానాన్ని పొందవలెను. సంపాదన, ఆరోగ్యం, అధ్యయనం, అధ్యాపనం.

వీటిలో సోమరితనం పనికిరాదు. తల్లిదండ్రులు, గురువు, అతిథి దైవంతో సమానం. వారిని గౌరవించు. నువ్వు నాలోని మంచిని మాత్రమే గ్రహించు. నాలో ఏవైనా చెడు లక్షణాలు ఉంటే వాటిని విడిచిపెట్టు అని పై ఉపనిషత్ వాక్యానికి అర్థం.

ఇంతటి గొప్ప సంప్రదాయం మిగిలిన సంస్కృతుల్లో మనకు కనిపించదు. ఇది సనాతన భారతీయ విద్యా సంప్రదాయంలోని గొప్పదనం. విద్యార్థికి కూడా గురువుతో సమానమైన గౌరవాన్ని ఇవ్వడం, తనలోని మంచిని మాత్రమే స్వీకరించమని గురువు పలకడం ఆనాటి గురుశిష్యసంబంధాలు ఎంత ఆదర్శప్రాయంగా ఉండేవో తెలుపుతున్నాయి. విద్య గర్వాన్ని పోగొట్టాలి, అహంకారాన్ని నాశనం చేయాలి. అప్పుడే హృదయవికాసం కలుగుతుంది. హృదయం వికసించినవాడే ఉత్తముడైన మానవుడుగా రూపొందుతాడు. మన ప్రాచీన విద్యావిధానం మానవుడి హృదయవికాసాన్ని కాంక్షించింది. మనిషిని ప్రకృతిలో మమేకం చేసి, అతడిలో మానవీయతను తీసుకువచ్చింది.

6.5. గురుదక్షిణ :-

విద్యాభ్యాసం ముగిసిన తర్వాత, శిష్యుడు గృహస్థాశ్రమాన్ని స్వీకరించదలచి గురుదక్షిణ చెల్లించేవాడు. తర్వాత గురుకులం నుండి తల్లిదండ్రుల వద్దకు తిరిగి వెళ్ళేవాడు. గురుదక్షిణ చెల్లించకపోవడం మహాపాపంగా చెప్పబడింది. గురుదక్షిణ చెల్లించటం వల్ల కలిగే ప్రయోజనాన్ని నన్నయ క్రింది విధంగా వర్ణించాడు. ఉదంకుడు గురుదక్షిణ చెల్లించిన సందర్భంలో, గురువు పలికిన పలుకులివి.

"కరమిష్టము సేసితిమా
కరి సూదన దీన నీకునగు సత్ఫలముల్
గురుకార్య నిరతులగు స
త్పురుషులకగు టరుదెయధిక పుణ్యఫలంబుల్"[62]

గురుకార్యం చేయడం వల్ల కలిగే పుణ్యఫలం అధికమైంది. దాన్ని లెక్కించడం సలభతరం కాదు అని గురువు ఉదంకుడితో అంటాడు.

నాటి గురుదక్షిణలను గురించి మనుధర్మశాస్త్రం ఈవిధంగా తెలుపుతుంది.

"న పూర్వం గురవే కించిదుపకుర్వీత ధర్మవిత్,
స్నాస్యంస్తు గురుణాఽజ్ఞప్తశ్శక్త్యా గుర్వర్థమాహరేత్"[63]

వేదాన్ని అధ్యయనం చేయటానికి ముందు శిష్యుడు గురువుకు ఏవిధమైన దక్షిణను ఇవ్వరాదు. వేదాధ్యయనం ముగిసిన తర్వాతనే గురుదక్షిణ చెల్లించాలి. ఏయే వస్తువులను గురువులకు దక్షిణగా ఇవ్వాలో కూడా మనువు తెలిపాడు.

"క్షేత్రం హిరణ్యం గామశ్వం ఛత్రోపానహమాసనమ్,
ధాన్యం శాకం చ వాసాంసి గురవే ప్రీతిమావహేత్"[64]

భూమి, సువర్ణం, గోవులు, గుఱ్ఱాలు, ఛత్రము, పాదరక్షలు, ఆసనము, ధాన్యము, కూరగాయలు, బట్టలు మొదలైన వాటిని ఇచ్చినట్లయితే గురువుకు సంతోషం కలుగుతుంది. నైష్ఠిక బ్రహ్మచారి, తన గురువు మృతినొందినపుడు, గురుపుత్రునికి, గురుపత్నికి శరీరము నశించువరకు శుశ్రూష చేయాలి. ఈ విధంగా ఎవడైతే ఆజన్మాంతం గురుశుశ్రూష చేస్తాడో అతడు బ్రహ్మపథాన్ని చేరుకొంటాడని చెప్పబడింది. వీళ్ళు లేనప్పుడు గురువు హోమము చేసిన అగ్నికుండానికి దగ్గరగా కూర్చొని ప్రతిరోజు ఆయగ్నిహోత్రమునందు హోమం చేస్తూ తన జీవితకాలం గడపాలి. ఇవి ప్రాచీన విద్యార్థులు పాటించిన నియమాలు.

వెనుకటి పుటలలో గురుశిష్యుల సంబంధాలు చర్చించిన సందర్భాల్లో గురుదక్షిణల ప్రస్తావన వచ్చింది. కాబట్టి ఇక్కడ సంక్షిప్తంగా గురుదక్షిణను గురించి వివరిస్తున్నాను. ఉదంకుడు, పైలుడి శిష్యుడు. వ్యాసుడికి ప్రశిష్యుడు. ఉదంకుడు తన గురుశుశ్రూష చేత గురువును సంతోషపరచి అణుమాది అష్టసిద్ధుల్ని పొందాడు. గురుదక్షిణగా గురుపత్ని పౌష్యమహారాణి కుండలాలు కావాలని కోరింది. ఎన్నో కష్టాలు పడి ఉదంకుడు పౌష్యుని చేరి కుండలాలు తీసుకొంటాడు. మార్గమధ్యంలో తక్షకుడు ఆ కుండలాల్ని ఎత్తుకొని నాగలోకానికి వెళ్ళిపోతాడు. ఉదంకుడు కూడా నాగలోకాన్ని చేరుకొని, నాగదేవతలను ప్రార్థించి తిరిగి కుండలాలు పొంది గురువును సమీపిస్తాడు. గురువుకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తాడు. గురుదక్షిణ చెల్లించి ఉత్తమ శిష్యుడు అనిపించుకున్నాడు.

మహాభారతంలోని ఏకలవ్యుడు, అర్జునుడు గురుదక్షిణలు చెల్లించి గురువుల ఋణం తీర్చుకున్నారు. ఏకలవ్యుడికి ద్రోణుడు చదువుచెప్పడానికి నిరాకరిస్తాడు. కానీ ఏకలవ్యుడు ద్రోణుడి ప్రతిమను చేసి, ఆ ప్రతిమ

ఎదుటనే విలువిద్యసాధన ప్రారంభంచాడు. ఒకరోజు వేటకుక్క ముఖం మీద ఏకలవ్యుడు నాటిన ఐదు బాణాలను చూసి కౌరవవీరులు ఆశ్చర్యపడ్డారు.

తన కంటె, ద్రోణుని కంటె ఏకలవ్యుడు విలువిద్యలో గొప్పవాడని అర్జునుడు భావిస్తాడు. తన కంటె విలువిద్యలో గొప్పవాడు ఉండకూడదని అర్జునుని కోరిక. ఈ విషయాన్ని ద్రోణుడితో పలుకుతాడు. ద్రోణుడు ఏకలవ్యుని గురుదక్షిణగా కుడిచేతి బొటనవ్రేలును కోరుతాడు. గురువు కోరిక ప్రకారం ఏకలవ్యుడు, తన బొటనవ్రేలును నరికియిస్తాడు. సాటిలేని విద్యార్థిగా, స్వార్థరహితుడైన విద్యార్థిగా చరిత్రలో ఏకలవ్యుడు నిలిచిపోయాడు.

విద్యాభ్యాసానంతరం పాండవులు, కౌరవులు గురుదక్షిణ చెల్లించడానికి ద్రోణుని దగ్గరకు వెళతారు. ద్రోణుడు తనకేమీ వద్దని అంటాడు. గురుపత్నిని కోరగా, ఆమె పూర్వం ద్రుపదుడికి, ద్రోణుడికి మధ్య జరిగిన వృత్తాంతాన్ని చెప్పి, ఆ ద్రుపదుడిని కట్టితెచ్చి గురువుకు అప్పజెప్పమని కోరుతుంది. అర్జునుడు గురువు కోరిక ప్రకారం ద్రుపదుడితో పోరాడి, అతడిని బంధించి తీసుకువచ్చి గురువు పాదాల దగ్గర పడవేస్తాడు. దీనితో ద్రోణుడు పరమానంద భరితుడౌతాడు. ఎనలేని గురుదక్షిణ చెల్లించినందుకు అర్జునుడిని ఎంతగానో అభినందిస్తాడు.

కృష్ణబలరాములు సాందీపని వద్ద సకలవిద్యలు అభ్యసించారు. వీరు చెల్లించిన గురుదక్షిణ అపూర్వమైనది. మృతుడైన గురుపుత్రుని తిరిగిబ్రతికించి కృష్ణబలరాములు ఎవరూ ఇవ్వలేని గురుదక్షిణను తమ గురువుగారికి చెల్లించారు. గురువు శిష్యుడికి జ్ఞానమయ శరీరాన్ని ప్రసాదించగా, శ్రీకృష్ణబలరాములు గురువు గారికి గురుపుత్రుని భౌతిక శరీరాన్ని తెచ్చియిచ్చారు. గురుశిష్యుల పరస్పర సహకారం నాటి విద్యావిధానంలో పైవిధంగా ప్రకటించబడింది.

అలాగే విశ్వామిత్రుడి శిష్యుడు గాలవుడు విద్యాభ్యాసం తర్వాత గురుదక్షిణ చెల్లించడానికి వెళతాడు. తనకు ఏమీవద్దని విశ్వామిత్రుడు అనగా, ఏదో ఒకటి కోరమని శిష్యుడు పలుకుతాడు. అప్పుడు విశ్వామిత్రుడు శరీరమంతా తెల్లగా ఉండి, చెవులు మాత్రం నీలిరంగులో ఉండే గుర్రాలను ఎనిమిది వందలు తీసుకువచ్చి తనకు ఇవ్వమని కోరుతాడు. ఎంతో కష్టమైన ఈ పనిని గరుత్మంతుని సహాయంతో గాలవుడు సాధించాడు. యయాతి కూతురైన మాధవిని అర్థించి, ఆమెను స్వీకరిస్తాడు. మాధవిని ఇక్ష్వాకుడు

అనేరాజుకు ఇచ్చి రెండువందల గుర్రాలను, తర్వాత దివోదాసుడికి ఇచ్చి రెండువందల గుర్రాలను, ఔశీనరుని నుండి మరో రెండు వందలు, మొత్తం ఆరువందల గుర్రాలు సేకరించి గురువుకు అర్పిస్తాడు. ఎంతో కష్టమైన గురుదక్షిణ చెల్లించి గాలవుడు విశ్వామిత్రుడి ఆశీస్సులు పొందాడు.

పైవిధంగా ప్రాచీన తెలుగు కావ్యాల్లో ఆనాటి గురుశిష్యసంబంధాలు ప్రతిఫలించాయి. విద్యార్థి నడవడిక, గురుశుశ్రూష, వేదాధ్యయనం, గురుదక్షిణలు, విద్యాసంస్కారాలు, ఆశ్రమజీవనం ఇవి భారతీయ విద్యాసంప్రదాయంలోని ప్రధాన అంశాలు. పరస్పరం విద్యను దానం చేయడం, పరస్పర గౌరవం కలిగివుండడం భారతీయ విద్యాసంప్రదాయంలో గురుశిష్యులు పాటించిన నియమాలు.

పాదసూచికలు

1. మనస్మృతి, పు.72, 140శ్లో.

2. పైదే, శ్లో.41.

3. ఆనుశాసనిక, 2ఆ, 179ప.

4. మహాభారతంలో విద్యావిధానం, పు.82.

5. మనుస్మృతి, పు.72, 142శ్లో.

6. ఆధి, 4ఆ, 49ప.

7. శాంతి, పు.4703, 19శ్లో

8. మనుస్మృతి, పు.74, 148శ్లో.

9. పైదే, పు.73, 145శ్లో.

10. అరణ్య, 3ఆ, 282ప.

11. మహాభారతంలో విద్యావిధానం, పు.86.

12. మనుస్మృతి, పు.49, 49శ్లో.

13. శాంతి, 4ఆ, 107ప.

14. మనుస్మృతి, పు.83, 190శ్లో.

15. పైదే, పు.84, 195శ్లో.

16. పైదే, 196శ్లో.

17. పైదే, పు.88, 218శ్లో.

18. పైదే, పు.90, 225శ్లో

19. అమరకోశం, పు.438.

20. పోతన భాగవతము, 7స్కంధం, 45ప.

21. వ్యాసభారతం, వనపర్వం, పు.468.

22. భారతీయ విద్య, పు.70.

23. సభా, 1ఆ, 21ప.

24. ఆది, 4ఆ, 23ప.

25. ఆది, 4ఆ, 21ప.

26. ఆధి, 1ఆ, 92ప.

27. ఆది, 3ఆ, 106ప.

28. పైదే, 110ప.

29. పైదే, 5ఆ, 190ప.

30. పైదే, 201ప.

31. పైదే, 230ప.

32. పైదే, 15ప.

33. అరణ్య, 1ఆ, పు.36.

34. విరాట, 1ఆ, 69ప.

35. పైదే, అదే.

36. ఆది, 4ఆ, పు.420, వచనం.

37. మహాభారతంలో విద్యావిధానం, పు.109–110.

38. విరాట, 1ఆ, 77ప.

39. మహాభారతంలో విద్యావిధానం, పు.110

40. అరణ్య, 4ఆ, 114ప.

41. ఆది, 5ఆ, 226ప.

42. అరణ్య, 1ఆ, 369ప.

43. విరాట, 1ఆ, 241ప.

44. మహాభారతంలో విద్యావిధానం, పు. 116–117.

45. విరాట, 1ఆ, 101ప.

46. హరివంశం, పూర్వభాగం, పు. 224–225.

47. మహాభారతంలో విద్యావిధానం; పు.118.

48. శాంతి, 6ఆ, 149ప.

49. గోపీనాథ రామాయణము, బాలకాండ, 595ప.

50. పైదే, 579 వచనం

51. శాంతి, 6ఆ, 321ప.

52. పైదే, 258ప.

53. పైదే, 260ప.

54. మనుచరిత్ర, 5ఆ, 9ప.

55. పైదే, 13ప.

56. పాండురంగమాహాత్మ్యం, 5ఆ, 171ప.

57. పైదే, 225.

58. పైదే, 229.

59. మనుధర్మశాస్త్రం, పు.45.

60. పైదే, పు.46.

61. తైత్తిరీయోపనిషత్తు.

62. ఆది, 2ఆ, 6ప.

63. మను, పు.95.

64. పైదే, అదే.

ఉపసంహారం

'విద్' అంటే 'తెలుసుకోవటం' అని అర్థం. ఏదైనా ఒక విషయం గురించి తెలుసుకోవటమే విద్య. ఈ తెలుసుకోవటంలో ఉండే క్రమ పరిణామాలను సూచించేది విద్యావిధానం. ప్రాచీన తెలుగు కావ్యాల్లో మన ప్రాచీన విద్యావిధానం ఎలా ప్రతిఫలించిందో ఈ సిద్ధాంత వ్యాసంలో విశ్లేషించడం జరిగింది.

విద్యార్జనలో ఆనువంశిక లక్షణం, పరిసరాల ప్రభావం రెండూ ఉంటాయి. వీటినే education, educare అనే పదాలు సూచిస్తున్నాయి. ప్రహ్లాదుడిలో ఆసురీశక్తులు తగ్గటానికి, సత్త్వగుణాలు వృద్ధిపొందటానికి కారణం పరిసరాల ప్రభావమే. నారదమహర్షి ఆశ్రమ వాతావరణం వల్లనే ప్రహ్లాదుడిలో దైవచింతన సత్ప్రవర్తన కలిగినాయి.

విద్యార్జనలో గురుశిష్యులిద్దరూ సమాన ప్రాధాన్యత కలిగినవారు. అగ్ని పుట్టాలంటే రెండు జమ్మికొయ్యలు అవసరం. అందులో ఒకటి పూర్వారణి. రెండవది ఉత్తరారణి. ఈ రెండింటి మధ్య ఘర్షణ జరిగినప్పుడే అగ్ని పుడుతుంది. అలాగే గురుశిష్యుల పరస్పర సంబంధం వల్లనే జ్ఞానాగ్ని పుడుతుంది. ఇది అజ్ఞానాన్ని తొలగించి, లోకానికి వెలుగును ప్రసాదిస్తుంది. కాబట్టి గురుశిష్యులు ఇద్దరూ విద్యార్జనలో సమానులే. మొదటి అధ్యాయంలో పై చర్చ జరిగింది.

రెండవ అధ్యాయంలో భౌతికవిద్యలు, అవి కావ్యాల్లో ప్రతిఫలించిన తీరు విశ్లేషించడం జరిగింది.

ఆయుర్వేదం, ధనుర్వేదం, అశ్వశాస్త్రవిద్య, గజశాస్త్రవిద్య, జలస్తంభనవిద్య, చోరకళ, అస్త్రహృదయవిద్య, చింతామణిమంత్రవిద్య, కామరూపిణివిద్య మొదలైన భౌతిక లేదా శారీరక విద్యలను గురించి ఈ అధ్యాయంలో వివరించటం జరిగింది.

మూడవ అధ్యాయంలో మానసిక విద్యల గురించి విశ్లేషించడం జరిగింది. వీటిని ప్రబోధాత్మక మానసిక విద్యలు, ప్రయోగాత్మక మానసిక విద్యులు అని విభజించటం జరిగింది. పురాణాలు, ఇతిహాసాలు మొదలైనవి 'ప్రబోధం' ప్రధాన లక్షణంగా కలిగిన మానసిక విద్యలు. కవిత్వం, సంగీతం, నాట్యం మొదలైనవి సాధన, ప్రయోగం ప్రధాన లక్షణాలుగా కలిగిన మానసిక విద్యలు. ఇవి తెలుగు కావ్యాల్లో

ఏవిధంగా ప్రతిఫలించాయో ఈ విద్యల్ని గురువులు విద్యార్థులకు ఏవిధంగా నేర్పించేవారో సోదాహరణంగా పరిశీలించడం జరిగింది.

నాల్గవ అధ్యాయంలో ఆధ్యాత్మిక విద్యల గురించి వివరించడం జరిగింది. దర్శన సంప్రదాయంలో, మత సంప్రదాయంలో ఆధ్యాత్మికవిద్య సాధించిన ప్రగతిని ఇక్కడ చర్చించడం జరిగింది. షడ్దర్శనాలు, జీవన్ముక్తి వంటి అంశాలు సోదాహరణంగా వివరించబడ్డాయి. అంతరంగ ప్రయాణమే ఆధ్యాత్మికవిద్యకు లక్ష్యం అని తేలింది. జీవాత్మను పరమాత్మలో ఐక్యం చేసే ప్రయత్నమే యోగమని నిరూపించబడింది. భారతం, భాగవతం, రామాయణం ఏవిధంగా పరమాత్మ తత్త్వాన్ని తెలియజేస్తున్నాయో పరిశీలించటం జరిగింది.

ఐదవ అధ్యాయంలో – 'ప్రాచీన విద్యలు – బోధనపద్ధతులు' అనే అంశం చర్చించబడింది. ప్రాచీన కాలంలో గురువులు ఏ పద్ధతులను ఉపయోగించి బోధన చేసేవారో, కావ్యాల ఆధారంగా విశ్లేషించడం జరిగింది. ఉపాఖ్యాన పద్ధతి, సంవాద పద్ధతి, చర్చాపద్ధతి, ఆలంకారిక పద్ధతి మొదలైన బోధన పద్ధతులు ఈ అధ్యాయంలో చర్చించబడ్డాయి.

ఆరవ అధ్యాయంలో గురుశిష్యసంబంధాల గురించి విశ్లేషించడం జరిగింది. గురువు, అధ్యాపకుడు మొదల పదాల వ్యుత్పత్తులు, నిర్వచనాలు, శిష్యుడు పాటించవలసిన నియమాలు వివరించబడ్డాయి. భీష్ముడు, పాండురాజు, ధర్మరాజు, అర్జునుడు, కర్ణుడు, ఏకలవ్యుడు మొదలైన భారతవీరులు ఏవిధంగా గురువులను సేవించారో, వారి గురుశిష్యసంబంధాలు ఎలా ఉన్నాయో? ఈ అధ్యాయంలో వివరించటం జరిగింది.

మానవుడిని భౌతికంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయటానికి ఉపయోగపడేదే విద్య. మానవుడి సంపూర్ణ వికాసమే విద్యకు పరమలక్ష్యం. హృదయవికాసం కలిగినప్పుడే మనిషిలో మానవీయ విలువలు జనిస్తాయి. హృదయవికాసం కలగాలంటే, జ్ఞానతృష్ణ కలిగిన విద్యార్థి, సుశిక్షితుడైన గురువు వద్ద విద్యనభ్యసించాలి. ప్రవచనం, సత్ప్రవర్తన గురుశిష్యుల మధ్య వారధిగా పనిచేస్తాయి.

ప్రస్తుత సమాజంలో ఎన్నో సంఘర్షణలు ఉన్నాయి. వీటిని ఎదుర్కోవటానికి ఎన్నో విప్లవాలు, ఉద్యమాలు పుట్టుకొచ్చాయి. కానీ ఈ సమాజం మారడం లేదు. మనిషి అంతరంగ ప్రపంచానికి ప్రతిబింబమే అతనికి కనిపిస్తున్న ఈ బాహ్యప్రపంచం. బాహ్యప్రపంచంలో మార్పు రావాలంటే ముందు మనిషి అంతరంగంలో మార్పు రావాలి. మనిషి ఏ విధంగా తన అంతరంగంలోని అరిషడ్వర్గాల నుండి బయటకు రాలేకపోతున్నాడో, అలాగే మానవుల సమూహమైన ఈ సమాజం కూడా దాని సామూహికమైన అంతరంగంలోని సంఘర్షణల నుండి బయటకు రాలేకపోతోంది. ఈ సంఘర్షణల నుండి మానవుడు ముక్తిని పొందటానికి ఏకైక మార్గం అంతరంగప్రయాణం. దీనికి మంచి సాధనం యోగం.

ప్రాచీనకాలంలో విద్య కొందరికే పరిమితం. శూద్రులకు, స్త్రీలకు ఇందులో ఆనాడు ప్రవేశం కల్పించబడలేదు. కానీ కొందరు రాజుల బిడ్డలు, ధనికుల కుమార్తెలు విద్యను అభ్యసించారు. సంగీతం, నృత్యం వంటి కళల్లో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. ప్రాచీన కాలంలో 'విద్య' అంటే కేవలం సర్టిఫికేట్ కోర్సు కాదు. జ్ఞానాన్ని అందించేది ఏదైనా విద్యయే పొట్టకూడు సంపాదించి పెట్టే ఏ జ్ఞానమైనా విద్యగానే భావించేవారు. అందువల్ల ఆనాడు నిరుద్యోగం చాలా తక్కువగా ఉండేది. చిన్నప్పటి నుండి వారికి వృత్తివిద్యలో శిక్షణ ఇవ్వబడేది. అందువల్ల ఏదో ఒక పని చేసుకొని జీవించగలిగేవారు.

ఆనాటి గురువులకు శిష్యుల పట్ల ఆదరాభిమానాలు ఉండేవి. శిష్యులకు గురువుల పట్ల విశేష గౌరవం ఉండేది. దీనికి కర్ణుడు, ఏకలవ్యుడు మంచి ఉదాహరణలు. గురువుకు నిద్రాభంగం కలగరాదని కర్ణుడు కీటకం పెట్టే బాధను భరించాడు. ఏకలవ్యుడు గురుదక్షిణగా బొటనవ్రేలును సమర్పించాడు. ఉదంకుడు ఎన్నో కష్టాలను ఎదుర్కొని పౌష్యరాణి కుండలాలను తెచ్చియిచ్చి గురుదక్షిణ చెల్లించాడు. ఈవిధంగా ఆనాటి గురుశిష్యులు ఎవరికి వారే ఆదర్శప్రాయులు.

రాజకుటుంబాల్లోని స్త్రీలు విద్యను నేర్చుకున్నారు. కైకేయి, సత్యభామ విలువిద్యలో మంచి ప్రావీణ్యాన్ని సంపాదించారు. జాంబవతి, రుక్మిణి, సత్యభామలు నారదునికి సంగీతవిద్యను బోధించారు. ద్రౌపది గృహిణీధర్మాలను సత్యభామకు బోధించింది. 'సీతారామాంజనేయ సంవాదం' అనే కావ్యంలో, సీతాదేవి ఆంజనేయుడికి అనేకములైన యోగశాస్త్ర మర్మాలను తెలియజేసింది. ఈవిధంగా స్త్రీలు కొందరు విద్యావంతులైనారు.

ద్రోణాచార్యుడు మొదలైన ఆచార్యులు విద్యను బోధించటానికి ఎన్నో పద్ధతులను కనిపెట్టారు. ప్రదర్శనాపద్ధతి, ప్రయోగపద్ధతి, ఉదాహరణీయ పద్ధతి, చర్చాపద్ధతి, ఆలంకారిక పద్ధతి మొదలైన రీతుల్లో విద్యార్థులకు విద్యాబోధన జరిగేది. శరద్వంతుడు ధనుర్విద్యకు వేదసారూప్యాన్ని కలిగించి, దాని 'ధనుర్వేదం'గా మార్చాడు. భీష్ముడు ప్రశ్నోత్తర పద్ధతిలో ధర్మరాజుకు ఎన్నో ధర్మాలను బోధించాడు.

ప్రాచీన విద్యావిధానంలో క్రింది మంచి లక్షణాలను మనం స్వీకరించవచ్చు.

1. విద్యార్జన ప్రశాంతమైన వాతావరణంలో జరిగేది
2. ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి బిడ్డనూ విద్యాలయానికి పంపించేవారు
3. సుశిక్షితుడైన గురువు దగ్గరే శిష్యులకు చదువు చెప్పించాలి.
4. విద్యపట్ల పిల్లల్లో ఉండే భయాన్ని పోగొట్టడానికి ఆశ్రమాల్లో అనుకూల వాతావరణం ఉండేది.
5. విద్యార్థికి చదువు పట్ల ఉండే ఆసక్తిని పరీక్షించి గురువులు అతనికి విద్యను నేర్పేవారు.
6. విద్యార్థికి బ్రహ్మచర్యం, ఏకాగ్రత ముఖ్యం.
7. గురుశుశ్రూష వల్ల విద్యార్థికి జీవితం పట్ల అవగాహన కలిగేది.
8. అరణ్యాల్లో నివశించటం వల్ల, జీవితంలో కష్టనష్టాలకు ఓర్చుకొనే శక్తి చిన్నతనంలో విద్యార్థులు పొందగలిగేవారు.
9. రాజుల బిడ్డలు కూడా అరణ్యాలకు వచ్చి చదువుకొనేవారు. దీనివల్ల విద్యార్థుల్లో భేదభావాలు నశించి, సహజీవనం అలవాటుపడేది.
10. గురువు శిష్యుడిని పుత్రుడిలాగా ఆదరించాలి. సరియైన మార్గంలో నడిపించాలా, ఒకవేళ తప్పుచేస్తే దండించి దారిలోకి తీసుకురావాలి.
11. అన్ని వృత్తులవారి పిల్లలు, తమ తల్లిదండ్రుల వద్ద వృత్తివిద్యలు నేర్చుకొనేవారు. దీనివల్ల నిరుద్యోగ సమస్య. ఆనాడు ఎక్కువగా లేదు. ఏదో ఒక పని చేసుకొని బ్రతికేవారు.

12.నలంద, తక్షశిల, మిథిల, ఉజ్జయిని నాటి ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలు

13.ఆశ్రమాలే ఆనాటి విద్యాకేంద్రాలు. వీటికి ఋషుల పేర్లు పెట్టేవాడు. ఋషులే ఆనాటి విశ్వవిద్యాలయాలకు కులపతులు.

14.ఆనాటి విద్య జ్ఞానం కోసం. ఈనాటి విద్య డిగ్రీ కోసం.

15.ఆనాటి విద్య సారవంతం. ఈనాటి విద్య సారహీనం.

16.ఆనాటి గురువులు ఆదర్శప్రాయులు. ప్రాణాపాయ స్థితిలోకూడా శిష్యుల గురించే ఆలోచించే గురువులు ఆనాడు ఉండేవారు. ద్రోణుడి తొడను మొసలి పట్టుకొన్నప్పుడు, దాన్ని విడిపించకోగల శక్తి ఉండి కూడా ద్రోణుడు శిష్యుల్ని పిలిచాడు. ఎవడు మొసలి నుండి తనను రక్షిస్తాడో? పరిశీలించటం కోసం.

17.ద్రోణాచార్యుడు ఏకలవ్యుని గురుదక్షిణగా బొటనవ్రేలు అడిగాడు. ఇది ధర్మవిరుద్ధమే అయినా, అర్జునుడి మీద వాత్సల్యంతో ఆ పని చేశాడు. ఇలా చేయకూడదు అని మనం నేర్చుకోవచ్చు.

18.విద్యార్థికి ఏవిద్యలో ఆసక్తి ఉందో? గమనించి, ఆరంగంలో అతడికి శిక్షనిచ్చేవాడు. భీముడికి గదాయుద్ధంలోను, అర్జునుడికి విలువిద్యలోను ప్రీతి కలదు. అందుకే వారి ఆయా విద్యల్లో మంచి శిక్షణనిచ్చారు.

19.రాజులు విద్యాలయాలను పోషించేవారు. వాటి నిర్వహణ కోసం భూదానాలు, గోదానాలు చేసేవారు. మేటి పండితులను సత్కరించి, వారికి విశేషదానాలు చేసేవారు.

20.ధ్రువుడు, ప్రహ్లాదుడు వంటి విద్యార్థులు చిన్నతనంలో అన్నివిద్యల్లో రహస్యాల్ని తెలుసుకోగలిగారు. ఆత్మసాక్షాత్కారాన్ని పొందగలిగారు.

21.శస్త్రచికిత్సలు, ఆయుర్వేదం, రసవాదం, అస్త్రప్రయోగాలు, అశ్వశాస్త్రం, గజశాస్త్రం వంటి విజ్ఞాన సంబంధి విద్యలు అభివృద్ధి దశలో ఉండేవి.

22.ఆనాటి విద్యకు పరమ ప్రయోజనం మోక్షం. దీనికి మార్గం యోగసాధన.

పై విధంగా ప్రాచీన తెలుగు కావ్యాల్లో భారతీయ విద్యావిధానం ఎంతగానో ప్రతిఫలించింది. ప్రతి మనిషిలోనూ మంచీచెడూ రెండూ ఉంటాయి. అలాగే ప్రాచీన విద్యావిధానంలో మంచి విషయాలతోపాటు, కొన్ని అనుసరించదగని విషయాలు కూడా ఉన్నాయి. అయితే మనం వాటిల్లోని మంచిని మంచిని స్వీకరించి, చెడును విడిచిపడితే చాలు. గత విద్యాచరిత్రను అధ్యయనం చేసి, వర్తమానంలో ఆ మంచి విషయాలను ఆచరించి, భవిష్యత్తును బంగారుమయంగా తీర్చిదిద్దుకోవచ్చు. విద్యకు నాశనం లేదు. ప్రాతదనం లేదు. అది నిత్యనూతనం. సార్వకాలికం. నిత్యం క్రొత్తగా కనిపించే ఉషస్సు లాంటిదే జ్ఞానతేజస్సు.

ఉపయుక్త గ్రంథావళి

1.	అబ్బయామాత్యుడు	అనిరుద్ధ చరిత్రము; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, హైదరాబాద్, 2006
2.	ఎఱ్ఱాప్రెగడ	ఆంధ్రమహాభారతము; తి.తి.దే. ప్రచురణలు, తిరుపతి, 2003
3.	ఎఱ్ఱాప్రెగడ	నృసింహపురాణము; వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్ ప్రచురణ, చెన్నై, 2010
4	ఎల్లనార్యుడు. చింతలపూడి	శ్రీరాధా మాధవము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్ ప్రచురణలు, చెన్నై, 1987
5.	కమలా చంద్రమౌళి. ఆర్.	మంథని చరిత్ర; శ్రీసాయిరామ్ ప్రచురణలు, హైదరాబాద్, 2003
6.	కృష్ణగాయత్రి. ద్వివేది	వ్యాసుడు – తిక్కన – మహాభారత రాజనీతి దర్శనం (అముద్రిత సిద్ధాంత వ్యాసం); హైదరాబాద్ విశ్వవిద్యాలయం, 2002.
7.	కృష్ణమూర్తి. జె.	విద్య: అందు జీవితమునకు గల ప్రాధాన్యము, శ్రీ వేంకటేశ ప్రింటింగ్ హౌస్, చైన్నై, 2005
8.	కృష్ణారెడ్డి. మఱ్ఱి (సంపా.)	అథర్వవేద భాష్యమ్ – ఆంధ్ర తాత్పర్యం; వైదిక సాహిత్య ప్రచార సమితి, హైదరాబాద్, 2007
9.	కోదండరామాచార్యులు. కె.	దుగ్గన నాసికేతోపాఖ్యానము – పరిశీలనము; శ్రీ లక్ష్మి ప్రింటింగ్ ప్రెస్; ఖమ్మం; 1986
10.	గోపరాజు. కొఱవి	సింహాసన ద్వాత్రింశిక; ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రచురణ; హైదరాబాద్, 1982
11.	గౌరన	నవనాథ చరిత్ర; ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రచురణలు, హైదరాబాద్, 1984
12	చంద్రశేఖర రెడ్డి. డి (సంపా.)	శ్రీకృష్ణదేవరాయ వైభవం; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, విజయవాడ, 2012

13 చిననారాయణ. సవరము — కువలయాశ్వచరిత్రము; ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణలు, హైదరాబాద్, 1982

14 చినవీరభద్రుడు. వాడ్రేవు — ఉపనిషత్ సుధాలహరి; యువభారతి ప్రచురణలు, తిలక్‌రోడ్, హైదరాబాద్, 2011

15 జయప్రకాష్. యస్. — పరిశోధన విధానం; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2011

16. తమ్మయ. సారంగు — వైజయంతీ విలాసము; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, హైదరాబాద్, 2008

17. తిక్కన సోమయాజి — ఆంధ్రమహాభారతము; తి.తి.దే. ప్రచురణలు, తిరుపతి, 2003

18. తిమ్మన. నంది — పారిజాతాపరహరణము; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, విజయవాడు, 2011

19. దుగ్గన. దగ్గుపల్లి — నాసికేతోపాఖ్యానము; ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణలు, హైదరాబాద్, 1977

20. ధూర్జటి — శ్రీకాళహస్తి మహాత్మ్యము; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణలు, హైదరాబాద్, 2005

21 నన్నయ — ఆంధ్రమహాభారతము; తి.తి.దే. ప్రచురణ, తిరుపతి, 2000

22 నన్నెచోడుడు — కుమారసంభవము–సంజీవనీ వ్యాఖ్య; తులుగు విశ్వవిద్యాలయ ప్రచురణలు, హైదరాబాద్, 1998

23 నారాయణరెడ్డి. సి. — ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు ప్రయోగములు, విశాలాంధ్ర ప్రచురణలు, హైదరాబాద్, 2013

24 నారాయణామాత్యుడు. అయ్యలరాజు — హంసవింశతి; ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణలు, హైదరాబాద్, 1977

25 పెద్దన. అల్లసాని — మనుచరిత్రము; శ్రీ వావిళ్ళరామస్వామి శాస్త్రులు & సన్స్ ప్రచురణలు, చెన్నై, 2001

26 పోతన. బమ్మెర — పోతన భాగవతము; తి.తి.దే. ప్రచురణలు, తిరుపతి, 2008

27 ప్రతాపరెడ్డి. సురవరం ఆంధ్రుల సాంఘిక చరిత్ర; ఓరియంట్ లాజ్మన్ లిమిటెడ్ ప్రచురణలు, హైదరాబాద్, 1992

28 ప్రమీలారెడ్డి. ఎం. కాకతీయ యుగ సాహిత్యంలో సంస్కృతి, అజంతా ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్, 2000

29 ప్రేమలత. రావి తెలుగు స్త్రీల చిత్రలిపి; లేజర్ ప్రింటర్స్, హైదరాబాద్, 1991

30 బలరామమూర్తి. ఏటుకూరి భారతీయ సంస్కృతి; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ, హైదరాబాద్.

31 బుద్ధభూపతి. గోన రంగనాథ రామాయణము; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ, హైదరాబాద్, 1989

32 మల్లికార్జున్. పి. స్వాతంత్ర్యానంతర తెలుగు సాహిత్యం విద్యావిమర్శ; పిహెచ్.డి. సిద్ధాంతవ్యాసం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, 2004

33 మల్లేశుడు. ఆర్. మహాభారతంలో విద్యావిధానం; గాయత్రి ప్రింటర్స్, ప్రొద్దుటూరు, 1989

34 మాధవరాయులు. సురభి చంద్రికా పరిణయము; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ, హైదరాబాద్, 2001

35 మొల్ల. ఆతుకూరి మొల్ల రామాయణము; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, విజయవాడ, 2013

36 రమాపతిరావు. అక్కిరాజు పండితారాధ్య చరిత్ర–వచనము; సుపథ ప్రచురణలు, హైదరాబాద్, 2002

37 రవికృష్ణ. మోదుగుల రాయవాచకము [వివరణతో]; మిత్రమండలి ప్రచురణ, గుంటూరు, 2013

38 రంగాచార్య. దాశరథి ఋగ్వేద సంహిత – వచనము; విశాలాంధ్ర ప్రచురణలు, హైదరాబాద్, 2011

39 రామకృష్ణ. వకుళాభరణం ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర–సంస్కృతి–II, [తొలి చారిత్రక ఆంధ్రప్రదేశ్]; విశాలాంధ్ర ప్రచురణ, హైదరాబాద్, 2012

40 రామకృష్ణకవి. తెనాలి — పాండురంగ మాహాత్మ్యము; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణలు, హైదరాబాద్, 2006

41 రామబ్రహ్మం. బేతవోలు (సంపా.) — వర్ణనరత్నాకరము–పాఠకమిత్రవ్యాఖ్య; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, హైదరాబాద్, 2013

42 రామబ్రహ్మం. బేతవోలు — మృచ్ఛకటికమ్–వ్యాఖ్యానం; అజో–విభో–కందాళమ్ ఫౌండేషన్, హైదరాబాద్, 2010.

43 రామరాజ భూషణుడు — వసుచరిత్ర; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, విజయవాడ, 2002

44 రాయుడు. సి.యస్. — యోగసాధన – హిమాలయ యోగ దర్శనము; శ్రీకృష్ణ యోగాశ్రమ ప్రచురణ, అనంతపురం, 2005

45 లక్ష్మణకవి. యేనుగు — సుభాషిత రత్నావళి; జె.పి. పబ్లికేషన్స్, విజయవాడ, 2013

46 లక్ష్మీకాంతం. పింగళి — సాహిత్య శిల్ప సమీక్ష; విశాలాంధ్ర ప్రచురణలు, హైదరాబాద్, 2012

47 వరాహ నరసింహస్వామి. మేడపల్లి (సంపా.) — విజ్ఞాన సర్వస్వము [10సం–సాంఘిక శాస్త్రములు]; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ, హైదరాబాద్, 1965

48 వల్లభరాయుడు. వినుకొండ — క్రీడాభిరామం; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, విజయవాడ, 2009

49 వేంకటకవి. చేమకూర — విజయవిలాసము; పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణలు, హైదరాబాద్, 2007

50 వేంకటకవి. చేమకూర — సారంగధర చరిత్రము; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణలు, హైదరాబాద్, 2009

51 వేంకటకవి. గోపీనాథము — గోపీనాథ రామాయణము; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణలు, హైదరాబాద్, 1987

52 వేంకట కృష్ణనాయకుడు. సముఖము — అహల్యాసంక్రందనము; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, హైదరాబాద్, 1971

53 వేంకట కృష్ణారావు. భావరాజు — ప్రాచానాంధ్ర నాకాజీవనము; ప్రాచీ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2003

54	వేంకట నరసింహాచార్య. మరింగంటి	తాలాంక నందినీపరిణయము; ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ, హైదరాబాద్, 1980
55	వేంకటపతి. శేషము	శశాంక విజయము; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, విజయవాడ, 2009
56	వేంకటరాయశాస్త్రి. వేదము	ఆముక్తమాల్యద–సంజీవినీ వ్యాఖ్య; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, హైదరాబాద్, 2012
57	వేంకటరాయశాస్త్రి. వేదము	శృంగారనైషధము–సర్వంకష వ్యాఖ్య; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, హైదరాబాద్, 2012
58	వేంకట సుబ్రహ్మణ్యం. చందూరి	శ్రీమద్వాల్మీకి రామాయణము–వ్యాఖ్యానము; శ్రీ ఉదయ్‌ప్రింటర్స్, హైదరాబాద్, 1992
59	వేంకటేశ్వర శర్మ. వేమూరి	ఉత్తర రామాయణ కథలు–వచనము; శ్రీమహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్, విజయవాడ, 1992
60	సచ్చిదానందమూర్తి. కొత్త	విజ్ఞాన సర్వస్వము [4సందర్శనములు–మతములు]; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ; హైదరాబాద్, 1992
61	సత్యదేవప్రసాద్	చదువులచెట్టు] భారతీయ విద్యా బోధనా శాస్త్రం[; నవభారతి ప్రచురణలు, హైదరాబాద్, 1989
62	సత్యనారాయణ. ఆవంచ	మనుస్మృతి–తెలుగు అనువాదం; సాయి వెంకటేశ్వర బుక్‌డిపో, కాచిగూడ, హైదరాబాద్, 2011
63	సత్యనారాయణ. గుమ్మలూరు	శ్రీమద్రామాయణ హితోపదేశము; డాన్‌బాస్కో టెక్నికల్ స్కూల్ ప్రెస్, గుంటూరు, 1987
64	సంపత్‌కుమార్. ఎస్	హఠయోగమంజరి, ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, విజయవాడ, 2012
65	సాంబమూర్తి. డి.	తెలుగు బోధన పద్ధతులు; నీల్‌కమల్ పబ్లికేషన్స్ ప్రై.లిమిటెడ్, హైదరాబాద్, 1999
66	సుజాతారెడ్డి. ముదిగంటి	సంస్కృత సాహిత్య చరిత్ర; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణలు, హైదరాబాద్, 2012
67	సుబ్రహ్మణ్యం.జి.వి. (ప్ర.సంపా.)	ఆంధ్రమహాభారతం; తి.తి.దే. ప్రచురణలు, తిరుపతి, 2006

68 సుబ్రహ్మణ్యం. జి.వి ముత్యాల ముచ్చట్లు; జీవియస్ షష్టిపూర్తి ప్రచురణలు, హైదరాబాద్, 1996

69 సుందరం. ఆర్వీయస్. పరిశోధన పద్ధతులు; యువభారతి ప్రచురణలు, హైదరాబాద్, 1990

70 సూరన. పింగళి కళాపూర్ణోదయం; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, విజయవాడ, 2006

71 సూరన. పింగళి ప్రభావతీప్రద్యుమ్నము; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, విజయవాడ, 2008

72 సోమనాథుడు. నాచన ఉత్తరహరివంశము; తెలుగు గోష్ఠి ప్రచురణలు, హైదరాబాద్, 1997

73 సోమనాథుడు. పాల్కురికి పండితారాధ్య చరిత్ర; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ, హైదరాబాద్, 1990

74 సోమనాథుడు. పాల్కురికి బసవపురాణము; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణలు, హైదరాబాద్, 2002

75 సోమశేఖరశర్మ. మల్లంపల్లి తెలుగు సంస్కృతి–I; తెలుగు భాషా సమితి ప్రచురణ, ఉదయ ఎంటర్‌ప్రైజెస్, హైదరాబాద్, 1983

76 శాస్త్రి. ఎం.వి.ఆర్. మన చదువులు [విద్యావిధాన విశ్లేషణ]; నవత ప్రచురణలు, హైదరాబాద్, 2001

77 శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద; మలయకూట పబ్లికేషన్స్, హైదరాబాద్, 2001

78 శ్రీచిత్ర. పురాణపండ ఋషుల చరిత్రలు; రోహిణి పబ్లికేషన్స్, రాజమండ్రి, 2002

79 శ్రీనాథుడు శృంగార నైషధము; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, విజయవాడ, 2006

80 శ్రీనాథుడు పలనాటి వీరచరిత్ర; విశాలాంధ్ర పబ్లికేషన్స్, హైదరాబాద్, 1991

81 శ్రీనాథుడు శ్రీ కాశీఖండము; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ, హైదరాబాద్, 1993

82 శ్రీనాథుడు — శ్రీ శివరాత్రి మహాత్మ్యము; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ, హైదరాబాద్, 1995

83 శ్రీనాథుడు — హరవిలాసము; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు

84 శ్రీనివాసరావు. వేమూరి — పూర్వగాథాలహరి; వేంకట్రామ అండ్ కో ప్రచురణలు, ఏలూరు, 2007

85 శ్రీపతి రెడ్డి. యర్రంరెడ్డి — శ్రీపతి సూక్తులు; సుధాప్రచురణలు, నెల్లూరు, 2005

86 శ్రీరామచంద్రానంద సరస్వతి — భగవద్గీత–తెలుగు తాత్పర్యం; వావిళ్ల రామస్వామి శాస్త్రులు&సన్స్ ప్రచురణ; చెన్నై; 2012

87 శ్రీరామచంద్రుడు. పుల్లెల — వాల్మీకి శ్రీమద్రామాయణము – బాలానందినీ వ్యాఖ్య; ఆర్షవిజ్ఞానట్రస్టు ప్రచురణ, హైదరాబాద్, 1987

88 శ్రీరామచంద్రుడు. పుల్లెల — అర్థశాస్త్రమ్ [ఆంధ్రవ్యాఖ్య–బాలానందినీ]; శ్రీ జయలక్ష్మీ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2010

నిఘంటువులు

1	ప్రసాదరావు. పి.వి.కె.	విజ్ఞాన సర్వస్వము [సాధారణ విషయ పరిజ్ఞానము]; ఎమెస్కో సంప్రదాయ సాహితీ ప్రచురణలు, విజయవాడ, 2008
2	బ్రౌన్. సి.పి.	బ్రౌణ్య ఇంగ్లీషు – తెలుగు నిఘంటువు; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణలు, హైదరాబాద్, 2000
3	రాధాకృష్ణ. బూదరాజు (మొ.) (ప్ర.సంపా.)	'తెలుగు–తెలుగు నిఘంటువు'; తెలుగు అకాడమీ ప్రచురణలు, హైదరాబాద్, 2001
4	రామయ్య పంతులు జయంతి (సంపా.)	శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువు; తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ; హైదరాబాద్, 1988
5	రెడ్డి. జి.యస్.	'ఇంగ్లీషు–తెలుగు నిఘంటువు'; తెలుగు అకాడమీ ప్రచురణలు, హైదరాబాద్, 2001
6	రెడ్డి. జి.యస్.	తెలుగు పర్యాయపద నిఘంటువు; విశాలాంధ్ర ప్రచురణలు, హైదరాబాద్, 2010
7	సీతారామాచార్యులు. బహుజనపల్లి	శబ్దరత్నాకరము; శ్రీవేంకటేశ్వర బుక్ డిపో ప్రచురణలు, విజయవాడ2012 ,
8	సూర్యనారాయణ అబ్బరాజు	ఆంధ్రమహాభారత నిఘంటువు; తెలుగు అకాడమీ ప్రచురణ, హైదరాబాద్, 1979
9	శాస్త్రి. ఆర్. ఎల్. ఎన్. (సంక.)	శాస్త్ర నామ నిఘంటువు; తెలుగు అకాడమీ ప్రచురణ, హైదరాబాద్, 2005